# చరిత్ర

## ప్రాచీన నాగరికతలు

## ఖండాలు : I - III

B R A O U

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్

2004

# రచయితల బృందం

సంపాదకులు

కీ.శే. ఆచార్య. వి. ఎమ్. రెడ్డి

ఆచార్య యమ్. రాధాకృష్ణ శర్మ

115053
27-4-05

సహాయ సంపాదకులు

ఆచార్య వి. రామకృష్ణారెడ్డి

కుమారి ఇ. సుధారాణి

రచయితలు

డా. సి. వి. రామచంద్రరావ్

శ్రీ ఎ. వి. కోటిరెడ్డి

డా. కె. సత్యమూర్తి

Dr. B.R.A.O.U. LIBRARY
Acc No... 115053
Date...... 27.4.2005
Call No ......

మూల్యాంకనం

ఆచార్య పి. ఝాన్సీలక్ష్మి

ముఖ చిత్రం

యమ్. రమేష్

BRAOU

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్.

ప్రథమ ముద్రణ : 1995

పరిష్కృత ముద్రణ - 1999, 2000 2003 ,2004

© 1995. డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం. అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగాన్నైనా ఉపయోగించదల్చుకుంటే, విశ్వవిద్యాలయ అనుమతిని పొందాలి. ఈ పుస్తకం సార్వత్రిక విశ్వవిద్యాలయ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ఒక భాగం.

ఇతర వివరాలు : డైరెక్టర్ (అకడమిక్), డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, రోడ్ నెం. 46, జ్యూబిలి హిల్స్, హైదరాబాద్ - 500 033. ఆం.ప్ర.

Lr. No. 952/Dr. BRAOU/DMP/PTG/F.No.28/J.O .No. 001 Copies: 400 Books

Printed at Kesava Art Printers, Red Hills, Lakdi-ka-pool, Hyderabad -500 004.

# పరిచయం

ప్రపంచం లోని వివిధ ప్రాంతాల్లో, మానవ, సమాజ ఆవిర్భావం, సంస్కృతీనాగరికతలు ఏ విధంగా పరిణామం చెందుతూ వచ్చిందీ, సామాజిక, ఆర్థిక, మత, రాజకీయ వ్యవస్థలు ఏ విధంగా ఏర్పడి, మారుతూ వచ్చిందీ తెల్పడమే, చరిత్ర చేస్తున్న పని. చరిత్ర పూర్వయుగ, చారిత్రక సంధి యుగాల్లో మానవుని అలవాట్లు, ఆహార సేకరణ, వేష ధారణ, వినోదాలు, ఇతర ప్రాణులతో అతడు మెలగిన తీరు, ఆదిగాగల విషయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, గ్రహించగల్గినప్పుడే, చారిత్రక యుగ పరిణామాలను సరిగా, సంపూర్తిగా, అర్థంచేసుకొనేందుకు వీలౌతుంది. ప్రపంచ చరిత్రలో ఈజిప్ట్, మెసపటోమియా, హరప్పా, చైనా, గ్రీక్ నాగరికతలు, 'ప్రాచీన నాగరికతలు'గా, ప్రసిద్ధిగాంచాయి. ఆయా ప్రాంతాల్లో తొలి నాగరికతలుగా విలసిల్లి, బాగా వ్యాప్తి చెందాయి. సామాజిక, ఆర్థిక, మత, రాజకీయ, పరిపాలన, కళ, సాహిత్య రంగాల్లో, తదుపరి యుగాల్లో పెల్లుబికి వచ్చిన పరిణామాలు, మార్పులకు, ఇవి మూలంగా, ప్రధాన భూమికలుగా నిల్చాయి.

చరిత్రలో ప్రథమ సంవత్సర స్నాతకోత్తర పాఠ్యాంశాలను అధ్యయనం చేసే, డా. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ విద్యార్థులకు, 'ప్రాచీన నాగరికతలు' కోర్సుగా రూపొందించబడినాయి. వీటి పరిణామ, వికాసాలతో బాటు, ఈ ప్రాచీన రాజ్యాల్లో నెలకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, మత వ్యవస్థలు, సాహిత్య, తాత్విక, వాస్తు, కళా రంగాల్లో సంభవించిన మార్పులు, ఎంతో వివరంగా, ప్రయోజనకరంగా, చర్చించబడినాయి.

ఈ కోర్సులో మొత్తం ఆరు ఖండాలు, ఇరవై రెండు భాగాలున్నాయి. పఠనా సౌలభ్యం కోసం, దీనిని రెండు పుస్తకాలుగా ముద్రించడమౌతూంది. మొదటి పుస్తకంలో, మొదటి మూడు ఖండాలకు సంబంధించిన పది భాగాలను చేర్చడం జరిగింది. వీటిలో, చరిత్ర పూర్వయుగ, చారిత్రక సంధియుగ పరిణామాలు, చారిత్రక యుగ ప్రారంభం, మెసపటోమియా, ఈజిప్ట్ నాగరికతలు, వివరంగా చర్చించబడ్డాయి. రెండో పుస్తకంలో, చివరి మూడు ఖండాలకు చెందిన పన్నెండు భాగాలను పొందుపర్చడమైంది. వీటి ద్వారా, ప్రసిద్ధిగాంచిన భారతీయ (హరప్పా), చైనా, గ్రీక్ నాగరికతలు, విపులంగా విశ్లేషించబడ్డాయి. వీటి అధ్యయనం ద్వారా, ఈ ప్రాంతాల్లోని నేటి సంస్కృతీ నాగరికతలు, సంప్రదాయికతను, నవ్యతను, ఏ మేరకు, ఏ యే రంగాల్లో అలపర్చుకున్నాయనే విషయాల్లో, విద్యార్థులకు సరైన అవగాహన ఏర్పడగలదని ఆశిస్తున్నాం.

అత్యంత ప్రాధాన్యత గల "ప్రాచీన నాగరికతల" గురించి క్షుణ్ణంగా తెలుసుకునేందుకు, ఈ పాఠ్యభాగాలు తోడ్పడగలవని విశ్వవిద్యాలయం ఆశిస్తూంది.

BRAOU

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| **ఖండం - I** | : | **చరిత్ర పూర్వయుగం నుండి చారిత్రక యుగం వరకు** | |
| భాగం - 1 | : | చరిత్ర పూర్వయుగం : చారిత్రక సంధి యుగం | 2 |
| భాగం - 2 | : | చారిత్రక యుగ ప్రారంభం | 30 |
| **ఖండం - II** | : | **మెసపటోమియా** | |
| భాగం - 3 | : | మెసపటోమియా నాగరికతా లక్షణాలు | 41 |
| భాగం - 4 | : | సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు | 48 |
| భాగం - 5 | : | మతం - తత్వ వివేచన | 61 |
| భాగం - 6 | : | కళలు - శాస్త్రవిజ్ఞానం | 69 |
| **ఖండం - III** | : | **ఈజిప్ట్** | |
| భాగం - 7 | : | ఈజిప్ట్ నాగరికతా లక్షణాలు | 81 |
| భాగం - 8 | : | సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు | 93 |
| భాగం - 9 | : | మతం - తత్వ వివేచన | 110 |
| భాగం - 10 | : | కళలు - వాస్తువు | 123 |

పాఠ్య ప్రణాళిక

మాదిరి పరీక్షా పత్రం

అభ్యాసాలు


BRAOU

BRAOU

# ఖండం-I : చరిత్ర పూర్వయుగం నుండి చారిత్రక యుగం వరకు

ఈ ఖండంలో రెండు భాగాలున్నాయి.

మొదటి భాగంలో చరిత్ర పూర్వయుగాన్ని, చారిత్రక సంధి యుగాన్ని నిర్వచించాం. చరిత్ర పూర్వయుగంలోని మానవ జీవన పరిణామ క్రమాన్ని ప్రాక్ చరిత్ర (Pre-history) అని పేర్కొన్నాం. చరిత్ర పూర్వయుగానికి సంబంధించి శాస్త్రజ్ఞులు జరిపిన అధ్యయనంలోని వివిధ దశలను ప్రస్తావించాం. మానవుని జీవపరిణామ క్రమంలో నర - వానర దశ నుండి బుద్ధి జీవి అయిన ఆధునిక మానవుడు రూపొందటంలో, మానవుని స్వరూప స్వభావాదులలో ఏర్పడిన మార్పులను, సాంకేతికపరంగా అతడు సాధించిన విజయాలను సమీక్షించాం. చరిత్ర పూర్వయుగాన్ని ప్రాచీన, మధ్య, నవీన శిలాయుగాలుగా విభజించిన తీరును గురించి, ఈ యుగాల పునర్విభజనను గురించి ప్రస్తావించాం. ఈ వివిధ శిలాయుగాలలో, మానవుడు రూపొందించిన పరికరాలు ఆధారంగా, అతడు సాంకేతిక రంగంలో సాధించిన ప్రగతిని, ఈ శిలాయుగపు సంస్కృతులున్న ప్రాంతాలను పేర్కొని, నాగరికత దిశగా మానవుడు చేసిన సుదీర్ఘ ప్రయాణంలోని వివిధ దశలను గురించీ, ఆ దశలలోని ప్రత్యేకతలను గురించీ చర్చించాం.

రెండవ భాగంలో, మానవునికి కలిగిన లోహ పరిజ్ఞానం వల్ల కాంస్య యుగంలో ఏర్పడిన నగర విప్లవాన్ని గురించి ప్రస్తావించాం. ఈ నగర విప్లవ ఫలితంగా ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పడిన కాంస్య యుగ నాగరికతల ప్రధాన లక్షణాలను సమీక్షించాం. ఇనుము లోహ పరిజ్ఞానంవల్ల ఏర్పడిన నాగరికతా విస్తరణను, నాగరికతలో ఏర్పడిన సాంకేతిక ప్రగతిని, సామ్రాజ్య స్థాపనలను గురించి చర్చించాం. కాంస్య, అయో యుగ నాగరికతలతో మానవుడు చారిత్రక యుగంలోకి ప్రవేశించిన తీరును తెలియజేశాం.

BRAOU

BRAOU

# భాగం -1 : చరిత్ర పూర్వయుగం : చారిత్రక సంధి యుగం

విషయక్రమం


1.0 లక్ష్యాలు

1.1 చరిత్ర పూర్వయుగ అధ్యయనం : వివిధ దశలు

1.1.1 చరిత్ర పూర్వయుగం : నిర్వచనం

1.1.2 చారిత్రక సంధి యుగం : నిర్వచనం

1.1.3 చరిత్ర పూర్వయుగం : పురావస్తు శాస్త్రం

1.1.4 చరిత్ర పూర్వయుగ అధ్యయనం : భూమి పుట్టుక, బైబిల్

1.1.5 'ఏకరూప' నిర్మాణ సిద్ధాంతం

1.1.6 మానవుని ప్రాచీనత : మానవ పరిణామాన్ని గురించి తెలిపే శిలాజాలు

1.1.7 చరిత్ర పూర్వ యుగం : త్రియుగ విభజన, పునర్విభజన

1.2 ప్రాచీన శిలాయుగం, మధ్య శిలాయుగం, నవీన శిలాయుగం

1.2.1 ప్లైస్టసీన్ యుగం : మానవ పరిణామం

1.2.2 'నరవానరులు' (Anthropoids)

1.2.3 'హోమోసేపియన్‌లు' (బుద్ధిజీవి అయిన మానవుడు)

1.3 శిలాయుగాలలోని పరికరాలు, పరిశ్రమలు, స్థావరాలు

1.3.1 ప్రాచీన శిలాయుగం : పరికరాలు, పరిశ్రమలు

1.3.2 ప్రాచీన శిలాయుగం : చిత్రలేఖనం

1.3.3 మధ్య శిలాయుగం : పరికరాలు, పరిశ్రమలు

1.3.4 నవీన శిలాయుగం : కొలాల పూర్వదశ, కొలాల దశ - స్థావరాలు

1.3.5 చారిత్రక సంధి యుగం : వివరణ

1.4 సంగ్రహంగా

1.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

1.6 ఉపయుక్త గ్రంథాలు

1.7 పదకోశం


BRAOU

## 1.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని అధ్యయనం చేయడంవల్ల, ఈ క్రింది విషయాలను తెలుసుకోగలగాలి.

- చరిత్ర పూర్వయుగం, చారిత్రక సంధి యుగ నిర్వచనాలు.
- చరిత్ర పూర్వయుగ అధ్యయనంలోని వివిధ దశలు.
- నరవానరుని (Anthropoid) స్థితి నుండి బుద్ధిజీవి అయిన మానవుడు (Homosapiens) గా రూపొందే వరకు, మానవ పరిణామంలోని వివిధ దశలు.
- చరిత్ర పూర్వయుగంలోని ప్రాచీన, మధ్య, నవీన శిలా యుగాలలో, ప్రాచీన శిలాయుగపు అంతర్భాగాలలో మానవుడు రూపొందించిన పరికరాలు, పనిముట్లు, పరిశ్రమలు, సాంకేతిక రంగంలో ప్రగతి.
- శిలా యుగాలలో మానవుల స్థావరాలు, జీవన విధానం.

## 1.1 చరిత్ర పూర్వయుగ అధ్యయనం : వివిధ దశలు

జీవపరిణామ క్రమంలో జరిగిన సుదీర్ఘ ప్రయాణంలో, జంతు ప్రపంచంలో చిట్టచివరి దశ, మానవుడు. ఈ విషయాన్ని ప్రకృతి శాస్త్రజ్ఞుడైన ఛార్లెస్ డార్విన్ (1809-1892) తాను రచించిన **Origin of the Species (1859), The Descent of Man (1871)** అనే సుప్రసిద్ధ గ్రంథాలలో ప్రతిపాదించిన 'పరిణామం, ప్రకృతి వరణం' అనే సిద్ధాంతాల ద్వారా, చక్కగా వివరించాడు. ఈ విషయం భూవిజ్ఞాన శాస్త్ర (Geology) సాక్ష్యాలతో, భూమి పైపొరలలో లభించిన శిలాజాల (Fossils) ద్వారా ధ్రువీకరించడమైంది. మానవుడి పుట్టుకను గురించిన అధ్యయనం, ప్రకృతి చరిత్ర (Natural History) తో ముడివడి ఉంది. అందువల్ల, అతి ప్రాచీన కాలంలోని మానవుల కార్యకలాపాలను, సామాజిక, ఆర్థిక స్థితిగతులను, పురావస్తు శాస్త్రం (Archaeology), మానవ శాస్త్రం (Anthropology) మొదలయిన శాస్త్రాల సహాయంతో అధ్యయనం చేయవలసి ఉంటుంది.

BRAOU

### 1.1.1 చరిత్ర పూర్వయుగం : నిర్వచనం

మానవులు నివసించే ఈ భూమి వయస్సు దాదాపు 4600 మిలియన్ల (460 కోట్ల) సంవత్సరాలని శాస్త్రజ్ఞులు లెక్కగట్టారు. భూమిమీద మానవుడు ఆవిర్భవించి సుమారు 20 లక్షల సంవత్సరాలై ఉండవచ్చునని శాస్త్రజ్ఞుల విశ్వాసం. కాని, బుద్ధిజీవి అయిన నేటి మానవుడు (Homosapiens) రూపొందింది, 40 లేదా 30 వేల ఏండ్లకు ముందు మాత్రమే. బుద్ధిజీవి అయిన ఈ మానవునికి లిపిజ్ఞానం లేదా అక్షరజ్ఞానం ఏర్పడి, ఇప్పటికి ఏ అయిదువేల ఏండ్లు మాత్రమే అయింది. లిపి జ్ఞానంతో చదవడం, రాయడం కొంచెం విస్తృతంగా వాడుకలో ఉన్నది, గత రెండు, మూడు వేల ఏండ్లలో మాత్రమే; అది కూడా ప్రపంచంలోని కొన్ని ప్రదేశాలకు మాత్రమే పరిమితం. మానవుడు లిపి నేర్చినప్పటి నుండే మానవ చరిత్ర ప్రారంభమయినట్లు భావించి, ఆ దశను మనం నాగరికతగా అభివర్ణిస్తుంటాం. భూగోళం మీద ఎక్కడైనా సరే రాయటం కనుక్కోవటాన్ని నాగరికతా ఆవిర్భావానికి సంకేతంగా భావించవచ్చని గార్డన్ ఛైల్డ్ (Gordon Child) నిర్దిష్టంగా నిర్వచించాడు. లిపి నేర్చినప్పటి నుండే, అంటే క్రీ.పూ. 3000 నుండి మానవ చరిత్ర ప్రారంభమైందని మనం సాధారణంగా భావిస్తుంటాం. ఈ దశకు పూర్వం ఉన్న మానవ జీవనాన్ని ప్రాక్ చరిత్ర (Pre -history) గాను, ఈ దశకు చెందిన అనేక వేల ఏండ్ల పర్యంతమైన కాలాన్ని చరిత్ర పూర్వయుగ (Pre –historical Period) మని శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు. ఈ చరిత్ర సమకాలికులుగాని, తర్వాతి కాలంలో వారు కాని రచించిన లిఖిత వృత్తాంతాల మీద ఆధారపడి ఉండదు. మానవుడు పరిసరాలను తన కనుగుణంగా మార్చుకొనే ప్రయత్నంలో ఉపయోగించిన పరికరాలే,

ఈ ప్రాక్ చరిత్రకు ప్రధాన సాక్ష్యాధారాలు. సుప్రసిద్ధ పురావస్తు శాస్త్రజ్ఞుడైన హెచ్.డి. సంకాలియా, ప్రాక్ చరిత్ర (Pre-history) ను ఇట్లా నిర్వచించారు : "Pre- history means the history of a region, a country or a nation, people or race, before it took to or knew writing. This, unlike ordinary history, is not based on accounts of contemporary or later writers. Hence, pre- history is also defined as an account of illiterate or pre-literate people." (H.D. Sankalia, *The pre-history and proto-history of India and Pakistan*, Poona, New Edition, 1974).

### 1.1.2 చారిత్రక సంధి యుగం (Proto-history) : నిర్వచనం

ఈ చరిత్ర పూర్వయుగ నిర్వచనం ఆఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ మొదలైన దేశాల ఆదిమ చరిత్రకు అతికినట్లు సరిపోతుంది. ఈ దేశాలలో ఆదిమ మానవులకు సంబంధించి ఏవో కొన్ని కథలు, గాథలు, చెదురుమదురుగా ఉన్న సంప్రదాయాలు ఉండవచ్చుగాని, పరంపరాగతమైన, మౌఖికమైన సంప్రదాయాలుగాని, సారస్వతంకాని లేవు. అందువల్ల, లిఖితం కానప్పటికీ పరంపరాగతమైన మౌఖిక సంప్రదాయాలు, సారస్వతం ఉన్న భారతదేశానికి ఈ చరిత్ర పూర్వయుగ నిర్వచనం నుండి కొంత మినహాయింపు ఇవ్వవలసి ఉంది. క్రీ.పూ. మూడో శతాబ్దం నాటివైన అశోకుని శిలా శాసనాలకు ముందు, భారతదేశ చరిత్రకు సంబంధించి ఎలాంటి లిఖిత వృత్తాంతాలు లభించనప్పటికీ, భారతదేశంలో వేదాల రూపంలో, సూత్రాల రూపంలో, క్రీ.పూ. 1500 వరకు విస్తరించి, సంపూర్ణ స్వరూపంతో ఉన్న సారస్వతం ఉంది. ఈ సారస్వతం అలిఖితంగా ఉన్నప్పటికీ, ప్రాచీన భారతదేశ చరిత్ర, సంస్కృతుల అధ్యయనానికి విశ్వసనీయమైన ఆధారమైవుంది. అలిఖితంగా ఉన్నటువంటి ఈ సారస్వతాధారం వల్ల తెలిసి వచ్చే చరిత్రను, ప్రాగ్ ఇతిహాసం (Proto- history) అనీ, ఆ చరిత్ర కాలాన్ని, చారిత్రక సంధి యుగం (Proto-historical period) అనీ, పిలిచారు. ఇదే విధంగా, భారతదేశంలోని సింధులోయ, లేదా హరప్పా నాగరికతను కూడా, ఈ చారిత్రక సంధి యుగం కింద చేర్చవలసి ఉంటుంది. ఎందువల్లనంటే, సింధులోయ నాగరికతా నిర్మాతలు నిరక్షరాస్యులు కారు. సింధు లోయ నాగరికతా స్థావరాలలో లభించిన అనేక ముద్రల, ముద్రికల, మృణ్మయ శకలాల మీది రాతలు, వారికి చక్కని లిపి జ్ఞానం, అక్షర జ్ఞానం ఉన్నట్టు తెలుపుతాయి. అంతేగాక, ఈ నాగరికత, తర్వాతి కాలంలో ఆవిర్భవించిన బ్రాహ్మణ, లేదా హిందూ మతానికి గల ఆధారాలలో ఒకటి. ఇట్లా, రెండు విధాలుగా, సింధు నాగరికత చారిత్రక సంధి యుగానికి చెందుతుంది. ప్రాగ్ ఇతిహాసానికి ఇచ్చిన నిర్వచనాన్ని బట్టి, సింధు లోయ నాగరికతకు సమకాలికాలైన, లేదా దానిని అనుసరించి వచ్చిన తామ్ర-శిలా సంస్కృతులు (Chalco-lithic Cultures) అన్నీ, ఈ చారిత్రక సంధి యుగానికి చెందినవనే చెప్పాలి. అందువల్ల, భారతదేశంలో ప్రాక్ చరిత్ర (Pre-history), శిలా యుగాల(Stone Ages)కు మాత్రం పరిమితమవుతుంది. ఈ చారిత్రక సంధి యుగాన్ని గురించి హెచ్.డి. సంకాలియా, ఇలా వివరించారు : "This literature (the Vedic and Sutra) can and has been a source of Indian history. But, since it is (was) not written down, it is called here proto-history.

"Likewise, the Indus Valley or Harappan Civilization, though included by some writers under pre-history, should be and is here included under proto-history. -----

"Pre-historic Archaeology then will deal with that period of time (in India) of which we have no legend, no tradition; and no object, save stone (and bone) implements and remains of animals. This is not a very precise definition, but will serve our purpose. Briefly, then, pre-historic archaeology will comprise the various Stone Ages". (అదే, పు.8)

### 1.1.3 చరిత్ర పూర్వ యుగం : పురావస్తు శాస్త్రం

చరిత్ర పూర్వ యుగాన్ని గురించి తెలుసుకోవాలన్నా, లేదా చారిత్రక సంధి యుగాన్ని గురించి తెలుసుకోవాలన్నా, ఈ యుగాల నన్నిటినీ విశదీకరించగల సాధనం ఒక్క పురావస్తు శాస్త్రమే. పురావస్తు శాస్త్రానికి కూడా చరిత్రకు వలెనే, ప్రాచీన మానవులను గురించి, అంటే ఆనాటి ప్రజల జీవన విధానం, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, మతం, వారి

BRAOU

స్వరూపాలు, వారు అవలంబించిన మృత సంస్కారాలు మొదలయిన విషయాలను, విశదీకరించి తెలపడమే ముఖ్యోద్దేశం. చరిత్రకూ, పురావస్తు శాస్త్రానికీ లక్ష్యం ఒకటే అయినా, ఆ లక్ష్య సాధనకు అవి అవలంబించే మౌలిక విధానాలలో భేదాలు ఉన్నాయి. చరిత్ర రచనకు ప్రధానాధారాలు లోహ, శిలా శాసనాలు, వివిధ చారిత్రక యుగాలకు సంబంధించిన సమకాలిక, తర్వాతి కాలపు లిఖిత వృత్తాంతాలు మొదలయినవి. అంటే, చరిత్రకారుడు ఎక్కువగా లిఖిత రూపకమైన సమాచారాన్నే సేకరిస్తాడు. కాని, పురావస్తు శాస్త్ర నిర్మాణానికి ఆధారమైనవి మానవులు తయారు చేసుకొన్న వస్తు సముదాయాలే (artefacts). ఈ సముదాయాలలో పనిముట్లు, ఆయుధాలు, ఇండ్లు, దేవాలయాలు, సమాధులు మొదలయినవన్నీ చేరతాయి. చూడదగినవి, తాకదగినవి (దర్శనీయాలు, స్పర్శనీయాలు) అయిన ఈ వస్తువులను ఆధారంగా చేసుకొని, పురావస్తు శాస్త్రజ్ఞుడు వాటి నిర్మాతల వ్యవహారాలను గురించి ఆలోచించి చెప్పవలసి ఉంటుంది. పురావస్తు శాస్త్ర ఆధారాలను గురించి చెప్తూ, "పురావస్తు శాస్త్రజ్ఞులు తవ్వి తీస్తున్నది వస్తువులను కాదు, మనుషులను" అని పురావస్తు శాస్త్రజ్ఞుడు మార్టిమర్ వీలర్ చక్కగా చెప్పాడు.

ప్రాచీన విషయాల మీద ఆసక్తి ఉండటం మానవ సహజం. ఈ ఆసక్తి ఇప్పటి మనకే కాదు, ప్రాచీనులకు కూడా ఉండేది. కొన్ని శతాబ్దాలకు పూర్వమే భారతీయులకు సృష్టి, భూమి పుట్టుక, దాని మీద ఈ చరాచర ప్రాణికోటి వికాసం అనే వాటిని గురించి, కొన్ని నిశ్చితాభిప్రాయాలు ఉన్నాయి. భారతీయులు భూమి పుట్టుక, భూమి మీద మానవుని ఆవిర్భావం కొన్ని లక్షల సంవత్సరాల కింద జరిగాయనీ, అవి అత్యంత ప్రాచీనమయిన విషయాలనీ విశ్వసించారు. ఇది క్రైస్తవులు, క్రైస్తవ మతాధికారులు, వారి పవిత్ర గ్రంథమైన బైబిల్ ఆధారంగా వెలిబుచ్చిన అభిప్రాయాలకు విరుద్ధమైంది.

## 1.1.4 చరిత్ర పూర్వయుగ అధ్యయనం : భూమి పుట్టుక, బైబిల్

చరిత్ర పూర్వయుగ పురావస్తు జ్ఞానం, ఆ యుగానికి సంబంధించిన శిలాయుగాల అధ్యయనం, దాదాపు నూట ఇరవై సంవత్సరాల కిందటనే, పశ్చిమ ఐరోపా దేశాలలోనూ, ఇంగ్లాండ్‌లోనూ ప్రారంభమైంది. ఆ సమయంలోనే, బ్రిటీష్ వారి పాలన వల్ల భారతదేశానికి కలిగిన కొద్ది సత్ఫలితాలలో ఒక సత్ఫలితంగా, భారతదేశంలో కూడా ఈ అధ్యయనం ప్రారంభమైంది. పశ్చిమ ఐరోపా దేశాలలో, ఇంగ్లాండ్‌లో 19వ శతాబ్ది ప్రారంభంలో, చరిత్ర పూర్వ యుగానికి సంబంధించిన పురావస్తు శాస్త్ర పునాదుల నిర్మాణానికి తగిన వాతావరణం రూపొందింది. ప్రాచీన వస్తువుల మీద, వస్తువుల అవశేషాల మీద శ్రద్ధ, ఆసక్తి చిరకాలమైనదైనప్పటికీ, 1715 నాటికే ఇంగ్లాండ్‌లోనూ, 1771 నాటికి జర్మనీలోనూ, శిలాయుగ పరికరాలను గురించి ఆయా సందర్భాలలో కనుక్కోడం, దానికి సంబంధించిన సమాచారం తెలిసి వున్నా, భూవిజ్ఞాన శాస్త్రజ్ఞుల (Geologists) తో సహా, శాస్త్రజ్ఞులు, భూమి పుట్టుక, బైబిల్‌లోని పాత నిబంధన ఆధారంగా, క్రైస్తవ మతాధికారులు నిర్ణయించిన క్రీ.పూ. 4004 సంవత్సరానికన్నా చాలా ప్రాచీనమని అంగీకరించడానికి సిద్ధంగా లేరు. బ్రిటన్‌లో ఆర్చ్‌బిషప్ (Archbishop) ఉష్షర్ (Ussher), భూమి పుట్టుక క్రీ.పూ. 4004లో జరిగినట్లు ప్రతిపాదించాడు. భూమిని క్రీ.పూ. 4004వ సంవత్సరంలో అక్టోబర్ నెల 23వ తేదీన ఉదయం 9 గంటలకు దేవుడు సృష్టించినట్లు, బిషప్ లైట్‌ఫుట్ (Bishop Lightfoot) లెక్కలు కట్టి చెప్పాడు. క్రీ.పూ. 4004 మార్చి 2వ తేది, బుధవారం సాయంత్రం 6 గంటలకు ఈ సృష్టి జరిగినట్లు, డాక్టర్ మార్గరెట్ ముర్రే (Dr. Margaret Murray) చెప్పారు. నాటి భూవిజ్ఞాన శాస్త్రజ్ఞులు, భూమిమీద గోచరించే వివిధ శిలా రూపాలు (Rock formations) భూతత్త్వ శాస్త్రానికి సంబంధించిన కొన్ని ఖచ్చితమైన సూత్రాల వల్ల ఏర్పడినవని కాక, ఏదో అకస్మాత్తుగా సంభవించిన ఉత్పాతాల వల్ల ఉత్పన్నమైనవని విశ్వసించారు. అత్యంత ప్రాచీన కాలంలో గతించిన జంతువుల ధాతువుల (bones)తో పాటు లభించిన శిలా పరికరాలను కనుక్కొన్న తొలి సంఘటనలను గమనించక పోవడం, గమనించినా అవి తెలిపే చారిత్రక సత్యాలను అనుమానించి అంగీకరించక పోవడం జరిగింది.

BRAOU

### 1.1.5 ఏకరూప నిర్మాణ సిద్ధాంతం

ఇలాంటి నేపథ్యంలో, భూవిజ్ఞాన శాస్త్రజ్ఞుడైన ఛార్లెస్ లైల్ (Charles Lyell, 1797-1875) భూమి మీద ఒకే రకంగా పరుచుకొని ఉన్న శిలారూపాలు ఒకేవిధంగా ఒక పద్ధతి ననుసరించి ఏర్పడటం జరిగిందనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. దీనిని 'యూనిఫార్మిటేరియానిజం' (Uniformitarianism, ఏకరూప నిర్మాణం) సిద్ధాంతమని పేర్కొన్నాడు. మొదట్లో ఈ సిద్ధాంతాన్ని అందరు శాస్త్రజ్ఞులు అంగీకరించలేదు. భూమి పుట్టుకను గురించి బైబిల్ చెప్పే సిద్ధాంతాన్ని గుడ్డిగా విశ్వసించిన మేధావులూ, సమాజమూ ఈ సిద్ధాంతాన్ని అంగీకరించడానికి చాలాకాలమే పట్టింది. కాని, ఈ సిద్ధాంతం (Uniformitarianism), నాటి ప్రముఖ బ్రిటీష్ భూవిజ్ఞాన శాస్త్రజ్ఞులైన John Evans, Falconer, Prstwich, Pengelly మొదలైనవారు శిలాజాలైన జంతువుల ధాతువుల (Bones)తోపాటు లభ్యమయిన శిలాపరికరాల (చేతి గొడ్డళ్ళ) ప్రాముఖ్యాన్ని అవగాహన చేసుకోడానికి దోహదం చేసింది. ఫ్రాన్స్‌లో ఏబ్‌విల్ (Abbeville) లోని సోమ్ (Somme) నదీ తీరాన ఉన్న ఒక తిప్పలో, 1830లో Boucher De Perthe అనే శాస్త్రజ్ఞుడు రాతి పనిముట్లను, శిలాజాలుగా మారిన జంతువుల ధాతువులతోపాటు కనుక్కొన్నాడు. అట్లే, బ్రిటీష్ శాస్త్రజ్ఞుడు Pengelly, 1858లో ఇంగ్లాండ్‌లోని బ్రిక్స్‌హ్యాం వద్ద ఒక గుహలో శిలా పరికరాలను, శిలాజాలైన జంతువుల ధాతువులను కనుక్కొన్నాడు. ఈ రాతి పరికరాలను చేసిన మానవుడు, శిలాజాలైన ధాతువుల వల్ల అతనితోపాటు ఉన్నట్లు తెలియవచ్చిన సింహం, ఏనుగు, ఖడ్గమృగం మొదలైన జంతువులు, అత్యంత ప్రాచీనకాలం నాటివని ఈ ఆవిష్కరణలు (discoveries) రుజువు చేశాయి. అంతేకాక, ఈ పరికరాలు, ధాతువులు, ఐరోపా, దాని శీతోష్ణ పరిస్థితులలో, భౌగోళికంగా ఇప్పటికన్నా చాలా విభిన్నంగా ఉన్న కాలం నాటివని కూడా రుజువు చేశాయి.

### 1.1.6 మానవుని ప్రాచీనత : మానవ పరిణామాన్ని గురించి తెలిపే శిలాజాలు

మానవుడు రూపొందించిన రాతి పనిముట్లను కనుక్కొన్న తర్వాత అనతి కాలం లోనే, భూమి మీద మానవుని ఆవిర్భావ పరిణామాలను గురించి తెలిపే అతని శిలాజాలు లభించాయి. 1700 సంవత్సరంలోనే ఆదిమ మానవుని పుర్రె ఒకటి లభించినా, దానిని గురించి ఎవ్వరూ పట్టించుకోలేదు. తర్వాత, 1856లో జర్మనీలోని డుస్సెల్ నదీతీరంలో ఉన్న నియాండరథల్ (Neanderthal) వద్ద ప్రాక్ మానవుని కపాలాన్ని ఒకదానిని కనుక్కొన్నారు. ఈ మానవుని 'నియాండర్‌తల్ మానవుడు' అని శాస్త్రజ్ఞులు పేర్కొని, భూమి నుండి అంతరించిపోయిన మానవ జాతికి చెందినదిగా గుర్తించారు. ఎత్తైన కనుబొమలతో, వెనకకు కుంచించుకుపోయిన నుదురుతో ఉన్న వానరాకారపు మానవునిదిగా ఈ కపాలాన్ని శాస్త్రజ్ఞుడు థామస్ హక్స్‌లే (Thomas Huxley) గుర్తించాడు. కాని తర్వాత, ఇతని వానరాకారం యదార్థం కాదని, కీళ్లవాతం వల్ల కాళ్లు, పాదాలు వక్రత పొంది సాఫీగా నడవటానికి లేకుండాపోయాయని గుర్తించారు. అతడు బుద్ధిజీవి అయిన మానవులలో (Homosapiens) ఒక తెగకు చెందినవాడని గుర్తించి, అతనిని Homosapien Neanderthalensis (బుద్ధిజీవి అయిన నియాండర్‌తల్ మానవుడు) అని పిలిచారు.

మానవుల భౌతిక అవశేషాలు, వారు ఉపయోగించిన పనిముట్లూ, కొన్ని అంతరించిపోయిన జంతువుల శిలాజాలతో కూడి, అవన్నీ అత్యంత ప్రాచీనాలని శాస్త్రబద్ధంగా నిరూపించబడడంతో, భూమి సృష్టికి బైబిల్ నిర్ణయించిన తేదీలు (క్రీ.పూ. 4004) పటాపంచలయిపోయాయి. కాని, ఈ ప్రాక్ మానవుల, జంతువుల ఉనికిని, పరస్పర సంబంధాన్ని అర్థం చేసుకోవడానికి శాస్త్రీయమైన వివరణ అవసరమైంది. *Origin of Species* (1859), *Descent of Ma*[n] (1871) అనే తన గ్రంథాల ద్వారా బ్రిటీష్ ప్రకృతి శాస్త్రజ్ఞుడైన ఛార్లెస్ డార్విన్ (1809-1892), *Man's Place in Natur*[e] (1863) అనే తన గ్రంథం ద్వారా, మరొక బ్రిటీష్ ప్రకృతి శాస్త్రజ్ఞుడైన థామస్ హెన్రీ హక్స్‌లీ ఈ వివరణను సమకూర్చారు. జీవపరిణామక్రమంలో జరిగిన సుదీర్ఘ ప్రయాణంలో, జంతు ప్రపంచంలో చిట్టచివరి దశ మానవుడనే విషయాన్ని ఛార్లెస్ డార్విన్ తన గ్రంథాలలో చక్కగా వివరించాడు.

BRAOU

### 1.1.7 చరిత్ర పూర్వయుగం : త్రియుగ విభజన, పునర్విభజన

నాటికి లభించిన రాతి పనిముట్లు, మానవుల, జంతువుల శిలాజాల ఆధారంగా చరిత్ర పూర్వయుగ పురావస్తు శాస్త్రానికి (Prehistoric Archaeology), 1800-1850ల మధ్య, యదార్థమైన పునాదులను నిర్మించినవారు డేనిష్ పురావస్తు శాస్త్రజ్ఞులు. వీరిలో ప్రముఖులు - నెరూప్ (Nyerup), సైమన్‌సెన్ (Simonsen), థామ్సెన్ (Thomsen), నిల్సాన్ (Nilssson), వర్సే (Worsaae)లు. వీరిలో సైమెన్‌సెన్ (Simonsen) పూర్వయుగంలోని మానవ పరిణామంలో మూడు దశలను గుర్తించవచ్చని 1813లో సూచనప్రాయంగా తెలిపాడు. ఈ మూడు దశలను విపులీకరించిన థామ్సన్, పూర్వయుగంలోని మానవుని పరిణామ క్రమంలో శిలా యుగం (Stone Age), కాంస్య యుగం (Bronze Age), అయో యుగం (Iron Age) అనే మూడు యుగాలు ఉన్నాయని ప్రతిపాదించాడు. మానవుడు తన పనిముట్లను, ఆయుధాలను చేసుకోవడానికి వాడిన రాయి (శిల), కంచు (కాంస్యం), ఇనుము (అయస్) ఆధారంగా థామ్సన్ ఈ యుగ విభజన చేశాడు. ఈ మూడు యుగాల సిద్ధాంతంలో, తర్వాతి కాలంలో, కొన్ని మార్పులు, చేర్పులు, వచ్చినా, మౌలికమైన యుగ విభజనలో ఎలాంటి మార్పు లేదు. థామ్సన్‌గాని, అతని శిష్యుడు వోర్సేగాని, ఈ యుగాలు ఖచ్చితమైన క్రమ పరిణామంలో ఒకదానిని మరొకటి అనుసరించినట్లు చెప్పలేదు. ఈ పరిణామంలో, మధ్య మధ్య శత్రు దండయాత్రలు, నూతన భావాల ప్రసరణ, ప్రజలు స్థలాంతరాలకు వలసపోవటం, దాని వల్ల రాగి, ఇనుములను గురించి కొత్తగా తెలుసుకోవటం మొదలయిన కారణాలు, కొన్ని అవాంతరాలను ఏర్పరిచాయి. అయితే, ఈ కారణాలే పరిణామానికి దోహదం చేశాయి. ఎన్ని అవాంతరాలు ఏర్పడినా, మానవజాతి నిలకడగా, క్రమాగతమైన, పురోగామి అయిన అభివృద్ధిని సాధించిందని, చరిత్ర పూర్వయుగ పురావస్తు శాస్త్రం మనకు తెలియచేస్తుందని, నిల్సన్ (Nilsson) ఇట్లా పేర్కొంటాడు : "It (pre-historic Archaeology) demonstrated that not withstanding apparent or partial retrogression, the human race was constantly undergoing a gradual and progressive development". మూడు యుగాల సిద్ధాంతాన్ని థామ్సన్ ప్రతిపాదించక ముందు, మానవ పరిణామంలో నాలుగు దశలు ఉన్నట్లు నిల్సన్ పేర్కొన్నాడు. నిల్సన్ పేర్కొన్న ఈ నాలుగు దశలు : (1) మృగప్రాయుడు (Savage), (2) మృగయుడు లేదా సంచార జీవి (Huntsman or Nomad), (3) కర్షకుడు (Agriculturist), (4) నాగరకుడు (నాణేలు, రాత, శ్రమ విభజన తెలిసినవాడు) - Civilized Man.

థామ్సన్, వోర్సే, నిల్సనన్‌లు చరిత్ర పూర్వయుగ అధ్యయనం ముందుకు సాగడానికి కావలసిన మార్గాన్ని ఏర్పరిచారు. వారి తర్వాత వచ్చిన శాస్త్రవేత్తలు శిలాయుగాన్ని, ప్రాచీన శిలాయుగం లేదా పాత రాతియుగం, మధ్య శిలాయుగం లేదా మధ్య రాతియుగం, నవీన శిలాయుగం లేదా కొత్త రాతియుగంగా (Paleolithic or Old Stone, Mesolithic or Middle Stone and Neolithic or New Stone Ages) విభజించారు. ప్రాచీన శిలాయుగాన్ని, దిగువ ప్రాచీన శిలాయుగం, మధ్య ప్రాచీన శిలాయుగం, ఎగువ ప్రాచీన శిలాయుగంగా పునర్విభజించారు. ఈ విభజనలను మొదటగా ప్రారంభించిన శాస్త్రజ్ఞుడు, లార్డ్ ఏవ్‌బరీ (Lord Avebury). తర్వాత అతన్ని అనుసరించి లార్టెట్, మార్టిల్లెట్ మొదలయిన శాస్త్రజ్ఞులు చరిత్ర పూర్వయుగానికి సంబంధించిన వివిధ కాలగణన చట్రాలలో, వివిధమైన కాల విభజన సిద్ధాంతాలను ప్రతిపాదించారు. మార్టిల్లెట్ (Martillet) మానవ పరిణామ క్రమాన్ని, Times, Ages, Periods, Epochs (కాలాలు, యుగాలు, యుగాంతరాలు, శకాలు)గా విభజించాడు. అతడు పేర్కొన్న Times (కాలాలు) - Tertiary, Quarternary, Recent, Pre-history, Proto-history and History; Ages (యుగాలు) - Stone (శిలా), Bronze (కాంస్య), Iron (అయో); Periods (యుగాంతరాలు) - Eolithic (అత్యంత ప్రాచీన శిలాయుగం), Paleolithic (ప్రాచీన శిలాయుగం) and Neolithic (నవీన శిలాయుగం); Epochs (శకాలు) - Chellean, Acheulian, Soultrean మొదలైనవి. మార్టిల్లెట్ పేర్కొన్న ఈ శకాలు (Epochs), ఫ్రాన్స్‌లోని కొన్ని స్థలాలలో మానవుడు ఉపయోగించిన పరికరాలనుబట్టి, ఆ స్థలాల పేరు మీదుగా, చేసిన అతి పరిమిత కాలాలు. స్థానిక సంస్కృతులను బట్టి చేసిన ఇలాంటి కాల విభజనను ఇతర దేశాలకు, ప్రాంతాలకు వర్తింపజేయలేం.

లుబ్బక్ (Lubbock) అనే శాస్త్రజ్ఞుడు ప్రాచీన మానవ చరిత్రను 1) ఆహారాన్వేషణ దశ (Food-gathering stage), 2) ఆహారోత్పాదన దశ (Food producing stage) అని, రెండు దశలుగా విభజించాడు. తర్వాతి కాలంలో ఈ విభజనను ఆమోదించి, విపులీకరించిన శాస్త్రజ్ఞులలో గార్డన్ చైల్డ్ (Gordon Childe) చాలా ప్రసిద్ధుడు.

మానవుడు ఆహారాన్వేషణ దశ నుండి ఆహారోత్పాదన దశకు చేరుకోవటాన్ని, మానవ చరిత్రలో తొలి విప్లవంగా గణించారు. రెండో విప్లవం, నగర విప్లవం. ఈ విప్లవం కూడా, చరిత్ర పూర్వయుగంలో రాగి, మిశ్ర లోహాలైన కంచు, మొదలైన లోహాలను కనుక్కోవడంతో ప్రారంభమయింది. ఈ రెండో విప్లవం ఫలితంగా, వృత్తి విభజన, విదేశ వ్యాపారం, మిగులు సంపద, వీటి పర్యవసానమైన నగరాలు ఏర్పడ్డాయి. ఈ విప్లవాలు, మార్పులు అన్నీ చాలా మందగతిలో జరిగాయి.

చరిత్ర పూర్వయుగంలోని వివిధ యుగాలకు సంబంధించి, గార్డన్ చైల్డ్ మరొక ప్రతిపాదన చేశాడు. ప్రాచీన, నవీన శిలాయుగాలు, తామ్ర, అయో యుగాలు, కాలక్రమానికి సంబంధించిన యుగాలుగాక, మానవ పరిణామంలోని వివిధ సాంకేతిక దశలు (Technological Stages) అని, గార్డన్ చైల్డ్ పేర్కొన్నాడు. అంటే, 'ప్రాచీన శిలా', 'నవీన శిలా' మొదలైన పదాలు, మానవ చరిత్రలోని ఒక ప్రత్యేక కాలాన్ని సూచించవు; అవి మానవ నాగరికతా పరిణామంలో ఒక ప్రాంతంలోకాని, దేశంలోకాని మానవులు అందుకొన్న దశను మాత్రమే సూచిస్తాయి. నేటికి కూడా ఆస్ట్రేలియాలోని ఆదిమవాసులు కొందరు "ప్రాచీన శిలా" దశలో, లేదా "నవీన శిలా" దశలో ఉన్నారని చెప్పినప్పుడు, వారు చరిత్ర పూర్వయుగంలోని ప్రాచీన, లేదా నవీన శిలా యుగాలకు చెందినవారనిగాక, ఆ యుగాలలో ఎలాంటి శిలా పరికరాలను వాడేవారో అలాంటి పరికరాలను మాత్రమే చేసుకోగలరని, అలాంటి పరికరాలనే వాడుతున్నారని అర్థం చేసుకోవలసి ఉంటుంది. ఉదాహరణకు, న్యూజిలాండ్‌లోని మయోరీ తెగవారు క్రీ.శ. 1800 ప్రాంతంలో కూడా కొత్త రాతియుగ దశలోనే ఉన్నారు.

ప్రాచీన, నవీన శిలా యుగాలలో మానవుడు సాధించిన ఆర్థిక, సాంకేతిక ప్రగతిని నిర్వచించటానికి ఎల్.హెచ్.మోర్గాన్ (1918-1981), ఆటవికుడు, బార్బేరియన్ అనే పదాలను, 1907లో ప్రచురించిన *Ancient Society* ('ప్రాచీన సమాజం') అనే గ్రంథంలో వాడాడు. ప్రాచీన మానవుని సాంకేతిక, సామాజిక, ఆర్థిక వ్యవస్థల ప్రగతి, ఆటవిక, బార్బేరియన్, నాగరికత అనే క్రమంలో జరిగిందని గార్డన్ చైల్డ్ (Gordon Childe), *What happened in History* (చరిత్రలో ఏం జరిగింది) అన్న గ్రంథంలో వివరించాడు.

## 1.2 ప్రాచీన శిలాయుగం, మధ్య శిలాయుగం, నవీన శిలాయుగం

భూవిజ్ఞాన శాస్త్రజ్ఞులు భూమి మీద జీవ పరిణామ చరిత్రను ఐదు ప్రధాన యుగాలుగా విభజించారు. వీటిని వరుసగా ఆర్కియన్ (Archaen), ప్రైమరీ (Primary), సెకండరీ (Secondary), టెర్షియరీ (Tertiary), క్వాటర్నరీ (Quaternary) అని, పేర్కొన్నారు. ఈ ఐదు ప్రధాన విభాగాలను, ఒక్కొక్కదానినీ, కొన్ని అంతర్భాగాలుగా పునర్విభజించారు. టెర్షియరీ, క్వాటర్నరీలలో ఉన్న అంతర్భాగాలను మాత్రం, ఈ క్రింది పట్టికలో చూడవచ్చు.

| | | |
|---|---|---|
| ఆర్కియన్ | ----- | |
| ప్రైమరీ | ----- | Invertebrates (వెన్నెముక లేని ప్రాణులు) |
| సెకండరీ | | ఉరగాలు |
| టెర్షియరీ | Pliocene (ప్లయోసీన్)<br>Miocene (మయోసీన్)<br>Oligocene (ఒలిగోసీన్)<br>Eocene (యోసీన్) | Mammals<br>స్తన్యదాలు |
| క్వాటర్నరీ | Holocene (హోలోసీన్)<br>Pleistocene (ప్లైస్టసీన్) | Mammals<br>స్తన్యదాలు |

BRAOU

### 1.2.1 ప్లైస్టసీన్ యుగం : మానవ పరిణామం

అద్యతన, లేదా వర్తమాన (Recent) కాలానికి భూవిజ్ఞాన శాస్త్రజ్ఞులిచ్చిన పేరు, హోలోసీన్ (Holocene). కాని, మానవుడు ఈ భూమిపైన ప్లైస్టసీన్‌లోనే ఆవిర్భవించాడు. ప్లైస్టసీన్ ఒక మంచుయుగం - ఒక హిమకాలం (Glacial or Cold Period) అనే భావన ఉంది. కాని, యధార్థానికి అది నిరంతరమైన హిమకాలం కాదు; కొన్ని హిమకాలాలు, మరికొన్ని హిమాంతర కాలాల (Glacial Periods, Inter - Glacial or Genial Periods) తో కూడి ఉన్న కాలం. భూవిజ్ఞాన శాస్త్రజ్ఞులు ప్లైస్టసీన్‌లో నాలుగు హిమకాలాలు, మూడు హిమాంతర కాలాలు సంభవించినట్లు నిర్ణయించారు. ఈ నాలుగు హిమకాలాల పేర్లు వరసగా, గుంజ్ (Gunj), మిండేల్ (Mindel), రిస్ (Riss) వర్మ్ (Wurm). మూడు హిమాంతర కాలాలలో మొదటిది గుంజ్-మిండేల్ మధ్యా, రెండోది మిండేల్-రిస్ మధ్యా, మూడోది రిస్-వర్మ్ నడుమా, ఏర్పడ్డాయి.

హిమకాలాలలో ఉష్ణత ఇప్పుడున్న దానికన్నా చాలా తక్కువగా ఉండటంవల్ల, ఇప్పటి ధ్రువ ప్రాంతాలలో, హిమాలయాలు, ఆల్ప్స్ మొదలైన ఎత్తైన పర్వతశ్రేణుల మీద నెలకొని ఉన్న హిమతలాలు (Glaciers) మరింత విస్తరించి, ఎక్కువ ప్రదేశాన్ని ఆక్రమించి ఉండేవి. ఇప్పుడు ధ్రువ ప్రాంతంలో ఉన్న మంచు అప్పుడు విస్తరించి ఉండటం వల్ల, ఐరోపా ఉత్తర ప్రాంతమంతా కప్పి ఉండింది. అట్లే, భారతదేశంలో హిమాలయ శిఖరాల నుండి మంచు దిగువకు విస్తరించి, చుట్టుపక్కల ప్రదేశాలను ఆక్రమించి ఉండేది.

హిమతలాలు చాలా మెల్లగా విస్తరిస్తాయి. అవి విస్తరించేటప్పుడు కింద ఉన్న మట్టిని తవ్వి, తమ అగ్రాల దగ్గర రాళ్లతోను, బండలతోను కలిపి, పెద్ద కట్టలుగా ఏర్పరుస్తాయి. ఈ కట్టలకు మొరేనులు (Moraines) అని పేరు. హిమతలాలు ఏఏ కాలాలలో, ఎంతెంతవరకు విస్తరించాయో తెలుసుకోవడానికి ఈ మొరేనులే అధారాలు. ఏయే మొరేనులు ఏయే హిమకాలాలకు చెందినవో భూవిజ్ఞాన శాస్త్రజ్ఞులు నిర్ణయించి చెప్పగలరు.

హిమకాలాల్లో హిమతలాల విస్తరణమే కాక, సముద్రపు నీటి మట్టం (Sea level) కూడా తగ్గింది. నీటిమట్టం ఇప్పుడున్న దానికన్నా కొన్ని వందల మీటర్ల వరకు కూడా తగ్గినట్లు నిదర్శనాలు ఉన్నాయి. ఏ హిమకాలంలో ఈ సముద్రపు మట్టం ఎంత వరకు తగ్గిందో భూవిజ్ఞాన శాస్త్రజ్ఞులు చెప్పగలరు.

హిమాంతర కాలాల్లో, పరిస్థితులు పైన వివరించిన వాటికి విరుద్ధమైనవి. ఇందులో కవోష్ణత (warmth) పెరగడం, మంచు కరగడం, ఆ కరిగిన మంచు నీరు సెలయేళ్ళుగా, నదులుగా పారడం జరిగాయి.

పైన పేర్కొన్న హిమ, హిమాంతర కాలాల ప్రభావం ఇప్పటి సమశీతోష్ణ మండలాల (Temperate Zones)లో, ఉదాహరణకు ఐరోపాలో ఎక్కువగా కనపడుతుంది. కాని, ఇప్పటి ఉష్ణ మండలాల (Tropical Zone)లో, ఈ కాలాల ప్రభావం కనిపించదు. ఈ ఉష్ణమండలంలో ఉన్న ప్రదేశాలైనా, ఆఫ్రికాలో, దక్షిణ భారతదేశంలో ఎంతటి హిమకాలంలోనైనా మంచు కప్పి ఉండలేదు. ప్లైస్టసీన్ నాటికి ఇక్కడి పరిస్థితులు ఐరోపాలాగా కాకుండా వేరుగా ఉండేవి. హిమ, హిమాంతర కాలాలకు బదులు, ఇక్కడ నాలుగు అతివర్ష (Pluvial or Wet), మూడు అల్పవర్ష (Interpluvial or Dry) కాలాలు ఉండేవి. అతివర్ష కాలాలు నాలుగింటికీ వరసగా, కాగెరాన్ (Kageran), కమాసియన్ (Kamasian), కంజెరన్ (Kanjeran), గాంబ్లియన్ (Gamblian) అని, పేర్లు. రెండేసి అతివర్ష కాలాల మధ్య ఒక్కొక్క అల్పవర్ష కాలం ఉండేది. అల్పవర్ష కాలంలో ఉష్ణం ఎక్కువగా ఉండేదని భావించాలి. సమశీతోష్ణ మండలాలలో, అంటే ఐరోపాలో, హిమకాలం, ఉష్ణమండలాలలో, అంటే ఆఫ్రికాలో, దక్షిణ భారతదేశంలో అతివర్ష కాలం, ఒకదానికొకటి సమకాలికాలు.

BRAOU

ప్లైస్టసీన్‌లో ఏర్పడిన శీతోష్ణాల విపర్యయాలు, భూమిమీద అనేక మార్పులకు కారణమయ్యాయి. హిమకాలంలో సముద్రపు పాటువల్ల ఇప్పుడు విడివిడిగా ఉన్న భూభాగాలు ఒకదానితో ఒకటి కలిసి ఉండేవి. ఉదాహరణకు, ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌తో కలిసి ఉండేది. ఆఫ్రికా, ఐరోపాల మధ్య ఇప్పటి జిబ్రాల్టర్ సంధి లేక, ఆ ఖండాలు రెండూ కల్సి ఉండేవి. ఆసియా ఖండంతో అమెరికాను కలుపుతూ ఒక భూమార్గం ఉండేది.

జంతువులు, వృక్షాలు ఉండే తీరులో కూడా మార్పులు సంభవించాయి. మానవుడు తన జీవనోపాధి కోసం జంతువుల మీదా, వృక్షాలమీదా ఆధారపడి ఉంటాడు కాబట్టి, మానవుడు ఉండే తీరుకూడా మార్పులకు లోనయింది. శీతోష్ణాల మార్పుల ననుసరించి, అతడు అనేక పర్యాయాలు ఐరోపా నుండి ఆఫ్రికాకు, మళ్ళీ ఐరోపాకు తన ఉనికిని మార్చుకొన్నాడు. ఈ శీతోష్ణ, నైసర్గిక పరిస్థితులలో మానవుడు మొదట ఆవిర్భవించి, చాలా కాలం పాటు నివసించాడు.

### 1.2.2 'నరవానరులు' (Anthropoids)

మానవులకుండే విశిష్ట లక్షణాలలో ప్రధానంగా పేర్కొనదగినవి: 1. రెండు కాళ్లమీద నిటారుగా నిలవడం, 2. అత్యంత వికాసం చెందిన మెదడు, 3. స్పష్టమైన ఉచ్చారణ, 4. అవసరమయిన పరికరాలు తయారుచేసుకొనే నేర్పు. ఈ లక్షణాలు మానవులను మిగిలిన జంతువుల నుండి వేరుచేస్తాయి. అతి ప్రాచీన మానవులను గుర్తించడానికి ముఖ్యంగా ఉపయోగపడే సాధనాలు, వారు రూపొందించుకొన్న రాతి పనిముట్లు.

స్తన్య జీవరాశుల (Mammals)లో ప్రైమేట్స్ (Primates) అనే ఒక ప్రాణి సముదాయానికి చెందినవాడే మానవుడు. ఈ సముదాయంలో నరులతోపాటు వానరులు (Apes), మర్కటాలు (Monkeys), లెమూర్లు (Lemurs-నక్కమూతి వంటి మూతి కలిగిన కోతులు), ఇంకా కొన్ని ఇతర ప్రాణులు ఇమిడి ఉన్నాయి. నరులకు, వానరులకు శరీర నిర్మాణంలో చాలా పోలిక ఉన్నట్లు శాస్త్రజ్ఞులు చెప్తారు. ఈ సామ్యాన్నిబట్టి, ఈ రెండు జీవరాశులకు పైతృకమైన జాతి ఒకటి, ఆంత్రోపోయిడ్ (Anthropoid) అనేది చాలాకాలం క్రితమే ఉందని, అది కాలక్రమాన శాఖోపశాఖలుగా చీలి, అందులో రెండు శాఖలు పరిణామ క్రమంలో ఇప్పటి నరులుగా, వానరులుగా అవతరించాయని శాస్త్రజ్ఞుల ఊహ. అవయవ నిర్మాణంలో నరులకూ, చింపాంజీ, గెరిల్లా జాతి వానరులకూ చాలా సారూప్యం ఉంది. అయితే ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టం చేయాలి. మనలో చాలామందికి నరుడు వానర సంతతి వాడనే అభిప్రాయం ఉంది. కాని, వాస్తవానికి ఈ రెండూ ఒక పైతృకం నుండి వేరుపడ్డ రెండు సమాంతర శాఖలు

ఐరోపా ఖండంలో నర-వానర జాతికి సంబంధించిన శిలాజావశేషాలు నాలుగు మాత్రమే లభించాయి. అవి కూడా అసంపూర్ణంగా లభించాయి. దాదాపు రెండు లక్షల సంవత్సరాల కాలానికి నాలుగే నాలుగు శిలావశేషాలు మాత్రమే ప్రాతినిధ్యం వహించడం ఆశ్చర్యకరమైన విషయమే. ఈ విషయంలో ఆసియా ఖండమే మేలు. ఆసియా ఖండంలో లభించిన నర-వానర జాతికి సంబంధించిన శిలావశేషాల సంఖ్య ఇరవై దాటింది. ఈ అవశేషాలు ఇంత తక్కువ సంఖ్యలో లభించటాన్నిబట్టి, ఈ జాతి మానవులు ఆ కాలంలో చాలా తక్కువ సంఖ్యలో ఉండేవారని శాస్త్రజ్ఞులు సిద్ధాంతీకరించారు.

మానవ పరిణామాన్ని ఊహించటం అతి క్లిష్టమైన విషయం. ఈ విషయం మీద శాస్త్రజ్ఞులకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఇది ఇంత క్లిష్టం కావడానికి కారణం, చాలా కొద్ది ఆధారాలతో - ముఖ్యంగా విరిగిన ఎముకలు, దంతాలు, పుర్రెలు వంటి కొద్దిపాటి ధాతు అవశేషాలతో - అతి దీర్ఘమైన, సుదూరమైన కాలాన్ని కొలవవలసి రావడం.

మనకింతవరకు లభించిన ఆంత్రపోయిడ్‌ల ధాతువులలో మిక్కిలి పురాతనమైంది, టెర్షియరీ యుగంలోని ఒలిగోసెన్ (Oligocene) విభాగానికి చెందింది. సివాపితికస్ (Sivapithecus) అనేది, మయోసీన్ (Miocene) పూర్వార్థానికి చెందిన ప్రోకన్సల్ (Proconsul). ప్రోకన్సల్ మానవ జాతికి పైతృకమని కొందరు శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

మయొసీస్ మధ్యలో, ఉత్తరార్ధంలో డ్రయొపితికస్ (Dryopithecus) అనే వేరొక ఆంత్రోపోయిడ్ ఉంది. దీని ధాతువులు ఆఫ్రికాలో, భారతదేశంలో సివాలిక్ పర్వత ప్రాంతంలోను, ఐరోపాలోను లభ్యమయ్యాయి. ఈ డ్రయొపితికస్ మానవ పరిణామ క్రమంలో ఒక దశను సూచిస్తుందని కొంత కాలం క్రితం వరకు అభిప్రాయపడ్డారు. ఇప్పుడు అది వానరులకు సన్నిహితమయిందే కాని, మానవులకు దగ్గరయింది కాదని భావిస్తున్నారు.

మానవులకు, వానరులకు పూర్వీకులయిన నర-వానరుల శిలాజాలు సివాలిక్ కొండలలో లభించినప్పటికీ, ప్రాచీన శిలాయుగపు మానవునికి చెందిన ధాతువులేవిగాని భారతదేశంలో లభించలేదు. సివాలిక్ కొండలలో లభించిన ఈ నర-వానరుల శిలాజాలను రామాపిథికస్ అని పిలిచారు. ఈ రామాపిథికస్ నర-వానరులు ఎనభై లక్షల సంవత్సరాల కింద నివసించినట్లు తెలుస్తుంది.

నిటారుగా నిల్చి నడిచి, చాలవరకు మానవుని పోలినవాడు (Homonid) అని చెప్పదగిన నర-వానరుని ధాతువులు మధ్య ఆఫ్రికాలో లభించాయి. ఈ నర-వానరుని ఆస్ట్రలోపిథికస్ (Australopithecus) అని పిలిచారు. ఈ ఆస్ట్రలోపిథికస్‌లో ఉపజాతి అయిన జిన్‌జాన్‌త్రొపస్ (Zinjanthropus) అనే నర-వానరుడు, పరికరాలను రూపొందించుకొన్నట్లు తెలుస్తుంది. ఈ నర-వానరులు, అయిదు లక్షల ఏండ్ల కిందట నివసించినట్లు చెబుతారు. మొదటగా పనిముట్లను రూపొందించిన వారైన ఈ నర-వానరులను, దిగువ ప్రాచీన శిలాయుగ సంస్కృతి (Lower Paleolithic Culture) కి నేతలుగా పేర్కొనవచ్చు. వీరు చాలావరకు మిగిలిన జంతువుల వలెనే, కందమూలాలు, పురుగులను తిని జీవించారు. ప్లయొసిన్ (Pliocene) చివరలో కాని, ప్లైస్టసీన్ (Pliostocene) మొదట్లో కాని చరించిన ఈ 'ఆస్ట్రలోపిథికస్' ఆంత్రపోయిడ్‌లను, లెకీ (Lecky) అనే శాస్త్రజ్ఞుడు మానవులతో సమానంగా పేర్కొన్నాడు. ముఖ్యంగా, వీటికి మానవులకున్న పరికరాలను ఉత్పత్తి చేసుకొనే శక్తి లేనందువల్ల, ఇవి మానవులతో సమానమేకాని, మానవులు కానేరవని లెకీ భావించాడు. వానరులు, గెరిల్లా, చింపాంజీల కన్నా, ఇవి మానవులకు దగ్గర కావచ్చని ఆయన అభిప్రాయం. వీటి మెదడు మానవులకు ఉండవలసిన దానికన్నా చాలా చిన్నది. ఆస్ట్రలోపిథికస్ మానవుడు కానప్పటికి, మానవ సదృశుడని కొందరి శాస్త్రజ్ఞుల అభిప్రాయం. అవి మానవునికి పరిపూర్ణత చెందని సన్నిహిత జ్ఞాతులు మాత్రమేనని మరికొందరి భావం.

మొత్తంమీద టెర్షియరీలో మానవుడు ఉన్నాడా, లేదా అనేది, వివాదగ్రస్తమైన విషయం. 19వ శతాబ్ది ఉత్తరార్ధంలో ఉన్నాడని వాదించిన వారి సంఖ్యే ఎక్కువ. కాని, పురావస్తు శాస్త్రం కాని, మరి ఏ ఇతర శాస్త్రం కాని, మానవుడు టెర్షియరీ యుగంలో ఉన్నాడనడానికి సరైన ఆధారాలను నేటివరకూ చూపలేకపోయాయి.

### 1.2.3. 'హోమోసేపియ'న్లు (బుద్ధిజీవి అయిన మానవుడు)

క్వాటర్నరీ యుగంలోని ప్లైన్ విభాగంలోని పూర్వార్థం నుండీ మానవులున్నట్లు నిదర్శనాలున్నాయి. 1959వ సంవత్సరంలో లెకీ (Lecky) అనే శాస్త్రజ్ఞుడు ఆఫ్రికాలోని టాంజానియా (Tanzania) దేశంలో 'ఓల్డువాయ్' (Olduvai) అనే చోట 'అసలు మనిషి' భౌతికావశేషాలను, పనిముట్లను కనుక్కొన్నట్లు ప్రకటించాడు. తానుకనుక్కొన్న మానవునికి జిన్‌జాన్‌త్రొపస్ అనీ, రాతి పనిముట్లకు 'ఓల్డువాన్' పరిశ్రమ (Oldowan Industry) అని పేరుపెట్టి, అవి ప్లైస్టసిన్‌లోని మొదటి అల్పవర్ష (Interpluvial or Dry) కాలానికి చెందినట్లు నిర్ధారణ చేశాడు. ఓల్డువాన్ పరిశ్రమ కాలక్రమంలో అభివృద్ధిచెంది, చేతి గొడ్డళ్ళు (Hand-axes) తయారుచేసే పరిశ్రమగా రూపొందింది.

1935వ సంవత్సరంలో ఇంగ్లండ్‌లోని థేమ్స్ (Thames) నదీలోయలో స్వాన్స్‌కూంబ్ (Swanscombe) అనేచోట ఒక పుర్రె కనబడింది. దీనికి స్వాన్స్‌కూంబ్ పుర్రె (Swanscombe skull) అనిపేరు. ఈ పుర్రె ఇరవై అయిదు సంవత్సరాల యువతికి చెంది ఉంటుందని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. ఈ పుర్రెతో పాటు కొన్ని రాతి చేతి గొడ్డళ్ళు కూడా లభించాయి. శాస్త్రజ్ఞులు స్వాన్స్‌కూంబ్ పుర్రెను పరీక్షించి, దానికి, నేటి మానవుల పుర్రెలకూ, చాలా సారూప్యమున్నట్లు కనుగొన్నారు.

BRAOU

నేటి మానవులకు శాస్త్రజ్ఞులు హెూమోసేపియన్లు (Homosapiens or Man, The Wise) బుద్ధిజీవి అయిన మానవులు, అని, పేరు పెట్టారు. ఈ హెూమోసేపియన్‌ల భౌతికావశేషాలు, ఐరోపాలో ప్లైస్టసిన్‌లోని నాలుగో హిమకాలపు చివరి దశ నుండి కనిపిస్తున్నాయి. ఈ బుద్ధి జీవి అయిన మానవుడు ఐరోపాలోనే కాకుండా ఉత్తర ఆఫ్రికాలో, తూర్పు ఆఫ్రికాలో, పాలస్తీనాలో, చైనాలో అవతరించాడు. పరిస్థితులు అనుకూలంగా లేనట్లనిపించినా, మానవజాతి పెరుగుతూ వచ్చింది. అందుకు సాక్ష్యం, ఈ కాలంలో లభించిన మానవ అస్థిపంజరాల సంఖ్య పెరుగుతూ రావటమే. కాని, నియాండర్‌తల్ మానవులు వారివారి శ్రామిక సంప్రదాయంతో పాటు, నాలుగో హిమకాలపు ప్రారంభ దశలో ఐరోపా నుండి అకస్మాత్తుగా అంతర్ధానమైపోయారు. అప్పటికే సంపూర్ణంగా రూపొందిన బుద్ధిజీవి అయిన 'ఆధునిక మానవుడు', తర్వాత వచ్చిన సమశీతోష్ణ వాతావరణంలో అభివృద్ధి చెందాడు. మానవులు అప్పటికే వివిధ జాతులుగా రూపొందారు. శరీర శాస్త్రవేత్తలు ఐరోపాలో నివసించిన మానవులను మూడు జాతులుగా విభజించారు. వాటిలో మొదటిది, నీగ్రోలక్షణాలు కొద్దిగా కలిగిన 'గ్రిమాల్డీ' జాతి. రెండవది, పొడవైన 'క్రోమాగ్నన్' (Cromagnon) జాతి. ఫ్రాన్స్‌లో క్రోమాగ్నన్ అనేచోట బయటపడ్డ అస్థిపంజరాలను బట్టి, ఈ జాతిని క్రోమాగ్నన్ జాతి అని పిలిచారు. ఈ అస్థి పంజరాలు ముగ్గురు పురుషులకు, ఒక స్త్రీకి, ఒక గర్భస్థ శిశువుకు సంబంధించినవి. వీరంతా ఒకే కుటుంబ సభ్యులై ఉండవచ్చు. మూడవ జాతి పొట్టిగా ఉండి, గుండ్రని తలలు కలిగి, నేటి ఎస్కిమోలను పోలిన 'కూయ్‌కాపెక్' జాతి. తొలినాటి మానవులలోకూడా జాతుల భేదం ఉండటం చూస్తే, మంచు యుగాలలోనే ఆధునిక మానవునికి రూపకల్పన జరిగిందనవచ్చు. కాని, ఇప్పటి వరకు లభించిన ఆధునిక మానవుని తొలి శిలాజాలు నియాండర్‌తల్ మానవులనే పోలి ఉన్నాయని మరిచిపోకూడదు. హెూమోసేపియన్లు పశ్చిమ ఆసియా నుండి ఐరోపాకు వలసపోయి, అక్కడ అంతకు పూర్వం నుండి ఉన్న నియాండర్‌తల్‌లు జాతి మానవులను తుదముట్టించారని, శాస్త్రజ్ఞుల విశ్వాసం. వీరు తయారు చేసుకొన్న పనిముట్లు చిరుకత్తి (Blades) ఆకారంలో చూడటానికి చక్కగా ఉంటాయి.

BRAOU

పాతరాతి యుగంలోని దిగువ, మధ్య దశలలో కంటే ఎగువ దశలో నివసించిన మానవులకు మెరుగైన పనిముట్లు, వస్తుజాలం ఉండేవని పురాతత్త్వ శాస్త్రజ్ఞులు నిరూపించారు. శీతోష్ణపరిస్థితులలోని మార్పుల కారణంగా సామాజిక సంప్రదాయాలలో తేడాలు, వాటి కారణంగా పనిముట్లు, వస్తుజాలంలో తేడాలు వచ్చాయి. వాటిలో ప్రధానమైనవి : 1. ఫ్రాన్స్‌లో వర్ధిల్లిన చాటల్‌పెరోనియన్ సంస్కృతి; 2. ఆసియా, క్రిమియా, బాల్కన్ దేశాలు, మధ్య ఐరోపా దేశాలలో వర్ధిల్లిన అరిగ్నేషియన్ సంస్కృతి; 3. ఉత్తర పాంటియాక్ సముద్ర ప్రాంతంలో వర్ధిల్లిన గ్రావెటియన్ సంస్కృతి; 4. ఆఫ్రికాలో వర్ధిల్లిన ఆటిరియన్ సంస్కృతి; 5. బహుశా దీని తర్వాత ఉత్తర ఆఫ్రికాలో వర్ధిల్లిన కాస్పియన్ సంస్కృతి. వీటి తర్వాత, క్రమంగా పశ్చిమ ఐరోపాలో సొల్యుట్రియన్, మాగ్దలీనియన్ సంస్కృతులలాంటి స్థానిక సంస్కృతులు రూపొందాయి. పురాతత్వశాస్త్రం విభాగించే ఈ సంస్కృతులకు, శరీర శాస్త్రవేత్తలు విభాగించే జాతులకు, ఎలాంటి సంబంధం లేదు.

నియాండర్‌తల్ జాతి మానవుల అస్థులు, అస్థిపంజరాలు ఐరోపాలో చాలాచోట్ల బయటపడ్డాయి. ఆఫ్రికాలో, పశ్చిమ ఆసియాలో, మధ్య ఆసియాలో కూడా వీరు ఉండేవారనడానికి నిదర్శనాలున్నాయి. నియాండర్‌తల్ మానవుడు మధ్య పాతరాతి యుగానికి చెందినవాడు. నాలుగో హిమకాలానికి చెందిన మంచు గుహలలో, 160,000 ఏండ్ల కింద ఉండినాడు. కాని, 40,000 ఏండ్ల కిందట ఆకస్మికంగా అంతర్హితమైపోయాడు. నియాండర్‌తల్ మానవుల శిరస్సులు ఈనాటి ఐరోపీయుల శిరస్సుల్లాగా పెద్దవిగా ఉండేవి. రెండు కనుబొమల మీది ఎముకల స్థానంలో ఎత్తైన ఒకే ఒక ఎముక, ఈ వైపు నుండి ఆ వైపుదాకా ఉండేది. వెనక్కుపోయిన నుదురు, వేలాడుతున్న దవడలు ఉండేవి. గడ్డం దాదాపు ఉండేదికాదు. తల ముందుకు సాగి ఉండేది. కాళ్ళు, పాదాలు సాఫీగా నడవడానికి పనికి వచ్చేవి కావని ఒకప్పుడు భావించారు. కాని, ఈనాడు ఈ అభిప్రాయం లేదు. మనకు లభించిన శిలాజాలలోని నియాండర్‌తల్ మానవునికి కీళ్లవాతం ఉండేదని శాస్త్రజ్ఞులు నమ్ముతున్నారు. నియాండర్‌తల్ మానవుల కపాలాలు నేటి మానవుల కపాలాల కంటే పెద్దవే అయినా, నుదుటి భాగం సొట్ట అయినందువల్ల వీరి మేధ అంతగా వికసించలేదని

ఊహిస్తున్నారు. ఆర్కిటిక్ ప్రాంతంలో జీవించటానికి అన్నివిధాలా తగిన జాతిగా నియాండర్‌తల్ మానవులను కొందరు శాస్త్రజ్ఞులు పరిగణిస్తారు. ఈనాటి ఐరోపీయ, ఇతర నవీన జాతులకు చెందిన మానవుల రక్తనాళాల్లో నియాండర్‌తల్ రక్తం ప్రవహిస్తున్నదా లేదా అన్నది సందేహాస్పదమైన ప్రశ్న. ఈ పోలికలు చాలా ఉన్న నర-వానర జాతి శిలాజాలు ఈలోగా పాలస్తీనా, దక్షిణ ఆఫ్రికా, జావా దేశాలలో దొరికాయి. వీటిని ఆధునిక మానవుడు రూపొందిన మార్గాల్లో ఒకదశగా కొందరు మానవ శాస్త్రవేత్తలు (Anthropologists) భావిస్తారు. మరికొందరు వీటిని మానవ పరిణామంతో సంబంధం లేని ప్రత్యేక విషయాలుగా, ఆగిపోయిన అడ్డదారులుగా పరిగణిస్తారు. కాని, పాలస్తీనాలో లభించిన కొన్ని శిలాజాలలో గడ్డంలాంటిది కనిపిస్తుంది. అది ఆధునిక మానవులుగా రూపొందిన జాతితో సంబంధాన్ని సూచిస్తున్నది.

నియాండర్‌తల్‌ల శిలాపరికర పరిశ్రమకు మౌస్టేరియన్ (Mousterian) అని శాస్త్రజ్ఞులు పేరు పెట్టారు. ఈ పరిశ్రమ నిదర్శనాలు, ఐరోపాలో, ముఖ్యంగా ఆఖరి హిమకాలానికి (Glacial or cold period), అంతకు ముందరి హిమాంతరకాలానికి (Inter-glacial or genial period) చెందిన మట్టి పొరలలో కనిపించాయి. మౌస్టేరియన్ పరిశ్రమ అంతకు పూర్వం ఐరోపాలో ఉన్న క్లాక్టోనియన్ పరిశ్రమ నుండి పుట్టినదే. క్లాక్టోనియన్ పారిశ్రామికులు నియాండర్‌తల్‌లకు పితరులై ఉంటారు. నియాండర్‌తల్ మానవుని తర్వాత, ఎగువ పాతరాతి యుగానికి చెంది, హెూమోసేపియన్ల జాతికి చెందిన క్రోమాగ్నన్ (Cromognon) మనిషి అవతరించాడు. ఈ క్రోమాగ్నన్ మానవుడే కాక, పైన పేర్కొన్న గ్రిమాల్డీ మానవుడు కూడా ఎగువరాతి యుగానికి చెందిన హెూమోసేపియన్ జాతి మానవుడే.

పైన పేర్కొన్నవేగాక, ఒకప్పుడు ప్రపంచంలో చరించి, నశించిపోయిన మానవ జాతులు కూడా ఉన్నాయి. వీటిలో చెప్పదగినవి పితికాంత్రోపస్ (Pithecanthropus) జాతి మానవులు. పితికాంత్రోపస్ జాతి(Pithecanthropus Erectus) భౌతికావశేషాలు మొదట జావాలోను, (Java Man, జావామానవుడు), తర్వాత చైనాలోను (Sinanthropus, - China Man చైనామానవుడు) బయల్పడ్డాయి. జావా, చైనా మానవులు, యథార్థంగా వానర మానవులు, రెండు కాళ్లపై నిలుచోగలిగినవారు (Erectus). వారి పుర్రెలు, చాలా గట్టిగా, పరిణామంలో చింపాజీకి, మానవునికి మధ్యగా ఉన్నాయి. నుదురు విశాలంగా ఉబ్బెత్తుగా ఉంది. అది కళ్లకు రక్షణగా కూడా ఉంది. మెదడులో భాషకు సంబంధించిన కేంద్రం వద్ద పుర్రె ఉబ్బి ఉంది. అంటే వీరి ఉచ్చారణలో కొంత స్పష్టత ఉండింది. నిశ్చితమైన సామాజికార్థంతో భాషను ఉపయోగిస్తూ ఉండేవారన్న మాట. వీరి దవడలు వేలాడుతున్నాయి. వీరంత పొడుగైన వారు కాదు. వీరి అవశేషాలు, ప్లైస్టసీన్‌లోని మొదటి అల్ప వర్ష కాలానికి (Inter Pluvial or Dry), రెండో అతి వర్ష కాలానికి (Pluvial or Wet) చెందినవి.

పితికాంత్రోపస్ జాతికి చెందిన చైనామానవుని శిలాజాలు నలభై, పెకింగ్ నగరానికి సమీపంలో ఉన్న చౌకూటిన్ గుహలో లభించాయి. అయితే, రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో జపాన్ చైనా మీద దాడి చేసినపుడు, ఈ భౌతికావశేషాలన్నీ అపహరించబడి, తర్వాత కనపడకుండా పోయాయి. మనకు ఈ మానవుని గురించిన అధ్యయనం కోసం నేడు లభించేవి, ఈ అవశేషాల ఫోటోలు, అచ్చులు మాత్రమే. చౌకూటిన్ గుహలో చైనా మానవుడు ఉపయోగించిన ఛేదక (Chopper) శిలావర్గానికి చెందిన పనిముట్లు, వీటితో పాటు అతడు వేటాడి, చంపి, తిన్న, అడవి దున్నలు, ఖడ్గమృగాలు, లేళ్లు, దుప్పులు మొదలయిన జంతువుల ఎముకలు దొరికాయి. ఇతనికి నిప్పు చేయడం తెలుసు. ఇతడు నర మాంస భక్షకుడని శాస్త్రజ్ఞుల విశ్వాసం. ఛేదక వర్గానికి చెందిన పనిముట్లు చైనాలోనే కాక, పంజాబ్‌లో, బర్మాలో దొరికాయి. వీటిని ఉపయోగించిన వారంతా ఒకే జాతీయులనడంలో సందేహం లేదు.

పితికాంత్రోపస్ జాతి ఆగ్నేయ ఆసియాలోని అనేక ప్రాంతాలలో 500,000 నుండి 200,000 సంవత్సరాల మధ్య నివసించినట్లు తెలుస్తుంది. ఐరోపాలో పితికాంత్రోపస్ జాతికి ప్రాతినిధ్యం వహించే ఒకే ఒక శిలాజం, జర్మనీలోని హైడల్‌బర్గ్ వద్ద లభించింది. నియాండర్‌తల్‌లకు, పితికాంత్రోపస్‌లకు అవయవ నిర్మాణంలో పరస్పరం ఉన్న సంబంధం, వారిలో ప్రతి ఒక్కరికీ హెూమోసేపియన్లలో ఉన్న దానికంటే అత్యంత సన్నిహితం.

పైన పేర్కొన్న విషయాలను ఇక్కడ క్లుప్తంగా సమీక్షిస్తాం. మానవులనదగినవారు అధనుం ప్లైస్టసీన్‌కు పూర్వార్థం నుండి ఈ భూమిపై చరించారు. అప్పటికే వారు ఒక పైతృక రాశి నుండి రెండు సమాంతర శాఖలుగా వేరు పడ్డారు. అందులో ఒక శాఖను నియాంత్రోపినె (Neo-anthropinae) అంటారు. ఇది హెూమోసేపియన్లు (బుద్ధి జీవులైన మానవులు) అవతరించడానికి కారణమైంది. నియాంత్రోపినులు మొదట చేతిగొడ్డలి (Hand - Axes) వర్గానికి చెందిన పనిముట్లను ఉత్పత్తి చేశారు. ఇది కాలక్రమేణా అభివృద్ధి చెంది, ప్లైస్టసీన్ చివరి నాటికి చిరుకత్తుల (Blade)

పరిశ్రమగా రూపొందింది. రెండో శాఖను పాలియో ఆంత్రిపినే (Paleo-anthropinae) అంటారు. ఇది పితికాంత్రోపసులకు, నియాండర్‌తల్‌లకు పైతృకం. వీరి శిలాపరికర పరిశ్రమలకు సందర్భాన్ని బట్టి, ఛేదకం, క్లాక్టోనియన్, మౌస్టీరియన్ అని వేర్వేరు పేర్లున్నాయి. పాలియో ఆంత్రిపిన్‌లు కాలక్రమేణా అంతరించారు.

మానవ పరిణామగతి అతి మందంగా అనేక సహస్రాబ్దాల పాటు సాగింది. మానవులు ఉద్భవించిన కాలం 550,000 సంవత్సరాలకు పూర్వమని ఒక అంచనా. ఇది పెద్ద సంఖ్యే అయినా, భూమి అవతరించిన నాటి నుండి గతించిన కాలంతో పోల్చి చూస్తే, బహు స్వల్పమని స్పష్టమౌతుంది. భూమి వయస్సు ఒక రోజనుకుంటే, మానవుని పుట్టుక ఏ నాలుగైదు సెకండ్ల క్రితమో జరిగి ఉంటుంది.

## 1.3 శిలా యుగాల లోని పరికరాలు, పరిశ్రమలు, స్థావరాలు

థామస్ త్రియుగ విభజనను గురించి పైన పేర్కొనడం జరిగింది. ఇక్కడ గమనించవలసిన విషయం ఒకటి ఉంది. ఈ మూడు యుగాలలో ఏ ఒక్కటి కూడా ప్రపంచమంతటా ఒకేసారి ఆరంభమై, ఒకేసారి ముగియలేదు. ఉదాహరణకు, పశ్చిమ ఆసియాలోని ప్రముఖ నాగరికతా స్థావరాలున్న దేశాలలో, ప్రపంచంలోని ఇతర ప్రదేశాలకన్నా ముందుగా కంచుతోను, ఇనుముతోను చేసిన పనిముట్లు తయారయ్యాయి.

ప్రాచీనులను గురించి మనకు తెలిసిన విషయాలు ఎక్కువైన కొద్దీ, థామ్సన్ ప్రతిపాదించిన శిలా, కాంస్య, అయో యుగాలను, లార్డ్ అవ్‌బరీ మొదలైనవారు చేసిన పునర్విభజనను గురించి పైన పేర్కొనడం జరిగింది. నిజానికి ఈ విభజనలు, పునర్విభజనలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. శిలాయుగానికి సంబంధించిన ఈ క్రింది విభజన శాస్త్రజ్ఞుల ఆమోదం పొందింది.

శిలాయుగం

| (2,50,000-10,000) | (10,000-8000) | (8000-4000) |
|---|---|---|
| ప్రాచీన శిలా యుగం | మధ్య శిలా యుగం | నవీన శిలా యుగం |
| (2,50,000-1,40,000) | (1,40,000-40,000) | (40,000-10,000) |
| దిగువ ప్రాచీన శిలా యుగం | మధ్య ప్రాచీన శిలా యుగం | ఎగువ ప్రాచీన శిలా యుగం |
| (Lower Paleolithic) | (Middle Paleolithic) | (Upper Paleolithic) |

శిలలను, ముఖ్యంగా నదీ గర్భాలలో లభించే వివిధ రకాలైన శిలలను, వాటిని పగులగొట్టి పెచ్చులు ఊడదీయవలసి ఉంటుంది. కాని, మానవుడే కాదు, ప్రకృతి కూడా రాళ్లను పగులగొట్టగలదు. ఒక్కొక్క సారి, అవి మానవులు పగలగొట్టిన రాళ్లా, లేదా ప్రకృతి పగలగొట్టినవా అనే సందేహం కలుగుతుంది. మానవులు చేసిన పగుళ్ళకు ఒక ప్రత్యేక లక్షణం ఉంటుంది. దీనిని కోణాకారపు పగులు (Conchoidal Fracture) అంటారు. ఈ లక్షణం సాధారణంగా ప్రకృతి వల్ల కలిగిన వాటికుండదు. ఒక రాతిని పగలగొట్టగా ఏర్పడిన రెండు ముక్కలలో, పగలగొట్టబడిన రాయిని మూలం (Core) అని, పగలగొట్టగా వచ్చిన ముక్కను పెచ్చు (Flake) అని పిలుస్తారు. నవీన శిలాయుగంలో పనిముట్ల తలాలు నున్నగా ఉంటాయి. పెద్ద రాతి బండల మీద అరగదీయడం వల్ల వాటికా నునుపు వస్తుంది. ఈ నున్నని పనిముట్లు చూడడానికే కాక, పనిలో కూడా ఉత్తమమైనవి, చిరకాలం మన్నేవి.



Dr. BRAOU LIBRARY Acc. No. 115053 Class No.




Lower Palaeolithic tools: 1–4 Punjab, 1 and 2 chopping tools, 3 hand axe made from pebble, 4 cleaver made from large flake; 5–8 Madras, 5 discoidal core, 6 chopping tool, 7 hand axe, 8 cleaver

Lower Paleolithic Tools

శిలాయుగమంతటిలోనూ, ఒకే రకపు పనిముట్లు తయారు కాలేదు. పైన చూపిన శిలాయుగపు విభజన, శిలాయుగంలోని పనిముట్ల ఆకృతులలోను, నిర్మాణ పద్ధతులలోను ఉన్న తేడాలను బట్టి చేసినదే. పనిముట్లను చేయడంలో క్రమంగా నిపుణత హెచ్చింది.

## 1.3.1 ప్రాచీన శిలాయుగం : పరికరాలు, పరిశ్రమలు

ప్రాచీన శిలాయుగపు పూర్వార్థంలో తయారయిన పనిముట్లలో చెప్పదగినవి గులకరాతి పనిముట్లు (Pebble Tools), దారకాలు (Cleavers), చక్రాలు (Discoids), ఛేదకాలు (Choppers). ఆఫ్రికాలో ఓల్డువాయి దగ్గర జిన్‌జాన్‌త్రోపస్ ధాతువులతో కూడిన గులకరాతి పనిముట్లు కనిపించాయి. ఇటువంటివే ఆఫ్రికాలో మరికొన్ని స్థలాలలో, దక్షిణ హిందూదేశంలోను, ఐరోపాలోను లభించాయి. వీటిని మానవుడు తయారుచేసుకొన్న మొదటి రాతిపనిముట్లుగా పేర్కొనవచ్చు. ఓల్డువాయి దగ్గర ఇవి ప్లైస్టసీన్‌లోని మొదటి అల్ప వర్ష కాలానికి (Inter pluvial or Dry) చెందినవని నిరూపించారు.

ఈ గులకరాతి పనిముట్ల పరిశ్రమ రెండో అతి వర్ష కాలం నాటికి (Pluvial or Wet) చేతిగొడ్డళ్ల (Hand Axes) పరిశ్రమగా రూపొందింది. అప్పటినుండి మూడో అతి వర్ష (Pluvial or Wet), హిమకాలా (Glacial or Cold Period)ల చివరి వరకు ఆఫ్రికా, హిందూదేశం, ఐరోపాలలో చేతిగొడ్డళ్ల పరిశ్రమ ప్రబలమై ఉండింది. ఈ పారిశ్రామికులు చాలాసార్లు ఐరోపా నుండి ఆఫ్రికాకు, తిరిగి ఐరోపాకు వలసలు వెళ్లినట్టు నిదర్శనాలు ఉన్నాయి. రాతి చేతిగొడ్డళ్లు భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా కర్నూలు, కడప, నెల్లూరు, గుంటూరు జిల్లాలలో చాలాచోట్ల లభించాయి.

పైన పేర్కొన్న పనిముట్లలో, ఒక్కొక్క దానిని వేరుచేసి, ఈ పనిముట్టు ప్రయోజనమిది అని ఖచ్చితంగా చెప్పడం కష్టం. చేతిగొడ్డలికి ఒక చివర మొనదేలి ఉండటం వల్ల, దానిని కర్ర కమర్చితే బల్లెంగాగాని, తవ్వుకోలగాగాని ఉపయోగించవచ్చు. దారకాని కొకచివర పదునై నిడివిగా ఉండటం వల్ల, దానిని కర్రలు మొదలైన వాటిని చీల్చే సాధనంగా పేర్కొనవచ్చు. చక్రానికి చుట్టూ పదునై ఉండటంవల్ల, దానిని జంతువులపై విసిరి, వాటిని గాయపరిచేవారు. సామాన్యంగా, దారకాలు, చక్రాలు, చేతిగొడ్డళ్ళతో కలిసి దొరకడంవల్ల, వాటిని కూడా చేతిగొడ్డళ్ల పరిశ్రమలో అంశాలుగానే భావించవలసి ఉంది.

పంజాబ్, చైనా, బర్మా ప్రాంతాలలో చేతిగొడ్డళ్ల పరిశ్రమకు సమకాలికంగా ఛేదక (Choppers) శిలా పరిశ్రమ ఉండేది. పంజాబ్‌లో ఈ పరిశ్రమ కాలపరిమితి రెండో హిమాంతర (Interglacial or genial) కాలం, మూడో హిమకాలం (Glacial or Cold Period) అని నిర్ణయించారు. ఛేదక శిలా పారిశ్రామికులు పితికాంత్రోపస్ తెగవారై ఉంటారు.

పైన, నియాండర్‌తల్‌ల రాతిపనిముట్ల పరిశ్రమ అయిన మౌస్టేరియన్ పరిశ్రమను పేర్కొన్నాం. ఈ

BRAOU




Sanghao: Middle and Upper Palaeolithic artefacts from the excavation. 1 unstruck discoidal core; 2 struck core; 3 and 4 burins; 5 flake struck from prepared core; 6 hand axe; 7 hollow scraper made on flake; 8 pointed flake struck from prepared core

Sanghao : Middle and Upper Palaeolithic artefacts from the excavation

BRAOU




Nevasan: Middle Palaeolithic tools from Central India and the Deccan: 1 core unstruck; 2, 6, 8, 9, 10 and 11 scrapers of various types on flakes; 3 blade-flake; 4, 5 and 7 struck cores

Nevasan : Middle Palaeolithic tools from Central India and the Deccan

మౌస్టేరియన్ (Mousterian) పరిశ్రమకు పూర్వం, క్లాక్టోనియన్ పరిశ్రమ ఉండేది. ఇది చేతిగొడ్డళ్ల, ఛేదకాల పరిశ్రమ కంటే విభిన్నమయింది. దీనిలో చేసిన పనిముట్లలో సూచికలు (Points), గోకుడురాళ్లు (Scrapers), కత్తులు (Knives) ఉన్నాయి. గోకుడురాళ్లు చర్మానికంటి ఉండే మాంసాన్ని కోయడానికి, సూచికలు వేటాడటానికి సాధనాలుగా ఉపయోగపడతాయి.

ప్రాచీన శిలాయుగపు మధ్య భాగానికి చెందిన పనిముట్లు ఆఫ్రికా, ఐరోపాలలో చాలా చోట్ల లభ్యమయ్యాయి. ఇవి చివరి అల్పవర్ష (Interpluvial or Dry), హిమాంతర (Interglacial or Genial Period) కాలానికి చెందినవి. ఈ కాలంలో రాతి చేతిగొడ్డళ్ల పరిశ్రమ దాని యథార్థ రూపంలో ఎక్కడో కాని కనపడదు. దాని నుండి ఉత్పన్నమైన విభిన్న పరిశ్రమలు, ఆఫ్రికా, ఐరోపాలలో చాలా చోట్ల ఉన్నాయి. క్లాక్టోనియన్ పరిశ్రమ కూడా కొత్తరూపంలో, మౌస్టేరియన్ పరిశ్రమగా అవతరించింది. వీటితోపాటు, లెవల్లోసియన్ (Levellosian) అనే ఇంకొక పరిశ్రమ కూడా ప్రముఖ పాత్ర వహించింది. ఈ మూడు పరిశ్రమలు అన్యోన్య సంపర్కంవల్ల మార్పులు చెందాయి.

భారతదేశంలో మధ్యప్రాచీన శిలాయుగానికి చెందిన పనిముట్లు చాలాచోట్ల లభించినప్పటికీ, అవి చివరి అతివర్షకాలానికి చెందుతాయా, అల్పవర్షకాలానికా అనేదాన్ని నిశ్చయంగా చెప్పలేం.

చైనా, బర్మాలలో ఛేదక శిలాపరిశ్రమ కాని, దానినుండి ఉత్పన్నమైన వేరొకటికాని, ఈ కాలంలో సాగి ఉండింది. చివరి అల్పవర్షకాలపు చివరి దశలో పశ్చిమ ఆసియాలో ఒక కొత్త పరిశ్రమ ప్రారంభమయినట్లు నిదర్శనాలున్నాయి. ఇది చిరుకత్తుల (Blades) పరిశ్రమ.

ఐరోపా, ఆఫ్రికాలలో చిరుకత్తుల పరిశ్రమ నాలుగో హిమ, అతివర్షకాలంలో ఉందని నిర్ణయించారు. ఐరోపాలో ఈ పరిశ్రమ నాలుగో హిమకాలపు ఉత్తరార్థంలో కాని కనపడదు. అక్కడ, నాలుగో హిమకాలంలో చాలా భాగం మౌస్టేరియన్ పారిశ్రామికులయిన నియాండర్‌తల్‌లు ప్రబలి ఉండేవారు. చిరుకత్తుల పరిశ్రమ ఐరోపా, ఆఫ్రికాలలో కంటే ముందు, పశ్చిమ ఆసియాలో ఉన్నట్లు తెలుస్తుంది. అక్కడి నుండి ఆ పరిశ్రమ ఒక వంక ఐరోపాకు, ఇంకొక పక్క ఆఫ్రికాకు చేరినట్లు నిదర్శనాలున్నాయి. చిరుకత్తుల పరిశ్రమను రూపొందించినవారు హెూమోసేపియన్లు. వీరు పశ్చిమ ఆసియానుండి ఐరోపాకు చేరి, అక్కడి నియాండర్‌తల్‌లను అంతమొందించి, తమ ఆధిక్యాన్ని నిలుపుకొన్నారు. ఆఫ్రికాలో నియాండర్‌తల్‌ల ప్రభావం ఎక్కువగా కనపడదు. భారతదేశంలో కొన్నిచోట్ల, ప్రధానంగా బొంబాయివద్ద, కర్నూలు జిల్లాలో, చిరుకత్తుల వర్గానికి చెందిన పనిముట్లు లభించాయి. కాని ఇవి, నాలుగో అతివర్షకాలానికి చెందినవనడానికి బలమైన ఆధారాలు లేవు. చిరుకత్తుల పారిశ్రామికులు తయారుచేసుకొన్న ఇతర పరికరాలలో చెప్పుకోదగ్గవి, కత్తులు, గోకుడురాళ్లు, సూచికలు, తక్షకాలు (Burins or Gravers). తక్షకాలను సాధారణంగా రాతిమీద చెక్కుడు పనులకు ఉపయోగిస్తారు. కొన్ని సమాజాలవారికి విల్లంబులను ఉపయోగించడం తెలుసు. ఈ నాటి మానవుల పరికరాల కోసం రాతినేగాక, ఎముకను, కొమ్మును కూడా విరివిగా వాడారు. వీటితో చేసిన పరికరాలలో పేర్కొనవలసినవి సూదులు (Awls), చేపగాలాలు (Fish-hooks), హార్పూన్ (Harpoon) అనే ఈటె.



BRAOU

## 1.3.2. ప్రాచీన శిలాయుగం - చిత్రలేఖనం

పాత రాతి యుగం సంస్కృతిని చిత్రకళ సంపన్నం చేసింది. ఈ యుగంలోని మానవులు తాము నివసించిన గోడలను, పై కప్పులను రేఖాచిత్రాలతోను, వర్ణచిత్రాలతోను అలంకరించారు. ఈ చిత్రాలకు, వారి మత సంబంధమైన కర్మకాండకు ఏదోసంబంధం ఉంటుందని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. వీటిలో మనకు సాధారణంగా గోచరించేవి ఎగుడు దిగుడు గీతలు, చక్కగా గీచిన జంతువుల చిత్రాలు. చిత్రాలున్న గుహలు ఫ్రాన్స్ దక్షిణ ప్రాంతంలోనూ, స్పెయిన్ ఉత్తర భాగంలోనూ ఎక్కువగా కానవస్తాయి. చెదురుమదురుగా ఇటువంటి గుహలు ఇటలీ, సిసిలీలలో కూడా ఉన్నాయి. భారతదేశంలో, మధ్యప్రదేశ్‌లోని రైసన్ జిల్లాలో ఉన్న భీమ్‌బెట్కా వద్ద గల గుహలలో ఉన్న చిత్రాలు శిలా యుగానికి చెందినవిగా భావిస్తున్నారు.

ఫ్రాన్స్ దేశంలోని గుహలలో, క్రోమాగ్నన్ మానవుడు చిత్రించాడని భావించే చిత్రాలను ఈ నాటి చిత్రకారులు మెచ్చుకొంటున్నారు. మాంత్రిక శక్తుల కోసం అవి చిత్రించబడ్డా, వాటిలో అందం లేకపోలేదు. వారు వారికి తెలియకుండానే అందులో అందాన్ని నిక్షిప్తం చేశారు. మాగ్డలీనియన్లు మంత్ర విద్యకు సంగీతాన్ని కూడా జతచేశారు. ఎముకలతో చేసిన ఈలలు, పిల్లన గ్రోవులు ఆకాలం నాటి గుహల్లో లభించాయి. ఫ్రాన్స్‌లో, స్పెయిన్‌లో గ్రావెటియన్లు, మాగ్డలీనియన్లు వేటకు ఉపయోగించిన ఆయుధాల మీద బొమ్మలను చెక్కటం ప్రారంభించారు. సంతానోత్పత్తి కోసం గ్రావెటియన్లు బూతు బొమ్మలను పూజించారు. బొమ్మల చేత సృష్టిక్రియ చేయిస్తే జంతువుల సంఖ్య పెరగటం, పంటలు బాగా పండటం జరుగుతుందని మరొక తెగవారు భావించారు. ఫ్రాన్స్‌లో గ్రావెటియన్లు, మాగ్డలీనియన్లు ఈ మాంత్రిక పూజాపునస్కారాలను ఎక్కువ చేశారు. ఎంతో ఇరుకుగా ఉన్న గుహలలో, బహుశా చిన్న కొవ్వొత్తుల గుడ్డి వెలుగులో వారు జంతువుల బొమ్మలను చాలా సహజంగా చిత్రించారు. వారు చిత్రించిన జంతువులు నిజంగా వాళ్లకు లభిస్తాయని, వాటిని చంపి తినవచ్చునని వారు ఆశించారు. పాత రాతి యుగం ఎగువ దశలో ఈ మాంత్రిక చిత్రకారుల ప్రాముఖ్యం విపరీతంగా పెరిగింది.

ప్లైస్టసీన్‌తో పాటు ప్రాచీన శిలా యుగం కూడా అంతరించినట్లు శాస్త్రజ్ఞులు చెబుతారు. ప్లైస్టసీన్ మానవులు చిన్నచిన్న గుంపులుగా చేరి, జంతువులను వేటాడుతూ, కందమూలాలను భక్షిస్తూ జీవనం సాగించేవారు. సాధారణంగా ప్రాచీన శిలాయుగపు పనిముట్లు నదీ పరీవాహప్రాంతాలలో ఎక్కువగా లభిస్తున్నాయి. దీనికొక ప్రత్యేకకారణముంది. పరికరాలు తయారు చేసుకోడానికి అనువయిన రాళ్లు ఇక్కడ సులభంగా లభిస్తాయి. అదీకాక, నీరు జంతువులకూ, మానవులకూ కూడా 'జీవనా'వసరమే.

## 1.3.3. మధ్యశిలా యుగం : పరికరాలు, పరిశ్రమలు

ప్రాచీన శిలా యుగం ఉత్తరార్థం అంతమొందడానికి కొంత పూర్వమే, ఆఫ్రికాలో, పశ్చిమ ఆసియాలో కొత్త రకపు పనిముట్లను చెయ్యడం ప్రారంభించారు. ఈ పనిముట్లు 2.5 సెం.మీ. పొడుగు మాత్రమే ఉన్నాయి. కనక వీటిని చిరు శిలా పరికరాలు (Microliths) అని పిలిచారు. ఈ చిరు శిలా పరికరాలే మధ్య రాతి యుగానికి ప్రధాన లక్షణం. ఇవి ప్లైస్టసీన్ అంతమొందినప్పటినుండి బాగా వాడుకలోకి వచ్చాయి. మధ్య శిలా యుగంలో, ఎగువ ప్రాచీన శిలా యుగంలో ఉన్న కొన్ని పనిముట్లు సూక్ష్మరూపంలో తిరిగి చేయబడటమేగాక, కొన్ని కొత్త రకాలు కూడా తయారయ్యాయి. ఈ కొత్త వాటిలో గమనించవలసినవి సమలంబ చతుర్భుజాలు (Trapezes), త్రిభుజాలు (Triangles), అర్థచంద్రాలు (Lunates). మధ్య శిలా యుగపు పనిముట్లు చాలా చిన్నవి కావడంవల్ల, వాటిని విడిగా కాక, ఏ కర్రకో, ఎముకకో అమర్చి, కత్తులు, బాణాలు, హార్పూన్లుగా చేసి ఉపయోగించేవారు.

B R A O U




Bagor: Mesolithic artefacts: 1–12 retouched blades; 13–29 truncated blades; 30–43 triangles; 44–48 and 52–57 trapezes; 49–51 transverse arrowheads; 58–59 rhomboids; 60–71 lunates; 72–79 trimmed points; 80–82 scrapers on flakes; 83 and 84 burins; 85 unstruck discoidal core (*after* V. N. Misra)

Bagor : Mesolithic artefacts

ఈ చిరు శిలాపరికరాలు, ఆనాటి వాతావరణ, నైసర్గిక పరిస్థితులను బట్టి రూపొందించుకొన్న వేట సాధనాలు. ప్లైస్టసీన్ అంతం కావడంతో, ఐరోపా ఉత్తర ప్రాంతం వరకు వ్యాపించిఉన్న హిమతలాలు (Glaciers) క్రమంగా క్షీణించి వెనకకు పోవడంతో, కొన్ని పెద్ద జంతువుల సమూహాలు అంతరించడమో, ఉత్తరం వైపుకు వలసపోవడమో జరిగింది. పోగా మిగిలిన చిన్న జంతువులను వేటాడటానికి, చిన్నవై చాలా వేగంగా దూసుకొని పోగల సాధనాలే ఎక్కువగా ఉపయోగపడ్డాయి. శీతోష్ణ, నైసర్గిక పరిస్థితులలో ఏర్పడిన మార్పులను బట్టే పనిముట్ల పరిమాణంలో మార్పులు వచ్చాయి. ఈ కాలంలో మానవుడు, కుక్కలను మచ్చిక చేసుకొని వేటకు ఉపయోగించుకొన్నాడు. ఈ కొత్త రకపు సాధనాలవల్ల ఆహారాన్ని సంపాదించుకోవడం సులభతరమయి ఉండవచ్చు.

పశ్చిమ ఆసియాలో క్రీ.పూ. పదివేల సంవత్సరాల నాటికే మధ్య రాతి యుగం ప్రారంభమయినట్లు, కర్బనం-14 పరీక్షల వల్ల తేలింది. ఈ కాలపు స్థావరాలు జాగ్రోస్ పర్వత ప్రాంతంలోనూ, కాస్పియన్ సముద్రతీరంలోనూ, పాలస్తీనా, ఆసియామైనర్‌లలోనూ కనిపించాయి.

క్రీ.పూ. తొమ్మిదివేల సంవత్సరాలనుండి మధ్యశిలా యుగపు మానవుల జీవితాలలో ఒక విశిష్టమైన మార్పు వచ్చింది. వీరి నివాసాలలో కేవలం వేట సాధనాలేగాక, కల్వాలు, పాత్రాలు, కొడవళ్ళ వంటి పరికరాలు లభ్యమవుతున్నాయి. నూతన సాధనాలు ధాన్యభోజనోపకరణాలు కావడం నిస్సందేహం. అయినా, వీరికి వ్యవసాయం తెలిసి ధాన్యం పండించే వారనడానికి ఆధారాలు లేవు. కాబట్టి వీరు ఆహారోత్పాదనకు కాక, ఆహార (ధాన్య) సేకరణకు మాత్రం పూనుకొన్నారని భావించవలసి ఉంది. మెసపొటేమియా, సిరియా, పాలస్తీనాలలో ఉన్న కొండల మీద అడవులలో పూర్వం, గోధుమలు, యవలు (బార్లీ), పెరుగుతూ ఉన్నట్లు వృక్ష శాస్త్రజ్ఞులు చెబుతారు. ఇదే ప్రాంతం అడవి గొర్రెలకు, మేకలకు కూడా నివాసంగా ఉండేదని తెలుస్తుంది. కొన్ని మధ్య శిలాయుగపు స్థావరాలలో అడవి గొర్రెలను మచ్చికచేసి పెంచినట్లు నిదర్శనాలున్నాయి. ఈ కాలపు మానవులు జంతువులను వేటాడుతూ, వనధాన్యాలను సేకరించుకొంటూ, ఒక్కొక్కచోట జంతువులను మచ్చిక చేసుకొంటూ జీవయాత్ర సాగించారు. ఈ రకపు జీవనం దాదాపు రెండువేల ఏండ్లు సాగింది. వీరు నవీన శిలాయుగపు మానవుల్లాగా ఆహారోత్పాదకులు కారు. తమ ఆహారంకోసం వీరు తమ పూర్వీకులలాగా కేవలం కందమూలాలమీదా, వేటాడిన జంతువుల మీదా ఆధారపడినవారూ కాదు. వీరిది ఈ రెండింటికి మధ్యస్థమయిన స్థితి.

ఈ రకం జీవితం గడపిన వారిలో ముఖ్యంగా పేర్కొన వలసినవారు పాలస్తీనాలో నివసించిన నటూఫియన్‌లు (Natufians). నటూఫియన్‌ల నివాస స్థానాలు మౌంట్‌కార్మెల్ (Mt. Carmel), జెరిఖో (Jericho), ఎయినాన్ (Eynan) మొదలగు చోట్ల కనపడ్డాయి. ఎయినాన్ దగ్గర వీరిది యాభై ఇళ్ల గ్రామం. వీరు తమ ఇళ్లను వర్తులాకారంగా రాతి గోడలతో నిర్మించుకొని, పై భాగం తుంగతోకాని, దుబ్బుతోగాని కప్పుగానేసేవారు. మరణించిన శిశువులను ఇళ్లలోనే గోతులు తీసి పాతి పెట్టేవారు. ఊరి నడుమ బయలు ప్రదేశంలో గోతులు తవ్వి, పెద్దలను పూడ్చిపెట్టేవారు. ఒకవ్యక్తిని పూడ్చే విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొన్నట్లు కనపడుతుంది. అతడు వారి ఊరి పెద్ద అయి ఉండవచ్చు. వారి ఇళ్లలో సాధారణంగా కానవచ్చే వస్తువులు - చిరు శిలా పరికరాలు, కల్వాలు, పాత్రాలు, వలలను ముంచే గుండ్రటి రాళ్లు (Net Sinkers), ఎముకలతో తయారు చేసిన సూదులు, చెమ్చాలు. వీరు మాంసాహారం కోసం చంపిన జంతువులు - లేళ్లు, దుప్పులు, అడవిపందులు. వీటినికాక, తాబేళ్లను, చేపలను, పక్షులను కూడా పట్టి తినేవారు. నటూఫియన్‌ల దేవాలయమొకటి జెరిఖో దగ్గర బయటపడింది. రాతితోనూ, ఎముకలతోనూ బొమ్మలు చేయడం వీరికి తెలుసు. వీటిలో ముఖ్యంగా గమనించవలసినవి మిధున శిల్పాలు, మృగశీర్షాల ఆకారంలో ఉన్న కొడవళ్లు.

మధ్య శిలాయుగపు పనిముట్లు భారతదేశంలో చాలా చోట్ల లభించాయి. కాని, వాటిని విపులంగా పరిశీలించింది కొన్ని చోట్లలోనే. బీహార్‌లోని దామోదర్‌లోయలో బీర్భాన్‌పూర్ అనేచోట లభించిన చిరు శిలా పరికరాలు, హోలోసీన్ ఆరంభ దశకు చెంది ఉండవచ్చు. క్రీ.పూ. 4000 ప్రాంతానికి చెందిన పరికరాలు తమిళనాడులో తిరునల్వేలి

జిల్లాలో దొరికాయి. గుజరాత్ రాష్ట్రంలో రమారమి నూరు మధ్య శిలాయుగ స్థావరాలు కనపడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇటువంటి స్థావరాలు గోదావరి నదీలోయలో చాలా ఉన్నట్లు తెలుస్తుంది. గుజరాత్‌లో లాంఘ్నాజ్ అనేచోట జరిగిన తవ్వకాలలో చిరుశిలాపరికరాలతో పాటు, వాటిని ఉపయోగించిన మానవుల అస్థిపంజరాలు, వారు చంపి, తిన్న లేళ్లు, దున్నలు, అడవిదున్నలు మొదలయిన వాటి ఎముకలు బయల్పడ్డాయి. లాంఘ్నాజ్ నివాసం క్రీ.పూ. 2500 కంటే ప్రాచీనమై ఉండవచ్చు. మనదేశంలో కొన్ని స్థలాలలో చిరుశిలాపరికరాలు క్రీ.శ. 5వ శతాబ్ది వరకు కూడా వాడుకలో ఉండేవి.

మధ్యశిలాయుగపు పనిముట్లు మధ్యధరాసముద్రం మొదలు ఉత్తర ఐరోపా వరకు, అట్లాంటిక్ మహాసముద్రం తీరం వెంబడి ఉన్న దేశాలలో చాలా చోట్ల కనపడ్డాయి. ఆనాడు ఈ ప్రాంతాలన్నీ ధనుర్బాణాలు ఉపయోగించి ఎంతో నేర్పుతో వేటాడగల జన సమూహాలకు నెలవుగా ఉండేవి. ఈ మానవ సమాజాలలో ఐరోపా ఉత్తర భాగంలో ఉన్న మాగ్లిమోసియన్లు (Maglemoiseans) ప్రసిద్ధులు. వీరు క్రీ.పూ. 6000-4000 మధ్య జీవించినట్లు నిర్ణయమయింది. వీరు సముద్రయానం చేసేవారనడానికి చాలా ఆధారాలు లభించాయి. క్రీ.పూ. 4000 నాటికి ఐరోపాలో కొన్ని భాగాలలో నవీన శిలాయుగం రాబోతున్నది.

## 1.3.4. నవీన శిలాయుగం : కౌలాల పూర్వదశ, కౌలాల దశ - స్థావరాలు

మధ్యశిలాయుగంలో కొన్ని చోట్ల, ఆహారానికి ఉపయోగించిన వనధాన్యాలను సేకరించుకొనే ఆచారం ఉండేదని తెలుసుకొన్నాం. వనధాన్యాల సేకరణ, వ్యవసాయం అవలంబించడానికి ప్రాతిపదిక మాత్రమే. అనేక వేల సంవత్సరాలపాటు ఆహార సంగ్రాహకుడుగానే ఉన్న మానవుడు నవీన శిలా యుగారంభంనుండి, ఆహారోత్పాదకుడుగా మారాడు. వ్యవసాయం చేసి ఆహారం పండించుకునే నేర్పును సంపాదించుకున్నాడు.

వ్యవసాయం మానవ ప్రగతికి మనుగడకు మూలం. మానవుడు కర్షక వృత్తిని చేపట్టడం జాతికంతకూ సంబంధించిన ఒక అపూర్వ సంఘటన. ఆ తరుణం మానవ చరిత్రలో ఒక విప్లవాత్మక ఘట్టం. కర్షకవృత్తి చేపట్టిన తర్వాత కలిగిన ఫలితాలలో చాలా ముఖ్యమయినవి రెండు ఉన్నాయి - ఒకటి జనాభా అభివృద్ధి, రెండు ఆహార సముపార్జన కోసం అనుదినమూ శ్రమించవలసిన అవసరం లేకపోవటం. దీని వల్ల తనకు లభ్యమైన విశ్రాంతిని, ఇతర నిర్మాణ కార్యక్రమాల కోసం వినియోగించుకొని, మానవుడు క్రమేణా నాగరికుడు (Civilised Man) కావడానికి అవకాశం ఏర్పడింది. అందువల్ల నాగరికతకు వ్యవసాయం మూలాధారమయింది. ప్రపంచంలో అతి పురాతనమైన నాగరికత పశ్చిమ ఆసియాలో బయటపడింది. ఆ కారణం వల్ల మానవుడు మొదట వ్యవసాయం చేపట్టింది పశ్చిమ ఆసియాలోనే అని ఊహించడానికి వీలుంది. ఇది యథార్థమని పురావస్తు శాస్త్రం రుజువుచేసింది.

పశ్చిమ ఆసియా వ్యవసాయానికి, కర్షక వృత్తికి ప్రథమ రంగం కావడానికి అనుకూల పరిస్థితులు అక్కడ ఏర్పడటమే కారణం. ప్లైస్టొసీన్ ముగిసిన తర్వాత వర్షాభావంవల్ల అది ఇప్పటి ఎడారులుగా మారడం మొదలుపెట్టింది. వేటకు ఎడారి పనికిరాదు. ఎడారులుగా మారక మిగిలిఉన్న నదీ ప్రవాహ ప్రాంతాలలోను, సరస్సుల దగ్గరను చేరి, వేటకు బదులు జంతువులను మచ్చికచేసి, వాటిని పోషించుకొంటూ, వనధాన్య సేకరణకు బదులు ధాన్యోత్పాదనకు పూనుకొని మనుగడ సాగించడం, ఆనాటి మానవులు తప్పనిసరిగా అవలంబించవలసి వచ్చింది.

పురావస్తు శాస్త్రజ్ఞులకు తెలిసిన కర్షక సమాజాలలో అతిప్రాచీనమయింది పాలస్తీనాలో, జోర్డాన్‌లోయలోని జెరిఖో గ్రామం. రేడియో కార్బన్ పద్ధతి ద్వారా ఈ గ్రామం క్రీ.పూ. 7000 ప్రాంతంలో ఉన్నట్లు పురాతత్త్వ శాస్త్రజ్ఞులు నిర్ణయించారు. ఈ గ్రామం చాల పెద్దది. వైశాల్యం దాదాపు 4 హెక్టార్లు. దీని చుట్టూ రాతిని చెక్కి తవ్విన 25 మీటర్ల వెడల్పు, 1.5 మీటర్లలోతు ఉన్న అగడ్త ఉంది. ఈ గ్రామ ప్రజలు కాల్చని ఇటుకలతో చిన్న ఇళ్లను నిర్మించుకొన్నారు. గ్రామం చుట్టూ రాతితో కట్టిన ప్రాకారం కూడా ఉంది. ఇంటిలోపలి భాగమంతా వేర్వేరు గదులుగా గాక ఒకటిగానే

ఉండేది. అరుదుగా రెండు, లేదా మూడు గదుల ఇళ్లుకూడా ఉన్నాయి. ప్రజలు ఆహారాన్ని సేకరించుకుంటూ, గొర్రెలను పెంచుకొంటూ జీవించారు. వీరు పండించుకొన్న ధాన్యాన్ని గాదెలలో భద్రపరుచుకొనేవారు. సుదూర ప్రాంతాలతో కూడా వర్తకం చేసేవారు. రాళ్లతో చిరు శిలా పరికరాలు, కల్వాలు, పాత్రాలు, పాత్రలను తయారు చేసుకొన్నారు. మట్టితో కుండలు చేయడం, రాతి గొడ్డళ్లు వీరికి తెలియదు. అందువల్ల ఈ దశను కౌలాల పూర్వదశ (ప్రాక్ మృణ్మయ దశ) (Pre-Pottery Period) అనవచ్చు. (సంస్కృతంలో కులాలు అంటే కుమ్మరి).

కౌలాల పూర్వదశ జెరిఖో ఒక్క చోటనే గాక, కొన్ని ఇతర ప్రదేశాలలో కూడా కానవచ్చింది. వీటిలో గమనించదగ్గది కుర్దిస్థాన్ (ఇరాక్) లోని జార్మో గ్రామం. ఇది జెరిఖో అంత పెద్దది కాదు. నూట యాభై మంది జనాభాకు సరిపోయే చిన్న గ్రామం. ఈ గ్రామస్థులు మట్టితో ఇళ్లు కట్టుకొన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా వ్యవసాయం చేయకుండానే సహజంగా పిచ్చిగా పండుతున్న గోధుమలు, బార్లీ, బటాణీలు మొదలైన తృణధాన్యాలను సేకరించి, వ్యవసాయం చేశారు. రాతితో చిరు శిలా పరికరాలు మాత్రమేగాక, కల్వాలు, పాత్రాలు, పాత్రలు, గొడ్డళ్లు, బాడిసెలను (Adzes) తయారుచేశారు. కర్రతో చేసిన పాత్రలను ఉపయోగించారు. ఎముకలతో సూదులు (Awls), ఉంగరాలు, లోలకులు (Pendants) వంటి వస్తువులను తయారు చేశారు. పచ్చి మట్టితో స్త్రీల బొమ్మలను, దేవ ప్రతిమలను తయారుచేశారు. వీరికి కుండల తయారీ తెలియదు. కొన్ని అంచనాల ప్రకారం జార్మో ప్రాచీనత క్రీ.పూ. 6700 నాటిది.

పై రెండూ కాక వేరొక స్థావరం, అనటోలియాలోని హాసిలార్ అనేచోట ఉంది. ఇక్కడి ఇళ్లు చతురస్రాకారంగా ఉండేవి. లోపల ప్రవేశించడానికి ద్వారం ఇంటి పై కప్పులో ఉండేది. నేల గోడలను జేగురు రంగుతో అలికి, అలంకరించేవారు. వీరి వస్తుసామాగ్రిలో ముఖ్యంగా పేర్కొనదగినవి - రాచిప్పలు, నున్నటి రాతి గొడ్డళ్లు, ఎముకలతో చేసిన సూదులు.

కౌలాల పూర్వ సమాజాలు ఒక్క పశ్చిమ ఆసియాలోనే కాక, బెలూచిస్థాన్ (పాకిస్థాన్)లో కూడా ఉన్నట్లు ఖిలేగుల్ మొహమ్మద్ (Khilegul Mohammed) అనేచోట జరిగిన తవ్వకాలవల్ల తెలియవచ్చింది. ఇది క్రీస్తుకు పూర్వం 3500 ప్రాంతం నాటిదని కర్బనం-14 పరీక్ష వల్ల తెలుస్తుంది.

పైన పేర్కొన్నవి అతిపురాతన కర్షక సమాజాలకు ఆదర్శప్రాయమైన ఉదాహరణలు. ఈ సామాజికులు అతిసాధారణమైన జీవనం గడిపారు. ఏ కుటుంబానికా కుటుంబం తమకు అవసరమయిన వస్తువులు తామే చేసుకొనేవారు. సమాజంలో కుటుంబాలకు సమానమైన ఆర్థిక స్తోమత ఉండటంవల్ల, ఆస్తిపాస్తులలో, తేడాలుండే అవకాశాలు లేవు. వారిలో తరతమభేదాలు లేవు. వీరి జీవితం అతి సాధారణమైనా, అందులో కొన్ని విభేదాలు కనిపిస్తాయి. ఈ భేదాలు ముఖ్యంగా, వీరు కట్టుకొన్న ఇళ్ల ఆకృతులలోను, ఉపయోగించిన వస్తువర్గాలలోను గోచరిస్తాయి.

క్రీ.పూ. 7వ సహస్రాబ్దం నడి భాగంలో మట్టితో కుండలు చేసే పద్ధతిని కనుక్కొన్నట్లు, అనటోలియాలో సాతల్‌హుయూక్ అనే చోట జరిగిన పరిశోధనలవల్ల తెలియవచ్చింది. సాతల్‌హుయూక్ (Catal Huyak) లో క్రీ.పూ. 6500 మొదలు, సుమారు ఒక వెయ్యి సంవత్సరాలపాటు నవీన శిలా యుగ కర్షకులు నివసించినట్లు కర్బనం-14 పరీక్షలవల్ల తెలియవచ్చింది. ఈ గ్రామం సుమారు 13 హెక్టారుల స్థలం ఆవరించి, ఆనాటి గ్రామాలన్నిటిలో ఎంతో పెద్దదిగా ఉంది. సాతల్‌హుయూక్ నివాసులు, హాసిలార్ వారికన్నా అనేక విషయాలలో అభివృద్ధిని సాధించారు. కాని, ఈ రెండుచోట్లా బయటపడిన సంస్కృతులు విభిన్న జాతులకు చెందినవి కావు. సాతల్‌హుయూక్‌లో వ్యవసాయం, వ్యాపారం బాగా విస్తరించాయి. ఇక్కడి ప్రజలు తమకు లభ్యమయ్యే అబ్సిడియన్ (Obsidian, ప్రకృతిసిద్ధమైన గాజులాంటి పదార్థం) ను ఎగుమతి చేసి, సముద్ర ప్రాంతాల నుండి ఆలిచిప్పలు (Shells ) మొదలయిన వాటిని ఆభరణాల కోసం దిగుమతి చేసుకొన్నారు. మరణించిన వారిని ఇళ్ళలో పాతిపెట్టటం వీరి ఆచారం. చనిపోయిన వారు పిల్లలూ, స్త్రీలూ, అయితే ఆభరణాలను, పురుషులు అయితే ఆయుధాలను ఆ గోతులలోనే ఉంచేవారు.

సాతల్ హుయుకలో ముఖ్యంగా గమనించవలసినవి అక్కడ బయటపడిన అనేక దేవాలయాలు. ఈ గుళ్లలో మట్టితోను, రాతితోను చేసిన బొమ్మలుండేవి. ఇక్కడి ప్రజలు ఒక దేవతను పూజించారు.

సాతల్ హుయుక్‌లో చాలా కాలం పాటు మట్టితో ఏక వర్ణ పాత్రల (Monochrome pottery ) నే తయారుచేసేవారు. చివరి దశలో మాత్రం పాత్రలను వర్ణ చిత్రాలతో (Paintings ) అలంకరించడం నేర్చుకున్నారు.

మట్టి పాత్రలను చేసే విధానం మొదట ఆనటోలియాలో క్రీ.పూ. 7 వ శతాబ్దపు మధ్యభాగంలో ఉద్భవించి, కాలక్రమంలో ఇతర ప్రాంతాలకు విస్తరించినట్లు ఊహిస్తున్నారు. ఇది సిరియా, పాలస్తీనాలకు 7వ సహస్రాబ్ది చివరకు విస్తరించినట్లు, ఆ ప్రదేశాలలోని ఆనూక్ (Anoque), రాస్‌షామ్రా (Ras Shamra),బిబ్లోస్ (Biblos) అనే స్థలాలలో నిదర్శనాలు లభించాయి. ఈ స్థలాలలో లభించిన ఏకవర్ణ మృణ్మయపాత్రలకు, సాతల్‌హుయూక్ వద్ద లభ్యమైన వాటికి కొంత సారూప్యం ఉంది. వర్ణచిత్రాలతో అలంకరించిన పాత్రలు సిరియాలో 6 వ శతాబ్ది మధ్యకాని, దాని ఉత్తరార్థం నుండి కాని, కనిపిస్తున్నాయి.

మెసపొటేమియా (ఇరాక్) లో అతిపురాతనమైన మృణ్మయ పాత్రల పరిశ్రమ జార్మో, హస్సూనా (Hassuna) లలో కనబడింది. హస్సూనాలో మొదట ఏక వర్ణాలు, తర్వాత వర్ణచిత్రాలంకృతాలైన పాత్రలను తయారు చేసారు. హస్సూనాలో ఏకవర్ణపాత్రలుండటానికి పూర్వమే, జార్మోలో వర్ణచిత్రాలంకృత పాత్రలు కనిపిస్తున్నాయి. జార్మోపై పశ్చిమ ఇరాక్ ప్రభావం ప్రసరించడమే దీనికి కారణమని, ఇరాక్‌లో ఇటువంటి పరిశ్రమ. క్రీ.పూ. 6000 నాటికే ఉండేదని శాస్త్రజ్ఞుల భావన.

పశ్చిమ ఆసియాలో మనకు కనిపించే ప్రగతి, ఈజిప్ట్, భారతదేశం, ఐరోపాల్లో కూడా అంత స్పష్టంగా, క్రమబద్ధంగా కాకపోయినా, కొంతవరకు కనిపిస్తుంది. ఈజిప్ట్‌లోని ఫయూమ్ (Fayum) సరస్సు ప్రాంతంలో కొన్ని నవీన శిలా యుగపు కర్షక నిలయాలు కనబడ్డాయి. వీరు తాము పండించుకొన్న ధాన్యాన్ని పాతరలలో దాచుకొనేవారు. వన్య మృగాలను, పక్షులను, చేపలను వేటాడేవారు. పశువులను, మేకలను, గొర్రెలను పెంచేవారు.మృణ్మయపాత్రలను చేయడం, వాటిని వర్ణచిత్రాలతో అలంకరించడం వీరికి తెలుసు. ఫయూమ్ గ్రామాలు క్రీ.పూ. 5 వ శతాబ్ది మధ్యభాగానికి చెందినవి.

భారతదేశంలో, ముఖ్యంగా దక్కన్ పీఠభూమిలో, అనేక నవీన శిలా యుగపు నివాస స్థలాలు కనబడ్డాయి. వీటిలో ప్రధానంగా బ్రహ్మగిరి, నంగనకల్లు, ఉత్నూరు, టెక్కలికోట, మాస్కిలను పేర్కొనవచ్చు. వీటిలో అతి ప్రాచీనమైనవి క్రీ.పూ. 3వ సహస్రాబ్ది ఉత్తరార్ధానికి చెందినవి. కాశ్మీర్‌లో బూర్జ్‌హోమ్ (Burzhom) అనే చోట బయల్పడిన నవీన శిలా యుగపు అవశేషాలు కూడా ఈ నాటివే. ఈ స్థలాలన్నిటిలోనూ కుండలు చేసే పరిశ్రమ ఉంది.

ఐరోపాలో వ్యవసాయం ఆఫ్రికా, పశ్చిమ ఆసియాలనుండి వలసవెళ్ళిన కర్షకులు ప్రవేశపెట్టిందే. ఐరోపాలో క్రీ.పూ. మూడు సహస్రాబ్దులను నవీన శిలా యుగ కాలపరిమితిగా పరిగణిస్తున్నారు. ఐరోపాలో ప్రధానంగా నాలుగు నవీన శిలా యుగపు సంస్కృతులున్నాయి. వాటిలో రెండింటిని డాన్యూబియన్ (Danubian) అనీ, వెస్టర్న్ (Western) అనీ పిలుస్తారు. ఈ రెండింటిలో డాన్యూబియన్‌కు వ్యవసాయం ప్రధాన జీవనాధారం; వెస్టర్నర్లకు పశుపోషణ ముఖ్య వృత్తి.

మధ్య ఐరోపా సంస్కృతైన డాన్యూబియన్ సంస్కృతిలో పనిముట్లు ఒకే రకంగా ఉన్నాయి. చాలా ప్రాంతాలకు వ్యాపించిన ఒకే జాతి ప్రజలు వీటిని తయారు చేశారని చెప్పవచ్చు. వీరు తయారు చేసుకున్న కుండలు, సొరకాయ జాతికి చెందిన కూరగాయల ఆకారంలో ఉన్నాయి. వీరు మధ్యధరా సముద్ర ప్రాంతంలో లభించే గవ్వలను, జర్మనీకి, రైన్ నదీ ప్రాంతానికి తెచ్చుకొని, వాటిని నగలుగా, తాయెత్తులుగా ఉపయోగించారు.

డాన్యూబియన్ సంస్కృతి విస్తరించిన పద్ధతిని అర్థం చేసుకోవటానికి జర్మనీలోని కోలోన్ (Cologne)కు దగ్గరగా బయల్పడ్డ కోల్‌లిండర్థల్ గ్రామాన్ని పరిశీలించవచ్చు. ఈ గ్రామంలో ఒకనాడు ఒకదానికొకటి ఎదురుగా కట్టిన 21 ఇళ్లు ఉండేవి. ఈ గ్రామ వైశాల్యం సుమారు 2.2 హెక్టార్లు. దీని చుట్టూ ప్రాకారం ఉండేది. ఈ ప్రాంతంలో చాలా గుంటలు ఉన్నాయి. అవి మొదట ఇళ్లు కట్టడానికైన మట్టికోసం తవ్వబడ్డా, తర్వాత దిబ్బలుగా, పందులకు నివాస స్థలంగా, గ్రామస్థులు పనిపాటు చేసుకొనే చోట్లుగా ఉపయోగించబడ్డాయి. కొన్ని ఇళ్లు సుమారు 6 మీటర్ల వెడల్పు, 30 మీటర్ల పొడవు ఉన్నాయి. ఈ ఇళ్లలో ఒక కుటుంబం కాక, ఒక తెగ నివసించటానికి వీలుంది. దాదాపు పది సంవత్సరాల తర్వాత అక్కడ నివసిస్తున్న ప్రజలు ఆ పల్లెను ఖాళీ చేసి వెళ్లిపోయారు. మరికొంతకాలం తర్వాత తిరిగి వచ్చి, ఈ ప్రాంతంలోని పొలాలు నిస్సారంగా మారిపోయాయని తెలుసుకొని మళ్లీ వెళ్లిపోయారు.

మళ్లీ మళ్లీ పంటపెట్టడంచేత నిస్సారంగా మారిపోయే భూములను వదిలి వెళ్లిపోవడం, డాన్యూబియన్‌ల పద్ధతి. ఈ నాటికీ ఆఫ్రికా, అస్సాం, మొదలైన ప్రాంతాల్లోని అనాగరిక జాతుల ప్రజలు ఈ పద్ధతినే అనుసరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కోయజాతి ప్రజలు ఈ పద్ధతినే ఇలీవలివరకు అనుసరించి, దానిని 'పోడు' వ్యవసాయ మని పిలిచారు. నిస్సారమైన పొలాలలో కలుపు మొక్కలను పెరగనిచ్చి, తర్వాత వాటిని ఆ పొలంలోనే కాల్చివేస్తే, ఆ బూడిద పొలాన్ని తిరిగి సారవంతం చేస్తుందని డాన్యూబియన్లే కనుక్కొన్నారు. అందుకే వాళ్లు తాము నివసిస్తున్న గ్రామాలను వదిలివెళ్లటం, మళ్ళీ రావటం, చేస్తుండేవారు. కాలక్రమంలో వీరు శత్రువుల నుండి తమను రక్షించుకోవటం కోసం, తమ గ్రామాల చుట్టూ కందకాలను తవ్వుకొన్నారు.

పైన వివరించిన నవీన శిలా యుగపు సంస్కృతులు ఒకదానికొకటి భిన్నంగా కనిపించినా, స్థూల విషయాలలో వాటికి విరోధం లేదు. ఈ సంస్కృతులకు చెందిన ప్రజల గ్రామాలు చాలా చిన్నవి. వ్యవసాయం చేసుకుంటూ, పశువులను మేపుకొంటూ సామాన్యమైన జీవితాన్ని గడిపారు. వ్యవసాయం, పశుపోషణ ప్రారంభమైన తోడనే, వేట మానివేయలేదు. సరైన వ్యవసాయ పద్ధతులు తెలియకపోవడం వల్లనో, పండించినది చాలకపోవడం వల్లనో, వేటమీద ఆసక్తి వల్లనో, ఇంకా వేటాడుతూనే ఉండేవారు. వీరు ఆహారం సంపాదించుకునే కార్యక్రమంలో వేటకు ఇంకా ప్రాధాన్యం ఉండేది. పశుపోషణ కూడా, చేతిలో ఉన్నవాటిని తేలికగా చంపవచ్చుననే ఉద్దేశంతో ప్రారంభమై ఉండొచ్చు వీరికి వస్త్రాలు నేయడం కూడా తెలుసు. ఇవి కాక, ఇళ్లలో అల్లిక బుట్టలు, కర్రతోనూ, చర్మంతోనూ చేసిన సామానులు ఉండేవి.

యూరేషియా ప్రాంతం నుండి చైనా వరకు, కొత్త రాతి యుగం ఆర్థిక వ్యవస్థ అములులో ఉన్నట్లుగా నాలుగువేల సంవత్సరాల నాటి పురావస్తు ఆధారాలు నిరూపిస్తాయి.

### 1.3.5 చారిత్రక సంధి యుగం (Proto-Historical Period) : వివరణ

పురావస్తు శాస్త్రజ్ఞుడు హెచ్.డి. సంకాలియా 'చారిత్రక సంధి' యుగాన్ని నిర్వచించి, ఆ యుగంలో భారతదేశంలోని మధ్య రాతియుగాన్ని, హరప్పా సంస్కృతిని, వైదిక నాగరికతను చేర్చిన విషయాన్ని పైన పేర్కొనడం జరిగింది. మానవ పరిణామం లోని యుగ విభజనలకు సంబంధించి, ఈ చారిత్రక సంధి యుగం అనే పదాన్ని వాడటం మీద శాస్త్రజ్ఞులలో ఏకాభిప్రాయం లేదు. డేనియల్ (Daniel, Glynn, A Hundred Years of Archaeology), అలిచిన్ (Allchin & Others, The Birth of Indian Civilization), సుబ్బారావ్ (Subba Rao B, The Personality of India) మొదలైన శాస్త్రజ్ఞులు సంకాలియా నిర్వచనంతో ఏకీభవించగా, ఎ.ఘోష్ మొదలుగా కొందరు పురావస్తువేత్తలు, 'ప్రోటో-హిస్టరీ' అనే పదంలో యుగ విభజనకు సంబంధించి స్పష్టత లోపించినందువల్ల, దానిని వాడకుండా ఉండటం మంచిదని భావించారు. ఘోష్ మాటలలో, "In view of the varying and confusing connotation of the term 'Proto-history' the present writer (Ghosh) expressed himself in favour of discontinuing its use in Indian archaeology, suggesting the retention of only two terms 'Pre-history' and 'history'" (A. Ghosh, 'Aspects of Periodization

and Terminology', Essays in Indian Proto-history, P.4). ఇట్లే భారతదేశానికి సంబంధించినంత వరకు, ప్రాచీన శిలా యుగాన్ని దిగువ, మధ్య, ఎగువ ప్రాచీన శిలా యుగాలుగా విభజించటంలో, చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు.

చారిత్రక సంధి యుగానికి చెందినదిగా సంకాలియా పేర్కొన్న సింధు లోయ నాగరికతను గురించి, రెండో ఖండంలో విపులంగా తెలియజేయడం జరిగింది. సింధు లోయ నాగరికతను కొందరు శాస్త్రజ్ఞులు చరిత్ర పూర్వయుగంలో చేర్చగా, మరికొందరు దీనిని చారిత్రక యుగంలో అంతర్భాగంగా భావించారు. దీనిని గురించి, ఈ ఖండంలోని రెండవ భాగం "చరిత్ర" కింద కాంస్య యుగ నాగరికతలలో పరిచయంగా తెలియజేయడం జరిగింది. సింధు లోయ నాగరికతను గురించి, ఖండం-IV కింద విపులంగా రాయడం జరిగింది.

## 1.4. సంగ్రహంగా

భూమిమీద మానవ పరిణామాన్ని గురించి శాస్త్రవేత్తలు గత రెండు శతాబ్దాలుగా అధ్యయనం చేస్తున్నారు. మానవునికి లిపి జ్ఞానం ఏర్పడక ముందు, సుదీర్ఘ కాలంలో ఉన్న అతని పరిణామం లోని వివిధ దశలలో, కాలాలలో ఈతడు గడిపిన జీవన క్రమాన్ని మానవశాస్త్రవేత్తలు, పురావస్తుశాస్త్రజ్ఞులు ప్రాక్ చరిత్ర (Pre-history) గా పేర్కొన్నారు; ఈ ప్రాక్ చరిత్రకు సంబంధించిన కాలాన్ని చరిత్ర పూర్వయుగం (Pre-historical Age) అని పేర్కొన్నారు. మానవుడు తన పరిణామ గతిలో శిలలతో రూపొందించిన పరికరాలు, పనిముట్లు ఆధారంగా, చరిత్ర పూర్వయుగాన్ని ప్రాచీన, మధ్య, నవీన శిలా యుగాలుగా విభజించారు. ఈ యుగాలలో, శిలాజాలు (Fossils) గా మారిన మానవుని ధాతువులు, కపాలాలు ఆధారంగా, పరిణామ గతిలో మార్పు చెందుతున్న అతని స్వరూప స్వభావాదులను శాస్త్రజ్ఞులు నిర్దేశించారు. అతడు రూపొందించిన పరికరాలు, పనిముట్లు, ఇతర వస్తుజాలం ఆధారంగా, అతని సాంఘిక, ఆర్థిక జీవనాన్ని, సాంకేతిక రంగంలో అతడు సాధించిన ప్రగతిని శాస్త్రవేత్తలు విశ్లేషించారు.

## 1.5. పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. చరిత్ర పూర్వయుగాన్ని గురించి శాస్త్రవేత్తల అధ్యయనంలోని వివిధ దశలను వర్ణించండి.
2. మానవ పరిణామ చరిత్రలోని యుగాలను గురించి వివరించండి.
3. ప్రాచీన శిలాయుగంలోని విభాగాలేవి? ఒక్కొక్క విభాగంలోని మానవ సంస్కృతులను సమీక్షించండి.
4. మధ్యశిలాయుగ విశిష్ట లక్షణాలెవ్వి? ఆనాటి మానవుల జీవనవిధానాన్ని గురించి తెలియజేయండి.
5. నవీన శిలాయుగపు మానవుల జీవన విధానాన్ని సోదాహరణ పూర్వకంగా వివరించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. చరిత్ర పూర్వయుగం, చారిత్రక సంధియుగాలను నిర్వచించండి.
2. చరిత్ర పూర్వయుగంలోని యుగవిభజనను గురించి రాయండి.
3. ప్లైస్టసీన్ యుగంనాటి వాతావరణ, నైసర్గిక పరిస్థితులను తెలియజేయండి.
4. నరవానరుల గురించి వివరించండి.
5. హోమోసేపియన్ల గురించి మీకు తెలిసిన విషయాలను పేర్కొనండి.
6. నియాండర్‌తల్ మానవుల గురించి తెలియజేయండి.

BRAOU

## 1.6. ఉపయుక్త గ్రంథాలు


Allichin B & Allichin. R : **The Rising Civilization in India & Pakistan,** 1973.

Agarwal & Ghosh D.P. : **Radio Carbon and Indian Archaeology,** Bombay, 1978.

Agarwal & Chakravarti : **Essay in Indian Proto-History,** New Delhi,1979.

Albright W.F. : **From Stone Age to Christianity,** Baltimore, 1946.

Binford R.L. : **An Archaeological Perspective,** 1972.

Child Gordon. V : **Progress and Archaeology,** London, 1944.
**Man Makes Himself,** 1965.

Clare and Piggot : **Pre-historic Societis**

Deo S.B. & Dhavalikar M.K. : **Studies in Indian Archaeology,** Bombay, 1970.

Darwin, Charles : **Origin of Species,** 1859; **Descent of Man,** 1871.

Daniel, Glynn : **A Hundred Years of Archaeology,** London, 1950.
**The Three Ages,** Cambridge, 1943.

Hawkes, Jacquetta : **History of Mankind**

Huxley. T : **Man's Place in Nature,** 1863.

Renfrew. C : **Before Civilization.**

Sankalia H.D. : **Pre-history and Proto-history in India and Pakistan** (New Ed.) Poone, 1973.

Subba Rao. B : **The Personality of India,** Baroda, 1958.

Subrahamnyam. R : **"PURAVASTU SASTRAMU"** (Telugu) Hyderabad.


BRAOU

## 1.7. పద కోశం

| | |
|---|---|
| ANTHROPOIDS | : నర-వానరులు |
| FOSSILS | : శిలాజాలు |
| GLACIAL PERIODS | : హిమకాలాలు |
| HOMOSAPIENS | : బుద్ధిజీవి అయిన మానవుడు, నేటి మానవులంతా 'హెూమోసేపియన్స్' కిందికి వస్తారు. |
| INTER-GLACIAL PERIOD | : హిమాంతర కాలం |
| INTER-PLUVIAL PERIOD | : అల్పవర్షకాలం |
| NEANDERTHAL | : జర్మనీలో ఒక స్థలం. అక్కడ దొరికిన శిలాజాలను బట్టి, చరిత్రలో పూర్వ యుగంలో అక్కడ నివసించిన మానవులను నియాండర్‌తల్ మానవులు అని శాస్త్రజ్ఞులు పిలిచారు. |
| PLUVIAL PERIOD | : అతివర్షకాలం |
| PRE-HISTORY | : ప్రాక్ చరిత్ర/ఆదిమ చరిత్ర |
| PRE-HISTORICAL AGE | : చరిత్ర పూర్వ యుగం, లేక ప్రాక్ చరిత్ర యుగం |
| PROTO-HISTORY/PROTO-HISTORICAL AGE | : చరిత్ర సంధి యుగం |
| UNIFORMITARIAINISM | : ఏక రూప నిర్మాణ సిద్ధాంతం |

# భాగం -2 : చారిత్రక యుగ ప్రారంభం

విషయక్రమం


2.0 లక్ష్యాలు

2.1 చారిత్రక యుగ ప్రారంభం : నగర విప్లవం

2.2 కాంస్య యుగం

2.2.1 కాంస్య యుగ నాగరికతా లక్షణాలు

2.2.2 కాంస్య, నవీన శిలాయుగాల మధ్య కాల విచ్ఛేదం : కాంస్య నాగరికతా ప్రారంభం

2.2.3 కాంస్య యుగ నాగరికతా విస్తరణ : ప్రాంతాలు

2.2.4 కాంస్య యుగ నాగరికతలలోని సామాన్య లక్షణాలు

2.2.5 వివిధ కాంస్య యుగ నాగరికతలు : ఒక పరిశీలన

2.3 అయో యుగం

2.3.1 ఇనుము సాంకేతిక పరిజ్ఞాన విస్తరణ : ఫలితాలు

2.3.2 అయో యుగం : రాజ్యాలు, సామ్రాజ్యాలు, నగరాలు

2.4 సంగ్రహంగా

2.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

2.6 ఉపయుక్త గ్రంథాలు


## 2.0. లక్ష్యాలు

ఈ భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా, ఈ క్రింది విషయాలను గ్రహించగల్గాలి.

- నవీన శిలాయుగం తర్వాత కాంస్య యుగంలో ఏర్పడిన నగర విప్లవం.
- కాంస్య యుగ నాగరికతా లక్షణాలు, ఆ నాగరికత వెలసిన ప్రాంతాలు.
- వివిధ కాంస్య యుగ నాగరికతలు.
- అయో యుగంలో ఇనుము సాంకేతిక పరిజ్ఞాన విస్తరణ వల్ల, నాగరికత ప్రగతిలో వచ్చిన పరిణామాలు.

BRAOU

## 2.1. చారిత్రక యుగ ప్రారంభం: నగర విప్లవం

నవీన శిలా యుగ మానవులు వ్యవసాయాన్ని అవలంబించి, తమకు ఏర్పడ్డ వివిధ అవసరాలను తీర్చుకోవటానికై సమర్ధమైన పరికరాలను, పనిముట్లను రూపొందించుకొని, స్థిర నివాసాలను ఏర్పరచుకొని మనుగడ సాగించటంతో, మానవ పరిణామంలో గొప్ప విప్లవాన్ని తెచ్చారు. కాని, ఈ కొత్తరాతియుగ విప్లవం చారిత్రక యుగోదయానికి ముందటి మానవ పరిణామపు మసక వెలుగులలో జరిగింది. కొత్తరాతియుగం తర్వాత వచ్చిన రాగి, లేదా కాంస్య (కంచు) యుగంలో ఏర్పడిన నగర విప్లవం (Urban Revolution) తో, మానవ పరిణామ ప్రగతిలో చారిత్రక యుగోదయం ప్రారంభమైంది.

నవీన శిలాయుగంలో వ్యవసాయదారులు తమ అవసరాలకు మించిన 'మిగులు' ధాన్యాన్ని పండించడంతో, ఆ యుగం మానవ పరిణామ ప్రగతిలో మరొక అడుగు ముందుకు వేయడానికి అవకాశమిచ్చింది. ఆహారాన్ని ఉత్పత్తి చేయని ఒక నూతన ఆర్థిక వర్గం అవసరాలను ఆ మిగులు ధాన్యం తీర్చింది. మానవుడు రాగి, కంచు లోహాలను, వాటి ఉపయోగాలను కనుక్కొని, వాటిని నిత్యజీవనంలో ప్రవేశపెట్టడంతో, ఈ నూతన ఆర్థిక వర్గం రూపొందింది. నూతనంగా ఏర్పడిన ఈ లోహ సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధితో, దానికి అనుగుణంగా, ఆర్థిక, సామాజిక సంబంధాల సర్దుబాటు చేసుకోవలసిన అవసరం ఏర్పడింది. రాగి, కంచు లోహాల ఉపయోగంతో పాటు, మానవుడు సాంకేతిక రంగంలో చలన సాధనాల అభివృద్ధి, కుమ్మరి సారెను కనుక్కోవడం మొదలైన కొన్ని నూతన విషయాలను సాధించి, నాగరికత దశ లోనికి ప్రవేశించాడు. ఈ నాగరికతా దశ లోని ప్రధాన లక్షణం, నగరాలు ఏర్పడటం. ఈ నగరాల ఆవిర్భావం మానవుని జీవితంలోని అన్ని రంగాలలో మౌలికమైన మార్పులను తెచ్చినందువల్ల, దానిని మానవ చరిత్రలో ఒక విప్లవంగా భావించారు. ఈ విప్లవాన్ని 'నగర విప్లవం' (Urban Revolution) అని పిలిచారు. ఈ నగర విప్లవం క్రీ.పూ. 4000 - 3000 సంవత్సరాల మధ్య జరిగింది.

## 2.2. కాంస్య యుగం

క్రీ.పూ. 4000 - 3000 సంవత్సరాల మధ్యగల వెయ్యేండ్ల కాలం, సాంకేతిక రంగంలో చాలా ముఖ్యమైంది. క్రీ.శ. 16 వ శతాబ్దానికి ముందు మానవ చరిత్ర లోని ఏ యుగం లోను సాధించనన్ని కల్పనలు(Inventions), ఆవిష్కరణలను (Discoveries) క్రీ.పూ. 3000 సంవత్సరాల నాడు ఒక వేయి సంవత్సరాల కాల వ్యవధిలో మానవులు సాధించగాలిగారు. సమాజ ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణానికి అవి ఎంతో తోడ్పడ్డాయి. వీటన్నిటినీ కలిపి, నగర విప్లవం అని పిలుస్తామని గార్డన్ చైల్డ్ (Gordon Child) అభిప్రాయపడ్డాడు. ఈ నగర విప్లవం రూపొందించిన నాగరికతలలో అంతా, మానవుడు పరికరాలను, ఆయుధాలను రూపొందించుకోవడానికి, రాయి స్థానంలో, క్రమక్రమంగా మొదటలో రాగి (తామ్ర) లోహాన్ని, తర్వాత రాగితో తగరం కలిపితే వచ్చే మిశ్రమ లోహమైన కంచు (కాంస్యం) ను వాడటంవల్ల, ఈ నాగరికతలన్నిటినీ తామ్ర-శిలా నాగరికతలనీ, కాంస్య యుగ నాగరికతలనీ పిలిచారు. ఈ నాగరికతలు కొత్త రాతి యుగం నుండి, రాగి యుగానికి మారుతున్న మొదటి దశలో పరికరాలను రూపొందించటానికై, రాగితో పాటు రాతినికూడా ఉపయోగిస్తున్నందువల్ల, ఆ దశలో ఉన్న ఈ నాగరికతలను తామ్ర-శిలా (రాగి - రాయి), నాగరికతలని పిలిచారు. ఆ తర్వాత వస్తుసామగ్రిని, పనిముట్లను, అయుధాలను తయారుచేసుకోవడానికి విరివిగా కంచును ఉపయోగించిన కాలాన్ని కంచు యుగం (Bronze Age) అని, ఆ కాలంలో వర్ధిల్లిన నాగరికతలను కాంస్య యుగ నాగరికత (Bronze Age Civilizations) లనీ పిలిచారు. నగర విప్లవంలో భాగమైన ఈ కాంస్య యుగ నాగరికతలన్నీ, ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలలో క్రీ.పూ. 4000 ప్రాంతంలో, అంటే నేటికి ఆరు వేల ఏండ్ల కిందట ఆవిర్భవించాయి. భారతదేశం లోని సింధు లోయ నాగరికత, లేదా హరప్పా సంస్కృతి కాంస్యయుగానికి చెందింది. ఈ నాగరికతా కాలానికి ముందు, అటు తర్వాత కూడా తామ్ర - శిలా నాగరికతా అవశేషాలు, స్థావరాలను కనుక్కొన్నారు.

B R A O U

పురావస్తుశాస్త్రజ్ఞులు ఈ తామ్ర - శిలా నాగరికతకు చెందిన సంస్కృతులను, వాటి స్థావరాలను బట్టి, జొర్వే సంస్కృతి (Jorwe Culture, Maharashtra), మాల్వా సంస్కృతి (Malwa culture, Madhya Pradesh), అని, అనేక పేర్లతో పిలిచారు. గత రెండు వందల ఏండ్లుగా పురాతత్త్వ శాస్త్రజ్ఞులు జరిపిన పరిశోధనల వల్ల, కృషి వల్ల ప్రపంచంలోని మొదటి నాగరికతలైన ఈ కాంస్య యుగ నాగరికతలను గురించి అనేక ఆసక్తికరమైన విషయాలు మనకు తెలిసివచ్చాయి.

## 2.2.1 కాంస్య యుగ నాగరికతా లక్షణాలు

కాంస్య యుగమంటే అది కేవలం కంచును వాడిన యుగమని అనుకోకుండా, అది ఒక రకపు జీవన ప్రమాణాలను, సామాజిక వ్యవస్థను నిర్దేశిస్తుందని కూడా తెలుసుకోవాలి. కాంస్య యుగానికి, అంతకు ముందున్న నవీన శిలా యుగానికి భేదం లోహ సామాగ్రి ఉండటం, లేకపోవడమే కాదు. ఈ రెండు యుగాల సామాజిక జీవన ప్రమాణాలలో ఎంతో వ్యత్యాసముంది. కాంస్య యుగ నాగరికతకు చిహ్నాలు నగరాలు, లేదా పట్టణాలు, సుస్థిరమైన కట్టడాలు. సమాజంలో వేర్వేరు వృత్తులు, వృత్తి శాఖలు ఏర్పడ్డాయి. నిర్దిష్టమైన ఒక రాజ్యాంగ వ్యవస్థ ఏర్పడింది. చారిత్రక యుగ ప్రారంభానికి ప్రధాన సంకేతంగా భావించిన లిపి జ్ఞానం ఏర్పడింది. వ్యవసాయదారులు అధికాహారోత్పత్తిని సాధించి, వారి అవసరాలకు పోను మిగులు ఆహారోత్పత్తులతో, ఈ నూతన వ్యవస్థకు, కొన్ని నూతన వృత్తి వర్గాలకు పోషకులయ్యారు. ఈ కాంస్య యుగ నాగరికతలలో మొట్టమొదటిది మెసపటోమియా (నేటి ఇరాక్) లోని సూమర్ నాగరికత. (సూమర్ యూఫ్రటిస్, టైగ్రిస్ నదుల మధ్య, పర్షియన్ సింధుశాఖకు సమీపం లోని ప్రదేశం). ఆ తర్వాత ఈజిప్ట్, భారతదేశం కూడా ఈ నాగరికతకు నెలవులయ్యాయి.

## 2.2.2 కాంస్య, నవీన శిలాయుగాల మధ్య కాల విచ్ఛేదం : కాంస్య నాగరికతా ప్రారంభం

కాంస్య, నవీన శిలాయుగాల నడుమ సాంస్కృతిక వ్యత్యాసమే గాక, కాల విచ్ఛేదం (Chronological gap) కూడా ఉంది. పశ్చిమ ఆసియాలోని కొన్ని ప్రాంతాలలో క్రీ.పూ. 5000 నుండి నవ శిలా యుగపు లక్షణాలు క్రమక్రమంగా అంతర్హితం కాజొచ్చాయి. ఈ లక్షణాలు క్రీ.పూ. 4000 నాటికి పూర్తిగా మాసిపోయాయి. కాని, అక్కడ కాంస్య యుగం క్రీ.పూ. 3000 నాటికి కాని ప్రారంభం కాలేదు. కాబట్టి, ఈ రెండు యుగాల మధ్య కాల విచ్ఛేదం పరిమితి వేయి సంవత్సరాలు. ఈ మధ్య కాలంలో మెసపటోమియాలో జరిగిన కొన్ని విప్లవాత్మక సంఘటనలు, అక్కడ మొదటగా కాంస్య యుగ నాగరికత రూపొందడానికి కారణమయ్యాయి. రాగినే ఉపయోగించి వస్తువులు తయారుచేసుకోవడం, చలన సాధనాల అభివృద్ధి, కుమ్మరి సారెను కనుక్కోవటం - ఈ సంఘటనలలో ప్రధానమైనవి. ఈ నూతన సంఘటనలు, లేదా ప్రయోగాలు అధికాహారోత్పత్తి చేయగల సమాజాల్లోనే ప్రయోజనకరంగా ఉంటాయి. టైగ్రిస్, యూఫ్రటిస్ నదులు తమ నీటితో సారవంతం చేసే సూమర్‌లో, ఈ అధికాహారోత్పత్తికి అవకాశం కలిగింది. ఈ కారణాలవల్లనే, సూమర్ మొదటి కాంస్య యుగ నాగరికతా ప్రదేశంగా రూపొందింది.

లోహాలను, వాటి ఉపయోగాన్ని కనుక్కోవడం మానవ జాతి చరిత్రలో చాలా ముఖ్యమైన విషయం. ఆదిమ మానవుడు ఒక అనాగరిక దశ నుండి నాగరిక దశకు మారిన స్థితిని సూచిస్తుంది. ఒక లోహపు పనిముట్టు రాతి పనిముట్టుకన్నా దృఢమై, ఎంతో కాలం మన్నుతుంది. అంతే కాకుండా, అది పాడైతే దానిని బాగుచేయడానికి వీలౌతుంది. గనుల నుండి రాగి ఖనిజాన్ని సంగ్రహించిన మానవులకు, తొలి దశలలో దాని ఉపయోగం తెలియలేదు. కొంత కాలం దానిని వేరొక ఉత్తమ శిలగా భావించారు. క్రీ.పూ. 5వ సహస్రాబ్దంలో, నదీ తీరాలలో, ప్రకృతి విరుద్ధంగా, లోహ రూపంలోనే లభిస్తుండిన రాగిని (Natural copper) తెచ్చి, ముక్కలు చేసి, వాటితో పూసలు, ఉంగరాలు మొదలయిన చిన్న వస్తువులను తయారుచేసుకొ . క్రీ.పూ. 4500 - 4000 ప్రాంతంలో ఇరాన్, మెసపటోమియా, సిరియా, అనటోలియా (ఆసియా మైనర్) లలో ఖనిజం (Ore) నుండి రాగిని ఉత్పత్తి చేసుకొనే పద్ధతిని కనుగొన్నారు.

క్రీ.పూ. 3000 నాటికి ఆసియా, ఆఫ్రికా, ఐరోపాలలో రాగి వాడుక సాధారణమైంది. తర్వాత చాలా కాలానికి గాని, అమెరికా ఖండంలో రాగి వాడుకలోనికి రాలేదు. మొదటి నాగరికతలు రూపొంది అభివృద్ధిచెందిన అనేక ప్రాంతాలలో, రాగి లభ్యమయ్యేది కాదు. దానిని చాలా దూరంలో ఉన్న ఇతర ప్రాంతాల నుండి సంపాదించేవారు. ఇది వ్యాపారానికి, వివిధ ప్రాంతాల ప్రజలు ఒక చోట కలవడానికి దోహదం చేసింది.

క్రీ.పూ. 3000 కు కొంచెం ముందు, రాగిని తగరంతో కలిపితే వచ్చే మిశ్రమ లోహమయిన కంచు, రాగి కంటే నాణ్యమయినదన్న విషయాన్ని తెలుసుకొన్నారు. రాగి కంటే కంచు దృఢమయింది. అందువల్ల, దానితో చేసిన పరికరాలు, ఆయుధాలు, పాత్రలు, పనిముట్లు పటిష్ఠంగా ఉంటాయి. పాత గుద్దలికన్నా, నేలను సాగుచేయటంలో, కంచు నాగలికర్రు ఎంతో శ్రేష్టమైంది. కంచు పనిముట్లు, సుత్తి, వడ్రంగం అభివృద్ధికి, చక్రాన్ని కనుక్కోవడానికి దోహదం చేసాయి. కంచు పరికరాలను తయారుచేయడానికి, శిలా పరికరాలను చేయడానికి అవసరమైనదాని కన్నా ఎక్కువ నేర్పు కావలసిరావడం చేత, కంచు పరికరాలను చేయడం ఒక విశిష్ట వృత్తిగా రూపొందింది. ఈ విధంగా లోహ పరిశ్రమ సమాజంలో వృత్తి వర్గాల సృష్టికి కారణమయింది. ఈ నూతన వృత్తి వర్గాలవారికి వ్యవసాయం చేసి ఆహారం పండించుకొనే వ్యవధి లేకపోవడంచేత, వీరి ఆహార అవసరాలను ఇతరులే, ప్రధానంగా కర్షకులే, తీర్చేవారు. గ్రామాలలోని కర్షకులు, తాము అధికంగా పండించిన ధాన్యంలో, తమ ఆహార అవసరాలకు పోగా మిగులు ధాన్యాన్ని,కంచు పనిముట్లకై కంచు పనివారితో వినిమయం (Exchange) చేసి, ఆ పనిముట్లను పొందేవారు. ఈ విధంగా వస్తు వినిమయ పద్ధతి (Barter) లో వ్యాపారం ఏర్పడింది.

BRAOU

## 2.2.3 కాంస్య యుగ నాగరికతా విస్తరణ: ప్రాంతాలు

తూర్పున థార్ ఎడారి, హిమాలయ పర్వతాలు; పడమట సహారా ఎడారి, మధ్యధరా సముద్రం; దక్షిణంలో కర్కాటక రేఖ; ఉత్తరంలో యూరేషియా పర్వత శ్రేణులు - వీటి మధ్యలో ఉన్న విశాల ప్రాంతం నగర విప్లవానికి రంగస్థలమై, కాంస్య నాగరికతల ఆవిర్భావానికి, అభివృద్ధికి ఆటపట్టయింది. చైనాలో హ్వాంగ్‌హో లోయలో కొంత ఆలస్యంగా, క్రీ.పూ. 18వ శతాబ్దం నాటికి గాని, కాంస్య యుగ నాగరికత అయిన ష్వాంగ్ (Shwang) నాగరికత ఏర్పడ లేదు.

క్రీ.పూ. 3000 - 2500 మధ్యకాలంలో ఐరోపాలోని మధ్యధరా, ఏజియన్ సముద్రాల పరిసర ప్రాంతాలు, భారతదేశం లోని సింధు లోయ, మెసపటోమియా (ఇరాక్)లోని టైగ్రిస్, యూఫ్రటీస్ నదుల పరీవాహ ప్రాంతాలు, ఈజిప్ట్ లోని నైల్ లోయ గొప్ప నాగరికతా కేంద్రాలుగా రూపొందాయి. ఈ నాగరికతలన్నీ, వాటి వాటి ప్రత్యేక లక్షణాలతో, వివిధంగా మానవ ప్రగతికి దోహదం చేశాయి. కాని, ఈ నాగరికతలకంతా కొన్ని సామాన్య లక్షణాలు కూడా ఉన్నాయి. వీటిలో కొన్నిటిని, సందర్భానుసారంగా, పైన పేర్కొన్నాం. వీటిని, మరి కొన్నింటిని, ఈ కింద కొంత విపులంగా పరిశీలిస్తాం.

## 2.2.4 కాంస్య యుగ నాగరికతల లోని సామాన్య లక్షణాలు

కాంస్య యుగ నాగరికతలలో ప్రతి నాగరికత తనకు ప్రత్యేకమైన రాజకీయ, సామాజిక వ్యవస్థలను రూపొందించుకొంది. ఈ నాగరికతలలో అంతా వాణిజ్యం, వ్యాపారం ఏర్పడి అభివృద్ధి చెందాయి. క్లిష్టమైన మతాచారాలు, మత విశ్వాసాలు చోటుచేసుకొన్నాయి. లిపి, గణితం, ఇతర శాస్త్రాలు, కళల పరిజ్ఞానం ఉండేది. వీటిని, ఈ నాగరికతలకు సంబంధించిన ఇతర సామాన్య లక్షణాలను, ప్రత్యేక లక్షణాలను ఈ గ్రంథంలో రాబోయే ఖండాల (భాగాలు,లో విపులంగా చర్చించడం జరిగింది.

ఈ నాగరికతలలోని సమాజాలు, కొత్త రాతి యుగం నాటి సమాజాలలో ఉన్న స్వయంపోషకత్వాన్ని (Self-Sufficiency) కోల్పోయాయి. ఈ నాగరికతలలో కర్షకులు, సమాజంలోని ఇతర వృత్తుల వారిని పోషించటానికి, తమ అవసరాలకు మించి ఆహార ధాన్యాలను పండించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. చిన్న కయ్యాలలో గుద్దలితో పనిచేసే నవీన శిలా యుగం నాటి కర్షకులకు ఇది సాధ్యమయ్యే పనికాదు. కాంస్య యుగ నాగరికతలలో మొదట్లో మానవుల చేత, ఆ తర్వాత పశువుల చేత లాగబడిన కొయ్య నాగలిని వ్యవసాయంలో ప్రవేశ పెట్టడం వల్ల, విశాలమైన భూములను దున్ని, అధికంగా పండించడం సాధ్యమయింది.

పంటభూములకు కావలసిన నీటి పారుదల అవసరాలు కూడా ఈ నాగరికతలలో పెంపొందాయి. నదుల సమీపంలోని అడవులను నరికి, అక్కడ భూములను వ్యవసాయ యోగ్యం చేయవలసి వచ్చింది. ముంపు నేలల (Marshes)లోని నీటిని బయటికి పంపడానికి కాలవలను తవ్వాల్సివచ్చింది. వరదల నుండి నివాసాలను కాపాడుకోవటానికి ఆనకట్టలను నిర్మించవలసి వచ్చింది. సేద్యపు భూములకు సక్రమంగా నీటిని అందచేయడానికి విస్తృతంగా పంట నీటి కాలవలను నిర్మించవలసి వచ్చింది. ఈ పనులన్నిటినీ నెరవేర్చటానికి ప్రజలందరూ కలిసి పరస్పర సహకారంలో పని చేయవలసి వచ్చింది. చిన్న గ్రామాలు ఈ పనులను నిర్వర్తించలేవు. ఈ అవసరాలన్నిటినీ సాధించటానికి అనేక సమాజాలు ఒకటిగా చేరి, అధికారాన్ని నిర్వహించి తన ఆజ్ఞలను అమలు చేయగల ఒక కేంద్ర అధికార వ్యవస్థను, ప్రభుత్వాన్ని, ఏర్పరుచుకొన్నాయి. ఈ విధంగా, నీటి పారుదల అవసరాలు, నగరాలలోని ప్రజలను ఒక ప్రభుత్వాధికారం కిందికి తెచ్చాయి. వ్యవసాయోత్పత్తుల అభివృద్ధి చాలామంది ప్రజలను తమ ఆహారావసరాలను తామే ఉత్పత్తి చేసుకోవలసిన పరిస్థితి నుండి తప్పించింది. ఈ విధంగా ప్రజలు, నగరాలలో నివసించి వ్యవసాయేతర వృత్తులను చేపట్టటానికి సాధ్యమయింది.

క్రీ.పూ. 5వ సహస్రాబ్దిలో, ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే 4వ సహస్రాబ్దిలో, పశువులతో బండ్లు నడుపుకోవచ్చన్న విషయాన్ని తెలుసుకొన్నారు; నాగళ్ళను పశువుల చేత లాగించి, భూమిని దున్నవచ్చనే విషయాన్ని తెలుసుకొన్నారు. గాలిని చలన సాధనంగా ఉపయోగించి, పడవలను నడపవచ్చునని తెలుసుకొన్నారు. క్రీ.పూ. 3000 నాటికి పశువులు లాగే బండ్లు, నాగళ్ళు, తెరచాపలున్న పడవలు (Sail boats) బాగా వాడుకలోకి వచ్చాయి. ఈ నూతన సాధనాలు వ్యవసాయం, వ్యాపారం అభివృద్ధి చెందడానికి తోడ్పడ్డాయి. ఈ అభివృద్ధి ఫలితంగా సమాజంలో వణిజులు, వడ్రంగులు మొదలగు అనేక వృత్తులవారు ఏర్పడ్డారు. కుమ్మరి సారెను కనుక్కొన్న తర్వాత, తక్కువ కాలంలో ఎక్కువ కుండలను ఉత్పత్తి చేసే అవకాశం ఏర్పడి, కుమ్మరం ప్రత్యేక వృత్తిగా రూపొందింది.

సమాజంలో వేర్వేరు వృత్తులు, వృత్తి శాఖలు ఏర్పడినప్పటికీ, ప్రజలలో అధిక భాగం వ్యవసాయం చేస్తూ జీవిస్తుండేవారు. వీరు తమ అవసరాలకు పోగా మిగిలిన పంటతో, ఇతర వృత్తి వర్గాలు తయారుచేసిన ఉత్పత్తులను పొందటానికై, తాము పండించిన ధాన్యాన్ని వినిమయం (Exchange) చేసేవారు. ఈ విధంగా వాణిజ్య, వ్యాపారాలు పెంపొందాయి. మొదట్లో వస్తు మార్పిడిపై ఆధారపడ్డ వాణిజ్య, వ్యాపారాలకు, నాగరికత అభివృద్ధి చెందిన తర్వాత, ఏదో ఒక రూపంలో ద్రవ్యం సాధ్యమయింది.

ప్రజలలోని వివిధ సమూహాలు వివిధమైన వృత్తులను అవలంబించి, వాటిలో నైపుణ్యాన్ని సంపాదించారు. ఈ విధంగా వృత్తిపనివారు, వ్యాపారులు, సైనికులు, అధికారులు, పూజారులు మొదలయినవారు, వారివారి వృత్తుల మీద శ్రద్ధ చూపి, వాటికి అంకితమైపోయారు. ఈ రకమైన శ్రద్ధవల్ల, అంకిత భావం వల్ల, ఆయా వృత్తులలో వారికి ఇతరులకు లేని నైపుణ్యం అబ్బింది. వివిధ వృత్తులలో సంపాదించిన ఈ నైపుణ్యాల (Division of Labour) వల్ల, సమాజంలో శ్రమ విభజన ఏర్పడింది. సాంకేతిక రంగంలో ప్రగతి వల్ల ఈ నైపుణ్యం, నైపుణ్యం వల్ల సాంకేతిక ప్రగతి, పరస్పరావలంబనాలుగా ఏర్పడ్డాయి. సమాజంలో వివిధ వృత్తులవారు ఆకాంక్షించే, సాధించుకోవలసిన ప్రయోజనాలు అనేక రకాలుగా ఉన్నాయి. ఇంకో విధంగా చెప్పాలంటే, నగర జీవితం క్లిష్టమైపోయింది. నగరంలోని ప్రజా జీవితాన్ని క్రమబద్ధం చేయడానికి ఒక వ్యవస్థను రూపొందించుకోవలసిన అవసరం ఏర్పడింది. నగరంలో శాంతిభద్రతలను

BRAOU

కాపాడి, ప్రజల విభిన్న ప్రయోజనాలను గురించి శ్రద్ధ వహించి, చట్టాలను రూపొందించటం, ఈ వ్యవస్థ బాధ్యతలైనాయి. ఈ బాధ్యతలను నిర్వర్తించటానికి కొందరు వ్యక్తులు అవసరమయ్యారు. ఈ విధంగా, కాలక్రమంలో, సమాజాలలో పాలకులు, రాజులు ఏర్పడి, ప్రభుత్వాలు రూపొందాయి. క్రీ.పూ. 3000కు ముందు కొంత కాలం పాటు, సూమర్ మొదలుగా కొన్ని నాగరికతలలో సమాజాలు పురోహితుల అధీనంలో వుండేవి.

## 2.2.5 వివిధ కాంస్య యుగ నాగరికతలు : ఒక పరిశీలన

దేవాలయ పురోహితుల ప్రభావం క్రీ.పూ.3000 వరకు కొనసాగి, తరువాత రాజ్య వ్యవస్థకు తావిచ్చింది. ఈ నూతన వ్యవస్థలో ఆధిపత్యం వహించింది రాజులు, వారి ప్రతినిధులు, అనుచరులు. రాజ్య వ్యవస్థ ఏర్పడటానికి ముందే, సూమర్‌లో కొన్ని నగర రాజ్యాలు (City States) అవతరించాయి. వీటిలో ప్రధానంగా ఉమ్మా (Umma), లగాష్ (Lagash), కిష్ (Kish), ఉరూక్ (Uruk), ఊర్ (Ur) నగర రాజ్యాలను పేర్కొనవచ్చు. వైశాల్యంలో, జనాభాలో ఈ నగరాలకు, నవీన శిలాయుగ స్థావరాలకు ఎంతో వ్యత్యాసముంది. ఊర్ నగరం సుమారు 60 హెక్టార్ల స్థలంలో 24,000 మంది ప్రజలకు నివాసంగా ఉండేదని అంచనా. కిష్ జన సంఖ్య 19,000 అని, ఉమ్మా జన సంఖ్య 16,000 అని ఊహించారు. ఈ నగరాలు ఒక దానితో ఒకటి, నిరంతరం పోట్లాడుకుంటూ ఉండేవి. ఈ పోట్లాటల వల్ల ఏర్పడిన యుద్ధాలను నడపడానికి కలిగిన అవసరం కూడా, ఈ రాజ్య వ్యవస్థ ఏర్పడటానికి మూలకారణమై ఉండవచ్చు.

రాజ్యాధిపత్యం ఏర్పడిన తర్వాత రాజులకు, సంపన్నులకు విలాస వస్తువులను సమకూర్చటం, సైన్యాలకు ఆయుధాలను తయారుచేయటం, వృత్తికారులు చేపట్టిన నూతన కార్యక్రమాలై, వృత్తులు అభివృద్ధి చెందసాగాయి. అందుకు నిదర్శనంగా, రాజ్యాధిపత్యాలు ఏర్పడినప్పటినుండే కంచు వస్తువులు ఎక్కువగా వాడుకలోకి వచ్చాయి. కాబట్టి, కాంస్య యుగ నాగరికత క్రీ.పూ. 3000 నుండి ఆరంభమయిందని భావిస్తున్నారు.

సూమర్‌లో వలెనే, ఈజిప్ట్, భారత దేశాలలో కూడా ఆ తర్వాత కొద్ది కాలంలోనే కాంస్య యుగ నాగరికతలు రూపొందాయి. అనాది నుండి ఈజిప్ట్‌లో వేర్వేరు భాగాలు వేర్వేరు తెగల అధీనంలో ఉండేవి. సూమర్ లోని నగర రాజ్యాల వలెనే, ఇవి కూడా నిరంతర కలహాలలో మునిగి ఉండేవి. ఈజిప్ట్‌లో క్రీ.పూ. 4వ సహస్రాబ్ది ఉత్తరార్ధం నుండి నాగరికతా చిహ్నాలు వ్యక్తమవుతూ వచ్చాయి. లోహ పరికరాల వాడుక హెచ్చింది. సముద్రం మీదుగా దూర ప్రాంతాలతో వ్యాపారం సాగుతూ ఉండేది. సమాధులలో విలువైన వస్తువులను ఉంచేవారు. సమాజంలో ఆర్థిక పటిష్టత పెంపొందుతున్నదనడానికి, ఇవన్నీ నిదర్శనాలు. సూమర్‌లో వలె గాక, కాంస్య యుగారంభంలోనే ఈజిప్ట్ కంతా ఒకే రాజ్య వ్యవస్థ ఏర్పడింది. ఈజిప్ట్‌లో రాజకీయ ఏకత్వం వల్ల సాంస్కృతిక సమానత్వం ఏర్పడింది. సూమర్‌లో రాజకీయ భిన్నత్వమున్నప్పటికీ, సాంస్కృతిక ఏకత్వానికి భంగం వాటిల్ల లేదు.

భారతదేశంలోని సింధు నదీ లోయ కూడా విశిష్టమైన కాంస్య యుగ నాగరికతకు కేంద్ర స్థానంగా రూపొందింది. ఈ విశిష్టమైన నాగరికత మొదట మొహంజొదారో, హరప్పాలలో జరిపిన తవ్వకాల మూలంగా బయటపడింది. ఆ తర్వాత జరిగిన ఖననాల ఫలితంగా, ఈ నాగరికతా స్థావరాలనేకం భారత దేశంలోని ఇతర ప్రాంతాలలో కూడా బయటపడ్డాయి. హరప్పా సంస్కృతీ విస్తరణ ప్రదేశం 1,299,600 చ.కిలోమీటర్లను ఆక్రమించింది; ఇది ఈజిప్ట్, మెసపటోమియా నాగరికతల విస్తరణ ప్రదేశాలకన్నా, చాలా అధికం. క్రీ.పూ. మూడవ, రెండవ సహస్రాబ్దులలో ఇంత విస్తారమైన ప్రదేశాన్ని ఆక్రమించిన సంస్కృతీ మండలం మరొకటి లేదు.

సింధులోయ నాగరికతలో సూమర్, ఈజిప్ట్ నాగరికతల కంటే భిన్నమయిన కొన్ని విశిష్ట లక్షణాలున్నాయి. ఈ విశిష్ట లక్షణాలు కట్టడాలు, లోహ పరికరాలు, కుండలు, ముద్రలు, లిపి మొదలయిన అంశాలలో కనపడుతున్నాయి. వీరు సూమర్‌తో వ్యాపారం చేశారు. సింధు లోయను, క్రీ.పూ. 2350 నాటి, అటు తర్వాతి మెసపటోమియా వృత్తాంతాలు 'మెలూహా' అని పిలిచాయి. సింధు నాగరికతావాసులు సముద్ర వ్యాపారం కూడా చేశారనడానికి నిదర్శనంగా, గుజరాత్ లోని లోథాల్ వద్ద వీరి నౌకాశ్రయం ఒకటి బయటపడింది. సూమర్‌లో, ఈజిప్ట్‌లో దేవాలయాలు, రాజప్రాసాదాలు

బయటపడ్డాయి. నేటి వరకు బయల్పడ్డ సింధు స్థావరాలలో ఎక్కడా దేవాలయమనిగాని, రాజప్రాసాదమని కాని పేర్కొనదగ్గ కట్టడం కనపడలేదు. కాని, వీరు నిర్మించిన కోటలు, ధాన్యాగారాలు, తీర్చిదిద్దినట్లున్న వీరి నగరాలు, నీటిపారుదల ఏర్పాట్లు, ఏదో ఒక రాజ్య వ్యవస్థ ఉండినట్లు సూచిస్తాయి. హరప్పా సంస్కృతీ మండలమంతా ఒకే రాజ్య మండలంగా ఉండి ఉంటే, భారతదేశంలో, మౌర్య సామ్రాజ్యం ఏర్పడేదాక, ఇంత పెద్ద రాజ్యం మరేదీ లేదు. కాని ఈ రాజ్య వ్యవస్థ స్వరూపాన్ని గురించి చెప్పడానికి మనకెలాంటి ఆధారాలు లభించలేదు. ఒక్క విషయం మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చు. సింధు లోయలో ఈజిప్ట్, సూమర్‌ల కన్నా, సాంఘిక సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యం ఉండేది. సింధు నగరాలు చాలా పెద్దవి. మొహంజొదారో విస్తీర్ణం 8,50,000 చ.మీ., జన సంఖ్య 30-40 వేల మధ్య ఉండవచ్చనీ, అట్లే హరప్పా విస్తీర్ణం 8,50,000 చ.మీ., దాని జన సంఖ్య 24-35 వేల మధ్య ఉండవచ్చనీ, పురావస్తు శాస్త్రజ్ఞులు అంచనాలను వేశారు.

రాజ్య వ్యవస్థ ఏర్పడినప్పుడు అది చట్టాలను చేయవలసి ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలలో లెక్కలను రాయవలసి ఉంటుంది. న్యాయ నిర్ణయాలను నమోదు చేయవలసి ఉంటుంది; ప్రజలకు అనేక సందేశాలు, శాసనాలను ఎరుక పర్చాల్సుంటుంది. ఈ రాజ్య వ్యవహార నిర్వహణకంతా ఏదో ఒక రూపంలో లిపి జ్ఞానం, రాత తెలిసి ఉండాలి. లిపి జ్ఞానమే చారిత్రక యుగ ప్రారంభానికి సంకేతం. పైన పేర్కొన్న నాగరికతలన్నీ ఏదో ఒక లిపి జ్ఞానాన్ని కలిగి ఉన్నాయి. ఈ నాగరికతల లోని లిపి జ్ఞానాన్ని గురించి, వాటి ఇతర ప్రత్యేక లక్షణాలను గురించి, కింది ఖండికలలో విపులంగా చర్చించడం జరిగింది.

## 2.3 అయో యుగం

కాంస్య యుగ నాగరికతలన్నీ ప్రపంచంలోని తూర్పు భాగంలో, ప్రధానంగా ఆసియా ఖండంలో వెలసి, వర్ధిల్లాయి. ఈ నాగరికతలంతా వర్ధిల్లుతున్న కాలంలో, పాశ్చాత్య ప్రపంచంలో చెప్పుకోతగ్గ నాగరికతలేవీ ఇంకా రూపొందలేదు. క్రీ.పూ. మొదటి సహస్రాబ్దితో ప్రారంభించి, మధ్యధరా సముద్రాన్ని వెంబడించి, చుట్టూ ఉన్న ప్రదేశాలలో నాగరికతలు ఆవిర్భవించి, త్వరితగతిలో అభివృద్ధి చెందాయి.

కాంస్య యుగ నాగరికతలన్నీ, వ్యవసాయం చేయటానికిగాను పెద్ద ఎత్తున అడవులను నరికి భూమిని సాగులోనికి తెచ్చుకోవలసిన అవసరం లేక, సులభంగా వ్యవసాయానికి అనువైన నదీ తీర భూములలో వర్ధిల్లాయి. కాంస్య యుగ నాగరికతల తర్వాత, ఇనుమును, దాని ఉపయోగాలను కనుక్కోవడంతో, మానవ నాగరికతలో మరో పురోభివృద్ధి కలిగింది. మానవ నాగరికతా పురోగతిలో, ఇనుము వాడకం ప్రారంభమై వృద్ధి చెందిన కాలాన్ని, అయో యుగమని పిలిచారు. ఆ కాలంలో వర్ధిల్లిన నాగరికతలను అయో యుగ నాగరికతలని పిలిచారు. అయస్ అంటే సంస్కృత భాషలో ఇనుము.

### 2.3.1 ఇనుము సాంకేతిక పరిజ్ఞాన విస్తరణ : ఫలితాలు

ప్రపంచంలో విస్తారంగా లభించే లోహాలలో ఇనుము ఒకటి. రాగి కంటె, కంచు కంటె గట్టి లోహం ఇనుము. రాగి ఏ కొద్ది ప్రదేశాలలోనే లభించే అరుదైన లోహం; అందువల్ల ఇనుము కంటే ఖరీదైన లోహం. ఇనుము, దాని ఉపయోగాలను కనుక్కోవడంతో, దానితో నాగలి కర్రులు, కొడవళ్లు, పారలు, మొదలుగా వివిధాలైన వ్యావసాయిక పనిముట్లను పెద్ద ఎత్తున తయారు చేయడం సాధ్యమయింది. ఇనుముతో చేసిన గొడ్డళ్లతో అడవులను తేలికగా నరికి, అక్కడి భూములను సాగులోనికి తేవడం సులభ సాధ్యమయింది. వ్యవసాయమే గాక, అనేక ఇతర వృత్తులలో ప్రత్యేక నైపుణ్యంతో కూడిన పనులను చేయడానికి, అనేక రకాలైన పరికరాలు, పనిముట్లను ఇనుముతో రూపొందించారు. అయో యుగ నాగరికతా ప్రదేశాలలో పురాతత్త్వ శాస్త్రజ్ఞులు సుత్తెలు, సమ్మెటలు, పట్టకారులు, చీలలు, ఉలులు, రంపాలు మొదలైన అనేక విధాలైన పనిముట్లను కనుక్కొన్నారు. ఈ పనిముట్లన్నీ రకరకాల ఉపయోగాలకు పనికివచ్చేవి. యుద్ధాలలో ఇనుప ఆయుధాల ప్రాముఖ్యం ఎనలేనిది.



BRAOU

ఇనుము ఉపయోగాలను అవగతం చేసుకొని, మానవులు తమ అవసరాలకు దానిని వాడుకోవటంలో చాలా జాప్యం జరిగింది. ఇనుమును కరిగించి వస్తువులుగా తయారుచేయడం క్లిష్టతరం కావడమే, దీనికి కారణమని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. ఇనుము వాడకం మొదటగా ఐరోపాలో ప్రారంభమయిందని ఒకప్పుడు శాస్త్రజ్ఞులు అభిప్రాయపడ్డారు. కాని, పురావస్తు పరిశోధనలు అయో యుగం కూడా, కాంస్య యుగం వలె, మొదటగా పశ్చిమ ఆసియాలోనే ప్రారంభమయిందని రుజువు చేశాయి.

ఇనుము, రాగి వలెనే, ప్రకృతిలో లోహ రూపంగా లభ్యం కాదు. అందువల్ల, దానిని ఖనిజం నుండి వేరు చేసి, సంపాదించుకోవాలి. అప్పుడప్పుడు ఆకాశం నుండి పడే ఉల్కలలో ఇనుము ఉంటుంది. ఈ ఉల్కల నుండి వేరు చేసిన ఇనుప ముక్కలతో తయారుచేసిన కొన్ని చిన్న వస్తువులు, క్రీ.పూ. 3వ సహస్రాబ్దం నుండి ఈజిప్టులో, మెసపటోమియాలో కనబడుతున్నాయి. మూడవ సహస్రాబ్దం అంతం కావడానికి పూర్వమే, మానవుడు తయారు చేసిన ఇనుముకు నిదర్శనాలు కొద్దిగా కనపడ్డాయి. అయితే, అప్పుడు తయారుచేసిన వస్తువులు సూదులు, పూసల వంటి చిన్న వస్తువులు. దీనినిబట్టి, సరి అయిన పద్ధతులలో ఇనుమును తయారు చేయడం, దాని వివిధ ఉపయోగాలు ఇంకా అవగాహన కాలేదని స్పష్టమవుతుంది.

క్రీ.పూ. 1400 నాటికిగాని, మానవులకు ఇనుమును కరగించడం, దాని ఉపయోగంలోని రహస్యాలు తెలియలేదు. నాటికి ఇనుప వస్తువుల సంఖ్య కొంచెం పెరగడమేగాక, కత్తులు, బాకులు వంటి కొన్ని పెద్ద వస్తువులను కూడా తయారుచేయగలిగారు. అయినా, క్రీ.పూ. 12వ శతాబ్దం వరకు ఉత్పత్తి అయిన ఇనుప వస్తువుల రాశి, అతి స్వల్పం. అప్పటి వరకు ఇనుము ఎక్కువగా వాడుకలోనికి రాలేదని, దీనిని బట్టి స్పష్టమవుతుంది. క్రీ.పూ. 12-11 శతాబ్దాల నుండి వివిధాలైన ఇనుప వస్తువులు ఎక్కువ సంఖ్యలో లభిస్తున్నాయి. దీనితోపాటు, పాలస్తీనాలో గేజెర్ (Gezer) అనే చోట, ఖనిజాన్ని కరిగించి ఇనుమును ఉత్పత్తి చేసే కొలుములను కూడా కనుక్కొన్నారు. ఈ కారణాల వల్ల, పశ్చిమ ఆసియాలో క్రీ.పూ. 12-11 శతాబ్దాల నుండి అయో యుగం ఆరంభమయిందని భావించారు. ఈ ఇనుప లోహకార సాంకేతిక జ్ఞానాన్ని పెంపొందించినవారు, అనటోలియా (ఆసియా మైనర్)లో ఉండిన హిట్టైట్ జాతివారని అంటారు.

క్రీ.పూ. రెండవ సహస్రాబ్ది ప్రారంభంలో కొన్ని కొత్త తెగలు పశ్చిమ ఆసియాకు వలసవచ్చి, రాజ్యాలను స్థాపించాయి. వీరిలో ప్రముఖులు అనటోలియాను పాలించిన హిట్టైట్ ప్రభువులు, మెసపటోమియా ఉత్తర భాగాన్ని పాలించిన మిటాణి ప్రభువులు, బాబిలోనియాను పాలించిన కెస్సైట్ ప్రభువులు. ఈ కొత్త తెగల వారు 'ఇండో-యూరోపియన్లు'; అంటే ఆర్యజాతివారు. ఈ ఆర్య రాజ్యాలలో మిటాణి క్రీ.పూ. 14 వ శతాబ్దపు మధ్యభాగంలో అంతరించింది. కెస్సైటులు, హిట్టైటులు క్రీ.పూ. 1200 వరకు పాలించారు. ఈ ఇండో యూరోపియన్ తెగల రాకతోపాటు, పశ్చిమ ఆసియాలో ఇనుము బాగా వాడుకలోకి వచ్చింది. కాని, వీరి రాకకు అయోయుగ ఆరంభానికి సంబంధం ఎటువంటిదో సరిగా నిర్ధారణ కాలేదు.

క్రీ.పూ. 12-11 శతాబ్దాలలో ఆరంభమైన ఇనుము పరిశ్రమ త్వరలోనే మిగతా ప్రాంతాలకు కూడా విస్తరించింది. ఇరాన్‌లో క్రీ.పూ. 10వ శతాబ్దం నుండే ఇనుప వస్తువులు అధిక సంఖ్యలో కనబడుతూ ఉండటం వల్ల, అప్పటి నుండి అక్కడ అయో యుగం ప్రారంభమయిందని ఊహించారు. క్రీ.పూ. 8, 7 శతాబ్దాల నుండి కాని, ఈజిప్టులో ఇనుము అధికంగా వాడుకలోనికి రాలేదు. క్రీ.పూ. 500 నాటికి ఐరోపాలోని అధికభాగంలో ఇనుము వాడకం వ్యాప్తి చెందింది.

భారతదేశంలో అయోయుగం క్రీ.పూ. 1000 ప్రాంతంలో ప్రారంభమయింది. ఈ కాలంలో ఆర్యులు గంగా-యమునా అంతర్వేదిలో స్థిరపడటం ప్రారంభమయింది. మలి వేద వాఙ్మయం ఇనుమును శ్యామ్ లేక కృష్ణ అయస్ అని పేర్కొంది. గంగా మైదానాలలోని దట్టమైన అడవులను వారు ఇనుప పనిముట్లతో ఛేదించి, ఇనుప కర్రు ఉన్న నాగలితో అక్కడి గట్టి నేలలను దున్ని, భూములను వ్యవసాయ యోగ్యం చేసి, ఆర్యులు అక్కడ స్థిరపడ్డారని పురాతత్త్వ శాస్త్రజ్ఞులు చెబుతారు. అయితే, అయో యుగ ప్రారంభ దశలో వ్యవసాయానికి సంబంధించిన ఇనుప పనిముట్లు

ఎక్కువగా లభించలేదు; లభించిన ఇనుప వస్తువులు పరిణతినందిన సంస్కృతిని సూచించవు. క్రీ.పూ. 500 నాటికి గంగా-యమున లోయలో అనేక నగరాలు వెలసి, అవి కేంద్రాలుగా అనేక రాజ్యాలు ఏర్పడ్డాయి. ఇట్లా ఏర్పడిన ప్రముఖమైన పదహారు రాజ్యాలను షోడశ మహాజనపదాలని చరిత్రకారులు పేర్కొన్నారు.

ఇనుము విస్తారంగా లభించే లోహం కావడం వల్ల, దానితో చేసిన వస్తువులు, కంచు వస్తువుల వలెగాక, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేవి. ప్రారంభంలో అన్ని దేశాలలోను ఇనుమును ఎక్కువగా ఆయుధాలు తయారు చేయటానికి, సైనిక అవసరాలకు ఉపయోగించేవారు. కాలక్రమంలో ఇనుప పనిముట్లు విస్తృతంగాను, చౌకగాను లభించటంవల్ల, సామాన్యులు కూడా వాటిని వాడి, వ్యవసాయ పద్ధతులలో మార్పులను సాధించారు. భూమిని లోతుగా త్రవ్వటానికి, చదును చేయటానికి, దున్నటానికి ఇనుప పనిముట్లు చక్కగా ఉపయోగపడ్డాయి. ఇనుప పనిముట్ల సహాయంతో ఎక్కువ భూమి సాగులోనికి వచ్చి, వ్యవసాయం మరింత విస్తృతమయింది. కాంస్య యుగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వర్తకులు, రాజులు, రాజ కుటుంబీకులు, వృత్తి పనులవారు, చేతి పనులవారు మాత్రమే గుత్తాధిపత్యంగా వినియోగించుకొనేవారు. అయో యుగంలో సామాన్యుడు ఇనుప లోహ పరిజ్ఞానాన్ని వాడుకోవటం ప్రారంభించాడు.

## 2.3.2 అయో యుగం : రాజ్యాలు, సామ్రాజ్యాలు, నగరాలు

రాజులు తమ సైన్యాలకు సమృద్ధిగా ఆయుధాలను సమకూర్చుకోవటానికి, ఇనుప లోహ పరిజ్ఞానం వీలు కల్పించింది. ఇనుము వాడుకలోనికి వచ్చిన తర్వాత, అత్యధికంగా తయారు చేసిన వస్తువులు ఆయుధాలే. పాలకుల రాజ్య విస్తరణ కోసం చేసిన దండయాత్రలకు ఈ ఆయుధాలు తోడ్పడి, విశాల సామ్రాజ్యాల నిర్మాణం జరిగింది. పర్షియన్ చక్రవర్తులైన సైరస్ (Cyrus), మూడవ డేరియస్ (Darius III) నిర్మించిన సామ్రాజ్యం, కాంస్య యుగం నాటి రాజ్యాలకన్నా అతి విస్తారమయింది. అది తూర్పున సింధు లోయ నుండి పడమట మధ్యధరా సముద్రం దాటి, విస్తరించింది. భారతదేశంలో దీనికి సాటి రాగలది, మౌర్యులనాటి మగధ సామ్రాజ్యం. అది అఖండ భారతదేశ అవధులను దాటి, ఆఫ్ఘనిస్థాన్, పర్షియాలలోనికి విస్తరించింది. కాంస్య యుగంలో ఇంత పెద్ద రాజ్యాల నిర్మాణం సాధ్యం కాదు.

BRAOU

రాజ్యాలు విస్తరించడంతోపాటు, రవాణా సౌకర్యాలు కూడా విస్తరించాయి. పర్షియన్లు ఆసియా మైనర్‌లోని సార్డిస్ నుండి, పర్షియాలోని పెర్సిపోలిస్ (Persepolis) వరకు, 2833 కిలోమీటర్ల రహదారిని నిర్మించారు. భారతదేశంలో కూడా నాడు ప్రధాన నగరాలను కలుపుతూ రహదారులున్నట్లు, బౌద్ధ వాఙ్మయం వల్ల తెలుస్తూంది. ఈ రహదారుల వెంబడి సైన్యాలేగాక, వ్యాపారుల బిడారులు కూడా ప్రయాణం చేస్తుండేవి. వాణిజ్యం అభివృద్ధి కావడంతో, నాణేల అవసరం ఏర్పడింది. నాణేల తయారీ, వర్తక వ్యవహారాలను సులభంగా నిర్వహించటానికి అనుకూలాన్ని కల్పించింది. అనాది నుండి ఉన్న వస్తు వినిమయ లేదా మార్పిడి పద్ధతిలో అనేక కష్ట నిష్ఠూరాలు ఉండేవి. గ్రీక్ ఆధారాలను బట్టి, ఆసియా మైనర్‌లో లిడియన్లు (Lydians) క్రీ.పూ. 8వ శతాబ్దంలో నాణేలను మొదటగా వాడినట్లు తెలుస్తుంది. మన దేశంలో క్రీ.పూ. 4వ శతాబ్దంలో, మౌర్యుల కాలం నుండి నాణేలు వాడుకలో ఉన్నాయి.

ఇనుము వల్ల వ్యాపార, వ్యవసాయాలు అభివృద్ధి చెందడమే కాక, ఎన్నో అనుబంధ వృత్తులు, పరిశ్రమలు రూపొందాయి. అయో యుగం నాటి నగరాలు, కాంస్య యుగం నాటి నగరాలకన్నా, ఎన్నో రెట్లు పెద్దవి. 60 హెక్టార్ల విస్తీర్ణమున్న ఊర్ (Ur) నగరాన్ని, కాంస్య యుగంలోని అతి పెద్ద నగరంగా భావించారు. భారతదేశంలోని కాంస్య యుగ నాగరికత అయిన సింధు లోయ నాగరికత లోని పెద్ద నగరాలైన మొహంజొదారో, హరప్పాల వైశాల్యం, వేర్వేరుగా 8,50,000 చదరపు మీటర్లని అంచనా వేశారు. కాని, క్రీ.పూ. 7వ శతాబ్దం నాటి నినివె (Nineveh) నగరం విస్తీర్ణం దాదాపు 700 హెక్టార్లు. మెగస్తనీస్ రాతలను బట్టి, మౌర్య సామ్రాజ్య రాజధాని అయిన పాటలీపుత్రం నినెవె కంటె పెద్ద నగరమని భావించాలి.

## 2.4 సంగ్రహంగా

కాంస్య (కంచు) యుగంలో ఏర్పడిన 'నగర విప్లవం'తో, మానవ పరిణామ ప్రగతిలో చారిత్రక యుగోదయం ప్రారంభమయింది. కంచు సాంకేతిక పరిజ్ఞాన ప్రవేశం వల్ల, ఈ నగర విప్లవం ఏర్పడింది. కాంస్య యుగంతో ప్రారంభించే మానవ సమాజాలలో లిపి జ్ఞానం మొదలయింది.

మెసపటోమియాలో జరిగిన కొన్ని విప్లవాత్మక సంఘటనలు, అక్కడ మొదటగా కాంస్య యుగ నాగరికత రూపొందడానికి కారణమయ్యాయి. చారిత్రక, సాంస్కృతిక, సాంఘిక తదితర రంగాలలో మానవుడు సాధించిన ప్రగతిని తెలుసుకోవటానికి, కాంస్య యుగ చరిత్ర నేపథ్యంగా ఉపయోగపడుతుంది.

ఇండో - ఐరోపీయ జాతులు ఐరోపా, ఆసియా ఖండాలలో ఇనుము సాంకేతిక పరిజ్ఞాన వ్యాప్తికి కారకులయ్యారు. ఇనుము సాంకేతిక పరిజ్ఞానం టైగ్రిస్, యూఫ్రటీస్ నదుల, నైల్ నదీ పరీవాహక ప్రాంతాలలో ప్రవేశపెట్టబడి, భారతదేశంలో సింధూ, గంగా నదుల పరీవాహక ప్రదేశాల వైపు పయనించింది. ఇనుము సాంకేతిక పరిజ్ఞానం సామ్రాజ్యాలను నిర్మించటానికి దోహదం చేసింది; రెండవసారి నగర విప్లవానికి దోహదం చేసింది.

## 2.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. కాంస్య యుగ నాగరికతలలోని సామాన్య లక్షణాలను పేర్కొనండి.

2. ఇనుము సాంకేతిక పరిజ్ఞాన విస్తరణ ఫలితాలను పరిశీలించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. నగర విప్లవాన్ని గురించి తెలపండి.

2. వివిధ కాంస్య యుగ నాగరికతలను పరిశీలించండి.

3. అయో యుగపు రాజకీయ, ఆర్థిక పరిణామాలను విశ్లేషించండి.

BRAOU

## 2.6 ఉపయుక్త గ్రంథాలు


Allichin.R & Allichin.B : **The Rise of Civilization in India and Pakistan,** 1983.

Child, Gordon.V : **New Light on the Most Ancient East,** 1958; **What Happened in History ?**

Doon. Eric Von : **The Story of Civilization**

Hawkes, Jacquetta : **History of Mankind**

Mellart, James : **Earliest Civilizations of the Near East,** 1965

Sankalia, H.D. : **Pre-history and Proto-history in India and Pakistan (New Edition),** Poona, 1973.

Subba Rao. B : **The Personality of India,** Baroda, 1958.

Subrahmanyam, B.R. : **"Puravastu Sastramu" (Telugu),** Hyderabad.

# ఖండం-II : మెసపటోమియా

ఈ ఖండంలో ప్రపంచ నాగరికతలలో అతి ప్రాచీనమైన, ప్రముఖమైన మెసపటోమియా నాగరికతను గురించిన వివరాలు పొందుపరచడమైనది. దీనిలో 3, 4, 5, 6 భాగాలున్నాయి. మూడో భాగంలో నాగరికతా ఆవిర్భావం, నాగరికతా సాధారణ లక్షణాలను వివరించడం జరిగింది. నాలుగో భాగంలో నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను గురించిన వివరణను పొందుపరచడమైంది. అంతేకాక, ఈ నాగరికత వివిధ పరిణామ దశలలో వచ్చిన మార్పులను గురించి కూడా తెలపడమైంది. ఐదో భాగంలో ఆనాటి వారి మత చింతనలు, తత్త్వ వివేచనలను ప్రస్తావించడం జరిగింది. ఆఖరిదైన ఆరో భాగంలో, నాటి నాగరికతా కాలంలో వికసించిన కళలు, శాస్త్ర విజ్ఞానాన్ని వివరంగా తెలపడం జరిగింది. మెసపటోమియా నాగరికతలోని ప్రముఖ విశేషాలన్నింటినీ పాఠకునికి తెలియజేయడమే, ఈ ఖండ లక్ష్యం.

BRAOU

BRAOU

# భాగం -3 : మెసపటోమియా నాగరికతా లక్షణాలు

విషయక్రమం


3.0 లక్ష్యాలు

3.1 పరిచయం

3.2 నదీలోయల ప్రాముఖ్యం

3.3 ప్రాచీన నాగరికతా సర్వసాధారణ లక్షణాలు

3.4 మెసపటోమియా నాగరికత - ఉనికి

3.5 నాగరికతావిర్భావం - వివిధ దశలు

3.6 నాగరికత సుసంపన్నత

3.7 సంగ్రహంగా

3.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

3.9 ఉపయుక్త గ్రంథాలు


## 3.0 లక్ష్యాలు

ప్రాచీన నాగరికతలలో ప్రథమమూ, సుసంపన్నమూ అయిన నాగరికతగా మెసపటోమియాను అభివర్ణిస్తారు. మెసపటోమియా అనే భౌగోళిక ప్రాంతంలో, వివిధ కాలాల్లో, వివిధ దశలుగా, భిన్న నామాలతో ఈ సంస్కృతి మొగ్గ తొడిగి వికసించింది. ఈ నాగరికత ఏ రీతిగా నదీలోయల్లో ఆవిర్భవించిందీ, విస్తరించిందీ, దీని సర్వ సాధారణ లక్షణాలను, ఈ భాగాన్ని అధ్యయనం చేయడం వల్ల తెలుసుకోగలగాలి.

## 3.1 పరిచయం

ఆది మానవుడు ఆవిర్భవించి పది లక్షల సంవత్సరాలు అయినట్లుగా భూవిజ్ఞాన శాస్త్రజ్ఞుల అంచనా. జీవి పరిణామం నెమ్మదిగా సాగింది. తొలి మానవుడు ప్రప్రథమంగా ఆఫ్రికా ఖండంలో జన్మించాడని, క్రమేణా ఆసియా, ఐరోపా, అమెరికా ఖండాలకు తరలి వెళ్ళాడని, పలువురి శాస్త్రజ్ఞుల అభిప్రాయం. ప్రాక్ చరిత్ర (Pre-history) క్రీ.పూ. 5 లక్షల సంవత్సరాల నుండి సుమారు 50 వేల సంవత్సరాలకు సాగినట్లు భావన. చారిత్రక యుగాన్ని తిరిగి ప్రాచీన, నవీన శిలాయుగాలు (Paleolithic and Neolithic)గా విభజించారు. నవీన శిలా యుగం నాడు ప్రారంభమైన నాగరికతా వికాసం, లోహ యుగ కాలంలో పతాక స్థాయి చేరింది. ఈ కాలంలోనే నదీ లోయ ప్రాంతాలలో అత్యద్భుతమైన నాగరికతలు ఆవిర్భవించాయి.

సంస్కృతి మానవుల జీవన స్రవంతిని ప్రతిబింబిస్తుంది. సంస్కృతి, నాగరికత అనే పదాలు ప్రత్యామ్నాయంగా వాడటం కద్దు. నాగరికత అంటే నగరంలో నివసించే సమాజమని పద వ్యుత్పత్తిని బట్టి చెప్పబడినా, వేటగాని జీవనం, వ్యావసాయిక జీవనం, ఆ జీవిత గమనంలో వారు చేసే వినూత్న ప్రయోగాలు కూడా నాగరికతలో అంతర్భాగాలే. భాష,



BRAOU

మతం, జీవన విధానం, రాజకీయ వ్యవస్థలు, నీతి సూత్రాలు, కళలు మొదలైనవి నాగరికతలో అంతర్భాగాలే. లిపి పుట్టుకతోనే నాగరికత ఆవిర్భవించిందని ప్రసిద్ధ పురాతత్వ శాస్త్రజ్ఞుడు గార్డన్ చైల్డ్ (Gordan Childe) అభిప్రాయపడ్డాడు. రాత నేర్చుకొన్న తరువాతనే తదితర విజ్ఞాన శాస్త్రాలు అభివృద్ధి చెందాయి. "మానవుడు పొందని స్వానుభవాన్ని, విజ్ఞానాన్ని, ఇతరులకు చెప్పడానికి భాష సాధనంగా ఉపయోగపడింది."

కంచు, ఇనుము మొదలైన లోహాల వాడకంలో ప్రాచీన కాలం నాటి ప్రప్రథమ నాగరికతలు రూపుదిద్దుకొన్నాయి. కొత్త రాతి యుగంలో వ్యవసాయం ఒక పద్ధతి ప్రకారం కొనసాగింది. దీనిలో మానవుని నాగరికత ఒక ముఖ్య ఘట్టం చేరుకుంది. స్థిర నివాసం, మెరుగైన పనిముట్ల తయారీ, సంగ్రహించిన సాంకేతిక పరిజ్ఞానం వల్ల నాగరికత మరో అడుగు ముందుకు వేసి, సాముదాయక జీవనం, సామాజిక ఆర్థిక వ్యవస్థ, నగరాల ఆవిర్భావం జరిగింది. క్రీ.పూ. 4000 సంవత్సరాల నుండి ఈ ప్రాచీన నాగరికతలు రూపురేఖలు సంతరించుకొని, అనేక చోట్ల ప్రముఖ నదీలోయ ప్రాంతాల్లో అందాలు దిద్దుకొని, పలువురిని ఆకట్టుకొన్నాయి.

## 3.2 నదీ లోయల ప్రాముఖ్యత

ప్రాచీన నాగరికతలన్నీ నదీలోయల వడిలోనే రూపుదిద్దుకొన్నాయి. ఆ ప్రాంతాల్లో నాగరికతా ఆవిర్భావానికి, వికాసానికి అనుకూలించే అన్ని సదుపాయాలు ఉండటమే, దీనికి ముఖ్యకారణం. సారవంతమైన భూమి బంగారు పంటలు పండించగా, వరద నీరు ప్రతి ఏడాది కొత్త ఒండ్రు మట్టిని చేర్చింది. తనకు, తన పొలాలకు, పశు సంపదకు, పచ్చిక బయళ్ళకు కావలసిన నీరు పుష్కలంగా లభించేది. నీటి వనరుల వినియోగంలో ఆనకట్టలు కట్టడం, కాలువలు త్రవ్వడం, వరద నీరు ఆగిన తరవాత భూములను సరిచేసుకోడంలో వారు సామూహికంగా పనిచేయడం జరిగేది. వ్యవసాయంలో వినూత్న ప్రయోగాలు జరిగాయి. కొద్దికాలం తరువాత నదులను రవాణా సౌకర్యాలకు వినియోగించడం ఆరంభమైంది. పడవలను నిర్మించుకొని, నదుల ద్వారా వస్తువులను, మనుషులను రవాణా చేయడం నేర్చుకొన్నారు. నదులు ప్రకృతి సిద్ధమైన రహదారులుగా రూపొందాయి. మానవ బృందాలు నదీలోయ ప్రాంతాల్లో స్థిర జీవనం ప్రారంభించగా, సమాజాలు ఏర్పడ్డాయి.

సమాజ జీవన ప్రారంభంలో నాగరికతలో ప్రముఖమైన మార్పులు వచ్చాయి. సంచార జాతుల నుండి తమ కుటుంబాలను, ఆస్తులను కాపాడుకోవాల్సి వచ్చింది. ఆది మానవుడు తన కాలాన్ని యావత్తు ఆహార సేకరణలో గడుపవలసి వచ్చింది. కాని, నదీ లోయల్లో పంటలు పుష్కలంగా పండటంతో, ప్రజలకు కొంత తీరిక సమయం లభ్యమైంది. అంతేకాక, అందరూ ఆహారోత్పత్తిలో నిమగ్నం కావలసిన అవసరం లేదు. కొందరు నూతన విషయాలను తెలుసుకోవడంతో, విజ్ఞానాభివృద్ధిలో కృషి చేశారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. గణితం, లోహాల వాడకం, గృహ నిర్మాణం తదితర రంగాలలో ప్రగతిని సాధించడం జరిగింది. వర్తక వ్యాపారాలు పెరిగాయి. వస్తువుల మార్పిడి కోసం ఇతర సామాజిక వ్యవస్థలతో సంబంధాలు ఏర్పడ్డాయి. తీరిక సమయంలో వివిధ కళలను అధ్యయనం చేయడం జరిగింది. వాస్తు శాస్త్రం, శిల్పం, చిత్రలేఖనం, సంగీతం మొదలైన లలిత కళల అభ్యాసానికి, అభ్యుదయానికి అవకాశం ఏర్పడింది.

లోహ ఖనిజాలను కనుక్కొని, వాటిని సరి అయిన పద్ధతిలో రూపొందించి వాడుకోవడం ప్రారంభం కావడంతో, మానవ నాగరికత మరో మలుపు తిరిగింది. ఆయుధాలను, పరికరాలను, తయారుచేసుకోడానికి ఈ లోహాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. రాగి ప్రథమంలో వాడుకోడానికి వచ్చింది. క్రీ.పూ. 5 వేల సంవత్సరాల నుండి రాగి పరికరాల ఉపయోగం ప్రారంభమైంది. రాగిని తగరంతో, లేదా జింక్‌తో కలిపి, కంచును తయారు చేసేవారు. కంచుతో చేసిన పరికరాలు దృఢంగా ఉండేవి. ఈ లోహాలతో తయారు చేసిన నాగళ్ళు వ్యవసాయాభివృద్ధికి తోడ్పడగా, కంచు పరికరాలు కమ్మరి పనికి బాగా ఉపకరించాయి. లోహాల పనిముట్లను తయారు చేయడం, వాటిలో మార్పులు,

B R A O U

చెర్పులు చేయడం, అవసరాల కనుగుణంగా వానిని రూపుదిద్దడంలో ఒక ప్రత్యేక సాంకేతిక పనివర్గం ఏర్పడింది. లోహాల వాడుకతో, నాగరికతా వ్యాప్తి మూడు పూవులు ఆరుకాయలుగా విస్తరిల్లింది. అందువల్లనే, ప్రాచీన నాగరికతలను, 'కంచు యుగపు నాగరికతలు'గా వ్యవహరిస్తారు.

## 3.3 ప్రాచీన నాగరికతల సర్వసాధారణ లక్షణాలు

1. ఈ నాగరికతలన్నీ నదీలోయ ప్రాంతాల్లోనే ఆవిర్భవించి, రూపుదిద్దుకొన్నాయి. క్రీ.పూ. 3000-2500 నాటికల్లా, మధ్యధరా సముద్ర ప్రాంతంలో ఇరాన్ లోని టైగ్రిస్, యూఫ్రటిస్, (Tigris, Euphrates) నదీ ప్రాంతంలో, ఈజిప్ట్ లోని నైల్ నదీ (Nile) ప్రాంతంలో, చైనా లోని హ్వాంగ్‌హో - యాంగ్‌ట్జె (Huang Ho; Yang Tse) నదీ ప్రాంతంలో, భారతదేశం లోని సింధు నదీ ప్రాంతంలో, ఈ నాగరికతలు విలసిల్లాయి.

2. ఈ నాగరికతలన్నింటిలోను గణనీయంగా వ్యవసాయాభివృద్ధి జరిగింది. కొత్త రాతి యుగంలో వీలుకాని అనేక మార్పులు వ్యవసాయ రంగంలో, నీటి వనరుల ఏర్పాటులో, ఈ కాలంలో సాధ్యమైనాయి. నాగలి మొదలైన వ్యవసాయ పనిముట్ల ఉపయోగం, కాలవల ద్వారా నీటిసాగుతో వ్యవసాయోత్పత్తి, బ్రహ్మాండంగా పెరిగాయి. అంతేగాక, వ్యవసాయదారులు తమకు అవసరమైన ఆహారధాన్యాలనే కాక, మిగతా వర్గాలైన వర్తకులకు, వృత్తి పనివారలకు వలసిన ఆహారధాన్యాలను కూడా ఉత్పత్తి చేయవలసి వచ్చింది. నదులకు సమీపంలో ఉన్న అడవులను నరికి, కాలవలను తవ్వారు. వరదల నుండి రక్షణ కోసం ఆనకట్టలను నిర్మించుకున్నారు. ఈ పనులన్నింటిని చిన్న చిన్న పల్లె జన సమూహాలు నిర్వహించలేవు. కనక, పెద్దఎత్తున ప్రజలు ఒకే చోట స్థిరనివాసాన్ని ఏర్పరుచుకున్నారు. వారు సామూహిక కార్యక్రమాలకై ఒక కేంద్ర వ్యవస్థను ఏర్పాటు చేసుకోవలసి వచ్చింది. కొందరు వ్యవసాయపు పనుల నుండి తమ దృష్టిని ఇతర వృత్తి విద్యలపై మళ్ళించారు.

3. పైన చెప్పిన మార్పుల వల్ల, ఈ నాగరికతల కాలంలో నగరాలుద్భవించాయి. నగరాల రాకతో, వర్తక వ్యాపారాలు పెరిగాయి. ఇతర ప్రదేశాలకు రాకపోకలు, వర్తక లావాదేవీలు, వివిధ ప్రాంతాల మధ్య ఉత్పత్తుల మార్పిడి జరిగాయి. నాగరికత అభివృద్ధి చెందినకొద్దీ, వినిమయ మాధ్య (Money) అవసరమేర్పడింది. నగరంలోని ప్రజలు వ్యవసాయపు పనులు చేయవలసిన అవసరం లేనందువల్ల వృత్తి విద్యల ప్రాముఖ్యం ఏర్పడింది. నూతన వృత్తులు ఏర్పడటమేకాక, కొందరు కొన్ని కొన్ని పనులలో ప్రత్యేక నైపుణ్యాన్ని సంతరించుకొన్నారు. వాటిలో శిక్షణ, ప్రావీణ్యాన్ని పొందారు. 'శ్రమ విభజన' (Division of Labour) సిద్ధాంతం అమలులోకి వచ్చింది. వివిధ వర్ణాలకు చెందిన ఈ ప్రజల సామాజిక జీవనాన్ని నిర్దేశించడానికి, ఒక ప్రభుత్వ వ్యవస్థ, శాంతిభద్రతలను కాపాడే యంత్రాంగం, అందరు అనుసరించడానికి కొన్ని శాసనాలు అవసరమయ్యాయి. ఇదే కాలంలోనే అన్ని నాగరికతలలోను 'లిపి' (రాత) ఆవిర్భవించింది.

ఈ నాగరికత లన్నింటిలోను పైన చెప్పిన సర్వసాధారణ లక్షణాలు వున్నా, వాటి మధ్య రాజకీయ, సాంఘిక వ్యవస్థలలో, వర్తక వ్యాపార విషయాలలో, మత నమ్మకాలలో, లిపి, కళలు, సాంఘిక పరిజ్ఞానాల్లో ఎంతో భిన్నత్వం, వైవిధ్యం కనిపిస్తుంది. ప్రస్తుతం అట్లాంటి ప్రాచీన నాగరికతలలో ప్రథమంగా చెప్పదగిన మెసపటోమియాను గురించి తెలుసుకుందాం.

## 3.4 మెసపటోమియా నాగరికత - ఉనికి

యూఫ్రటిస్ (Euphrates), టైగ్రిస్ (Tigris) నదుల మధ్యగల ప్రాంతాన్ని మెసపటోమియాగా వ్యవహరించటం, ఒక పరిమితమైన ఆలోచన. బాగ్దాద్‌కు ఈ ప్రాంతం ఉత్తరంగా, లేదా పశ్చిమోత్తర దిక్కుగా ఉంది. దీనిని అరబ్బుల

BRAOU

దిదిగా వ్యవహరిస్తారు. ఈ ప్రాంతానికి దక్షిణంగా ఉన్న ప్రాంతాన్ని బాబిలోనియా అంటారు. కాని, విస్తృత పరిధిలో అవగాహన చేసుకోవాలంటే, ఈశాన్యంలో 'జాగ్రోస్' (Zagros) పర్వతాలు, నైరుతి దిశలో అరేబియా పీఠభూమి అంచు వరకు గల మధ్య భూభాగాన్ని, పర్షియన్ గల్ఫ్ నుండి ఆగ్నేయంగా 'ఎంటీటారస్' (Anti Tarus) పర్వతాల వరకు గల విస్తృత భూభాగాన్ని, మెసపటోమియాగా వ్యవహరించొచ్చు. న్యాయంగా చూస్తే, బాబిలోనియా నుండి మాత్రమే, టైగ్రిస్, యూఫ్రటిస్ నదులు జంటగా పారుతాయి. ఇవి తమ లక్షలాది సంవత్సరాల గమనంలో, ఎన్నో మార్పులను చెందాయి.

కాలగర్భంలో కలిసిపోయిన ఈ నాగరికతలను వెలుగులోకి తీసుకరావడం, పురావస్తు శాస్త్ర విజ్ఞానంలో ఒక అద్భుత ఘట్టం. ప్రాచీనులని చెప్పే రోమన్‌లకు, యూదులకు, గ్రీకులకు, సుమేరియాను గురించి తెలియదు. మెసపటోమియాలో మొదటి తవ్వకాలు 1840 ప్రాంతంలోనే మొదలయ్యాయి. ప్రాచీన సమీప ప్రాచ్యం గురించిన సమాచారం, బైబిల్, గ్రీక్, రోమన్ రచయితల ప్రస్తావనలో కనిపిస్తుంది. అంటే, అప్పటికే ఈ నాగరికత రెండు వేల సంవత్సరాల పూర్వం నాటిది. క్రీ.పూ. 5వ శతాబ్దానికి చెందిన హెరొడోటస్ (Herodotus) ప్రప్రథమంగా బాబిలోన్, అస్సీరియాలను గురించి ప్రస్తావించాడు. ఆ తరవాత ఈ ప్రాంతంలో వచ్చిన గ్రీక్ కథనాలు, పూర్తిగా నమ్మశక్యం కానివి. కొన్ని కేవలం కట్టుకథలే. బెరోసస్ (Berosus), డియోడరస్ (Diodorus) రాసిన వివరాలు స్పష్టంగా లేవు. పైగా ఎన్నో వైరుధ్యాలతో కూడినవి.

ఆధునిక కాలంలో ఈ సమీప ప్రాచ్యం ఎందరో ఐరోపా యాత్రికులను ఆకర్షించింది. నేటి షిరాజ్ దగ్గరలో ఉన్న పెర్సిపోలిస్ (Persepolis), సందర్శన స్థలంగా మారింది. అరబిక్, అరమిక్, గ్రీక్, హిబ్రూ భాషలకు చెందిన శిలాశాసనాలను గూర్చి, సమాచారాన్ని సేకరించడం జరిగింది. క్రీ.శ. 1700లో ఈ విలక్షణమైన శాసనాలకు థామస్ హైడ్ (Thomas Hyde) అనే ఆంగ్లేయుడు, 'క్యూనిఫారం' (Cunieform) అనే పేరు పెట్టాడు. ఈ శాసనాలు బాబిలోనియాకు సంబంధించినవనే విషయం, క్రీ.శ. 1760 నాటికి తెలియవచ్చింది. కార్స్టెన్ నీబుర్ (Carsten Niebuhr) అనే శాస్త్రజ్ఞుడు క్యూనిఫారంలోని మూడు రకాలైన అక్షరాలను వేరుపరచటంలో కృతకృత్యుడయ్యాడు. 1802లో గ్రోటిఫాండ్ (Grote fond) ఈ అక్షరాల అర్థాలను చదవడంలో, ప్రయత్నాలను ప్రారంభించాడు. 19వ శతాబ్దపు రెండో భాగంలో 'క్యూనిఫారం' శాసనాలను విశ్లేషించడానికి, ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఎమిలీ బర్నాఫ్ (Emile Burnof), 'ఎడ్వర్డ్ హిక్స్' (Edward Hiks), సర్ హెన్రీ రాలిన్‌సన్ (Sir Henry Ralinson) మొదలయిన వారి విశేష విశిష్ట కృషి మూలంగా, ఈ శిలా శాసనాలను కొంతవరకు చదవడానికి, ఆకళింపు చేసుకోడానికి వీలు కలిగింది.

ఇదే సమయంలో పురావస్తు తవ్వకాలు ప్రారంభమయినాయి. గత నూట ఏబది సంవత్సరాలుగా జరిగిన తవ్వకాలలో, ఎన్నో కష్టాలు, అడ్డంకులు ఎదురయ్యాయి. మొదట్లో తవ్వకాలు అస్తవ్యస్తంగా జరిగాయి. సాంకేతిక పరిజ్ఞానం లోపించింది. తవ్వకాలు క్రమపద్ధతిలో జరగలేదు. స్థానికులు కొందరు తవ్వకాలలో నిధులు దొరకగలవని దొంగతనంగా తవ్వకాలు చేశారు. బురదమట్టితో చేసిన ఇటుకలతో కట్టిన నిర్మాణాలు, తవ్వకాలలో దెబ్బతిన్నాయి. సరైన స్థితిలో వాటిని కనుక్కోలేకపోయారు. 20వ శతాబ్ది ప్రారంభంలో, రాజ్యాలలో కొన్ని, సంయుక్తంగా ఈ పురావస్తు తవ్వకాలను చేపట్టాయి. ఈ తవ్వకాలను దశల వారీగా చేపట్టడం జరిగింది. ఫలితంగా, సమాధి అయిన ప్రాచీన సుమేరియా నగరాలు వెలుగులోకి వచ్చాయి. ఎరిదు (Eridu) (నేడు అబుషహరిన్ అంటున్నాం) ఉల్ (నేటి ముకయ్యార్), ఉర్క్ (నేటి వార్కా), లార్సా (నేటి సెంక్రెచ్), లగాష్ (నేటి షిప్పుర్ల) నిపూర్, నిశాన్, వీటిలో ముఖ్యమైనవి.

## 3.5. నాగరికతావిర్భావం - వివిధ దశలు

క్రీ.పూ. 10,000 నాటి నుండి బృహత్తరమైన శాశ్వత స్థావరాల ఏర్పాటు జరిగే వరకు, నాగరికత అభివృద్ధి ఎన్నో దశలుగా జరిగింది. కొన్ని సందర్భాలలో, ఈ దశలు ఒకదానికొకటి సమాంతరంగా నడిచాయి. వాటిని ఈ రీతిగా

వర్గీకరించవచ్చు.

1. ఆదిలో వేటగాళ్ళు, పశుల కాపరులు తమ నివాసాన్ని ఋతువులను బట్టి మారుస్తూ ఉండేవారు. తరువాత కాలంలో ఒకే చోట కొన్నేళ్ళ వరకు నివాసాన్ని స్థిరంగా చేసుకునేవారు.

2. ప్రయోగాత్మకంగా మొక్కలు నాటడం మొదలుపెట్టి, పద్ధతి ప్రకారం విత్తనాలు నాటి, పంటలు పండించడాన్ని ప్రారంభించారు.

3. గృహ నిర్మాణం, దేవాలయ నిర్మాణాన్ని ఈ దశలో చేపట్టారు.

4. చనిపోయిన వారిని సమాధి చేయడం మొదలుపెట్టారు.

5. మట్టి పాత్రలను చేతులతో చేయడం ప్రారంభించి, తరవాత కుమ్మరి చక్రంలో వాటిని దృఢంగా రూపొందించారు. అంతేకాక, ఆ పాత్రల మీద రకరకాల చిత్రణలు చేశారు.

6. ఈ దశలో చేతి పనులలో ప్రత్యేకమైన శిక్షణ, నైపుణ్యం ఏర్పడింది. పనివారు వివిధ వృత్తులలో పనిచేస్తూ, వర్గీకరింపబడ్డారు. శ్రమ విభజన వచ్చింది.

7. లోహ యుగం ఆవిర్భవించింది. మొట్టమొదట రాగి వాడకంతో, నూతన రాతి యుగం నుండి నాగరికత లోహ యుగంలో అడుగుపెట్టింది.

మొదట వ్యవసాయం, జంతువులను మచ్చిక చేసుకోడం, గోధుమ, బార్లీ మొదలయిన ధాన్యాలను పండించడం, ప్రస్తుతపు ఇరాన్, ఇరాక్, అనటోలియా, సిరియా, పాలస్తీనా మొదలయిన దేశాలలోని నదీలోయలలో, పచ్చగా ఉండే పర్వత సానువుల్లో ప్రారంభమైంది. ఒకే చోట స్థిర నివాసం, జనాభా పెరగడంతో, ఈ జన స్థావరాలు పల్లపు ప్రదేశాలకు విస్తరించాయి. కొత్త రాతి యుగం అని పిలవబడే ఈ దశను చేరడానికి, కొన్ని వేల సంవత్సరాలు పట్టింది. ఈ ప్రథమ స్థావరాలు మెసపటోమియా సరిహద్దుల లోని 'జవీ' (Zawi), కెమీ (Chemi), షనిదార్ (Shanidar) లలో కనిపిస్తాయి. ఇది క్రీ.పూ. 10వేల నుండి 9 వేల సంవత్సరాల మధ్య జరిగినట్లు, దీనిని మృణ్మయ నాగరికత కన్నా ముందు దశ అని చెప్పవచ్చు. ఈ స్థావరాలలో చిన్న చిన్న కుటీరాలు, సమాధులు ఉన్నాయి. కరీమ్‌షహీర్ (Karimshahir) వద్ద ధాన్యం పండించినట్లు, బంకమట్టిని కాల్చిన వస్తువులు, రూపాలను తయారుచేసినట్లు స్పష్టమైన ఆధారాలు కన్పించాయి. ఈ కాలాన్ని చరిత్రకారులు క్రీ.పూ. 6750 గా ఊహించారు. ఇక్కడ తీసిన తవ్వకాలలో 20, 25 గృహాలున్న సముదాయాలు, గొర్రె, మేక, పందులను మచ్చిక చేసినట్లు, బార్లీ, గోధుమను పండించినట్లు, ఆధారాలు లభ్యమయ్యాయి.

## 3.6 నాగరికత సంపన్నత

క్రీ.పూ. 5000 సంవత్సరాల మధ్య శాశ్వతప్రాతిపదికపైన పెద్ద పెద్ద స్థావరాలు ఏర్పడ్డాయి. ఈ కాలంలో కొన్ని మార్పులు సమాదరంగా జరగడమేకాక, ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. ప్రథమంగా ఋతువులను బట్టి నివాసాలు మార్చుకొనే పశువుల కాపరులు, వేటగాళ్ళు మొదలయిన జనం, కొంతవరకు స్థిరనివాసానికి అలవాటుపడ్డారు. కొన్ని సందర్భాలలో కొన్నేళ్ళపాటు, ఒకే చోట ఉండి పోయేవారు. ప్రయోగాత్మకంగా ఏదో ఒక విత్తనం చల్లడం మాని, పద్ధతి ప్రకారం పంటలను పండించడం మొదలుపెట్టారు. ఆ తరవాత గృహాల నిర్మాణం, దేవాలయాల ఏర్పాటు మొదలయింది. చనిపోయిన వారిని ఒకేచోట దహనం చేయుట, అలవాటు చేసుకొన్నారు. మట్టి పాత్రల తయారి మొదట చేతులతో, ఆతరవాత చక్రం సాయంతో ప్రారంభమైంది. అనతి కాలంలో వాటిపై చిత్రాలు రాయడం మొదలుపెట్టారు. ఆ తరవాతి దశలో శ్రమ విభజనతోపాటు, ప్రత్యేకమైన కళల అభ్యాసం మొదలయింది. చివరగా, లోహాల తయారీలో, ముఖ్యంగా రాగిని వాడటం, ఈ పరిణామంలో ముఖ్య ఘట్టం.

మెసపటోమియా సరిహద్దులోని ప్రథమ స్థావరాలు 'జనీకెమీ', (Zanichemi), షనిదార్ (Shanidar) ప్రాంతాలలో లభ్యమయ్యాయి. ఇవి క్రీ.పూ. 10 వేల సంవత్సరాల మధ్య వచ్చిన మార్పులను సూచిస్తాయి. వివిధ రకాలైన గోధుమలు, బార్లీ, గొర్రెల, పందుల ఎముకలు, రాతి పరికరాలు, చిత్రీకరణలున్న మృణ్మయ పాత్రలు లభించాయి. మరో వేయి సంవత్సరాల తరవాతి కాలానికి చెందిన రెండు గ్రామాలు మెసపటోమియా మైదాన ప్రాంతంలో బయల్పడ్డాయి. మొసులోకి చేరువగానున్న హొసూనా (Hossuna), సమారా దగ్గరున్న తల్ సవాన్ (Tall Sawwan) - ఈ రెండు గ్రామాల్లో - బొమ్మలు చిత్రీకరించబడిన పాత్రలు, కట్టడాలలో దేవాలయం, కృత్రిమ నీటిసాగు ఆధారాలు కన్పించాయి.

క్రీ.పూ. 5000 నుండి మెసపటోమియా నాగరికత పరిపుష్టి పొందినట్లుగా, నాగరికతలో భిన్న పరిణామాలు చోటు చేసుకున్నట్లుగా గోచరిస్తుంది. మట్టి పాత్రల ఆకారం, పొందిక, నాణ్యత, గట్టితనం, రంగు, అన్నిటినీ మించి అలంకారం, ఈ పరిణామాలకు అద్దం పట్టాయి. ఇదే కాలంలో పరికరాల నాణ్యత పెరగడం, నదులపై రాకపోకలు జరిగాయి. మెసపటోమియాలో దక్షిణంగా ఉన్న ఎందూ (Endu) లో, క్రీ.పూ. 4000 నాటిదని చెప్పబడిన నమూనా నావ దొరికింది. ఇక్కడే సుమేరియా దేవత 'ఏంకీ' పూజా సంబంధమైన సంస్కృతి కన్పిస్తుంది. ఇక్కడ నిర్మితమైన దేవాలయం 80'×40' అడుగుల విస్తీర్ణంలో ఉండటమేకాక, వరదల నుండి తట్టుకొనేటట్లుగా, పెద్ద అంతస్తులో కట్టబడి ఉంది. దీని చుట్టూ ఎన్నో అలంకరణలు కనిపిస్తాయి. మెసపటోమియా కాలం నాటి చరిత్రలో మానవాళి సాధించిన విజయాల పట్టికను రూపొందించడం, వాటిని పోల్చి చూడడం మాత్రమే మనం చేయగలం. జన ప్రవాసం గూర్చి, వారి కదలికను గురించీ, స్పష్టమైన ఆధారాలు లేవు. ఇతర ప్రజల ఆగమనాన్ని సూచించే కొన్ని ఆధారాలు, నాటి వర్తక వ్యాపారాలకు సంకేతాలు మాత్రమే. ఖచ్చితమైన జాతిని సూచించే ఎలాంటి ఆధారాలు లేవు. కాబట్టి, ఈ కాలం నాటి సాంఘిక వ్యవస్థనుకాని, గ్రామ పాలనను గురించి గాని చెప్పలేం. వీటికి సంబంధించిన వివరాలు, ఆధారాలు తరవాతి కాలంలోనే లభ్యమయినాయి (Proto-history of Sumeria). సుమేరియన్ అక్షరాల ఆధారంగా, మెసపటోమియాలో కన్పించిన నాగరికతా లక్షణాల పుట్టుకను, వ్యాప్తిని, పరిశోధించడం జరిగింది.

B R A O U

ఇటీవలి కాలంలో పురావస్తు శాస్త్రజ్ఞులు చేసిన నిరంతర కృషివల్ల, మెసపటోమియా నాగరికతను గురించి ఎన్నో విశేషాలు వెలుగులోకి వచ్చాయి. 19వ శతాబ్దంలో హింక్స్ (Hincks), ఒపెర్ట్ (Oppert) మొదలయిన మహాశయులు 'క్యూనిఫారం' (cunieform) లిపిని విశ్లేషించడం ద్వారా, ఎంతో సమాచారం లభ్యమైంది. కాని, నిజానికి సర్ హెన్రీ రాలిన్‌సన్ (Sir Henry Rawlinson) నిరంతర శ్రమవల్ల, ఈ సంస్కృతికి సంబంధించిన అతి ముఖ్యమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వారు పర్షియాలో లభ్యమైన మూడు భాషలలో ఉన్న బెహిస్తన్ (Behistan) శిలా శాసనాన్ని చదవడంలో కృతకృత్యులు కావడంతో, ఈ సంస్కృతిని తెలుసుకోడానికి దారి లభ్యమైంది. ఆ తరవాత పురావస్తు శాస్త్రజ్ఞులు ప్రపంచంలోని అతి ప్రాచీనమైన నగరాలను కనుక్కొన్నారు. ఎందు (Endu), యురుక్ (Uruk), సుషా (Susha), కిష్ (Kish), లార్సా (Larsa), నిశెన్ (Nisen), బాబిలన్ (Babylon), నినివే (Nineveh) మొదలయిన నగరాల శిథిలాలు ఎన్నో విశేషాలను తెలిపాయి. వీటిని ఆధారంగా చేసుకొని, మెసపటోమియా నాగరికతా కాలం నాటి రాజకీయ, సాంఘిక, ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేయవచ్చు.

మెసపటోమియా చరిత్ర, ఈజిప్ట్ చరిత్ర కన్నా కొంత భిన్నమైంది. ఈజిప్ట్ సంస్కృతి అవిచ్ఛిన్నంగా, నిశ్చలంగా, ఒకే జాతి ప్రజల గాథగా నడిచింది. కాని, మెసపటోమియా తొలి చరిత్రలో ఎందరో ప్రజలు శారీరకంగా, సైనికంగా బలమైనవారు, బలహీనులను ఓడించడం, సామ్రాజ్యాలను ఏర్పరచడం, పరాజితుల సంస్కృతిని తమలో సంలీనం చేసుకోడం, కన్పిస్తుంది. మెసపటోమియా లోని ఎందరో ప్రజల సంస్కృతుల సమ్మేళనం కన్పిస్తుంది. ఇది మధ్యమ పశ్చిమ ఆసియా చరిత్రను ఎంతగానో ప్రభావితం చేసింది.

పరిశోధనల మూలంగా, ఇక్కడ నివసించిన వారిలో సుమేరియన్లు, వారి నాగరికత ప్రథమ దశగా (క్రీ.పూ. 3000-2400); ఆ తరవాత ఆసియా నాగరికత (క్రీ.పూ. 2400-2000); అమరైట్ నాగరికత (క్రీ.పూ. 2000-900); అస్సీరియా నాగరికత (క్రీ.పూ. 900-600); బాల్డియా నాగరికత (క్రీ.పూ. 600-540)లు ఐదు దశలుగా రూపొందినట్లు చరిత్రకారుల అభిప్రాయం. ఈ వివిధ నాగరికతల కాలంలో, ప్రజా జీవనం, మతం, ప్రభుత్వం, కళలు, సాంఘిక వ్యవస్థ ఎలా ఉన్నదీ, వివరంగా రాగల భాగాలలో చదవొచ్చు.

## 3.7 సంగ్రహంగా

మెసపటోమియా నాగరికత టైగ్రిస్, యూఫ్రటిస్ నదీ లోయల్లో పుట్టి పెరిగింది. ఈ నాగరికత సుసంపన్నమైంది. నాగరికత వివిధ దశల్లో పరిణామం చెందింది. నాగరికత లక్షణాలు చాలాపరకు, మిగతా నదీ లోయల లక్షణాలతో సరిపోతాయి.

## 3.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. మెసపటోమియా నాగరికతా ఉనికి, విస్తరణ, సంపన్నతను తెలియజేయండి.

2. మెసపటోమియా నాగరికతా సర్వసాధారణ లక్షణాలను వివరించండి.

II. కింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. నదీలోయల ప్రాముఖ్యం

2. మెసపటోమియా నాగరికత వివిధ దశలు

## 3.9 ఉపయుక్త గ్రంథాలు


Smith : **Early History of Assyria to 1000 B.C.**

A.M. Openhiem : **Ancient Mesopotamia**

H.A. Davies : **An Outline History of the World**


BRAOU

# భాగం-4 : సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు

విషయక్రమం

4.0 లక్ష్యాలు

4.1 పరిచయం

4.2 సుమేరియన్‌ల రాజకీయ వ్యవస్థ

4.2.1 నగర రాజ్యాలు

4.2.2 సామ్రాజ్యాల స్థాపన

4.2.3 అకాడియా ప్రభుత్వ వ్యవస్థ

4.2.4 అమొరిట్ ప్రభుత్వం

4.3 హమ్మురాబీ

4.3.1 హమ్మురాబీ పాలనా వ్యవస్థ

4.3.2 న్యాయపాలన

4.3.3 హమ్మురాబీ న్యాయసూత్రాల క్రోడీకరణ

4.3.4 మౌళిక లక్షణాలు

4.3.5 ప్రాధాన్యం

4.4 అస్సీరియా రాజ్యస్థాపన

4.4.1 అస్సీరియన్ ప్రభుత్వ వ్యవస్థ

4.4.2 రాజుల సంక్షిప్త చరిత్ర

4.4.3 పాలనా వ్యవస్థ

4.4.4 న్యాయపాలన

4.5 చాల్డియన్ పాలన

4.5.1 వైభవం

4.6 ఆర్థిక, సాంఘిక జీవనం

4.6.1. వర్గాల ఆవిర్భావం

4.6.2 సాంఘిక వ్యవస్థ

4.7 సంగ్రహంగా

4.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

4.9 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

## 4.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని అధ్యయనం చేయడం వల్ల, మెసపటోమియా ప్రాంతంలో, భిన్న కాలాల్లో స్థాపించబడిన రాజ్యాలు, వాటి పాలనా వ్యవస్థలు, ఆర్థిక, సాంఘిక జీవనంలో వచ్చిన మార్పులను గ్రహించవచ్చు. హమ్మురాబీ న్యాయసూత్రాలలో వివరంగా ప్రస్తావింపబడిన అంశాలు, వాటి ప్రాధాన్యతను విశ్లేషించగలగాలి.

## 4.1 పరిచయం

ఇంతకు ముందు భాగంలో మెసపటోమియా నాగరికత వివిధ దశలుగా సాగినట్లు, వివిధ దేశాల్లో ఏదో ఒక రాజ్యం తన నాగరికతను అత్యున్నత దశకు తీసుకొని వెళ్ళినట్లు తెలుసుకున్నాం. క్రీ.పూ. 3000 నాటికే సుమేరియా నాగరికత పతాక స్థాయికి చేరింది. సుమేరియా అనేక చిన్న నగర రాజ్యాలుగా విభజితమైంది. ఈ ప్రాంతంలోని నగరాలు 'ఉర్' (Ur), ఎరిడు (Eridu), ఎరిక్ (Erich), లాగష్ (Lagash), నిప్పూర్ (Nippur), బాబిలన్ (Babylan) వర్తక వ్యాపారాలకు, పరిశ్రమలకు కేంద్రాలుగా మారాయి. నీటిసాగు వనరులు అభివృద్ధి చెంది, క్రమబద్ధమయ్యాయి. ఈ నగరాల మధ్య ఒకే రకమైన సంస్కృతి వికసించినా, రాజకీయ ఆధిక్యం కోసం నిరంతరం యుద్ధాలు సాగాయి.

సుమేరియాలో నివసించిన ప్రజల ప్రభుత్వ వ్యవస్థను గురించిన స్పష్టమైన ఆధారాలు పెద్దగా లేవు. దొరికిన ఆధారాలు కూడా సమగ్రంగా, అవిచ్ఛిన్నంగా వారి ప్రభుత్వ తీరును సూచించ లేదు. కేవలం పురావస్తు శాస్త్రజ్ఞుల మీద ఆధారపడి విశ్లేషించబడే మన సమాచారం, కొన్ని తప్పుడు నిర్ణయాలకు దారితీసినా ఆశ్చర్యపడనక్కరలేదు. కాని, ఉన్నంతలో నాటి రాజకీయ పరిస్థితులను తెలుసుకోడానికి ప్రయత్నం జరిగింది.

## 4.2 సుమేరియన్‌ల రాజకీయ వ్యవస్థ

ప్రపంచ చరిత్రలో నగరాలను నిర్మించి, ప్రభుత్వ వ్యవస్థను ఏర్పరిచినవారిలో సుమేరియన్‌లు ప్రప్రథములని పలువురి అభిప్రాయం. సుమేరియన్‌ల తరవాతనే ఈజిప్ట్‌వారు నగరాలను నిర్మించుకొన్నారని 'విల్ డ్యూరాంట్' (Will Durant) అభిప్రాయపడ్డాడు. ఈ అభిప్రాయంతో కొంతమంది ఏకీభవించకపోవచ్చు. పెన్సిల్‌వేనియా విశ్వవిద్యాలయానికి చెందిన పండితులు చేసిన పురావస్తు పరిశోధనల మూలంగా, యూఫ్రటిస్ నదీ ప్రాంతంలో బాబిలన్‌కు దక్షిణంగా నిప్పూర్ (Nippur) వద్ద ఒక పట్టణ జనాభా, క్రమబద్ధమైన ప్రభుత్వ వ్యవస్థ ఆధ్వర్యంలో ఉండేదని, ఇది బహుశా క్రీ.పూ. 5 వేల సంవత్సరాలు, లేదా అంతకన్న పురాతనమైందని భావించడం జరిగింది. నిప్పూర్ వద్ద గోపురమున్న దేవాలయాన్ని సుమేరియన్‌లు నిర్మించారు. దీనిని వారు 'జిగరుట్' (Ziggarut) స్వర్గ పర్వతమని వ్యవహరిస్తారు. ఇది సుమేరియన్‌ల దేవతలలో ముఖ్యమైన వాయుదేవునికి 'ఎన్‌లిల్' దేవాలయం. నిప్పూర్ వద్ద 66 అడుగుల లోతుకు వెళ్ళారు. ఇది బహుశా క్రీ.పూ. 7 వేల నాటి నాగరికత కావచ్చునని చరిత్రకారులభిప్రాయపడ్డారు. 'కిష్' (Kish) నగరం సుమేరియన్‌ల రాజధానిగా క్రీ.పూ. 4500 - క్రీ.పూ. 1300 వరకుండేదని, బ్లాక్స్‌లాండ్ స్టబ్స్ (Blaxland Stubbs) అభిప్రాయపడ్డాడు. ప్రొఫెసర్ లినార్డ్ వూరీ 'ఉర్' నగర వైభవాన్ని వేనోళ్ళ పొగిడాడు. యూదుల మతాధిపతి అబ్రహాం ఈ నగరం నుండే ఇజ్రాయిల్ వెళ్ళాడని నమ్మకం. 'లగాష్' నగరం కూడా నాటి రాజ్యాధికారంలో పాలుపంచుకొన్నదని భావిస్తారు.

### 4.2.1 నగర రాజ్యాలు

ప్రాచీన సుమేరియాలో నగర రాజ్యాల వ్యవస్థ ఉండేది. నగరం, దాని చుట్టూ ఉన్న ప్రాంతం, నగర రాజ్యంగా భావించబడింది. సుమేరియన్‌లు ఒక కేంద్రీకృత రాజ్య స్థాపనను చేయలేకపోయారు. ప్రతి నగర రాజ్యానికి ఒక రాజు, 'పటేసి' (Patesi) అని పిలవబడే మహా పూజారి ఉండేవారు. కొన్ని సందర్భాలలో రాజే మహాపూజారిగా వ్యవహరించడం,

లేదా రాకుమారుడు మహాపూజారిగా నియమించబడటం జరిగేది. పూజారి ఎంతో అధికారాన్ని, పలుకుబడిని కలిగి ఉండేవాడు. నిప్పూర్ శిలా శాసనాన్ని పరిశీలిస్తే, పర్షియా సింధుశాఖ నుండి మధ్యధరా సముద్రం వరకు విస్తరించిన ప్రథమ సామ్రాజ్యాన్ని 'ఎరిక్' (Eric) నగర మహా పూజారి స్థాపించినట్లు తెలుస్తుంది. బహుశా, అనేక నగర రాజ్యాలను మహా పూజారులే పాలించి ఉండవచ్చు. ఈ నగరాల మధ్య ఎట్లాంటి ఐక్యతా భావం ఉండేది కాదు. వర్తకవ్యాపారాల్లో పోటీ, నీటిసాగు కాల్వల, వ్యాపార రహదార్ల వివాదాలు, వారి మధ్య ఉండేవి. నిరంతర యుద్ధాలు నగర రాజ్యాలను బలహీనపర్చాయి.

నగర రాజ్యాల పాలనను దైవదత్త అధికారంగా చెప్పవచ్చు. రాజ్య మతాధికారం ఒక్క చోటనే కేంద్రీకృతమయితే, మహాపూజారులు చాలావరకు ప్రాజ్ఞ పాలన చేసేవారు. శాంతిభద్రతలను కాపాడటం, పొరుగు రాజ్యాల నుండి తమ భూభాగాలను పరిరక్షించడం, వారి ముఖ్య విధి. విలుకాండ్రతో, బల్లేలు ప్రయోగించే వారితో కట్టుదిట్టమైన రక్షణ వ్యవస్థ ఉండేది. అంతేకాక, వారు వ్యవసాయ, వర్తక రంగాలకు అధిక ప్రాధాన్యమివ్వడంవల్ల, సుమేరియా నగర రాజ్యాలు సుసంపన్నంగా ఉండేవి. వారి ఆర్థిక జీవనం సమ్మిళితమై, ఎన్నో అభివృద్ధి చెందిన వాణిజ్య సంస్థలను నెలకొల్పడం జరిగింది. మన బ్యాంకులను పోలిన వ్యవస్థ నాడు ఉండేది. పన్నుల భారం చాలా ఎక్కువైనా, ప్రజలు సంపన్నులైనందువల్ల ఎలాంటి కష్టం లేకుండా, అభ్యంతరాలను చెప్పకుండా, పన్నులను చెల్లించేవారు. బహుశా, మతాధిపతి అయిన రాజుపట్ల, కొంత భయం కూడా ఉండవచ్చు. స్వతంత్ర నగర రాజ్యాల తొలి దశలో, ప్రజాస్వామ్యాన్ని పోలిన వ్యవస్థ కొంతవరకుంటానికి అవకాశమున్నదని స్టివార్ట్ సి. ఈస్టన్ (Stewart C. Easton) అభిప్రాయపడ్డాడు. రాజులు, కేంద్ర ప్రభుత్వం, నాటి పరిస్థితులను బట్టి తరవాతి కాలంలో ఉత్పన్నమయ్యాయని వారి అభిప్రాయం. ఈ తొలి ప్రజాస్వామ్య వ్యవస్థలో పెద్దలు, పుర ప్రజలతో కూడిన సాధారణ సభ ఉండేదని, విపత్కాలంలో ఒక రాజును వారు ఎన్నుకొనే వారని, అతడు కొంత గడువు మాత్రమే రాజుగా వ్యవహరించేవాడని చెప్పడం జరిగింది.

సుమేరియాను పాలించిన ప్రాజ్ఞ రాజుల జాబితా, చరిత్రలో మనకు కనిపిస్తుంది. వీరు సుమేరియాలో కొంత భాగాన్ని మాత్రమే పాలించారు. యురుకాగినా (Urukagina) అనే రాజు 'లగాష్' (Lagash)ను పాలించాడు. ప్రజలను న్యాయబద్ధంగా పాలించాడని, సామాన్యులను ధనవంతులు, పూజారుల, దోపిడీ నుండి పరిరక్షించాడని, చెప్పడం జరిగింది. ఈ ప్రాజ్ఞ రాజు ప్రజలకు స్వేచ్ఛను కూడా ప్రసాదించాడు. అయితే 'లుగల్ జగాసీ' (Lugal Zagasi) అనే దురాక్రమణదారుడు అతనిని ఓడించి, 'లగాష్' నగరాన్ని దోచుకొన్నాడు. 'లగాష్' నగరంలో 'గుడే' (Gude) అనే మరో ప్రాజ్ఞ రాజు వుండేవాడు. శిల్పకారులు వీరి శిల్పాలెన్నింటినో ప్రతిష్ఠించారు. అవి తవ్వకాలలో లభ్యమయ్యాయి. ప్రజా సంక్షేమానికి ఎంతో కృషి చేసి, వారి ప్రేమకు, గౌరవానికి పాత్రుడయ్యాడు. అతని మరణానంతరం ప్రజలు అతని విగ్రహాన్ని ఆరాధించారు. "ఏడేళ్ళపాటు పరిచారిక యజమానురాలితో, బానిస యజమానితో కలిసి నడిచారు. నా నగరంలో బలహీనులు, బలవంతులు అందరూ ఒకటే" అనే శిలా శాసనం దొరికింది.

### 4.2.2. సామ్రాజ్యాల స్థాపన

సుమేరియాలో అనతి కాలంలోనే నగర రాజ్యాలకు కాలం చెల్లింది. నాటి రాజకీయ, సైనిక సమస్యలు జటిలం కాగా, వాటిని తట్టుకోలేక పోయాయి. వర్తక వ్యాపారాలు, వృత్తిపనులు విస్తృతంగా అభివృద్ధి చెందాయి. తదనుగుణంగా విశాల భూభాగాలను సంయుక్తంగా నిర్వహించగల, సమర్థవంతమైన ప్రభుత్వ ఆవశ్యకత ఏర్పడింది. వివిధ నగర రాజ్యాలలోని రాజులు, లేదా పాలకులు అణచివేయబడి, వారి స్థానంలో బలమైన రాజ్యం, బలమైన సైన్యం ఏర్పడ్డాయి. ఈ విస్తృత రాజ్యాలను ప్రాంతాలుగా విభజించి, వాటికి సామంతులను నియమించి, వారికి కొన్ని రాయితీలు, అధికారాలను దత్తం చేశారు. ఈ సామంతులు చక్రవర్తికి విధేయులుగా ఉంటూ, అతనికి సైనిక బలాన్ని సమీకరించేవారు. రాజుగారు ధన, ధాన్యాలను పన్నులుగా వసూలు చేసి, ప్రభుత్వ గోదాములలో నిల్వ చేసి, అధికారులకు, ఉద్యోగులకు జీతాలుగా చెల్లింపులు చేసేవారు. దీనిని ఒక రకంగా రాచరిక, భూస్వామ్య వ్యవస్థ పాలన అని చెప్పవచ్చు.

BRAOU

ఈ నూతన పాలనా వ్యవస్థలో 'న్యాయసూత్రాల క్రమబద్ధీకరణ' (Codification of Laws) ఒక ప్రముఖమైన ప్రయోగం. 'ఉర్' నగర శాసనాలను ఆధారంగా చేసుకొని, 'యుర్ ఎంగుర్' (Ur Engur) 'దుంగి' (Dungi) అనే రాజులు న్యాయ సూత్రాలను రచింపజేశారు. వర్తకం, కొనుగోల్లు, అమ్మకాలు, అప్పులు, లావాదేవీలు, దత్తత, ఆస్తి పంపకం, మొదలైన విషయాలన్నిటినీ క్రమబద్ధీకరించడం జరిగింది. దేవాలయాల్లో పూజార్లు కొన్ని వ్యవహారాల్లో న్యాయకర్తలుగా పనిచేయగా, ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయాధిపతుల వ్యవస్థ శ్రీకారం చుట్టింది. న్యాయసూత్రాలు చాలా వరకు మతపరమైన సూత్రాలకు అనుగుణంగా ఉండేవి. 'యుర్ ఎంగుర్' (Ur Engur), 'హమ్మురాబీ' (Hammurabi) మొదలైనవారు తమ న్యాయ సూత్రాలను సూర్యభగవానుని పేరున విడుదల చేశారు.

## 4.2.3 అకాడియా ప్రభుత్వ వ్యవస్థ

క్రీ.పూ. 2750 నాటికి సుమేరియా సామ్రాజ్యం పతనం చెందింది. సెమిటిక్ (Semitic) జాతికి చెందిన మొదటి 'సర్గోన్' (Sargon) అనే సైనిక నాయకుడు సుమేరియన్‌లను ఓడించి, సుమేరియన్ - అకాడియన్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. సర్గోన్ పుట్టు పూర్వోత్తరాలు మనకు స్పష్టంగా తెలియవు. అతని తండ్రి ఎవరో తెలియదు. కాని, తల్లి దేవాలయంలో పనిచేసేదని, అతనిని ఒక పడవలో వదలి వేయగా, అతడు రక్షంపబడి, పెరిగి పెద్దవాడై, రాజ కొలువులో చేరి, ఆ రాజునే పడగొట్టాడని కథనం. కొద్ది కాలంలోనే అక్కడ్ ప్రాంతాన్ని అంతటిని జయించి, ఈనాటి బాగ్దాద్‌కు సమీపంలో ఉన్న 'అగడీ' (Agadi)ని రాజధానిగా చేసుకొని పాలించాడు. సుమేరియా నగర రాజ్యాల నిరంతర అంతర్గత కలహాల మూలంగా, వాటిని సులభంగా జయించి, 'సర్గోన్' ఒక సామ్రాజ్యాధినేత అయ్యాడు. అంతేకాక, 'అమెరిటస్' (Ameritus) సంచార తెగలను, ఎలామ్ (Elam) ప్రజలను ఓడించి, రాజ్య విస్తీర్ణత చేశాడు. ఎన్నో నగరాల మీద దాడిచేసి, ఎందరినో చంపి, పెద్ద ఎత్తున ఆస్తులను దోచుకున్నాడు. లగాష్ నగరాన్ని ధ్వంసం చేసిన 'లుగల్ జగాసీ'ని (Lugal Zagasi) సర్గోన్ ఓడించి, సంకెళ్ళు వేసి, నిప్పూర్‌కు తీసుకొని వచ్చాడు. తన ఆయుధాలను పర్షియా సింధు శాఖలో కడిగి, పశ్చిమ ఆసియాకు వచ్చి, మధ్యధరా సముద్రం చేరి, చరిత్రలో ప్రప్రథమ సామ్రాజ్య స్థాపకుడయ్యాడని, 'విల్ డ్యూరాంట్' రాశాడు. పర్షియా సింధుశాఖ నుండి, మధ్యధరా సముద్రం వరకు విస్తృతమైన అతని రాజ్యం, రెండు శతాబ్దాలపాటు అవిచ్ఛిన్నంగా కొనసాగింది. రాజకీయంగా, సైనికంగా 'అక్కడ్‌లు' సుమేరియన్‌లను జయిస్తే, సుమేరియన్‌లు సాంస్కృతికంగా అకాడియన్‌ల మీద విజయాన్ని సాధించారు. ఈ రెండు రాజ్యాల సంస్కృతి, సమ్మేళనం చెందింది. రాజు సుమర్ (Sumar) అక్కడ్ పాలకునిగా బిరుదు వహించాడు.

సర్గోన్ తన రాజ్యాన్ని వివిధ పాలనా విభాగాలుగా విభజించి, ప్రతిపాలనా విభాగానికి ఒక గవర్నర్‌ను నియమించాడు. అతడు అకాడియా సుమేరియన్ అయి ఉండాలి. ఈ సామ్రాజ్యంలో శాంతి స్థాపించబడి, ప్రజాజీవనం సుఖవంతమైంది. సంచార తెగలు స్థిరనివాసం ఏర్పరుచుకోగా, గుడారాల స్థానే ఇటుకలతో కట్టిన ఇళ్ళు వచ్చాయి. సర్గోన్ 55 సంవత్సరాలు పాలించాడు. అతని సుదీర్ఘ పాలనలో శాంతి, సుస్థిరత వెలిసింది. అతని మరణానంతరం కూడా, చాలావరకు ఇదే స్థితి, ఇదే పద్ధతిలో పాలనా వ్యవస్థను కొనసాగించడం జరిగింది.

## 4.2.4 అమొరిట్ ప్రభుత్వం

'సర్గోన్' చక్రవర్తి సామ్రాజ్యం రెండు దశాబ్దాల పాటు కొనసాగింది. ఆఖరి దినాల్లో అంతర్గత కలహాలు, విదేశీ దండయాత్రలు, రాజ్యాన్ని బలహీనపరిచాయి. ఈ రాజ్యాన్ని సారవంతమైన చంద్రరేఖాకృతి (Fertile crescent) అని పిలిచేవారు. ఆ దేశ సంపదే, పొరుగున ఉన్న సంచార తెగల ఈర్ష్యకు, ఆశకు కారణభూతమైంది. వారి దాడులు నిరంతరంగా సాగేవి. సుఖసంపదలతోపాటు శాంతియుతంగా జీవిస్తున్న సుమేరియన్ - అక్కడ్‌లు, ఈ తెగల సైనిక సాహస చర్యలకు సులభంగా లొంగిపోయారు. అలాంటి తెగలలో ముఖ్యమైనవి 'ఎలమైట్లు' (Elamites), అమొరిట్లు (Amorites). ఎలమైట్ల జాతిని గురించి మనకు తెలియదు. వారు సుమేరియన్, సమైట్ జాతులకు చెందినవారు కారు.



BRAOU

వారి ముఖ్య పట్టణం 'సూసా (Susa). వారు సుమేరియన్ అక్కడ్ రాజ్యాన్ని తూర్పు నుండి దాడిచేసి, అనేక నగరాలను కైవశం చేసుకొన్నారు. క్రీ.పూ. 2200 ప్రాంతంలో పశ్చిమం నుండి వచ్చిన 'సెమెటిక్' జాతికి చెందిన 'అమొరిట్లు', బలహీనపడిన సుమేరియన్ అక్కడ్ రాజ్యం మీద విరుచుకుపడ్డారు. 'యూఫ్రిటీస్' నది ఒడ్డున ఉన్న 'బాబిలోన్' (Babylon) అనతి కాలంలో మెసపటోమియాలోని అత్యున్నత నగరంగా, ప్రపంచంలోని ఒక అద్భుత నాగరికత కేంద్రంగా విరాజిల్లింది. అందువల్లనే, 'అమొరిట్' రాజ్యాన్ని 'బాబిలోనియా' సామ్రాజ్యమని కూడా వ్యవహరించారు.

## 4.3 హమ్మురాబీ (Hammurabi) (2123-2081 B.C)

అమొరిట్ రాజులలో ఆరవ వాడైన హమ్మురాబీ, బాబిలోనియా రాజులలో అగ్రగణ్యుడు. 43 ఏండ్ల ఇతని పరిపాలనా కాలం మెసపటోమియా చరిత్రలో స్వర్ణ యుగం. హమ్మురాబీ ఒక గొప్ప విజేత, పరిపాలనాదక్షుడు, న్యాయ సూత్రాలను ప్రసాదించిన ప్రతిభాశాలి. "ప్రాచీన శిలా శాసనాలు, ముద్రలు, హమ్మురాబీని ఉద్రేకం, ప్రతిభ ఉన్న యువకుడని, యుద్ధంలో సుడిగాలివలె చెలరేగేవాడని, తిరుగుబాట్లను, శత్రువులను ముక్కలు, ముక్కలుగా అణచివేసి, అభేద్యమైన అరణ్యాలలో ముందుకు సాగేవాడని, ఒక్క యుద్ధం కూడా ఓడిపోలేదని చెప్పుకొన్నాయి." అని, విల్ డ్యూరాంట్ వ్రాశాడు. 'హమ్మురాబీ' సమర్థవంతమైన కేంద్రీకృత ప్రభుత్వాన్ని స్థాపించి, 'బాబిలోనియా'ను ఒక సమైక్య సామ్రాజ్యంగా రూపొందించాడు. అతని న్యాయ సూత్రాలు, 55 జాబులు అతను సాధించిన విజయాలను స్పష్టంగా తెలియచేస్తున్నాయి. చరిత్రలో 'హమ్మురాబీ' విజేతగాకాక, పరిపాలనాదక్షునిగా, న్యాయసూత్రాల ప్రదాతగా చిరస్మరణీయుడయ్యాడు.

### 4.3.1 హమ్మురాబీ పాలనా వ్యవస్థ

మెసపటోమియాలోని ప్రభుత్వాలన్నీ సంప్రదాయంగా మతాన్ని, రాజకీయాలను ఒక్కటే చేసి, దైవాజ్ఞ అనే పేరుతోనే రాజ్యపాలన చేశాయి. హమ్మురాబీ వంటి ప్రజ్ఞశాలి కూడా ఈ దైవదత్తాధికార సిద్ధాంతాన్ని ప్రయోగించక తప్పలేదు. ఈ సిద్ధాంతం ద్వారా ప్రజల విధేయతను పొందగలిగాడు. హమ్మురాబీ మత సంబంధ వేడుకలలో పాల్గొనేవాడు. కొన్ని సందర్భాలలో మతాధికారి ఉడుపులు ధరించి, తానే రాజ్య మతాధిపతినని గుర్తుచేసేవాడు. బాబిలోనియా చరిత్ర అంతటా ఈ దైవదత్తమైన రాజరిక (Divine origin rights theory) సిద్ధాంతం కొనసాగింది. దేవుని పేరున పన్నులు వసూలు చేసేవారు. వాటిలో పెద్ద మొత్తాలను దేవాలయాలకిచ్చేవారు. పూజారుల ఆశీస్సులు లేకుండా, ఏ రాజు రాజ్యపాలన చేసేవాడు కాదు. ఈ వాస్తవాన్ని గమనించిన 'హమ్మురాబీ' పూజారులను మంచి చేసుకొని, వారికి వలసిన వనరులు సమకూరుస్తూ, వారి మద్దతును పొందాడు.

'హమ్మురాబీ' సమర్థమైన, న్యాయమైన, నిర్దిష్టమైన పాలనాయంత్రాంగాన్ని రూపొందించాడు. రాష్ట్ర గవర్నర్లకు నిర్దిష్టమైన ఆదేశాలనిచ్చేవాడు. వారు కూడా తమ కింది వారికి అలాంటి నిర్దిష్టమైన, న్యాయబద్ధమైన ఆదేశాలను ఇవ్వాలని ఆదేశించాడు. జయించిన సుమేరియన్ నగరాలలో అధికారులకు పంపిన అలాంటి ఆదేశాలను పురావస్తు శాస్త్రజ్ఞులు కనుక్కొన్నారు. మట్టి ముద్రల మీద రాయబడిన 55 ఆదేశ పత్రాలు లభ్యమయ్యాయి. పన్నుల వసూలు, వరదల తరవాత తీసుకోవలసిన చర్యలు, సంతలలో అధికారులు చేయవలసిన పనులు, లంచగొండుల పట్ల తీసుకోవలసిన కఠిన చర్యలు, కాలువలు బాగుచేసి మరమ్మత్తులు చేయవలసిన అవసరం, దేవాలయ నిధుల దుర్వినియోగం మీద విచారణ జరుపవలసిన ఆవశ్యకత, మొదలయిన విషయాలన్నిటినీ ఇందులో ప్రస్తావించడం జరిగింది. ఈ ఆదేశాల పట్టికను పరిశీలిస్తే, 'హమ్మురాబీ' వ్యవసాయం, పశుసంపద ముఖ్యంగా గొర్రెల పెంపకం పట్ల అత్యంత శ్రద్ధ కనబరిచినట్లు విదితమౌతుంది. సాగు నీటి కాలువల పట్ల ప్రత్యేక శ్రద్ధను చూపేవాడు. పర్షియా సింధు శాఖ నుండి కిష్ (Kish) నగరం వరకు పంటకాలువను తవ్వించడమేకాక, పూర్తి సాగు పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఎన్నో బీడు భూములు సాగులోనికి రాగా, టైగ్రిస్ (Tigris) నది వరదల నుండి దక్షిణ నగరాలకు రక్షణను కల్పించడం జరిగింది.

BRAOU

### 4.3.2 న్యాయ పాలన

న్యాయ పాలన పట్ల 'హమ్మురాబీ' అత్యంత శ్రద్ధాసక్తులను కనబరిచాడు. అత్యున్నత న్యాయాధీశునిగా తానే స్వయంగా వివాదాలను విని, పరిష్కరించేవాడు. కొన్ని సందర్భాలలో చిన్నచిన్న తగాదాలలో కూడా **తీర్పులను** ఇచ్చేవాడు. న్యాయాధిపతుల తీర్పు సక్రమంగా లేదని భావించినపుడు, పునర్విచారణకు ఆదేశాలను జారీ చేసేవాడు. వర్గ భేదం లేకుండా, ఆర్థిక తారతమ్యాలు అడ్డు రాకుండా, అందరికీ సమంగా న్యాయం వర్తించాలని భావించాడు. బలహీనుల మీద దోపిడీని సహించేవాడు కాదు. అందరూ న్యాయంలో సమానులే అని ప్రకటించాడు. అతని పాలన కఠినంగా ఉన్నా, ప్రజా సంక్షేమమే కర్తవ్యంగా న్యాయ నిర్ణయాలను చేసేవాడు. దిగువ న్యాయస్థానాలలో పూజారులు న్యాయాధిపతులు కాగా, ఉన్నత న్యాయాధిపతులు పాలనా వ్యవస్థలో భాగంగా నియమింపబడేవారు. న్యాయవాదులున్నట్లు దాఖలాలు లేవు. పూజారులే లేఖకులుగా వుండేవారు. ఇంత జాగ్రత్తగా న్యాయపాలన చేసినా, అక్కడక్కడ లంచగొండితనం, సాక్షులను లొంగదీసుకోవడం ఉండేది.

### 4.3.3 'హమ్మురాబీ' న్యాయ సూత్రాల క్రోడీకరణ

న్యాయ సూత్రాలన్నింటినీ ఒకే చోట క్రోడీకరింపచేసి, ప్రజలు వాటిని చదువుకోడానికి, ఆచరించడానికి వీలుగా బహిరంగ ప్రదేశాలలో ఉంచడం, 'హమ్మురాబీ' సంస్కరణలలో అత్యున్నతమైనదిగా చెప్పవచ్చు. 'హమ్మురాబీ' న్యాయ సూత్రాల క్రోడీకరణ 1902లో 'సూసా' (Susa) నగరంలో బయల్పడింది. క్రీ.పూ. 1100 ప్రాంతంలో ఈ సూత్రాలు 'బాబిలన్' నుండి యుద్ధ విజయ బహుమతులుగా, ఇక్కడికి తీసుకొని రావడం జరిగింది. ఈ న్యాయ సూత్రాలు 8 అడుగుల నల్లరాతి వర్తుల స్తంభాకార నల్ల రాతి మీద చెక్కబడ్డాయి. ఈ స్తంభానికి ఒక వైపున న్యాయ సూత్రాలను 'హమ్మురాబీ' సూర్యభగవానుడైన హమాష్ (Hamash)నుండి గ్రహించినట్లుగ చెక్కబడింది. ఈ న్యాయసూత్రాలు సుమేరియా భాషలో కాక 'సెమిటిక్', అమెరిటీస్, అక్కడ్‌ల భాషలో రాయబడ్డాయి. ఈ న్యాయ సూత్రాలు భగవదత్తాలనే నమ్మకం. సూర్యభగవానునిచే ప్రసాదించబడి, అతని ప్రతినిధి అయిన 'హమ్మురాబీ'చే అమలుపరచబడినట్లు భావిస్తారు. అయితే, 'హమ్మురాబీ'కి ముందే మెసపటోమియాలో తొలి రాజులైన 'ఉర్ ఎంగుర్' (Ur Engur), డుంగీ (Dungi) కొన్ని న్యాయ సూత్రాలను క్రమబద్ధీకరించారు. ఈ న్యాయ సూత్రాలను, నాటి ఆచార వ్యవహారాలను, సంప్రదాయంగా వస్తున్న విశేషాలను, సమ్మేళనం చేసి, 'హమ్మురాబీ' వాటిని పద్ధతి ప్రకారం క్రోడీకరించాడు.

### 4.3.4 మౌలిక లక్షణాలు

హమ్మురాబీ న్యాయ సూత్రాలలో కొన్ని మౌలిక లక్షణాలు కన్పిస్తాయి. (1) ప్రముఖంగా అవి ప్రజా సంక్షేమానికి ఉద్దేశించబడినాయి. ఈ విషయాన్ని ఆధునిక న్యాయశాస్త్రజ్ఞులు కూడా అంగీకరించారు. వివిధములైన కార్మిక వర్గాల, చేతిపనుల వారి విశ్లేషణ, వారి జీతభత్యాల నిర్ణయం, నిజంగా ఆధునికమైన ప్రయోగమే. కొన్ని శాసనాలలో పేద వారికి, వితంతువులకు, అనాధలకు, ఆర్థిక రక్షణ, న్యాయాన్ని చేకూర్చడం జరిగింది.

2. మరో వైపున ఈ న్యాయ సూత్రాలలో కఠినమైన, అనాగరికమైన శిక్షలు కూడా చేర్చబడ్డాయి. చిన్న చిన్న నేరాలకు కూడా, మరణ శిక్ష, లేదా అంగ పరిచ్ఛేదం అమలుపరచబడేది. అయితే శిక్షలు అమలుపరచటానికి విస్తృతమైన న్యాయనిబంధన లుండేవి.

3. ప్రతీకారం "కంటికి కన్ను' 'పన్నుకు పన్ను' అనే సూత్రం, ఈ న్యాయ సూత్రాలలో ముఖ్య ఆదర్శంగా కనిపిస్తుంది. తప్పు చేసిన వాడిని శిక్షించడం తప్పనిసరి. అతన్ని సంస్కరించడం అంత ముఖ్యం కాదనే సిద్ధాంతం కనిపిస్తుంది. ఉదాహరణకు ఎవరైనా కట్టిన ఇల్లు కూలి అందులో ఉన్నవాడు మరణిస్తే, కట్టుబడిదారుడికి మరణ శిక్ష వేయాలి. ఒక వేళ ఇల్లు కొన్న వాడి కొడుకు చస్తే, ఇల్లు కట్టినవాడి కొడుకు చావాలి. ఈ శిక్షలు దుర్మార్గమైనవే.

BRAOU

తరవాతి కాలంలో ఈ క్రూర శిక్షలకు బదులు నష్టపరిహారం చెల్లింపు పద్ధతి వచ్చి, కొంతవరకు న్యాయ సూత్రాలు ఉదారంగా మారాయి.

4. ఉద్యోగ ధర్మ నిర్వహణను నిర్దేశిస్తూ, కొన్ని శాసనాలను చేయడం జరిగింది. ఏదైనా వైద్యుని అశ్రద్ధ వల్ల రోగి చనిపోయినా, కనుచూపుపోయినా, ఆ వైద్యుని చేతులు నరికివేయబడతాయి. బిడ్డలను మార్పు చేస్తే, 'ఆయా' (Nurse) వక్ష స్థలం ఛేదించబడుతుంది. పారిపోతున్న బానిసకు రక్షణ కల్పించినా, పూజారిణి తాగినా, యుద్ధం నుండి పారిపోయి వచ్చినా, కాన్పులు చేసేటప్పుడు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించినా, ఉద్యోగంలో తప్పులు చేసినా, దొంగతనం చేసినా, భర్తను చంపి పరాయి మగవానితో ఉండాలని భావించినా, స్త్రీలను చెరపట్టినా, దారిదోపిడీలు చేసినా, మనుషులను డబ్బుకోసం బలత్కారంగా ఎత్తుకుపోయినా, మరణదండన విధించడం జరిగేది.

5. ఈ (కోడ్)స్మృతిలో మొత్తం 285 న్యాయ సూత్రాలు ఉన్నాయి. ఈ రోజులతో పోల్చితే సంఖ్య తక్కువే అయినా, వాటిని వివిధ శీర్షికల కింద, పద్ధతి ప్రకారం, శాస్త్రీయంగా పొందుపరిచారు. వ్యక్తిగత ఆస్తి, ఆస్తి అమ్మకం, కొనుగోల్ళు, వర్తక వ్యాపారాలు, కుటుంబ వ్యవస్థ నేరాలు, కార్మిక శాసనాలు మొదలైన శీర్షికలలో ఇవి పొందుపరచబడ్డాయి. కొన్ని నిబంధనలకు లోబడి, వస్తువుల ధరలు, కార్మికుల జీతాలు, వృత్తుల వారికి చెల్లించవలసిన రుసుములను నిర్ణయించడం జరిగింది. నగలు చేసేవారు, ఇండ్లు కట్టేవారు, చేనేతవారు, అద్దకాలు చేసేవారు, దర్జీలు, ఇటుకలు తయారుచేసేవారు, రాతిపనివారు, కమ్మరవారు, మొదలైన వారందరికీ, ఏ పనికి ఎంత చెల్లించాలనేది ప్రజలకు తెలుసు.

వారసత్వపు ఆస్తిని గురించి కొన్ని శాసనాలు ఉన్నాయి. వ్యక్తి ఆస్తి అతని భార్యకు కాక, నేరుగా సంతానానికి సంక్రమిస్తుంది. కుమారులందరు ఆస్తిలో సమాన భాగస్వాములే. విధవరాలు తన భర్త ఆస్తి నుండి కట్నం ఇచ్చిన డబ్బును తిరిగి తీసుకోవచ్చు. మిగతా రాజ్యాల న్యాయసూత్రాలతో పోలిస్తే, 'హమ్మురాబీ' కోడ్‌లో స్త్రీలకు ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. ఆస్తి హక్కు వారికివ్వడం జరిగింది. వివాహ సంబంధంగా బాధలు వస్తే, విడాకులు పొందే హక్కు భార్యాభర్తలకు సమానమే. స్త్రీలు వర్తకవ్యాపారాలలో కూడా పాలు పంచుకోవచ్చు. చదువుకొని లేఖకులుగా ఉద్యోగాలు కూడా చేయవచ్చు. అంతేకాక, ఈ న్యాయ సూత్రాలలో వ్యాపార లావాదేవీలు, ప్రామిసరీ నోట్లు, వడ్డీ రేట్లు, కౌలుకు సంబంధించిన విషయాలు కూడా చెప్పబడ్డాయి.

BRAOU

## 4.3.5.ప్రాధాన్యత

'హమ్మురాబీ' న్యాయ సూత్రాలు మెసపటోమియాలో ప్రప్రథమంగా అమలుపరచబడిన లిఖిత శాసనాలు. ఇవి ప్రజలందరికి తెలియచెప్పబడ్డాయి. ప్రజలను న్యాయబద్ధంగా, క్రమశిక్షణలో పరిపాలించాలనే చక్రవర్తి లక్ష్యం ద్యోతకమవుతుంది. బీదలకు, బలహీనులకు, వితంతువులకు, అనాధలకు రక్షణ కల్పించడానికి ఉద్దేశించిన ఈ న్యాయ సూత్రాల గొప్పదనాన్ని గుర్తించవచ్చు. వివిధ వర్గాల ప్రజలు చేయవలసిన పనులు, దానిమీద వారికి వచ్చే ప్రతిఫలం, పనులు చేయడంలో వారు పాటించవలసిన ప్రమాణాలు పొందుపరచబడడం, ఈ శాసనాలకు ఆధునికతను సంతరింపజేశాయి. సమకాలీన న్యాయ సూత్రాలతో పోలిస్తే, 'హమ్మురాబీ' కోడ్ ఎంతో శాస్త్రీయమైనది, నిర్దిష్టమైనది, సహేతుకమైనది. న్యాయ సూత్రాలు పూర్తిగా ఆదర్శాలను వల్లించక, వాస్తవిక విషయాలను కూడా పరిగణనలోకి తీసుకోవటం జరిగింది. సాంఘిక సమానత్వం ప్రవచింపబడలేదు. రాజకీయ క్షేమం కోసం కఠినమైన శిక్షలు నిర్దేశింపబడ్డాయి. బానిస వ్యవస్థను కొనసాగించడం జరిగింది. 'దెబ్బకు దెబ్బ' అనే సిద్ధాంతం ఈ నాడు అనాగరికంగా కన్పించినా, ఆనాడు అది తప్పనిసరి. కొన్ని శాసనాలు దుర్మార్గంగా, కొన్ని శిక్షలు అమానుషంగా ఉన్నాయని, భాగ్యవంతులకు రాయితీలు ఇవ్వడం జరిగిందని, మనిషి ప్రాణం కన్న ఆస్తికి ఎక్కువ విలువ ఇవ్వటం జరిగిందని, విమర్శలు చేయబడ్డాయి. ఈ విమర్శలలో వాస్తవం లేక పోలేదు. అయినా 'హమ్మురాబీ' న్యాయ

సూత్రాలు ప్రాచీన ప్రపంచం లోని వివిధ రాజ్యాల మీద ఎనలేని ప్రభావాన్ని చూపాయి. పాలస్తీనా లోని సామ్రాజ్య స్థాపకులు హీబ్రూలతో సహా, ఈ న్యాయ సూత్రాలను అనుసంధించారు. మోసస్ న్యాయ సూత్రాలు భాషలో, భావంలో 'హమ్మురాబీ' కోడ్‌ను అనుసరించాయి. పర్షియా, గ్రీస్, రోమ్, అరేబియా దేశాల లోని శాసనకర్తలు, ఈ న్యాయ సూత్రాలను చాలా వరకు తమ న్యాయ సూత్రాలలో పొందుపరిచారు.

## 4.4. అస్సీరియా రాజ్య స్థాపన

తొలి బాబిలోనియా సామ్రాజ్యానికి తూర్పున 'కసైట్‌లు' (Kassites) అనే 'సెమిటిక్' జాతికి చెందిన ప్రజలుండేవారు. బాబిలోనియా సంపదను చూసి వారెన్నోమార్లు దోపిడి యాత్రలు చేశారు. కొండజాతి వారైన వారు దోపిడి దొంగలుగా మారి, ఆ తరవాత రాజ్యస్థాపనా దండయాత్రలను ప్రారంభించారు. హమ్మురాబీ తరవాత సమర్థులైన రాజులెవ్వరూ లేనందువల్ల, కసైట్‌ల నిరంతర దండయాత్రల వల్ల, ఎనిమిదేండ్ల కాలం లోనే బాబిలోనియా సామ్రాజ్యం పతనం చెందింది. 'కసైట్లు' మెసపటోమియాలో అశాంతికి, రాజకీయ గందరగోళానికి కారకులయ్యారు. వారు ఆరేళ్ళపాటు ఈ పరిస్థితులలో కొనసాగగా, ఉత్తరం నుండి అస్సీరియన్లు దండయాత్ర చేసారు. 'అషుర్' (Ashur) రాజధానిగా ఉన్న అస్సీరియన్లు, 'నినెవె' (Nineveh) కు మారారు. రక్తపిపాసులు, దుర్మదాంధులు, అయిన అస్సీరియన్లు, 'సెన్నాచెరిబ్' (Sennacherib) నాయకత్వంలో బాబిలన్ నగరాన్ని సర్వనాశనం చేసారు. 'కసైట్ల'ను పారద్రోలారు. కసైట్లు బాబిలోనియా భాష, మతాన్ని, సంస్కృతిని అలవరుచుకొన్నారు. బాబిలోనియాలో గుర్రాన్ని ప్రవేశపెట్టారు.

### 4.4.1. అస్సీరియన్ ప్రభుత్వ వ్యవస్థ

అస్సీరియన్‌లు ప్రముఖంగా సెమెటిక్ జాతికి చెందిన వారు. క్రీ.పూ. 3000 నాటికి వారు ఉత్తర మెసపటోమియాలో స్థిరపడ్డారు. మెసపటోమియాను సుమేరియన్‌లు, అక్కడ్‌లు, ఎమెరెట్‌లు పాలించే కాలంలో వీరు వ్యవసాయదారులుగా, పశువుల కాపరులుగా, జీవనం ప్రారంభించి, తరవాతి కాలంలో వర్తకవ్యాపారాల్లోకి దిగారు. నాటి పరిస్థితుల ప్రభావంగా, శాంతియుతంగా జీవించే ఈ జనావళి, ప్రాచీన చరిత్రలోనే ప్రసిద్ధి చెందిన సైనికులుగా మారారు. పర్వతాల వాతావరణం వారి దేహదారుఢ్యాన్ని అధికం చేసింది. వారు ఇరుగుపొరుగు వారిపైన, బాబిలోనియన్‌లు, 'హిటైట్లు' ఆర్మీనియన్లపై నిరంతర పోరాటాన్ని సాగిస్తూ, క్రమశిక్షణ కలిగిన సైనికులుగా రూపొందారు. క్రీ.పూ. 910లో 'బాబిలన్' నగరాన్ని ఆక్రమించుకొన్నారు. ఆతరవాత మధ్యధరా సముద్రం వరకు తమ దండయాత్రను, దోపిడీలను సాగించారు. వారి సైన్యాలు అజేయంగా నిలిచాయి. క్రీ.పూ. 722లో హీబ్రూలను ఓడించి, ఇజ్రాయిల్‌ను తమ అధీనంలోకి తీసుకొన్నారు. క్రీ.పూ. 700 నాటికి సారవంతమైన చంద్రవంకే కాక, దాని పరిసర ప్రాంతం కూడా వారి అధీనమైంది. మెసపటోమియా నగర రాజ్యాలకు స్వస్తి చెప్పి, కేంద్రీకృత సామ్రాజ్యాన్ని స్థాపించారు.

19వ శతాబ్దంలో జరిగిన తవ్వకాలలో ఎన్నో అస్సీరియన్ నగరాలు, శిలా శాసనాలు బయటపడ్డాయి. దీనివల్ల అస్సీరియా నాగరికతను గురించి మనకు చాలా వరకు సమగ్ర సమాచారం అందుబాటులోనికి వచ్చింది. ముఖ్యంగా అస్సీరియా రాజు అషుర్‌బనిపాల్ (Ashurbanipal) సేకరించిన గ్రంథాలయ ప్రతులు నాటి చరిత్రకు స్పష్టతను చేకూర్చాయి. నాటి పరిస్థితులను అధ్యయనం చేయడానికి ఎంతగానో ఉపకరించాయి.

### 4.4.2.రాజుల సంక్షిప్త చరిత్ర

అస్సీరియన్ శిలా శాసనాలు, లేఖలు ఎందరో రాజులను గురించి ప్రస్తావించాయి. వారిలో కొందరు విజేతలు, మరికొందరు పరిపాలనాదక్షులు. వీరి పాలనలలో సుమేరియా, బాబిలోనియా, ఫోనిషియా (Phonecia), ఈజిప్ట్‌లు సంలీనం చేయబడ్డాయి. మెసపటోమియా లోని చిన్న నగర రాజ్యాలు మొదటి షాల్‌మనేసర్ (Shalmanesar)

పాలనలో ఒకే కేంద్రాధికారం కిందికి వచ్చాయి.. కలఖ్ (Kalakah) అతని రాజధాని. 'రెండో తిగ్లత్ పిలేసర్' (Tiglath Pileser) అస్సీరియన్ రాజులలో ప్రముఖుడు. రెండో 'సరగాన్' (Sarogan II) అస్సీరియా ప్రభుత్వంలో ఉద్యోగిగా చేరి, రాజైన మరో ముఖ్యుడు. వీరే కాక, 'సెన్నాచెరీబ్' (Sennacherib) 'ఎసర్ హద్దాన్' (Esar haddan) అషుర్ బనిపాల్ మొదలైన వారంతా, అస్సీరియా రాజులలో ముఖ్యులు. ఈ రాజులంతా ప్రముఖంగా క్రూరులు. తాము జయించిన ప్రాంతాలను చాలా దుర్మార్గంగా, కొన్ని సందర్భాలలో నిర్హేతుకంగా కొల్లగొట్టారు. సర్వనాశనం చేశారు. 'సెన్నాచెరీబ్' అనే రాజు జెరూసలేమ్, ఈజిప్ట్‌లపై దండయాత్ర చేసి విఫలమయ్యాడు. ఆ కోపంతో 90 నగరాలను, 820 గ్రామాలను విధ్వంసం చేశాడు. బాబిలన్ నగర ప్రజల స్వేచ్ఛా ప్రవృత్తిని అనుసరించి, నగరాన్ని, విధ్వంసం చేయటమేకాక, వృద్ధులను, పిల్లలను హతమార్చాడు. దేవాలయాలను, రాజప్రాసాదాలను నేలమట్టం చేశాడు.

అస్సీరియన్‌లు 'అషుర్' (Ashur) 'అర్‌బేలా' (Arbela) 'కలఖ్' (Kalakh) 'నినెవె' (Nineveh) అనే నాలుగు పట్టణాలను అభివృద్ధి చేశారు. ప్రథమంలో అషుర్ (Ashur) వారి రాజధాని. కాని, అక్కడి వాతావరణం చాలా వేడిగా ఉండటం వల్ల, శత్రువుల దాడికి దగ్గరగా ఉండటం వల్ల, తరవాతి కాలంలో రాజధానిని 'నినెవె' నగరానికి మార్చారు. ఇది బాబిలన్‌కు ఉత్తరంగా 200 మైళ్ళ దూరంలో టైగ్రిస్ నది ఒడ్డున ఉంది. 'నినెవె' (Nineveh) అనతి కాలంలో ఎంతో అభివృద్ధి చెంది, మూడు లక్షల జనాభాతో విలసిల్లింది.

### 4.4.3. పాలనా వ్యవస్థ

అస్సీరియా సామ్రాజ్యం అత్యున్నత స్థితిలో ప్రాచీన సామ్రాజ్యాలన్నింటిలోను, అగ్రగామి అని చెప్పవచ్చు. అస్సీరియా, బాబిలోనియా, ఎలమ్, ఈజిప్ట్, మేడిహ్, పాలస్తీనా, ఫొనిషియా, సుమేరియా, సిరియాలు ఇందులో అంతర్భాగాలు. సైరస్ (Cyrus), డేరియస్ (Darius)ల కాలంలో స్థాపించబడ్డ ఒక్క పర్షియన్ సామ్రాజ్యమే, దీనికన్నా పెద్దది. ఈ విస్తృత సామ్రాజ్యంలో రాజకీయ వ్యవస్థ చక్కగా అనుసంధించబడింది. చక్రవర్తే సర్వ శాసనకర్త. అధికారులు అతని ఆదేశాలను అమలుపరుస్తారు. యుద్ధం, శాంతి, పన్నుల విధింపు, న్యాయ నిర్ణయం మొదలైన ముఖ్య విధులన్నీ రాజే నిర్వహించేవాడు. బ్రహ్మాండమైన రాజప్రాసాదాలలో పలువురికి కన్నుకుట్టే భోగభాగ్యాలతో కొలువు తీర్చేవాడు. రాజులకు సలహాలనిచ్చే ఉన్నత మండలి ఉండేది. అయితే, రాజాధికారం నిరపేక్షమైనది. అధికారులను నియమించటం, బర్తరఫ్ (రద్దు) చేయటం, శిక్షలు విధించటం, రాజు ఇష్టానుసారంగా జరిగేవి. ఉన్నతాధికారులకు లేఖకులు సహాయంగా ఉండేవారు. వారు జరిగిన విషయాల రికార్డులను భద్రంగా, జాగ్రత్తగా ఉంచేవారు. ఈ పద్ధతి అంతకు ముందున్న పాలనా వ్యవస్థలో లేదు.

సామ్రాజ్యం రాష్ట్రాలుగా విభజితమయింది. ప్రతి రాష్ట్రానికి ఒక గవర్నర్ నియమితుడయ్యాడు. రాజ్యం లోని ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి రహదారులు వేయడం జరిగింది. రాకపోకలు సుగమం కాగా, అస్సీరియన్‌లు ప్రాచీన కాలంలో మొదటిసారిగా తపాలా పద్ధతిని ప్రవేశపెట్టారు. మొదట్లో స్థానిక పాలన భూస్వామ్యప్రభువుల చేతిలో ఉండేది. తరవాత ఇది గవర్నర్ల అజమాయిషీ కిందికి వచ్చింది. పర్షియన్‌లు అస్సీరియన్‌ల తపాల పద్ధతిని, రహదారులను, పాలనా వ్యవస్థను అనుకరించారు. రాష్ట్ర గవర్నర్లు శాంతిభద్రతలను కాపాడటమేకాక, పన్నుల వసూలు, కాలువల తవ్వకం, చక్రవర్తికై సైన్యాలను సమీకరించడం మొదలైన విధులను నిర్వర్తించేవారు. కాలవల మరమ్మత్తు, రహదార్లను నిర్మించడంలో, గవర్నర్లు ప్రజలచే వెట్టి చాకిరి చేయించేవారు. ప్రతి విషయాన్ని జాగ్రత్తగా గమనిస్తూ, అధికారులు, గవర్నర్ల చర్యలపై నిత్యమూ చక్రవర్తికి తెలియజేసే సమర్థవంతమైన వేగులుండేవారు.

అస్సీరియా సామ్రాజ్యం సైనిక పునాదుల మీద నిర్మితమయింది. అందువల్ల, వారు ప్రజాభిప్రాయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. కొన్ని సందర్భాలలో రాజ్యం కేవలం సైనిక ప్రయోజనాలకే నిర్దేశించబడిందా అనే అనుమానం కలిగేది. అస్సీరియా సైనిక ప్రతిభ అద్వితీయం. క్రమశిక్షణ అంత కట్టుదిట్టంగా ఉండేది. ప్రాచీన కాలంలో వీరిని స్పార్టన్‌లతో

పోల్చవచ్చు. యుద్ధంలో ఇనప పరికరాలను ప్రప్రథమంగా వాడింది అస్సీరియన్లే. బాణాలు, విల్లంబులు, శిరస్త్రాణాలు, గొడ్డండ్లు, ఈటెలు, బరిసెలు, బల్లేలు, మొదలైనవాటిని చాల వరకు ఇనుము తోనే తయారు చేసేవారు. సైనిక వ్యూహరచన చాలా జాగ్రత్తగా జరిగేది. రథాలు, అశ్విక బలం సైన్యానికి చేయూతగా ఉండేవి. వారి భయంకర విధ్వంసక శక్తితో, నగరాలను సునాయాసంగా ధ్వంసం చేసేవారు. అస్సీరియన్‌ల దురాక్రమణకు ప్రజలు భీతిల్లేవారు. శాంతి కావాలంటే పన్నులు చెల్లిస్తూ, చక్రవర్తికి విధేయతను ప్రకటించాలి. బహుశా ఏ ప్రాచీన రాజ్యం లోను ప్రజలు అంతటి భీతావహ పాలనను చూసి ఉండరు. ఎదురుతిరిగిన ప్రజలను పెద్ద ఎత్తున దూర ప్రదేశాలకు ప్రవాసులుగా పంపి, వారి సమైక్యాన్ని విచ్ఛిన్నం చేసేవారు.

### 4.4.4.న్యాయ పాలన

సిద్ధాంతరీత్యా, అస్సీరియా రాజ్యం మతాధికార రాజ్యం. రాజు పురోహితుల మద్దతు మీద ఆధారపడేవాడు. 'అషుర్' దేవత రాజ్యానికి అధినేత అని, అతని పేరున రాజు అధికారం స్వీకరించాడనే కట్టు కథ ఆధారంగా, శాసనాలు, పన్నుల విధింపును, దైవం పేరుతోనే అమలుపరచడం జరిగేది. రాజు, పురోహితులు, అధికారులు, వివిధ న్యాయస్థానాలుగా న్యాయ నిర్ణయాన్ని చేసేవారు. వారి శాసనాలు 'హమ్మురాబీ' కోడ్ (స్మృతి) కన్నా, దుర్మార్గంగా ఉండేవి. శిక్షలు దారుణం. విచారణలో చిత్రహింసలు పెట్టేవారు. వెట్టిచాకిరి, ప్రవాసం, కొరడాలతో కొట్టడం, నాలుకను చీల్చడం, చెవులను ముక్కలుగా కోయడం, కళ్ళను పీకటం, తల తీయడం, మొదలైన శిక్షలన్నీ క్రూరంగా అమలుపరచబడేవి. దొంగతనం, వ్యభిచారం, బలాత్కారం వంటి విషయాలలో, మరణ శిక్ష విధించబడేది. 19వ శతాబ్దంలో క్రీ.పూ. 1300 నాటివి 90 ప్రకరణాలున్న న్యాయ శాసనాలు దొరికాయి.

అస్సీరియా పాలకుల దుర్మార్గపు చర్యలు, రక్తపిపాస వారికి చెరుపు చేసింది. ప్రజల సానుభూతి పూర్తిగా కోల్పోయిన వారి పాలన, 'అషుర్ బనిపాల్' మరణానంతరం పతనం చెందింది. క్రీ.పూ. 600 నాటికి ఉత్తర భాగంలోని నగరాలను బాబిలోనియా సైన్యాలు వశం చేసుకొన్నాయి. అస్సీరియన్‌లు 'సుసా', 'బాబిలన్' నగరాల్ని విధ్వంసం చేయగా, నేడు వారి పట్టణమైన 'నినెవె' అదే రీతిలో సమూలంగా నాశనం చేయబడింది. అస్సీరియా వైభవ చిహ్నం మిగలలేదు. వారు ఏరీతిలో అధికారంలోకి వచ్చారో, అదే పద్ధతిలో నాశనమయ్యారు.

## 4.5. చాల్డియన్ (Chaldean) పాలన

'అస్సీరియన్'లను జయించిన 'చాల్డియన్లు' నూతన బాబిలన్ సామ్రాజ్యాన్ని స్థాపించారు. 'నబోపాలసార్' (Nabopolassar) క్రీ.పూ. 625లో ఈ సామ్రాజ్యాధినేతగా రాజ్యానికి వచ్చాడు. అతని కుమారుడు "నెబుకద్‌నజర్" (Nebuchadnazzar) (క్రీ.పూ. 605 - క్రీ.పూ. 562) పాలనలో, చాల్డియన్ సామ్రాజ్యం పతాక స్థాయిని చేరింది. వీరు హిబ్రూలకు పరమ శత్రువులుగా మారారు. 'డేనియల్' తన గ్రంథంలో 'నెబుకద్‌నజర్' పాలనను తీవ్రంగా నిందించాడు. చాల్డియన్ల రాజధానిగా తిరిగి 'బాబిలన్' నగరం పూర్వ వైభవాన్ని సంతరించుకొన్నది. రాజ్యాధికారానికి, సంస్కృతీనాగరికతలకు, వర్తకవ్యాపారాలకు కేంద్రంగా భాసిల్లింది. 'నెబుకద్‌నజర్' ఈ ప్రాంతపు విజేతగా, పరిపాలనా దక్షునిగా, రాజనీతిజ్ఞునిగా, కళాపోషకునిగా చరిత్రలో నిలిచిపోయాడు. క్రీ.పూ. 604లో 'యూఫ్రటిస్' సమీపాన, అస్సీరియా, ఈజిప్ట్ సైన్యాలను సమూలంగా ఓడించాడు. క్రీ.పూ. 586లో జెరూసలేమ్‌ను విధ్వంసంచేసి, సగం యూదు జనాభాను ఊచకోత కోశాడు. మిగిలిన వారిని బందీలుగా 'బాబిలన్'కు తీసికొని వచ్చాడు. అందువల్లనే, 'ఓల్డ్ టెస్టమెంట్' (Old Testament) లో 'నెబుకద్‌నజర్'ను దయ్యపు బిడ్డగా, దుర్మార్గుడిగా చెప్పడం జరిగింది.

BRAOU

### 4.5.1. వైభవం

'నెబుకడ్‌నజర్' పాలనలో 'బాబిలన్' నగరం శోభాయమానంగా తీర్చి దిద్దబడి, పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. నగరంలో వేలాడే ఉద్యాన వనాలను, గ్రీకులు ప్రపంచ వింతలలో ఒకటిగా స్తుతించారు. 'నెబుకడ్‌నజర్' విజ్ఞతతో రాజ్యాన్ని పాలించాడు. సమర్థమైన, క్రమపద్ధతి ఉన్న పాలనా వ్యవస్థను ఏర్పరచాడు. పాలనా వ్యవస్థ వివరాలు అంతగా లేనప్పటికి, రాజ్యం సుభిక్షంగా కొనసాగడం వల్ల, వర్తకవ్యాపారాలు అభివృద్ధిచెందటం వల్ల, 'నెబుకడ్‌నజర్' పాలనాదక్షతను అవగాహన చేసుకోవచ్చు. పాలస్తీనా, సిరియాలు జయింపబడటంతో, మధ్యధరా సముద్రం, పర్షియా సింధుశాఖ లోని వర్తక రహదారులన్నీ, వారి వశమయ్యాయి. ఇది వారి సంపన్నతకు దోహదం చేసింది.

పన్నులు, రుసుములు, కప్పం రూపంలో పెద్ద మొత్తంలో నిధులు దొరకగా, వాటిని వ్యవసాయం, పరిశ్రమలు, దేవాలయాల నిర్మాణం, మొదలైన పనులకు విరివిగా ఖర్చు పెట్టడం జరిగింది. 145 మైళ్ళ చుట్టుకొలత గల ఒక పెద్ద చెరువు (రిజర్వాయర్) నిర్మితమయింది. వరద నీరు ఇందులోకి రాగా, ఆ నీటిని సాగుకు ఉపయోగించేవారు. ఎన్నో పంట కాలవలు తవ్వబడ్డాయి. వరద ప్రమాదం నుండి రక్షణను కల్పించడం జరిగింది. 'నెబుకడ్‌నజర్' పాలనలో కూడా, దైవదత్త అధికార సిద్ధాంతం, పూజారుల ప్రాభవం కొనసాగింది.

క్రీ.పూ. 561లో 'నెబుకడ్‌నజర్' మరణానంతరం, బలహీనులైన వారసుల వల్ల, ప్రభువుల మధ్య వివాదాల వల్ల, 'చాల్డియన్' సామ్రాజ్యం బలహీనపడగా, సైరస్ (Cyrus) అనే పర్షియా రాజు క్రీ.పూ. 539లో బాబిలోనియాను జయించి, పర్షియా రాజ్యంలో భాగంగా సంలీనం చేశాడు. పర్షియన్లు 'బాబిలన్' నగరాన్ని నాశనం చేయలేదు. 'సైరస్' దానిని ఒక రాజధానిగా కొనసాగించటంతో, పశ్చిమాసియాలో 'బాబిలన్' ఒక రాజకీయ, సాంస్కృతిక, వర్తక కేంద్రంగా విరాజిల్లింది. ఈ రీతిగా మెసపటోమియా చరిత్ర, నాగరికత ఐదు దశలుగా, వివిధ కాలాల్లో విరాజిల్లి, పర్షియా దండయాత్రలతో పరిసమాప్తి చెందింది.

BRAOU

## 4.6. ఆర్థిక, సాంఘిక జీవనం

మెసపటోమియా నాగరికత చాలా వరకు వారి ఆర్థిక స్థితిపై ఆధారపడింది. ప్రతి ఏటా నదులు పొంగి, పొర్లడంతో, భూమి సారవంతంగా మారి, బంగారు పంటలు పండేవి. నదులు పొంగడం ప్రమాదాలకు కూడా దారి తీయడంతో, ఎన్నో వరద నిరోధక చర్యలను తలపెట్టారు. క్రీ.పూ. 4000లలో కాలువలు తవ్వడం, వరద నీటిని మళ్లించడం వంటివి చేశారు. వారు సాధించిన నీటిపారుదల పద్ధతి, ఈ నాగరికత సాధించిన విజయాలలో తలమానికం. ఎన్నో రకాల ధాన్యాలు, కాయగూరలను, పండించేవారు. ఎద్దులతో లాగించే నాగలి వచ్చింది. విత్తనాలను వేయడానికి వాడే బుర్ర, నూర్పిడి చేయటానికి ఉపయోగించే సాధనాలన్నీ, ఈ కాలంలో వాడుకలోకి వచ్చాయి. సుమేరియన్‌లు రాగి, తగరాన్ని ఎక్కువగా వాడేవారు. ఆ తరవాత కంచు, ఇనుము, వాడకం వరకు, ఈ నాగరికత కాలంలోనే ఎదిగారు. మట్టి సాధనాల నుండి ఇనప పనిముట్ల వరకు, ఈ నాగరికత పురోగమించింది. నేత పని పెద్ద ఎత్తున ప్రభుత్వ అజమాయిషీలో జరిగేది. వారి గృహాలు మట్టితో, ఇటుకలతో నిర్మితమయ్యేవి. ఆవులు, గొర్రెలు, పందులు, మచ్చిక జంతువులు, బావుల నుండి నీరు తోడేవారు. వస్తువులను జల రహదారుల ద్వారా చేరవేసేవారు. అందుకోసం కాలవలను తవ్వేవారు. తరవాత భూరహదారులను నిర్మించారు. చక్రాల బండ్లు వచ్చాయి. నాణాలు ఉండేవి కావు. వర్తక వ్యాపారం వస్తువుల మార్పిడి ద్వారా జరిగేది. ఎన్నో మట్టి ముద్రల మీద నాడు జరిగిన వర్తక లావాదేవీలు లిఖితమయ్యాయి. వస్తువులను, బంగారం, వెండి మొదలైన వాటి మీద వడ్డీతో అప్పుగా తీసుకోవచ్చు. వడ్డీరేటు 10 నుండి 33 శాతం వరకు ఉండేది. వెండి, బంగారం, ఆయుధాలు, నగలు, పరికరాలు, నాటి సమాధులలో విరివిగా లభ్యమయ్యాయి. భాగ్యవంతులు, పేదవారు కాక, చిన్న వర్తకులు, మేధావులు,

పూజారులు, వైద్యులు, మధ్యతరగతిగా ఉండేవారు. వైద్యంలో కూడా కొంత ప్రగతి కన్పిస్తుంది. మనకు సరిగా అవగతంగాని క్యాలెండర్‌ను వారు ఉపయోగించేవారు. మొత్తం మీద నాటి ఆర్థిక జీవనం, సంపన్నత, నాగరికత అభివృద్ధికి తోడ్పడింది.

### 4.6.1. వర్గాల ఆవిర్భావం

ప్రభువులు పూజారులు పెద్ద ఎత్తున భూములను ఆక్రమించుకొని, బానిసలను, వెండిని కొనుగోలు చేసి, భాగ్యవంతులయ్యారు. రైతులు, వృత్తిపనివారు ఈ భాగ్యవంతుల నుండి అప్పులను తీసుకొని, వడ్డీ భారం ఎక్కువైనందున చెల్లింపులను చేయలేక పోయేవారు. వారి రుణబాధ పెరిగి, నిత్యం భయం, దరిద్రంతో జీవనం గడుపుతూ, బానిసలుగా మారేవారు. పేద రైతులకు భూమిపై ఎట్టి హక్కు లేదు.

వారు కేవలం కౌలుదారులుగా ఉంటూ, ఫలసాయంలో మూడింట రెండు వంతులు భూస్వాములకిచ్చేవారు. యుద్ధంలో పట్టుబడినవారు కూడా బానిసలుగా మారేవారు. బానిసలు దేవాలయాల్లో, ప్రభువుల ఇళ్ళల్లో పనిచేసేవారు. మెసపటోమియాలోని బానిసలు ప్రభువులను ఎదురుగా చూడటానికి వీలులేదు. వారు కళ్ళున్న కబోదులు.

### 4.6.2 సాంఘిక వ్యవస్థ

అస్సీరియా నాగరికతా కాలంలో సామాజిక వ్యవస్థ పితృస్వామికమైంది. తండ్రికి మాత్రమే సంతానం పైన సంపూర్ణ అధికారం. భార్యలను కొనుగోలు చేసేవారు. వారి పరిస్థితి బానిసల స్థితికన్నా కొంచెం మెరుగ్గా ఉండేది. భర్త చనిపోతే, వితంతువు ఆతని సోదరుని భార్యగా మారుతుంది. పెళ్ళి అయిన స్త్రీ ముసుగును ధరించాలి. ఇది ఒక ప్రత్యేకత. బానిస స్త్రీలు, వెలయాండ్రు ముసుగులు ధరిస్తే, కఠిన శిక్షలకు లోనవుతారు. అలా ముసుగు ధరించిన ఒక వెలయాలి తలను మరుగుతున్న ద్రావకంలో ముంచితే, మరో బానిస స్త్రీ చెవులు కోసినట్లు చెప్పబడింది.

ఆ రోజుల్లో బానిసలను కొనుగోలు చేయడం, చాలా ఖర్చుతో కూడినపని. అందువల్ల, భాగ్యవంతులు స్వేచ్ఛగా వున్న వ్యవసాయదారులకు అమిత వడ్డీపై రుణాలనిచ్చేవారు. వారి భూములను, ఇళ్లను, కుటుంబ సభ్యులను తనఖాగా తీసుకొనేవారు. అలా తనఖాగా తీసుకోబడిన వ్యక్తులను శారీరకంగా హింసించకూడదని, అమ్మాయిలను తండ్రి అనుమతి లేకుండా అమ్మకూడదని, శాసనం చేయబడింది. అప్పును సకాలంలో చెల్లించకపోతే, తనఖా పెట్టబడిన వ్యక్తి బానిసగా మారతాడు. అతనిని కొట్టవచ్చు, బాధించవచ్చు, చివరకు అమ్మవచ్చు కూడా !

బాబిలోనియా నాగరికతా కాలం నాటికి, సాంఘిక వ్యవస్థలో మూడు వర్గాలు ఏర్పడ్డాయి. సర్వ హక్కులు కల పౌరులు, స్వేచ్ఛా పౌరులు, నిమ్నవర్గాలుగా వారిని విభజింపవచ్చు. రాజ్య, దేవాలయ అధికారులు, పూజారులు, వర్తకులు, వృత్తి కళాకారులు, భూమిగల్గిన రైతులు ప్రధమ వర్గం. వీరి చేత ఎన్నిక చేయబడిన ప్రజా సభ, దేవాలయానికి అనుబంధంగా వుంటుంది. కొన్ని సందర్భాలలో, ముఖ్యంగా వివాహ, ఆస్తి తగాదాలలో న్యాయ పరిష్కారాన్ని చేస్తుంది. ఈ వర్గంలోని వారందరికీ సమాన హక్కులు, వారసత్వపు హక్కు వుండేవి. రెండో వర్గమైన స్వేచ్ఛా పౌరులలో, విదేశీ అధికారులు, రాజ్య పాలనలో వున్న వలస ప్రాంతాల సైనిక, రాజోద్యోగులు, విదేశీ వర్తక వ్యాపారస్తులు, ముఖ్యులు. వీరు ప్రజా సభలో సభ్యులు కారు. కొన్ని సందర్భాలలో వారే తమ స్థానిక ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకునేవారు. వారికి భూసంబంధమైన హక్కులు లేనందున, వారికి పౌరహక్కులు వుండేవి కావు. నిమ్నవర్గం మూడోది. ఇందులో భూమిలేని రైతులు, పై వర్గం వారికి తరతరాలుగా సేవలను చేస్తుండేవారు. అయితే, వారు బానిసలు కాదు. వారిని అమ్మడం నిషిద్ధం. వీరు ఎక్కువగా గ్రామాల్లో జీవనం గడిపేవారు. ఈ వర్గంలో అట్టడుగున వున్న బానిసలు, ప్రభువుల నిరంతర సేవలో కుమిలి కృశించే వారు. వందలాది బానిసలు దేవాలయాల పొలాల్లో పనిచేస్తే, భాగ్యవంతులకు ముగ్గురి నుండి ఐదుగురు వరకు బానిసలుండేవారు. కొన్ని సందర్భాలలో

బానిసలకు జీతం బదులు, కొంత ఆస్తిని ఇచ్చేవారు. అట్టి ఆస్తిని వీరు అమ్ముకోవడానికి, కౌలు కివ్వడానికి వీలుండేది. వారికి స్వంత ఇళ్లు, కుటుంబాలు కూడా ఉండేవి. అయితే, వారికి వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. వారికి స్వేచ్ఛనిచ్చే అధికారం ప్రభువుది. కాని, ఇట్టి బానిసలు చాలా కొద్ది మంది మాత్రమే. బానిసలలో అత్యధికులు ఎట్టి ఆస్తి, హక్కులు లేనివారే. తిరుగబడిన బానిసలను క్రూరంగా హింసించేవారు. వారిని కష్టమైన పనులలో నియోగించేవారు. వారు ఏడాది పాటు ఏదో ఒకపని చేస్తూ వుండాలి. క్రీ.పూ. 1000 నాటికి, ఈ బానిసల స్థితి కొంత మెరుగయింది. అప్పు చెల్లించకపోతే, కారాగార వాసాన్ని విధించవచ్చు కాని, అతనిని బానిసగా అమ్మకూడదని శాసనం చేయబడింది. ఈ బానిస వ్యవస్థ, ఆనాటి ఆర్థిక వ్యవస్థను ఎంతగానో ప్రభావితం చేసింది.

## 4.7. సంగ్రహంగా

ఈ భాగంలో మెసపటోమియా నగర రాజ్యాల స్థాపన, వివిధ దశలలో అవి సాధించిన అభివృద్ధిని ప్రస్తావించడం జరిగింది. నాటి సాంఘిక, ఆర్థిక జీవనం గురించిన ప్రస్తావనలు, హమ్మురాబీ న్యాయసూత్రాలలో మాత్రమే లభ్యమవుతాయి. కాని, ఆవిషయాలను అక్కడే ప్రస్తావించడం జరిగింది. ఈ మెసపటోమియా నాగరికతలోని రాజ్య వ్యవస్థను గురించి వివరంగా చెప్పడం జరిగింది.

## 4.8. పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1) సుమేరియా నగర రాజ్యాల స్థాపనను వివరించి, నాటి పాలనా వ్యవస్థను గురించి సంగ్రహంగా తెలపండి.

2) హమ్మురాబీ న్యాయ సూత్రాలను వివరించి, నాటి ప్రాధాన్యతను విశ్లేషించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1) అకాడియా ప్రభుత్వ వ్యవస్థ

2) చాల్డియన్ పాలన

3) సుమేరియా ఆర్థిక జీవనం

## 4.9. ఉపయుక్త గ్రంథాలు


Will Durant : **Story of Civiliztion**

Arthur Coterich : **Ancient Civiliztions**

**Cambridge Ancient History, Vols. I & II**


BRAOU

# భాగం-5 : మతం - తత్వ వివేచన

విషయక్రమం


5.0 లక్ష్యాలు

5.1 పరిచయం

5.2 మెసపటోమియా మతాలు

5.2.1 ఆధారాలు

5.2.2 సుమేరియన్‌ల మతం

5.3 మరో ప్రపంచ ఆలోచనలు

5.4 తొలి బాబిలోనియన్ల మతం

5.5 అస్సీరియన్‌ల మతం

5.6 కాల్డియన్ల మతం

5.7 నాటి సాహిత్యం : సాహితీపరంగా వచ్చిన పురాణ గాధలు

5.7.1 మానవ సృష్టి గాధ

5.8 వృక్షకోటి గురించిన గాధ

5.9 గిల్గిమెష్ ఐతిహ్యం

5.10 సంగ్రహంగా

5.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

5.12 ఉపయుక్త గ్రంథాలు


BRAOU

## 5.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల, మెసపటోమియా లోని సుమేరియా, అస్సీరియా, బాబిలోనియా, కాల్డియా నాగరికతల కాలంలో, ప్రజల నమ్మకాలు, మత విశ్వాసాలు, ఆచారాలు, పరలోక చింతన గురించిన అభిప్రాయాలన గ్రహించగలగాలి. వీటికి తోడుగా, వారు విశ్వసించే కొన్ని ముఖ్య గాధలను గూడా విశ్లేషించగలగాలి.

## 5.1 పరిచయం

మెసపటోమియా నాగరికత ఏఏ కాలాలలో ఎట్లా పరిణతి చెందినది, భిన్న రాజ్యాల పాలనలో ఎట్లాం రాజకీయ పరిణామాలు, వాటి ఆర్థిక, సాంఘిక జీవనం గురించి ఇంతకు ముందు చదివున్నాం. మతం, ఆలోచనల మత వ్యవస్థల ఆవిర్భావం, వాటి పరిణామం మొదలయిన విషయాలన్నీ నాటి సంస్కృతిలోని అంతర్భాగా

మెసపటోమియాలో నివసించిన సుమేరియన్‌లు, అక్కడ్‌లు, అమరోట్లు, తొలి బాబిలోనియన్‌లు, అస్సీరియన్‌లు, కాల్డియన్‌లు (తరవాత బాబిలోన్‌లు) మతం గురించి, మరో జన్మ గురించి, దేవుళ్ళను గురించి ఏమి ఆలోచించారు? ఎలా ఆలోచించారు? వారి వేదాంత ధోరణి ఎలా సాగింది? అనే విషయాలను ఈ పాఠంలో చదువుతాం.

ఒక పద్ధతి లేనిది సాంఘిక వ్యవస్థ లేదు. నియమాలు లేనిది పద్ధతి రాదు. చరిత్రలో శాసనాలకన్న, ఆచారాలకు, ఆనవాయితీలకు ఎంతో విలువ కనిపిస్తుంది. జీవన గమనానికి కొన్ని పద్ధతులు అవసరం. అయితే, అవి జన సముదాయాలను బట్టి మారుతూ ఉంటాయి. అయితే, ఒక జన సముదాయంలో సామాన్యంగా ఒకే రకమైన పద్ధతులుంటాయి. ఈ పద్ధతులను, ఆచారాలను కాని, ఆనవాయితీలు, నైతిక సూత్రాలను కాని, శాసనాలు అని కాని వ్యవహరించవచ్చు. ఒక జనసముదాయం తమ అవసరాలకనుగుణంగా నడచుకొనే పద్ధతులు, ఆచారాలు. అలాంటి పద్ధతులనే కొన్ని తరాల వారు అనుసరిస్తూ, చిన్న చిన్న మార్పులు, చేర్పులు చేస్తూ కొనసాగిస్తుంటే, అవే ఆనవాయితీలుగా మారతాయి. వీటిని ఏ పేరున పిలిచినా, ఆ పద్ధతులు ఆ ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి ఆవశ్యకాలుగా భావించబడినవన్నమాట. ఆదిమ ప్రజలలో లిఖిత న్యాయసూత్రాలు పెద్దగాలేవు. వారి మనుగడకు, సాంఘిక వ్యవస్థ స్థిరత్వానికి, ఆచారాలే ముఖ్యం. కొన్నాళ్ళకు ఆ ఆచారాలు పూర్తిగా వారిలో జీర్ణించుకపోయి, జరుగుతున్న దానికి వ్యతిరేకంగా ఏ పని చేసినా, వ్యవహరించినా భయపడేవారు. వారి ఆత్మ ఘోషించేది. ఇదే పశువులకు, మానవులకు మధ్య వ్యత్యాసమని డార్విన్ చెప్పారు. ఈ వ్యక్తిగత స్పృహ మరింతగా ఎదిగి, సామాజిక స్పృహగా మారుతుంది. అప్పుడు వ్యక్తి తన ఇష్టానుసారంగా కాక, సామాజిక దృష్టితో ఆలోచిస్తాడు, వ్యవహరిస్తాడు. విధేయత, ఇతరుల పట్ల శ్రద్ధ, అతనిలో ఒక రకమైన నైతిక బాధ్యతను కల్పిస్తుంది. ఈ ఆలోచన లేనిది ఏ నాగరికత, సంస్కృతి మనలేదు.

## 5.2 మెసపటోమియా మతాలు

మెసపటోమియా మతాలంటే సామాన్యంగా సుమేరియన్‌ల, అక్కడ్‌ల మత నమ్మకాలు, ఆచరణలను, పరిగణనలోనికి తీసుకొంటాం. ఇవి చాలావరకు సుమేరియన్‌ల నమ్మకాలు, ఆచారాలుగా ప్రారంభమైనాయి. వీటిని అక్కడ్‌లు కొంతవరకు మార్పు చేశారు. కొన్ని కొత్త ఆచారాలను ప్రవేశపెట్టారు. అనతికాలంలో వీరిద్దరి ఆలోచనలు, నమ్మకాలు సమ్మేళనం చెందాయి. ఈ సృష్టిని నడుపుతున్న శక్తులు, సరిఅయిన పద్ధతిలో జీవించటానికి వలసిన మార్గదర్శక సూత్రాలు ఈ మత ప్రాతిపదికలు కాగా, మత శక్తులు నాటి సంస్కృతిలోని సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సైనిక వ్యవస్థలను ప్రభావితం చేశాయి. మత ప్రభావం కవిత్వంలో, కళల్లో కూడా కనిపిస్తుంది. వీరి మత ప్రభావం మెసపటోమియా అవతల కూడా కనిపిస్తుంది. తూర్పున ఉన్న 'ఎలమైట్‌లు' (Elamites), ఉత్తరాన ఉన్న 'హిటైట్‌లు, పశ్చిమాన ఉన్న ఇజ్రాయల్ జనాభా కూడా వీరి మతం నుండి కొన్ని సిద్ధాంతాలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అందుకొని, వారి మత విలువలలో నిక్షిప్తం చేసుకొన్నారు. మెసపటోమియా మత ఆలోచనలు పొరుగుననున్న సంస్కృతులను ప్రభావితం చేయటమే కాక, వాటి పద్ధతులలో, ఆలోచనల్లో గణనీయమైన మార్పులను తీసుకొని రావడం జరిగింది.

### 5.2.1 ఆధారాలు

ప్రాచీన మెసపటోమియా మతం గురించి తెలుసుకోవటానికి మనం పూర్తిగా పురాతత్వ తవ్వకాలపైనే ఆధారపడాలి. గత శతాబ్దంలో మెసపటోమియా నగర శిథిలాల తవ్వకాలలో లభించిన మట్టి దిబ్బలు ముఖ్యాధారం ఇక్కడ 'క్యూనిఫారం' లిపిలో రాయబడిన మట్టి గుళికలు, రాళ్ళమీద రాతలు సాహిత్యపరమైన మూలాలు. అన్నింటికన్నా ముఖ్యమైనవి మత పరమైన రాతలు, దేవుళ్ళ జాబితాలు, ప్రార్థనా గీతాలు, మత సంబంధతిత కర్మకాండ విశేషాలు. శోకగీతాలు, పుక్కిటి పురాణాలు, మంత్రోచ్చారణలు, కుల, మతపరమైన రాతలు ముఖ్యమైన ఆధారాలు. అయితే, ఆనాటి మతం సంస్కృతిలోని ప్రతి భాగాన్ని స్పందింపజేసి, ప్రభావితం చేసినందువల్ల, తవ్వకాలలో లభ్యమైన విశేషాల నుండి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఎంతో కొంత సమాచారాన్ని సేకరించవచ్చు.

మతాన్ని గూర్చి తెలియజేసే ముఖ్య పురావస్తు ఆధారాలు, క్రీ.పూ. 1800 - 1600 నాటివని చెప్పబడే రాతలున్న మట్టి గుళికలు. నిప్పూరు (Nipor), పురో (Puro) ల వద్ద లభ్యమయ్యాయి. సుమేరియన్‌లకు, అక్కడ్‌లకు చెందిన మతపరమైన రాతలు, ముఖ్యంగా 'నినవె'ను పాలించిన అస్సీరియా రాజు అషూర్ బనిపాల్ II (Ashurbanipal, క్రీ.పూ. 688 - క్రీ.పూ. 624) అతి ముఖ్యమైన పుస్తక భాండాగారం, మత విషయాలను తెలుసుకోవడానికి ఉపకరిస్తాయి. ఈ రాతలే కాక, ఎరిక్ (Erich), ఉర్ (Ur), నిప్పూర్ (Nipper), బాబిలన్ (Babylon), అషూర్ (Ashur), నినెవే (Ninveh) ప్రాంతాలలో బయల్పడిన దేవాలయాలు, దేవాలయాల శిఖరాలు, వివిధ కాలాలకు చెందిన కళాఖండాలు కూడా, నాటి మత పరిస్థితులను అధ్యయనం చేయడంలో ఉపకరిస్తాయి. పవిత్ర వివాహ వ్యవస్థను చిత్రీకరించిన ఉరుక్ పాత్ర, సూర్యభగవానుడు న్యాయ సూత్రాలను ప్రసాదిస్తున్నట్లుగా ఉన్న 'హమ్మురాబీ' శిలా స్తంభం, విజయ యాత్రలకు సంబంధించిన మరికొన్ని శిలా స్తంభాలు, దీనికి ఉదాహరణలు. అయితే, వీటిని పరిశీలించి విశ్లేషించడం అంత సులభం కాదు. ఆధునిక కాలంలో జీవిస్తున్న మనం అంత పురాతనమైన విషయాలను శోధించి సాధించడంలో, ఆలోచనల అంతరం బాధిస్తుంది. కాల నిర్ణయ, కాలక్రమం కూడా అంత సులభం కాదు. ఒక్కొక్కసారి కవిత్వం మీద ఆధారపడి, అభూత కల్పనలకు కూడా దారి తీయవచ్చు. భాషా భేదం చెప్పే పద్ధతులనుబట్టి కూడా, కొన్ని సందర్భాలలో పొరపాట్లు దొర్లవచ్చు.

## 5.2.2 సుమేరియన్‌ల మతం

సుమేరియన్‌లు ఎందరో దేవుళ్ళను పూజించేవారు. వారి మతం బహుదేవతల ఆరాధన మీద నడిచింది. (1) వాయుదేవుడైన 'ఎన్‌లివ్' (Enliv) వారి దేవుళ్ళలో అందరికన్న ప్రముఖుడు. 'నిన్‌లివ్' (Ninliv) అతని సహవాసి. నిప్పూర్‌లో వీరికై 'జిగరిట్' (Ziggarat) లు, లేదా శిఖరాల దేవాలయాలను నిర్మించారు. (2) హమాష్ (Hamash) అనే సూర్యదేవుడు మరొక ప్రముఖ ఆరాధ్య దేవత. యుర్-ఎంగుర్ (Ur-Engur) చక్రవర్తి హమాష్ (Hamash) దేవుని పేరున కొన్ని న్యాయసూత్రాలను ప్రవచించాడు. (3) ఇన్నిని (Innini) భూదేవత, ఆమె కన్య. ఉరుక్ నగర రాజ్యంలో ఆమె ఆరాధనాలయం కనిపిస్తుంది. (4) కిష్ లగాష్ (Kish Lagesh) ప్రజలు నింకర్ సాగ్ (Ninkarsag) అనే దేవతను ఆరాధించేవారు. ఆమె దుఃఖ విషాదాలకు అమ్మ తల్లి. భూమికి సాగునిచ్చే దేవుని 'నింగిరసు' (Ningirasu) అని పిలిచేవారు. (6) అబూ (Abu) అనే దేవత, వృక్ష సంపదకు మూలం. (7) చంద్రుడిని 'సిన్' (Sin) అనే దేవుని పేరున ఆరాధించేవారు. (8) ఎంకీ జలవనరుల దేవత. ఈ దేవతలే కాక, గాలిలో ఎన్నో మంచి క్షుద్ర శక్తులున్నాయని భావించేవారు. దేవతలు, రాక్షసులు, రకరకాల శక్తులు పరిభ్రమిస్తూ ఉంటాయని, క్షుద్రశక్తులు మంచిని పారదోలి మనిషి మీద ఆధిపత్యానికి నిరంతరం శ్రమిస్తూ ఉంటాయని వారి భావన.

ఈ దేవుళ్ళను 'జిగరుట్లు' లేదా గోపుర దేవాలయాల్లో ప్రతిష్ఠించేవారు. దీని కోసం ప్రజల నుండి విరాళాలను సేకరించేవారు. విరాళాలు ధనధాన్య రూపాల్లో ఉండేవి. దేవతలను తృప్తిపర్చి వారి నుండి వరాలు పొందడానికిగాను బలులు ఇచ్చేవారు. ప్రథమంలో నరబలి కూడా ఉండేది. క్రమేణా దానిని మానివేసి, కేవలం జంతువులను, పక్షులను బలి ఇచ్చేవారు. సుమేరియన్‌ల నాగరికతలో దేవాలయాలకు ప్రత్యేక స్థానముంది. అవి నాగరికతా కేంద్రాలు. ఫలితంగా, 'సుమేరియన్' నగర రాజ్యాలలోని పూజారులు, ధనవంతులు, బలవంతులు అయ్యారు. వారి పలుకుబడి విపరీతంగా పెరిగింది. పటేసీ (Patesi), లేదా పూజారి రాజు, నగర రాజ్యాధిపతి అయ్యాడు. కొద్దికాలంలోనే వారు స్వార్థపరులుగా, అవినీతిపరులుగా, లంచగొండులుగా మారారు. 'యురుకగినా' చక్రవర్తి వారిమీద చర్యలను తీసుకోడానికి ప్రయత్నించాడు. విద్యాలయాలు ఈ దేవాలయాలకు అనుబంధంగా ఉండేవి. ఈ పాఠశాలల్లోనే స్థానిక ఆడ, మగ విద్యార్థులు చదువుసంధ్యలను నేర్చుకొనేవారు. బడిగా, గుడిగా, దేవాలయాలు నాటి నాగరికతకు, మతానికి కేంద్రాలుగా పనిచేశాయి.

BRAOU

## 5.3 మరో ప్రపంచ ఆలోచనలు

చనిపోయిన తరవాత ఏమవుతుందీ, ఏమి జరుగుతుందీ అనే విషయంలో ఈజిప్ట్ వారు కొన్ని నిర్దిష్ట అభిప్రాయాలు, ఆలోచనలు చేశారు. అలాంటి నిర్దిష్టమైన ఆలోచనలు సుమేరియా నాగరికతలో కనిపించవు. చనిపోయిన తరవాత అందరూ భూమి అడుగుననున్న పాతాళానికి వెళ్ళగలరని, అది ఒకటి చీకటి గుయ్యారమని వారి భావన. చనిపోయిన వారి దేహాలు నగరాల బయట శ్మశాన వాటికలో పూడ్చి పెట్టేవారు. కొన్ని సందర్భాలలో ఇంటి పెరటి భాగంలో, లేదా గదుల కింద కూడ సమాధి చేసేవారు. శవాన్ని పూడ్చిపెట్టకపోతే, అది వీధులలో తిండి కోసం తిరుగాడుతుందనే భయం ఉండేది. బతికున్న జనాలను ప్రేతాలు పీడిస్తాయనే భయంతో, శవాలను జాగ్రత్తగా, అన్ని మర్యాదలతో పాతిపెట్టేవారు. చనిపోయిన వారితోపాటు, కుండలలో ఆహారం, కొన్ని ఆయుధాలను కూడా పూడ్చి పెట్టేవారు. ఆడవారికైతే మెరుగుపెట్టిన రాగి అద్దాలను సమాధులలో ఉంచేవారు. చనిపోయిన మనిషికి కూడా మరో ప్రపంచంలో అన్ని అవసరాలుంటాయని, అవసరాలకనుగుణంగా కావలసిన సదుపాయాలు కల్పించాలని, బతికుండగా అతనికెక్కువగా అవసరమైన వస్తువులను, అతని శవంతోపాటు ఉంచాలని భావించేవారు. ప్రాచీన సుమేరియాలోని ఉర్ నగరంలో బయల్పడిన రాజుల సమాధులలో, చనిపోయిన వ్యక్తి అంగరక్షకులు, ఆడ, మగ పని మనుషులు, ఎద్దులు కట్టిన రథాలను కూడా పూడ్చిపెట్టినట్లు సాక్ష్యాధారాలు కనిపించాయి. ఈ దేవుళ్ళు, దేవతలు మనం బతికుండగనే భోగభాగ్యాలు ఇవ్వగలరని, చనిపోయిన తరవాత వారు ఏమి చేయలేరనే ఆలోచన ఉండేది. మరణానంతర పరిణామాలపై వారికెలాంటి అధికారం లేదు. ఈ ఆలోచన వల్లనే, బతికుండగనే సుఖాలను, దీర్ఘాయువును ప్రసాదించమని ప్రార్థించేవారు. మరణానంతరం జీవితం కేవలం అంధకారమయమని వారి భావన.

## 5.4 తొలి బాబిలోనియన్ల (అమోరైట్స్) మతం

అమోరైట్లు, లేదా తొలి బాబిలోనియన్లు సుమేరియా మత ఆలోచనలచే ప్రభావితులై, బహు దేవతారాధనను, ఆరాధన కోసం పూజారుల ఆవశ్యకతను గుర్తించి, అనుసరించారు. నాటికి పూజారుల అధికార ప్రాభవాలు ద్విగుణీకృతంకాగా, 'హమ్మురాబీ' వంటి సమర్థుడైన రాజు కూడా వారిని తృప్తి పరిచి, గౌరవించి, రాజ్యమేలవలసిన పరిస్థితి ఏర్పడింది. రాజు అధికారం కూడా పూజారుల చేత అధికృతం చేయబడకపోతే, ప్రజలంగీకరించేవారు కాదు. ప్రతి కుటుంబానికి, సముదాయానికి, గ్రామానికి, నగరానికి, తమ తమ దేవతలు, దేవుళ్ళుండేవారు. ఒక అంచనా ప్రకారం 65 వేల మంది దేవతలుండేవారని, ఆ దేవ గణ ఆశీస్సుల కోసం, అభిమానాల కోసం నిరంతర ప్రార్థనలు, పూజలు జరిగేవని తెలుస్తుంది.

తొలి బాబిలోనియన్లు 'హమాష్' (Hamash) సూర్య భగవానుని పూజించేవారు. 'హమ్మురాబీ' చారిత్రక సమీకృత న్యాయశాసనాలు కూడా సూర్య భగవానుని నుండి గ్రహించబడినట్లుగా, అతని పేరున ప్రకటితమయ్యాయి. మొదట్లో 'మర్దుక్' (Marduk) వీరికి సూర్య భగవానునిగా ఉండేవాడు. హమాష్‌ను సూర్య భగవానునిగా గుర్తించడంతో, 'మర్దుక్'ను అధిదేవునిగా పూజించారు. ఇంతకు ముందు అధిదేవునిగా ఉన్న వాయుదేవుడు 'ఎన్‌లివ్' (Enliv) స్థానాన్ని, మర్దుక్ పొందాడు. ఆకాశాన్ని 'అను' (Anu) అనే పేరుతో, భూమిని బెల్ లేదా బల్ (Bel or Bal) అనే పేరుతో, చంద్రుడిని 'నన్నార్' (Nannar) అనే పేరుతో పూజించేవారు.

ఈ నాగరికతలో ప్రేమకు, అందానికి 'ఇష్టార్' (Ishtar) అనే పేరుతో దేవత వెలసింది. ఈమెను ఈజిప్ట్ నాగరికతలోని 'ఈసిస్' (Isis), గ్రీకుల 'అస్టార్ట్' (Astarte), హిబ్రూల అషతోరెట్ (Ashtoreth)తో పోల్చవచ్చు. ఇష్టార్ దేవతను బాబిలోనియన్లు దేవమాతగా, స్త్రీల సంరక్షకురాలిగా, సృష్టి ప్రతినిధిగా భావించి, దేవతలకు దేవతని, స్వర్గానికి వెలుగని, మహిళలకు మహిళని ప్రస్తుతించారు. ఈ దేవత చంద్రుని బిడ్డ అని తలచేవారు. ఈ సౌందర్య

BRAOU

దేవతారాధన తరవాతి కాలంలో గ్రీకులు, రోమన్‌లు కూడా అనుసరించారు. రోమన్‌లు సౌందర్య దేవతను 'ఎసర్డైట్' (Esardite) అని, గ్రీకులు 'వీనస్' (Venus) అని పిలిచేవారు.

ఈ నాగరికతా కాలంలో దేవుళ్ళ, దేవతల పేరున ఎన్నో కథలు, గాథలు అల్లబడ్డాయి. ఇది ఒక ముఖ్య పరిణామం. బాబిలోనియన్‌లు ఒక అద్భుత కల్పిత మత సాహిత్యాన్ని సృష్టించారు. మన మతంలో కూడా దేవుళ్ళపేరున వచ్చిన పురాణ గాథలు కోకొల్లలు కదా! దేవతలను తృప్తిపరచటానికి జంతువులను బలి ఇచ్చేవారు. వీటిలో గొర్రెల బలి అధికం. బలి ఇచ్చిన గొర్రె కాలేయాన్ని (లివర్) ఆధారం చేసుకొని భవిష్యత్తును చెప్పవచ్చుననే నమ్మకం వారికి ఉండేది. బాబిలోనియా నాగరికతలో సుమేరియన్ పద్ధతిలోనే దేవాలయాలు ఒక్క మతపరమైన నిర్మాణాలుగా కాక, నాటి సాంఘిక, ఆర్థిక జీవనానికి కేంద్రాలుగా విరాజిల్లేవి. గుడి మనిషికి, దేవుడికి అనుసంధాన వ్యవస్థ. దేవాలయాలు సంపదలతో తులతూగేవి. దేవాలయాల వ్యవహారాలను చూడటం కోసం పెద్ద సిబ్బంది ఉండేది. పూజారులు, పూజారిణులు, గొర్రెల కాపరులు, మత్స్యకారులు, పూజారులకు సేవ చేసే పనివారు ఎందరో ఉండేవారు.

## 5.5 అస్సీరియన్‌ల మతం

అస్సీరియన్‌లు చాలావరకు సుమేరియన్‌ల, బాబిలోనియన్‌ల మతాచారాలను అనుసరించారు. వారి కాలంలో దేవాలయాలు మరింత భాగ్యవంతంకాగా, పూజారులు మరింత అధికారాన్ని సంతరించుకొన్నారు. అస్సీరియన్‌లు స్వతహాగా యుద్ధ కాముకులు. ఆరితేరిన సైనిక శిక్షణ ఉన్నవారు. అందువల్ల, తమ తెగ యుద్ధదేవుడైన 'అస్సుర్' (Assur)ను పూజించేవారు. 'అస్సుర్' దేవతకు జీవిత వృక్షం ప్రతిరూపమని భావించేవారు. అలాంటి వృక్షాన్ని తయారుచేసి వసంత కాలంలో, ఆ చెట్టును అందంగా అలంకరించి, పూజలు చేసేవారు. ఈ ఆచారం, వారు తెగ ప్రజలుగా ఉన్నంతకాలం నడిచింది. అస్సీరియన్‌లు ఒక తెగ ప్రజలుగా కాక, ఒక సైనిక జాతిగా రూపాంతరం చెందిన తరవాత, 'అస్సుర్'ను ఒక భయంకర యుద్ధ దేవునిగా, సూర్యునికి ప్రతిరూపంగా భావించడం జరిగింది.

సౌందర్య దేవత ఇష్టార్ (Eshtar) ఆరాధన, అస్సీరియన్‌ల పాలనలో కూడా ఉండేది. ఈ కాలంలో కూడా అంతకు ముందున్న నాగరికతలలో ఉన్న దైవారాధన చాలావరకు యధాతథంగా కొనసాగింది. చనిపోయినవారిని అస్సీరియన్‌లు పెరడులో, లేదా గదుల కింద భూభాగంలో పాతిపెట్టేవారు. అస్సీరియన్‌ల రాజధాని 'అషుర్'లో జరిగిన తవ్వకాలలో, రాజప్రాసాదం అట్టడుగున పెద్దపెద్ద రాతి శవపేటికల శిథిలాలు కనిపించాయి. బహుశా, వారి మరో ప్రపంచ ఆలోచనలు కూడా అస్సీరియన్‌ల, బాబిలోనియన్‌ల పద్ధతిలోనే ఉండి ఉండవచ్చు.

## 5.6 కాల్డియన్‌ల మతం

కాల్డియన్‌లు కూడా తమకు ముందున్న సుమేరియన్, బాబిలోనియన్, అస్సీరియన్‌ల మత నమ్మకాలను, వ్యవస్థలను అనుసరించారు. మత విషయాలలో ఎలాంటి మౌలికమైన మార్పులను చేయలేదు. కాని, వారి నాగరికతలో ఏడుగురు దేవుళ్ళను ముఖ్యులుగా పరిగణించారు. సూర్యుడు, చంద్రుడు, నాటికి వారికి తెలిసిన మరో ఐదు గ్రహాలను గుర్తించి, వారిని ముఖ్యులుగా భావించారు. ఈ దేవుళ్ళను ఒకరి తరవాత ఒకరిని పూజించేవారు. ప్రతి రోజు ఒక దేవుని పేరుపెట్టి, ఆరోజున ఆదేవుడినే తప్పనిసరిగా ఆరాధించేవారు. ఈ పద్ధతిలో ఒక్కొక్క దేవునికి ఆరాధన ఏడు రోజుల కొకసారి వచ్చేది. ఈ దినాల పేర్లు క్రమబద్ధీకరింపబడి, ఏడు రోజులు అనే ప్రమాణ మేర్పడింది. ఇది తరవాత కాలంలో వారంగా మారింది.

BRAOU

## 5.7 నాటి సాహిత్యం : సాహితీపరంగా వచ్చిన పురాణ గాథలు

సుమేరియన్‌ల, బాబిలోనియన్‌ల, అస్సీరియన్‌ల సాహిత్యం, ప్రాచీన ఈజిప్ట్, పాలస్తీనా సాహిత్య ప్రమాణాలతో పోలిస్తే, చాలా తక్కువ. సాహిత్య సృష్టికన్నా, నాటి రాతలు కేవలం లెక్కలు రాయడానికి మాత్రమే పరిమితమైనాయి. బాబిలోయన్‌ల భాష సుమేరియన్, అక్కడ్‌ల భాష నుండి వచ్చింది. బాబిలోనియన్ల, సుమేరియన్‌ల భాషల మధ్య ఎంతో అంతరముంది. 'నినెవె' (Ninveh) లో ఉన్న అషుర్‌బనిపాల్ గ్రంథాలయంలో ఎన్నో మట్టి ముద్రలు దొరికాయి. వాటిమీద సుమేరియా, అస్సీరియా, బాబిలోనియా భాషలలో నిఘంటువులు, వ్యాకరణం రాయబడ్డాయి.

### 5.7.1 మానవ సృష్టి గాథ

బాబిలోనియన్‌లు సృష్టించిన పురాణగాథలెన్నో ఆధునిక కాలంలో హీబ్రూ సాహిత్యం ద్వారా వెలుగులోకి వచ్చాయి. వీటిలో సృష్టికి సంబంధించిన గాథ ముఖ్యమైంది. ఈ గాథను బాబిలోనియన్‌లు, అస్సీరియన్‌ల నుండి, వారు సుమేరియన్‌ల నుండి గ్రహించారు. వారి కథనం ప్రకారం, ప్రథమంలో స్వర్గం, భూమి రెండూ లేవు. కేవలం ఏ విభజన లేని సంకుల స్థితి (chaos) అవ్యక్త స్థితి ఉండేది. క్రమేణా ఒక పద్ధతిలో వస్తువులు రూపాన్ని సంతరించుకోడం మొదలయింది. అది ఇష్టం లేని రాక్షస దేవత 'తియమట్' (Tiamat) దేవతలందరినీ నాశనం చేసి, తిరిగి అవ్యక్త స్థితిని పునరుద్ధరించాలని, తన ఆధిక్యాన్ని చాటుకోవాలని విధ్వంసాన్ని ప్రారంభించింది. 'తియమట్' రాక్షస దేవత మర్దుక్ (Marduk) దేవుని మింగడానికి నోరు తెరవగా, మర్దుక్ ఆమె నోటిలోనికి సుడిగాలిని పంపించాడు. రాక్షస దేవత మృత దేహాన్ని నిలువుగా రెండుగా చీల్చి, ఒక సగాన్ని వేలాడదీయగా అది స్వర్గంగా, మరో భాగాన్ని తన కాలికింద నొక్కిపెట్టగా, అది భూమిగా మారాయి. ఆ తరవాత మర్దుక్ దేవుడు తన రక్తంతో మట్టిని కలిపి, భూమి మీద మానవులను సృష్టించాడు. వీరు దేవుని సేవలకోసం సృష్టించబడ్డారు. మట్టి నుండి మానవులు వచ్చారు. ప్రథమంలో వారు అమాయకులు, నిరాడంబరులు. తరవాత 'ఒయాన్నిస్' (Oannes) అనే సగం వేదాంతి, సగం చేప రూపం వంటి విపరీత ఆకారంలో ఉన్న వ్యక్తి, మానవులకు నాగరికత, కళలు, శాస్త్రవిజ్ఞానాన్ని నేర్పాడు. తన పని పూర్తికాగానే 'ఒయాన్నిస్' సముద్రంలోకి దూకి, నాగరికత మీద గ్రంథాన్ని రాశాడు.

మానవుల ప్రవర్తన నచ్చని దేవతలు ఒక పెద్ద ప్రళయాన్ని సృష్టించి, అందులో మానవులను సర్వనాశనం చేయాలనే ఉద్దేశంతో బ్రహ్మాండమైన వరదను పంపగా, జ్ఞాన దేవుడైన 'ఈ' (Ea) మానవాళిని కనికరించి, ఒక సత్ప్రవర్తన కలిగిన షమాష్‌నపిష్టమ్ (Shamashnapistham) అనే మానవుని, అతని భార్యను వరద నుండి కాపాడగా, వారు 'నిసిర్' (Nisir) పర్వతం మీద తలదాచుకొన్నారు. షమాష్‌నపిష్టమ్ దేవతలకు బలులు ఇవ్వగా, వారు తృప్తి పడ్డారు. ఈ విధంగా తరవాతి కాలంలో మానవుల మనుగడ కొనసాగింది.

## 5.8 వృక్షకోటి సృష్టిని గూర్చిన గాథ

వృక్షకోటి ఉద్భవాన్ని గూర్చి కూడా సుమేరియన్లు ఒక పురాణ గాథను సృష్టించారు. బాబిలోనియన్లు ఈ గాథను కొంతమార్చి, ప్రచారం చేసారు. ప్రేమ దేవత 'ఇష్టార్' (Ishtar), తాముజ్‌ను (Tamuz) ప్రేమించి పెళ్ళి చేసుకొన్నది. 'తాముజ్' జ్ఞాన దేవుడైన 'ఈ' కుమారుడు. అతడు 'ఎరిడా' వృక్షం కింద గొఱ్ఱెలు కాచుకొనేవాడు. 'ఎరిడా' వృక్షం మొత్తం భూమికే నీడనిచ్చేది. ఒక దినమున మదించిన అడవి పంది 'తమూజ్'ను చంపివేసింది. చనిపోయిన తమూజ్ అందరివలె చీకటి రాజ్యంలోకి వెళ్ళాడు. ఆ రాజ్యాన్ని 'ఇష్టార్' సోదరి 'ఎరిష్‌కిగల్' (Erishkigal) పరిపాలించేది. ఈమె చాలా అసూయాపరురాలు. ఇష్టార్ చీకటి రాజ్యంలోకి వెళ్ళి 'తమూజ్'ను తీసుకరాదలచగా, ఆమె సోదరి ఆమెను కారాగారం పాలు చేసింది. కారాగారంలో ఆమె 60 రకాల జబ్బులకు లోనైంది. ఇష్టార్ లేని కారణంగా ప్రపంచంలో వృక్షాలు, జంతువులు, ఎట్టి పునరుత్పత్తి లేక నశించిపోవడం మొదలైంది. జనాభా కూడా తగ్గింది. ఈ పరిస్థితిని



BRAOU

గమనించిన దేవతలు 'ఇష్టార్'ని వదలివేయమని ఆమె సోదరిని ఆదేశించారు. తమూజ్‌తో సహా ఇష్టార్ భూమికి తిరిగి రావడంతో, తిరిగి చెట్లు చిగురించాయి. పశు సంపద వృద్ధి పొంది, పూర్వ స్థితి ఏర్పడింది. ఈ కథ చావు పునర్జన్మలను గురించి తెలియజేస్తుంది. ప్రతి ఏడాది బాబిలోనియన్‌లు తామూజ్ చనిపోయిన దినాన్ని దుఃఖ దినంగా, తిరిగి వచ్చిన దినాన్ని పండుగ దినంగా జరుపుకొంటారు.

## 5.9 గిల్గిమెష్ ఐతిహ్యం (Epic of Gilgimesh)

బాబిలోనియా సాహిత్యంలో గిల్గిమెష్ ఐతిహ్యం ఆణిముత్యం. గిల్గిమెష్ 'యురుక్' నగర పూజారి రాజు ప్రపంచాన్ని ముంచిన వరద నుండి కాపాడబడిన ఏకైక వ్యక్తి. అతని తల్లి 'నిస్సన్' (Nissan) దేవత. తండ్రి 'కుల్లాబ్ (Kullab) అధిపూజారి. గిల్గిమెష్ ఐతిహ్యం గ్రీక్ ఐతిహ్యం 'ఇలియడ్' (Iliad) వలె ఎన్నో గాథల సముదాయం. సుమారు 5 వేల సంవత్సరాల కాలం కథలు ఇందులో ఉన్నాయి. నిన్వేలోని అసుర్‌బనిపాల్ గ్రంథాలయంలో ఈ ఐతిహ్యాన్ని 12 మట్టి పలకలమీద పురావస్తు శాస్త్రజ్ఞులు కనుగొన్నారు.

గిల్గిమెష్ స్ఫురద్రూపి, అందగాడు, బలమైనవాడు. ప్రపంచాన్నంతా చూశాడు. ఎంతో తెలివి గలవాడు. అతడు రెండు వంతులు దేవుడు, ఒక వంతు మానవుడు. అతడికన్నీ తెలుసు. వరదలు ఎప్పుడు రాగలవో చెప్పగలడు. అన్ని రహస్యాలు తెలుసు. ఎన్నో వీరోచిత కృత్యాలను చేశాడు. ప్రపంచమంతా తిరిగాడు. కోటలు నిర్మించాడు. ఎరిక్‌లో కోటలు నిర్మించడానికి గిల్గిమెష్ ప్రజలను ఎన్నో బాధలకు గురిచేశాడు. భార్యల నుండి భర్తలను, తల్లుల నుండి కన్యలను విడదీసి, రేయింబవళ్ళు వారితో పని చేయించాడు. వారంతా గిల్గిమెష్‌పై ఇష్టార్ దేవతకు ఫిర్యాదు చేయగా, ఆమె దేవతల తల్లిని ఒక గొప్ప వీరకుమారుని ప్రసాదించమని, అతడు నిరంతరం గిల్గిమెష్‌ని పోరాటంలో ఉంచితే, ప్రజలు శాంతిసుఖాలతో ఉండగలరని వేడుకొన్నది. 'ఇష్టార్' దేవత కోరిక మేరకు మట్టిముద్ద నుండి 'ఎన్‌గిడ్' (Engidu) అనే వీరుని సృష్టించడం జరిగింది. 'ఎన్‌గిడ్' అడవి పంది బలాన్ని, పక్షి వేగాన్ని, సింహపు పౌరుషాన్ని, లేక క్రూరుడిగా ఒంటి నిండుగా వెంట్రుకలతో అడవి గడ్డిని మేస్తూ, నీరు తాగుతూ తిరిగేవాడు. అతన్ని పట్టుకోవడంలో విఫలమైన వేటగాళ్ళు 'ఎన్‌గిడ్'ను ప్రలోభపరచటానికి ఒక అందమైన పూజారిణి అరువుగానిమ్మని గిల్గిమెష్‌ని కోరారు. గిల్గిమెష్ పంపిన ఆ పూజారిణి ఎన్‌గిడ్‌ను తన జాణతనంతో లొంగదీసుకొన్నది. ఇది చూసిన జంతువులు అతనిని వదిలి వెళ్ళాయి. ఎన్‌గిడ్ ఒంటరివాడై బాధతో సొమ్మసిల్లిపోయాడు. పూజారిణి అతనిని దరిచేర్చుకొని మనిషిలా జీవించేటట్లుగా, మానవాహారం తీసుకొనేటట్లుగా మార్చివేసింది. పొగడ్తలతో అతనిని ముంచెత్తింది. గిల్గిమెష్‌తో మల్లయుద్ధానికి పురికొల్పింది. ఎన్‌గిడ్ ఓడిపోయాడు. అయితే గిల్గిమెష్ అతనిపట్ల ఎలాంటి పగ చూపలేదు. దానితో ఇద్దరు మిత్రులుగా మారి, విజయ యాత్రలను చేశారు. ఉరుక్ నగరాన్ని జయించిన తరవాత గిల్గిమెష్ సైనిక దుస్తులు తీసివేసి, రాజవస్త్రాలను ధరించాడు. అంతట 'ఇష్టార్' దేవత అతనిని ప్రేమించింది. పెళ్ళి చేసుకోమని వేడుకొన్నది. ఇంతకు ముందు ఆమె ప్రేమికులు గుర్రాలుగా, గొర్రెలుగా, సింహాలుగా మారిన విషయం తెలిసిన గిల్గిమెష్, ఇష్టార్ కోరికను నిరాకరించాడు. అంతట ఇష్టార్ తన తండ్రి అయిన 'అను'ను గిల్గిమెష్‌ను చంపేందుకు ఒక దైవాంశ ఉన్న ఎద్దును సృష్టించమని వేడుకొన్నది. ఇష్టార్ ఇంతకు ముందు తన ప్రేమికులను ఎలా భంగపరిచిందీ తెలుసుకొన్న 'అను' (Anu) అందుకు అంగీకరించకపోగా, ఇష్టార్ తాను ఆత్మహత్య చేసుకోగలనని, దాని ఫలితంగా ప్రేమ, కోరిక, సర్వప్రాణులు నాశనం కాగలవని బెదిరించింది. గత్యంతరం లేక 'అను' ఎద్దును సృష్టించాడు. కాని, గిల్గిమెష్, ఎన్‌గిడ్‌లు దానిని సంహరించారు. ఈ సంతోషం క్షణికమైంది. ఎన్‌గిడ్ ఇష్టార్ శాపంవల్ల జబ్బుపడి మరణించాడు.

స్నేహితుని మరణంతో దిగులు చెందిన గిల్గిమెష్, చావు అంటే ఏమిటి? దానినుండి మనం తప్పుకోగలమా? అనే మీమాంసలో పడ్డాడు. షమాష్‌నపిష్తిమ్‌కు చావు నుండి తప్పుకొనే విషయం తెలుసునని చెప్పగా, అతనిని కలవటానికి ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. ఎంతో దూరం ప్రయాణం చేశాడు. దారిలో ఎందరో దేవతలు సాయం చేశారు.

BRAOU

అడవులు, సముద్రాలు, గుహలు దాటి వెళ్ళి, 'షమాష్‌నఫిస్తమ్'ని కలిసి, చావును తప్పించుకొనే రహస్యం చెప్పమని వేడుకొన్నాడు. షమాష్ అతనికి ప్రళయ వరదను గురించి, దాని నుండి మానవ జాతిని రక్షించడానికి దేవతలు తనకు, తన భార్యకు చావు లేకుండా ఇచ్చిన వరాన్ని గురించి చెప్పి, గిల్గిమెష్‌కు ఒక ముళ్ళున్న మొక్కను ప్రసాదించాడు. ఆ మొక్క అద్భుతాలు గలది. సంతోషంగా తిరిగి వస్తున్న గిల్గిమెష్ స్నానం చేస్తుండగా, మొక్క వాసన చూసిన పాము దానిని సంగ్రహించింది. తాను పడిన కష్టం బూడిద పాలైందని బాధపడి, గిల్గిమెష్ 'ఉరుక్' నగరం చేరాడు. పాము ఆ మొక్కను తింటూ, కుబుసం విడుస్తూ, తిరిగి యౌవనాన్ని సంపాదించుకుంటుంది.

గిల్గిమెష్ ఎన్‌గిడ్‌ను బతికించమని ఎందరో దేవుళ్ళను వేడుకొన్నాడు. ఒక్కసారి అతనితో మాట్లాడటానికి అవకాశం కల్పించమన్నాడు. అతని కోరిక మన్నించబడి, ఎన్‌గిడ్ పునర్జీవుడు కాగా, చనిపోయిన తరవాత స్థితి ఏమిటని గిల్గిమెష్ ప్రశ్నించాడు. అతడు చెప్పిన భయంకర విషయాలకు మూర్ఛిల్లాడు. కథ అంతటితో ముగుస్తుంది. ఎంత కష్టపడినా చావులేని స్థితి రహస్యం తెలుసుకోవటం వీలుకాదనేది, నీతిగా భావించవచ్చు.

పైన చెప్పిన కథనాలు కాక, మెసపటోమియా నాగరికతకు సంబంధించిన మరెన్నో చిన్న చిన్న కథలు, గాథలున్నాయి. వాటిలో చావు పుట్టుకల ప్రస్తావనలు, స్వర్గం, నరకం ప్రస్తావనలు, ప్రార్థనా గీతాలు, బాధతో, పాపంతో పాడిన పాటలు ఉన్నాయి. అదికాక, జ్ఞానాన్ని బోధించే సూక్తులు కూడా కొన్ని లభ్యమయ్యాయి. "యువకుణ్ణి పొగడ్తలతో ముంచు, అతడు ఏ సాహసం అయినా చేస్తాడు", "కుక్కపిల్ల ముందు మాంసం పడవేయి - అది తోక ఆడిస్తూ వస్తుంది", "దేవుని మాటతో సమానమైన నీ తల్లి మాటను విను", "తగాదాల సమయంలో నీ ముఖంలో కోపం ప్రదర్శించకు, తగాదాలలో ఎవరైనా తగలబడుతుంటే ఆ మంటల నార్పే నిగ్రహం ప్రదర్శించు" మొదలగునవి ఈ సూక్తులకు మచ్చుతునకలు.

BRAOU

## 5.10 సంగ్రహంగా

ఈ భాగంలో తొలి నాగరికత అయిన మెసపటోమియాలో వివిధ నాగరికతా కాలాల్లో ప్రజలు ఇహం గురించి, పరం గురించి ఎలా ఆలోచించారో, ఏమేమి భావించేవారో, ఎలాంటి కథలు ప్రచారంలో ఉండేవో వివరించడం జరిగింది. వారి మతం, తత్వ వివేచన, తదితర నాగరికతల కాలాల్లో కూడా కనిపిస్తుంది.

## 5.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. మెసపటోమియాలో ఆవిర్భవించిన మత ఆలోచనలను తెలిపి, ఆ ఆలోచనలు వివిధ కాలాల్లో ఎలా రూపు చెందినదీ వివరించండి?

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. వృక్షకోటి గురించిన గాథ
2. గిల్గిమెష్ ఐతిహ్యం.

## 5.12 ఉపయుక్త గ్రంథాలు

Korvakin : ***History of the Ancient World***

Will Durant : ***History of Civilization***

Smith : ***Early History of Assyria to 1000 B.C.***

# భాగం-6 : కళలు - శాస్త్రవిజ్ఞానం

విషయక్రమం


6.0 లక్ష్యాలు

6.1 పరిచయం

6.2 సుమేరియా కళలు

6.2.1 ప్రాసాదాలు - దేవాలయాలు

6.3 బాబిలోనియా కళలు - వాస్తు శిల్పం

6.3.1 దేవాలయాలు

6.4 అస్సీరియన్ వాస్తుశిల్పం - కళలు

6.4.1 శిల్పం

6.4.2 చిత్రకళ

6.5 కాల్డియన్ కళలు

6.6 సుమేరియన్ ఖగోళ విజ్ఞానం

6.6.1 జ్యోతిష్య శాస్త్రం

6.6.2 గడియారాలు

6.6.3 తూకాలు, కొలతలు

6.6.4 గణితం

6.6.5 లోహ విజ్ఞానం

6.7 బాబిలోనియా శాస్త్ర విజ్ఞానం

6.7.1 గణితం

6.7.2 వైద్యం

6.8 అస్సీరియా శాస్త్ర విజ్ఞానం

6.9 కాల్డియా నాగరికత : శాస్త్ర విజ్ఞానం

6.10 లిపి - లేఖనం

6.11 సంగ్రహంగా

6.12 పరీక్ష నమూనా ప్రశ్నలు

6.13 ఉపయుక్త గ్రంథాలు


BRAOU

## 6.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని అధ్యయనం చేయడం వల్ల, సుమేరియన్ కళాప్రగతి, శాస్త్ర విజ్ఞానాభివృద్ధిని గురించి తెలుసుకోగలగాలి. సుమేరియా, బాబిలోనియా, అస్సీరియా, కాల్డియన్ నాగరికతలలో వికసించిన కళా వైభవాన్ని, ఎంతగానో అభివృద్ధి చెందిన శాస్త్ర విజ్ఞానాన్ని గురించి విశ్లేషించగలగాలి.

## 6.1 పరిచయం

మెసపటోమియా నాగరికతలో భాగస్తులైన సుమేరియన్‌లు, అమోరాలు (పాత బాబిలోనియన్‌లు), అస్సీరియన్‌లు, కాల్డీయన్‌లు (నూతన బాబిలోనియన్లు) నాటి వాస్తు శిల్పానికి, చిత్ర లేఖనానికి, విజ్ఞాన శాస్త్రానికి యధారీతిగా తోడ్పడ్డారు. అయితే, మెసపటోమియా వాస్తుశిల్పం, కళావైభవం ఈజిప్ట్‌తో పోల్చినపుడు, తక్కువే. దీనికి కారణం, ఈజిప్ట్‌లో లభ్యమైన శిలలు మెసపటోమియాలో చాలా కొద్దిగా మాత్రమే ఉండేవి. లియొనార్డ్ ఊలీ (Leonard Wooly), లాంగ్డన్ (Longdon) మొదలయిన పురావస్తు శాస్త్రజ్ఞుల నిరంతర కృషి వల్ల, 19వ శతాబ్దంలో పురావస్తు తవ్వకాలు జరిగి, మెసపటోమియా నాగరికతకు సంబంధించిన అనేక నగరాల శిధిలాలు వెలుగు చూశాయి. ఎరిడు, ఉర్, ఉమక్, లార్సా, లగాష్, నిప్పూర్, లినెవె మొదలయిన చోట్ల లభ్యమైన శిథిల వాస్తు సంపద, నాటి నాగరికత, కళా వైభవాన్ని మనకు తెలియపరుస్తుంది. అంతేకాక, తవ్వకాలలో లభ్యమైన వస్తు సంపద మూలంగా, సాహిత్య ఆధారాల మూలంగా, నాటి కళలు, విజ్ఞాన శాస్త్రాలను గురించిన సమాచారాన్ని మనం విశ్లేషించడానికి వీలున్నది.

## 6.2 సుమేరియా కళలు

సుమేరియాలో చిత్రకళ ఒక ప్రత్యేక విభాగంగా లేదు. అనాటి మట్టి పాత్రలపైన జంతువులు, తత్సంబంధమైన చిత్రణలు కన్పిస్తాయి. పురావస్తు తవ్వకాలలో సుమేరియన్లు శిల్పకళలను అభ్యసించినట్లుగా ఆధారాలున్నవి. లగాష్‌ను పాలించిన ప్రాజ్ఞరాజు గుడియా (Gudea) శిల్పాలు దొరికాయి. వలకు పెద్ద పట్టీ వేసుకొని, ఒడిలో చేతులు ముడుచుకొని, భుజాలు, కాళ్ళు ఎట్టి అచ్ఛాదన లేకుండా, జిజ్ఞాసలో మునిగి ఉన్నట్లుగా గుడియా శిల్పాకృతి లభ్యమైంది. ఈ శిల్పంలో గుడియా గంట ఆకారంలో ఉన్న చొక్కా వేసుకొన్నట్లుగా ఉంది. మనిషి పొట్టివాడులా కనిపిస్తాడు. సుమేరియన్‌ల దేవాలయాలు కూడా దేవుళ్ల, నాయకుల, జంతువుల శిల్పాలతో అలంకరించబడ్డాయి. అయితే, ఈ శిల్పకళ అంత అద్భుతమైనదేమీ కాదు. చాలా సామాన్యంగా ఉండే టెల్-ఎల్-ఉబాయిడ్ (Tell-el-ubaid)లో లభ్యమైన ఎద్దు రాగి విగ్రహం, ఉర్‌లో ఒక రాణి సమాధిలో దొరికిన వెండి ఆవు విగ్రహం అద్భుతమైనవి. రాతి శిల్పాలు అంత ప్రామాణికంగా లేకపోయినా, బంగారం, వెండి, రాగి, గవ్వలతో తయారైన విగ్రహాలు మాత్రం అద్వితీయంగా ఉన్నాయని లియొనార్డ్ ఊలీ ప్రస్తుతించాడు. ఇవి కాక, ఎరిడులో చలవరాతి సంబంధమైన నగిషీ చేసిన పాత్రలు దొరికాయి. క్రీ.పూ. 4000 నాటి అందంగా తయారుచేసిన బంగారు పాత్రలు, లోహ, రాగి నగలు ఉర్ సమాధులలో, ఎంటమెన్ (Entamen)లో ఒక వెండి పాత్ర, ఉర్‌లో ఒక కత్తి, బంగారు కత్తి, ఒర లభ్యమయ్యాయి. చిత్తరువులు చెక్కిన లోహ, రాగి వర్తుల స్తంభాకార ముద్రలు తవ్వకాలలో కనిపించాయి. వజ్రాలను పొదగడంలో సుమేరియన్‌లు ఒక ప్రత్యేకతను సంతరించుకొన్నారు. మొత్తంమీద వారి మట్టిపాత్రలు మోటుగా ఉన్నా, నగలు ...డాయి

### 6.2.1 ప్రాసాదాలు - దేవాలయాలు

కులీనులైన సుమేరియన్‌లు పెద్ద పెద్ద ప్రాసాదాలను, భవంతులను నిర్మించుకొన్నారు. ఇవి సామాన్యంగా మట్టి దిబ్బలపైన, ఎత్తైన ప్రదేశాలలో సుమారు 40 అడుగుల ఎత్తున నిర్మితమైనాయి. ఇక్కడ రాయి పెద్దగా లభ్యం కానందువల్ల, ఇటుకల వాడకం ఎక్కువ. ఈ ప్రాసాదాల గోడల లోపలి భాగం చదును చేయబడి, అక్కడక్కడ చక్కని బొమ్మలతో చిత్రీకరించబడ్డాయి. వెలుపల గోడలు ఎర్రరంగులో ఎన్నోరకాల చిత్రీకరణతో కనిపిస్తాయి. ఈ భవంతులకు ఎక్కడ కిటికీలు కనిపించవు. వాటిని చేరడానికి ఒకే దారి ఉండి, రక్షితంగా నిర్మితమయ్యాయి. నూతుల నీరు వాడేవారు. ప్రతి గృహం నుండి మురికి నీరు పోయే కాలువలున్నాయి. వస్తు సామగ్రి అంత విరివిగా లేకపోయినా, చీలలున్న కుర్చీలు, శయ్యలు అందంగా అలంకార ప్రాయంగా రూపొందించేవారు.

దేవాలయాలను రాతితో కట్టారు. రాళ్ళను ఎంతో దూరం నుండి తీసుక రావలసి వచ్చేది. వీటి నిర్మాణంలో డబ్బును లెక్కచేయక, ఎంతో విలువయిన సామగ్రిని వాడేవారు. రాగితో, విలువయిన వస్తువులతో, నగిషీ చేసిన స్తంభపు చిత్రాలున్నవి. ఉర్‌లోని నన్నారు దేవాలయం అద్భుతంగా నిర్మితమయింది. దీని నిర్మాణంలో ఊదారంగులోని పలకలు నేలమీద పరచగా, ఎంతో ఖరీదయిన కలప సామాగ్రితో లోపలి భాగాలు తీర్చిదిద్దబడ్డాయి. బంగారం, చలువరాయి, అపురూపమైన రత్నాలు, ఈ దేవాలయ నిర్మాణంలో ఉపయోగించబడ్డాయి. సుమేరియాలో నిర్మితమైన ముఖ్య దేవాలయాన్ని జిగరుట్, లేదా గోపుర దేవాలయం అని వ్యవహరిస్తారు. ఇది **ఎత్తైన** ప్రదేశంలో కాక, సమతలంలో నిర్మితమయింది. అయితే, ఇది మిగతా దేవాలయాల కన్న మూడు, నాలుగు నుండి ఏడు అంతస్తుల వరకు ఎత్తుగా నిర్మితమై, పైభాగం చేరడానికి బయటి నుండి చుట్టగా తిరిగే మెట్లు ఉండేవి. ఇవి ఆధునిక కాలంలోని స్కై స్రేపర్లను (Sky scrappers) పోలి ఉన్నాయి. అయితే, వీటిలో పెద్దగా అందంకాని, ఆకర్షణకాని లేదు. ఈజిప్ట్ వాస్తు శిల్పంలోని నాజూకుదనం కనిపించదు. చూపరిని ఆకట్టుకోలేదు. జిగరుట్ ఒక్క దేవాలయాలు మాత్రమే కాదు. వాని చుట్టూ సామాగ్రిని దాచే గదులు, పూజారులు, దేవాలయ పనివాండ్రు నివసించడానికి గృహాలు, దుకాణాలు, పని ప్రదేశాలు మొదలైన నిర్మాణాల సముదాయం ఉండేది.

## 6.3 బాబిలోనియా కళలు - వాస్తుశిల్పం

ప్రాచీన బాబిలన్ నగర శిధిలాలు వారు వాస్తుశిల్పంలో, తదితర కళలలో సాధించిన విజయాలకు అద్దం పట్టాయి. అయితే, ఈ రంగంలో ఈజిప్ట్‌తో పోలిస్తే, బాబిలోనియా కూడా చాలా వెనకపడి ఉందని అంగీకరించక తప్పదు. బాబిలన్ నగరాన్ని అమొరైట్లు నిర్మించారు. దానిని అస్సీరియన్‌లు నాశనం చేయగా, కాల్డియన్‌లు పునర్నిర్మించారు. బాబిలన్, తదితర నగరాలు ఒక క్రమ ప్రణాళిక ననుసరించి నిర్మితమయ్యాయి. డ్రైనేజి, రద్దీలను క్రమబద్ధం చేసే పద్ధతుల ననుసరించారు. బాబిలోనియన్‌ల గృహాలు సామాన్యంగా ఎండిన బంకమట్టితో కట్టబడేవి. కులీనుల గృహాలకు ఇటుకలను వాడారు. వారి గృహాలకు కిటికీలుండేవి కావు. తలుపులు కూడా వీధిలోనికి కాక, వసారాలోనికి తెరుచుకొనేటట్లుగా ఉండేవి. భాగ్యవంతుల ఇళ్ళు రెండు, మూడు అంతస్తులుగా ఉండేవి. వారి వాస్తుశిల్పం అంత నాజూకైనది కాదు.

బాబిలోనియా చిత్రకారులు గోడలను, బొమ్మలను అద్భుతంగా అలంకరించేవారు. అంతేకాక, బాబిలోనియాలో చిత్రకళ ఒక ప్రత్యేక కళగా కాక, అనుబంధ కళగానే ఉండిపోయింది. అంతేకాక బాబిలోనియా శిల్పకళ కూడా ఈజిప్ట్‌తో పోలిస్తే, తక్కువ స్థాయిలోనే ఉంది. పూజారుల ఆధిక్యం, ఆచారాల కఠిన నియమాల వల్ల, శిల్పకళకు ఊపిరి, ఉత్తేజం

BRAOU

మందగించాయి. చెక్కిన ముఖ ప్రతిమలు, దేహాలన్నీ ఒకే మూసలో పోసినట్లుగా కనిపిస్తాయి. నాటి విగ్రహాలు చాలా తక్కువగా లభ్యమయ్యాయి. జంతువుల శిల్పాలు మిగతా వాటి కన్నా ఎక్కువగా కనిపిస్తాయి. హురురుచే సూర్య భగవానుని నుండి న్యాయ సూత్రాలను స్వీకరిస్తున్నట్లుగా చెక్కిన రాతి స్తంభం, దాని శిల్పాకృతి ప్రముఖమైన కళాఖండం.

బాబిలోనియన్‌ల కాలం నాటి ఎన్నో రకాల వస్తువులు లభ్యమయ్యాయి. కుర్చీలు, బల్లలు, పరుపులు, అందంగా అద్దిన దుస్తులు, కంబళ్ళు, అలంకారపు అల్లిక పనులు, రాగి, కంచు, ఇనుము, వెండి, బంగారులతో చేసిన వస్తు సముదాయం, నగిషీ రాళ్ళు, బల్లపరుపుకు వాడిన రాతి పలకలు, నాటి బాబిలోనియన్‌ల రస పిపాసను తెలియజేస్తుంది. వారికి సంగీతమంటే ఎంతో ఇష్టం. వీణ వంటి వాద్యాలు, డ్రమ్ములు, తుత్తురాలు వాయించే దళాలు, మొదలైన వాద్య పరికరాలెన్నో వారికి తెలుసు. దేవాలయాల్లో, రాజ ప్రాసాదాలలో, ప్రభువుల గృహాలలో సంగీత కచేరీలు జరిగేవి. వాద్య బృందాలుండేవి.

### 6.3.1 దేవాలయాలు

బాబిలోనియాలో గృహాలకన్నా దేవాలయాలు చక్కగా నిర్మితమయ్యాయి. ఎంతో ఎత్తున నిర్మితమైన దేవాలయాలకు పునాదులే గృహాలంత ఎత్తున ఉండేవి. దేవాలయాలు ఆ పరిసర ప్రాంతాలను ప్రభావితం చేసేవి. సామాన్యంగా దేవాలయం చతురస్రాకారంలో రాతి పలకలతో నిర్మాణం, దానికి ఆనుకొని శిఖరం ఎంతో ఎత్తుగా, బయటి నుండి మెట్లతో, ఘన పరిమాణ కట్టడంగా ఉండేది. ఎత్తు పెరిగిన కొద్దీ, అంతస్తుల పరిమాణం తగ్గేది. అన్ని మత కర్మకాండలు దేవాలయ ప్రాంగణంలో జరుగుతాయి. జిగరుట్‌లు, లేదా శిఖర దేవాలయాలు పూజారుల చేతనేకాక, ఖగోళ విషయాలను తెలుసుకోడానికి కూడా ఉపయోగపడేవి. బాబిలన్‌లో నున్న జిగరుట్ 650 అడుగుల ఎత్తున్నది. అంటే, ఈజిప్ట్‌లోని గీజా (Gizeh) పిరమిడ్ కన్నా, 170 అడుగుల ఎక్కువ ఎత్తు. అందులో ఏడంతస్తులు ఎనామిల్ పూతతో ప్రకాశించగా, అన్నింటికన్నా పై అంతస్తులో బంగారంతో చేసిన మందిరం ఉంది. బహుశా, ఇది యూదుల పురాణాల్లోని 'బబెల్ టవర్' (Babel Tower) కావచ్చునని కొందరి చరిత్రకారుల అభిప్రాయం. ఈ జిగరుట్‌కు దక్షిణంగా మర్దుక్ (Marduk) అధిదేవుని బ్రహ్మాండమైన దేవాలయముంది. దేవాలయాలన్నింటికీ చక్కగా వేసిన రహదారులుండేవి. వీటిని పవిత్ర దారులుగా వ్యవహరించేవారు. దేవుళ్ళను ఈ రహదార్లలో ఊరేగించేవారు. ఈ రహదారుల కిరువైపులా గోడలు అందమైన నగిషీ బిళ్ళలతో, గర్జిస్తున్న సింహాల చిత్రాలతో అలంకరించబడ్డాయి. రహదారి చివర ఒక బ్రహ్మాండమైన వాకిలి, పుష్ప జంతువుల బొమ్మలతో చిత్రితమైంది. దీనినే ఇషర్ వాకిలి అని పిలిచేవారు.

బోర్సిప్పా జిగరుట్ (Ziggarut) ఏడు గ్రహాల దశలను చిత్రీకరిస్తూ, ప్రసిద్ధి పొందింది. ప్రతి ఒక్క అంతస్తును ఒక వారం పేరుతో, ఒక గ్రహానికి అంకితం చేయడం జరిగింది. ప్రతి ఒక్క అంతస్తుకు ప్రత్యేకమైన రంగు నివ్వడం జరిగింది. శని గ్రహానికి నలుపు, శుక్రునికి తెలుపు, బృహస్పతికి ధూమ్రవర్ణం, బుధునికి నీలం, అంగారకునికి సింధూర వర్ణం, చంద్రునికి వెండి వంటి తెలుపు. సూర్యునికి సువర్ణ వర్ణాలతో అంతస్తులు, ఒకదానితో మరొకదానిని గుర్తించేటట్లు చేశారు.

## 6.4 అస్సీరియన్ వాస్తుశిల్పం - కళలు

అస్సీరియన్‌లు ప్రముఖంగా యుద్ధవీరులు. వారు కూడా బాబిలోనియన్ల నుండి కళలు, వాస్తు శిల్పాన్ని తెలుసుకొని అభివృద్ధి చేశారు. వారు నిర్మించిన ముఖ్య నగరాలైన అషుర్, అర్‌బేలా, కలాఖ్, నినెవెల చుట్టూ రెండు రెండు ప్రాకారాలు నిర్మితమై, ప్రాకారాల పక్కన కందకాలు తవ్వబడి పూర్తిగా రక్షితమయ్యాయి. నినెవె నగరం అన్నింటిలోను వైభవోపేతమైంది. కట్టుదిట్టంగా నిర్మితమైంది. నినెవె చుట్టూ ఉన్న ప్రాకారపు గోడలు 8 మైళ్ళ పొడవు, 100 అడుగుల ఎత్తు, 50 అడుగుల వెడల్పుతో నిర్మితమైనాయి. అస్సీరియన్‌ల కాలం నాటి వాస్తుశిల్పం గురించి, సరిగా అంచనా వేయడానికి వీలులేదు. వారి నగరాలన్నీ పూర్తిగ శిథిలమయ్యాయి. సామాన్యంగా ఇటుకను, పెద్ద కట్టడాలకు రాతిని ఉపయోగించడం జరిగింది. వారి కట్టడాలలో అందం కన్నా, ప్రయోజన దృక్పథానికే ఎక్కువ ప్రాధాన్యమివ్వడం జరిగింది.

అస్సీరియన్‌ల ప్రాసాదాలు విశాల స్థలాలను ఆక్రమించుకొన్నాయి. కేవలం రెండు మూడంతస్తులకు మించి, పైకి పోలేదు. వారి కట్టడాలలో పెద్దపెద్ద గదులు ఆవరణను నలువైపులా మూసివేస్తాయి. రాజ ప్రాసాదాల ప్రవేశ ద్వారాలు రాతితో చెక్కిన జంతువుల బొమ్మలతో రక్షితమైనాయి. ప్రవేశ ద్వారాలు చలువరాతి రాళ్ళతో పరచబడి, గోడలు చారిత్రిక విషయాలను తెలిపే చిత్తరువులతో, జలతారు అల్లిక పనులతో, ఖరీదైన కర్రతో చేసిన ద్వారబంధాలతో, వైభవంగా కనిపిస్తాయి. అషర్‌నసిక్‌పాల్‌కల్కాలో (Kalka) నిర్మించిన రాజప్రాసాదం ఎంతో సుందరమైంది. రెండో సరగాన్ రాజు 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన బృహత్తర రాజ ప్రవేశ ద్వారం రెక్కలున్న ఎద్దులతో కాపాడబడుతుండగా, గోడలు ఎంతో అందంగా తీర్చిదిద్దబడ్డాయి. గదులన్నింటా రకరకాల చిత్రాలు చెక్కిన వస్తు సామాగ్రి ఉంది. సెన్నాచెరిబ్ రాజు నిన్వేలో నిర్మించిన రాజ ప్రాసాదాన్ని దేనితో పోల్చడానికి వీలులేదని శ్లాఘించారు. ఖరీదైన కొయ్య, విలువైన లోహాలు, రాళ్ళ నుపయోగించడం జరిగింది. ఇక్కడ కూడా ప్రవేశ ద్వారంలో రెక్కల ఎద్దులున్నాయి. అవి సున్నపురాయి, చలువ రాతితో తయారు చేసినవి. ఈ రాజప్రాసాదాలు పలువురి చరిత్రకారుల ప్రశంసలందుకున్నాయి.

### 6.4.1 శిల్పం

అస్సీరియన్‌లకు పెద్ద ఎత్తున సున్నపురాయి, చలువరాయి లభ్యమైనందువల్ల, వాటితో నిర్మించిన శిల్ప కళాఖండాలు వారి ప్రత్యేకత. తియమాత్ (Tiyamat) అనే దుష్ట దేవతను మర్డుక్ (Marduk) అధిదేవ చంపుతున్నట్లుగా చిత్రించిన చలువరాయి శిల్పం అద్భుతమైంది. మనుష్యుల శిల్పాలు ఒకే రీతిగా మలచబడ్డాయి అవి శిల్పకళలో అంత చెప్పుకోదగినవి కావు. కాని, జంతువుల శిల్పాలు మాత్రం జాగ్రత్తగా మలచబడ్డాయి. కొన్ని సందర్భాలలో అవి అస్సీరియా శిల్పాల కన్న అందంగా రూపొందాయి. మనుష్యుల ప్రతిమకన్న, జంతువుల బొమ్మలకు ప్రాధాన్యమివ్వడం జరిగింది. వేటాడే బొమ్మలు, యుద్ధం చేస్తున్నట్లు ఉన్న దృశ్యాలను నాటి కళాకారులు ఎక్కువ ఇష్టపడ్డారు. "నాటి కళాకారుడు తన యజమానులను వ్యక్తిగతంగాకాని, వాస్తవంగాగాని, చిత్రీకరించడానికి నిషేధించబడ్డాడా అన్నట్లుగా, తన ప్రతిభ నంతా జంతువులను చిత్రించడంలో - సింహాలు, గుర్రాలు, గాడిదలు, గొర్రెలు, కుక్కలు, లేళ్ళు, పక్షులు- సర్వమూ అన్ని భంగిమలలో (ఒక్క విశ్రాంతి భంగిమ తప్ప) అద్భుతంగా తీర్చిదిద్దబడ్డాయి. కొన్ని సందర్భాలలో చావు సమయంలో వ్యక్తమయ్యే బాధతో సహా, అన్ని మానసిక స్థితులను వ్యక్తపరచడంలో కృతకృత్యుడయ్యాడని" విల్‌డ్యురాంట్ చమత్కరించాడు. నినెవె రాజప్రాసాదాలలో కొన్ని వందల అడుగుల పర్యంతం చలవరాతితో చేసిన వరస శిల్ప సంపద, బ్రిటీష్ మ్యూజియంకు తరలించడం జరిగింది. రెండో

Dr. BRAOU LIBRARY Acc. No: 115053 Class No: 954 CHH

అషుర్‌నిపాల్ పెద్ద విగ్రహాన్ని రాజదర్పంతో అతి చక్కగా మలచడం జరిగింది. మొత్తం మీద, నాటి మానవ విగ్రహాలు మాత్రం చెప్పుకోతగ్గ స్థాయిలో లేవు.

### 6.4.2 చిత్రకళ

అస్సీరియా చిత్రకారులు రంగుల మిశ్రమాలను వాడటంలో సిద్ధహస్తులు. వారు ఎక్కువగా తెలుపు, ఎరుపు, నీలం, నలుపు రంగులను వాడారు. రాజప్రాసాదాలలో స్తంభాల పైభాగాలలో గచ్చు వేసిన వాటిమీద అందమైన చిత్రీకరణలు కనులకింపుగా గోచరిస్తాయి. మట్టి గోడలను చదును చేసి, దానిపై పలచగా సున్నం వేసి, దాని మీద చిత్రీకరణలు చేసేవారు. ఈ చిత్రీకరణలలో రెక్కల భూతాలు, హరిణాలు, ఎద్దులు మొదలైనవి విశేషంగా కనిపిస్తాయి. గులాబి పువ్వు స్వరూపాలు, తాటిచెట్లు, చక్రబింబాలు, తెగిన వృత్తాకారాలు, రంపపుటంచు ఆకులు, వారి చిత్రాల ధోరణులు. అస్సీరియా శిథిలాలలో ఎన్నో ఆభరణాలు కూడా దొరికాయి. వారి మట్టిపాత్రలు ఇంపుగా లేవు. వాద్య విశేషాలను చాలా వాటిని తయారుచేసి, వాడేవారు.

## 6.5 కాల్డియన్ కళలు

కాల్డియన్ రాజులలో 'నెబుకడ్‌నెజర్' (Nebuchadnezzar) కళాపోషణలో పేరొందినాడు. బాబిలన్ నగరాన్ని సుందరంగా, దేదీప్యమానంగా తీర్చిదిద్దాడు. అతని పాలన తరవాత, వంద సంవత్సరాల తరవాత కూడా, హెరోడోటస్ బాబిలన్ నగర వైభవాన్ని ప్రస్తుతించాడు. యూఫ్రటిస్ నది రెండు ఒడ్డులను కలుపుతూ, వంతెన నిర్మితమైంది. మానవ చరిత్రలో బహుశా మనకు తెలిసిన ప్రథమ వంతెన ఇదే. 56 మైళ్ళ పొడవున్న నగర రక్షణ గోడను నిర్మించారు. ఈ గోడపైన నాలుగు గుర్రాలు కట్టిన రథాల స్వారీ చేయవచ్చు. నెబుకడ్‌నెజర్ (Nebuchadnezzar) నిర్మించిన అద్భుత రాజప్రాసాదాలలో కసర్ (Kasar) వద్ద మట్టి దిబ్బమీద నిర్మించిన రాజప్రాసాదం చాలా ముఖ్యమైంది. పసుపుపచ్చ ఇటుకలతో, నీలం చిత్రీకరణలతో, అద్భుతంగా నిర్మితమైంది. వర్తులాకారం స్తంభాలను వరసగా దగ్గరగా నాటి, నిర్మితమైన వేలాడే ఉద్యానవనాలు (Hanging Gardens) ప్రపంచ వింతలలో ఒకటిగా పరిగణించబడింది. నెబుకడ్‌నెజర్ రాణులలో ఒకరు తన మాతృభూమిలో ఉన్నట్లుగా, ఎండ వేడిమి నుండి, నగర దుమ్మునుండి రక్షణ కావాలని కోరిక తెలుపగా, ఆమె కోర్కెను మన్నించి, ఈ ఉద్యాన వనాలు నిర్మితమయ్యాయి. చెట్లు, పూల మొక్కలు కొన్ని అడుగుల లోతైన సారవంతమైన భూమిలో వేళ్ళుని పెరగ్గా, 756 అడుగుల ఎత్తున వీటికి నీటిని గొట్టాల ద్వారా పంపేవారు. రాజప్రాసాదంలోని వనితలు ఈ చల్లని వాతావరణంలో ప్రజల కంటబడకుండా వన విహారం చేసేవారు.

నెబుకడ్‌నెజర్ ప్రాచీన బాబిలోనియా దేవతలకు ఎన్నో దేవాలయాలను పునర్నిర్మించాడు. దేవాలయాల నుండి రాజప్రాసాదానికి పండుగ రహదారిని నిర్మించాడు. దాని ప్రవేశ ద్వారాన్ని ఇష్టార్ దేవత పేరున అంకితమొనర్చాడు.

## 6.6 సుమేరియా శాస్త్ర విజ్ఞానం : ఖగోళ శాస్త్రం

ప్రపంచ చరిత్రలో శాస్త్ర విజ్ఞానం, గణితం, ఖగోళ శాస్త్రం, వైద్యం మొదలయిన విషయాలలో సుమేరియన్‌లు మార్గదర్శకులు. ఈ రంగాలలో సుమేరియన్‌ల ప్రతిభ ఈజిప్ట్ వారికన్న గొప్పదని విల్‌డ్యూరాంట్ అభిప్రాయం.

ప్రపంచంలో ఖగోళాన్ని గురించి ప్రథమ పరిశోధకులు సుమేరియన్‌లని చెప్పవచ్చు. వారి జిగురుతోల నుండి ఖగోళంలో సంచరిస్తున్న విశేషాలను పద్ధతి ప్రకారం అధ్యయనం చేసి, వాటి పోకడలను నమోదు చేశారు. అంగారకుడు



BRAOU

(Mars), శుక్రుడు (Venus), బుధుడు (Mercury), బృహస్పతి (Jupiter), శని (Saturn) మొదలయిన అయిదు గ్రహాలు వారికి తెలుసు. క్రీ.పూ 2300లో చంద్రగ్రహణం వచ్చినట్లు నమోదయింది. ఖగోళ శాస్త్రంలో వారు తదితర నాగరికతలకు దారి చూపారనేది నిర్వివాదాంశం. మబ్బులు లేని పొడి వాతావరణమున్న మెసపటోమియా రాత్రులు వారి పరిశోధనకు దోహదం చేశాయి.

### 6.6.1 జ్యోతిష్య శాస్త్రం

అదే రీతిగా గ్రహాల నడవడిక మీద ఆధారపడి చెప్పే జ్యోతిష్యశాస్త్రంలో కూడా, సుమేరియన్‌లే మార్గదర్శకులు. గ్రహదేవతలు ఆజ్ఞానుసారం నడుస్తాయని, దైవప్రార్థనల ద్వారా గ్రహాలను శాంతింపజేసి, మానవుల క్షేమాన్ని, అభివృద్ధిని పరిరక్షించవచ్చునని వారి అభిప్రాయం. ప్రయాణాలకు, గృహ నిర్మాణాలకు, ముఖ్యమైన వ్యవసాయ పనులకు, గ్రహస్థితిని చూసి, శుభ దినాలను నిర్ణయించేవారు. ఈ నమ్మకాలు ఈనాటికి ప్రపంచ వ్యాప్తంగా నిలిచిపోయాయి. మత విషయాలలో, తదితర కార్యక్రమాలకు కాలాన్ని కొలిచేందుకు, సుమేరియన్‌లు చంద్రుని దశల ననుసరించి, చంద్రమాన పంచాంగాన్ని రూపొందించారు. ఏడాదికి 360 రోజులుగా, 12 నెలలుగా, నెలకు 30 రోజులుగా విభజించారు. 12 చంద్రమాన మాసాలలో 360 రోజులు ఇమడక పోవడంతో, కొన్ని మార్పులను చేశారు. ఋతువులకు, మాసాలకు కొన్ని సందర్భాలలో సరిపోలేదు. అందువల్ల, కొన్ని సంవత్సరాలకు కలిపి, ఒక అధిక మాసాన్ని చేర్చడం జరిగింది. సుమేరిన్‌లు రూపొందించిన ఈ చంద్రమాన పంచాంగాన్ని, మెసపటోమియాలో నివసించిన భిన్న ప్రజలందరూ అనుసరించారు. కాల్డీయన్‌లు దానిలో కొన్ని మార్పులను చేశారు. పొరుగున ఉన్న యూదులు, అరబ్బులు, పర్షియన్‌లు కూడా ఈ చంద్రమాన కాలెండర్‌నే ఉపయోగించారు. ముసల్మాన్‌లు ఈ నాటికి కూడా, వారి పండుగలు జరుపుకోవడానికి చంద్రుని ఆధారంగా చేసుకొన్నారు. ఈజిప్ట్ నాగరికతలో ఇంతకన్నా మెరుగైన కాలెండర్‌ను తయారు చేయడం జరిగింది.

B R A O U

### 6.6.2 గడియారాలు

సుమేరిన్‌లు నెలకు 30 రోజులు, ప్రతి రోజులో 24 గంటలు, పగలు 12 గంటలు, రాత్రి 12 గంటలు, గంటకు 60 నిముషాలు, నిమిషానికి 60 సెకండ్లనే విభజన చేశారు. రోజులో సమయం తెలుసుకోడానికి 'సన్‌డయల్' (Sun dail), వాటర్ క్లాక్ (Water Clock) అనే పరికరాలను ప్రవేశపెట్టారు. వాటర్ క్లాక్‌కు రెండు గ్యాస్ బల్బులుండి, పైదానినుండి కింద బల్బ్‌లోనికి ఇరుకైన ద్వారం ద్వారా, ఇసుక, లేదా మరొక పదార్థం కొద్దికొద్దిగా జారిపడేటట్లు తయారు చేశారు. ఈ వాటర్ క్లాక్ సిద్ధాంతాన్ని మెసపటోమియాలోని మిగతా పాలకులు, ఆతరవాత విశ్వవ్యాప్తంగా అనుసరించడం జరిగింది.

### 6.6.3 తూకాలు

సుమేరియన్‌లు కొన్ని ప్రమాణాలతో తూకాలను నిర్ణయించారు. వాటిని మెకెల్, మీనా, టారెంట్‌లని పిలిచేవారు.

60 షకల్లు - 1 మీనా, 60 మీనాలు - టాలెంట్

ఈ తూకాల పద్ధతిని పాలస్తీనా, ఫొనిషియా, అరేనియం, ఐరోపాలోని కొన్ని ప్రాంతాలలో కూడా అనుసరించారు. మొదట్లో వస్తువుల మార్పిడి విధానాన్ని (Barter) అనుసరించినా, తరవాత విలువ ప్రాతిపదిక మీద ప్రమాణాలు

నిర్ణయించబడ్డాయి, గోధుమలు, బార్లీ విలువ ప్రమాణాలను ప్రారంభించి, ఆతరవాత 1 సికలు వెండిని ప్రమాణంగా స్వీకరించడం జరిగింది. వెండి బంగారాల మధ్య నిష్పత్తి 4:1 గా నిర్ధారించారు.

బట్టలు, గదులు కట్టడం, ఎత్తు ఇటుకల, రాళ్ళ పరిమాణాలను కొలవడం కోసం సుమేరియన్‌లు కర్రతో చేసిన కొలత బద్దను తయారుచేశారు. ముంజేతిని (అంటే సుమారు 18,20 అంగుళాలు) ప్రమాణంగా చేసుకొని, దానిని 5భాగాలు చేసి, అట్టి ప్రతి భాగాన్ని 6 విభాగాలుగా చేసి, వాడేవారు. విభాగాలన్నింటినీ కొలత బద్దల మీద గుర్తు పెట్టేవారు.

### 6.6.4 గణితం

సుమేరియన్‌లు 1-9 వరకు గల అంకెల సంకేతాలను కనిపెట్టారు. అయితే వారికి సున్నా తెలియదు. కొన్ని సందర్భాలలో డెసిమిల్ పద్ధతిని, మరికొన్ని సందర్భాలలో 6ను హెచ్చవేస్తూ పోయే పద్ధతిని సమ్మిళితం చేశారు. 1 నుండి 10 వరకు లెక్కలను చేసేవారు. మరికొన్ని సార్లు 1,2,3,4,5,6,10,12,15,20,- - 30 ప్రకారం, 60 దాని హెచ్చింపు 3600 వరకు లెక్కలను కట్టేవారు. ఎక్కాలు కూడా తయారయ్యాయి. సుమేరియన్‌ల మట్టి సీళ్ళను పరిశీలిస్తే, వారికి రేఖాగణితం కూడా కొంతవరకు తెలిసినట్లు గోచరిస్తుంది. గది వైశాల్యాన్ని పొడుగు × వెడల్పు సిద్ధాంతంపై నిర్ధారించే వారు. వృత్తాకార చుట్టుకొలతకు, వ్యాసానికి మధ్య సంబంధం వారికి తెలుసు. ఆ సమీకరణం ద్వారా వృత్తాకార స్తంభాల, వర్తులాకార స్తంభాల పరిధిని అంచనా వేసేవారు.

### 6.6.5 లోహ జ్ఞానం

సుమేరియన్‌ల సాంకేతిక పరిజ్ఞానం వల్ల వారికి రాగి, బంగారు, వెండి, సీసం, మొదలయిన లోహాలు, వాటి లక్షణాలు తెలుసు. బహుశా రాగిని ప్రప్రథమంగా వారు వెలికి తీసిఉండవచ్చు. పాత్రల, ఆయుధాల, పరికరాల తయారీలో రాగిని విస్తృతంగా వాడటం జరిగింది. రాగి అంత బలంగా లేకపోవడంతో, దానిని తగరంతో కలిపి, మరికొంత గట్టి మిశ్రమ లోహాన్ని తయారు చేశారు. ఇది కంచు లోహం. బంగారం, వెండితో కూడా ఎన్నో వస్తువులు తయారయ్యాయి. అంతేకాక, రసాయనిక చర్యలను కూడా సుమేరిన్‌లు అవగతం చేసుకొని వాడారు. తోళ్ళను నూనెలో, పటికల మిశ్రమంలో శుభ్రపరచటం, తోళ్ళకు, గొర్రె బొచ్చుకు అద్దకం చేయటం, నూనెతో సబ్బులను రోగ నివారిణిగా వాడటం మొదలైన విషయాలను సుమేరియన్‌లు ప్రవేశపెట్టారు. వైద్యరంగంలో పెద్దగా ప్రగతి లేదు. జబ్బులు దుష్ట శక్తుల ప్రభావంవల్ల వస్తాయని భావించారు. "గులా" అనే దేవత, వైద్య రంగానికి అధినేత అని వారి భావన. తరవాతి కాలంలో వైద్యులు అనే ప్రత్యేక వర్గం, జబ్బులు పోగొట్టడానికి తీసుకొన్న పద్ధతులు ఛాయామాత్రంగా కనిపిస్తాయి.

## 6.7 బాబిలోనియాలో శాస్త్ర విజ్ఞానం

బాబిలోనియన్‌లు ఖగోళ శాస్త్రంలో నిష్ణాతులు. ఖగోళ శాస్త్ర అధ్యయనాన్ని, జ్యోతిష్ శాస్త్ర పురోగతికి వాడారు. మనుషుల భవిష్యత్తును తెలుసుకోడంలో వారికున్న శ్రద్ధ, సముద్ర మార్గాలను, భూమార్గాలను అన్వేషించడంలో చూపలేదు. చదువుకొన్ని పూజారులంతా జ్యోతిష్యశాస్త్రంలో పండితులు. తాంత్రిక విద్యకు ప్రాధాన్యం ఉండేది. వారు

BRAOU

గ్రహాలన్నింటికి దేవుళ్ళ పేర్లు ఇచ్చారు.

| | | |
|---|---|---|
| గ్రహం | - | దేవత |
| అంగారకుడు | - | నెర్గల్ |
| శుక్రుడు | - | ఇష్తాక్ |
| బుధుడు | - | నబు |
| బృహస్పతి | - | మర్డున్ |
| శని | - | నినిబ్ |
| సూర్యుడు | - | షమాష్ |
| చంద్రుడు | - | సిన్. |

గ్రహాల, నక్షత్రాల కదలిక వల్ల ఈ భూమిమీద వివిధ సంఘటనలు జరుగుతాయని వారు నమ్మారు. రాజుల విజయాలు, అపజయాలు కూడా వీటిమీద ఆధారపడి ఉంటాయని చెప్పేవారు. ఆకాశాన్ని అంచనా వేయటంలో బాబిలోనియన్‌లు విజయాన్ని సాధించారు. క్రీ.పూ. 2000 నాటికే గ్రహాల కదలిక, భిన్న కాలాల్లో వాటి స్థానం, మొదలైన విషయాలను నిర్ధారించే రికార్డులున్నాయి. బలి ఇచ్చిన గొర్రె లివర్‌మీద ఉన్న గుర్తుల నాధారంగా చేసుకొని, భవిష్యతును చెప్పగల సమర్థత పూజారుల కుండేదని వారినమ్మకం. ఈ నమ్మకం రోమన్లకు కూడా వ్యాప్తి చెందింది. నీటిమీద నూనె వేసి, ఆనూనె ఏ ఆకృతిలో మారుతుందో గమనించి, దానిని బట్టి దేశంలో జరిగే సంఘటనలను ఊహించేవారు.

BRAOU

### 6.7.1 గణితం

బాబిలోనియన్‌లు సుమేరియన్‌ల కాలెండర్‌నే ఉపయోగించారు. (Sun diel) సన్‌డైల్ క్లాక్‌ను మరికొంత అభివృద్ధి చేశారు. వారు 6ను ఆధారంగా చేసుకొని హెక్సాడెసిమల్ (Hexadecimal) సిద్ధాంతాన్ని అనుసరించారు. వృత్తంలో 360 డిగ్రీలు, ఏడాదిలో 360 రోజులు, డిగ్రీలో 60 నిమిషాలు, నిముషంలో 60 సెకన్లు వారి కాలమానం. లెక్కలు వేయటాన్ని సుగమం చేయటానికి, ఎక్కాల పట్టీలను , హెచ్చవేతల, భాగహారాల పట్టీలను తయారు చేశారు. 1/2, 1/4, 1/3 మొదలైన విభాగాలను కూడా సృష్టించారు. వారికి చతురస్రాలు, దీర్ఘచతురస్రాలను, వృత్తాలను, తదితర ఆకారాల వైశాల్యాన్ని లెక్కలు కట్టడం తెలుసు.

### 6.7.2 వైద్యం

బాబిలోనియన్‌లు మతాచారాలపైన, మూఢనమ్మకాలపైన, మనసును లగ్నం చేయటంతో, వైద్యరంగంలో శాస్త్రీయ పద్ధతులను పెద్దగా ప్రవేశపెట్టలేదు. వైద్యానికి సంబంధించి మనకు లభ్యమైన మట్టి సీళ్ళలో సమాచారం సమగ్రంగా లేదు. హరరుచి న్యాయ సూత్రాలలో, తప్పుగా మందులిచ్చి, వైద్యం చేసిన వారికి, తప్పుగా శస్త్రచికిత్స చేసిన

వారికి శిక్షలు, వైద్యులకివ్వవలసిన ఫీజు, మొదలైన అంశాలను చేర్చడం జరిగింది. కొన్ని జబ్బుల నివారణలో మూలికలను వాడేవారు. జబ్బులు దయ్యాల వల్ల వస్తాయని, మందులు వాటిని పారదోలటానికి పనికి వస్తాయనే భావన వారికి ఉండేది.

## 6.8 అస్సీరియా శాస్త్రవిజ్ఞానం

అస్సీరియన్‌ల కాలంలో వృక్షశాస్త్రంలో, రసాయనిక శాస్త్రంలో అధ్యయనాలు జరిగాయి. గ్లాస్ (Glass) తయారీ, లోహాలను వెలికి తీయడంలో కొంత ప్రగతి కనిపిస్తుంది. నైట్రిక్ అమ్లం, హైడ్రోక్లోరిక్ అమ్లాల మిశ్రమంతో సల్ఫ్యూరికామ్లాన్ని తయారు చేశారు. బట్టలు ఉతికే సోడా, ఉప్పు, కాపర్ సల్ఫేట్, బోరాక్స్ మొదలయిన మిశ్రమాలు వచ్చాయి. లోహాల తయారీలో రసాయనిక చర్యలను ప్రవేశపెట్టారు. నినెవెలోని 'అఘర్ బనిపాల్' (Aghar Banipal) గ్రంథాలయంలో, వైద్యానికి సంబంధించిన కొంత సమాచారం లభ్యమైంది.

## 6.9 కాల్డియా నాగరికత : శాస్త్ర విజ్ఞానం

కాల్డినీయన్లు అంతకు ముందున్న మెసపటోమియా నాగరికతలానే, విజ్ఞాన శాస్త్రాన్ని వారసత్వంగా తీసుకొన్నారు. నెబుకడ్‌నెజర్ (Nebuchadnezzar) పాలనలో ఖగోళశాస్త్రంలో బ్రహ్మాండమైన అభివృద్ధిని సాధించడమైంది. స్థిరంగా ఉన్న నక్షత్రాలను, కదలుతున్న గ్రహాలమధ్యనున్న భేదాలను స్పష్టంగా అర్థం చేసుకొన్నారు. సూర్య, చంద్ర మండలాలను నిర్దిష్టంగా గుర్తించారు. సూర్య, చంద్ర గ్రహణాలను అంచనా వేశారు. గ్రహాల కదలికను అధ్యయనం చేశారు. ఋతువులు, వాటి లక్షణాలను తెలుసుకొన్నారు. సూర్యుని చుట్టూ భూమి తిరుగు మార్గాన్ని రెండు రాశి చక్రాలుగా విభజించారు.

గ్రహాలు మానవ మనుగడ మీద ప్రభావం కలిగి ఉన్నాయనే నమ్మకం, వారికి ప్రగాఢంగా ఉండేది. గ్రహాలను దేవతలగా ఆరాధించారు. ఒక్కొక్క రోజున ఒక్కొక్క దేవతను ప్రత్యేకంగా పూజించేవారు. క్రమేణా ఆదేవత పేరు ఆరోజుకు సంక్రమించేది. సూర్యుని కొలిచే రోజు ఆదివారంగా (Sunday), చంద్రుని కొలిచే రోజు సోమవారంగా (Monday) మారటం మనకు తెలుసు. ఒకడు మంచి నక్షత్రంలో జన్మించాడని, మరొకడు దుష్ట నక్షత్రంలో జన్మించాడనే నమ్మకం, నాటి నుండి మరింత స్థిరపడింది.

నబోనజర్ పాలనలో కాల్డియన్ ఖగోళ శాస్త్రజ్ఞులు వారి పరిశీలనలను స్పష్టంగా నమోదు చేశారు. అయితే, ఆరికార్డులు పూర్తిగా లభించలేదు. అయినా, వారు చేసిన ఖగోళ పరిశోధనలు ప్రపంచ చరిత్రలో ప్రప్రథమమైనవి. క్రీ.పూ. 500 నాడు కాల్డియన్ ఖగోళ శాస్త్రజ్ఞుడైన నబురిమన్ను (Naburimannu) గత 250 సంవత్సరాల రికార్డులను పరిశీలించి, సూర్య, చంద్ర కదలికలను, అవి పరిభ్రమించటానికి పట్టే కాలాన్ని, అంచనా వేశాడు. సంవత్సరానికి 365 రోజుల 6 నెలల 15 నిముషాల, 41 సెకన్లు అనే ఖచ్చితమైన లెక్కవేసిన ఘనుడు. కిడిను (Kidinu) అనే మరొక ఖగోళ శాస్త్రజ్ఞుడు తయారు చేసిన లెక్కలు, ఆధునికులకు కూడా ఎంతో మార్గదర్శకమయ్యాయి. కాల్డియన్‌లు ఖగోళ విజ్ఞానానికి శాస్త్రీయ పునాదులు వేశారన్నది నిర్వివాదాంశం. అదేరీతిగా వైద్యరంగంలో కూడా పురోగతిని సాధించారు. 550 రకాల మందులను పరిశోధించారు. నాటి శస్త్రచికిత్సనిపుణులు కంచు పరికరాలను వాడారు.

BRAOU

## 6.10 లిపి - లేఖనం

సుమేరియన్‌లు లేఖనా శిల్పాన్ని క్రీ.పూ. 3500 నాటికే మొదలెట్టారు. 400 సంవత్సరాల తరవాత మట్టి పలకలపై వ్రాసి భద్రపరచటం జరిగింది. 1902లోసూసాలో హరరుచి న్యాయసూత్రాలు లభ్యం కావటంతో, నాటి లిపి, లేఖనం మీద ఎంతో సమాచారం వెలుగులోనికి వచ్చింది. హరరుచి లేఖలు కూడా మరి కొంత సమాచారాన్ని తెలుపుతున్నాయి. రాజుగారు చెపుతుండగా మట్టి పలకల మీద కార్యదర్శులు క్యూనిఫారం (Cumiform) గుర్తులలో వెదురు గంటంతో వాటిని వ్రాయగా, దానిపై పొడి చల్లి, దాన్ని మరో మట్టి బరలో మూసి, కొలిమిలో వేడిజేయగా, అక్షరాలు అలానే నిలిచిపోయాయి. నాటి పురాణ గాథలు, ఐతిహ్యం తదితర సాహిత్యమంతా, ఇదే రీతిలో భద్రపరచబడడం జరిగింది. నాటి లేఖకులకు ఎంతో విలువిచ్చేవారు. వారు సూర్యుని వలె ప్రకాశించగలరనే నానుడి వుంది. ఈజిప్ట్ నాగరికతలో ఇంక్, పాపిరస్‌ను వాడటం జరిగింది. సుమేరియన్‌ల 'క్యూనిఫారం' లిపిని చదవడానికి, పండితులు కొన్ని వందల ఏళ్ళు శ్రమించి, విజయాన్ని సాధించారు. వారిలో జార్జి గ్రోట్‌ఫ్రెండ్ (George Grotefriend), హెన్రీ రాలిసన్ (Henry Rawlison), ఛంపోలియన్ (Champolian) ముఖ్యులు. వారి కృషి వల్ల, నాడు మట్టి పలకలను భద్రపరిచిన భాండాగారాల వల్ల, మెసపటోమియా అద్భుత నాగరికతను గురించి ఈనాడు మనం చదువుకోగలుగుతున్నాం.

## 6.11 సంగ్రహంగా

ఈ భాగంలో మెసపటోమియా నాగరికతలోని భిన్న కాలాల, భిన్న సంస్కృతులలో కళలు, విజ్ఞాన శాస్త్రం ఎంతటి గొప్ప అభివృద్ధిని సాధించిందీ, వివరించడమైంది. తరవాత వచ్చిన నాగరికతలలోని ప్రగతికి, కొంత మూలం ఈ నాగరికతలోనే కన్పిస్తుంది.

## 6.12 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి

1. మెసపటోమియా నాగరికతలోని కళల అభివృద్ధిని వివిధ దశలుగా వివరించండి.
2. మెసపటోమియా నాగరికతా కాలంనాటి శాస్త్ర విజ్ఞానాన్ని వివరించండి

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి

1. సుమేరియా - ఖగోళ విజ్ఞానం
2. బాబిలోనియా - గణితం
3. లిపి - లేఖనం

## 6.13 ఉపయుక్త గ్రంథాలు

Will Durant : **Story of Civilization**

**Cambridge Ancient History - Vols. I & II**

Openheim : **Ancient Mesapatomia**

BRAOU

# ఖండం - III: ఈజిప్ట్

ఆఫ్రికా ఖండంలోగల ఈజిప్ట్ పరిశీలనను నాల్గు ప్రత్యేక భాగాలుగా చూడవచ్చు. అవే, 7,8,9,10 భాగాలు. 7వ భాగంలో ఈ నాగరికతా లక్షణాలను వివరించడం జరిగింది. 8వ భాగంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను చర్చించడం జరిగింది. 9వ భాగంలో మతం, తత్వవివేచన అనే అంశాలను విశ్లేషించడం జరిగింది. చివరిదైన 10వ భాగంలో కళలు, వాస్తువును పరిశీలించడం జరిగింది.

ఈ పరిశీలన అంతా, క్రీ.పూ 4326 నుండి క్రీ.పూ.30 వరకుగల కాలంలో ప్రాచీన ఈజిప్ట్ నాగరికతకు చెందిన భిన్న అంశాలపై, సమగ్రంగా అవగాహన కలిగించేందుకు ప్రయత్నం చేయడం జరిగింది.

BRAOU

BRAOU

# భాగం - 7: ఈజిప్ట్ నాగరికతా లక్షణాలు

విషయక్రమం


7.0 లక్ష్యాలు

7.1 పరిచయం

7.2 చారిత్రక ఆధారాలు

7.2.1 సాంస్కృతికావశేషాలు

7.2.2 లిఖితాధారాలు

7.2.3 అలిఖితాధారాలు

7.2.4 సమకాలీనుల రాతలు

7.2.5 ఈజిప్టాలజిస్టుల రాతలు

7.3 భౌగోళికాంశాల ప్రాముఖ్యం

7.3.1 నైల్ నది

7.3.1.1 నైల్ లోయ

7.3.1.2 నైల్ మైదానం

7.3.2 ఎడారి

7.3.3 సినాయ్ పీఠభూమి

7.4 ఈజిప్ట్ నాగరికతా లక్షణాలు

7.4.1 సామాజిక వ్యవస్థ

7.4.2 రాజకీయ వ్యవస్థ

7.4.3 ఆర్థిక వ్యవస్థ

7.4.4 మత వ్యవస్థ

7.4.5 తత్వ వ్యవస్థ

7.4.6 కళలు

7.5 నాగరికతా స్వభావం

7.6 తులనాత్మక పరిశీలన

7.7. సంగ్రహంగా

7.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

7.9 ఉపయుక్త గ్రంథాలు

7.10 పదకోశం


BRAOU

## 7.0 లక్ష్యాలు

1. ఆఫ్రికాలో ఉండి, పశ్చిమాసియా రాజ్యాలతో రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరమైన సంబంధాలను ఏర్పరుచుకొని, ప్రపంచపు ప్రాచీన నాగరికతల్లో కిరీటం వంటిదయిన ఈజిప్ట్ నాగరికతను గురించి తెలుసుకోవడం.

2. ఈజిప్ట్‌ను ప్రాచీన కాలం నుండి ప్రభావితం చేసిన వెన్నెముక వంటి భౌగోళిక లక్షణాల వివరాలను తెలుసుకోవడం.

3. ఈజిప్ట్ నాగరికతకు ఆధారాలను తెలుసుకోవడం

4. ఈజిప్ట్ నాగరికత ప్రాథమిక లక్షణాలను తెలుసుకోవడం

5. ఈజిప్ట్ నాగరికతకు మాత్రమే చెంది, ఇతర నాగరికతలకు లేని లక్షణాలను తులనాత్మకంగా వివరించడం.

6. మానవునికి, ప్రకృతికి గల సంబంధం, ఈజిప్ట్‌లో ఏ విధంగా అనేక మాండలిక జీవన విధానాలకు, అభిప్రాయాలకు తావిచ్చిందో తెలుసుకోవడం

## 7.1 పరిచయం

మానవ జీవన పరిణామ తొలిదశ, శిలాయుగంతో ప్రారంభమై, చివరకు లోహ యుగాన్ని చేరింది. ఈ కాలంలో మానవుడు ప్రకృతిమీద కొంత వరకు ఆధిపత్యాన్ని నెలకొల్పుకోగలిగాడు. కాని, ఆ పరిణామంలో మానవుడు కొన్నిచోట్ల (కాలాలలోను, ప్రాంతాలలోను) ప్రకృతికి లొంగిపోయాడు. మరి కొన్ని చోట్ల ప్రకృతిని తన ఉపకరణంగా తీర్చిదిద్దుకొన్నాడు. తాను ప్రకృతికి లొంగినపుడు మానవుడు ప్రకృతి పట్ల గౌరవాన్ని ఏర్పరుచుకొని, ప్రకృతిలోని వివిధ శక్తులను గమనించాడు. ఆరకంగా గమనించడాన్నే 'దర్శనం' అంటారు. 'దర్శనం' అనేమాట 'దృశ్' అనే సంస్కృత భాషలోని ధాతువువల్ల ఏర్పడిన నామవాచకం. 'దర్శనం' అనేమాటకు తొంగిచూచు అనే అర్థం ఉంది. అంటే, మానవుడు ప్రకృతిలో పైకి కనపడే అంశాలకు ప్రాముఖ్యమిచ్చి, వాటిని గమనించడం మాత్రమే కాక, వాటి లోతులలోకి తొంగి చూడటం జరిగింది. దాని వల్ల, భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అని పంచభూతాలుగా పిలువబడే ప్రకృతి శక్తులను, తమకు తోచిన రీతిలో అవగాహన చేసుకొని, వాటిని వివిధ మతాచారాలద్వారా పూజించడం ఆరంభించారు. వాటిని పూజించడం, ప్రకృతివల్ల పొందే ప్రతిఫలాల వల్ల తాను ప్రకృతికి గౌరవం ఇవ్వడం కన్నా, భయంతో ప్రకృతికి లొంగుబాటును వ్యక్తం చేయడానికి గుర్తు.

కాని, ప్రకృతిపై తాను అధికారాన్ని, లేదా పెత్తనాన్ని చెలాయించినపుడు, ప్రకృతిని ఒక పరికరంగానో, లేదా ఉపకరణంగానో మార్చుకొని, ప్రకృతిని తనకు అనుబంధంగా చేసుకొన్నాడు. ఆస్థితిలో ప్రకృతి మానవునికి వినియోగపడటం ప్రారంభమైంది. ఈ విధమైన వినియోగ ప్రవృత్తి, శాస్త్రాభిజ్ఞతకు, శాస్త్రాభివృద్ధికి దారి తీసింది. 'శాసతి త్రాతయితి శాస్త్ర' (అంటే శాసించేది, రక్షించేది శాస్త్రం). శాస్త్రం ఏదయినా మానవుల మనుగడను ఇదమిద్ధంగా (ఇది ఈ విధంగా) ఉండాలని, దాని స్వరూప స్వభావాలను, దాని లక్ష్యాలను నియమిస్తుంది. అంతేగాక, అనుసరించిన వారిని రక్షిస్తుంది. వ్యతిరేకించిన వారిని తగిన రీతిగా శిక్షిస్తుంది. శాస్త్రాభివృద్ధివల్ల ప్రజలకు ప్రకృతిపై చిన్నచూపు ఏర్పడుతుంది. దానితో బాటు, మానవుడుతప్ప ఇక ఉన్నత మైన శక్తి ఏదీలేదు అని భావించే స్థితి వస్తుంది; వచ్చింది. ఆస్థితిలోనే తూర్పు దేశాలలో "నా విష్ణుఃపృథివీపతిః" (రాజు స్వయంగా విష్ణుదేవుడు) అనే సూక్తి ఏర్పడింది. అటువంటి సూక్తి ప్రభువుల పరమౌన్నత్యాన్ని, పరమాధికారాన్ని శబ్దవత్తుగా చెప్పినా, లాక్షణికమయిన ప్రవృత్తి ద్వారా ప్రభువుల లోని ఔన్నత్యాన్ని చూపడం జరిగింది.

BRAOU

ఈజిప్ట్‌లో కూడా రాజు తనను తాను "సూర్యుని కొడుకు"నని అభివర్ణించుకొనడం, ఈ రకమయిన భావానికే ప్రతీక. ప్రకృతికి లొంగిన భావం మానసిక పరిణామానికి, సంస్కృతీ వికాసానికి దారితీయగా, ప్రకృతిని లొంగదీసికొనిన భావం దైహికమయిన పరిణామానికి, నాగరికతా వికాసానికి తావిచ్చాయి. ఈ రకమయిన సంస్కృతీ, నాగరికతల వికాసం ఎప్పుడూ ఒక శైలిలో ఉండటం జరగలేదు. మానవులలోని వైవిధ్యంవలెనే, వారి సంస్కృతీ, నాగరికతలలో కూడా వైవిధ్యం ఉంది. ఈజిప్ట్‌దేశపు నాగరికత అటువంటి స్థితికి ఒక చక్కని ఉదాహరణ.

## 7.2 చారిత్రక ఆధారాలు

నైల్ నదీ కానుకగా పరిణమించిన ఈజిప్ట్ నాగరికతను గురించి తెలుసుకోవడానికి గల ఆధారాలను, రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. మొదటి వర్గానికి చెందినవి ఈజిప్ట్ నాగరికతా కాలం నుండి యథాతథంగా అర్వాచీన కాలానికి వారసత్వంగా సంక్రమించిన సాంస్కృతికావశేషాలు. రెండవ వర్గానికి చెందినవి ఈజిప్ట్ నాగరకతను గురించి సమకాలీనులు, తర్వాత ఈజిప్ట్‌పై పరిశోధన చేసిన చరిత్రకారులు (ఈజిప్టాలజిస్టులు) రాసిన రాతలు.

### 7.2.1 సాంస్కృతికావశేషాలు

ఇవన్నీ ఈజిప్ట్‌లోని ప్రజల ప్రవర్తనకు, అభిప్రాయాలకు, విశ్వాసాలకు, ప్రకృతితో వారు ఏర్పరుచుకొన్న సంబంధాలకు అద్దం పట్టేవి. ఇవి లిఖితాధారాలనీ, అలిఖితాధారలనీ రెండు రకాలు.

BRAOU

### 7.2.2 లిఖితాధారాలు

ఇవి "చిత్ర లిపి"లో లిఖితమై ఉండేవి. వీనిని రాయడానికి "పాపిరస్"అనే చెట్టు పట్టలను వాడేవారు. "పాపిరస్" వృక్షం ఇప్పుడు ఇంచుమించు పూర్తిగా లుప్తమయిపోయింది. దీనినే "బిబ్లస్" అనికూడా పిలిచేవారు. దీనిపై రాసిన రాత ప్రతులు ఎంతో ఉపయోగకరమైనవి. వానివల్ల, ఈజిప్ట్ దేశాన్ని పరిపాలన చేసిన ప్రాచీన రాజ్యపు రాజులను గురించి తెలుసుకోవడం జరిగింది. ఇంచుమించు క్రీ.పూ. 204 కి చెందిన 'వెస్ట్‌కార్ పాపిరస్'లో 'రే' అనే దేవుని పూజారిణికి ఏ విధంగా ముగ్గురు మధ్య రాజ్యపు రాజులు కలిగారో చెప్పబడింది. 'పాపిరస్ ఎబర్స్', 'ఎడ్విన్ స్మిత్స్ సర్జికల్ పాపిరస్' వంటి వైద్యం, శస్త్రచికిత్సా విధానాలను గురించి విశేషంగా విమర్శించే 'పాపిరస్' పత్ర గ్రంథాలలో ఎంతో ప్రముఖమయినవి. లిఖిత ఆధారాలు ప్రధానంగా చిత్ర లిపిలో ఉండటం, ఈజిప్ట్ దేశస్థులకు, వారి దేశానికి పరివృతమయిన ప్రకృతి వలయానికి మధ్యగల ఎడతెగని సంబంధానికి, దృష్టాంతం.

### 7.2.3 అలిఖితాధారాలు

వీనిలో పిరమిడ్లు, సమాధులు, శిల్పాలు, చిత్రాల వంటివి ముఖ్యమైనవి. ఆరోజులలో ఈజిప్ట్ ప్రభువులు (వీరిని 'ఫారో' అనేవారు) తమను తాము సమాధి చేసుకొన్న 'పిరమిడ్'లను పరిశీలన చేయగా, వారి జీవన విశేషాలు యథాతథంగా వెల్లడవుతున్నాయి. గీజె, అబుసింబెల్ మొదలయిన ప్రాంతాలలో గల పిరమిడ్‌లు, ఈ రకమయిన నిర్మాణాల ఔన్నత్యానికి గుర్తు. 'ఫారో'లు తమ పరిచారకులతోను, అన్ని రకాల దైనందిన జీవన సౌకర్యాలతోను, 'పిరమిడ్'లలో కనపడడం, ఈజిప్ట్ ప్రజలు నమ్మిన 'మరణానంతర జన్మ' (Life after death) అనే భావనకు గుర్తు. మరణించిన వారు తమ శరీరంతో సహా వేరొక చోట, లేదా వేరొక లోకంలో జన్మిస్తారనే నమ్మకం వల్ల, ఆ ప్రభువులకు గల అన్ని వస్తువులను ఫారోలతో బాటు ఖననం చేసేవారు. అవి వేర్వేరు కాలాల్లో రాచరికపు వ్యక్తుల ప్రవృత్తికి, జీవనానికి ప్రత్యక్ష నిదర్శనాలు.

కాగా, రాగితో చేసిన గొప్ప విగ్రహాలు, 'స్పింక్స్' వంటి ఏకశిలా ప్రతిమలు, ఈజిప్ట్ దేశస్థులు ప్రకృతిని అవగాహన చేసుకొని ప్రకృతిని లొంగదీసుకొని, ప్రకృతిపై ఆధిపత్యాన్ని కొనసాగించిన వైఖరికి గుర్తులే. థేబ్స్, టెల్-ఎల్-అమర్నా వంటి చోట్లగల కుడ్యచిత్రాలు, అక్కడి ప్రకృతికి, సమాజానికి పట్టిన నిలువుటద్దాలు.

### 7.2.4 సమకాలీనుల రాతలు

ఈజిప్ట్ దేశంలో వారసత్వంగా పరిణమించిన సాంస్కృతికావశేషాలు, ప్రాచీనులలో అనేక ఊహలను రేకెత్తించాయి. ఈజిప్ట్ నాగరికతను గురించి వీరంతా తాము సమకాలీనులుగా చూసిన అనేక ఈజిప్ట్ అవశేషాలను గుర్తించి, వేర్వేరుగా రాశారు. హెరొడోటస్ (Herodotus) రాసిన 'ఈజిప్ట్ విషయాలు' అర్వాచీనమైనవి కాగా, మిలెటస్‌కు చెందిన హెకాటవ్స్ (Hecataeus) రాసిన 'పెరిగెసిస్' (Periegesis= ప్రపంచ యాత్ర), క్రీ.పూ. 240కి చెందిన మనెథో (Mancetho)రాసిన 'ఈజిప్టికా' (Aegyptiaca), హీలియోపొలిస్ (Heliopolis) గురించి టాసిటస్ (Tacitus) రాసిన వ్యాఖ్యలు, ప్లినీ (Pliny) రాసిన 'నాచురల్ హిస్టోరియా' (Naturalis Historia); ప్లూటార్క్ (Plutarch) రాసిన 'డిఎసిడ్‌ఎట్ ఒసిరిడె' (De aside et osiride) వంటి పుస్తకాలు, ఆరోజులలో ఐరోపా దేశాలకు చెందిన వివిధ విజ్ఞాన వేత్తలలో గల జిజ్ఞాసకు గుర్తు. ఆ రాతలు ఈజిప్ట్ నాగరికతలోని ఔన్నత్యాన్ని చెప్పకనే చెప్పుతున్నాయి.

### 7.2.5 ఈజిప్టాలజిస్టుల రాతలు

క్రీ.శ 1821 నుండి ఆధునిక ఈజిప్టాలజీ ఒక విద్యావిషయంగా అభివృద్ధి చెందింది. థామస్ యంగ్ (Thomas Young): జె.ఎఫ్.చంపొలియన్ (J.F. Champollion): జె.జి. విల్కిన్సన్ (J.G. Wilkinson): సామ్యూల్ బిర్చ్ (Samuel Birch): కార్ల్ రిచర్డ్ లెప్సియస్ (Karl Richard Lepsius): జి.ఆర్. గ్లిడ్డన్ (G.R. Gliddon) వంటి వారి కృషి, ఈజిప్టాలజీ వికాసంలో అమూల్యమైంది. జె.జి. విల్కిన్‌సన్ 1837లో "Manners and Customs of the Ancient Egyptians" అనే పుస్తకాన్ని ప్రకటించాడు. దాన్ని 1878లో బిర్చ్ పునర్ముద్రించాడు. రానురాను ఈరకమైన కృషి, కేవలం పైకి కన్పిస్తున్న అవశేషాలను చూసి, వ్యాఖ్యానాలనో, వివరణలనో రాయడానికి పరిమితం కాలేదు. శాస్త్రబద్ధమయిన సరళిలో ఉత్ఖాతనాల (Excavations) ను నిర్వహించడం ద్వారా, భూగర్భంలో ఉన్న ఈజిప్ట్ నాగరికతాంశాలను వెలికి తేవడం జరిగింది. దానివల్ల, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, ఈజిప్ట్ నాగరికతలోని అనేక అంశాలను కూలంకషంగా తెలుసుకొని, ఈజిప్ట్ నాగరికతా స్వభావాన్ని సమగ్రంగా అవగాహన చేసుకోవడానికి అవకాశం కలిగింది.

BRAOU

## 7.3 భౌగోళికాంశాల ప్రాముఖ్యం

నాగరికతను ప్రభావితం చేసేవి భౌగోళికాంశాలే. వాటి ప్రాముఖ్యాన్ని అనేకమంది శాస్త్రజ్ఞులు వివిధ రీతుల్లో గుర్తించారు. క్రోబర్ (Krober) అనే మానవ శాస్త్రజ్ఞుడు సంస్కృతి, మానవునకు, పర్యావరణానికి మధ్యగల సాపేక్షమైన సంబంధం (an intervening variable between human organism and environment) అని వ్యాఖ్యానించాడు. దీనిలో పర్యావరణ ప్రభావమే సంస్కృతిని తీర్చిదిద్దుతుందనే అభిప్రాయం నిర్ద్వంద్వంగా చెప్పడం జరిగింది. పర్యావరణనే ఇంగ్లీష్‌లో 'ఇకోసిస్టం' (Eco System) అంటారు. ఉష్ణోగ్రత, వర్షపాతం నీటివనరులు, భూసారం, ప్రకృతి సంపద, అరణ్యాలు, జంతువులు, ఖనిజాల వంటివి - ఇవన్నీ పర్యావరణంలో భాగాలే. దీనిని మానవుడు ఒకటిగా సమకూర్చుకొన్నప్పుడు అతని నాగరికత, సంస్కృతి, రెండూ చక్కని పరిణామాన్ని పొందుతాయి. అందువల్లనే, రిచర్డ్ హాక్ల్యుట్ (Richard Hacklyut) "భూగోళం, కాలమానం చరిత్రకు కుడి కన్ను, ఎడమ కన్ను వంటివి" (Geography and Chronology are the right eye and left eye of History) అన్నాడు. ఈ పర్యావరణ ప్రభావం ఈజిప్ట్‌లోని ఈ క్రింది అంశాలమీద ఆధారపడి, చరిత్రను తీర్చిదిద్దింది.

## 7.3.1 నైల్ నది

హెరోడోటస్ (Herodotus) అనే గ్రీస్ దేశపు చరిత్రకారుడు "ఈజిప్ట్ నైల్ నది కానుక" ( Egypt is the Gift of Nile)) అని పేర్కొన్నాడు. గ్రీక్ భాషలో 'నీలస్'అని, లాటిన్ భాషలో 'నైలస్' అని పిలువబడే మాటలకు 'నైల్'(Nile) పదం సంబంధాన్ని కలిగిఉంది. ఇది తూర్పు ఆఫ్రికాలో 'టాంగనీకా' సరస్సుకు 30 మైళ్ల తూర్పున, లు విరోంజా (Lu Vironza) (3°40' దక్షిణ అక్షాంశం) అనే ప్రాంతంలో ఆవిర్భవించి, సుడాన్ మొదలయిన ప్రాంతాల మీదుగా ప్రవహించి, మధ్యధరా సముద్రంలో కలుస్తుంది. దీని మొత్తం పొడవు 4,517 మైళ్లు. దీనిలో బ్లూనైల్, ప్రధాన నైల్ మొదలయిన భాగాలున్నాయి. ఇది ప్రపంచంలో అతిపెద్ద, పొడవైన నదిగా గుర్తించబడడం జరిగింది. ఈ నైల్ నది ఈజిప్ట్‌లో దక్షిణం నుండి ఉత్తరంగా ఇంచుమించు 750 మైళ్ళ పొడవునకు పైగా ప్రవహిస్తున్నది. ఈజిప్ట్ దేశంలోని నాగరికతకు నైల్ నది తల్లివేరు వంటిది. నైల్ నది లేనట్లయితే, ఈజిప్ట్ నాగరికత, అభివృద్ధి వికాసం లేనట్లే. ఈ నైల్ నది మధ్యధరా సముద్రంలో కలిసే పర్యంతం, వివిధ దశలలో ఉంది. మొదటి దశలో అది కేవలం సన్నగా ఉండి, 'శాండ్ స్టోన్' (Sand Stone) వంటి రాళ్ళమీదుగా కొండలలో ప్రవహిస్తూ, మైదాన ప్రాంతాన్ని చేరుతుంది. ఈ మొదటి దశను నైల్ లోయ అంటారు. రెండవ దశను, అంటే కైరో తర్వాతి భాగాన్ని నైల్ మైదానం అంటారు. ఈజిప్ట్ చరిత్రలో ఈ మైదాన ప్రాంతానికి, పీఠభూమి ప్రాంతానికి మధ్య జరిగిన సంఘర్షణ, రెండు ప్రాంతాలను కలిపి ఒకటిగా చేయడానికి చేసిన ప్రయత్నాలు, ఎంతో క్లిష్టమైనవి, విస్తృతమైనవి.

### 7.3.1.1 నైల్ లోయ

నైల్ లోయ దేశాన్ని రెండు భాగాలుగా విభజిస్తున్నది. పశ్చిమ భాగం అంతా పీఠభూమివంటి ఎడారి ప్రాంతమే. ఈ ప్రాంతంలో అనేక చోట్ల భూమి కుంగిపోయిన గుర్తులు (depressions) కన్పిస్తున్నాయి. తూర్పు భాగంలో రెండు కొండలు, పీఠభూమి ఉన్నాయి. ఇవి రెండూ కూడా, నైల్ నది చేత ఖండించబడ్డాయి. నైల్ లోయ లక్షణాలను మనం సూడాన్ దేశపు సరిహద్దు నుండి, ఈజిప్ట్ రాజధాని అయిన కైరో (Cairo) వరకూ చూడవచ్చు. ఈదశలో ఒక్కోసారి ఈ నది 14 మైళ్ళ వెడల్పు కలిగి ఉండగా, వేరొక దశలో చుట్టుపట్లగల మట్టి అంతా నదీ ప్రవాహంలో కొట్టుకొని పోయేటంతవరకు సన్నబడటం జరిగింది. ఈ నది ఇంచుమించు రెండు వందల మైళ్ళ దూరంలో ఉన్న ఆస్వాన్ వరకు కేవలం రాళ్ళ మీద ప్రవహిస్తున్నది. ఈ ప్రవాహంలో అనేక 'సన్నని తోవ"లు (Gorges) ఉండటం చూడవచ్చు. వానిలో ఆశ్చర్యకరమైనది, ఆస్వాన్‌కు దక్షిణంగా కేవలం 250 గజాలు మాత్రం ఉన్నది. అస్వాన్ దాటాక, యీ నది ఉత్తరంగా ప్రవహిస్తున్నది. అప్పుడు 10 మైళ్ళు వెడల్పుగల ఒండ్రు మట్టి మైదానం ఏర్పడింది. ఆ తర్వాత ఇస్నా (Isna) వద్ద శాండ్ స్టోన్‌కు బదులుగా సున్నపు రాయి ఎక్కువగా ఉండటం వల్ల, ఈ లోయలో నది 12 మైళ్ళ వెడల్పుగా ఉంటుంది. ఆ తర్వాత నది అనేక మలుపులు తిరగడంవల్ల, చాలా మట్టి దిబ్బలు ఏర్పడ్డాయి. 'అస్యూట్'నుండి తూర్పు వైపుగా గల కొండలు చిన్నవిగా ఉంటాయి. దానివల్ల, నైల్ నది తూర్పుకు పెనవేసుకుపోతున్నట్లుగా కనబడుతుంది. దాని ఫలితమే, నదికి పడమట విస్తరించిన ఎంతో సారవంతమైన వ్యవసాయ యోగ్యమైన భూమి.

### 7.3.1.2 నైల్ మైదానం

నైల్ మైదానం కైరో ప్రాంతం నుండి తూర్పు - పడమరలుగాను, ఉత్తర దక్షిణాలుగాను వ్యాప్తి పొందింది. తూర్పు పడమరలుగా, త్రికోణాకారంలో ఉన్న దీని విస్తీర్ణం 155 మైళ్ళు. ఉత్తర దక్షిణాలుగా దీని విస్తీర్ణం 100మైళ్ళు. కైరో నుండి మధ్యధరా సముద్రం వరకు భూమి పల్లంగా ఉంటుంది. దీని ఎత్తు కేవలం 52 అడుగులు. ఈ నైల్ మైదానమంతా ప్లీస్టోసీన్Pleistocene) యుగానికి చెందిన మధ్యధరా సముద్రపు అఖాతానికి బదులుగా ఏర్పడింది. ఇథియోపియా దేశంలోని మెట్ట భూములనుండి కొట్టుకొని వచ్చిన మట్టి వల్ల, ఈ మైదానం ఏర్పడింది. దీని మందం 65 అడుగులు. ఈ మైదానంలో తూర్పున నదిలోని ఇసక, రాళ్ళు, చిన్న చిన్న దిబ్బలుగా, నిష్ప్రయోజనమైన భూభాగంగా కన్పిస్తాయి.



BRAOU

కొత్తగా మేట వేసిన ఒండ్రు మెత్తగా, సాగుతూ, బంకగా ఉండి, రాను రాను గట్టి పడుతుంది. ఈ ప్రాంతంలో రోడ్లన్నీ ఇటువంటి గట్టిపడ్డ మట్టితో వేసినవే.

### 7.3.2 ఎడారి

నైల్ నది తర్వాత ఈజిప్ట్ నాగరికతను నిర్దేశించే ఇంకొక అంశం, ఎడారి. ఇది కైరో పట్టణానికి పడమటగాను, ఉత్తర దక్షిణాలుగాను విస్తృతంగా వ్యాపించింది. గీజా (Giza) మొదలయిన పట్టణ ప్రాంతాలన్నీ, ఈ ఎడారి భాగానికి చెందినవి. ఈ ఎడారి నైల్ నదీ పరీవాహక ప్రదేశానికి పడమటగా ఉంది. నైల్ నది తూర్పుగా లోయ ప్రాంతాలలో పెనవేసుకుపోతున్నట్లు ప్రవహించడం వల్ల, ఈ పడమటి ప్రాంతంకూడా సారవంతమైంది. దానివల్ల, ఎడారి ప్రాంతంలో అనేక వాసయోగ్యమయిన భాగాలు పరిణమించాయి. ఈ ఎడారి ప్రాంతంలో అంతర్లీనమయిన ఉష్ణోగ్రతా ప్రభావంవల్ల, ఈజిప్ట్ నాగరికతకు చెందిన అనేక ఆధారాలు ఏ మాత్రం పాడుగాకుండా ఉన్నవి ఉన్నట్లుగా దొరికాయి. కాలి అడుగులు మాయలేదు; పూలమాలలు వాడలేదు. సొగసు రేకులు నలగలేదు. బతుకు తళుకులు వీడలేదు. ఈ ఎడారి ఈజిప్ట్ నాగరికతా అవశేషాలకు భాండాగారం వంటిది.

### 7.3.3 సినాయ్ పీఠభూమి

ఇది ఈజిప్ట్‌లో ఈశాన్య భాగంలో ఉంది. సూయజ్ అఖాత ప్రాంతంలో గల భూసంధి (Isthmus) వల్ల, ఈ పీఠభూమి ఈజిప్ట్ ప్రధాన భూభాగంతో ఎంతో సంబంధాన్ని పొందింది. లేనట్లయితే, ఈ పీఠభూమి వస్తుతః ఈజిప్ట్ దేశానికి చెందినది కాదని కూడా చెప్పవచ్చు. ఇది ఇథియోపియా పీఠభూమిలోగల అగ్ని పర్వతాల ప్రేలుళ్ళ వల్ల ఏర్పడ్డ లావా, నైల్ నదీ ప్రవాహంలో కొట్టుకొని వచ్చిన వండలి, రాళ్ళు, బరక ఇసుక మొదలయినవన్నీ యథాతథంగా ఏర్పడిన దశలలో, ఏర్పడింది. సినాయ్ పీఠభూమిలోగల రాగి గనులు ఈజిప్ట్ నాగరికతా తొలి వికాసంలో ఎంతో ప్రధానమయిన పాత్రను వహించాయి.

ఈ విధంగా నైల్ నదీ లోయ, మైదానం, ఎడారి, పీఠభూమి అనేవి, ఈజిప్ట్ నాగరికతకు నేపథ్యంగా వ్యవహరించాయి.

## 7.4 ఈజిప్ట్ నాగరికతా లక్షణాలు

నైల్ నదీ బహుమానంగా, గ్రీక్ చరిత్రకారుడు హెరోడోటస్ చేత వర్ణింపబడిన ఈజిప్ట్ నాగరికతలో, ఈజిప్ట్ వాసుల కార్యకలాపాలు, ప్రవర్తన, నదీ ముఖద్వారంలో ఉండే నైల్ నది మైదానానికి, ఈజిప్ట్‌కి చెందిన సినాయ్ పీఠభూమికి, సమీప స్థలాలయిన సిరియా, పాలెస్టీన్‌లకు గల పరస్పర పోషకమైన, పరస్పర భంజకమైన శక్తుల ప్రభావం వలన, ఈజిప్ట్‌లోని రాజకీయ వ్యవస్థ, సామాజిక వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ పెంపొందాయి. వీటి ప్రభావం వల్ల, ప్రజల ఆలోచనలనుండి, ప్రకృతికిగల సాన్నిహిత్యాన్ని, సంబంధాన్ని అంచనా వేయడంవల్ల, ఒక మత వ్యవస్థ, తత్త్వవివేచన పెంపొందింది. అంతేకాక, ఈజిప్ట్‌లో ప్రకృతి-మానవ సంబంధాలను, భౌతిక మాధ్యమంలో వర్ణిస్తూ, మానవ స్వభావాన్ని ప్రకృతి మాధ్యమంలో రూపిస్తున్న విధానంలో, వారి కళలు, వాస్తు రీతులు పెంపొందాయి. వారి నాగరికతలోని ఈ ఉప వ్యవస్థల లక్షణాలను ఈ క్రింది విధంగా సూచించవచ్చు.

### 7.4.1 సామాజిక వ్యవస్థ

ఈజిప్ట్ సమాజంలో సుఖ జీవుల వర్గం, బానిస వర్గం అనేవి ఏర్పడ్డాయి. ఈ రెండు వర్గాలు వారిలోని ఆర్థిక అంతరాలవల్ల ఏర్పడ్డవని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఈ రెండు వర్గాలవారు స్థూలంగా మూడు తరగతులుగా ఉండేవారు. ఫారో (Pharoh), అతని తక్షణ సహచరులు సమాజంలో ఉన్నత శ్రేణికి చెందినవారు. భూస్వాములు,



BRAOU

మతాధిపతులు, స్వతంత్ర వ్యవసాయదార్లు, వృత్తిపనివారు , వర్తకులు, మధ్యతరగతికి చెందినవారు. రైతు కూలలు, బానిసలు, అధమ శ్రేణికి చెందినవారు. ఈ రెండు వర్గాలవారికి తమ తమ ధన, మాన, ప్రాణాలమీద ఎటువంటి అధికారం ఉండేదికాదు. యుద్ధంలో ఓడింపబడ్డవారు, చట్టబద్ధంగా ఋణగ్రస్తులై ఆస్తులు కోల్పోయినవారు, కూలీలుగా కాక, బానిసలుగా మార్పు పొందేవారు. కూలీలకు, బానిసలకు మధ్య వ్యత్యాసం తక్కువ. కాని, మిగిలిన ఇతర వర్గాలకు, తరగతులకు మధ్య, ఎంతో దగ్గరగా తేలేని వ్యత్యాసం ఉంది. అది ఎడారికి, మైదానానికి గల వ్యత్యాసం వంటిది. ఈజిప్ట్ సమాజంలో స్త్రీకి ఎంతో గొప్ప హోదా, హక్కు, అధికారం ఉండేది. నూతన రాజ్యకాలంలో హట్షెప్సుట్ రాణిని ఉదాహరణగా తీసికొన్నట్లయితే, ఫారోల కుటుంబాలలోను, మరికొన్ని యితర ఉన్నత కుటుంబాలలోను, స్త్రీలకు ఆరకమైన ఉన్నతాధికారం ఉండేదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. ఈజిప్ట్ సమాజంలో, ముఖ్యంగా రాచకుటుంబాలలో, వంశ పవిత్రత పట్ల కొన్ని ప్రధానమైన నమ్మకాలుండేవి. ఇతర కుటుంబాలతో వివాహం జరిగితే, తమ వంశ పవిత్రత క్షయమవుతుందని భావించి, తమ యిళ్ళలోని చెల్లెళ్ళు, కూతుళ్ళనే వివాహం చేసికొనేవారు. దీనిని తర్వాతి తరాలవాళ్ళు అశ్లీలంగా భావించినా, వారి దృక్పథంలో 'పవిత్రత' అనే అంశం వారిని ఆ విధంగా ప్రోత్సహించి ఉంటుందనడం నిర్వివాదాంశం.

## 7.4.2 రాజకీయ వ్యవస్థ

ఈజిప్ట్‌లో పిరమిడ్ యుగం (క్రీ.పూ. 3400 - 2500) ముందున్న రాజకీయ వ్యవస్థలుగాని, వాటి స్పష్టమైన స్వరూపంగాని లేదు. బ్రెస్టెడ్ (Breasted) అనే ఈజిప్టాలజిస్ట్ ప్రకారం, "పూర్వ - మధ్య రాజ్యాల సంస్కృతుల సామాన్య సంఘటనల గతిని గురించి, అస్పష్టమైన, రేఖామాత్రమైన వర్ణన కంటే, ఎక్కువగా బహుశః ఏమీ ఇవ్వలేం". కాని, రాజ్య వ్యవస్థలో దుర్నిరీక్ష్యమైనవాడు ఫారో. ఇతడు దైవాంశసంభూతుడుగా చెప్పబడ్డవాడు. అతడే, అనగా ఫారోయే ఏకైక యజమాని, ప్రభువు, యుద్ధంలో నాయకుడు, పరిశ్రమల యజమాని, ప్రజోపయోగ కార్యక్రమాల పర్యవేక్షకుడు, వనరులకు అధిపతి. అనేక మంది ఉద్యోగులు అతని అధికారంలో లొంగి పనిచేసేవారు. ఫారో అధికారంలోని బలహీనత, భూస్వామ్య యుగంగా పరిణమించింది. ఈ యుగంలో వివిధ మతాధిపతులు చిన్న చిన్న రాజ్యాలను ఏర్పరచుకొన్నారు. ఈ కాలంలో ఉద్యోగిస్వామ్యంతో కూడుకొన్న నిరంకుశ ప్రభుత్వం నశించింది. తత్ప్రభావంగా, రాజ్య ప్రజల్లో స్వేచ్ఛాభావం పెంపొందింది. ఈ కాలంలో నుబియన్లు దక్షిణం నుండి, హిక్సోస్ సిరియా, పాలెస్తీనాలనుండి దండెత్తి వచ్చి, కొంత కాలం ఈజిప్ట్‌ను పాలించారు. కాని, అచిరకాలంలో ఈజిప్ట్ వారు సామ్రాజ్యాన్ని నిర్మించుకోగలిగారు. సామ్రాజ్యయుగంలో, ఈజిప్ట్ రాజ్య వ్యవస్థలో, నౌకాదళం పెంపొందడం ఒక ప్రధాన లక్షణం. కాని, ఈ కాలంలో ఈజిప్ట్ రాజ్యంలో రాజకీయ బలహీనత సామాన్య లక్షణంగా ఏర్పడింది.

## 7.4.3 ఆర్థిక వ్యవస్థ

ఈజిప్ట్ నాగరికతలో వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉండేది. వారు గోధుమలు, బార్లీ, చిరుధాన్యాలు, ఉల్లిపాయలు, చిక్కుళ్ళు, బఠాణీల వంటి ఆహారధాన్యాలు, జనుము, ప్రత్తిని పండించేవారు. వేర్వేరు వృత్తి పనులు కూడా వ్యాప్తిలో ఉండేవి. రాళ్ళను తవ్వి తీయడం, ఇటుకల తయారీ, తాపీ పని, లోహపు పని, వడ్రంగం ప్రధాన వృత్తులుగా ఉండేవి. నౌకా నిర్మాణం, మట్టి పాత్రల తయారీ, నారబట్టలనేత, ఆభరణాలు, వారి పనులలోని నైపుణ్యాన్ని, సౌందర్యాత్మకతను సూచిస్తుంటాయి. వాణిజ్యం అంత గొప్ప స్థాయిలో పెంపొందలేదు. ప్రత్యేకమైన ద్రవ్యమారక వ్యవస్థ ఏర్పడలేదు. కేవలం కొన్ని ప్రత్యేకమైన, నియతమైన బరువున్న వెండి ముక్కలను, బంగారపు ముక్కలను మార్కెట్టులో వాడేవారు. ఎక్కువగా దైనందిన మారక వ్యవస్థ, వస్తు మార్పిడిగానే కొనసాగుతుండేది. సుగంధ ద్రవ్యాలు, రంగులు, సౌందర్యాన్ని పెంపొందింపచేసే వస్తువులను, భారతదేశం వంటి తూర్పు దేశాలనుండి తెచ్చుకొనేవారు. ఈజిప్ట్ ఆర్థిక వ్యవస్థలో పాపిరస్ చెట్టు బెరడు నుండి కాగితాన్ని (Paper) తయారుచేయడం, ఒక ప్రత్యేకమైన రూపంగా పెంపొందింది. ఈజిప్ట్‌లో కేంద్రీకృతమైన పన్నుల వసూలు వ్యవస్థ ఉండేది. నూటికి పదినుండి ఇరవై పాళ్ళ వరకు పన్నులను వసూలు చేసేవారు. ఎక్కువగా పన్నులు ధాన్యరూపంలో ఉండేవి.

## 7.4.4 మత వ్యవస్థ

ఈజిప్ట్ మత వ్యవస్థలో పునర్జన్మ పట్ల నమ్మకం ఉండేది. అందువల్ల, వాళ్ళు దాని కనుగుణంగా మృత శరీరాలను రక్షించేవారు. ఆ రకంగా రక్షితమైన మృత దేహాలను మమ్మీలు అంటారు. ఈజిప్ట్‌లో ఏక దేవతారాధన లేదు. వారు ఈజిప్ట్‌లో నైల్ నదిని పూజించేవారు. ఒసిరిస్‌ను నైల్ నదీ ప్రభువుగా భావించి, పూజించేవారు. వీరి తాత్త్వికవివేచన అతి సరళమైనది. 'రా'అనబడే సూర్యదేవుని, అతి శక్తివంతమైన దేవునిగా భావించేవారు. అతడికి శత్రువులందరి మీద అధికార ముందని, అతడు ఋతువులను ఏర్పరచేవాడని, అతడు సంతానవత్వానికి, సంతోషానికి మూలం అని భావించేవారు. దేవుడు తన పదార్థం నుండే తాను జన్మిస్తాడని ఈజిప్టియన్లు చేసిన భావన, 'ఆత్మానమాత్మ ముద్ధరతే' అనే భారతీయ సిద్ధాంతాలకు దగ్గరగా ఉంది. నాల్గవ అమెన్‌నోటెప్ కాలంలో, దేవుడు స్వచ్ఛమయినవాడని, దయాళువని, గొఱ్ఱెల కాపరి అని, తండ్రి అని, భావించడం జరిగింది. ప్రాచీన ఈజిప్ట్‌లో ఏక దేవతారాధనకు యత్నాలు జరిగినా, శుద్ధమైన ఏకదేవతా రాధన ఎప్పుడూ నెలకొనలేదు.

## 7.4.5 తత్త్వవ్యవస్థ

ఈజిప్షియన్ల, ప్రధానంగా వారి తాత్త్విక చింతన, ప్రకృతి - పురుష బంధాన్ని అన్వయం చేసికొనే పద్ధతిలో భవిష్యజ్జీవితం అనే సాంప్రదాయం పెంపొందింది. వేర్వేరు దశల్లో భవిష్య జీవితం - మంత్రకర్మలమీద, ధర్మవర్తనమీద, ఆధారపడిందని నమ్మేవారు. అలాగే మృతిచెందిన పిదప, వ్యక్తులు భూమిమీద, స్వర్గంలోను, విచిత్రమైన ద్వంద్వ జీవితం గడుపుతారని నమ్మేవారు. పంచ భూతాలన్నీ సమాధులను అంటిపెట్టుకొని ఉంటాయని నమ్మడం జరిగింది. ఆత్మ పరలోక యాత్ర చేస్తూ, అనేక దుష్ట శక్తులనెదుర్కొంటుందని వారు నమ్మేవారు. ఆ దుష్ట శక్తులను మంత్రతంత్రాల ద్వారా వారించేవారు. ఆత్మ, యాత్ర పిదప సత్యప్రాంగణానికి చేరుతుంది. శక్తివంతమైన ఆత్మ, దేవునిలో కలిసిపోతుంది. ద్రోహియైన ఆత్మను క్రూరమృగాలకు కబళాగా అగాధంలోకి తోసివేయడం జరుగుతుంది.

## 7.4.6 కళలు

ఈజిప్ట్‌లో శిల్పకళ, వాస్తువుకు అనుషంగికంగా రూపొందింది. శాశ్వతత్వం, వాస్తవికత ఆనాటి శిల్పుల ఆదర్శాలు. ఏకశిలా ప్రతిమలు ఈజిప్ట్ తొలి రోజుల ప్రత్యేకత. కూర్చొన్న, నిల్చున్న, విగ్రహాలు ముద్దుగా వుండేవి. ఇంచుమించు 80, 90 అడుగుల ఎత్తుగల ఏక శిలాశిల్పాలు లభ్యమయ్యాయి. మానవాకృతి, జంత్వాకృతి కలిపిన శిల్పాలు, గొప్పగా రూపొందాయి. స్పింక్స్, సింహం శరీరం, మనిషి తలతోగల గొప్పశిల్పం. ఆలంకారిక శిల్పాన్ని వారు కథాకథనాత్మకంగా పిరమిడ్ల గోడలమీద, దేవాలయాల ప్రాంగణాల వద్ద చూపారు. వీరి చిత్ర కళ ప్రయోజనాత్మకమైనది కాక, కేవలం అలంకరణాత్మకమైనది మాత్రమే. చిత్రాలలో నలుపు, తెలుపు వర్ణ సమ్మిశ్రత ఉండేది. ప్రాచీన, మధ్యరాజ్యాల కాలంలో, చిత్ర కళ మత సంబంధమైనదే. హట్షెప్సుట్ కాలంనుండి ప్రయోజనాత్మక చిత్రకళ పెంపొందింది. అప్పట్నుండి చిత్రకారునికి స్వేచ్ఛ ఉండేది. సముద్ర తరంగాలు, పద్మాలు, పిరస్ పొదలు వంటి ప్రకృతి దృశ్యాలను మనోజ్ఞంగా చిత్రించేవారు. రాతిపని, కొయ్యపని, నగల తయారీ వంటివి ప్రయోజనాత్మకమైన ఉపకళలుగా పెంపొందాయి. వాస్తు కళ, చిత్రలేఖనం, శిల్ప కళలకన్న గొప్ప స్థానం పొందింది. వాస్తు కళలో వీరు పిరమిడ్ ఆకారంగల కట్టడాలను, పెంపొందించారు. గీజె వద్ద నిర్మితమైన గొప్ప పిరమిడ్, 746 చదరపు అడుగుల స్థలంలో, 450 అడుగుల ఎత్తైన కట్టడం. ఇవి ప్రపంచపు వింతలుకూడా. పిరమిడ్లు నిరాడంబరతను, విశాలత్వాన్ని ప్రధాన లక్షణాలుగా కల్గి ఉన్నాయి. కార్నిక్‌లోని దేవాలయం, దేవాలయాలు అనే వేరొక తరహా కట్టడాలకు గొప్ప ఉదాహరణ. గ్రీస్‌లోని డోరియన్ శైలికి ఇది మాతృక వంటిదని చెప్పొచ్చు. వాస్తు కళలోని బృహత్ పరిమాణం, అధిక భారం, ఒక మేరునగధీరగంభీర భీకరత్వాన్ని వ్యక్తం చేస్తాయి.

B RAOU

ఈ కాలంలో సాహిత్యం కూడా మత ప్రధానంగా పెంపొందింది. వారి సాహిత్యం, దేవతల స్తోత్రాలు, ఫారోల ప్రశంసలు, ముక్తాత్మల ఉపదేశాలుగా పెంపొందింది. 'ది బుక్ ఆఫ్ ది డెడ్', 'కాఫిన్ టెక్ట్సులు', 'ది సాంగ్ ఆఫ్ ది హార్పర్' గొప్ప సాహిత్యానికి ఉదాహరణలు. వీనిలో హేతువాదం పట్ల నిరసన; శాశ్వతత్వ సాధన పట్ల ఆవశ్యకత; ప్రాపంచిక సుఖాలకు లొంగిఉండడం పట్ల బాధ - ఉద్వేగం, ఊహ, కళాత్మకత అనే మూడు విషయాలలో వ్యంగ్య భావస్ఫోరకంగా చెప్పబడ్డాయి. వీరి సాహిత్యంలో శాస్త్ర సాహిత్యంకూడా, జ్యోతిషం, ఖగోళ శాస్త్రం, గణిత శాస్త్ర భాగాలుగా పెంపొందింది. ఈ సాహిత్యం అంతా హీరోగ్లిఫిక్ లిపిలో వ్రాయబడింది. ఈ రకమైన లిపిలో ఒక నిర్దిష్టమైన వస్తువును ఒక సంకేతంతో సూచిస్తారు.

## 7.5 నాగరికత స్వభావం

ఈజిప్ట్‌లో లభ్యమయిన అనేక సాంస్కృతికావశేషాలవల్ల, ఈజిప్టాలజిస్టుల రాతల వల్ల, ఈజిప్షియన్లకు గల ప్రకృతితో సాన్నిహిత్యం, ఈ క్రింది స్వభావమున్న నాగరికతకు కారణమయినట్లు విశదమవుతుంది.

1. ఈజిప్ట్ నాగరికత, నైల్ నదీ కేంద్రీకృత నాగరికత. వారి భౌతిక, దైనందిన, ఆది భౌతిక వ్యక్తిత్వాలు నైల్ పరిధిని దాటిపోలేదు. నైల్ నది వారికి నీటిని ఇచ్చింది. అదే ప్రధాన వాణిజ్య రహదారిగా మారింది. అదే నైల్ నది ఎట్టకేలకు దైవత్వాన్ని పొంది, ఒసిరిస్ (Osiris) అనే దేవతగా గౌరవాన్ని పొందింది.

2. నైల్ నదికి, భూమికి ఉండే సంబంధాన్ని విశేషంగా గ్రహించడం వల్లనే, ఏ రకంగా భూమిమీద నైల్ ప్రవహించి, ఉన్నతంగా అభివ్యక్తమవుతున్నదో, భూమిని ఏలే పాలకులంతా ప్రధానంగా ఏదో ఒక దేవుని అర్చకులుగా ఉండాలనే ఆచారానికి దారితీసింది.

3. సుభిక్షత నిచ్చే నైల్, క్లిష్టమైన ఎడారి, పరస్పర సాన్నిహిత్యాన్ని కలిగి, ఒక దాని తర్వాత ఒకటిగా ఉన్నాయో, ఈజిప్ట్ వాసులలో బతుకు తరవాత చావు, చావు తర్వాత బతుకు అనే విశ్వాసం ఏర్పడి, ఉన్నతమైన పిరమిడ్లవంటి అపర కర్మ చిహ్నాల నిర్మాణానికి దారితీసింది.

4. పండ్లు, ఫలాలు, నీళ్ళు, మట్టి, రాళ్ళు, రాగి, బంగారం, వివిధ ఆహారాలు, కేవలం నైల్ నదీ పరీవాహక ప్రదేశంలోను, దానికి సమీపమైన భూములలోను దొరకడం వల్ల, ఈజిప్ట్ ప్రజలకు ఇంచుమించు క్రీ.పూ. 2040 వరకు, చుట్టుపట్లగల దేశాలతో గాని, ప్రజలతోగాని ఏరకమైన సంబంధాలు ఏర్పడలేదు. దానివల్ల, ఈజిప్ట్ నాగరికత అంతా ఒక విధంగా 'శిలాజీకృతం' (Fossilised) అయిపోయిందనవచ్చు.

5. ఈ నాగరికతలోని పిరమిడ్లవంటి నిర్ణాయకాంశాలవల్ల, ఈ నాగరికత పట్టణ నాగరికతగా రూపొందినట్లు గమనించగలం.

6. ఈ రకమైన పట్టణ నాగరికత, సంప్రదాయాలవల్ల కలిగిన 'అధికార వినిమయ పద్ధతుల' (Methods of Exchange of Power) వల్ల, అధికారం కేంద్ర ప్రాంతాల నుండి సరిహద్దు ప్రాంతాలకు, వేర్వేరు మాధ్యమాలలో బదిలీ అయింది. దానిలో యుద్ధం ఒకటి. అందువల్ల ఈజిప్ట్ నాగరికతా వికాసంలో అంతర్యుద్ధాలు ఒక ప్రధానమయిన సరళిని పెంపొందించుకొన్నాయి.

7. ఈజిప్ట్ భౌగోళిక ప్రాంతం, మధ్యధరా సముద్రంవల్ల, ఎర్ర సముద్రంవల్ల పరివృతమై ఉండటంవల్ల, పశ్చిమాసియాలోని సుదుర్, అస్సీరియా, బాబిలోనియా మొదలైన రాజ్యాలతో వారు వ్యవహరించిన తీరు, కేవలం ఆర్థిక ప్రాముఖ్యాన్ని పొందగలిగింది.

8. ఈజిప్ట్‌లోని ఎడారి భాగం, నైల్ నది పరస్పర విరుద్ధాంశాలు. దీని ప్రభావం వల్ల, ఎక్కువగా పరిపాలనా మండలాలు ఏర్పడలేదు. అందువల్ల, పాలనావ్యవస్థ మొత్తం కేంద్రీకృతమై, దాని భారమంతా ఫారో (Pharoh) పైన; తర్వాత 'వజీర్' (Vazir)ల భుజస్కంధాలపై పడింది. క్రీ.పూ. 1569-656లో నుబియా (Nubia) మొదలైన ప్రాంతాలను ఆక్రమించి, ఈజిప్ట్ సామ్రాజ్యంగా మారేవరకు, పరిపాలనలో కేంద్రీకరణ స్వభావం ఏమీ మారలేదు. ఈ పరిపాలనా విధానంలో ప్రభువునే భగవంతుడుగాను, లేదా అతని వారసుడుగా గాని, ప్రతినిధిగా గాని గుర్తించబడే స్థితి ఏర్పడింది.

9. ఈజిప్ట్ పరిపాలనా విధానంలో పురుషులు మాత్రమే గాక, స్త్రీలు కూడా పాలనార్హతను కలిగి ఉండేవారు. హట్షెపుట్ (Hutshepsut) రాణి పరిపాలన దీనికి ఒక గొప్ప ఉదాహరణ.

10. ఈ నాగరికతతో వాణిజ్య వ్యవస్థ స్థిరపడినా, విస్తరింపక పోయింది. దీనివల్ల, ఈ ఆర్థిక వ్యవస్థలో వస్తు మారక వ్యవస్థ మాత్రమే ప్రాచుర్యం పొందింది. ద్రవ్యమారక విధానం ఈ నాగరికతలో లేదు.

11. ఈజిప్ట్ నాగరికత ప్రకృతికి అతి సన్నిహితమైన పరిధిలో అభివృద్ధి పొందడం వల్ల, వారి భావాలకు సంకేతాత్మకమైన చిత్ర లిపి మాత్రం అభివృద్ధి చెందింది. దీనివల్ల, ఆనాటి ఈజిప్షియన్‌ల భావాలు పరివ్యాప్తం కావడానికి గల అవకాశాలు లోపించాయి.

12. సినాయ్ పీఠభూమిలో రాగి, నైల్ మైదానంలో మంచి ఒండ్రు మట్టి దొరకడం వల్ల, వివిధ పరికరాలు, ఆభరణాలు, ఆయుధాల వంటి వాటిని, మట్టితోను, రాగితోనూ తయారుచేసేవారు.

## 7.6 తులనాత్మక పరిశీలన

నైల్ కేంద్ర నాగరికతగల ఈజిప్ట్‌లో నాగరికత పరంగా సంక్రమించిన గొప్పదనాన్ని, లోపాలను, తులనాత్మక పరిశీలన ద్వారా గమనించగలం.

పిరమిడ్లు, ఏక శిలా ప్రతిమలు, లోహ ప్రతిమలు మొదలైనవన్నీ ఆనాడు ఈజిప్ట్‌లో అభివృద్ధి పొందిన సాంకేతిక, విజ్ఞాన శాస్త్రాల ఔన్నత్యానికి గుర్తు. పిరమిడ్లు వాటి ఎత్తువల్లా, వానిలో ఉన్న వాస్తు స్వభావాల వల్లా, ప్రపంచపు వింతలలో ఒకటిగా నేటికి కూడా గుర్తింపబడుతున్నాయి. ఈ నాగరికత ఎంత గొప్పదయినా, సుమేరియాలోవలె లిఖిత శాసనాలనుగాని, రాత పూర్వకమైన సంప్రదాయాలను గాని కలిగిలేదు. ఈ నాగరికతకు వివిధ ప్రాంతాలతో అతి పరిమితమైన సంబంధాలు వుండేవి. ఆ సంబంధాలు తరచుగా కూడా ఉండేవి కావు. అందువల్ల, ఈజిప్ట్ నాగరికత ఎంతో కాలం, ఇంచుమించు క్రీ.పూ. 5,000 నుండి 3000 వరకు, యధాతథంగా వర్థిల్లింది. అది యీ నాగరికతకు గల ఏక పక్షమైన అభివృద్ధిని మాత్రం సూచిస్తుంది. అంతే కాక, ఈ నాగరికతకుగల చారిత్రక సంప్రదాయాన్ని కూడా సూచించడం జరిగింది. ఈ దేశానికి అన్ని దిక్కులలోను, అన్ని ప్రాంతాలలోను, సముద్ర ప్రభావం ఎక్కువవడం వల్ల, ఈ నాగరికత కేవలం శాంతికాముకమైనదిగా మిగిలింది. కాని, మిగిలిన ప్రాంతాలకు అది సాధ్యం కాలేదు. ఇతర ప్రాంతాలతో తరచుగా ఉండే సంబంధాల వల్ల, మెసపటోమియాలోని సుమర్, అస్సీరియా, బాబిలోన్ మొదలైన ప్రాంతాలలో వివిధ సంప్రదాయాలు ఆవిర్భవించి, ఔన్నత్యాన్ని పొందాయి. అదే విధంగా ఇతర స్థలాలతో ఉండే భౌగోళిక సంబంధాల వల్లనే, సింధునదీ నాగరికత ఆర్యుల దాడికి గురై విచ్ఛిన్నమైంది. ఒక వంక సముద్రం, వేరొక వంక ఎడారి ఈజిప్ట్‌ను కాపాడగా, నైలునదీ వరప్రసాదమైన ఈజిప్ట్ నాగరికతలోని ఇతర వివరాలను తర్వాతి భాగాలలో తెలుసుకొనవచ్చు.

BRAOU

## 7.7 సంగ్రహంగా

1. ఈజిప్ట్ నాగరికత క్రీ.పూ. 5000 - 600 లలో అభివృద్ధి చెందింది.
2. ఇది నైల్ నదీ పరీవాహక ప్రదేశంలోని నైల్ నది కానుక.
3. ఈ నాగరికతకు ఇతర ప్రాంతాలతోగల సంబంధాలు పరిమితమైనవి.
4. ఈ నాగరికతలో ప్రభువులు, ప్రకృతి శక్తుల పూజారులు, వారసులు, ప్రతినిధులు.
5. ఇది క్రీ.పూ. 3000 ప్రాంతం వరకు సామ్రాజ్యంగా అభివృద్ధి చెందలేదు.
6. పిరమిడ్లు ఈ నాగరికతలోని ప్రపంచపు వింతలలో ఒకటి.
7. ఈ నాగరికతకు చిత్రలిపిలో రాయబడిన 'పాపిరస్' ప్రతులు ముఖ్యమైన లిఖితాధారలు.
8. "మరణానంతర జన్మ" అతి ప్రధానమైన నమ్మకం.
9. మానవ శాస్త్ర ప్రమాణాల ప్రకారం, ఇది ప్రభావితం కాని నాగరికత.

## 7.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

(I) క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. ఈజిప్ట్ భౌగోళిక నేపధ్యాన్ని వివరించండి.
2. ఈజిప్ట్ నాగరికతా ప్రధాన లక్షణాలను పేర్కొనండి.
3. ఈజిప్ట్ నాగరికతా ప్రధానాధారలను పేర్కొనండి.

(II) క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.

1. ఈజిప్ట్ నాగరికతను ఇతర నాగరికతలతో పోల్చి చూడండి.
2. నైల్ నదీ ప్రాంతాన్ని గురించి రాయండి.
3. ఈజిప్ట్‌లోని ఎడారి, పీఠభూమిని గురించి రాయండి.
4. ఈజిప్ట్ నాగరికతా స్వభావాన్ని విశ్లేషించండి.

## 7.9 ఉపయుక్త గ్రంథాలు


**Encyclopaedia Britanica** : Vol.8 పుటలు, 27-91

Holmen Schnider : **History of the World Civilization**

Hutchinson : **Ancient World History of Civilization**

Veesh W.S. (ed) : **History of the World**


B R A O U

## 7.10 పదకోశం

పిరమిడ్‌లు : ఈజిప్ట్ రాజుల సమాధులు

స్పింక్స్ : జంతువుల ఆకృతిగల ఏక శిలా ప్రతిమ

ఫారో : ఈజిప్ట్ రాజు

వజీర్: ఈజిప్ట్‌లో గొప్ప నది, పొడవు 4,517 మైళ్ళు

డనాయధ : ఈజిప్ట్‌కి ఈశాన్యంలోగల పీఠభూమి

సినాయ్ : ఈశాన్యంలోగల పీఠభూమి

నుబియా : ఆగ్నేయ ఈజిప్ట్‌లోని భాగం.

ఒసిరిస్ : స్త్రీ దేవత పేరు

రే : సూర్యుడు.

ఈజిప్టాలజీ : ఈజిప్ట్ నాగరికతా శాస్త్రం.

BRAOU

# భాగం-8 : సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు

విషయక్రమం


8.0 లక్ష్యాలు

8.1 పరిచయం

8.2 సామాజిక వ్యవస్థ

8.2.1 విజాతీయత-బహుళ జాతీయత

8.2.2 సామాజిక వ్యవస్థ స్వభావం

8.2.2.1 ఫారో

8.2.2.2 దాస్యం: బానిస వ్యవస్థ

8.2.2.3 ఉన్నత వర్గాలవారు

8.2.2.4 మధ్య తరగతివారు

8.2.2.5 కుటుంబ వ్యవస్థ

8.2.2.5.1 స్త్రీలు, వివాహ వ్యవస్థ

8.2.2.5.2 సంతానం -పిల్లల పెంపకం

8.2.2.5.3 ఇళ్ళలో దాసీలు

8.2.2.6 గృహాలు: గృహోపకరణ వస్తువులు

8.2.2.6.1 సామాన్యుల ఇండ్లు

8.2.2.6.2 రాజవంశస్థుల ఇండ్లు

8.2.2.6.3 రాజగృహోపయోగ వస్తువులు

8.2.2.7 ఆహారపు అలవాట్లు

8.2.2.7.1 విందులు

8.2.2.8 వస్త్రధారణ

8.2.2.9 అలంకరణలు

8.2.2.10 క్రీడలు - వినోదాలు

8.2.2.10.1 సంగీతం- వాద్యాలు

8.3 ఆర్థిక వ్యవస్థ

8.3.1 వ్యావసాయిక వ్యవస్థ


BRAOU

8.3.2 రవాణా వ్యవస్థ

8.3.3 వర్తక వాణిజ్యాలు

8.4 రాజకీయ వ్యవస్థ

8.4.1 కేంద్రీకృత వ్యవస్థ-ఫారో

8.4.2 వజీర్

8.4.3 ఇతర ఉద్యోగులు

8.4.4 న్యాయవ్యవస్థ-శిక్షా విధానం

8.4.5 ఆదాయ వ్యయాలు

8.4.6 ఆస్తి హక్కుల వివరాలు

8.4.7 సైనిక వ్యవస్థ

8.5 సంగ్రహంగా

8.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

8.7 ఉపయుక్త గ్రంథాలు

8.8 పదకోశం

BRAOU

## 8.0 లక్ష్యాలు

1. ఈజిప్షియన్‌లు ఒకే జాతి వారా? లేక అనేక జాతుల వాస్తవిక అనుసంధానం(Material association) వల్ల, ఏకీకృత పరిస్థితుల (Unified conditions) వల్ల, ఈజిప్షియన్ జాతిగా ఆవిర్భవించారా? వారి వ్యక్తిత్వ స్వరూపం ఎటువంటిదో తెలుసుకోడం.

2. ఈజిప్ట్‌లోని సామాజిక వ్యవస్థ స్థిరాత్మకమైనదా? (Stratified) విస్తరణాత్మకమైనదా? (Horizantal) అనే అంశాలను పరిశీలించడం.

3. ఈజిప్ట్‌లోని కుటుంబ వ్యవస్థను గురించి తెలుసుకోడం.

4. ఈజిప్ట్‌వాసులు ఎక్కడ నివసించేవారు? వారి ఇళ్ళు, ఇతర నిర్మాణాల శైలి ఏవిధమైనవో తెలుసుకోడం.

5. వారివారి ఇళ్ళలోని పద్ధతులు, దర్జా (ఇది హోదాను సూచించే వస్తువులకు చెందిన మాట)లు, ఆహారం, వస్త్ర ధారణ, గృహోపకరణ వస్తువుల వినియోగం వంటివాటిని గురించి తెలుసుకోడం.

6. ఆర్థిక వ్యవస్థకు నేపథ్యంగా మూలాధారమైన వ్యవసాయం, రవాణా, వర్తకం, పరిశ్రమలు, మారకం మొదలైన అంశాలను తెలుసుకోడం.

7. సమాజ నిర్వహణలో అధికార స్వరూపం ఎటువంటిదో తెలుసుకోడం.

8. అధికారాన్ని ఎవరు, ఎందుకు, ఎప్పుడెపుడు, ఎట్లా నిర్వహించారో ? ఆ అధికారం ఆవిర్భవించడంలోగల ప్రధానమైన (important), ఆనుషంగికమైన (Subordinate), ప్రత్యక్షమైన (direct), అప్రత్యక్షమైన (indirect) అంశాలను పరిశీలించడం.

9. ఈజిప్ట్ నాగరికత ఆవిర్భావంలో పెరిగిన రాజకీయ చరిత్రను గురించి, దాని ప్రాముఖ్యం గురించి, ఒక సంక్షిప్తమైన వివరణను, విశ్లేషణను ఏర్పరచడం.

10. ఈజిప్ట్ నాగరికతలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను, సమీప ప్రాచీన నాగరికతలతో పోల్చి చూడటం.

## 8.1 పరిచయం

సామాజిక వ్యవస్థ అంటే, సమాజంలో ఉండే వేర్వేరు జాతులకు, ఆర్థిక, మత వర్గాలకు చెందిన వ్యక్తుల మధ్యగల, నిర్వచించబడి, నిర్వచించబడని సంబంధాల సమగ్ర స్వరూపం. సమాజంలో సంబంధాలు రాజువల్ల, చట్టం వల్ల, ఆచార సంప్రదాయాల వల్ల, అంగీకరించబడి, చెలామణిలోకి వస్తాయి. వానిననుసరించడం గౌరవం. ఉల్లంఘించడం నేరం. సమాజంలో అన్ని సంబంధాలకు వివాహ వ్యవస్థ; కుటుంబ వ్యవస్థ, కీలకమైనవి.

వివాహం ద్వారా దగ్గరయిన స్త్రీ, పురుషులు సమాజంలోని సూక్ష్మ అంశం. వీరు కుటుంబ వ్యవస్థద్వారా గుర్తించబడతారు. కుటుంబ వ్యవస్థ, వివాహ వ్యవస్థ పరస్పర పోషకాలు: ఆర్థిక వ్యవస్థలో నిత్య వ్యవహారంలో అందరూ అందరితోను కలుస్తారు. దీనివల్ల, సమాజంలో సాన్నిహిత్యం ఏర్పడుతుంది. మానవులు ప్రకృతిలోని వివిధ వనరులను వినియోగించుకొని, తమ నిత్యావసరాలను తీర్చుకోడం జరుగుతుంది. ఆర్థిక వ్యవస్థ వ్యక్తులలో సామాజికేతరమైన విలువలకు ప్రాముఖ్యమిస్తుంది. దాని ఫలితంగా, వ్యక్తికి ఆర్థిక ప్రాబల్యంపట్ల గౌరవం పెరుగుతుంది.

ఈ స్థితిలో ప్రకృతిలోని, సమాజంలోని వనరులను, వాటి వినియోగ విధానాలను నియమిస్తూ, సమాజంలోని అన్ని వర్గాలవారికీ, ఆర్థిక పరమైన సమతౌల్యాన్ని (economic equilibrium) ఏర్పరచవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఇదే ప్రధానోద్దేశ్యంగా రాజ్యవ్యవస్థ అవతరించింది. ఈజిప్ట్ సమాజంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలలోని వివరాలు, ఈ క్రింది విధంగా పై లక్ష్యాలను తెలుపుతాయి.

## 8.2 సామాజిక వ్యవస్థ

ఈజిప్ట్ సమాజంలో విజాయతీయత ఉన్నప్పటికీ, ఒకానొక సాంస్కృతిక ఐక్యత ఉండేది. ఆనాటి సమాజంలో ఫారో కేంద్ర వ్యక్తి. అతడు మతాధికారి, రాజ్యాధికారి కూడా. దాస్యం అతి సామాన్యమైన లక్షణం. అధికారం ఎక్కువగా ధనికుల్లోనే ఉండేది. స్త్రీలకు చెప్పుకోదగ్గ గౌరవముండేది. వారు హుందాతనం, హోదాతో కూడిన జీవనాన్ని గడిపేవారు.

### 8.2.1 విజాతీయత-బహుళ జాతీయత

ఈజిప్ట్ సామాజిక వ్యవస్థలోని అత్యంత ముఖ్యమైన అంశం, విజాతీయతను ప్రకటించే బహుళ జాతీయత. ఈజిప్ట్‌లోని నాగరికతలకు కర్తలయిన వారందరూ, హెర్మన్ ష్నైడర్ (Herman Schnider) అభిప్రాయం ప్రకారం, ఒకటి, లేదా రెండు జాతుల సమ్మేళణ ఫలితంగా ఏర్పడినవారు కారు. అందువల్లనే, నాగా ఎడ్గార్ (Naga Edgar) మొదలైన ప్రాంతాలలోని సమాధులలో గల అవశేషాలను చూసిన తరవాత, వీరిని ఏవిధంగా, ఏ ప్రమాణాల దృష్ట్యా వర్గీకరించాలో తెలుసుకోడానికి అవకాశం లేకపోయింది. అందువల్లనే ష్నీడర్ మొదలైనవారు వీరిని 'టెహ్రో ఈజిప్షియన్లని' (Tehro Egyptians) అన్నారు. ఈజిప్ట్ నాగరికత తొలుత ఎగువ ఈజిప్ట్‌లోని అనేకమంది సెమెటికేతర (other than Semetics)

జాతులవారి శారీరక సాంకర్యం వల్ల జన్మించినవారి కర్తృత్వంలో అభివృద్ధిపొందింది. ఆ తరువాతఈజిప్ట్‌లోని ఒకానొక సంవిలీనీకరణ (assimilation) దక్షిణం నుండి ఉత్తరానికి విస్తరించింది. ఈరకమైన 'ఉత్తరాయణం', ఎడ్ఫు నుండి ప్రారంభమై, అంబిస్ (Ambis), అక్సిరింకస్ (Axirimkas), మెంఫిస్ (memfis) ప్రాంతాలకు విస్తరించి, థేబ్స్ (Thabes) మొదలైన వివిధ ప్రాంతాలలోని జాతులవారి సంవిలీనీకరణగా పరిణమించింది. వీరెవ్వరూ నెగ్రిటో (Negrito) మొదలైన కుటుంబాలకు చెందినవారు కారు. ఈ సమాజానికి కర్తలైన వారిలో, మతపరమైన సమైక్యం బహుళ జాతీయతలోని లోపాలను అరికట్టి, ఏకత్వానికి త్రోవ తీసింది. కాని, వీరికి గల ప్రాంతీయపరమైన సంబంధాలు, వేర్వేరు భౌగోళికమైన లక్షణాలు, ఈజిప్ట్ సమాజంలోని విజాతీయతకు, వికేంద్రీకరణకు దోహదం చేశాయి.

## 8.2.2 సామాజిక వ్యవస్థ స్వభావం

ఈజిప్ట్‌లో నెలకొన్న సామాజిక వ్యవస్థ స్తరాత్మకమైనది. అంటే, ఈ వ్యవస్థలో అనేక వర్గాలకు చెందిన వ్యక్తులు, అట్టడుగు వర్గాల వారని, మధ్య వర్గాలవారని, ఉన్నత వర్గాలవారని గుర్తించబడతారు. ఈజిప్ట్ సమాజ వ్యవస్థలో పాలక వర్గం, దానికి చెందిన ప్రతినిధులు, అత్యున్నత స్థాయికి చెందినవారుగా గుర్తించబడ్డారు. రైతులు, తదితరులు అట్టడుగు స్థాయికి చెందిన వారుగా గుర్తించబడ్డారు. మధ్య స్థాయిలలో, వర్తకులు, సైనిక వర్గాలు, వివిధ ఉద్యోగులు, వివిధ మతాధికారులు, మతాధిపతులు మొదలైనవారంతా వేర్వేరు స్తరాలుగా రూపొందారు.

### 8.2.2.1 ఫారో (Pharoh)

ఈజిప్ట్ సామాజిక వ్యవస్థలో అందరికన్నా గొప్పవాడు 'ఫారో' అని పిలువబడిన ఈజిప్ట్ ప్రభువు. ఇతడు ఈజిప్ట్ జీవన వ్యవస్థలోని అన్ని అంశాలపట్ల, సర్వం సహాధికారాన్ని, సంపూర్ణ నియంత్రణాధికారాన్ని కలిగినవాడు. 'ఫారో' తనను తాను 'హోరస్' లేదా 'రే' కుమారుడనని, మంచి ప్రభువునని అభివర్ణించుకోడం జరిగింది. అతడు మానవలోకానికి, స్వర్గలోకానికి మధ్య లంకెలా వ్యవహరించాడు. ఫారో లేనట్లయితే, ఈజిప్ట్ వ్యవస్థ అంతా అతి మానుషం. అంటే, కేవలం మానవ లోకానికి చెందినదే. ఫారో ఉన్నట్లయితే, అధిమానుషం. అంటే, మానవ లోకం కన్నా ఎత్తయిన లక్షణాలనుకూడా కలిగిఉన్నది. ఈ నేపథ్యంలో ఈజిప్షియన్ల మధ్య అనేక అంతరాలు ఏర్పడి, ఆ పద్ధతి ఒకానొక స్థిరమైన బానిస వ్యవస్థకు కూడా బాటవేసింది. బానిస వ్యవస్థ ఒక వెలుపలి చట్రంగా, ఈజిప్ట్‌లోని సామాజిక వ్యవస్థలోని కుటుంబ, వివాహ వ్యవస్థలు అనేక రీతులుగా పరిణమించాయి.

### 8.2.2.2 దాస్యం-బానిస వ్యవస్థ

ఈజిప్ట్ సామాజిక వ్యవస్థలో గల దాస్యం, బానిసత్వం, చట్టబద్ధమైన రీతిలో అమలులో ఉండేవి. ఈ వ్యవస్థ సమాజంలోని అమానుష ప్రవృత్తికి దర్పణం పట్టినా, అది అనాటి సమకాలీన సామాజిక జీవనంలో అతి సామాన్యమే. మానవుడు వేరొక మానవుని మీద అధికారాన్ని చెలాయించడంలో, అతి సామాన్యమైన విధానం ఇంకొకరిని తనకు బానిసగా చేసుకోడమే అని నమ్మినవారిలో, ఈజిప్షియన్‌లు కూడా ఒకరు. ప్రభువులు తాము దండయాత్రలు చేసినప్పుడు, ఓటమి పొందినవారిని దాసులుగా చేసుకొనేవారు. ఈరకమైన బానిసల స్థితి హీనమైనదేమీ కాదు. ఈ బానిసలను సామాన్యంగా పెద్ద పెద్ద మార్కెట్లలో వేలం ద్వారా అమ్మడం జరిగేది. బానిసలు చరాస్తిలో ఒకభాగంగా గుర్తించబడ్డారు. తోటలు, భూములు మొదలైన ఆస్తులను అమ్మడం జరిగినపుడు, వానితోబాటే వానికి చెందిన బానిసలైన వారందరినీ కూడా అమ్మడం జరిగేది. ఈ బానిస వర్గంలో ఎక్కువ మంది నుబియా ప్రాంతానికి చెందినవారు. కాని, బానిసలు తమ బానిసత్వం నుండి విముక్తి పొందడానికి అవకాశం ఉండేది. వారు ఆస్తిపాస్తులను, కుటుంబ జీవితాన్ని కలిగి ఉండేవారు. వారి బానిసత్వాన్ని కొందరు సాక్షుల ప్రమేయంతో, చట్ట ప్రకారం

అంగీకరింపబడిన రీతిలో రద్దు చేసుకొని, భూమిని కౌలుకు తీసికోడం మొదలైన విధానాలద్వారా, జీవించడానికి అవకాశం ఉండేది. కాని, బానిసత్వానికి వెరిచి, పారిపోయినవారు కూడా ఉండేవారు. ఈరకంగా బానిసత్వ సంప్రదాయం, ఈజిప్ట్ సామాజిక వ్యవస్థలోని బానిసలు అనే ఒక అణగదొక్కబడిన వర్గాన్ని గూర్చి తెల్పుతున్నది.

### 8.2.2.3 ఉన్నత వర్గాల వారు

ఫారో తర్వాత సాంఘిక వ్యవస్థలో లెక్కించదగినవారు, ఈ ఉన్నత వర్గాల వారు. వీరిలో రాజకుటుంబ సభ్యులు, వజీర్ మొదలైన అధికార వర్గాలవారు, ఆమన్ (Amon) వంటి ఘ్లుతపరమైన అధికారులు ఉండేవారు. వీరు కూడా ఫారోలకువలెనే తమకు గల మహోన్నతమైన గౌరవాన్ని, మతపరమైన, పౌరాణికమైన ప్రశస్తులతో తమను తాము అభివర్ణించుకొనే వారు. వీరిలో అందరూ ఫారోలకు వలెనే, తమ మరణానంతరం పిరమిడ్లను నిర్మించుకోవడంకూడా జరిగింది. ఎక్కువ మంది రాజోద్యోగులు ఎక్కువగా యుద్ధాలలో పాల్గొనడం జరగడంవల్ల, వారంతా కూడా ఫారోతో సమంగానే గుర్తించబడడానికి అవకాశాలు ఏర్పడ్డాయి. వీరందరికన్నా, మత వ్యవస్థను పాలించే అధికారులు ఉన్నత స్థితిని పొందారు.

### 8.2.2.4 మధ్యతరగతివారు

రైతులు, వర్తకులు మొదలైన మధ్య తరగతివారంతా ఫారోల, వారి అనుయాయుల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి ఉండవలసి వచ్చేది. ఫారోలు భూమి అంతా తమదని, తాము రాజ్యానికంతా దైవదత్తాధికారాన్ని కలవారమని భావించేవారు. అందువల్ల, ప్రాచీన (Archaic), మధ్య (Middle) రాజ్యాల కాలాల్లో, రైతులకు, వర్తకులకు స్వేచ్ఛ, ఆస్తి హక్కు మొదలైనవి కేవలం అలంకారప్రాయంగా ఉండేవి. దానివల్ల ఏమి ప్రయోజనాలు ఉండేవి కావు. కాని, క్రీ.పూ. 1567-1085కి చెందిన ఆధునిక రాజ్యం (New kingdom) లో ఫారో అధికారం పూర్తిగా మానవలోకానికి చెందిన లక్షణాలనే మిగుల్చుకొన్నప్పుడు, ఈ వర్గాలవారికి సమాజంలో అంతమునుపు లేని గుర్తింపు పొందడానికి గాను అవకాశం కలిగింది.

పై లక్షణాలు కలిగిన సామాజిక చట్రం (Social framework)లో కొంత విస్తరణాత్మకత కూడ, చోటుచేసుకొన్నది. దానిలో మొదట ప్రభావం చూపిన అంశం - ఎగువ, దిగువ ఈజిప్ట్ల కలయిక. దానివల్ల కొన్ని ఛాందసభావాలు క్రమంగా మరుగున పడ్డాయి. దానిలో రెండవదిగా ప్రభావం చూపిన అంశం, సుమేరియన్లు, బాబిలోనియన్లు, గ్రీక్లు, మొదలైన జాతుల వారితో సంబంధాలు. దీనివల్ల, సామాజిక వ్యవస్థలోని కొన్ని శక్తులు చరాత్మక (dynamic) మయ్యాయి. దాని వల్లనే, పర్షియన్ దాడులకు, అలెగ్జాండర్ దండయాత్రలకు ఏర్పడిన కొన్ని స్థితి గతులలోని మార్పులను, ఈజిప్ట్ సమాజం తట్టుకొని నిలబడగల్గింది. ఇది గ్రీక్ పూర్వ యుగంలో చాలా అసాధ్యమైన అంశం.

### 8.2.2.5 కుటుంబ వ్యవస్థ

ఆనాటి ఈజిప్ట్లోని కుటుంబ వ్యవస్థ, కుటుంబ జీవితంలోని సుఖసంతోషాలను ప్రధాన లక్ష్యంగా గుర్తించేది. ఇంటి యజమాని తన బాధ్యతలను నెరవేర్చేవాడు. ఇది తరతరాలుగా వంశంలో వచ్చిన (అనువంశికంగా వచ్చిన) లక్షణం. కుమారుడు తన తల్లిదండ్రులను ప్రేమించడం, గౌరవించడంతోబాటు, తన తండ్రికి వార్ధక్యంలో ఊతకర్రలాగ ఉండాలనేది కొన్ని పాపిరస్ ప్రతుల ద్వారా తెలుస్తున్నది. హృదయాన్ని స్పందింపజేస్తూ, దైనందిన సంసార జీవనంలో సౌఖ్యాన్ని ప్రతిబింబించే వ్రాతలు కొన్ని ఉన్నట్లు, ఆ ప్రతుల పరిశీలనవల్ల తెలుస్తున్నది.

BRAOU

### 8.2.2.5.1 స్త్రీలు : వివాహ వ్యవస్థ

కుటుంబ వ్యవస్థలో స్త్రీలకు చెప్పుకోదగ్గ గౌరవం ఉండేది. స్త్రీలు ఎప్పుడూ 'ఘోషా' వంటి ఆచారాలను పాటించాల్సిన అవసరం లేదు. ఇల్లాలిని గౌరవించడం అప్పటి కుటుంబ జీవనంలో ఒక ముఖ్య సూత్రం. ఆ గౌరవం మరు జన్మలో కూడా ఆమె ఇల్లాలిగా ఉండాలనే ఉద్దేశ్యంతో, ఆమెను తన సరసన సమాధిలోకి కొనిపోయిన ఘట్టాలు కూడా ఈజిప్ట్ చరిత్రలో అరుదుకాదు. ఒక వ్యక్తి తన ధర్మపత్నిని గౌరవించినా, ఉంపుడుగత్తెలను ఉంచుకోడం కూడా కన్పిస్తున్నది. అది ఏ రకమైన సాంఘిక దోషంగాను పరిగణించబడలేదు. అప్పటి 'పాపిరస్' ప్రతులలో వైవాహిక పరమైన ఒప్పందాలు అనేకం ఉన్నాయి. కాని, విడాకుల వివరాలను సూచించే ఏ రకమైన వ్రాత ప్రతి దొరకలేదు. స్త్రీలకు ఆ రోజులలో ఆస్తి హక్కు ఉండేది. ఆ వారసత్వపు హక్కులతో బాటు, తమదైన వ్యక్తిగతమైన ఆస్తిని కలిగి ఉండేవారు. స్త్రీలు వర్తక వ్యాపారాలలో భాగం పంచుకొన్నట్లు కూడా, మనకు వ్రాతప్రతుల వల్ల తెలుస్తున్నది. ఆనాటి ఈజిప్ట్ సమాజంలో, సామాన్యంగా, స్త్రీలు రాయడంగాని, చదవడంగాని నేర్చినవారు కారు. అదే విధంగా, ఏ రకమైన ఉద్యోగపరమైన బాధ్యతలను నెరవేర్చినట్లు కూడా దాఖలా లేదు. కాని, వారిలో అరుదయిన ఉదాహరణ, నవీన రాజ్యానికి (New Kingdom) చెందిన రాణి అయిన హట్షెప్సుట్ (Hatshepsut). ఆమె ఆనాటి ఈజిప్షియన్ స్త్రీలలో అపురూపమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నట్లు, ఆమె పరిపాలన ద్వారాను, ఆమె కాలంలో 'పుంత్' (Punt) ద్వీపంపై నిర్వహించిన దండయాత్రల వల్ల తెలుస్తున్నది.

### 8.2.2.5.2 సంతానం - పిల్లల పెంపకం

ఆనాటి కుటుంబ వ్యవస్థలో, తిండికి, గుడ్డకు లోటులేని కుటుంబాలలో, ఆరుగురు సంతానం ఉండటం సామాన్యమైన అంశం. పిల్లల పెంపకంలో, వారి నైతిక ప్రవర్తన పట్ల ఎంతో ఆసక్తిని వ్యక్తపరిచేవారు. ఇంచుమించు ఆరేళ్ళ వరకు పిల్లలను బడికి పంపేవారు కారు. అంతవరకు వారు నగ్నంగానే తిరుగుతుండేవారు. చిన్న పిల్లలకు తలకు ఒక వైపంతా పూర్తిగా క్షౌరం చేయబడి ఉండేది. ఇంకొక వైపు జడ వంటిదైన పెద్ద జుత్తు ఉండేది. ఇంచుమించు ఏడేళ్ళ నుండి బాలురంతా ఒక పట్టాగుడ్డకు బిగించిన అంగవస్త్రాన్ని ధరించి ఉండేవారు.

### 8.2.2.5.3 ఇళ్ళలో దర్జాలు

సామాన్యుల ఇళ్ళలో, వారి వారి కుటుంబాలలో, గొప్ప వసతులు కాని, హోదాలు సూచించే అంశాలు కాని ఉండేవి కావు. కాని, రాజవంశీకులయిన వారి ఇళ్ళలోను, ధనికుల ఇళ్ళలోను కొందరు పరిచారకులుండేవారు. వంట మనుషులు, పని మనుషులు, కార్యదర్శుల వంటి ఉద్యోగులు మొదలైనవారు తప్పక ఉండేవారు. ఇళ్ళలో నీచమైన పనులు (menial services) చేయడానికి కొందరు ధనికులు ఖైదీలనుగాని, బానిసలనుగాని ఉపయోగించుకొనేవారు. ఈ రకమైన బానిసలు నుబియా, ఆసియా యుద్ధాలలో ఓటమిని పొంది, ఈజిప్షియన్‌ల చేతికి చిక్కినవారు, కొందరు ధనికుల ఇళ్ళలో విదేశాల నుండి వచ్చిన వంటవారు, తోటమాలులుగాను, ద్వార ప్రతీహారులుగాను ఉండేవారు.

ఆ రోజులలో ధనికులు అనేక పెంపుడు జంతువులను పెంచేవారు. బొచ్చు కుక్కలు, పిల్లులు, కోతులు, బాతులు వంటి వానితో బాటు, వేట కుక్కలను కూడా పెంచేవారు. ప్రాచీన రాజ్య కాలంలో మరుగుజ్జులను, పిగ్మీలను నాట్యం చేయడానికి, ఆనందం, ఉల్లాసం కలిగించడానికి ఎంతో ఖరీదు పెట్టి కొనుక్కునేవారు. ఈ రకంగా ఈజిప్ట్ కుటుంబ వ్యవస్థను "విత్తం కొద్దీ వైభోగం" అనే నానుడికి ఒక దృష్టాంతంగా గ్రహించొచ్చు.

### 8.2.2.6 గృహాలు - గృహోపకరణ వస్తువులు

ఈజిప్ట్‌లోని నాగరికత కొత్త రాతియుగం నుండి నవీన రాజ్యం వరకు పరిణమించింది. ఈ పరిణామంలో గృహాల పరిణామం కూడా ఒకటి. అవి చిన్న చిన్న వసతి గుంటల (Pit dwellings/dwelling pits) నుండి మహాభవనాల

వరకు మార్పు చెందాయి. ఈజిప్ట్ రాజయిన 'ఫారో' అనే శబ్దానికి 'భవనం' (Palace) అని కూడా ఉన్న అర్థాన్ని అనుసరించి, ఇండ్లు ఏ రకంగా వైభోగానికి, ఆర్థిక, సామాజిక గౌరవాలకు ప్రతీకలు - అనే విషయాన్ని తెలుసుకోవచ్చు.

### 8.2.2.6.1 సామాన్యుల ఇండ్లు

తొలి రోజులలో సామాన్యమైన ఇళ్ళన్నీ, మట్టి గోడలనుకాని, లేదా మట్టితో అలకబడిన తడకలను కలిగి, కేవలం ఒక గది మాత్రం ఉండేది. అటువంటి ఇంటిని 'ఫలాహిన్' (Fallahin) అని వర్ణించడం జరిగింది. మెరిండ్ (Merind), బెనిసలామా (Benisalama) మొదలైన నవీన శిలాయుగ స్థావరాలలో, ఈజిప్ట్‌లోని వసతి గృహాలకు చెందిన ఆధారాలు లభించాయి. రానురాను చారిత్రక యుగానికి ముందరి కాలంలో, ఇళ్ళన్నీ కొన్ని కప్పులను కలిగి, ఆ కప్పులు కొయ్య స్తంభాలతోగాని, ఈనెల మోపులతోగాని ఏర్పరిచిన ఆధారాలను కలిగి ఉండేవి. ఈ కప్పులు ∩ ఆకారంలో ఉండేవి. ఇల్లు (గుడిసె) దీర్ఘ చతురస్రాకారంలో ఉండి, ఇంటి ముందు ఒక చిన్న నిర్మాణం - 'వల్లభి' వంటి దానిని ఏర్పరచడం జరిగింది. రానురాను దీని పరిణామమే, ఇంటి ముంగిట గల వరండా.

### 8.2.2.6.2 రాజవంశస్థుల ఇళ్ళు

ఈజిప్ట్‌లోని తొలి రాజవంశీకుల ఇళ్ళన్నీ కూడా ఇదే విధంగా ఉన్నా, అవి విశాలమైనవి. 'మాస్తబా' (Mastaba) సమాధులలో వాడబడిన ఇటుకలు, రాతి అలంకారిక ద్వారాలు, కొయ్యతోను, మట్టితోను చేయబడిన ఇళ్ళను పోలిన నమూనాలుగల 'ట్రే'ల వంటి వాని ద్వారా, ఆ ఇళ్ళ స్వరూపం తెలుస్తున్నది. ఇంటికి ముంగిట ఒక ప్రవేశ ద్వారం ఉండేది. దాన్నిదాటి లోనికి పోగానే, ఒక చావడి ఉంటుంది. అది దాటి లోనికిపోయాక, స్తంభాలతో ఉన్న ఒక లోగిలి ఉంటుంది. ఆ తరవాత ఇంట్లో గల అనేక గదులను చూడవచ్చు. 'అల్‌లాహెన్' (Allahen) వద్ద గల 'హెటెప్‌సెనుస్రెట్' (Hetepsenusret) అనే ప్రహరీలు గల పురంలో, అనేక పెద్ద, చిన్న ఇళ్ళన్నీ కనిపిస్తున్నాయి. ఇవన్నీ ఇరుకైన సందులతో, గుంపుగా ఉన్నట్లు ఉంటాయి. రాజ్యంలోని ఉన్నతోద్యోగుల ఇళ్ళలో, పదికి మించి కూడా గదులు ఉండేవి.

నవీన రాజ్యానికి (New Kingdom) చెందిన గృహాలకు చెందిన అనేక ఆధారాలు 'టెల్ ఎల్ అమర్నా' (Tel El Amarna) మొదలైన ప్రాంతాలలో లభ్యమవుతున్నాయి. అఖెటాటన్ (Akhetatan) మొదలైన ప్రభువులకు, రాజకుటుంబీకులకు, రాజోద్యోగులకు విశాలమైన భవన ప్రాంగణాలు, భవనాల చుట్టు తోటలు ఉండేవి. ఇళ్ళల్లో క్రీడాస్థలాలుగా ఉండే మడుగులు ఉండేవి. తోటలలో కూర్చోడానికి కావలసిన అనేక రకాల సౌకర్యాలు ఉండేవి. ఇటువంటి భవన ప్రాంగణాలన్నిటిలోను పెద్దపెద్ద ప్రహరీ గోడలు ఉండేవి. అటువంటి ఇళ్ళలో ఇంటి ముందుగా ఒక ప్రవేశ స్థలం ఉండేది. దాని వెనక అతిథులు కూర్చోడానికి అనువైన విశాలమైన గది ఉండేది. ఇటువంటి గదులన్నిటికీ వెలుగు రావడానికి విస్తృతమైన సౌకర్యాలు ఉండేవి. కిటికీలను రాతితోగాని, కొయ్యచట్రాలను బిగించిగాని ఏర్పరిచేవారు. నివాసయోగ్యమైన గదులన్నీ, ఇటువంటి గదుల వెనకగాని, వానిచుట్టూగాని ఉండేవి. గదులలో మెత్తని పూత పూసిన నేలగల శౌచాలయాలు, వానిలో ఇటుకలపై ఏర్పరచబడిన రాతి పీఠాలు గల మలవిసర్జన శాలలు ఉండేవి. మహారాజులు, రాజకుటుంబీకులు మొదలైనవారి ఇళ్ళలో, అనేక వంటశాలలు, నౌకర్ల వసతి గృహాలు, ధాన్యాన్ని నిలవ ఉంచుకొనే పాతరలు, జాడీలు, కుండలు, పశువుల శాలలు, అశ్వశాలలు ఉండేవి. ప్రతి ఇంట్లోను మంచినీటి కోసం ఒక బావి ఉండేది. పురావస్తువేత్తలు కొన్ని రాజభవనాలను తవ్వకాల (excavations) ద్వారా వెలికితీయడం జరిగింది. కాంటిర్ (Canter) ప్రాంతంలో రామ్సెస్ II (Ramses II) కాలానికి చెందిన రాజభవనాన్ని వెలికితీశారు. దానిలో ప్రభువులకు లొంగిన బందీలను వర్ణచిత్రాల ద్వారా చూపించడం జరిగింది. పశ్చిమ థేబ్స్‌లోని 'మెడినెట్‌హబు' (Medinet Habu) లో మూడవ రామ్సెస్ (Ramses III) మరణ నిర్మాణానికి వెలుపల ఒక చిన్న భవనాన్ని బయటకు తీయడం జరిగింది. రాజుగారి శయన మందిరం, శౌచాలయం, రాణిగారి వసతిగృహాలు అన్నీ

స్తంభాలతో ఎత్తుగా కట్టిన ఒక సింహాసన పీఠానికి చుట్టూ నిర్మితమై ఉన్నాయి. ఈ రకమైన పీఠికకు వెలుపల 'పాపిరస్' స్తంభాలతో చేసిన 'బాల్కనీ' ఉండేది. 'ఫారో'లు దాని ద్వారా ప్రజలకు దర్శనాన్ని ఇస్తుండేవారు. ఇటువంటి 'బాల్కనీ' నే మనం 'టెల్‌ఎల్ అమర్నా' (Tel El Amarna) లోని వర్ణచిత్రాలలో కూడా చూడగలం. స్తంభమంటపం వలె ఉన్న ఈ సింహాసన పీఠిక నేల అంతా ఒక కొలనులా చూపడం జరిగింది. దానిలో తిరుగాడుతున్న చేపలు, తేలుతున్న కలువలు, దాని చుట్టూ పాపిరస్ చెట్ల ఆకులతో కూడుకొన్న దిబ్బల వంటివన్నీ చూపబడి, అత్యంత సహజసుందరంగా చిత్రీకరించబడింది. సున్నపురాతితో కట్టినవి, మట్టిమీద వెల్లవేసిన గోడల మీద గల బొమ్మలన్నీ, రాజకుటుంబంలోని ఫారో, రాణి, రాజకుమారులు, రాజకుమార్తెల మధ్య గల సౌహార్ద్రాన్ని, సాత్త్వికతను చూపించే చిత్రాలుగా ఉండేవి.

### 8.2.2.6.3 రాజగృహోపయోగ వస్తువులు

సామాన్యుల ఇండ్లుగాని, రాజభవనాలుగాని మరీ ఎక్కువ సామాన్లతో నిండి లేవు. కుర్చీలు, బల్లలు, ఎత్తు పీటలు (Stools) వంటివన్నీ, ఎక్కువగా ధనికుల ఇండ్లలోనే కన్పిస్తుండేవి. పరుపులు, మంచాలు, విస్తృతమైన భోగాన్ని సూచించే రీతిలో కూడా ఏర్పరచబడటం జరిగింది. ప్రతి మంచానికి సమీపంలో తలగడ ఉండేది. ఈ రకమైన తలగడలు మట్టితోగాని, కొయ్యతోగాని, రాతితోగాని చేయబడి, వంపు కలిగి, వేర్వేరు వ్యక్తుల తలల పరిమాణానికి అనుగుణంగా ఏర్పరచబడి ఉండేవి. ఎత్తు పీటల మీద తోలుతో నేయబడిన దిండ్లు ఉండేవి. సామాన్యంగా కుర్చీలు వంపుగా ఉండే కొయ్యతో చేసిన 'సీటు'తో ఉండేవి. వెనుకకు వాలి కూర్చోడానికి అనువుగా, వంపుగా కూడా ఉండేవి. 'టీ' రాణి తల్లిదండ్రుల సమాధులలో ఒక బాలుడు/బాలిక కూర్చోడానికి అనువైన చిన్న కుర్చీ లభ్యమైంది. దాని మీద తెలుపు, 'పింక్' రంగుల దిండు అమర్చి ఉన్నది. దానిలో మెత్తదనం కోసం పావురం ఈకలను నింపడం జరిగింది. మడత మంచాలు, మడవడానికి అనువైన పీటలు ఎత్తువి కూడా దొరికాయి. కుర్చీల, మంచాల కాళ్ళు, సింహం పంజా ఆకారంలోగాని, ఎద్దు గిట్ట ఆకారంలోగాని, తీర్చిదిద్దబడి ఉండేవి. మేజాబల్లలు (Tables) అరుదుగా ఉండేవి. నీటి కుండలను, మద్యపాన పాత్రలను ఉంచడానికి 'స్టాండ్లు' (Stands) ఉండేవి. పూలకుండీలు అతి సామాన్యమైనవి. ఇళ్ళలో దీపాలు పెద్దపెద్ద కుండలలో వత్తులను ఉంచడం ద్వారా వెలిగించేవారు.

BRAOU

### 8.2.2.7 ఆహారపు అలవాట్లు

సామాన్యుల ఆహారపు అలవాట్లు ఎప్పుడూ సామాన్యంగానే ఉంటాయి. అదే విధంగా ఈజిప్టులో కూడా, సామాన్యులు అతి సాధారణమైన ఆహారపు అలవాట్లనే కలిగి ఉండేవారు. రొట్టెలు, చిక్కుళ్ళు వంటి గింజలు గల కాయలు, ఉల్లిపాయలు, 'పాడిరస్' కాయలు, కొన్ని రకాల వేరులు సామాన్యుని ఆహారం. కాని, ధనవంతులు వైవిధ్యం గల ఆహారాన్ని తినేవారు. అన్నిరకాల కూరలు, పండ్లు, ఉల్లిపాయలు, వెల్లుల్లి, దుంపలు, పుచ్చకాయలు, అన్ని రకాల సొరకాయలు, బఠాణీలు, చిక్కుళ్ళను వారు వాడేవారు. లేతగా ఉన్న పాడిరస్ కాయలతో చేసిన పదార్థాలు, వారికి అత్యంత ప్రియమైన ఆహారం. అత్తిపండ్లు, ద్రాక్ష, ఖర్జూరం వంటి పండ్లను తినేవారు. మాంసం వారి ఆహార వ్యవస్థలో విశేషమైన పాత్ర వహించింది. వారు ఆహారం కోసం ఎద్దులను, దూడలను, హైనాల వంటి జంతువులను పెంచేవారు. అలాగే కొంగలు, బాతులు కూడా వారి ఆహారంలో ఉండేవి. ఎండబెట్టిన, ఊరబెట్టిన చేపలను తినేవారు. పాలు, పాలతో చేసిన ఆహార పదార్థాలు ఎంతో విలువైనవి, ఖరీదైనవి. కాల్చిన రొట్టెలను తేనెతో నంజుకొని తినేవారు. రొట్టెలను, 'కేకు'లను చేయడానికి వంటశాలల్లో ప్రత్యేక సిబ్బంది ఉండేవారు.

పేదలు, ధనికులు తారతమ్యం లేకుండా, అందరూ 'బీర్' ను త్రాగేవారు. ద్రాక్షాసవాన్ని నిలవ చేసి, పులియబెట్టి, ప్రశస్తమైన మద్యాలను చేయడానికి అంఫొరే (Amphorae) తోను, మట్టితోను చేసిన పెద్దపెద్ద జాడీలు ఉండేవి. ఇఖ్నాటన్ (Ikhnaton) ప్రభువు భవనంలోని మద్యాలు, మంచి మద్యం, ప్రశస్తమయిన మద్యం, మహాప్రశస్తమైన మద్యం అని వర్గీకరించబడి ఉండేవి.

ఆ రోజులలో అన్నం తినేటప్పుడు చెంచాల వంటి వాని ఉపయోగం ఉండేది కాదు. అన్నం వేళ్ళతోనే కలుపుకొని తినేవారు. ఒక వర్ణచిత్రంలో 'నెఫర్‌టిటి' (Nephertiti) రాణి కాల్చిన బాతును తరుగుతున్నట్లు, ఆమె భర్త ఆవు మాంసాన్ని ఎముక నుండి బరికి, వేరుగా తీస్తున్నట్లు చూపడం జరిగింది.

### 8.2.2.7.1 విందులు

నవీన రాజ్యం (New Kingdom) లోని ఒక ఆధారంలో, విందు దృశ్యాన్ని చిత్రించడం జరిగింది. వాద్యగాండ్రు, నాట్యగత్తెలు, దొమ్మరివాండ్రు ఆ విందులో వినోదం పంచడానికి ఉండేవారు. వయసులో ఉన్న దిగంబరమైన పడతులు, అందరు ఆహ్వానితులను లోపలికి తీసుకొని వెళ్ళడం, నిండుకొన్న మద్యపాత్రలలో మద్యం పోయడం, పూవులను, అత్తరు పూసిన మూచూచుకొనే సామగ్రిని అందించడం చేస్తుంటారు. సామాన్యంగా ఈ రకమైన విందులలో ఆడవారు, మగవారు వేర్వేరుగా కూర్చొంటారు. 19వ రాజ్యకాలంనాటికి దంపతులు జంటగా పక్కపక్కన కూర్చొనేవారు.

### 8.2.2.8 వస్త్రధారణ

వస్త్రధారణలోను, అలంకరణలలోను ఈజిప్ట్‌లో అనేకమైన పరిణామాలను చూడొచ్చు. ప్రాచీన రాజ్యం (Old kingdom) లో, నడుము చుట్టూ బిగించబడి కట్టిన వస్త్రం మాత్రం, మగవారికి ఉండేది. మధ్య రాజ్యం (Middle kingdom)లో ఉన్నితో నేయబడిన, కుట్టబడిన దుస్తులను వాడేవారు. ఇవి భుజాల నుండి, చేతులు మినహా, అన్ని భాగాలను కప్పి ఉంచేవి. ఈ రకమైన దుస్తులు తెల్లనివి, రంగురంగులవి, అల్లిక పని చేసినటువంటివిగా ఉండేవి. నవీన రాజ్యం (New kingdom)లో 18వ రాజవంశ మధ్యకాలంలో దుస్తులలో మార్పు వచ్చింది. భుజాలను కప్పేటటువంటి కుచ్చులుగల శాలువా, వెనక అంచులు గల బట్టలను వాడేవారు. ఇవి నడుముకు చుట్టుకొన్న తరవాత, ఆ అంచుల భాగం, బయటకు వేలాడుతుండేది. స్త్రీలు కూడా ఇటువంటి దుస్తులనే వాడేవారు.

B R A O U

### 8.2.2.9 అలంకరణలు

ఆడవారు, మగవారు రకరకాల నగలను వాడేవారు. మగవాళ్ళు మెడ చుట్టూ అర్ధచంద్రాకారపు పూసల మాలలు, కంకణాలు, అందెలను ధరించేవారు. రకరకాల విలువైన రాళ్ళతో చేసిన అనేక ఆభరణాలను వారు ధరించేవారు. కంఠికలు, హారాలు, కంకణాలు, అందెలు స్త్రీలకు ప్రధానమైన ఆభరణాలు.

### 8.2.2.10 క్రీడలు, వినోదాలు

ఈజిప్ట్ సామాజిక వ్యవస్థలో అనేక క్రీడలు, వినోదాలు ఉండేవి. "వైకుంఠపాళి"ని పోలిన గుండ్రని బల్ల ఆకారంలో, దాడి సర్పాకారంతో ఉండే ఆట, ఆ రోజులలో ఒకటి. అట్లాగే కోలగా ఉండే ఒక చదరంగపు బల్ల మీద పావులను కదిలిస్తుండే ఆట, ఒకటి. ఆ పావులను ఏబొనీ (Ebony) కొయ్యతో చేసేవారు. పాచికలనుగాని, గుర్తువేసిన శలాకలనుగాని ఉపయోగించి, పందెం వేసేవారు. పందాన్ని బట్టి పావులను ఆ బల్ల మీద ఉన్న గుంటలలో ఉంచాలి. దీనిని 'సెనెట్' (Senet) అంటారు. దీనిలో మొత్తం 414 పావులుంటాయి. అట్లాగే పిల్లలు ఆడే ఆటలలో కప్పగంతులు, ముందు పరుగెత్తే వ్యక్తిని వెనక నుండి పరుగెత్తుతూ వచ్చి తాకడం (Pick a back) వంటి ఆటలు ఉండేవి. చిన్న పిల్లల కోసం మట్టితోగాని, కొయ్యతోగాని చేసిన జంతువుల బొమ్మలు, గిలక్కాయలు, పిల్లలు ఆటలలో యుద్ధాల కొరకు వాడే చిన్న చిన్న ఆయుధాలు ఉండేవి.

### 8.2.2.10.1 సంగీతం, వాద్యాలు

పాటలు పాడడం ఒక వినోదం. ఈజిప్ట్‌లో సంగీతం ఏ రకమైన శాస్త్రీయతను పొందలేదు. పాటకు లయబద్ధంగా చప్పట్లు చరుస్తూ, గంతులు వేయడమే జరిగేది. ఆరవ రాజ వంశానికి చెందిన మెరెరుకా (Mereruka) ప్రభువు, అతని భార్య పాడుతూ, వీణ వంటి తంత్రీ వాద్యాన్ని వాయించడం, బొమ్మలలో చూపడం జరిగింది. తప్పెటలు, వేణువులు, వీణలు ఉపయోగించేవారు. హాథర్ (Hother) దేవత ఆరాధనలో సిస్ట్రం (Systrem) అనే వాద్యాన్ని ఉపయోగించేవారు. టుటన్‌ఖామెన్ (Tutankhamen) సమాధిలో తప్పెటలు లభ్యమయ్యాయి.

## 8.3 ఆర్థిక వ్యవస్థ

మూడు పూవులు, ఆరు కాయలుగా అభ్యున్నతిని పొందిన ఈజిప్షియన్ సమాజంలోని ప్రధాన నేపథ్యం, దాని ఆర్థిక వ్యవస్థ. ఈ ఆర్థిక వ్యవస్థలో ఈజిప్ట్ దేశంలోగల సహజమైన వనరులను, అంటే భూగర్భంలోని ఖనిజ సంపదను, అడవులు, భూసారం వంటి వానిని వివిధ పద్ధతుల ద్వారా వినియోగించుకోవడం జరిగింది. అంతేగాక, దండయాత్రల ద్వారాను, వర్తక వ్యాపారాల ద్వారాను, ఇతర దేశాల్లో గల ప్రకృతి వనరులను వినియోగపరచుకోవడానికి కూడా ప్రయత్నాలు జరిగాయి. ఈ ఆర్థిక వ్యవస్థ అంతా, ప్రత్యక్షమైన 'ఫారో' యాజమాన్యం కింద ఉండి, అతని చేత నియుక్తులైన 'వజీర్ల' వంటి ఉద్యోగుల నియంత్రణలో ఉండేది. సహజమైన పద్ధతుల ద్వారా వనరులను వినియోగించుకోవడం, వ్యవసాయానికి దారి తీసింది. కృత్రిమమైన విధానాల ద్వారా వనరులను వినియోగించుకోవడం, గనుల తవ్వకానికి, దాని ద్వారా వివిధ ఖనిజాలను వెలికితీసి ఉపయోగించుకోడానికి, అనువును కలిగించింది. వేర్వేరు ఇతర దేశాల నుండి వస్తువులను దిగుమతి చేసుకోడానికి చేసిన ప్రయత్నాలు, ఈజిప్ట్ దేశంలో వాణిజ్య-వ్యవస్థకు, రవాణా వ్యవస్థకు సోపానాలను ఏర్పరచాయి. కాని, ఈజిప్ట్‌లో భారీ ఎత్తున వినిమయం జరిగినా, ద్రవ్యమారక విధానం అమలులోకి రాలేదు. ఆర్థిక వ్యవస్థ అంతా కేవలం 'వస్తు మారక' విధానంపైనే ఆధారపడి ఉండడం గమనార్హం.

### 8.3.1 వ్యావసాయిక వ్యవస్థ

సమాజంలో అందరూ - అట్టడుగు వర్గాలవారు, అత్యున్నత వర్గాలవారు - ప్రధానంగా వ్యవసాయ వ్యవస్థ మీద ఆధారపడి ఉండేవారు. ఆర్థిక వ్యవస్థలో అన్ని భాగాలు వ్యావసాయిక వ్యవస్థకు అనుబంధమైనవే. ఈ రకమైన వ్యవసాయ కేంద్రీకృత వ్యవస్థ ప్రపంచంలోని అన్ని ప్రాంతాలలోను క్రీ.శ. 18వ శతాబ్దం వరకు కన్పిస్తుంది. ఈజిప్ట్‌లోని ఎడారి ప్రాంతాలు, పీఠభూమి ప్రాంతాలు ఏ రకంగాను వ్యవసాయానికి అనుగుణంకానివి. అటువంటి చోట్ల, పాపిరస్ దుంపలు, వేరులు, అడవిపండ్లు, చేపలు, వేట వంటివి ప్రధానాహారంగా ఉండేవి. కాని, సారవంతమైన నైల్ లోయ ప్రాంతాలలో బియ్యం సాగు చేయబడుతుండేది. అదేకాక, జంతువుల పెంపకం, కుండలు చేయడం, తడకలు, బుట్టలు వంటివి అల్లడం, అభివృద్ధి చెందాయి. ప్రతి ఏటా నైల్ నది వరదలు తీసిన తరవాత, సాగు చేయడం ప్రారంభించేవారు. నాగలితో దున్నడం జరిగాక, చాళ్ళను ఏర్పరచుకొని, గింజలను చల్లేవారు. దాని కోసం వేర్వేరు పక్షులను ఉపయోగించి, చేనంతా గింజలు చల్లడం జరిగేది. వీరికి నాట్లు వేయడం వంటి పద్ధతులు తెలియవు. స్వైప్ (Swype) లేదా షడూఫ్ (Shaduf) అనే ఏతాం వంటి పరికరంతో, వారు కాలవలలో నుండి నీటిని ఎత్తి, చేలల్లో పోసేవారు. పండిన-పిదప, కంకులను చిన్న పిడిగల, కొడవళ్ళతో కోసి, కుప్పగా వేసేవారు. ఎద్దులను, గొర్రెలను కుప్పలను నూర్చడానికి ఉపయోగించేవారు. నూర్పిళ్ళ తరవాత వారు గింజలను ఆరబెట్టి, ఊకపోయేటట్టుగా చూసేవారు. ధాన్యంతోపాటు వారు అత్తిపండ్లు, ఖర్జూరాలు, ఆలివ్‌పండ్లు, గుమ్మడి, మారుంగా వంటి వాటిని సాగు చేసేవారు. అట్లాగే ద్రాక్ష మొదలైనవాటిని పెంచి, వారు మద్యం తయారీ (Vine culture)ని కూడా విస్తృతంగా చేపట్టేవారు.

B R A O U

వ్యవసాయం అభివృద్ధి చెందడానికిగాను, రాజులు ఆనకట్టలు కట్టడం, కాలువలను తవ్వించడం చేసేవారు. రైతులు ప్రభువునకు పంటలో 1/7 వ వంతును శిస్తుగా కట్టేవారు. శిస్తు వసూళ్ళను వజీర్ నియమించిన ఉద్యోగులు నిర్వహించేవారు.

## 8.3.2 రవాణా వ్యవస్థ

ఈజిప్ట్ ప్రధానంగా స్వయంసమృద్ధి గల దేశం కావడం వల్ల, వాణిజ్య వ్యవస్థ అభివృద్ధి పొందడం ఎంతో ఆలస్యంగా జరిగింది. వర్తకం అంతా ప్రధానంగా భూమార్గం మీద, జలమార్గం మీద జరిగేది. భూమార్గంలో, సరుకుల రవాణాలో గాడిదలు ప్రధాన పాత్రను నిర్వహించేవి. బెడౌన్ (Bedown)లోను, బనీహసన్ (Banihasan) సమాధిలో గల చిత్రాలలో, గాడిదలు నిర్వహించే పనిని చూపడం జరిగింది. ఈజిప్షియన్‌లకు గుర్రం గురించి తెలియదు. అదే విధంగా క్రీ.శ. రెండవ శతాబ్ది వరకు, వీరికి ఒంటెను గురించి తెలియదు. వీరి రవాణా వ్యవస్థలో గాడిదలతో బాటు, ఎద్దుల బండ్లు, స్లెడ్జి బండ్లు ముఖ్యంగా ఉండేవి. రాతి పలకల వంటి బరువైన వస్తువులను నది గట్టు వరకు స్లెడ్జి మీద చేర్చి, వాటిని ఓడలలో, పడవలలో వేసేవారు.

ఇంచుమించు ఏడు వందల ఏభై మైళ్ళ పైగా ఈజిప్ట్ దేశపు నడిబొడ్డున ప్రవహించే నైల్ నది, ప్రధాన రవాణా క్షేత్రంగా రూపొందింది. ఎడ్ఫు (Edfu) నుండి మెంఫిస్ (Memphis) వరకు గల వివిధ ప్రాంతాలను ఈ నది కలపడం వలన, ఈజిప్ట్ రవాణా వ్యవస్థలో జలమార్గం ప్రాముఖ్యాన్ని సంతరించుకొంది. నది మీద పోవడానికి తెప్పల నుండి నావల వరకు, అన్నిరకాల సౌకర్యాలు ఉండేవి. తెప్పను సాధారణంగా ఈనెలతో తయారు చేసేవారు. పడవలకు రెండు స్తంభాలకు కట్టిన తెరచాప, తెడ్డు ఉండేవి. 1954లో గీజా (Gisa) లోని ఖుఫు పిరమిడ్‌తోబాటు, అప్పటి నౌక ఒకటి దొరికింది. దానిలో కాబిన్ (Cabin) లోపలి భాగం రెండుగదులతో విశాలంగా ఉండేది. తెడ్డువేసేవాడు ఉండడానికి విడిగా ఒక ఎత్తైన భాగం ఉంది. దీనికి తెల్లగాలిని తట్టుకొని నిలబడడానికి తెరచాప, చిన్నపలకల స్తంభాలు రెండు ఉండేవి. ఇది మొత్తం 143 అడుగుల పొడుగు, 20 అడుగుల మందం కలిగి ఉంది. క్రీ.పూ. 2686-2613 మధ్య, మూడవ రాజవంశ పాలనా కాలంలో, మధ్యధరా సముద్రంలో 'బిబ్లాస్ పడవలు' అనే ఈజిప్షియన్‌ల నావలు తిరిగేవి.

BRAOU

## 8.4.3 వర్తక వాణిజ్యాలు

విదేశీ వ్యాపారం అంతా ప్రభువుల (ఫారోల) గుత్తాధిపత్యంలోనే ఉండేది. సుమేరియాకు చెందిన వివిధ వస్తువులుఈజిప్ట్‌లో దొరకడం జరిగింది. కాని, ఈజిప్షియన్ వస్తువులు ఏవీ సుమేరియాలో దొరకలేదు. అయినప్పటికీ, నిర్ద్వంద్వంగా ఈజిప్ట్ - సుమేరియా దేశాల మధ్య జరిగిన వర్తకాన్ని గురించి చెప్పొచ్చు.

దక్షిణాదిలో 'ఎలిఫంటైన్' ప్రాంతం నుండి 'సుడాన్' (Sudan) వరకు వర్తకం, భూమార్గంలో స్థానిక గవర్నర్ల నియంత్రణలో జరిగేది. సుడాన్ నుండి 'ఎబోనీ' (Ebony) వృక్షపు ఉత్పత్తులను, ఏనుగు దంతాలను, జంతు చర్మాలను, విలువగల రాళ్ళను తెప్పించుకొనేవారు. దేవాలయాల అర్చనలో సుగంధ ద్రవ్యాలైన కస్తూరి, పునుగు, గంధం, జవ్వాది వంటివి ముఖ్యమైనవి. వాటిని వారు 'పుంత్' ద్వీపం నుండి తెప్పించుకొనేవారు. ఎగువ ఈజిప్ట్‌లోని కాప్టస్ (Coptus) నుండి వాడి మొహమ్మద్ (Wadi Mohammed) ద్వారా ఎర్ర సముద్రాన్ని చేరి, అక్కడి నుండి పుంత్ ద్వీపానికి వెళ్ళేవారు. 'పుంత్' ద్వీపాన్ని 'దేవభూమి' (Divine Land) అని కూడా వ్యవహరించేవారు. సుగంధ ద్రవ్యాలు దొరకకపోతే, కర్పూర వృక్షపు (Terpentine), అనాస వృక్షపు (Pine) పట్టలను ఉపయోగించేవారు.

క్రీ.పూ. 1567-1065లో నవీన రాజ్యం (New Kingdom)లోని రాజులకు, పశ్చిమాసియాలోని రాజులకు మధ్య జరిగిన రాచరికపు ఉత్తర ప్రత్యుత్తరాలు, వాని వివరాలు టెల్ ఎల్ అమర్నా (Tel El Amarna)లో లభ్యమయ్యాయి. ఒక లేఖలో పశ్చిమాసియా ప్రభువులు "సోదరుని భూమి (రాజ్యంలో) బంగారం ధూళి, దుమ్ము వలె అతి

సామాన్యమైనది" అని రాయడం జరిగింది. బాబిలోనియా, సుమేరియాల నుండి ఈజిప్ట్‌వారు చక్కని పడకలను, వెండి - బంగారు మిశ్రమ ధాతువుల పూత గల రథాలను, ఆసియా నుండి రాగిని, బాదక్‌షాన్ (ఆఫ్ఘనిస్తాన్‌లోనిది) నుండి ఖరీదైన ఇంద్రనీలాలను దిగుమతి చేసుకొనేవారు.

నవీన రాజ్యంలోనే సామంత రాజ్యమైన సిరియా నుండి లోహంతో చేసిన, పూత పూసిన పెద్ద పెద్ద పాత్రలను, నగిషీ పట్టిన దంతపు వస్తువులను, అలంకరణ చేసిన వివిధ తరహాల ఆయుధాలను, ఎలుగులు, ఏనుగు గున్నలు మొదలైన వాటిని దిగుమతి చేసుకొనేవారు. నుబియా నుండి దంతం, ఎబొనీ దుంగలు, నిప్పుకోడి (Ostrich) ఈకలు, గుడ్లు, చిరుతపులి చర్మాలు, సుగంధ ద్రవ్యాలు, ఎద్దులు, నీగ్రో బానిసలను తెప్పించుకొనేవారు. కుష్ బంగారు గనుల నుండి బంగారాన్ని దిగుమతి చేసుకొనేవారు. టుటన్‌ఖామెన్ (Tutankhamen) కాలంలో, ఆలివ్ నూనె, బిట్యువాన్, తేనె, రాగి, తగరం, సీసం, ఇనుము, సెడారడేల్, మాపుల్, ఎల్మ్, ఆష్, ఓక్, బీచ్ వంటి రథాల తయారీకి వినియోగపడే చెక్కలను దిగుమతి చేసుకోడం జరిగింది. అట్లాగే పొడవైన ఉంగరాల జుత్తుతో, అల్లిక పని చేసిన కొపీనాలు ధరించిన క్రీట్ దేశస్థులను నాసస్ నుండి, ఎద్దుకొమ్ము ఆకారంలో గల వేర్వేరు తాగడానికి ఉపయోగపడే వస్తువులను, గ్లాసుల వంటివాటిని - మైసెనా నుండి తీసుకొని వచ్చినట్లు టుటన్‌ఖామెన్ సమాధిలో గల వజీర్ విషయాలను తెలియజెప్పే వర్ణచిత్రాలలో ఉంది. క్రీ.పూ. 7వ శతాబ్దం నాటికి సైట్ (Site) ప్రభువుల ప్రోత్సాహంతో, గ్రీక్ దేశానికి చెందిన వివిధ వర్తకులు ఈజిప్ట్‌తో జరిపే వర్తకంపై గుత్తాధిపత్యాన్ని పొంది, సొక్రటీస్ వద్ద వర్తక స్థావరాలను, వలసలను ఏర్పరుచుకొన్నట్లు తెలుస్తున్నది. సైట్ ప్రభువుల కాలంలోను, పర్షియన్ ప్రభువుల కాలంలోను, ఈజిప్ట్‌లో విదేశీ వ్యాపారం బాగా పుంజుకొంది. అల్ ఇస్మాలియా వద్ద నైల్‌నది నుండి ఎర్ర సముద్రం వరకు ఒక కాలవను తవ్వి, ఆఫ్రికా దక్షిణాగ్రం దాటి భారతదేశం చేరడానికి, ఒక సముద్రమార్గాన్ని కూడా ఏర్పరిచారు. కాని, ఈజిప్ట్, భారతదేశాల మధ్య వర్తకాన్ని సూచించే గుర్తులేమీ లభ్యంకాలేదు.

ఈ ఆర్థిక వ్యవస్థలో విదేశీ వ్యాపారం మొత్తం 'ఫారో' సొంత వ్యవహారం వలెనే జరిగింది. వివిధ వర్తకులు తమ వ్యాపారాన్ని ఫారో నుండి కౌలుకు తీసుకొని చేసినట్లుగానే జరిగింది. కాని, వర్తకులెవ్వరూ స్వతంత్రంగా వ్యాపారం ప్రారంభించడానికిగాని, పెంచడానికిగాను, మార్పులు చేసుకోడానికిగాని అవకాశాలు లేవు. అంతేగాక, ఈజిప్ట్‌లో ద్రవ్యమారక వ్యవస్థ లేకపోవడం, ఒక ప్రధానమైన లోపం. దానివల్ల పశ్చిమాసియా ప్రాంతపు ప్రభువులు తాము పంపిన వస్తువులన్నిటికీ బంగారంలోనే విలువ కట్టడం జరిగింది. అది, ఈజిప్ట్ నుండి బంగారం వెలుపలికి పోవడానికి అవకాశాన్ని ఇచ్చింది. ఈజిప్ట్‌లో ప్రమాణ సహితమైన ఆర్థిక విధానం, మారక వ్యవస్థ లేకపోవడం వల్ల, వ్యవసాయ రంగానికి, వాణిజ్యరంగానికి మధ్య ఏ రకమైన పొత్తుగాని, పొంతనగాని లేకుండా ఉండడం జరిగింది. అదే, కాలగమనంలో ఈజిప్ట్ దేశంలోని పేదరికానికి దారితీసింది.

## 8.4 రాజకీయ వ్యవస్థ

ఈజిప్ట్ దేశంలోని రాజకీయ వ్యవస్థ, మత వ్యవస్థకు, భౌగోళిక వ్యవస్థకు మధ్య గల విభేదాలను, ఆయా ప్రాంతీయ భావాలను అణచివేసి, అందరు ఒకే జాతీయతకు చెందినవారమనే భావనను కలగజేయడానికి ప్రయత్నించింది. ఈజిప్ట్ రాజ్యంలో దక్షిణాది నుండి ఉత్తరానికి ఎలిఫెంటైన్ (Elephantine), ఆంబూ (Ambo), ఎడ్ఫు (Edfu), ఎస్నా (Esna), లక్సర్ (Luxor), కార్నక్ (Carnock), థేబ్స్ (Thabes), కాప్టస్ (Coptus), ఆంబిస్ (Ambis), డెండెరా (Dendera), అబిడాస్ (Abidos), అఖ్నేటన్ (Akhneton), హెర్మా పోలిస్ మాగ్నా (Herma Polis Magna), హెరాక్లియోపోలిస్ (Heracleopolis), ఫయూం (Fayum), సకారా (Sakara), మెంఫిస్ (Memphis), హీలియోపోలిస్ (Heliopolis) మొదలయిన పట్టణాలుండేవి. **దీనిలో**, నైల్ మధ్యధరా సముద్రంలో కలిసే ప్రాంతం నుండి హీలియోపోలిస్ వరకు గల ప్రాంతాన్ని దిగువ ఈజిప్ట్ అని, హీలియోపోలిస్ నుండి హెర్మాపోలిస్ మాగ్నా వరకు గల



BRAOU

భాగాన్ని ఎగువ ఈజిప్ట్ అని వ్యవహరించేవారు. వీనిలో హీలియోపోలిస్, హెరాక్లియోపోలిస్, హెర్మోపోలిస్ మాగ్నాలు ప్రసిద్ధమైన మత క్షేత్రాలుకూడా. ఇంత విస్తృతమైన ఈజిప్ట్ ప్రాచీన రాజ్యకాలంలో, నలభై రెండు 'నోమ్స్' (Nomes)లు ఉండేవి. 'నోమ్' అనేది ఒక స్థానిక పాలనా విభాగం. దానిని పాలించే పాలకుని 'నోమార్క్' (Nomarch) అంటారు. నోమ్స్ మొత్తం సంఖ్య నలభై రెండు. దానిలో ఎగువ ఈజిప్ట్‌లో ఇరవైరెండు, దిగువ ఈజిప్ట్‌లో ఇరవై ఉండేవి. ఈ 'నోమ్స్', పరిపాలనా వ్యవస్థలో భౌగోళిక వికేంద్రీకరణకు గల అవకాశాన్ని సూచిస్తునాయి. కాగా, మెంఫిస్, హీలియోపోలిస్, హెరాక్లియోపోలిస్, హెర్మోపోలిస్ మాగ్నా, అఖ్నేటన్, అబిడాస్, థేబ్స్, కార్నక్, ఎడ్ఫు వంటి క్షేత్రాలు అప్పటి ఈజిప్ట్ వ్యవస్థలో, రాజకీయ వ్యవస్థకు సమాంతరంగా అభివృద్ధి పొందిన ప్రాంతీయ మతపీఠాల అభివృద్ధిని, ప్రాంతీయ మతాచారాలకు రాజకీయ వ్యవస్థపై గల అధికారాన్ని, రాజకీయ వ్యవస్థలో గల వికేంద్రీకరణ ప్రాబల్యాన్ని సూచిస్తాయి. అంటే, ఈజిప్ట్‌లో భౌగోళికమైన, మతపరమైన బాహుళ్యంతోబాటు, వైరుధ్యాలు కూడా దాని రాజకీయ వ్యవస్థలో భాగంగా ఉన్నవని తెలుస్తున్నది. అయినప్పటికీ, 'ఫారో' (Pharoah) తాను స్వీకరించిన మతపరమైన అధికారాల ద్వారా, 'ఫారో' నిర్వహించిన కేంద్రీకృత వ్యవస్థ ప్రాబల్యమే ఎక్కువగా ఉండేది.

## 8.4.1 కేంద్రీకృత వ్యవస్థ - ఫారో

ఈజిప్ట్ రాజ్యవ్యవస్థలో వికేంద్రీకరణ భావాలను అణచివేసి కేంద్రీకృతమైన అవగాహనను, ఆచరణను, జీవన విధానాన్ని, పెంపొందించడానికి, 'ఫారో' అధికారంలో ఒక కేంద్రీకృత వ్యవస్థ ఆవిర్భవించింది. 'ఫారో' అనే శబ్దానికి అర్థం, భవనం (Palace) అని కూడా. అంటే, భవనం సమగ్రతకు, ఔన్నత్యానికి ఎట్లా సంకేతమో, అట్లాగే ఫారో కూడా సమగ్రతకు, ఔన్నత్యానికి ప్రతీక. అతడు ఈజిప్ట్ ప్రజల సమగ్రతను, ఔన్నత్యాన్ని కాపాడవలసి ఉండేది. ఈ సమైక్యతా భావానికి ప్రతీకగానే ఫారోలు, కొమ్ములు కలిగి, ఫాల్కన్ (Falcon=గరుడపక్షి) గుర్తులు గల రెండు కిరీటాలను శిరస్సుపై ధరించేవారు.

B R A O U

తాము దైవత్వాన్ని పొందినట్లు వ్యవహరించడం, ఫారోలు తమ ఔన్నత్యాన్ని చాటడానికి చేసిన అత్యంత ఉన్నతమైన ప్రయత్నం. వారు తాము 'దేవుళ్ళలో దేవుడని'; 'రే' అనే దేవుని కుమారులమని చెప్పుకొనేవారు. వారు దివ్యత్వాన్ని సూచించే వివిధ గుర్తులను ధరించేవారు. దేవతలతో అనునిత్యం సంబంధాలు ఉండేవి. దేవతలతో పొత్తుగల ఫారోలు, ప్రజల సంక్షేమం కోసం తగిన రీతిలో వ్యాఖ్యానం చేసేవారు. ఒక విధంగా ఫారోలు దేవతలకు, మానవులకు లంకె వంటివారు. ఫారోలు అనునిత్యం దైవారాధనలో గడుపుతూ, వివిధ దేవతామూర్తులను ఆవాహన చేసి, వారిని యథోచితమైన నివేదనలతో సంతృప్తులను చేయడం, ప్రధాన కర్తవ్యం. ఆ తరవాత దైనందిన లౌకిక కార్యక్రమాలను నెరవేర్చుకొని, ఫారోలు తమ అధికారాన్ని అభిభాషిస్తారు. ఆ రకమైన అభిభాషణలన్నీ చట్టంగా రూపొంది, మొత్తం ప్రభుత్వ నిర్వహణంతా దాని మీద ఆధారపడి ఉండేది.

ప్రభుత్వ నిర్వహణలో అనేకమంది ధనికవర్గాలవారు ఫారోలకు తోడ్పడేవారు. ఆ రకమైన తోడ్పాటు పొందిన వారిలో, "రాజు మిత్రుడు" అని, "ఆత్మ సహచరుడు" అని పిలవబడినవారు, చాలా గౌరవం పొందినట్లుగా భావించేవారు. ఈ రకమైన వారిని ఫారోతోబాటే అతని సహచరులుగా పరలోకంలో వ్యవహరించడానికి పంపడం జరిగేది.

రానురాను ఫారో గౌరవంలో మార్పు వచ్చింది. ఆ మార్పుకు ప్రాంతీయమైన తగాదాలు, ఆర్థిక వ్యవస్థలో వచ్చిన లోట్లు, అనుషంగికంగా ఉన్న వికేంద్రీకృత వ్యవస్థ హద్దులు దాటి పెరగడం, కారణాలయ్యాయి. ఫారో తన దివ్యమైన గౌరవాన్ని పోగొట్టుకొని, నలుగురిలో ఒకడయ్యాడు. అమెనెంహెట్ I (Amenemhet I) అనే ఫారో హత్య చేయబడటం దివ్యత్వ లోపాన్ని సూచిస్తున్నది. ఫారో తనను 'అమున్-రే' (Amun Re) అనే దేవుని అవతారమని ప్రకటించుకొన్నా, ఆ ప్రకటనను అనేకులు అంగీకరించినా, నవీన రాజ్య (New kingdom) కాలం నాటికి, ఫారో పదవిలో మార్పు

స్ఫుటంగా కనిపించింది. అతనిని ఒక బలశాలి అయిన మానవునిగా మాత్రం గుర్తించడం జరిగింది. అతడు సేనలను యుద్ధానికి తరలించేవాడు. తన బలాన్ని - ఏనుగులను, సింహాలను వేటాడడం ద్వారా, విలువిద్య, రథ చోదకత్వం మొదలైన పోటీలలో అందరి ముందు పాల్గొనడం ద్వారా వ్యక్తం చేసేవాడు. ప్రాచీన రాజ్యకాలంలోను, మధ్య రాజ్యకాలంలోను, ఫారో ఒక సేనాధిపతి పరమైన గౌరవం వంటిది కాక, దివ్యత్వానికి, మానుషత్వానికి సంధానపరిచే శక్తిగా, వ్యక్తిగా గుర్తింపును, గౌరవాన్ని పొందేవాడు.

ప్రాచీన రాజ్యం నుండి నవీన రాజ్యం వరకు తానే భగవంతుడినని, భగవంతుని కుమారుడినని చెప్పుకొన్న ఫారో, కాలక్రమేణా దివ్యత్వాన్ని పూర్తిగా పోగొట్టుకొన్నాడు. అతడు సామాన్య మానవునిగా మారిపోయి, కేవలం ధనికుడయి, బలశాలి అయిన రాజుగా మాత్రం గుర్తింపు పొందాడు. ఇది, ఈజిప్ట్ రాజకీయ వ్యవస్థలోని ఒక కీలకమైన మార్పు. ఇది,ఈజిప్ట్ రాజ్యం సామ్రాజ్యంగా మారడానికి కొంత దోహదం చేసింది.

### 8.4.2 వజీర్

ఫారో తరవాత పరిపాలనా వ్యవస్థలో వివిధ ఉద్యోగులున్నా, వారందరిలోను 'వజీర్' అత్యున్నత స్థానాన్ని పొందేవాడు. ఈ 'వజీర్' పదవిని కేవలం రాజవంశీకులు, ధనికులు మాత్రమే కాక, సామాన్యులు కూడా పొందడం జరిగింది. ఉదాహరణకు, మూడవ అమెన్‌హోటెప్ (Amenhotep III) కు వజీరైన 'హపు' కుమారుడైన అమెన్‌హోటెప్ (Amenhotep) సాధారణమైన వ్రాయసకాడు (writer)గా ఉండేవాడు. కాని, ఏభయ్యో ఏట అతడు వజీరయ్యాడు. రాజ్య పాలనలో వజీర్ అతి కీలకమైన పాత్ర వహించేవాడు. ఇతడు సామాన్య ప్రజలకు, ఫారోకు మధ్య, మధ్యవర్తిగా వ్యవహరించేవాడు. రాజ్యంలోని అన్ని వ్యవహారాలలోను వజీర్ పాత్ర తప్పనిసరిగా ఉండేది. అతడు యుద్ధ వ్యవహారాలలోను, ఆర్థిక వ్యవహారాలలోను, విదేశీ రాయబారులను ఆహ్వానించడంలోను--ఒకటేమిటి, అన్నింటిలోను అతనికి చాలా బాధ్యత ఉండేది. వజీర్ విదేశీ రాయబారులను ఆహ్వానించడం వంటి అంశాలు, పిరమిడ్‌లలోని వివిధ వర్ణచిత్రాల ద్వారా తెలుస్తున్నాయి.

### 8.4.3 ఇతర ఉద్యోగులు

వజీర్ తరవాత, ఆమన్ (దేవాలయంలో గల ప్రధాన అర్చకుడు) ముఖ్యమైన పాత్ర వహించేవాడు. అర్చకులను వెఎబ్ (Weeb) అని వ్యవహరించేవారు. 'వెఎబ్' అంటే శుచి. అంటే అర్చకులు శుచైన ప్రవర్తనను, వ్యక్తిత్వాన్ని కలిగి ఉండాలని భావన.

వీరే కాక, ప్రధాన భవన నిర్మాత, మహా ప్రతీహారి (Royal chamberlin), అంతఃపుర రక్షకుడు (Royal herald) మొదలైనవారు ఉన్నతమైన గౌరవాన్ని కలిగి ఉండేవారు.

### 8.4.4 న్యాయ వ్యవస్థ - శిక్షా విధానం

అప్పటి ఈజిప్ట్ పాలనలో ఏ రకమైన, లిఖితమైన, న్యాయ సంప్రదాయాలు లేవు. కేవలం ప్రాంతీయ ఆచారాలు, ప్రాంతీయ చట్టాలు, జోస్యాలు (oracles) ప్రధాన పాత్రను నిర్వహించేవి. ఆస్తిపాస్తుల సమస్యలు, వివాహం వంటి విషయాలన్నిటినీ, పూజారులే పరిష్కరించేవారు. నేర సంబంధమైన విషయాలను అందరికీ అంగీకారమైన కొందరు సామాజికులు పరిష్కరించేవారు. నేరాల తీవ్రతను బట్టి కొట్టడం, బానిసత్వం, అంగ విచ్ఛేదన, ఉరి తీయడం మొదలైన శిక్షలను అమలు చేసేవారు. ప్రాచీన ఈజిప్ట్‌లో ముప్పైమంది సభ్యులు గల న్యాయస్థానం ఉండేదని డియోడోరస్ (Diodorus) పేర్కొన్నాడు. లుక్రైట్స్ (Lukrites) అనే న్యాయస్థానాలు స్థానిక ఈజిప్షియన్‌ల సమస్యలను పరిష్కరించేవి. బెర్మాటిస్టె (Bermatiste) అనే న్యాయస్థానాలు ఈజిప్ట్‌లో ఉన్న గ్రీక్‌ల సమస్యలను పరిష్కరించేవి. కోయనీడాక్ (Koyanidoc) అనే న్యాయస్థానాలు ఈజిప్షియన్‌లకు, గ్రీక్‌లకు మధ్య తలెత్తిన వివాదాలను పరిష్కరించేవి.

### 8.4.5 ఆదాయ వ్యయాలు

రాజ్యంలో సుంకాలు, శిస్తులు, దోపిడీల ద్వారా వచ్చిన సొమ్ము, రాజుగారి భూముల మీద వచ్చిన ఫలసాయం, భూమి శిస్తు ప్రధానమైన ఆదాయం. వీటన్నిటిని విధించడం, వసూలు చేయడం, అనుభవించడంలో ప్రభువులదే గుత్తాధిపత్యం. రాజభవనాన్ని నిర్వహించడం, ఉద్యోగుల జీతభత్యాలు, పరిపాలన నిర్వహించడానికి, సేనలను నిర్వహించడానికి జరిపే వ్యయం, దేవాలయాల నిర్మాణం, దేవాలయాలలోని వివిధ రకాల సేవల ఏర్పాటుకు పెట్టిన వ్యయం, ఆనకట్టల, వంతెనల, కాలువల నిర్మాణానికయిన వ్యయం, విశ్వాసపాత్రులయిన, కుశలురయిన ఉద్యోగుల సన్మానానికి అయ్యే వ్యయం, ప్రభుత్వ వ్యయంలోని ప్రధానాంశాలు. క్వారీలు, గనులు, కొన్ని సహజ వనరులు, ఇవన్నీ ప్రత్యక్షంగా అధికారంలోనే ఉండేవి. యుద్ధాలలో వచ్చిన దోపిడీ సొమ్ము, పశు సంపద, కప్పం ఇవన్నీ ఫారోకి ప్రత్యక్షమైన ఆదాయాన్ని సూచిస్తాయి.

### 8.4.6 ఆస్తి హక్కుల వివరాలు

ఫారోలకు, దేవాలయాలకు పెద్దపెద్ద భూవసతులు ఉండేవి. ఫారోలకు వంశపారంపర్యంగా సంక్రమించిన ఆస్తిహక్కు ఉండేది. ఒక్కొక్కసారి ఫారోలు ఉద్యోగులకు భూమిని దానంగా ఇచ్చేవారు. అటువంటి దానాలు ఆ ఉద్యోగి మరణం తరవాత, తిరిగి ఫారోకి చేరతాయి. అటువంటి దానాలు దేవాలయాల పేరుతో ఇచ్చినా, కౌలు ఆ వ్యక్తికి చెందుతుంది. ఇవి, ప్రాంతీయ ఫ్యూడల్ వ్యవస్థలు, వ్యావసాయిక సార్వభౌమాధికారం పెంపొందకుండా, వికేంద్రీకరణ శక్తులు అభివృద్ధి చెందకుండా, ఆనాటి ప్రభువులు తీసుకొన్న చర్యలు.

ఫారోల భూముల వివరాలను గురించి 'పాప్రి' పత్రాలు, ఇతర జాబుల ద్వారా తెలుస్తున్నది. వ్యావసాయిక భూములు, ద్రాక్ష తోటలు, మార్కెట్ ప్రాంతాలు, పాపిరస్ గుంటలు ఇవన్నీ రాజుకు చెందినవే. పాపిరస్ గుంటల వద్ద చేపలు పట్టడం, చేపల పెంపకం, బాతుల పెంపకం మొదలైనవానిని చేపట్టేవారు. వాటన్నిటివల్ల ఫారోలకు ఎంతో లాభం ఉండేది.

నవీన రాజ్యకాలంలో దేవాలయాల భూవసతుల మీద పన్నులు విధించేవారని 'హారిస్ పాపిరస్' ద్వారా వివరంగా తెలుస్తున్నది.

భూమిని వ్యక్తిగతమైన ఆస్తిగా, కొనుగోలు వల్లగాని, వారసత్వం వల్లగాని పొందేవారు. ఈ భూమిమీద పంటలో 1/7వ వంతు రాబడిని రాచరికంవారికి పన్నుగా రైతులు చెల్లించేవారు. ప్రతి ఉద్యోగి తాను ఉద్యోగంలో ఉన్నంతకాలం అనుభవించడానికి కొన్ని భూములను పొందేవాడు. వాటి మీద అధికారం అతడు ఉద్యోగంలో ఉన్నంత కాలమే ఉండేది. ఆ భూముల మీద అధికారం ఏ పరిస్థితులలోను ఇంకొకరికి సంక్రమించదు; అది వారసత్వం కాదు.

గోధుమలు, రొట్టెలు, మద్యం మొదలయిన వాటిని ప్రభుత్వం వారే దివాణం నుండి ఉద్యోగులందరికి, వారి వారి తరహాల కనుగుణంగా మంజూరు చేసేవారు. కబేళాలు (Slaughter houses), పిండి మిల్లులు (Grinding mills), మద్యం తయారుచేసే శాలలు (Breweries), వంటశాలలు, రొట్టెలు తయారుచేసే శాలలు (Bakeries) మొదలైనవి ప్రభుత్వ అజమాయిషీలో ఉండేవి. కప్పంగా సేకరించిన పశువులు, గోధుమలు, కాయగూరలు, పండ్ల వంటివాటిని ఆయా శాలలకు పంపేవారు. ఈజిప్ట్ అంతటా ఇది ఒక వికేంద్రీకృత వ్యవస్థగా ఉండి, అనేక ప్రాంతీయ కేంద్రాలతో ఉండేది.

ప్రభువులు పాలనా వ్యవస్థలోని ఉద్యోగులకు, రాజ్యసభలలోని సభ్యులకు, సైనికులకు విడిగా వేర్వేరు నివాస గృహాలను కట్టి ఇవ్వడం కూడా జరిగేది.



BRAOU

### 8.4.7 సైనిక వ్యవస్థ

రెండవ రామ్సెస్ (Ramses II) కాలంలో సైనిక సంస్కరణలు జరిపేవరకు, ఈజిప్ట్‌లో ఒక స్థిరమైన సైన్యంగాని, సైనిక వ్యవస్థగాని రూపొందలేదు. నుబియా, లిబియా, షెర్డా ప్రాంతాలకు చెందినవారితోనే సైన్యాలను ఏర్పాటు చేసుకొనేవారు. మొదటి ప్సాంటికో (Psantico I) అనే ఫారో, పూర్తిగా గ్రీక్‌లపైనే తన సైనిక బలాన్ని వృద్ధి చేయడంలో ఆధారపడ్డాడు. యుద్ధాలలో గండ్రగొడ్డళ్ళు, బల్లేలు, గదలు, విల్లమ్ములు వాడేవారు. కోటలను పట్టుకోడంలో నిచ్చెనలు వాడేవారు. మధ్యరాజ్యకాలంలో రానురాను పెద్ద కత్తులు, డాళ్ళు, బరిసెలు, ఈటెలను కూడా ఉపయోగించేవారు. ఈజిప్ట్ సేనలో రథాలు చాలా ఆలస్యంగా భాగమయ్యాయి. రెండు గుర్రాలతో లాగబడే రథాలకు సారథి, రథికుడు ఉండేవారు. వారికి కాల్బలమే కాని, అశ్విక బలం లేదు. ప్రతి సేనలోని ఒక్కొక్క యూనిట్‌లో ఏభైమంది విలుకాండ్రు, ఏభైమంది బల్లేలు విసిరేవాళ్ళు ఉండేవారు. నవీన రాజ్యకాలం చివరి దశలో, ఈజిప్ట్ సైన్యంలో నౌకాబలం అభివృద్ధి పొందింది. ఈ వ్యవస్థలో పుంత్, నుబియా, హిట్టైట్ మొదలైన రాజ్యాల మీద దాడి చేయడం, అభివృద్ధి చెందిన సైనిక వ్యవస్థ ప్రాబల్యానికి గుర్తుగా గమనించగలం.

## 8.5 సంగ్రహంగా

1. ఈజిప్ట్ దేశంలోని సామాజిక వ్యవస్థ-వివిధ వర్గాలుగా ఉండేది.
2. అట్టడుగు వర్గాలవారి మీద ఉన్నత వర్గాలవారి ప్రాబల్యం ఉండేది.
3. ఉన్నత వర్గాలవారు తమ కేంద్రీకృత అధికారం ద్వారా, సంఘంలోని వివిధ వర్గాలవారిని ప్రచ్ఛన్నమైన, ప్రత్యక్షమైన దోపిడీకి గురిచేసేవారు.
4. ఆర్థిక వ్యవస్థ ఏ రకమైన స్వతంత్ర ప్రతిపత్తిని కలిగినది కాదు.
5. పాలకులయిన 'ఫారో'ల అధికారం ఆర్థిక వ్యవస్థలో అణువణువూ వ్యాప్తి పొందింది.
6. రాజకీయ వ్యవస్థలో 'ఫారో'లకు విస్తృతమైన అధికారాలు ఉండేవి.
7. స్నెఫ్రు, ఖుఫ్రు, ఖఫ్రె, అబురోష్, షెప్సెఖఫ్, అమెన్‌హోటెప్ I, థట్మోస్ I, అమెన్‌హోటెప్ IV, రామ్సెస్ I, రామ్సెస్ II, రామ్సెస్ III మొదలైనవారు ప్రసిద్ధులైన 'ఫారో'లు.
8. హట్షెప్సుట్ వంటి రాణులు ఉన్నా, స్త్రీల పాలన అరుదైన అంశం.
9. రాజకీయ వ్యవస్థ అనేక మతాచారాల మీద ఆధారపడి ఉండేది.
10. ఇటువంటి వ్యవస్థ మతప్రసక్తి గల రాజ్యం (Theocratic State) కాదు.

## 8.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. ఈజిప్ట్ సామాజిక వ్యవస్థను వివరించండి.
2. ఈజిప్ట్‌లోని ఆర్థిక వ్యవస్థ స్వరూపం ఏమిటి ?
3. ఈజిప్ట్‌లోని రాజకీయ వ్యవస్థను గురించి రాయండి.

II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.

1. ఆహారపు అలవాట్లు - విందులు

52. వాణిజ్యం - వర్తకం

3. ఫారో

## 8.7 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| ***Encyclopaedia Britannica*** | : | **Vol. 8**, Pages 27-91 |
| Leonard. H. Vesask (ed.) Vol.5 | : | ***Encyclopaedia of Religion : Overview of Egyptian Religion*** |
| Herman Schnider | : | ***History of World Civilization,*** London, 1931. |
| Hutchinson | : | ***Ancient Races*** |
| Korov Kin. F. | : | ***History of the Ancient World,*** Moscow, 1987. |
| Pramathanathbus | : | ***Epochs of Civilization*** |
| Vish W.S. (ed.) | : | ***History of the World*** |


## 8.8 పదకోశం

| | | |
|---|---|---|
| టెహూనో ఈజిప్షియన్లు | : | జాతి సాంకర్యం వల్ల రూపొందినవారు |
| సలాడ్ | : | పచ్చి కూరలతో కూడిన ఆహారం |
| సెనెట్ | : | చదరంగం వంటి ఒక ఆట |
| సిస్టం హాథర్ | : | దేవతారాధనలో వాడే ఒక వాద్యం |
| షడూఫ్ | : | ఏతాం వంటి నీటిని తోడే పరికరం |
| గీజా | : | ప్రాచీన రాజ్యకాలంలో రాజధాని |
| ఎబానీ | : | సుడాన్‌లో ఉండే కర్రవలె బలిష్ఠమైన నల్లని చెక్క |
| పుంత్ | : | ఎర్ర సముద్రంలోని ఒక ద్వీపం : 'దివ్యభూమి' (Divine land) అనే పేరుండేది |
| బాదక్‌షాన్ | : | ఆఫ్ఘనిస్థాన్‌లోని ఒక ప్రసిద్ధ రాజకీయ కేంద్రం |
| మాఫర్ | : | ఆలివ్ జాతికి చెందిన, తెల్లని రంగు గల మందునిచ్చే చెట్టు |
| బీచ్ | : | పలుచని బూడిద రంగు పట్ట గల, ఫాగస్ కుటుంబాలకి చెందిన చెట్టు |
| ఎలెక్ట్రమ్ | : | వెండి బంగారాల మిశ్రమ లోహం : రథాలకు పూసేవారు |

BRAOU

# భాగం-9 : మతం-తత్త్వ వివేచన

విషయక్రమం

9.0 లక్ష్యాలు

9.1 పరిచయం

9.2 మత వ్యవస్థ

9.2.1 ఆధారాలు

9.2.1.1 శాసనాధారాలు

9.2.1.2 సంప్రదాయ సాహిత్యం

9.2.1.3 మతపరమైన నమ్మకాలు

9.2.3 మత వ్యవస్థలు-మతాచారాలు

9.2.3.1 ప్రేతాత్మల దేవాలయాలు

9.2.3.2 వ్యక్తి పూజ

9.2.3.3 జంతువుల ఆరాధన

9.2.3.4 గారడీ, ఇత్యాదులు

9.2.4 పౌరాణిక సంప్రదాయాలు-దేవుళ్ళు, దేవతలు

9.2.5 ఉత్సవాలు- పండుగలు

9.3 తత్త్వవివేచన

9.3.1 ప్రాంతీయమైన నమ్మకాలు

9.3.2 తులనాత్మక పరిశీలన

9.4 సంగ్రహంగా

9.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

9.6 ఉపయుక్త గ్రంథాలు

9.7 పదకోశం

B R A O U

## 9.0 లక్ష్యాలు

1. ఈజిప్ట్ నాగరికతలోని తత్త్వ వివేచనా సరళిని, మతాలను తెలియడానికి గల ఆధారాలను సమీక్షించడం.
2. ఈజిప్షియన్ల మత పరమైన నమ్మకాలను వివరించడం
3. ఈజిప్ట్ దేశంలో అభివృద్ధి చెందిన మత వ్యవస్థను, మతాచారాలను వర్ణించడం.
4. ఈజిప్షియన్‌ల పౌరాణిక సంప్రదాయాలను, వారికి గల దేవుళ్ళు(Gods), దేవతల (Goddesses) గురించి చెప్పడం.
5. ఈజిప్షియన్‌ల పండుగల, ఉత్సవాల ప్రాశస్త్యాన్ని వివరించడం.
6. ఈజిప్ట్ దేశంలో వ్యాప్తి పొందిన ప్రాంతీయమైన, మతపరమైన నమ్మకాలను విశదీకరించడం.
7. నైల్ నదికి, ఈజిప్ట్ మత వ్యవస్థకు గల సంబంధాన్ని వివరించడం.
8. ఈజిప్ట్ దేశంలోని మత వ్యవస్థను, ఇతర నాగరికతలలోని మతాలతో పోల్చి, పరిశీలించడం.

## 9.1. పరిచయం

BRAOU

ప్రకృతిలోనికి, తొంగిచూచి, దానిని అవగాహన చేసుకొని, దానిలోని నిజాలను, భ్రాంతులను, సవ్యతలను (సరిగా ఉన్నవానిని), అపసవ్యతలను (సరిగాలేని వానిని), దీప్తిని (కాంతిని), ఛాయను (నీడలను) విశ్లేషించి, విచక్షణతో సిద్ధాంతాలను ఏర్పరచడమే తత్త్వ వివేచన . ఆరకంగా ఏర్పడిన సిద్ధాంతాల సంఖ్యకు మితిలేదు. నిరంతరం ప్రకృతితో సంబంధం కలిగి, నాగరికతను పెంచుకొన్న ఈజిప్షియన్లు తమ అవగాహన ద్వారా అనేక సిద్ధాంతాలను ఏర్పరచడం జరిగింది. ఆ సిద్ధాంతాలకు ఆచరణపరమైన విధానమే మతం. తత్త్వ వివేచనలోని అనేక భావాలను దైనందిన వ్యవస్థలోనికి ఆచరణ పూర్వకంగా తేవడానికి అందరూ అంగీకరించిన విధానాలే, మతం పేరున పిలువబడ్డాయి. ప్రజా జీవనంతోను, ప్రజల అనుభవాలతోను, నమ్మకాలతోను సంబంధాలుగల తత్త్వ వివేచన, ప్రజల గౌరవాన్ని పొందుతుంది. అంతేగాక, దానివల్ల ఉత్పన్నమైన మత వ్యవస్థ, మత వ్యవస్థను నేపథ్యంగా తీసుకొని వర్ధిల్లిన అన్ని వ్యవస్థలు బలవంతమై, కాలానుక్రమంలో ప్రజాజీవనంలో దీప్తిని, ఉత్సాహాన్ని, తేజస్సును, ఆశలను, శాంతిని కలిగిస్తాయి. **ఈజిప్ట్** నాగరికతలో తత్త్వవివేచన, మతం ఎటువంటి ప్రాధాన్యాన్ని కలిగి ఉండేవో, ఈక్రింది విధమైన ఆధారాల ద్వారా తెలుసుకోవచ్చు.

## 9.2 మత వ్యవస్థ

ఈజిప్ట్ మత వ్యవస్థలో ప్రకృతి ఆరాధన, పునర్జన్మ ప్రధాన రూపాలు. రా, ఒసిరిస్ వంటి వారి ఆరాధన, ప్రకృతి ఆరాధనకు తోడ్పడ్డాయి. కాగా, పిరమిడ్ల నిర్మాణం ప్రధానంగా పునర్జన్మ పై కేంద్రీకృతమైంది.

### 9.2.1 ఆధారాలు

మతవ్యవస్థను గూర్చి, తత్త్వ వివేచన గూర్చి తెలియడానికి గల ఆధారాలను, రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. మొదటి తరహాకు చెందినవి శాసనాధారాలు. రెండవ తరహాకు చెందినది సంప్రదాయ సాహిత్యం.

### 9.2.1.1 శాసనాధారాలు

ఇవి 'ఫారో'ల శాసనాలుగాను, దేవాలయ శాసనాలుగాను రెండు రకాలున్నాయి. దేవాలయ శాసనాలన్నీ మతపరమైన, ఆచారాలపరమైన వ్రాతలు. 'ఫారో'ల శాసనాలలో నార్మెట్ శిలా ఫలకం (Narmette Palette); 'షబాకా'' శిలాఫలకం (Shabaka stone block); దేవాలయ శాసనాలు (Temple insciptions) లభ్యమైన వానిలో ముఖ్యమైనవి. 'నార్మెట్' శిలాఫలకంలో తొలి రాజవంశీకులైన 'మిన్'/'హోరస్' మతానుయాయులయిన ప్రభువులు ఏరకంగా 'ఎడ్ఫు' (Edfu) ప్రాంతీయులతో వ్యవహరించారో, 'హోరస్ (Horus) సంప్రదాయం సంపూర్ణవ్యాప్తిలోనికి రాగలిగిందో చెప్పడం జరిగింది. 'షబాకా' శిలాఫలకంలో హెర్మోపోలిస్‌కు చెందిన 'అటున్' (Atun) లేక 'ప్తా' అనే దేవతా మూర్తి ఏవిధంగా సృష్టికర్తగా పరిణమించాడో, చెప్పడమైంది. మధ్య రాజ్య (Middle Kingdom) కాలానికి చెందిన దేవాలయాలలోని కొన్ని చిత్ర లిపిలోని శాసనాలు, మతపరమైన అంశాలను వర్ణించాయి.

### 9.2.1.2 సంప్రదాయ సాహిత్యం

1. పిరమిడ్‌ల వ్రాతలు (Pyramid Texts): పిరమిడ్‌లలో దైవత్వాన్ని పొందిన, పొందగోరిన వివిధ ఫారోల వివరాలు చెప్పి, ఈ వ్రాతల్లో వారు ఆశించిన దివ్యత్వాన్ని గురించి నిర్వచించడం, వ్యాఖ్యానించడం జరిగింది. ఉదాహరణకు, 'ఎల్‌బెర్షా' (Elbersha) లో ప్రభువు 'హెటెప్' (Hetep) క్షేత్రాన్ని పొందగోరినట్లుంది. 'హెటెప్' అనేది ఈజిప్షియన్‌లు ఆశించిన ఒక రకమైన స్వర్గం. దీనికి తోవలను చూపడంలో, దిబ్బలతో చుట్టిన నీలి జలమార్గం పగటి ఆకాశంగాను, నీటితో చుట్టిన నల్లని భూమార్గం రాత్రి ఆకాశంగాను, చెప్పడం జరిగంది.

2. ద్వంద్వ మార్గగ్రంథం: (The Book of the Two Ways) : దీనిలో అధిదేవుడు (All Lord)గా భావించిన 'రే' (Re) సూక్తులున్నాయి. "అతడే అందరూ శ్వాసించే నాలుగు రకాలైన వాయువులను ఏర్పరిచాడు. అతడే పేదలు, ధనికులు అందరూ పొందే వరదలను కల్గించాడు. అతడే అందరి హృదయాలను పశ్చిమ దిక్కును మరిచేటట్లు చేసి, వారి నోమ్‌లలోని దేవతలకు నిత్య నివేదనాలకు ఏర్పాటు చేశాడు." "నాకన్నీటి నుండి మానవులను నా స్వేదం నుండి దేవతలను సృష్టించాను". "కొన్ని లక్షల సంవత్సరాల తరవాత నేను, ఒసిరిస్ కలిసి కూర్చుంటాం. అప్పటికి నగరాలు శిథిలాలవుతాయి. శిథిలాలు నగరాలవుతాయి. ఒక ఇల్లు నుంచి ఇంకొక ఇల్లు వెలివేయబడుతుంది". ఈరకమైన సూక్తులు 'రే' అనంతమయిన శక్తిని, సర్వజ్ఞత్వాన్ని సూచిస్తున్నది.

3. "వెస్ట్‌కార్ పాపిరస్'' (West car papyrus):– ఈ ప్రతిలో ఫారో 'ఖుఫు' (Kufu) కాలంలో (క్రీ.పూ. 3718-3665) జరిగిన అద్భుతాలను చెప్పడం జరిగింది.

4. సంప్రదాయ బోధిని (Instruction Genere):– క్రీ.పూ. 2040 లో హిరాక్లియోపోలిస్‌లో రాసిన ఈ గ్రంథంలో 'లే' ప్రచ్ఛన్నుడని, సర్వజ్ఞుడని, త్రికాలవేత్త అని, న్యాయవర్తనుడని రాయడం జరిగింది.

5. సినుహె కథ (Story of Sinuhe):– క్రీ.పూ. 1971-1928 మధ్య కాలానికి చెందిన ఈ ఆధారంలో థేబ్స్‌కి చెందిన 'అమున్' ముందు ఎవ్వరూ నిలవలేరని చెప్పడం జరిగింది.

6. ఖాన్సు దేవాలయ గ్రంథం (Khonsu Temple Text):- 'కార్నక్' (Carnok) కు చెందిన 'అమున్' (Amun) దేవాధిదేవుడని, హెర్మోపోలిస్‌లో ప్రళయంలో గ్రుడ్డును తానే సృష్టించాడని, దానినుండి 'రే' మొదలైన దేవతలు ఆవిర్భవించారని, ఆ 'ఖాన్సు' 'థేబ్స్ వరకు ప్రయాణించాడని చెప్పడం జరిగింది.



BRAOU

7. 'బా'తో వివాదం: (The Dispute of Man with his 'Ba') :– 'బా' అనే ఈజిప్షియన్ పదానికి ఆత్మ (Soul) అనే మాట దగ్గరది. ఈ ఆధారంలో మానవుని సంఘర్షణ వివరించడం జరిగింది.

8. 'ఖఖాపెర్రెసెనెబ్' విలాపం (Lamentations of Khakhe Perre Se neb):– ఇది కూడా 'బాతో వివాదం' అనే ఒక శరీరానికి, ఆత్మకు మధ్య జరిగిన కన్నీటి గాథ.

9. దయ్యం కథ (Ghost Story): ఈజిప్ట్‌లో 'కా' అనే ప్రేతాత్మ ఒక పూజారికి కన్పించి, తన సమాధి బద్దలయిందని, దానిని మరమ్మత్తు చేయించి, తనకు తిరిగి పూజాపురస్కారాలు ఏర్పరచవలసిందని కోరుకోడం, ఈ ఆధారంలో ఉంటుంది.

10. 'మెరికారె'కు బోధిని (Instructions for Merikare): ఇది ఒక రాజకుమారునికి నేర్పిన మత విషయాల సారాంశం.

11. 'ఆటన్' సంహిత: (Hymn to Aton) : ఇది 'రె' లేదా 'హోరస్'ల వలెనే బలవంతుడైన 'ఆటన్' అనే దేవుని స్తోత్రం. ఇది అఖ్నేటన్ (Akhneton) కాలం ( క్రీ.పూ. 1377-1361 లో రాయబడింది. దీనిలో 'ఆటన్' ఇతర దేవతలను పరాభూతులను చేసినట్లు చెప్పడం జరిగింది.

12. 'హార్పర్' పాటలు:- Songs to Harper): ఇవి మరణానంతర జీవితం అనే నమ్మకం పట్ల **వ్యతిరిక్తతను** చెప్పే రాతలు.

13. జీవనయానంలో అలసిన మనిషి (Man who was tired of Life) :ఇది నిరాశకు, నిస్పృహకు లోనయి, నిస్సారమయిన బ్రతుకు గడిపి, చావు తరవాత ఇంకా బతుకెందుకులే అనే భావనను సూచిస్తుంది. పై ఆధారం వంటిదే (12) ఇది కూడా.

14. వేకువ యాత్ర : (Book of Going forth by Day):– నవీన రాజ్య కాలానికి ( క్రీ.పూ. 1567-1085) చెందిన ఈ గ్రంథంలో, అనేక రకాల మంత్రతంత్రాలను గురించి, 'మాజిక్' ను గురించి చెప్పడం జరిగింది.

15. అభిచారిక మంత్రాలు : (Execration Texts) : కండ బలం ద్వారా శత్రువులను గెలవలేనప్పుడు, వారి మీద ఉపయోగించే మరణకారక మంత్రాలు.

16. 'పాపిజూమిలాక్' (Papy Jumilac):– ఇది ఎగువ ఈజిప్ట్‌లోని మత వ్యవస్థ చరిత్ర. చాలా ప్రధానమైంది.

17. ఇద్దరు సోదరుల కథ (Story of the Two Brothers) : ఇది పౌరాణిక సంప్రదాయాన్ని చెప్పడంగాని, ప్రయోజనాలను తీర్చడంగాని చేయని, ఒక పౌరాణిక ఇతివృత్తం.

18. నిజం చూపుమాపిన మాయ (Blinding of Truth by Falsehood) : ఇదికూడా "ఇద్దరు సోదరుల కథ' వంటిదే.

19. హోరస్- సేత్ యుద్ధం (Contending of Horus and Seth) : ఇది సేత్‌పై ఒసిరిస్ కుమారుడైన హోరస్ జరిపిన యుద్ధ వర్ణన గల కథ.

20. ఎస్టార్ట్ అసంతృప్త సముద్రం (Astarte and the Insatible Sea) : ఇది పశ్చిమాసియా నుండి ఈజిప్షియన్‌లు స్వీకరించి, పూజించిన 'అస్టార్ట్' అనే దేవుని కథ.

BRAOU

21. నైల్ స్తోత్రం (Hymn to Nile) : ఇది నైల్ నదిని భగవంతుని రూపంగా కీర్తిస్తుంది.

22. అమున్ రే స్తోత్రం (Hymn to AmunRe) : ఇది దేవాధిదేవుడయిన, జాతీయతాకారకుడైన 'అమున్‌రే' ప్రశంస.

23. ఆటన్ స్తోత్రం (Hymn to Aton) : ఇది 'ఆటన్' ప్రశంస. 'అమున్‌రే' స్తోత్రం వంటిది.

ఈ ఆధారాలన్నీ ఈజిప్ట్‌లోని మత, తత్త్వ వివేచనా సంప్రదాయాలను వివరించడంలో, ఈ క్రింది విధంగా తోడ్పడతాయి.

## 9.2.2 మతపరమైన నమ్మకాలు

ఈజిప్ట్‌లో తత్త్వ వివేచన వల్ల విశ్వం ఆవిర్భవించడానికి, అనేక కారణాలను ప్రతిపాదించడం జరిగింది. ఈరకమైన కారణాలు మత వ్యవస్థ స్థిరపడటంలో తోడ్పడే వివిధ మతాచారాల ఆవిర్భావానికి తగినంతగా తోడ్పడ్డాయి. వానిలో కొన్ని కారణాలను ఈ క్రింది విధంగా సమీక్షించవచ్చు.

1. ఆకాశం అంతా ఒక తిరగబడిన (లేదా బోర్లించబడిన) పళ్ళెం వంటిది. ఆకాశాన్ని 'బయా' (Bia) అని పిలుస్తారు. దీనిలో నుండి కొన్ని ఆశ్చర్యకరమైన భాగాలు (బయాన్ = Bian) భూమిమీద పడ్డాయి. దానిలో 'బయట్' (Biat) అనే తోకచుక్కనుండి వచ్చిన ఇనుము కూడా ఉంది. ఆ ఇనుమును 'ఓపెనింగ్ ఆఫ్ ది మౌత్' అనే ఉత్సవంలో 'ఆడ్జెస్' (Adges) మొదలైన వస్తువులను చేయడానికి ఉపయోగిస్తారు. ఈ సిద్ధాంతం ఆకాశంలో భూమి ఒక భాగమని, అది ఆకాశం నుండి వేరుగా పడిందని వివరిస్తున్నది. ఇటువంటి సిద్ధాంతాన్నే తర్వాతి కాలంలో భూమిజ్ఞాన శాస్త్రజ్ఞులు (Geologists) కూడా, సూర్యగోళం నుండి పడి చల్లారిన ముక్కలలో భూమి ఒకటి అని ప్రతిపాదించారు. ఈ సిద్ధాంతంలో సృష్టికి గల ఇతర అవకాశాలను గురించి గాని, సృష్టిలోని పరిణామాలను గురించి గాని, చెప్పబడలేదు.

2. రెండవ సిద్ధాంతం ప్రకారం ఆకాశం అంతా ఒక గొప్ప ఆవు. దాని నాలుగు కాళ్ళు నాలుగు రకాలయిన దేవతామూర్తులతో మోయబడేవి. ఇతర దేవతలు చుక్కలు. వారు చంద్రవంకల వంటి చిన్న నౌకల మీద ఈ ఆవు కడుపు చుట్టూ తిరుగుతారు. ఈ సిద్ధాంతంలోని 'ఆవు'కు గల సంకేతాత్మకత, చంద్రునితో సమన్వయించడానికి వీలైనది. పాలు, ఔషధులు, వృక్ష సంపద మొదలయినవన్నీ చంద్రునికి అనుబంధించడం, సామాన్యమైన విషయం. ఆవుగా సంకేతించబడిన ఆకాశంలోని 'ఆవు గుర్తు', హీలియో పోలిస్ మత సంప్రదాయాలలో ఎంతో ప్రాముఖ్యతను కలిగి వుంది. ఈ ఆవును 'హాథర్' (Hather) అనే దేవతతో సమన్వయించేవారు. హీలియో పోలిస్ సంప్రదాయం ప్రకారం, ఆమె 'రే'కు భార్య; 'హోరస్'కు తల్లి. అలాగే ఆమెను, 'హోరస్' భార్యగాను, 'ఐ' (Iay) తల్లిగాను వర్ణించడం జరిగింది. ఈ ఆకాశాన్నే "నట్" అని పిలిచేవారు. ఇది తూర్పు నుండి పడమరకు విశాలమైన భాగం.. దీని నుండే 'హోరస్' పుట్టాడు.. అని చెప్పడం జరిగింది.

3. మూడవ సిద్ధాంతం హిలియో పోలిస్ దేవాలయానికి చెందినది. ఈ సంప్రదాయం దృష్ట్యా, ఈ విశ్వాన్నంతా 'అటుమ్ (Atum) సృష్టించాడు. ఇతడు సమగ్రమైనవాడు. ఇతడే గాలిని (షు), తేమను (టెఫ్నట్)ను స్వయంగా సృష్టించాడు. ఈ ఇద్దరి నుండి 'గెబ్' (భూమి), 'నట్' (జలాకాశం) కలిగాయి. వారిద్దరి నుండి ఈజిప్ట్‌లోని ఇతర దేవతామూర్తులు ఆవిర్భవించారు.

4. హెర్మోపోలిస్ సంప్రదాయాల ప్రకారం, 'అమున్' (Amun), 'అమౌనెట్', Amaunet) అనే ప్రచ్ఛన్నతను చూపే జంట, 'కుక్' (Kuk), 'కౌకెట్' (Kauket) అనే చీకటిని చూపేజంట; ' హుహ్' (Huh), 'హౌహెట్'

(Haulet) అనే రూపరాహిత్యాన్ని, లేదా నిర్గుణత్వాన్ని, చూపే జంట; 'నన్' Nun), 'నౌనెట్' (Naunet) అనే జల అఖాతాలను చూపే జంట-నాలుగు వైపుల ఉండగా ఒక ప్రళయం (Chaos) సంభవించింది. దానిలో ఒక గుడ్డు ఆవిర్భవించింది. దాని నుండి 'ప్లా' (Plah) అనే దేవుడు ఆవిర్భవించాడు. ఇతడు చతురస్రపు పీఠం మీద ఉండే, రెండు ముఖాలు గల దేవుడు. ఇతడు జగత్ప్రభువు, జగద్రక్షకుడు. ఇతన్ని హెర్మాపోలిస్ నగరాధి దేవత అయిన 'థాత్' (Thoth), చంద్రునితో పోల్చడం జరిగింది. 'ప్తా' భార్య 'సెఖ్మెట్. వీరికి 'నేఫర్టెమ్' అనే కుమారుడు పద్మ గర్భం నుండి జన్మించాడు. ఈ సంప్రదాయంలో చెప్పిన జల ప్రళయం, గుడ్డు నుండి ఆవిర్భావం, పద్మ గర్భం నుండి సృష్టికర్త ఆవిర్భవించడం మొదలైనవి, కొంతవరకు భారతీయ సంప్రదాయాలను పోలి ఉన్నాయి.

5. ఇంకొక ప్రశస్తమైన వివేచన, దక్షిణ ఈజిప్ట్‌లో ఎక్కువగా వ్యాప్తి పొందినది. దీని ప్రకారం ఆకాశం అంతా విశ్వం. అతడే 'హోరస్' అని పిలువబడ్డాడు. అతనికి ఫాల్కన్ పక్షి సంకేతం. ఇతని రెండు కన్నులు సూర్యుడు, చంద్రుడు. చంద్రుడు తన పినతండ్రి అయిన 'సేత్' (Seth) తో జరిగిన యుద్ధంలో, 'హోరస్' కు చెందిన గాయపడిన కన్నును సూచిస్తాడు. ఇతడు 'రే' కన్న గొప్పవాడు.

6. ఈజిప్షియన్‌ల ఇతర నమ్మకాల ప్రకారం మానవులు, 'రే' కన్నీటి నుండి ఆవిర్భవించినవారు. వారు అతని హృదయం నుండి బుద్ధిని, నాలుక నుండి మాటను పొంది, కమ్మరి ఆరె మీద రూపుదిద్దుకొన్నవారు.

7. ఈజిప్షియన్లు తత్త్వవివేచనలో, చావు తరవాత మళ్ళీ జన్మ అనే నమ్మకం, ఎంతో ప్రాశస్త్యాన్ని సంతరించుకొంది. ఈ నమ్మకం వల్ల మరణించిన వారిని పూజించేవారు. మరణించినవారి ఆత్మలను 'కా' అనేవారు. వీని పూజలో రానురాను వివిధ నమూనా ప్రతిమలను చేసి, సమర్పించేవారు. ఆ ప్రతిమలను, మరణించిన ఆ వ్యక్తిని మళ్ళీ అదే విధంగా చేయడానికి దేవునికి సమర్పించిన నమూనాలుగా, భావించేవారు. ఔద్ధత్యంతోకూడిన హక్కు (Hu హు) కోసం, ఆలోచన (సయా- Sia) కోసం; దృష్టి ('మా' Ma) కోసం; వినికిడి (సెడెం Sedem) కోసం ఇటువంటి బొమ్మలను సమర్పించేవారు.

తత్త్వ వివేచన ద్వారా ఇటువంటి నమ్మకాలు వేర్వేరు మత వ్యవస్థలకు, ఆచారాలకు దారితీశాయి.

### 9.2.3 మత వ్యవస్థలు- మతాచారాలు

ఈజిప్ట్‌లోని మత వ్యవస్థలో దేవాలయం అతి ముఖ్యమైంది. మెంఫిస్ (Memphis), హీలియోపోలిస్ (Helio polis), హెరాక్లియో పోలిస్ (Heraclio Polis), హెర్మాపోలిస్ (Herma Polis), కార్నక్ (Karnok), థేబ్స్ (Thabes) ఎడ్ఫు (Edfu) మొదలైన చోట్ల ప్రసిద్ధ దేవాలయాలుండేవి. ఈ దేవాలయాలలో ఉన్నత స్థాయిలో గల మతాధికారులు, లేదా అర్చకులు నలుగురు ఉండేవారు. ఈ ఉన్నత అర్చకులు సామాన్యంగా, 'హెంనెట్జర్' (Hemnetjr), అంటే 'దేవదాసుడు' అనే బిరుదును ధరించేవారు. ఈ దేవాలయార్చకులు ఉన్నతమైన లౌకికాధికారాన్ని కూడా కలిగి ఉండేవారు. వారు న్యాయ నిర్ణేతలుగా కూడా వ్యవహరించేవారు. మెంఫిస్‌లోని 'ప్తా' (Ptah) దేవాలయంలో ప్రధానార్చకులుగా రాజవంశీకులు, లేదా కుటుంబీకులే వ్యవహరించేవారు. ఈ ప్రధానార్చక పదవి అన్ని చోట్లా వారసత్వం కాదు. కాని, థేబ్స్‌లో ఇది వారసత్వాన్ని కలిగి ఉంది. ఇరవై ఒకటో రాజవంశ కాలం నాటికి, ఈ థేబ్స్ పీఠానికి ప్రధానార్చకులైనవారు రాజ్యాధి కారం కోసం వ్యవహరించేవారు.

పద్దెనిమిదో రాజవంశానికి చెందిన అఖ్మోజ్ నెఫర్టిరే (Akhmoj Nephertire) రాణి, రెండో ప్రధానార్చక పదవిని నిర్వహించింది. ఆమె ఆ పదవిని నిర్వహించడానికి ఇంకెవరినైనా దానిలో నియోగించడానికి, అధికారం ఉండేది. ఇరవై

ఆరో రాజవంశానికి చెందిన 'మాంటు అమ్వెట్' (Montu Amvet), థేబ్స్ దేవాలయంలో నాలుగో ప్రధానార్చకుడుగా ఉండేవాడు. ఇతడు థేబ్స్ నగరానికి నగర పాలకుడు, (మేయర్)గా కూడా వ్యవహరించాడు.

ఈ రకమైన అర్చక పదవులను ఈజిప్ట్‌లో స్త్రీలు కూడా నిర్వహించేవారు. ప్రాచీన రాజ్య (Old Kingdom) కాలంలో, 'హాథర్' (Hather) దేవతాలయ ప్రధానార్చక పదవి, స్త్రీలకే ఉండేది. గొప్ప గొప్ప రాజుల భార్యలు 'అమున్ దైవపత్నులు' అనే బిరుదును ధరించేవారు. ఫారోలలో వలెనే స్త్రీలలో (రాణులలో)కూడా అనేక మంది అర్చనలు మొదలైనవి నిర్వహించేవారు. హట్షెప్సుట్ రాణి స్వతహాగా అర్చకురాలు. ఆమె కుమార్తె 'నెఫర్టి'తాను స్వయంగా కాని, తన కుమార్తెతో కలిసిగాని, దైవ నివేదనలను, సమారాధనలను నిర్వహించేది. 'అమున్' దేవుని తొలి ప్రవక్త కుమార్తెలను 'దైవపత్ని' అని, ఇరవై ఒకటో రాజవంశ కాలంలో గౌరవించేవారు. 'టానిటె' రాజవంశస్తులు సామాన్యంగా ఆ అధికారాన్ని తమ కుమార్తెలకే ఇచ్చేవారు. అది, వారికి దక్షిణ ఈజిప్ట్ పై గల సార్వభౌమాధికారానికి గుర్తు. ఆ పదవిని చేపట్టిన రాజకుమార్తె కన్యగానే ఉండాలి.

తొలి ప్రవక్త పదవికన్న పెద్దది, 'డ్వైన్ అడరోట్రెస్ (Dwine Adarotress). అంటే, దైవాలంకారం.

తొలి ప్రవక్త తరవాత ముగ్గురు మహాప్రవక్తలు, వారి తరవాత 'చెరికెచ్' (Cherikech) అని ఒక అర్చకుడు ఉండేవాడు. ఇతడు శకునాలను వ్యాఖ్యానించడం, స్వప్నాలను వివరించడం, మంత్రాలను గురించి తెలియడం, వేర్వేరు రకాల అపర కర్మలను గురించి, వాని విషయాలను గురించి తెలుసుకోడం, ఆప్రాంతంలో వైద్యుడుగా ఉండటం వంటి విధులన్నీ నిర్వహించేవాడు.

వీరందరి తరవాత 'వబూ' (Waboo) అనే సామాన్య అర్చకులు ఉండేవారు. 'వబూ' అంటే శుచి. వీరు దేవాలయాలలో శుచిశుభ్రతల విధులను నిర్వహించేవారు. ఈ మొత్తంలో 'వబూ'లు నాలుగు గుంపులుగా విడివడేవారు. వారిలో ఒక్కొక్క గుంపుకు చెందినవారు మూడు నెలల చొప్పున దేవాలయంలో కార్యాలను, కరామత్తులను నిర్వహించేవారు. వీరు క్షౌరం చేయడం, దేవాలయ ప్రాంగణంలోని నీటి మడుగులను శుభ్రం చేయడం, దేవతామూర్తులను పూజించడం, దేవాలయంలో కూలీలుగాను, కాపలావారిగాను, పరిచారకులుగాను వ్యవహరించడం, ప్రధాన అర్చకులకు నిత్య అర్చనలు, నివేదనలలో తోడ్పడటం, యథాశక్తి దేవాలయావరణను శుభ్రపరచడం, మెరుగుపెట్టడం, రంగులు వేయడం మొదలయినవానిలో ఉపయుక్తులు అయ్యేవారు. కేవలం నైమిత్తకమయిన ఉత్సవాలలో మినహా, వీరికి నిత్యం దేవుణ్ణి చూడటానికి గాని, తాకడానికి గాని ఏరకమైన అధికారం ఉండేదికాదు.

B R A O U

### 9.2.3.1 ప్రేతాత్మల దేవాలయాలు

నగరాలలో గల పై దేవాలయ వ్యవస్థకు సమాంతరంగా అభివృద్ధి పొందినవి, ప్రేతాత్మల ఆలయాలు. సమాధులపైన, పిరమిడ్లపైన, అలంకారప్రాయంగా రూపొందిన గూళ్ళ (Niche)వంటివి, క్రమంగా వేర్వేరు దేవాలయాలుగా రూపొందాయి. అక్కడి పూజారులను 'హెమూకా' అనేవారు. అంటే 'కా' సేవకులని అర్థం. 'కా' అంటే ప్రేతాత్మ. కొన్ని కొన్ని ప్రేతాత్మల ఆలయాలకు, భూవసతుల వంటి దానం చేసిన ఆస్తులు ఉండేవి. ఈ పూజారులు వాటిని అర్చనకు ఉపయోగిస్తూ, వానిలో మిగిలిన దానిని తమ భృతిగా స్వీకరించేవారు.

### 9.2.3.2 వ్యక్తి పూజ

వీరి మతాచారాలలోను, వ్యవస్థలలోను ఇంకొక ముఖ్యమయిన అంశం, వ్యక్తి పూజ. ఈరకమైన వ్యక్తి పూజ భగవదవతారంగా భావించబడిన ఫారో నుండి అన్ని వర్గాలలోను ప్రశస్తమయిన వారిని కూడా పూజించడంలో అభివ్యక్తమవుతున్నది.

మొదటి అమెన్‌హోటెప్ (Amenhotep), అతని తల్లి అయిన అహ్మోస్ నెఫర్టరి (Ahmos Nepherteri), ఇద్దరూ డయిర్ అల్‌మెదీన్ (Diur Almedine) ప్రాంతంలోని శ్రామిక వర్గాల చేత్నఆప్రాంతంలో ఉన్నతమైన దాతలుగాను, దానసత్వం గల ఋషులుగాను, అనేక శతాబ్దాలపాటు పూజింపబడ్డారు. సకారావద్ద జోసర్ కోసం కట్టిన స్టెప్ పిరమిడ్ (Step Pyramid) నిర్మాత అయిన ఇమ్హొటెప్ (Imhotep) భగవదవతారంగా భావించబడి, ఋషిగా గౌరవించబడి, రెండు శతాబ్దాలపాటు పూజింపబడ్డాడు. ఇమ్హొటెప్‌నే గ్రీక్ దేవుడైన 'అస్క్లేపయస్' (Askleypayas) తో, సమన్వయపరచడం కూడా జరిగింది. అదేవిధంగా, హపు కుమారుడైన 'అమెన్‌హోటెప్' అనేవాస్తువేత్త ఋషిగా భావించబడి, కొలవబడ్డాడు.

### 9.2.3.3 జంతువుల ఆరాధన

ఈజిప్ట్ మతాచారాలలో ఇంకొక ప్రశస్తమైన అంశం, జంతువుల ఆరాధన (Zoomorphic Cults). వేర్వేరు జంతువులను, వేర్వేరు దేవతలకు సంకేతాలుగా భావించి, పూజించడం జరిగింది. 'ఫాల్కన్' (గరుడ) పక్షిని 'హోరస్' సంకేతంగా భావించారు. ఆవును హాథర్ (Hather) దేవతకు గుర్తుగా భావించారు. చక్రంతో ఉన్న 'ఫాల్కన్' పక్షిని 'రే'కు సంకేతంగా భావించారు. గుంటనక్కను 'అనుబిస్' (Anubis) కి సంకేతంగాను, మొసలిని 'సోబెక్' (Sobech) కు సంకేతంగాను, పొట్టేలును 'అమున్‌రే'కు సంకేతంగాను భావించి, పూజించారు. 'ఎడ్జో'లో నాగుపాము (Cobra), 'నెఖ్బెత్'లో రాబందు, ఎగువ, దిగువ ఈజిప్ట్‌లలో రాజుల రక్షకులుగా భావించబడినారు. 'అపోఫిస్' అనే పామును గొప్ప రాక్షసిగా, 'రే', 'హోరస్'లకు అడ్డువచ్చేదిగా గుర్తించారు. కొన్నికొన్ని జాతరలలో అర్చకులు జంతు వేషం తోనే ఆరాధనలు, నివేదనలు చేయవలసి వచ్చేది.

### 9.2.3.4. గారడీ, ఇత్యాదులు

ఈజిప్ట్ మతాచారాలలో గారడీ (magic) ఎంతో పేరు పొందింది. వేకువ యాత్ర (Book of Going Forth by Day) అనే ఆధారం, గారడీలోని వివిధ విషయాలను గురించి, మంత్రాలను గురించి చెబుతున్నది. అభిశంసన మంత్రాలు (Execration Texts) కండ బలం చాలనప్పుడు శత్రువులను ఓడించడంలో తోడ్పడేవి.

ఇన్ని రకాలయిన మత వ్యవస్థ లోని మతాచారాలు, ఈజిప్ట్‌లోని వివిధ దేవతలను గురించి, పౌరాణిక సంప్రదాయాలను గురించి తెలియడానికి, అవకాశాన్ని కలిగిస్తున్నాయి.

### 9.2.4. పౌరాణిక సంప్రదాయాలు : దేవుళ్ళు, దేవతలు

ఈజిప్ట్ మత వ్యవస్థలో పూజార్హులయిన దేవుళ్ళను, దేవతలను వారివారి ఆవిర్భావ ప్రాంతాల ననుసరించి, ప్రాముఖ్యాల ననుసరించి, మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. మొదటి తరహాలో ప్రాంతీయ దేవతలని, జాతీయ దేవతలని, ఇతర ప్రాంతాల నుండి స్వీకరించిన వారని మూడు రకాలుగా చూడవచ్చు. ఈజిప్ట్ సంవిలీనీకరణకు ముందుగల 'నోమ్స్' (Nomes) లోని దేవతలను ప్రాంతీయ దేవతలుగాను, సంవిలినీకరణ తరవాత ప్రభువులయిన 'ఫారో'ల భక్తిప్రపత్తులను పొందిన దేవతలను జాతీయ దేవతలని, సామ్రాజ్యం ఏర్పడిన తరవాత ఈజిప్ట్‌వాసులపై ప్రభావం చూపిన దేవతలను ఇతర ప్రాంతాల నుండి స్వీకరించిన వారని గ్రహించవచ్చు. ప్రాముఖ్యం దృష్ట్యా, ప్రాంతీయ దేవతలను, జాతీయ దేవతలను మాత్రం ముఖ్యులుగా గ్రహించవచ్చు. రిషెట్ (Rishet), కదేష్ (Kadesh), అనత్ (Anat), అస్టార్ట్ (Astart) మొదలైన దేవతల ఆరాధనా సంప్రదాయాలను ఈజిప్ట్ దేశస్థులు పశ్చిమాసియా నుండి స్వీకరించి, అనుసరించారు. వీరికి గల ప్రాచుర్యంగాని, సంస్థలుగాని, చాలా పరిమితమైనవి.

BRAOU

ఈజిప్ట్ చరిత్రలో 'హోరస్', 'రే', 'అమున్‌రే','అటుమ్' మొదలయినవారు, వివిధ కాలాలలో జాతీయ దేవతలుగా గుర్తించబడ్డారు. ఈ రకమైన జాతీయ దేవతలందఱూ ప్రాంతీయత కలిగినవారే. మెంఫిస్, హీలియోపోలిస్, హెరాక్లియోపోలిస్, హెర్మోపోలిస్‌మాగ్నా, లక్సర్, థేబ్స్, ఎడ్ఫు మొదలయినవన్నీ, ప్రాంతీయ మత కేంద్రాలు. ఇవన్నీ కూడా ప్రధానంగా సూర్యుణ్ణి (హోరస్/రే), చంద్రుణ్ణి (అథోథ్) పూజించాయి. నైల్ నదీ స్తోత్రం, 'అమున్‌రే' స్తోత్రం వంటి ఆధారాలు, ఈ రకాలయిన ప్రజలలో అభివ్యక్తమవుతున్న ప్రాంతీయ, జాతీయ భావనలను కలిగినవి.

హీలియోపోలిస్‌లో హోరస్ గొప్ప దేవుడుగా చెప్పబడ్డాడు. కార్నక్‌లోను, థేబ్స్‌లోను అమున్, అమున్‌రే గొప్పవారుగా చెప్పబడ్డారు. హెర్మోపోలిస్‌లో 'ప్తా' గొప్పవాడని చెప్పబడటం గమనించగలం.

ఈ ఉదాహరణలలో 'హోరస్' ఉత్తర ప్రాంతంలోను, 'ప్తా' మధ్యప్రాంతంలోను, 'అమున్' దిగువ ప్రాంతంలోను, జాతీయస్థాయి కెదిగిన ప్రాంతీయ దేవతలు.

హెర్మోపోలిస్ ఆధారాల ప్రకారం, యీ దేవుళ్ళ వంశ వృక్షం ఈ విధంగా ఉంది.

జల ప్రళయం (Chaos) గ్రుడ్డు
|
గ్రుడ్డు
|
ప్తా (దేవత సెఖ్మెట్)
|
రే (దేవత) హాథర్

ఒసిరిస్‌లో ఇసిస్ — సేత్ (Seth)
|
హోరస్
|
ఇమెస్టి — హపి — డ్వాముటెఫ్ — ఖబెక్సెన్వెఫ్

హీలియోపోలిస్ ఆధారాలలో దీనికే కొంత సవరణ, లేదా వ్యతిరేకత కనపడింది.

హోరస్ లో హాథర్
|
ఐ (Ihy)

అదే ఆధారాలలో :

ప్తాలో హాథర్
|
హోరస్

అని కూడా చెప్పబడింది. కాని, దక్షిణాది సంప్రదాయాల ప్రకారం :

ఒసిరిస్
|
హోరిస్ (రూపం ఫాల్కన్)

అని చెప్పబడింది. పైన, అంటే హెర్మోపోలిస్ ఆధారాలలో, పేర్కొనబడిన 'హోరస్' కుమారులందరూ రక్షక దేవతలుగా గుర్తించబడ్డారు. లియోనార్డ్. హెచ్. లెస్కో (Leonard. H. Lesko) ప్రకారం, పైన గల వివిధ దేవాలయాల పౌరాణిక సంప్రదాయాలలో గల అన్యూహమైన ఈ భేదం, ముందరి రోజులలోని వేర్వేరు ప్రాంతీయ సంప్రదాయాలకు ప్రతీకలవడంగాని, లేదా తర్వాతి సంవిలీనీకరణంలోగాని వచ్చింది.



BRAOU

ఈజిప్ట్ మత వ్యవస్థ మొత్తాన్ని సమాలోకనం చేసినట్లయితే, ఈ క్రింది అంశాలను ఎరి...

1. ఈజిప్ట్‌లోని వివిధ ప్రాంతాలు సంవిలీనీకరణకు ముందు, తర్వాత, తమ ప్రతిపత్తిని 'నోమార్క్'ల ద్వారా నిలబెట్టుకొని, దానిని తమ గ్రామాల, నగరాల దేవతల ద్వారా వ్యక్తం చేశాయి.

2. ఎగువ, దిగువ ఈజిప్ట్‌లను సంవిలీనీకరించనప్పటికి, దక్షిణ ప్రాంతపు ప్రభావంవల్ల ఆయాదేవతా సంప్రదాయాలలో స్థిరత్వం ఏర్పడలేదు.

3. మధ్య ఈజిప్ట్‌లోని హెర్మాపోలిస్‌లోని సంప్రదాయాలయిన జల ప్రళయం, ప్రా ఔన్నత్యం మొదలయిన వాటిని, 'రే' లేదా 'హోరస్' అని అంతవరకు జాతీయ దేవుని కన్న మిన్నగా గుర్తించారు.

4. ఫారోలు తమ మత బద్ధమయిన రాజకీయ విధానంలో, ఈ సంప్రదాయాలను ఈజిప్ట్ దేశమంతా ప్రచారం చేశారు.

5. అఖ్నేటన్ కాలంలోను, తరవాత హట్షెప్సుట్‌రాణి కాలంలోను, 'అటన్' మినహా, వేరే దేవుడు లేడని నమ్మేవారు.

6. కాని, హట్షెప్సుట్‌రాణి పాలనలో వచ్చిన ప్రధానమైన మార్పు 'రే'కి ప్రాముఖ్యమివ్వడం; ఆమె సిద్ధాంతాలలో మార్పుకై ఒత్తిడిని తేవడం. వివిధ పురాణాలలోను, స్థానిక దేవతా చరిత్రలలోను ఇన్ని మార్పులు రావడం, మత విషయాలను ఫారోలు తమ వ్యక్తిగతమైన అంశాలుగా గుర్తించి, అనుసరించడం వల్లనే. ఫారోల ఎడతెగని అజమాయిషీ ఉండటం వల్ల, ఈజిప్ట్‌లో ప్రచ్ఛన్నమైన మతప్రమేయ రాజ్యవ్యవస్థ (Theocracy) నెలకొన్నట్లుగా గ్రహించొచ్చు.

### 9.2.5. ఉత్సవాలు : పండుగలు

ఈజిప్ట్ మత వ్యవస్థలో ఈ క్రింది ప్రధానమైన ఉత్సవాలను, పండుగలను చూడగలం.

1. నోటిని తెరిచే ఆరాధన - (Ritual of opening of the Mouth) : ఇది పిరమిడ్లలోగాని, సమాధులలోనగాని గల వివిధ ప్రేతాత్మ(కా)లను, స్వర్గద్వారం వైపు పంపే సమయంలో చేసే అరాధన. ఇది సాధారణంగా 'హెముకా' లచే నిర్వర్తించబడుతుంది.

2. 'ఓపెట్' సమారాధన - (Feast of opet) : కార్నక్‌లో జరిగే ఈ ఉత్సవంలో 'అమున్-రే' ప్రతిమను దేవాలయం నుండి తొలగించి, పూజారులచే మోయబడే పల్లకీ వంటి దానిలో చేర్చి, నదిపై రెండుమైళ్ళు ఊరేగించి, 'లక్సర్' లోని దేవాలయానికి చేర్చేవారు.

3. 'సుందర సమారాధన' (Beautiful Feast) : ఇదికూడా కార్నక్ లోనే జరుగుతుంది. 'అమున్‌రే'ను పశ్చిమ థేబ్స్ వరకు ఊరేగిస్తారు.

## 9.3. తత్త్వ వివేచన

ఈజిప్ట్‌లో తత్త్వ వివేచన కొన్ని మత పీఠాల ద్వారా, ప్రాంతీయ నమ్మకాలుగా ప్రారంభమైంది. ఈ వ్యవస్థ నవీన రాజ్య కాలంలో బాగా పెంపొందింది.

### 9.3.1. ప్రాంతీయమైన నమ్మకాలు

ఈజిప్ట్ దేశపు మత వ్యవస్థలో ప్రాంతీయమైన నమ్మకాల పాత్ర గొప్పది. థేబ్స్ మొదలుగాగల దక్షిణ ఈజిప్ట్‌లోని క్షేత్రాలలో ప్రధానార్చకుని పదవిని వారసత్వంగా ఏర్పరచడం, 'డ్వైన్‌అడోర్టైస్' మొదలయిన విశేషమయిన పదవులను ఏర్పరచడం, ఆయా మతకేంద్రాలకు మతేతరమైన రాజకీయ ప్రాముఖ్యాన్ని కలిగించాయి. దాని వల్లనే గాక, ఈజిప్ట్ రాజకీయ (పాలనా) వ్యవస్థలోగల 'నోమ్'ల ప్రాబల్యం, నగరాలలోని రాజకీయాలకు మతాల ముసుగును కప్పింది. హెర్మాపొలిస్‌లోని పరిణామాలు అటువంటి వాటికి ఒక గొప్ప ఉదాహరణ. అదేవిధంగా, అఖ్నేటన్, హట్షెప్సుట్‌రాణి మొదలైన వారికాలాల్లో జరిగిన పరిణామాలు, ఏ మాత్రం నవీనీకరణను అంగీకరించని వివిధ ప్రాంతీయ మత పీఠాల ఔద్ధత్యానికి సూచికలు. అందువల్లనే, ఈజిప్ట్‌లో ఫారోలు కేంద్రీకరణను జరిపినా, వివిధ ప్రాంతీయమైన నమ్మకాలు ప్రచ్ఛన్నంగా బలపడి, ఫారో ఔన్నత్యాన్ని తగ్గించి, అతనిని కేవలం మనిషిగా మార్చాయి.

### 9.3.2. తులనాత్మక పరిశీలన

ఈజిప్ట్‌లోని మత వ్యవస్థను మెసపటోమియా నాగరికతలోని మత వ్యవస్థతో పోల్చి చూసినట్లయితే, కొంత సమానత్వం కనిపిస్తుంది. అది, ప్రధానంగా సూర్యారాధన. 'ప్తా', 'రే', 'హోరస్' మొదలయిన పేర్లతో ఈజిప్షియన్లు పిలిచిన సూర్యుణ్ణే, ప్రధాన దైవంగా మెసపటోమియా ప్రజలు కూడా పూజించారు. కాని, సింధు నాగరికతలో ఉన్నట్లు, 'పశుపతి' ఆరాధన, 'అమ్మ పూజ' (Fertility cult) వంటివి ఈజిప్ట్‌లో లేవు. నైల్ నదీ పూజలో కొంతవరకు 'అమ్మ పూజ'ను గమనించొచ్చు.

BRAOU

## 9.4 సంగ్రహంగా

1. ఎగువ, దిగువ, దక్షిణ ఈజిప్ట్‌లలో గల మత వ్యవస్థ, మెంఫిస్, హీలియోపొలిస్, హెరాక్లియోపొలిస్, హెర్మోపొలిస్, లక్సర్, కార్నక్, థేబ్స్ వంటి వివిధ ప్రాంతీయ మత పీఠాలను సువిలీనీకరించడం ద్వారా ఏర్పడింది.
2. 'ప్తా', 'రే', 'హోరస్', 'అమున్‌రే' మొదలయిన పేర్లతో, ఈజిప్ట్‌లోని ఉన్నతమైన దేవుడు సూచించబడ్డాడు.
3. ఈ వ్యవస్థలోగల జంతువుల ఆరాధనా సంప్రదాయాలు పూర్తిగా సమగ్రమయినవని చెప్పడానికి అవకాశం లేదు. కాని, ఎంతో ప్రధానమైనవి.
4. హెర్మాపొలిస్ పట్టణంలో విశ్వ ఆవిర్భావాన్ని గురించి చేసిన సిద్ధాంతపరమయిన ప్రతిపాదనలు, ఎక్కువ కాలం ఈజిప్ట్‌లో ఎక్కువ భాగాల్లో అంగీకారాన్ని, గౌరవాన్ని పొందాయి.
5. నైల్ స్తోత్రం, అమున్ స్తోత్రం వంటివి, ఈజిప్షియన్‌లలో గల భక్తి (డ్యోన్ - Duan)ని; దాస్యప్రవృత్తి (సెన్సు Sensu)ని సూచిస్తున్నాయి.

6. మత వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ పరస్పరపోషకాలుగా అభివృద్ధి చెంది, కాలానుగుణమైన పరిణామాలను పొందాయి.

7. మత వ్యవస్థలోని దేవాలయాలు గొప్ప భూవసతులు కలిగి, ఫారోలు ఏర్పరచిన కేంద్రీకృత వ్యవస్థకు ఇంకొక ప్రతీకగాగాని, మాతృకగాగాని వ్యవహరించాయి.

8. ఈ మత వ్యవస్థ ప్రకృతితో సంబంధానికి గొప్పగుర్తు.

## 9.5. పరీక్ష నమూనా ప్రశ్నలు

**I.** క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. ఈజిప్ట్ మత వ్యవస్థ ప్రధాన లక్షణాలను వివరించండి.
2. ఈజిప్ట్ మత వ్యవస్థ గురించి తెలుసుకోడానికి గల ప్రధానాధారాలను పరిశీలించండి.
3. ఈజిప్షియన్‌ల పౌరాణిక సాంప్రదాయాలను వర్ణించండి.

**II.** క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.

1. మత వ్యవస్థలో ఫారోల పాత్ర
2. ప్రాంతీయమైన నమ్మకాలు
3. ఈజిప్ట్ పౌరాణిక వృత్తాంతాలు

## 9.6. ఉపయుక్త గ్రంథాలు


1. **Encyclopaedia Britannica** : Vol. 8; PP. 27-91
2. Leonard. H. Lesko (ed) : **Encyclopaedia of World Religion :Vol.5 Overview of Egyptian Religion**
3. Henmen Schiender : **History of World Civilisation** (London, 1931)
4. Hutchinson : **Ancient Races**
5. Korovkynk : **History of the Ancient World** (Moscow, 1987)
6. Pramathanath Bose : **Epochs of Civilisation** (New Delhi, 1978)
7. Weesh W. H (ed) : **History of the World**


## 9.7. పదకోశం

'ప్తా' : హెర్మోపొలిస్ ఉన్నతమైన సంప్రదాయ దేవుడు.

'అటుం' : ఇది 'ప్తా'కు ఇంకొక పేరు.

'రే' : సూర్యునికి పేరు.

'బయా' : ఆకాశం.

'బయట్' : ఆకాశం నుంచి పడ్డ ముక్కలు.

'హాథర్' : 'హోరస్' తల్లి; 'రే'కు భార్య.

'షు' : గాలి.

'టెఫ్నట్' : తేమ.

'గెబ్' : భూమి.

'నట్' : మేఘాలతో కూడిన ఆకాశం.

'థాత్' : చంద్రుడు.

'సెఖ్మెట్' : 'ప్తా'కు భార్య.

'నెఫర్టెమ్' : పద్మంలో జన్మించిన 'ప్తా' కుమారుడు.

'ఫాల్కన్' : గరుడ పక్షి; 'హోరస్'కు సంకేతం.

'కా' : ప్రేతాత్మ.

'హెముకా' : ప్రేతాత్మల పూజారి.

'హెంనెట్జర్' : అర్చకుల బిరుదు; దేవదాసుడు.

'డ్వైన్ అదరోట్రెన్' : దైవాలంకారం, ప్రధానార్చకునికన్న పెద్ద పదవి.

'చెరీకెట్' : జోస్యుని వంటి పూజారి.

'వబూ' : సామాన్య అర్చకుడు.

'అసోఫిస్' : పాము, గొప్పరాక్షసి.

'సేత్' : ఒసిరిస్ తమ్ముడు; 'హోరస్' పిన తండ్రి.

'ఐ' : 'హోరస్'కు 'హాథర్'కు జన్మించిన సూర్యుని విశేషం.

'ఓపెట్ సమారాధన' : కార్నక్ నుండి లక్సర్ వరకు జరిగే యాత్రోత్సవం.

'సుందర సమారాధన' : కార్నక్ నుండి పశ్చిమ థేబ్స్ వరకు జరిగే ఉత్సవం.

BRAOU

# భాగం-10 : కళలు - వాస్తువు

విషయక్రమం


10.0 లక్ష్యాలు

10.1 పరిచయం

10.2 కళలు - వాస్తువు

10.2.1 ఈజిప్ట్ కళా పరిణామం

10.2.1.1 నైల్ లోయలో కళా పరిణామం

10.2.2 పిరమిడ్లు - ప్రేతాత్మల దేవాలయాలు

10.2.3 భవనాలు, దేవాలయాలు

10.2.3.1 వాస్తు శిల్పులు

10.2.4 చిత్రలేఖనం, శిల్పం

10.2.4.1 ప్రాచీన రాజ్య కాలంలో చిత్రలేఖనా పద్ధతులు

10.2.4.2 మధ్య రాజ్య కాలంలో చిత్రలేఖనం

10.2.4.3 నవీన రాజ్య కాలంలో చిత్రలేఖనం

10.2.4.3.1 నవీన రాజ్య కాలంలో వ్యక్తి చిత్రాలు

10.2.5 ఉప కళలు

10.3 సంగ్రహంగా

10.4 పరీక్ష నమూనా ప్రశ్నలు

10.5 ఉపయుక్త గ్రంథాలు

10.6 పదకోశం

అనుబంధం


BRAOU

## 10.0 లక్ష్యాలు

1. శిలా యుగ కాలం నుండి ఈజిప్ట్‌లో కళల పరిణామాన్ని సమీక్షించడం.
2. పిరమిడ్లు, ప్రేతాత్మల దేవాలయాలు అనే స్మారక భవనాలను గురించి తెలుసుకోడం.
3. భవనాలు, దేవాలయాల నిర్మాణ క్రమాన్ని గురించి వివరించడం.
4. వర్ణ చిత్రాలతో సహా, చిత్రలేఖన సంప్రదాయాన్ని గ్రహించడం.
5. సామాన్యమైన కళల, లేదా ఉపకళల (minor arts) పరిణామ క్రమాన్ని అవగాహన చేసుకోడం.,

## 10.1 పరిచయం

ఈజిప్ట్‌లో ఉండే కళలు, వాస్తు సంప్రదాయాలు ప్రాచీన ప్రపంచంలో ఇంచుమించు మొదటివిగాను, మానవ జాతి విజయాలలో అతి ప్రధానమైనవిగాను, పురావస్తువేత్తలు, చరిత్రకారులు గుర్తించారు. ఈజిప్ట్‌లోని కళల ప్రాముఖ్యం, రెండు విధాలుగా తెలుస్తున్నది. మొదటిది, పిరమిడ్ల వంటి అవశేషాలుగా మిగిలిన వాని కీర్తిప్రతిష్ఠల వలన. రెండోది, దానిలో (ఆ కళలో) గల ఊహ, చాతుర్యం, కళా సృష్టిలో అంతర్భూతమైన ఉన్నతత్వం, కళలను వ్యక్తపరిచిన మాధ్యమాల స్వభావం, దానిని ఎన్నుకొన్న రీతి, అనే అంశాల వలన. ఈ కళా ప్రగతి ఇచ్చట గల ప్రకృతి సహజమైన పరిస్థితుల మీద ఆధారపడి ఉంది. అన్నివైపులా ఎడారి వల్ల రక్షణ ఉన్న సన్నని పొడుగైన నైల్ నదీ లోయ, స్వయంపోషకత్వం గల భౌగోళిక భాగంగాను, సాంస్కృతిక క్షేత్రంగాను పరిణమించింది. శిలా యుగం నుండి క్రీ.పూ. నాల్గవ శతాబ్దంలో గ్రీక్ రాజయిన అలెగ్జాండర్ ఈజిప్ట్ మీద దండయాత్ర చేసేవరకు, ఈజిప్షియన్ కళలలో వచ్చిన అభివృద్ధి, ప్రతిస్పందనలు, పతనం వంటి ప్రధానమయిన దశలన్నీ, ఆ లోయలోను, దేశంలోను గల నియతిని చూపిస్తున్నాయి. ఇంచుమించు మూడు వేల సంవత్సరాలపాటు వివిధ దశలలో పరిణమించిన ఆ కళాభివృద్ధి, ఈజిప్షియన్ సమాజంలో గల సంప్రదాయ బద్ధత ఫలితమే. కాని, ఎన్నో కళాఖండాలకు కర్తలెవ్వరో తెలియదు. ఈజిప్షియన్ కళలో కొన్ని వైయక్తికమయిన (ఒక్కొక్క వ్యక్తి ప్రతిపాదించి, పెంపొందించిన) శైలులను గాని, అభిరుచులనుగాని, పరిశీలన ద్వారా తెలుసుకోవచ్చు. కాని, ఆ పరిశీలన మొత్తం కర్తలెవరో నిర్ణయించడానికి వీలుకాని ఈజిప్ట్ కళాపీఠికలోని ఒక భాగం మాత్రమే. ఈజిప్ట్‌లో కళల అభివృద్ధికి మూడు అంశాలు ప్రధానంగా దోహదం చేశాయి. అవి: 1. భగవత్స్వరూపుడుగా భావించబడిన 'ఫారో'ల పాలన; 2. మరణానంతర జన్మ అనే నమ్మకంతో అభివృద్ధి పొందిన వైవిధ్యం గల అపరకర్మ సంప్రదాయాలు; 3. అనంతర జన్మకు కావలసిన అనేకాంశాలను ఈ జన్మలోనే ఏర్పాటు చేసుకోవాలి అనే నమ్మకం. ఈజిప్ట్ నాగరికతలో నవీన రాజ్య కాలంలో విదేశీ సంప్రదాయాల ప్రభావం ముమ్మరంగా వ్యాపించిన తరవాత మాత్రమే, ఈజిప్ట్‌లోని కళ దాని సంప్రదాయబద్ధతను పూర్తిగా కోల్పోయింది.

## 10.2 కళలు - వాస్తువు

ఈజిప్ట్‌లో కళలు, వాస్తువు ప్రధానంగా నైల్ లోయలో పెంపొందాయి. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన పిరమిడ్లు,ఈజిప్ట్‌లోని కళా విభవానికి ప్రతీకలు. వీరి వర్ణ చిత్రాలు, చిత్ర లిపి కూడా వారి కళల్లోని ఒక ప్రత్యేకతను సూచిస్తున్నాయి. వ్యక్తి చిత్రాలను రాయడం, అనంతర ఈజిప్ట్ చరిత్రలో ఒక ముఖ్యమైన పరిణామం.

## 10.2.1 ఈజిప్ట్‌లో కళా పరిణామం

క్రీ.పూ. 3000 నాటికి ఈజిప్ట్‌లో చిత్ర లిపి అభివృద్ధి పొందడం ఆరంభమైంది. ఈ రకమైన చిత్ర లిపి ఒక తర్కబద్ధమైన స్వరూపానికి, క్రమబద్ధమైన అమలు జరిపే విధానానికి, చిత్రీకరణ సంప్రదాయానికి స్ఫూర్తినిచ్చింది. ఎగువ, దిగువ ఈజిప్ట్ ప్రాంతాలను ఒకటిగా చేసి పరిపాలన చేసిన ఒకటి, రెండు రాజవంశాల ఫారోల కాలంలోని సంఘర్షణా ఫలితాలలో, ఈ రకమైన చిత్ర లిపికి, దానిననుసరించి అభివృద్ధి పొందిన కళా పరిణామానికి గల తర్కబద్ధమైన కారణాలను చూడగలం. ప్రాక్చారిత్రకయుగం (Pre-historic period) నుండి నైల్ సంప్రదాయంగా అభివృద్ధి పొందిన కళారీతులే, చారిత్రక యుగంలో కళా ప్రగతికి ఎంతో బలమయిన భూమికగా వ్యవహరించాయి.

అతి ప్రాచీనమైన కళావిశేషాలను మనం ఎగువ ఈజిప్ట్‌లోని శిలా కళ (Rock art) లో చూడగలం. ఉత్తర ఆఫ్రికాలో హిమ యుగం చివరి కాలం నుండి అభివృద్ధి పొందిన ఈ కళలోని అంశాలను, ప్రధానంగా వేర్వేరు పర్వత శిఖరాలమీద చిత్రితమైన చిత్రాలలో మనం చూడగలం. పశ్చిమ ఆఫ్రికా నుండి ఈజిప్ట్‌లోకి ప్రవేశించిన ఈ రకమైన కళా సంప్రదాయం, ఎల్ డఖ్లా (El Dakhla), ఎల్ ఖర్గా (El Kharga) ఒయాసిస్సుల పర్యంతం, ఎగువ ఈజిప్ట్, నుబియాలకు చెందిన నైల్ లోయ పర్యంతం, వ్యాప్తి చెందింది. ఈ రకమైన సంప్రదాయంలో, రాతి మీద రంగులతో చిత్రితమైన బొమ్మలను, రాతిలోనికి బరికి (scratch)కాని, చెక్కి (sculpted) కాని, చూపిన ఉదాహరణలను చూడగలం. అటువంటివానిలో ఏనుగు, జిరాఫీ, సిల్హౌట్ (Silhoutte) వంటివి కొన్నింటిని బరికి చిత్రించిన బొమ్మలు, ఇంచుమించు అరుదయినవి. తొలి బొమ్మలలో నీటి గుర్రం (Hippopotamus) కూడా ఒకటి. ఈ రకమైన బొమ్మలలో, చాలా తర్వాతి కాలంలోగాని, నావలు, నౌకలు చోటుచేసుకోలేదు. ఈ బొమ్మలలోని నావలను పోలిన వాటిని, అమ్రేషియా, నఖ్దా సంప్రదాయాలలోని కుండల మీద గల రంగుల బొమ్మలలో ఉన్నట్లు, వివిధ ఉదాహరణలను పురావస్తు శాస్త్రవేత్తలు చూపారు. ఈ రకంగా కొండల మీద గల చిత్రాల సంప్రదాయం, ఎగువ ఈజిప్ట్‌లోని నైల్ లోయ నుండి ఉత్తరంగా వాడి మహమ్మద్ వద్దగల నైల్ మలుపు వరకు, తూర్పు, పడమరలుగా వ్యాపించింది.

### 10.2.1.1 నైల్ లోయలో కళా పరిణామం

దిగువ ఈజిప్ట్‌లోను, ఎగువ ఈజిప్ట్‌లో గల ఫయూం (Fayum) ఒయాసిస్సుల సమీప ప్రదేశంలోను, ఒకేసారిగా కొందరు స్థిరనివాసాలను ఏర్పరుచుకొన్నారు. ఈ నివాస స్థలాలన్నీ వరదల తాకిడి లేనిచోట, సారవంతం కాని భూములతో, ఇంచుమించు ఎడారికి సమీపంలో గల మెట్ట ప్రాంతాలలో ఏర్పడ్డాయి. ఈ రకంగా ఈజిప్ట్‌లో వ్యావసాయిక రంగంలోను, ఆర్థిక రంగంలోను సంభవించిన పరిణామాల ద్వారా, వీరిలో ఇండ్ల పట్ల, సొంపైన, ఆభరణాలు, వస్త్రాలు, పనిముట్లు మొదలయిన వాటిపట్ల, మోజు పెరిగింది. వీనిని ఉత్పత్తి చేయడం పనివారయిన కళాకారుల ద్వారా క్రమంగా జరిగింది.

అనేక శిఖరాలతో కూడి, ఇరుకయిన నైల్ నదీ ప్రవాహ ప్రాంతంలోని ఎగువ ఈజిప్ట్ ప్రజలలో, సాంప్రదాయికమైన వేట వల్ల, అభివృద్ధి పొందిన వ్యవస్థ నుండి వ్యావసాయిక వ్యవస్థను స్వీకరించడంవల్ల, అనేక పరిణామాలను చూడగలం. అక్కడి నివాస స్థలాలలో కనిపిస్తున్న నివాస స్థావరాలు, విశాలమయిన సమాధులలో కనిపిస్తున్న పాత్రలు, పనిముట్లు, ఆభరణాలు, చిన్నచిన్న బొమ్మలు, బిడారియన్ ప్రాక్‌చారిత్రక నాగరికత నుండి అమ్రేషియన్ (Amratian), నగ్దా (Nagda) నాగరికతల ద్వారా, ఎగువ దిగువ ఈజిప్ట్‌ల సంవిలీనీకరణ యుగం వరకు గల పరిణామాలకు ప్రతీకలు. దిగువ ఈజిప్ట్ మైదానానికి చెందిన బ్యూటో, సయాస్ వంటి కేంద్రాలలో తొట్టతొలి రాజవంశాలకు చెందిన వివిధ నిర్మాణాలు లభ్యమవుతున్నాయి. దిగువ ఈజిప్ట్‌లోని స్థావరాలన్నీ సువిశాలమైనవే కాక, సాంద్రతరమైన జనాభాను కూడా కలిగినట్టివి. అయినప్పటికీ, ఈ ప్రాంతంలో కళాత్మక వస్తువుల ఉనికి తక్కువగానే ఉంది.

ఈ రకమైన వైవిధ్యానికి కారణం, వివిధ ప్రాంతాలలో, అంటే ఉత్తర, దక్షిణ ఈజిప్ట్‌లలో అనుసరించిన అపరకర్మ (మరణించిన తర్వాత నిర్వహించే మతపరమైన కార్యకలాపాలు)లలోని వైవిధ్యమే. దిగువ ఈజిప్ట్‌లో మృతులను గ్రామంలోనే ఖననం చేసేవారు. కాని, ఎగువ ఈజిప్ట్‌లో మృతుల కోసం ప్రత్యేకమయిన సమాధులు మొదలయిన నిర్మాణాలను ఏర్పరిచి, వానిలో మృత శరీరాలను భద్రపరిచారు. ఈ రకమైన ఏర్పాటు ఎగువ ఈజిప్ట్‌లో అనేక రకాల కళాత్మకమయిన, కళాత్మకం కాని వస్తువులు, పనిముట్లు లభించడానికి దోహదం చేసింది. ఈజిప్ట్‌లో కళా సంప్రదాయం, అందువల్లనే, ఎగువ ఈజిప్ట్‌లో గల అవశేషాల విశ్లేషణ పైన ఎక్కువగా ఆధారపడి ఉంది.

వ్యక్తి చిత్రాల లభ్యతలోనూ, కుండలపై గల వివిధ రేఖాచిత్రాల పరిణామంలోను, క్రీ.పూ 4,000 సంవత్సరం ఆదిగా 'బడారి' మొదలయిన ప్రాంతాల నుండి ఆధారాలు లభ్యమయ్యాయి. నఖ్డా (Nakhda) సంస్కృతులలోను, గెబెలీన్ (Gebelien) ప్రాంతంలో గల కొన్ని సమాధులలోను, విశేషమయిన ఆధారాలు కన్పించాయి.

కాని, ఈజిప్ట్‌లో నైల్‌నదీ పరీవాహక ప్రదేశంలో అభివృద్ధి పొందిన నౌకాయానం, వర్తకం, ఎగువ ఈజిప్ట్, దిగువ ఈజిప్ట్‌ల సాంస్కృతిక సాన్నిహిత్యానికి, నాగరికతాపరమైన ఏకత్వానికి దోహదం చేశాయి. రాచిప్పలు మొదలయిన వివిధ రాతి పాత్రలను తొలుత కొండ ప్రాంతాలలో ప్రారంభించిన వైఖరి రాను రాను అభివృద్ధి పొంది, రాయిని ఒక ఉన్నతమయిన కళామాధ్యమం (Medium of Art)గా పెంపొందించడానికి కావలసిన అవకాశం వచ్చింది. దాని పరిణామమే, ఈజిప్ట్ నాగరికతలో పెంపొందిన శిల్ప సంపద. దీనికి మూల రూపం, వివిధ రాతి పాత్రలపై లోతుకు చెక్కడం (incision) ద్వారా అలంకరించిన వివిధ రూప ప్రతీకలు. ఈ రకమయిన ప్రతీకలలోని ఒక వైవిధ్యాన్ని, గోడలపై గల బొమ్మలలో కూడా చూడవచ్చు. కాం ఎల్ అహ్మర్ (Kam El Ahmar) అనబడుతున్న హీరాకాన్ పోలిస్ (Heirokon Polis) లోని ఒక సమాధిలో గల ఒక చిత్రం, దీనికి ఒక ఉదాహరణ. ఇటువంటి వానిలోనే, ఒక దంతపు పిడిగల కతి ఇంకొక ఉదాహరణ. ఇది గెబెల్-ఎల్-అరక్ (Gebel el Arak) వద్ద దొరికింది.

పై అంశాల దృష్ట్యా, నైల్ లోయలో ప్రారంభమైన కళా పరిణామం, తొలి దశలో ఎగువ ఈజిప్ట్‌లో అంకురించి, దిగువ ఈజిప్ట్‌లోనికి వ్యాప్తి చెందినదని వ్యాఖ్యానించవచ్చు.

### 10.2.2 పిరమిడ్లు - ప్రేతాత్మల దేవాలయాలు

ఇంచుమించు క్రీ.పూ. 2780 నుండి 2260 వరకు గల కాలాన్ని 'పిరమిడ్ల యుగం' అని వ్యవహరిస్తారు. ఈ కాలంలో ఈజిప్టులోని 3, 4 రాజవంశాలు పరిపాలన చేశాయి. మూడవ రాజవంశ స్థాపకుడు జోసర్ (Zoser). ఇతడు మెంఫిస్ నగరాన్ని రాజధానిగా చేసుకొని పరిపాలన చేశాడు.

పిరమిడ్లు ఒక్కసారిగా జోసర్ కాలం నుండి నిర్మింపబడలేదు. అంతకు ముందు థైనైటు (Thinite) యుగం (క్రీ.పూ. 3000-2780) లోనే, అక్కడక్కడ ఉదాహరణలు లభ్యమయ్యాయి. అవి అబిడాస్ వద్ద, మెంఫిస్ వద్ద దొరికాయి. ఈ రకమయిన పిరమిడ్లలో 'స్టెప్ పిరమిడ్' (Step Pyramid) అతి ప్రధానమైంది. దానిని జోసర్ కాలంలో నిర్మించారు. ఈ నిర్మాణం 'ఇమ్హొటెప్' (Imhotep) అనే శిల్పి ఆధ్వర్యంలో జరిగింది. ఇది మెంఫిస్ (Memphis) సమీపంలోని సకారా వద్ద ఉంది. ఇది ఇంచుమించు రెండు వందల అడుగుల ఎత్తయినది. ఎగువ ఈజిప్ట్‌లోని మస్తాబా (Mastaba) అనే శిలానిర్మితమయిన నిర్మాణంలోని వికాసమే, స్టెప్ పిరమిడ్‌గా పర్యవసించింది. ఈ నిర్మాణానికి దక్షిణపు గోడనానుకొని ఒక ప్రేతాత్మ దేవాలయం బల్లపరుపు (Flat) కప్పును, వివిధ రకాల గూళ్ళు (Niches) అలంకారంగా గల ముఖమండపాన్ని కలిగిఉన్నది. ఇది దిగువ ఈజిప్ట్‌లోని మెంఫిస్‌లో అనుసరించిన వివిధ నిర్మాణాల సూత్రం ప్రకారం నిర్మితమయింది. ఈ దేవాలయ వైశాల్యం 600 × 300, అంటే 1,80,000 చదరపు అడుగులు. దాని గోడలు తెల్లని సున్నపురాతితో కట్టబడి, 30 అడుగుల ఎత్తయినవి. ఈ దేవాలయంలో 'హెబ్-సెడ్' పండుగ నిర్వహించడానికి అనువుగా, విశాలమయిన పూజా మందిరం, ప్రవేశపు చావడి, పరిపాలన కోసం, నివాసం



BRAOU

కొసం వేర్వేరు నిర్మాణాలు ఉన్నాయి. ఇవన్నీ మెంఫిస్‌లోని యథార్థమయిన రాజ భవనానికి ప్రతీకలే. ఈ పిరమిడ్‌లోని దేవాలయంలో వివిధ వ్యక్తుల విగ్రహాలను చూడగలం. ఉదాహరణకు, జోసర్ ప్రభువు నిలువెత్తు విగ్రహం ఒకటి, అతని నివాసపు నిర్మాణానికి, సమీపంలో గల 'సెర్దబ్' (Serdab) అనే ఒక ప్రత్యేకమైన గదిలో ఉంచబడింది.

మూడో రాజవంశ కాలం నుండి నాలుగో రాజ వంశ కాలానికి జరిగిన పరిణామంలో 'ప్రేతాత్మల ఆలయాలు', అనే నివాసాల కట్టడంలో చాలా మార్పు సంభవించింది. అది ఒక ఫారో మరణం తరవాత మరు జన్మలలో ఉపయోగించబడే గృహంగానో, లేదా దేవాలయంగానో భావించడం తగ్గింది. దాని పరిణామాలనే 'మెడుం' (Medum) వద్ద గల చతురస్రపు ప్లాన్‌పై కట్టిన 'స్టెప్ పిరమిడ్' (Step Pyramid) లోను, 'దహ్షూర్' (Dahshur) వద్ద స్నెఫ్రు (Snefru) కోసం కట్టిన 'బెంట్ పిరమిడ్' (Bent Pyramid)లోను, చిట్టచివరిగా స్ఫటికం వంటి స్వభావమున్న పిరమిడ్‌లను నిర్మించడంలోను, జరిగింది. ఈ మార్పు, పిరమిడ్‌ల నిర్మాణంపై ఎగువ ఈజిప్ట్ వ్యక్తపరిచిన ప్రభావానికి గుర్తు.

నాలుగో రాజవంశానికి చెందిన స్నెఫ్రు (Snefru) అనంతరీకులలో నిర్మితమైన 'గీజె' (Geije) పిరమిడ్, ప్రభువు భగవత్స్వరూపుడనే నమ్మకానికి పూర్తి స్థిరత్వం ఏర్పడిన స్థితికి గుర్తు. ఖుఫు (ఖియోప్స్) కాలంలోని ప్రేతాత్మ దేవాలయాలు, నల్లని బసాల్ట్ రాతితో తీర్చిదిద్దిన చావడిని, గ్రానైట్ స్తంభాల మీద తీర్చిదిద్దిన కప్పును, సున్నపురాతితో ఏర్పాటు చేసిన గోడలను కలిగినవి. ఖఫె పిరమిడ్‌లోని ఆలయం దీర్ఘచతురస్రాకారపు 'ప్లాన్'ను, వెలుపలి అలంకరణను కలిగి ఉన్నది. గోడలన్నీ సున్నపురాతితో నిర్మితమైనవి. వాటి కిరువైపుల గ్రానైట్ పలకలు పేర్చబడినవి. అలాగే, దేవాలయంలో 'కాల్సైట్' (Calcite) అనే తెల్లని 'అలబాస్టర్' (Alabaster) తోడి గచ్చు ఉంది. మొత్తం 23 ఖఫ్రెకి చెందిన సింహాసనస్థుడయిన విగ్రహాలు పేర్చబడినవి. వెలుగు రావడానికిగాను కప్పులలో సన్నని చీలిక (Slit)లను ఏర్పరిచారు. ఈ రకంగా తొలి ఈజిప్ట్ కళా వికాసంలో, నల్లని గ్రానైట్ అందాలు, శిల్పుల క్రమబద్ధమైన శారీరక, మానసిక అభివ్యక్తీకరణ, పరస్పర పోషకాలుగా ఉండేవి.

'మెడుం' (Medum) లోని పిరమిడ్‌లో, ఆ దేవాలయంలో ఉత్సవం జరపడానికి అనుకూలంగా ఒక 'ఉత్సవ మార్గాన్ని' ఏర్పరిచారు.

'గీజె'కి ఉత్తరంగా 'అబురోష్' వద్ద ఖఫ్రె తర్వాతి వాడైన రడ్డెఫ్ (Ruddef) పాలనలో నిర్మించిన పిరమిడ్‌లో, హీలియోపోలిస్ కేంద్రంగా గల సౌరమతం అభివ్యాప్తి వల్ల వచ్చిన ఘర్షణను, తత్ఫలితాలను గమనించగలం. ఈ కాలం వస్తుతః రాజుల దైవత్వ భావనా సంప్రదాయ క్షీణతకు నాందిగా గుర్తించవచ్చు. దీని పరిణామాన్ని ఐదో రాజ వంశీకుల కాలం నుండి గమనించగలం.

ఐదో రాజవంశ కాలంలో వెసర్కఫ్, అతని వారసుడు - ఇర్పురా - సూర్యారాధనను జాతీయ స్థాయిలో తీర్చిదిద్ది, 'అబుగురోబ్' (Abu Gurob) మొదలయిన చోట్ల వేర్వేరు నిర్మాణాలను ఏర్పరిచారు. వారు నిర్మించిన పిరమిడ్‌లలో, 'మెంఫిస్' సంప్రదాయాలను చాలా సవరించారు. ఈ నిర్మాణం తూర్పు ముఖంగా కాక, దక్షిణ ముఖంగా ఉంది. దాని తల వాకిట కొంత భాగాన్ని తెంచి, దానిలో గ్రానైట్ స్తంభాలు గల మండపాన్ని నిర్మించారు. స్తంభాల అలంకరణలో ఎంతో మార్పు వచ్చింది. వాని మీద పాపిరస్ మొగ్గలు, పద్మపు మొగ్గలు ఉండేవి. అంతేగాక స్తంభం ఆకారం అంతా ఆ మొగ్గలవలె ఉండేది. లోపలి కప్పులను నీలిరంగు రాతితో అలంకరించి, తలుపును నల్లని బసాల్ట్ రాతితో ఏర్పరిచారు. బసాల్ట్ తలుపుకు గల నల్లని రంగు భూమికి, కప్పులకు గల నీలిరంగు ఆకాశానికి సంకేతాలు. వెసర్కఫ్ (Weserkaf) కాలం నుండి గోడల మీద సూర్యుని సామ్రాజ్యంగా భావింపబడ్డ వర్ణచిత్రాలను చిత్రించడం ప్రారంభమైంది. పిరమిడ్‌లు మొదలయిన రాజవంశీకుల సమాధులలోని ప్రతిభావంతమైన అభివృద్ధి, ఐదో రాజ వంశంతో అంతమైంది. ఆరవ రాజ వంశం నుండి రానురాను, పూర్వపు విధానాలనే అనుసరించడం, వాని వైవిధ్యాలను, ఛాయలను చూపడాన్ని గమనించగలం. ఆ రకమైన వాస్తువులో తమకు తాముగా ఏర్పరిచిన శైలులుగాని, ప్రతీకలుగాని లేవు. కాని, పిరమిడ్

BRAOU

ఆరాధనా సంప్రదాయం, ఐదో రాజ వంశం చివరి కాలం నుండి 'పిరమిడ్ టెక్ట్స్' (Pyramid Texts) అనే పేర్లతో వివిధ రకాలుగా రూపొందాయి.

మధ్యరాజ్య (Middle Kingdom) కాలంలో 12, 13 రాజవంశాల కాలంలో, అంటే, క్రీ.పూ. 1991-1650లలో, అమెనొంహెట్ I (Amenomhet I) కాలంలో రాజధానిని థేబ్స్ నుండి మెంఫిస్‌కి కొంత దక్షిణంగా తరలించారు. తిరిగి వీరు మెంఫిస్ సంప్రదాయానికి చెందిన పిరమిడ్లను నిర్మించడంలో ఆసక్తిని వ్యక్తపరిచారు. కాని, వీరు నిర్మించిన పిరమిడ్‌లు ప్రాచీన రాజ్యకాలంలోని పిరమిడ్లవలె మహోన్నతమైనవి కావు. గీజె, సకారా మధ్య ప్రాంతంలో లిష్ట్ (Lisht) వద్దగల అమెనొంహెట్ I తన పిరమిడ్‌ను నిర్మించుకొన్నాడు. లిష్ట్ వద్ద 'సెసోస్ట్రిస్' (Sesostris) నిర్మించిన పిరమిడ్, తక్కువ పనితో, తక్కువ వస్తువులతో పిరమిడ్‌ను నిర్మించడానికి చేసిన తొలి ప్రయత్నం. దీనిలో ప్రధానమైన గోడలను, అప్రధానమైన గోడలను, ఒకదానికొకటి లంబంగా తీర్చిదిద్ది కట్టడం జరిగింది. వాటి రెండింటి నిర్మాణం, పక్కపక్క అప్రదక్షిణంగా ఏర్పరచబడిన 'W' లాగ ఉంటుంది. రెండు భాగాల మధ్య అంతరం (దూరం) ఉంటుంది (EW). నిర్మాణంలో ఎక్కువ భాగం సున్నపు రాతిని వినియోగించారు. ఫయూం (Fayum)కి దక్షిణంగా 'దషూర్', 'లహూన్', 'హవారా'ల వద్ద గల పిరమిడ్‌లు ఇటుకలతో కట్టబడినవి. కాని, వాని ముందుగా, సన్నని సున్నపు రాతి పలకలను ఉంచారు. మూడో అమెనొంహెట్ శవపేటికగల గదిని, పెద్ద క్వార్ట్జ్ ఇటుకలను తొలిచి ఏర్పరచారు. కాగా, దషూర్‌లో గల అమెనెంహెట్ రెండవ పిరమిడ్‌లో, శవపేటికపైన ఉంచబడిన నల్లని గ్రానైట్ రాయి మాత్రం పురావస్తువేత్తలకు లభ్యమవుతున్నది. మధ్యరాజ్యానికి చెందిన వానిలో, మూడో అమెనెంహెట్ హవారా వద్ద నిర్మించిన దేవళాన్ని (ప్రేతాత్మ దేవళం), ప్రాచీన వాస్తు కళలోని అద్భుతాలలో ఒకటిగా, స్ట్రాబో, హిరోడోటస్‌లు వర్ణించారు.

నవీన రాజ్యకాలం (క్రీ.పూ.1510-1085)లో ఈజిప్టును, 18, 19, 20 రాజవంశాలవారు పాలించారు. వీరి పాలనలో పిరమిడ్ల నిర్మాణం పూర్తిగా అంతమైంది. అట్లాగే ప్రేతాత్మ ఆరాధనా సంప్రదాయం, 'కా' అనే ప్రేతాత్మ ఆలయాల నిర్మాణాలు, రద్దు చేసిన ఆచారాలుగా మారాయి. ప్రేతాత్మల కన్న సూర్యుడుగా భావించబడిన, 'హోరస్‌రే', 'అమున్‌రే' మొదలయిన దివ్యస్వరూపులు (వివరాలకు 3 : 9) విస్తృతంగా ఆరాధనలను పొంది, ప్రజా జీవనంలో బలమైన స్థానాన్ని, వాస్తువులోని విశేషమయిన ప్రాముఖ్యాన్ని పొందారు.

BRAOU

### 10.2.3 భవనాలు, దేవాలయాలు

ప్రాచీన రాజ్యకాలం (క్రీ.పూ. 2780 - 2260)లో గల భవనాలు ఎండబెట్టిన ఇటుకలతోను, కొయ్యతోను నిర్మించబడేవి. 'సకారా' వద్ద జోసర్ ప్రభువు కాలంలో నిర్మించబడిన వివిధ ప్రతిరూపాలు మాత్రమే అప్పటి భవనాలను, వాని 'ప్లాన్'లను అర్థం చేసుకోడానికి తగిన ఆధారాల నిస్తున్నాయి. ఈ భవనాలన్నీ ఈనెలతోను, మట్టలతోను, తడపలతోను, ఇటుకలతోను నిర్మించబడిన వివిధ రూపాలకి గల శిలా ప్రతీకలే. ఈ కాలపు భవనాలలో స్తంభ మండపం ఒక ప్రధానమైన అంశంగా గుర్తించబడింది. దాని దాఖలాలను నాలుగో రాజవంశ ప్రభువులు నిర్మించిన పిరమిడ్‌లలో చూడగలం.

దేవాలయాలలో ఎక్కువ భాగం మెంఫిస్ సంప్రదాయానికి చెందినవి. అవి వివిధ స్థానికులయిన దేవతల కోసం ఏర్పాటు చేయబడినాయి. ఈ రకమైన దేవాలయాలు అన్నీ ముందుగా ఇటుకలతో కట్టబడినవి. రానురాను వానిని శిలా నిర్మాణాలుగా మార్చారు. పూర్తి శిలా దేవాలయాల నిర్మాణం అరుదయిన అంశం. ఉదాహరణకు, హీరాకాన్‌పోలిస్‌లోని 'ఖశేఖేముయి' (Khasekhemui) దేవాలయం, థైనైట్ (Thinite) కాలంలో (క్రీ.పూ. 3000 - 2780) నిర్మించబడిన శిల్ప నిర్మాణానికి గుర్తు. జోసర్ కాలంలో హీలియోపోలిస్ వద్ద తొమ్మిదిమంది దేవతలకు సున్నపురాతితో ఒక నిర్మాణాన్ని ఏర్పరచడం జరిగింది. 'గీజా' వద్ద నాలుగు దవడలు గల 'స్ఫింక్స్' (Sphinx) శిలావిగ్రహానికి ముందుగా ఒక గొప్ప దేవాలయపు అవశేషాలు లభ్యమవుతున్నాయి. ఇది 'ఖెఫ్రెన్' కాలంలో నిర్మితమైన

లోయలోని దేవాలయపు ముఖంగా ఉంది. దాని గోడలు, స్తంభాలు అన్నీ అక్కడె దొరికె సున్నపు రాతితో నిర్మితమైనవి. వాటి మీద గ్రానైట్ పలకలను ఏర్పరచారు. ఈ దేవాలయం నాలుగు వైపుల స్తంభ మండపాలు గల ఒక వెలుపలి చావడి (outer porch)ని, కలిగి ఉన్నది. లోపల పడమటివైపున గల గోడ 'స్ఫింక్స్' వెనకగల చిన్న గూటి పర్యంతం విస్తరించింది. స్ఫింక్స్ అనే విగ్రహాన్ని పడమటి వరకు విస్తరించిన 'హోరస్' (Horus)కు సంకేతంగా భావించేవారు. తూర్పునగల చిన్నగూడు సూర్యోదయానికి సంకేతం.

'అబుగురోచ్' (Abu Guroh) వద్దగల 'రా' (Ra) పుత్రుడైన జీవిస్తున్న ఫారో కట్టినది. దీని నిర్మాణ వస్తువులో ఒక విశిష్టమైన శైలి ఉంది. ఈ గుడి హీలియోపోలిస్‌లోని సూర్యదేవాలయం వరకు విస్తరించినట్లు చూపబడడం దీనిలోని విశిష్టత.

మొట్టమొదటి సూర్య దేవాలయాన్ని ఐదో రాజ వంశానికి చెందిన వెసర్కఫ్ (Weserkuf) రాజు ఇటుకలతో కట్టించాడు. దానిని న్యూసిర్రా (Nusirra) ప్రభువు శిలా నిర్మాణంగా మార్చాడు. ఇది తూర్పు నుండి పడమటికి విస్తరించిన కట్టడం. తూర్పు వైపున గల ఒక చిన్న చావడిలో ఉత్తర దక్షిణాలుగా విస్తరించిన ఒక ప్రదక్షిణ పథం ఉంది. దేవాలయంలో పడమటి వైపు సున్నపు రాళ్ళతో కూడిన గర్భగృహం వంటి నిర్మాణం ఉంది. దీని ఎత్తు ఇంచుమించు 120 అడుగులు. దాని పీఠం ఎత్తు 65 అడుగులు. దాని ముఖ భాగం గ్రానైట్ పలకలతో కప్పబడి ఉంది. అంటే, ఈ దేవాలయం పడమట ఎత్తుగాను, ముందు పల్లంగాను ఉంటుంది. తూర్పువైపున జంతు బలులు ఇవ్వడానికి గల పీఠానికి ఉత్తరంగా, చిన్నచిన్న నిల్వ గదులు (Store Rooms) ఉన్నాయి. ప్రాచీన రాజ్యకాలానికి చెందిన దేవాలయాలన్నీ ఎక్కువగా శిథిలమయ్యాయి.

మధ్య రాజ్య స్థాపకుడు, వాని వారసులు థేబ్స్, (Thebes)లోని గెబెలీన్ (Gebeline), టాడ్ (Tod), మెడామడ్ (Medamad), డెండేరా (Dendera), ఎలిఫంటైన్ (Elephantine) ద్వీపం మొదలయిన అన్ని ప్రాంతాలలోను వేర్వేరు దేవాలయాలను నిర్మించారు. వాటిలో మెంట్‌హోటెప్ III డాయర్‌ఎల్ బ్రాహి (Dayar El Brahi)కి ఉత్తర దిశలో ఒక గుట్ట మీద నిర్మింపచేసిన దేవాలయం ఒకటి ఇప్పటికీ మిగిలి ఉంది. ఇది ఒక సమచతురస్రాకారపు నిర్మాణం. దీని వెనక గోడలో మూడు పూజామందిరాలు (Shrines) ఏర్పరచబడినవి. దీనికి ముందుగా ఒక మండపం ఉంది. ఇది దేవాలయాలలో తొలి ఉదాహరణ.

అమెనెంహెట్ కార్నక్‌లో నిర్మింపజేసిన ఒక సౌర (సూర్యునికి చెందిన) దేవాలయాన్ని మొదటి సెసోస్ట్రిస్ (Sesostris I) పునర్నిర్మింప చేశాడు. దీనిలో పల్లంగా ఒక చిన్న సమచతురస్రాకారపు చావడి ఉండగా, దాని వెనకగా ఒక ఎత్తయిన పీఠం మీద నాలుగు అర్చామూర్తులు ఉంచబడ్డాయి. అక్కడకు నాలుగు వైపులా ఉన్న మెట్లను దాటి రావాలి. దీనికి నాలుగు వైపుల విశాలమయిన స్తంభ మండపాలున్నాయి. స్తంభాల మధ్య చిన్నచిన్న పిట్టగోడల వంటి వాటిని నిర్మించారు. ఈ స్తంభాలన్నీ సాలంకృతాలు. మొదటి సియోస్ట్రిస్ హీలియోపోలిస్‌లో ఒక దేవాలయాన్ని కట్టించాడు. దీనిలో 65 అడుగుల ఎత్తుగల పీఠం మాత్రం మిగిలి ఉంది. మూడో సియోస్ట్రిస్ కాలంలో 'బ్యుబాస్టిస్' (Bu Bastis) వద్ద 'హాథర్ ' దేవత శిరస్సు గల కొన్ని స్తంభాలు, పాపిరస్ మోపును పోలిన స్తంభాలు, గ్రానైట్‌తో చేసిన అలంకరణ ఫలకాలు (Architraves) మాత్రం దొరికాయి. నైల్ లోయకు దూరంగా ఫయూం వద్ద రెండు దేవాలయాలున్నాయి. వానిలో ఒకటి 'మెదినెట్‌మది' (Medinet Madi) వద్ద గలది. దీనిలో మూడు దేవతా గృహాలున్నాయి. మధ్యగల గూడు (Niche) వెలుపలి వానికన్న విశాలమైనది. గోడలు కొంచెం ముందుకు విస్తరించి, పాపిరస్ మోపుల వంటి స్తంభాలతో గల ఒక ఉపనివేశనం (Ante- Room)ను పోలి ఉన్నది. ఉపనివేశనం గోడలపై మూడో అమెనెంహెట్, నాలుగో అమెనెంహెట్ కాలాలకు చెందిన శిల్పాలు, శాసనాలు ఉన్నాయి. ఇంకొక గుడి 'కాసర్‌ఎస్ సాఘా' (Kasar es Sagha) వద్ద ఉంది. ఇది కూడా 'మెదినెట్‌మది' వద్దగల దేవాలయాన్ని పోలి ఉంది. కాని, దీనిలో ఏడు ఉపాయతనాలు సన్నని వరండా వెంట ఏర్పరచబడ్డాయి. దీనిలో శాసనాలుగాని, అలంకరణ వైవిధ్యంగాని లేవు. ఇది అసంపూర్తిగా ఉన్నదా అనే అనుమానానికి అవకాశం ఉంది.



BRAOU

నవీన రాజ్యకాలం (క్రీ.పూ. 1570-1085)లో 'ఐర్సాస్' ప్రభావం హెచ్చుగా ఉంది. మధ్య ఆసియాకు చెందిన వీరు ఈజిప్ట్‌లోని కొన్ని భాగాలను వశపరుచుకొని 'అవరిస్' (Avaris) (మైదాన ప్రాంతం) నుండి పాలనను చేసేవారు. థేబ్స్, దిగువ ఈజిప్ట్ ప్రాంతాలలో రాజకీయ స్వాతంత్ర్య శక్తులు ఆవిర్భవించిన మూడో అమెన్హొటెప్ పరిపాలనా కాలం నుండి నవీన రాజ్య ప్రాబల్యం పెరిగింది. నైల్ నది రెండు ఒడ్డుల వరకు విస్తరించిన, అతి విశాలమయిన, థేబ్స్ నగరంలో అనేక 'అమెన్' దేవాలయాలు నిర్మితమైనవి. 'దీపెట్ సమారాధన', 'సుందర సమారాధన' వంటి ఉత్సవాలలో ఏటిని దాటి, లక్సర్, కార్నక్‌ల వరకు దేవుణ్ణి ఊరేగించేవారు. (వివరాలకు భాగం 3:9). నవీన రాజ్యకాలంలో నిర్మితమైన దేవాలయాలు ఎక్కువగా ప్రాంతీయాచారాల మీద, నమ్మకాల మీద ఆధారపడినవే. ఉత్సవ ప్రతిమలను ఉంచడానికి విడివిడిగా దేవాలయాలను కూడా నిర్మించడం జరిగింది. 'మెదినెట్‌హబు' వద్ద హట్షెప్సుట్ రాణి నిర్మించిన ఒక చిన్న దేవాలయం ఇటువంటిదే.

ఈ కాలంలో దేవాలయ నిర్మాణం మొదటి థట్మోస్ (Thutmos I), హట్షెప్సుట్ రాణి, మూడో థట్మోస్‌ల కాలంలో విశేషంగా వ్యాప్తి చెందింది. మొదటి థట్మోస్ కాలంలోని ప్రధాన పరిణామం 'ప్లాన్'లో కన్పించింది. పడమటగా 'ప్లాన్' పెంచబడి, దేవాలయ వైశాల్యం పెరగడమే గాక, వివిధ గదుల నిర్మాణానికి కూడ అవకాశం వచ్చింది. దేవాలయాన్ని మూడు వైపుల గోడతో కప్పి, ఒక వైపు మాత్రమే మార్గంగా వ్యవహరించడానికి అనువును కల్పించారు. ఈ రకమయిన పరిణామంలో ముందు భాగంలో ఒక వెలుపలి మండపం (Pylon), లోపలి మండపం (Inner Pylon)ను నిర్మించారు. గులాబి రంగు గ్రానైట్‌తో చేసిన 65 అడుగుల ఎత్తుగల ధ్వజ స్తంభాలను (obelisk) ఏర్పరిచారు. ఈ రెంటి మధ్య గల సన్నని తోవను కొయ్య స్తంభాలు ఆధారంగా గల ఒక కొయ్యతో చేసిన కప్పుతో ఉంచడం జరిగింది. కాని, విచ్ఛిన్నమయ్యాక హట్షెప్సుట్ రాణి ఆ ప్రాంతంలో వంద అడుగుల ఎత్తు గల గ్రానైట్ ధ్వజ స్తంభాలను ఏర్పరిచింది. ఇవి గులాబి రంగువి. మూడో అమెన్హొటెప్, రామ్సెస్ I కాలంలో ఈ కార్నక్ దేవాలయం పడమటగా విస్తరించింది.

కార్నక్‌లోని ప్రధాన దేవాలయంలో వెలుపలి చావడిలోని ధ్వజ స్తంభాలు, మండపాలు, లోపలి గోడలను తాకే స్తంభ మండపాలు ప్రధానమైనవి. వీనిలో 'ఒసిరిస్' ప్రతిమలున్నాయి. ఈ రకమైన పద్ధతి 'హీలియోపోలిస్'లోని 'రా' దేవాలయానికి అనుకరణ. కార్నక్‌లోని గర్భగృహం వంటి దానిని పోలిన లోపలి దేవాలయం కూడా, 18వ రాజవంశ కాలంలోనే పూర్తి చేయబడింది. దానిలో ఒక పొడవయిన గది ఉంది. దానికి గ్రానైట్ స్తంభాలు, తూర్పుగా ఒక కిటికీ ఉన్నాయి. దాని లోపలికి పడమటి నుండి రావడానికి కావలసిన సౌకర్యం ఉంది.

లక్సర్‌లో (కార్నక్‌లోవలెనే) ఒక గొప్ప దేవాలయాన్ని సంస్కరించి, పునర్నిర్మించడం జరిగింది. ఇది క్రీ.పూ. 1100 ప్రాంతంలో మూడో అమెన్హొటెప్ పరిపాలనా కాలంలో జరిగింది. దీనిలో దేవాలయానికి ముందు పెద్ద చావడి వంటి స్తంభ మండపం ఏర్పరచబడింది. దీనికి మూడు వైపుల విశాలమయిన చావడి (Hall) ఉంది. ఈ చావడిలో పాపిరస్ మోపులను పోలే విధంగా జంట స్తంభాలను ఏర్పరిచారు. దాని తరవాత కొంత ఖాళీస్థలం, దాని తరవాత ఇంకొక స్తంభ మండపం ఉన్నాయి. అది గర్భగృహానికి, ముఖ మండపానికి మధ్య గల అర్థమండపం వంటిది. దానిని దాటి దేవాలయంలోకి పోవాలి. దాని తరవాత ఇరువైపుల స్తంభాలు గల అంతరాళం (vestibule) వంటి దీర్ఘచతురస్రాకారపు నడవ ఉంది. లక్సర్‌లోని ఈ దేవాలయం 'అమెన్'కు చెందినది. అర్చాప్రతిమను ఒక పీఠంపై ఉంచి పూజిస్తారు. ఈ దేవాలయంలో గదులన్నీ ఏటవాలుగా ఉంటాయి. ఈ దేవాలయంలోనికి రావడానికి ఒక పొడవయిన చావడిని దాటి రావాలి. దానిలో ఏభయి అడుగుల ఎత్తయిన పాపిరస్ మోపులను పోలిన స్తంభాలు ఉండేవి.

### 10.2.3.1 వాస్తు శిల్పులు

ఇన్ని రకాల దేవాలయాల నిర్మాణాలు ప్రశస్తులైన వాస్తు నిర్మాతల చేత, శిల్పుల చేత చేయబడేవి. 18వ రాజవంశ కాలంలో వారి సంఖ్య హెచ్చుగా ఉండేది. 'ఇనేనీ' (Ineni) అనే వాస్తుశిల్పి మొదటి అమెన్‌హొటెప్ కాలం

BRAOU

(క్రీ.పూ. 1560-1539) నుండి మూడో థట్మోస్ కాలం వరకు ఎక్కువ పలుకుబడి, ఖ్యాతి ఉన్నవాడు. ఇతడు మొదటి థట్మోస్ కాలంలో తోరణాలను, మండపాలను, స్తంభ మండపాలను నిర్మించడం, 'అమెన్' స్వర్ణప్రతిమ గల ఆసియా నుండి తెచ్చిన లోహంతో చేసిన ద్వారాన్ని నిర్మించడం, మొదలయిన పనులను పర్యవేక్షించి, నిర్వహించాడు.

హట్షెప్సుట్ (Hatshepsut) రాణి కాలంలో ఆమె వద్ద 'సెచ్ముట్' (Sechmut) అనే వాస్తు శిల్పి ఉండేవాడు. 'డయెర్ ఎల్ బ్రహి' (Dayar al Brahi)లో ఒక దేవళాన్ని రెండో మెంట్‌హోటెప్ సమాధికి ఉత్తరంగా నిర్మించాడు.

అఖ్నాటన్ కాలంలో 'టెల్ ఎల్ అమర్నా' వద్ద వివిధ నిర్మాణాలను జరిపారు. వానికి హీలియో పోలిస్‌లోని సూర్య దేవాలయాన్ని పరమ ప్రమాణంగా గ్రహించారు.

ఇన్ని రీతులుగా జరిగిన కళా పరిణామంలో భవనాలు, దేవాలయాలు వివిధ శిల్పాలతోను, చిత్రలేఖనాలతోను వివిధ రీతులలో అలంకరింపబడటం గమనించగలం.

## 10.2.4 చిత్రలేఖనం, శిల్పం

'మరణానంతర జన్మ' అనే నమ్మకం, ఈజిప్ట్‌లోని అపర కర్మలలో భాగంగా కట్టిన పిరమిడ్లలోను, 'కా' అనే ప్రేతాత్మల దేవాలయాలలోను అనేక రకాల శిల్పాలకు, చెక్కడాలకు, వర్ణ చిత్రాలతో కూడిన చిత్రలేఖనం అభివృద్ధికి ఎంతో దోహదం చేసింది. 'స్పింక్స్' (Sphinx) వంటి 'హోరస్'కు సంకేతంగా ఉన్న ఏక శిలాశిల్పాలు, వేర్వేరు ఫారోల శిల్పాల వంటివన్నీ, ఆనాటి శిల్పుల నైపుణ్యానికి ఎంతో ఉన్నతమైన గౌరవాన్ని ఆపాదించే గుర్తులు.

దేవాలయ వాస్తువు వలెనే చిత్రలేఖన, శిల్ప కళలు ప్రాచీన రాజ్య కాలంలోను, మధ్యరాజ్య కాలంలోను, నవీన రాజ్య కాలంలోను, వివిధ స్థాయిలలో ప్రోత్సహించబడటం జరిగింది.

చిత్ర లేఖనంలోను, శిల్పంలోను ద్విమిత్యాత్మకమైన మానవ రూపాన్ని ఏర్పరచడం, థైనైట్ రాజుల కాలం (క్రీ.పూ.3700-2780)లోనే సంభవించింది. దాని పరిణామాన్ని, వివిధ దాన ఫలకాలలోగల శిల్పాలలో చూడగలం. తొలి ఆధారం మొదటి రాజవంశానికి చెందినది. ఇది, నుబియా మీద 'జెట్' (Djet) ప్రభువు విజయాన్ని సాధించడం చూపిస్తున్నది. ఈ శిల్పాన్ని కుశలురుకాని శిల్పులు చెక్కినప్పటికీ, మత ప్రమేయం ఏ మాత్రంలేని ఒకే ఒక్క అంశంగా ఇది మిగిలి ఉంది. సమాధులను అలంకరించడంలో శిల్పి, తన ప్రతీకలలో సహజత్వంతో బాటు ఎంతో నూతనత్వాన్ని చూపవలసిన అవసరం కలిగింది. 'అబిడాస్'లోని సమాధులు చిత్ర నిర్మాణంలోను, భంగిమలను చూపడం లోనుగల ప్రగతికి గుర్తులు. అట్లాగే 'అబిడాస్'లోని సమాధులలో అంతర్మందిరాలలోగల చిత్రలేఖనాలు, హీరాకాన్ పోలిస్ ఆధారాల ప్రకారం, ఇంచుమించు ప్రాక్-చారిత్రక కాలంలో గోడలమీద చిత్రితమైన 'శిలాకళా' (Rock Art) సంప్రదాయాన్ని అనుసరించి చిత్రితమైనట్లు తెలుస్తున్నది. హీరోకాన్ పోలిస్ దేవాలయపు ఆవరణలో గోడ వెలుపలి వైపుగల గ్రానైట్ పలకలమీద చెక్కిన ఖస్‌ఖైముయి (రెండవ రాజ వంశానికి చెందినవాడు) రూపం, 'తొలి శిల్ప కళలో గొప్ప విజయం. ఇదేగాక, మెంఫిస్ వద్దగల 'హెమాకా' సమాధిలో దొరికిన స్టియటైట్ చక్రాలు, కుక్కల, పక్షుల ప్రతీకలు, శిల్ప కళలో తొలి ఉదాహరణలు. అలాగే, ఈజిప్ట్‌లోని శిల్పకళా సంప్రదాయాన్ని కేవలం రాతిలోనేకాక, కొయ్య, మట్టి, దంతం, లోహం మొదలైన వానిలోకూడా చూడగలం. ఇవన్నీ ఎక్కువగా థైనైట్ కాలానికి చెందినవి. దంతంతోను, రాతితోను చేసిన కప్పలు, సింహాలు, గ్రద్దలు, నెమళ్ళు మొదలైనవి, ఈ కళలోని చిన్న తరహా సామాన్య జన సంప్రదాయానికి ఉదాహరణలు. ఈజిప్ట్ ఏకీకరణ సమయంలో 'కాప్టస్'వద్ద దొరికిన పది అడుగుల 'మిన్' శిల్పం, ఒక స్తంభం వంటి సున్నపు రాతి పలకలో చెక్కబడిన అమూల్యమయిన, ఉత్కృష్టమయిన ఉదాహరణ. ఇతడు ఒక గోచీని ధరించి, పెద్ద గడ్డాన్ని, ముండిత శిరస్సును కలిగి ఉంటాడు. ఇది శిల్పకళలోని పూర్తి వికాసానికి గుర్తు. అదే విధంగా 'అబిడాస్' వద్ద గల పెద్ద పలకవంటి శరీరాన్ని గల వేరొక కూర్చొన్న వ్యక్తి ప్రతిమ, పూర్తిగా బట్టతో కప్పబడినట్లు

BRAOU

చూపబడుతుంది. ఈ బొమ్మలో దంతంలో చెక్కినట్లు, జుట్టును అలంకరించడంలో ఎంతో శ్రద్ధ కనిపించింది. మానవ రూపాన్ని తీర్చి దిద్దడంలో తొలి ప్రయత్నాలు వ్యక్తం చేసిన శ్రద్ధ, కుశలత్వం తొలుతగా కొయ్యలో కన్పించి, ఆతరవాత రాతికి, దంతానికి విస్తరించింది. రెండో రాజవంశం చివరి రాజుల నాటికి, రాతి చెక్కడం లోని సంపూర్ణ వికాసం, షిస్ట్‌లోను, సున్నపు రాతిలోను చెక్కిన 'ఖశేఖం' ప్రతిమలలో కన్పిస్తున్నది. అతడు కొంచెం ముందుకు వంగినట్లు చెక్కబడ్డాడు.

థైనైట్ కాలం లోని పై ప్రగతిని గడచి, ప్రాచీన రాజ్యకాలంలోనికి అడుగు పెట్టినపుడు, శిల్పంలోను, చిత్రలేఖనం, ఫారోల, ప్రేతాత్మల దేవాలయాలలోను, రాజోద్యోగుల సమాధులలోను చిత్రాత్మకమయిన కళ బాగా రూపొందింది. బహుళ వర్ణ (Polychrome) చిత్రాలను, ప్రాచీన రాజ్య కాలంలోని ప్రధాన విషయాలలో ఒకటిగా భావించవచ్చు. 'హెమాకా' సమాధులలో ఈ రకమైన బహుళ వర్ణ చిత్రాలకు గల తొలి ఉదాహరణలను చూడగలం. సున్నపు రాతిని కట్టడాలకు వాడటం అనేది, ప్రధానంగా బహుళ వర్ణ చిత్రాలకు ఎంతో స్ఫూర్తిని కలిగించింది. ఎరుపు, పసుపు పచ్చ రంగులకు ఐరన్ ఆక్సైడ్‌ను, పసుపుపచ్చ నీలిరంగులకు మాలఖైట్, అజురైట్‌లను ఉపయోగించేవారు. అట్లాగే తెలుపు, నలుపు రంగులను కూడా ఉపయోగించేవారు. స్త్రీ, పురుషుల శరీరాన్ని (చర్మాన్ని) పసుపు పచ్చ, ఎరుపు రంగులను వినియోగించి, విడిగా చూపేవారు. శుద్ధమైన రంగులకు తోడుగా, వేర్వేరు రంగుల ఛాయలను వాడటం కూడా ఆనవాయితీగా ఉండేది. వీటిని నీలిరంగుతోను, వృక్షాలను ఆకుపచ్చరంగుతోను చూపేవారు. వ్యక్తుల వర్ణ చిత్రాల ప్రతీకలన్నీ, సమగ్రత ప్రధానంగా చిత్రింపబడినాయి. సమాధులలోను, పిరమిడ్‌లలోను గల వ్యక్తి (రిలీఫ్) చిత్రాలన్నీ, అపర కర్మలలోని అంశాలకు చాలా దగ్గరితనాన్ని కలిగి ఉన్నటువంటివే. ఆ చిత్రాలు వ్యక్తి హోదాను బట్టి, వైవిధ్యతను సంతరించుకొన్నాయి. ఎనిమిదో, ఆరో వంశ కాలాల్లోని వ్యక్తి చిత్రాలలో ఎక్కువ భాగం, మనకు వారసత్వంగా మిగిలి ఉన్నాయి. ప్రైవేట్ సమాధులలోని గోడలపైగల చిత్రాలలో, అ మృతుల కుటుంబ జీవనంలోని అంశాలను యథాతథంగా చిత్రించడం జరిగింది. 'సకారా' వద్ద 'హెసీరా' సమాధి వంటి ఉదాహరణలలో, సమాధులపైభాగంలో కొయ్యతో ఏర్పరిచి, వర్ణీకరించిన వ్యక్తి చిత్రాలను తూర్పువైపున గూళ్ళలో ఉంచారు. ప్రాచీన రాజ్యానికి చెందిన చిత్రాలలో బీరువాలు, బల్లలు, కుర్చీలు, పరుపుల వంటివికూడా చూపబడినాయి. మృతుడు తన ఇంటిలోని అన్ని వస్తువులను పరిశీలిస్తున్నట్లు చూపడం జరిగింది. 'హెసీరా' కన్న కొన్ని ప్రత్యేకతలను, 'ఖాచౌసోకార్' లో చూడగలం. దీనిలో పూజామందిరం వంటి గూడు, సున్నపు రాతి పలకలతో నాలుగు అంచులుగా పేర్చబడింది. 'మెడుం'లోని నాలుగో రాజ వంశ కాలానికి చెందిన, ఇటుకలతో కట్టిన 'మస్తబా'లలో స్త్రీ, పురుషులు నివేదనలు చేస్తున్నట్లు, వారి నివేదనల సందర్భంగా వారి వారి పేర్లతో సహా గోడలపై చెక్కబడిన చిత్రం, ఒక విశిష్టమైన వర్ణ చిత్రాల శైలికి దృష్టాంతంగా కనిపిస్తున్నది. ఎద్దును బలి ఇవ్వడం కూడా ఈ 'మస్తబా'లలో చూపబడి ఉంది. కొన్ని రాజ పురుషుల సమాధులను కూడా, సున్నపు రాతితో కట్టడం జరిగింది. రహోటెప్ రాజకుమారుడు,అతని రాణి నోఫ్రెట్ నెఫిర్‌మాట్, ప్రేతాత్మ దేవాలయంలో విపులంగా వ్యక్తీకరించబడ్డారు. అట్లాగే నెఫిర్ మాట్ రాణి అయిన 'అటెట్' దేవళంలో, మట్టి, సున్నంతో పూసిన ఇటుక గోడల వర్ణ చిత్రాలున్నాయి. ఐదో రాజ వంశ కాలంలో 'రా' సూర్యుని ఆరాధన విస్తృతమయిన ప్రాశస్త్యాన్ని పొందడం వల్ల, వర్ణ చిత్రాల రీతిలో కొంత మార్పు వచ్చింది. 'అబుగోరింబ్' వద్ద న్యూసెర్రా రాజు కట్టించిన సూర్య దేవాలయంలోని 'ఋతువుల మందిరం'లోని గోడలపైగల వర్ణ చిత్రాలు, వివిధ ఋతువులను చూపించాయి. వెసర్ కాఫ్ రాజు నిర్మించిన దేవాలయంలో, ఎక్కువ పక్షులతో నిండిన తటాకం వంటి గుంటలో అతడు పడవమీద పోతున్నట్లు చూపే చిత్రం, ఐదో రాజ వంశ కాలానికి చెందిన అత్యుత్తమ వర్ణ చిత్రంగా గుర్తింపు పొందింది. పాపిరస్ వృక్షాలపైనగల వివిధ పక్షులను, జలచరాలయిన చేపలు, మొసళ్ళు మొదలయినవానిని కూడా, రకరకాలుగా చిత్రించడం జరిగింది. అప్పుడప్పుడు విహార యాత్రలు కూడా చూపబడ్డాయి. వేర్వేరు పంటలను పండించడంలోని అనేక దశలను చిత్రించారు. ఆరో రాజ వంశానికి చెందిన వజీరయిన మెరెరుకా అనేక గదులు గల సమాధిలోను, వివిధ ఉన్నతోద్యోగుల సమాధులలోను, వారివారి దైనందిన జీవనం యథాతథంగా చిత్రించబడి, రంగుల లోని చరిత్రగా

తరవాతి తరాల వారికి సంక్రమించింది. 'ప్తానెఫెర్వర్'కి సకారా వద్ద గల సమాధులలో చలనమ్మూర్తులను (నడిచే బొమ్మలు), ధావనమ్మూర్తులను (పరుగెత్తే బొమ్మలు) కూడా చూపి, వర్ణ చిత్రాలలోగల విశేష వైవిధ్యానికి ఉదాహరణలను చూపారు. వర్ణ చిత్రాలలోగల లౌకికీకరణ (Secularisation))ను, సందర్భ సహితమయిన తర్కసహ విధానం అనుసరించింది. దీనిలో ప్రేతాత్మ దేవాలయాల వ్యవస్థనే పదేపదే ప్రశ్నించడం ప్రారంభమయింది.

### 10.2.4.1 ప్రాచీన రాజ్య కాలంలో చిత్రలేఖన పద్ధతులు

ఈ చిత్రాలను గీయడంలో ముందుగా గోడను విభజించుకునేవారు. ఆ తరవాత సున్నపు రాతి గోడలమీద కుంచెలను ఎర్రని రంగులో ముంచి, ప్రతీకలను రాసేవారు. ఆ తరవాత దానిని నల్లని రంగుతో, రేఖామాత్రంగా అద్దేవారు. ఆ తర్వాత శిల్పి, అంచుల ద్వారా లోనికి చెక్కిన ఒక ప్రతీకను చిత్రలేఖనానికి అనువుగా చూపేవాడు. ఏమయినా పూరించవలసిన అంశాలుంటే, దానిపై తెల్లని సున్నం, మట్టిని పూసి, చిట్టచివరి వర్ణీకరణ చేసేవారు. ఆ తరువాత చిత్రకారుడు పెద్దపెద్ద కుంచులతోను, చిన్నకుంచులతోను విశాలమైన, సన్నమైన అంశాలను చూపేవాడు. చివరికి నేపథ్యం నుండి కొన్ని రేఖల (Contour Lines)తో బొమ్మను వేరుచేసేవారు. ఈ ప్రక్రియా విశేషాలను అసంపూర్తిగా ఉన్న వర్ణ చిత్రాల నుండి గ్రహించొచ్చు.

### 10.2.4.2 మధ్య రాజ్య కాలంలో చిత్రలేఖనం

మధ్య రాజ్య కాలంలో గోడలపైగల వర్ణ చిత్రాలను చూపడానికి, కేవలం కొన్ని భిన్నమయిన అవశేషాలు మాత్రం మిగిలి ఉన్నాయి. 12వ రాజ వంశ ప్రారంభం నాటికి, వ్యక్తి చిత్రాలలో పెద్ద తరహావి, చిన్న తరహావి పక్కపక్కనే చూపబడినాయి. ఈజిప్ట్ చిత్రలేఖనంలో వివిధ సూక్ష్మాంశాలను చూపడానికి అనుసరించిన 'గ్రిడ్' విధానం వలన, ఒక నూతన 'రాయల్ శైలి' ఉత్పన్నమైనట్లు చెప్పొచ్చు. కార్నక్‌లోని స్తంభం మీద గల ఒకే ఒక ప్రతిమా చిత్రంలో 'ప్తా'(pta.) రాజుని కౌగిలించుకొన్నట్లు చూపడం జరిగింది. ఈ ప్రతిమ ఉన్నతంగాను, తేజోవంతంగాను ఉంది. దీనిలో రాజును, 'ప్తా'ను, కేవలం ముఖంలోని అంశాలాధారంగా వేరు చేయడం జరిగింది. 'కాప్టక్' దేవుడయిన 'యిన్' వద్దకు పోతున్న మొదటి సియోస్ట్రెస్‌ను చూపడంలో కూడా, ఇదే విధమైన పద్ధతిని అనుసరించారు. 'మెడాముద్' వద్ద మూడో సియోస్ట్రెస్ నిర్మించిన దేవాలయంలోని 'హెడ్-సెద్ దృశ్యంలో (దీనిని ద్వార స్తంభంపై చూపారు) వైశాల్యం, ఆలంకారిక స్వభావం ఎంతో హృదయంగమంగా ఉన్నాయి. మూడో అమెనెంహెట్ కాలంలో మృత్యుదేవతగా చెప్పబడి, మొసలి రూపంలో చూపిన 'ఫయూం'వద్దగల 'సొబెక్'ను చూపడంలో, వివిధ వర్ణాక్షరాల ద్వారా భావాలను చెప్పారు. కొన్ని మధ్యరాజ్య కాలపు చిత్రాలలో, వేర్వేరు 'నోమార్క్'లకు అబ్బిన రాజ్యాధికారం ఆధారంగా, చిత్రాలను రాశారు. అటువంటి చిత్రాలలో 'నోమార్క్' తన సాటి అధికారులతో ఉండటం, స్థానిక సంఘటనలు కొన్ని, 'ఎల్ బెర్షె' వద్దగల సమాధిలో ఒక పెద్ద విగ్రహాన్ని రవాణా చేస్తున్నట్లు; 'బెనిహసన్' వద్ద సెమెటిక్ జాతి వర్తకుల సబురురావడం, చూపడం జరిగింది. మధ్యరాజ్యకాలంలోని చిత్రాలలో ప్రాచీన రాజ్య కాలంలో లేని కథనపరమైన వైవిధ్యం ఉంది.

BRAOU

### 10.2.4.3 నవీన రాజ్య కాలంలో చిత్రలేఖనం

నవీన రాజ్యకాలంలో ప్రతీకాత్మకమైన కళావైవిధ్యాన్ని, బాహుళ్యాన్ని చూడగలం. మధ్యరాజ్య కాలంలో కన్న, నవీన రాజ్యకాలంలో నిర్మాణాలలో రాతిని ఎక్కువగా వాడారు. అందువల్ల, ప్రతీకలను విరివిగాను, నిడివిగాను చిత్రించడానికి కావలసిన నేపథ్యం లభ్యమయింది. ఇసుక రాయి, సన్నని సున్నపురాయి, అలబాస్టర్, క్వార్టజైట్, ఎర్రని గ్రానైట్ మొదలైనవి ఉపయుక్తమయిన శిలా విశేషాలు. 18వ శతాబ్దారంభం వరకు చిత్రాలన్నీ ఇంచుమించు, పూర్వకాలపు పద్ధతులను అనుసరించే చిత్రించడం జరిగింది. ఈ చిత్రాలలో ఎక్కువ భాగం దైనందిన జీవితానికి చెందినవే. హట్షెప్సుట్ రాణి కాలంలో 'డయెర్ ఎల్ బహ్రి' వద్ద గల దేవళంలో, 'అమెన్' దేవుని కృపవల్ల ఆమె రాణికాగలిగిందనే భావనను

చూపే వర్ణ చిత్రాలు చిత్రితమైనాయి. ఈ అంశం, తర్వాత, లక్సర్ దేవాలయంలో మూడో అమెన్‌హోటెప్ రాజు కాలంలో కూడా చూపడం జరిగింది. ఈ కథనాన్ని వర్ణరూపంలో చెప్పేటప్పుడు, చిత్రకారుడు కథలోని అసాధారణ భావాలను మరింత మధురమైన శైలిలో చెప్పాడు. దానికి తోడు, కొంత భాష్యాన్ని రాయడం జరిగింది. గర్భిణీ అయిన 'అహ్మోస్' రాణి, పుంతీ ద్వీపానికి పంపిన నౌకాబలాన్ని కూడా, దక్షిణ దిశలోని స్తంభమండపంపై చూపడం జరిగింది. కొంతకాలం తరవాత, మూడో థట్మోస్ కాలంలో కార్నక్ దేవాలయంలో అతడు సిరియా నుండి తెచ్చిన వివిధ జంతువులను, వృక్షాలను, మొక్కలను చూపించారు.

## 10.2.4.3.1 నవీన రాజ్యకాలంలోని వ్యక్తి చిత్రాలు

ఈకాలంలోని వ్యక్తి చిత్రాలన్నిటిలోను ఒక రకమైన సౌకుమార్యం, ఉల్లాసాన్ని వ్యక్తం చేయడం గమనించొచ్చు. ఈజిప్షియన్‌లు, పుంత్ ద్వీపవాసులు మొదలయినవారు పరస్పరం ఎదురుగా నిలబడినట్లు చూపడం జరిగింది. అలాగే, 'ఫ్రీజ్'లవలె వివిధ వ్యక్తులను వివిధ వర్ణాలలో గోడల అంచులలో చేర్చడం వల్ల, దానిలో ఒక ఉత్సాహాన్ని కలిగించు అలంకరణాత్మక ఫలితాన్ని అభివ్యక్తం చేయడానికి అవకాశం వచ్చింది. కార్నక్‌లోని ఏడో ద్వార తోరణపు దక్షిణ దిక్కున, శాసనాలతో సహా, వివిధ యుద్ధ సంఘటనలను రంగులలో చిత్రించడం జరిగింది. విజేత అయిన రాజును ద్వార తోరణానికి ఇంచుమించు సరితూగే ఎత్తులో చూపడం జరిగింది. 'టిబికి' మొదలయిన ప్రాంతాలలోగల సమాధులలో, మృతి తరవాత జరిపే 'వైకుంఠ సమారాధన' వంటి అన్నదానోత్సవాన్ని చిత్రించడం జరిగింది రాజ్యకాలంలోని సమాధులలోని చిత్రాలన్నీ, వివిధ ప్రాంతాలను బట్టి, ఋతువులను బట్టి, ఆయా మృతుల సామాజిక, రాజకీయమైన స్థితిగతులను బట్టి, అనేక రకాల కథనాలుగా రూపొంది, కథలోని వైవిధ్యాన్నేగాక, కథనంలోని వైవిధ్యాన్ని కూడా వ్యక్తం చేశారు. వజీర్ మొదలయినవారు విధిని నిర్వహిస్తున్నట్లుగాను, వివిధ కార్యాలను పర్యవేక్షిస్తున్నట్లుగానూ, చూపడం జరిగింది. సాంప్రదాయికమైన ఇతివృత్తాలయిన పక్షుల వేట, చేపల వేట వంటివి కూడా వీనిలో ఉన్నాయి. వేటగాడు చిన్న రథంపై గుర్రాలు లాగగా పోతున్నట్లు చూపడం జరిగింది. మూడో థట్మోస్ నిర్వహించిన యుద్ధాల తరవాత గల కాలంలో, చిత్రలేఖనం నవీన రాజ్యకాలంలో ఎంతో ఎక్కువగా అభివృద్ధి చెందింది. సంపద, సుఖభోగాలు, సుఖప్రదమైన జీవనం, పండుగలలో జరిపే విందుల వంటివి ఎక్కువగా చిత్రించడం జరిగింది. రెండో అమెన్ విసుటెప్ కాలంలో వజీరయిన 'రెఖ్మారా' (Rekhmara) సమాధిలోను, నాల్గవ థట్మోస్ (Thutmos IV) కాలానికి చెందిన 'నఖ్త్' (Nakhth) సమాధులలోను, ఇటువంటి సుందరమైన విందుల చిత్రీకరణను చూడగలం. చిత్రలేఖనంలోగల సృజనాత్మకత, చిత్రకారునికిగల స్వేచ్ఛ, జీవితానికి చిత్రకారునికిగల సాన్నిహిత్యం, చిత్రకారుడు జీవితంలో పొందిన తాదాత్మ్యతను ఈ రకమైన చిత్రాలలో చూడగలం. మూడో అమెన్ హోటెప్ కాలంలోని చిత్రాలలో, నృత్యాలు, సంగీత వినోదాలను కూడా చూపడం జరిగింది. ముగ్గురు స్త్రీలు హంగుగా ఉండగా, వేణువు వాయించిన ఒక స్త్రీని చూపటాన్ని గమనించగలం. మూడో అమెన్ హోటెప్ (Amenhotep III) కాలం నాటికి, ఈ చిత్రలేఖన కళ ఉన్నత శిఖరాలు చేరింది. అఖ్నేటన్ (Akhneton) కాలంలో కొత్త రాజధాని అయిన అఖ్టెటన్ (Akhteton) లోని వివిధ వర్ణ చిత్రాలు, నవీన రాజ్యకాలంలో అభివృద్ధి పొందిన పోకడలకు నిదర్శనంగా ఉంటాయి. ఈనాటి కళాకారులలో అసదృశ్యమైన, అద్భుతమైన వేగం ఉండటం, ఆనాటి ఈజిప్ట్ చరిత్రలో నవీన రాజ్యపు చిత్ర లేఖనం సంతరించుకొన్న ఒక అపూర్వమయిన విప్లవాత్మకతకు ప్రధాన కారణంగా భావించొచ్చు. అటువంటి వాటికి ఉదాహరణలను, మనం 'టెల్‌ఎల్ అమర్నా', 'థేబ్స్' వంటి చోట్లలో చూడగలం. నవీన రాజ్యకాలంలోని చిత్రకళలో, ప్రధానంగా, ఇతి వృత్తం లౌకికీకరణ, ఉన్నత స్థాయి అభివ్యక్తీకరణ, వివిధ కాలాల్లోను, ప్రాంతాలలోను జరిగిన వేర్వేరు సంఘటనలను తరచుగా చూపడం, లక్షణాలుగా మనం గమనించొచ్చు. 'మెంఫిస్' వద్ద గల 'హోరెంహెబ్' (Horemheb) సమాధిలో 'టెల్ ఎల్ అమర్నా' సంప్రదాయం వ్యాపించినట్లు తెలుస్తున్నది.

థేబ్స్‌లో ఈ కాలంలో జరిగిన కొంత అభివృద్ధి, వివిధ స్థానిక సంఘటనలను చూపడం మాత్రమేకాక, అమర్నా సంప్రదాయానికి ముందుగల కొంత విషయాన్ని, శైలిని చిత్రకారులు అనుసరించడమే.

మొత్తం మీద ఈజిప్ట్‌లో చిత్రలేఖనాన్ని, శిల్పాన్ని సమీక్షించి పరిశీలన చేసినట్లయితే, మతపరమయిన అభివ్యక్తీకరణ, లౌకిక భావాల అభివ్యక్తీకరణగా పరిణమించినట్లు, చిత్రకారునికి లేని స్వాతంత్ర్యం, అపురూపమయిన, వేగవంతమైన స్వాతంత్ర్యంగా రూపొందినట్లు గమనించగలం. చిత్రలేఖనం కేవలం ఎవరు మృతుని వ్యక్తిగతమైన, లేదా దైనందినమైన అంశాలను వర్ణించే పరికరంగా కాక, సంపూర్ణమయిన జాతీయ భావాలను వ్యక్తం చేసే ఒక సుందరతా మయమయిన మాధ్యమంగా పరిణమించినట్లు తెలుస్తుంది. ఈ పరిణామంలో రానురాను 'హిక్సాస్ 'క్రీట్', 'సిరియా' వంటి ప్రాంతాల ప్రభావం కూడా గమనించదగింది. అది కేవలం 'నోమ్స్'గా ఉన్న ఈజిప్ట్ రాజ్యంగాను, సామ్రాజ్యంగానూ, మారిన స్థితిగతులను చూపే ఒకే ఒక్క సాంస్కృతిక చిహ్నం.

### 10.2.5 ఉపకళలు (Minor Arts)

ఈజిప్ట్ నాగరికతా చరిత్రలో కేవలం శిల్పం, చిత్రలేఖనం వంటి ప్రధానమైన కళలేకాక, అనేక ఉపకళలు కూడా ముఖ్యమైన పాత్రను వహించాయి. అవి లేట్లయితే, ఈజిప్ట్‌లోని వర్ణ చిత్రాలవంటివి, అంత గొప్ప నైపుణ్యాన్ని, భావ వ్యక్తీకరణను, సౌకుమార్యాన్ని కలిగి ఉండేవికావు. మిగిలిన అన్ని కళలలానే ప్రాచీన, మధ్య, నవీన రాజ్యకాలాల్లో, ఈ ఉపకళలు కూడా రాజాదరణను, జనాదరణను పొందాయి.

థైనైట్ కాలానికి చెందిన వివిధ అవశేషాలు 'అబిడాస్', 'మెంఫిస్' ప్రాంతాలలోగల సమాధులలో లభ్యమయ్యాయి. వాటివల్ల అప్పటి దారుకర్మ (Carpentary), 'దంతకర్మ' (Ivory carving) వంటి వాటిని గురించి తెలియడానికి అవకాశం వచ్చింది. అదే విధంగా, పచ్చ, ఇంద్రనీల వంటి రాళ్ళను, బంగారం వంటి లోహాలను అభినివేశంతో కూర్చిచేసిన కంకణాల వంటి ఉదాహరణలు, అప్పటి కళాకారుని నైపుణ్యానికి మచ్చుతునకలు. ఆ రోజులలో క్వార్ట్జైట్, స్ఫటికం, డయొరైట్, అబ్సిడియన్ వంటి రాళ్ళను (శిలా ఖనిజాలు) ఉపయోగించి, పాత్రలు చేసే కళ ఒక ఉన్నతమైన స్థాయికి ఎదిగింది. ఈ పాత్రలపైగల వర్ణ చిత్రాలు, చిత్రలేఖనా పరిణామంలో కూడా అపూర్వమైనవి.

ప్రాచీన రాజ్యకాలంలో కూడా, విశేషంగా ఆభరణాలు, వస్తు సామాగ్రి (Furniture), వస్త్రముల వంటివి విరివిగా లభ్యమైనాయి. ఈ కాలంలోని వానిలో 'ఖియోప్స్' రాజు తల్లి అయిన హెటెఫెరెస్ I (Hetepheres I) సమాధి, అపూర్వమైన దారుకర్మ నైపుణ్యాన్ని సూచిస్తున్నది. దీనిలోగల తాపడం చేసిన బంగారు రేకులు పొదగబడిన వివిధ రత్నాల వంటివి, కళాకారుని నైపుణ్యానికి గొప్ప ప్రతీకలు.

మధ్యరాజ్యకాలంలో ఆభరణాలను చేయడంలో ఎంతో వైవిధ్యం కనబడుతుంది. బంగారు, వెండి నగలను చేయడంలోను, మెరుగుపెట్టి రత్నాలను పొదగడంలోను ఎంతో నైపుణ్యం ఉంది. అటువంటి ఉదాహరణలను 'దాషుర్', 'లహనీ వంటి చోట్ల చూడగలం. వివిధ అలంకరణ సామాగ్రి అయిన అద్దాలు, మైపూతలు ఉంచుకొనే రకరకాల జాడీలు, వేర్వేరు హారాలు, దుద్దులు, రింగుల వంటివి, ఎంతో వైవిధ్యాన్ని సూచిస్తున్నాయి. 'ఎల్‌బెర్షె' వద్ద స్త్రీలు ప్రత్యేకంగా ఎద మీద నుండి జారుతూ ఉపయోగించే 'లాకెట్' వంటి ఆభరణం (హారం వలె) లభ్యమయింది.

నవీన రాజ్య కాలంలో థట్మోస్ నుబియాను ఆక్రమించిన తరవాత ఈజిప్ట్‌లో పెరిగిన బంగారం వల్ల, వివిధ ఆభరణాల సంఖ్య, వైవిధ్యం కూడా పెరిగింది. కాని, అది కేవలం రాణులకు, ఇతర ఉన్నతోద్యోగులకు మాత్రం పరిమితమయింది. బంగారుతో చేసిన చిన్నచిన్న పాత్రలు, గొడ్డళ్ళు, ఛురికలు లభ్యమయ్యాయి. చిన్న చిన్న పాత్రల మీద అనేక రకాల అలంకరణలు కూడా ఉన్నాయి. అవి లతలు, చేపల వంటివి. దీనివల్ల ఆయా కళాకారుల పనితనాన్ని అంచనా వేయడానికి అవకాశం కలుగుతుంది.

కేవలం ఆభరణాలు, గృహోపకరణ వస్తువులే కాక, వివిధ రీతుల వస్త్రాల వంటి వానిని కూడా, ఈజిప్ట్ కళాకారుని పరిణామంలో ఒక గుర్తుగా భావించొచ్చు.

## 10.3. సంగ్రహంగా

1. ఈజిప్ట్ దేశంలో కళలు థైనైట్ కాలం (క్రీ.పూ. 3700-2780) నుండి నవీన రాజ్య కాలం (క్రీ.పూ. 1085) చివరి వరకు, విశేషమయిన పరిణామాన్ని పొందాయి.
2. ఇవి, 'చావు పిదప జన్మ' అనే సిద్ధాంతం ప్రాతిపదికగా అభివృద్ధి చెందాయి.
3. పిరమిడ్లు, 'కా' అనే ప్రేతాత్మల దేవాలయాలు, 'రా', 'ప్తా', 'రే', 'హోరస్', 'అమున్-రే' వంటి వివిధ జాతీయ స్థాయి దేవాలయాలు, వాటిలో అభివృద్ధి పొందిన శిల్పం, చిత్రలేఖనాలు అన్నీ ఒక సామూహికమైన రాజ సమాదరణవల్ల కలిగిన అభివృద్ధికి సూచికలు.
4. స్వేచ్ఛ ఏ మాత్రం లేక, ప్రకృతికి, సంప్రదాయానికి కట్టుబడి ఉండే చిత్రకారుడు, కాలగమనంలో ఎంతో స్వేచ్ఛను, వేగాన్ని పొందాడు.
5. కేవలం మతపరమైన విషయాలను మాత్రం చిత్రించే వ్యక్తి, లౌకిక జీవితానికి దర్పణం పట్టాడు.
6. కేవలం ఆటవికమైన జీవనానికి అద్దం పట్టిన కళ, రానురాను నాగరిక జీవనానికి చిత్రదర్శినిగా మారింది.
7. కళ వ్యక్తిగతమైన స్థానిక స్థాయి నుండి జాతీయ స్థాయికి ఎదిగింది.
8. కళ ఈజిప్షియన్‌ల జీవనానికి సాలంకృతమైన భాష్యాన్ని చెప్పే మాధ్యమంగా పరిణమించింది.

## 10.4. పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. ఈజిప్ట్‌లోగల పిరమిడ్లు, ప్రేతాత్మల దేవాలయాల గురించి రాయండి.
2. ఈజిప్ట్‌లో కళాపరిణామాన్ని వివరించండి.
3. ఈజిప్ట్‌లో చిత్రలేఖనాభివృద్ధిని సమీక్షించండి

II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.

1. ఉపకళలు
2. వ్యక్తి చిత్రాలు
3. టెల్ ఎల్ అమర్నా సంప్రదాయం

B R A O U

## 10.5 ఉపయుక్త గ్రంథాలు


**Encyclopaedia Britannica,** Vol. 8, Pages 27-91

**Encyclopaedia of World Art,** Vol. 4, Pages 618-711

Herman Schneider : **History of World Civilisation,** London, 1931.

Hutchinson : **Ancient Races**

Korodkin, F : **History of the Ancient World,** Moscow, 1987

Pramathnath Bus : **Epochs of Civilization,** New Delhi, 1978

Vish, W.S. (ed) : **History of the World**

## 10.6 పదకోశం

సిర్డబ్ : ఒక ప్రత్యేకమైన గది; జోసర్ పిరమిడ్ లోనిది.

శిలాకళ : ఇది ప్రధానంగా ప్రాక్చారిత్రక ఈజిప్ట్‌లో పెంపొందింది.

## అనుబంధం

### ఈజిప్ట్ చరిత్రలో తేదీలు

| వంశం సంఖ్య | క్రీ.పూ. | ప్రధానమైన రాజులు |
|---|---|---|
| 1. | 4326-4265 | మెనా |
| | 4158-4128 | డెన్ |
| | 4112-4104 | సెయర్‌ఖెట్ |
| 2. | 4040-3990 | కకా |
| 3. | 3803-3784 | జెసర్ |
| 4. | 3747-3718 | స్నెఫెరు |
| | 3718-3655 | ఖఫు |
| | 3655-3589 | ఖోఫ్రా |
| | 3559-3526 | మెన్‌కౌరా |
| 5. | 3441-3397 | న్యూసెర్రా |
| | 3760-3330 | ఉనాస్ |
| 6. | 3288-3235 | పెపీ I |
| | 3228-3134 | పెపీ II |
| 11. | 2597-2593 | మెంట్‌హోటెప్ IV |
| 12. | 2584-2564 | అమెనెంహెట్ I |
| | 2564-2519 | సెనుసర్ట్ I |
| | 2484-2465 | సెనుసర్ట్ II |
| | 2465-2384 | సెనుసర్ట్ III |
| | 2432-2384 | అమెనెంహెట్ II |
| 13. | 2371-1918 | అరవైనుంది రాజులు |
| 15. | 2371-2111 | ఖ్యాన్‌అపెపా మరియు నలుగురు రాజులు |

BRAOU

| వంశం సంఖ్య | క్రీ.పూ. | ప్రధానమైన రాజులు |
|---|---|---|
| 17. | 1734-1583 | సెక్యానెన్-రా మరియు 42మంది రాజులు |
| 18. | 1573-1560 | ఆహ్మోస్ I |
| | 1560-1539 | అమెన్హోటెప్ I |
| | 1539-1514 | టాహుట్మోస్ I |
| | 1514-1501 | టాహుట్మోస్ II, హట్షెప్సుట్ |
| | 1501-1447 | టాహుట్మోస్ III |
| | 1449-1423 | అమెన్హోటెప్ II |
| | 1423-1413 | టుహుట్మోస్ IV |
| | 1413-1377 | అమెన్హోటెప్ III |
| | 1377-1361 | అఖెనాటన్ |
| | 1351-1339 | టుటన్ఖామెన్ |
| | 1322-1318 | హెరెమ్హెబ్ |
| 19. | 1317-1295 | సెటి I |
| | 1295-1229 | రామ్సెస్ II |
| | 1229-1210 | మెర్నెప్తా |
| 20. | 1195-1163 | రామ్సెస్ III |
| | 1173-1118 | రామ్సెస్ X |
| 21. | 976-940 | పసెబ్ఖెన్ I |
| 22. | 940-919 | షెషెన్క్ I |
| | 878-852 | ఉసర్కోన్ II |
| 25. | 748-725 | పరిఖి I |
| | 717-705 | షబాకా |
| | 693-667 | తహర్ఖువా |
| 26. | 664-610 | ప్సంటెక్ I |
| | 610-594 | నెకో II |
| | 589-570 | హాఅబ్రా |
| | 570-526 | అహ్మోస్ II |
| 27. | 525-521 | కాంబిసెస్ |
| | 521-486 | డేరియస్ I |
| 29. | 399-393 | నైఫారుద్ |

| వంశం సంఖ్య | క్రీ.పూ. | ప్రధానమైన రాజులు |
| --- | --- | --- |
| 30. | 378-361 | నెఖ్మేన్‌బెఫ్ |
| | 359-342 | నెఖ్‌హోర్‌హెబ్ |
| గ్రీక్‌లు | 332-323 | అలెగ్జాండర్ |
| | 323-285 | టాలెమీ I |
| | 285-248 | టాలెమీ II |
| | 248-221 | టాలెమీ III |
| | 51-30 | క్లియోపాత్రా VI |
| | 30- | అగస్టస్ |

(మూలం : Hutchinson : Ancient Races )

BRAOU

BRAOU

## డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

### సామాజిక శాస్త్రాల విభాగం

### చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

### మొదటి సంవత్సరం

### కోర్స్ - 1 : ప్రాచీన నాగరికతలు

### పాఠ్యప్రణాళిక

**ఖండం - I : చరిత్ర పూర్వయుగం నుండి చారిత్రక యుగం వరకు**

భాగం - 1 : చరిత్ర పూర్వయుగం : చారిత్రక సంధి యుగం

భాగం - 2 : చారిత్రక యుగ ప్రారంభం

**ఖండం - II : మెసపటోమియా**

భాగం - 3 : మెసపటోమియా నాగరికతా లక్షణాలు

భాగం - 4 : సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు

భాగం - 5 : మతం - తత్వ వివేచన

భాగం - 6 : కళలు - శాస్త్రవిజ్ఞానం

**ఖండం - III : ఈజిప్ట్**

భాగం - 7 : ఈజిప్ట్ నాగరికతా లక్షణాలు

భాగం - 8 : సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు

భాగం - 9 : మతం - తత్వ వివేచన

భాగం - 10 : కళలు - వాస్తువు

**ఖండం - IV : ఇండియా**

భాగం - 11 : హరప్పా సంస్కృతి నేపథ్యం

భాగం - 12 : హరప్పా సంస్కృతి లక్షణాలు

భాగం - 13 : సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు

భాగం - 14 : మతం, కళలు, వృత్తి కళలు

BRAOU

**ఖండం - V : చైనా**

భాగం - 15 : చైనా నాగరికతా లక్షణాలు

భాగం - 16 : సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు

భాగం - 17 : తత్వ వివేచన - మత వ్యవస్థ

భాగం - 18 : కళలు - వాస్తువు

**ఖండం - VI : గ్రీస్**

భాగం - 19 : గ్రీక్ నాగరికతా లక్షణాలు

భాగం - 20 : సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు

భాగం - 21 : మతం - తత్వ వివేచన

భాగం - 22 : కళలు - వాస్తువు

BRAOU

లేదా

బాబిలోనియన్ల శాస్త్ర విజ్ఞానాన్ని తెలియజేయండి.

7. ఈజిప్ట్ నాగరికతను ఇతర నాగరికతలతో పోల్చి చూడండి.

లేదా

ఈజిప్ట్ నాగరికతకు చెందిన ఉప కళలను (Minor Arts) పరిశీలించండి.

8. సింధు నాగరికతా ప్రాముఖ్యత ఎట్టిది ?

లేదా

సింధు ప్రజల వ్యాపారవాణిజ్యాలు ఎలా సాగాయి ?

9. చైనాకు, భారతదేశానికి గల సాంస్కృతిక పోలికలను పరిశీలించండి.

లేదా

గ్రీక్ రాజకీయ వ్యవస్థపై ప్లేటో, అరిస్టాటిల్‌ల రాజకీయ సిద్ధాంతాల ప్రభావాన్ని తెల్పండి.

BRAOU

# డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కార్యక్రమం

## మొదటి సంవత్సరం

## మాదిరి పరీక్షా పత్రం

## కోర్స్ - 1 : ప్రాచీన నాగరికతలు

సమయం: 3 గంటలు | మార్కులు: 100

### భాగం - A

**I.** క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. చరిత్ర పూర్వయుగాన్ని గురించి శాస్త్రవేత్తల అధ్యయనంలోని వివిధ దశలను వర్ణించండి.

లేదా

కాంస్య యుగ నాగరికతలలోని సామాన్య లక్షణాలను పేర్కొనండి.

2. మెసపటోమియా నాగరికతా ఉనికి, విస్తరణ, సంపన్నతను తెలియజేయండి.

లేదా

ఈజిప్ట్ నాగరికతా కాలంనాటి సామాజిక వ్యవస్థను సమీక్షించండి.

3. సింధు ప్రజల మతాచారాలను, మతవిశ్వాసాలను విశ్లేషించండి.

లేదా

చైనా నాగరికతకు చెందిన ఆర్థిక వ్యవస్థను పరిశీలించండి.

4. చైనాలో చిత్రలేఖన ప్రాముఖ్యత, పరిణామాల గూర్చి వివరించండి.

లేదా

గ్రీక్ నాగరికతా లక్షణాలను విశ్లేషించండి.

### భాగం - B

**II.** క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

5. హోమోసేపియన్ల గురించి మీకు తెలిసిన విషయాలను పేర్కొనండి.

లేదా

అయోయుగపు రాజకీయ, ఆర్థిక పరిణామాలను విశ్లేషించండి.

6. సుమేరియా ఆర్థిక జీవన మెలాగుండేది ?

BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

## చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం

## కోర్స్ - I : ప్రాచీన నాగరికతలు

## అభ్యాసం - 1

గమనికలు :

- పుస్తకాలను చూచి, జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయాలి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకన కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

### భాగం – A

**I.** క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. శిలా యుగాల లోని పరికరాలు, పరిశ్రమలు, స్థావరాలను సమీక్షించండి.
2. సుమేరియా నగర రాజ్యాల స్థాపన, వాటి పాలనా వ్యవస్థను సంగ్రహంగా తెల్పండి.

### భాగం – B

**II.** క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. నగర విప్లవాన్ని వివరించండి.
2. కాల్డియన్‌ల శాస్త్రవిజ్ఞానాన్ని పరిశీలించండి.

BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

### చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం

### కోర్స్ - 1 : ప్రాచీన నాగరికతలు

## అభ్యాసం - 2

గమనికలు :

- పుస్తకాలను చూచి, జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయాలి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకన కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

### భాగం – A

**I.** క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. ఈజిప్ట్ ఆర్థిక వ్యవస్థను విశ్లేషించండి.
2. సింధు లిపిని గుర్తించడానికి నేటివరకు జరిగిన ప్రయత్నాలను సమీక్షించి, సింధు నాగరికతా నిర్మాతలెవ్వరో తెల్పండి.

### భాగం – B

**II.** క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. పిరమిడ్లను గురించి మీకు తెలిసిందేమిటి ?
2. సింధు నాగరికతా వ్యాప్తిని పేర్కొనండి.

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

## చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం

## కోర్స్ - 1 : ప్రాచీన నాగరికతలు

## అభ్యాసం - 3

గమనికలు :

- పుస్తకాలను చూచి, జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయాలి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకన కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

### భాగం – A

**I.** క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. చైనా నాగరికతా లక్షణాలను సమీక్షించండి.
2. గ్రీక్‌ల సామాజిక, ఆర్థిక వ్యవస్థలను విశ్లేషించండి.

### భాగం – B

**II.** క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. కన్ఫ్యూషియస్ సిద్ధాంతాలను పేర్కొనండి.
2. సోక్రటీస్ యుగ తత్వ వివేచనను విశ్లేషించండి.

BRAOU

# అందరికీ అందుబాటులో ఉన్నత విద్య




డా॥ బి.ఆర్
అంబేద్కర్
సార్వత్రిక
విశ్వవిద్యాలయం

రోడ్ నెం. 46, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ - 500 033

M.A.H.(P)-1

# చరిత్ర

# ప్రాచీన నాగరికతలు

2




Dr. B.R. AMBEDKAR OPEN UNIVERSITY
EDUCATION AT YOUR DOORSTEP

BRAOU

# చరిత్ర

# ప్రాచీన నాగరికతలు

## ఖండాలు : IV - VI

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్

2004

# రచయితల బృందం


సంపాదకులు
కీ.శే. ఆచార్య వి. ఎమ్. రెడ్డి
ఆచార్య యమ్. రాధాకృష్ణ శర్మ

సహాయ సంపాదకులు
ఆచార్య వి. రామకృష్ణా రెడ్డి
కుమారి ఇ. సుధారాణి

రచయితలు
డా. సి. వి. రామచంద్ర రావ్
శ్రీ . ఎ. వి. కోటిరెడ్డి
డా. కె. సత్యమూర్తి

మూల్యాంకనం
ఆచార్య పి. ఝాన్సీ లక్ష్మి

ముఖచిత్రం
యమ్. రమేష్



డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం , హైదరాబాద్
ప్రథమ ముద్రణ 1995
పరిష్కృత ముద్రణ - 1999, 2000 **2002** 2003 ,2004



1995 డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.

BRAOU

©అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏభాగాన్నైనా ఉపయోగించదల్చుకుంటే, విశ్వవిద్యాలయ అనుమతిని పొందాలి. ఈ పుస్తకం సార్వత్రిక విశ్వవిద్యాలయ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ఒక భాగం.



ఇతర వివరాలకు :
డైరెక్టర్ (అకడమిక్),
డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం,
రోడ్ నెం. 46, జూబ్లీ హిల్స్,
హైదరాబాద్ - 500 033. ఆం.ప్ర



Lr. No. 953/Dr. BRAOU/DMP/PTG/F.No.28/J.O .No. 002 Copies: 400 Books

Printed at Kesava Art Printers, Red Hills, Lakdi-ka-pool, Hyderabad -500 004.

# పరిచయం

ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో , మానవ, సమాజ ఆవిర్భావం, సంస్కృతీ నాగరికతలు ఏవిధంగా పరిణామం చెందుతూ వచ్చిందీ, సామాజిక, ఆర్థిక, మత, రాజకీయ వ్యవస్థలు ఏ విధంగా ఏర్పడి, మారుతూ వచ్చిందీ తెల్పడమే, చరిత్ర చేస్తున్న పని. చరిత్ర పూర్వ యుగ, చారిత్రక సంధి యుగాల్లో మానవుని అలవాట్లు, ఆహార సేకరణ, వేషధారణ, వినోదాలు, ఇతర ప్రాణులతో అతడు మెలగిన తీరు, ఆదిగా గల విషయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, గ్రహించగల్గినప్పుడే, చారిత్రక యుగ పరిణామాలను సరిగా, సంపూర్ణంగా, అర్థం చేసుకునేందుకు వీలౌతుంది. ప్రపంచ చరిత్రలో ఈజిప్ట్ , మెసపటోమియా, హరప్పా, చైనా, గ్రీక్ నాగరికతలు, ' ప్రాచీన నాగరికతలు ' గా , ప్రసిద్ధిగాంచాయి. ఆయా ప్రాంతాల్లో తొలి నాగరికతలుగా విలసిల్లి, బాగా వ్యాప్తి చెందాయి. సామాజిక, ఆర్థిక, మత, రాజకీయ, పరిపాలన, కళ, సాహిత్య రంగాల్లో తదుపరి యుగాల్లో పెల్లుబికి వచ్చిన పరిణామాలు, మార్పులకు, ఇవి మూలంగా, ప్రధాన భూమికలుగా నిల్చాయి.

చరిత్రలో ప్రథమ సంవత్సర స్నాతకోత్తర పాఠ్యాంశాలను అధ్యనం చేసే, డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ విద్యార్థులకు, ' ప్రాచీన నాగరికతలు ' కోర్సుగా రూపొందించబడినాయి. వీటి పరిణామ, వికాసాలతోబాటు, ఈ ప్రాచీన రాజ్యాల్లో నెలకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, మత వ్యవస్థలు, సాహిత్య, తాత్విక, వాస్తు, కళా రంగాల్లో సంభవించిన మార్పులు, ఎంతో వివరంగా, ప్రయోజనకరంగా, చర్చించబడినాయి.

ఈ కోర్సులో మొత్తం ఆరు ఖండాలు, ఇరవై రెండు భాగాలున్నాయి. పఠనా సౌలభ్యం కోసం, దీనిని రెండు పుస్తకాలుగా ముద్రించడమౌతుంది. మొదటి పుస్తకంలో , మొదటి మూడు ఖండాలకు సంబంధించిన పది భాగాలను చేర్చడం జరిగింది. వీటిలో, చరిత్ర పూర్వయుగ, చారిత్రక సంధి యుగ పరిణామాలు, చారిత్రక యుగ ప్రారంభం, మెసపటోమియా, ఈజిప్ట్ నాగరికతలు, వివరంగా చర్చించబడ్డాయి. రెండో పుస్తకంలో, చివరి మూడు ఖండాలకు చెందిన పన్నెండు భాగాలను పొందుపర్చడమైంది. వీటి ద్వారా, ప్రసిద్ధి గాంచిన భారతీయ (హరప్పా ) చైనా, గ్రీక్ నాగరికతలు, విపులంగా విశ్లేషించబడ్డాయి. వీటి అధ్యయనం ద్వారా , ఈ ప్రాంతాల్లోని నేటి సంస్కృతీ నాగరికతలు, సంప్రదాయికతను, నవ్యతను, ఏ మేరకు , ఏ యే రంగాల్లో అలవర్చుకున్నాయనే విషయాల్లో విద్యార్థులకు సరైన అవగాహన ఏర్పడగలదని ఆశిస్తున్నాం.

అత్యంత ప్రాధాన్యత గల " ప్రాచీన నాగరికతల " గురించి క్షుణ్ణంగా తెలుసుకునేందుకు, ఈ పాఠ్య భాగాలు తోడ్పడగలవని విశ్వవిద్యాలయం ఆశిస్తూంది.

BRAOU

విషయ సూచిక


| | | పుట నెం. |
|---|---|---|
| ఖండం - IV: | ఇండియా | |
| భాగం - 11 : | హరప్పా సంస్కృతీ నేపథ్యం | 3 |
| భాగం - 12 : | హరప్పా సంస్కృతీ లక్షణాలు | 13 |
| భాగం - 13 : | సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు | 22 |
| భాగం - 14 : | మతం, కళలు, వృత్తి కళలు | 30 |
| ఖండం - V : | చైనా | |
| భాగం - 15 : | చైనా నాగరికతా లక్షణాలు | 43 |
| భాగం - 16 : | సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు | 53 |
| భాగం - 17 : | తత్వ వివేచన - మత వ్యవస్థ | 67 |
| భాగం - 18 : | కళలు - వాస్తువు | 82 |
| ఖండం - VI : | గ్రీస్ | |
| భాగం - 19 : | గ్రీక్ నాగరికతా లక్షణాలు | 97 |
| భాగం - 20 : | సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు | 107 |
| భాగం - 21 : | మతం - తత్వ వివేచన | 123 |
| భాగం - 22 : | కళలు - వాస్తువు | 139 |
| | పాఠ్య ప్రణాళిక | |
| | మాదిరి పరీక్షా పత్రం | |
| | అభ్యాసాలు | |


BRAOU

BRAOU

# ఖండం - IV : ఇండియా

## పరిచయం

ఈ ఖండంలో నాలుగు భాగాలున్నాయి. ఈ నాలుగు భాగాలలో, సాంకేతికంగా హరప్పా సంస్కృతి, లేదా హరప్పా నాగరికత అని, సాధారణంగా సింధులోయ నాగరికత, లేదా సింధు నాగరికత అని పేర్కొన్న మూల భారతీయ నాగరికత (Proto - Indian Civilization) ప్రధాన లక్షణాలను గురించి తెలియజేయడం జరిగింది. హరప్పా నాగరికత ఆవిష్కరణను గురించి, ప్రాముఖ్యాన్ని, వ్యాప్తిని, కాలాన్ని, నిర్మాతలను గురించీ,తెలియజేయడం జరిగింది. నేటికీ సమస్యగానే మిగిలిఉన్న సింధు లిపి భాషను గుర్తించడానికి, దాని ఆధారంగా ఆ నాగరికత నిర్మాతలను గుర్తించటానికి జరిగిన, జరుగుతున్న ప్రయత్నాలను, వాటి ఫలితాలను సమీక్షించడం జరిగింది. ఆ నాగరికత లోని రాజకీయ, సాంఘిక, ఆర్థిక పరిస్థితులను వివరించడం జరిగింది. మతాచారాలను, మత విశ్వాసాలను గురించి విమర్శనాత్మకంగా పరిశీలించడం జరిగింది. సింధు నాగరికత క్షీణతకు, నాశనానికి గల కారణాలను గురించి పండితులు వివిధంగా పేర్కొన్న అభిప్రాయాలను తెలియజేయడం జరిగింది.

11వ భాగంలో హరప్పా సంస్కృతి ఆవిష్కరణ, ప్రాముఖ్యం, వ్యాప్తి, ఉత్పత్తి కాలాలను గురించి తెలియజేయడమైంది. నేటికీ చర్చనీయాంశాలుగా ఉన్న సింధు లిపి, నిర్మాతలను గురించి వివిధ పండితుల అభిప్రాయాలను వివరించడం జరిగింది.

12వ భాగంలో హరప్పా సంస్కృతి నగరాలను గురించి, నగర నిర్మాణంలోని వైశిష్ట్యాన్ని గురించి వివరించడమైంది.

13వ భాగంలో రాజకీయ, సామాజిక వ్యవస్థలను గురించి, ఆర్థిక వ్యవస్థను గురించి చర్చించడమైంది.

చివరిదైన 14వ భాగంలో, సింధు ప్రజల మతాచారాలు, విశ్వాసాలు, వారు ఆరాధించిన దేవతామూర్తులు, వారనుసరించిన కళలు, వృత్తి కళలను గురించి విశ్లేషించడమైంది.

BRAOU

BRAOU

## భాగం - 11 : హరప్పా సంస్కృతి నేపథ్యం

విషయక్రమం

11.0 లక్ష్యాలు

11.1 ఆవిష్కరణ

11.2 ప్రాముఖ్యం

11.3 వ్యాప్తి

11.4 ఉత్పత్తి, కాలం, పరిణతి

11.5 సింధు లిపి

11.6 నిర్మాతలు

11.7 సంగ్రహంగా

11.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

11.9 ఉపయుక్త గ్రంథాలు

### 11.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల, సింధు నాగరికత ఆవిష్కరణ కాలం, దానిని ఆవిష్కరించిన పురావస్తు శాస్త్రజ్ఞులు , భారతదేశ చరిత్రలో దానికి గల ప్రాముఖ్యం , దాని వ్యాప్తి , కాలం గురించి క్షుణ్ణంగా తెలుసుకోగలగాలి.

దీనితోబాటు, సింధు నాగరికుల లిపి, ఈ నాగరికత నిర్మాతలను గురించి విశ్లేషించగలగాలి.

BRAOU

### 11.1 ఆవిష్కరణ (Discovery)

సింధులోయ నాగరికతా స్థావరాలలో ప్రసిద్ధి గాంచినది హరప్పా. దీని వద్ద గల గుట్టలు పురావస్తు ప్రాముఖ్యం కలవిగా, 1826 నాటికే జిజ్ఞాసువుల దృష్టిని ఆకర్షించాయి. హరప్పాకు గల పురావస్తు ప్రాముఖ్యాన్ని భారతదేశపు పురావస్తు శాఖ మొదటి డైరెక్టర్ జనరల్ (Director - General of Archaeology, 1871-85) గా నియమితుడైన అలెగ్జాండర్ కన్నింగ్ హామ్ (Alexander Cunningham)1873 లోనే గుర్తించాడు. సింధు నాగరికతకు చెంది, ఎద్దు బొమ్మతో ఉన్న ఒక ముద్ర (seal with a humped bull) ను గురించి, 1875లో కన్నింగ్‌హామ్ రాశాడు. కాని, సర్ జాన్ మార్షల్ (Sir John Marshall) పురావస్తు శాఖ డైరెక్టర్ - జనరల్‌గా ఉన్న కాలంలో, అతని పర్యవేక్షణలో, 1921లో పురావస్తు శాస్త్రజ్ఞుడు దయారాం సాహ్ని హరప్పా వద్ద జరిపిన తవ్వకాల ఫలితంగా, ఈ నాగరికతను మొదటగా గుర్తించి, దీనిని సాంకేతికంగా ' హరప్పా నాగరికత ', ' హరప్పా సంస్కృతి ' అని పేర్కొన్నారు. నేటి పాకిస్థాన్‌లో, (పశ్చిమ) పంజాబ్ రాష్ట్రంలోని మాంట్‌గోమరీ (షాహీవాల్) జిల్లాలో రావీ నదీ తీరాన హరప్పా ఉంది. హరప్పా తవ్వకాల వల్ల , సింధు నాగరికతకు చెందిన ఒక నగరం బయల్పడింది.

క్రీ.శ. 1922 లో, నేటి పాకిస్థాన్‌లో సింధు రాష్ట్రంలోని లార్కానా జిల్లాలో, సింధు నదీ తీర సమీపంలో ఉన్న మొహంజొదారో వద్ద R.D బెనర్జీ జరిపిన తవ్వకాల ఫలితంగా, సింధు నాగరికతకు చెందిన మరొక మహానగరం బయల్పడి, ఈ నాగరికత శిథిలాలు, వస్తు అవశేషాలు విస్తారంగా లభ్యమైనాయి. ఈ నాగరికతా లక్షణాలు కొన్నింటికి, మధ్య ఆసియా (ఇరాక్) లోని ప్రాచీన నాగరికత అయిన సుమేరియన్ (Sumerian) నాగరికతా లక్షణాలలో కొన్నింటితో గల సామ్యాన్ని బట్టి, ఈ నాగరికతను మొదట్లో కొందరు పండితులు ఇండో-సుమేరియన్ నాగరికత అని గూడా పిలిచారు. కాని, ఆ తరువాత జరిపిన తవ్వకాల వల్ల, ఈ నాగరికత శిథిలాలు, అవశేషాలు, హిమాలయ పర్వత పాదాల నుండి అరేబియా సముద్రం వరకు వ్యాపించిన సింధులోయలోని అనేక స్థలాలలో లభ్యమైనాయి. అందువల్ల, ఈ నాగరికతకు మధ్య ఆసియా నాగరికతలతో కొన్ని పోలికలున్నప్పటికీ, ఈ నాగరికత సింధులోయలో స్వతంత్రంగా రూపొందిందని నిర్ధారించి, పండితులు ఈ నాగరికతకు సింధు (నదీ) లోయ నాగరికత అనే పేరును ధ్రువీకరించారు. దీనిని క్లుప్తంగా సింధు నాగరికత (Indus Civilization) అని కూడా పిలిచారు. నేడు ఈ నాగరికతను సాంకేతికంగా హరప్పా నాగరికత, లేదా హరప్పా సంస్కృతి అని, సాధారణంగా సింధు (లోయ) నాగరికత అని పిలుస్తున్నారు. సింధు నదీ తీరాన ఉన్న మొహంజొదారోకు, రావీ నదీ తీరాన ఉన్న హరప్పాకు, సింధు నదిని వెంబడించి, మధ్య గల దూరం 655 కి.మీ. ( 400 మైళ్ళు ). మొహంజొదారో అంటే మృతుల దిబ్బ (Mound of the Dead) అని అర్థం. సర్ జాన్ మార్షల్ పర్యవేక్షణలో, 1921 - 1922 తర్వాతి దశాబ్ది కాలంలో, మొహంజొదారోలో పెద్ద ఎత్తున జరిగిన తవ్వకాల ఫలితంగా తెలియవచ్చిన ఈ నాగరికత లక్షణాలను, విశేషాలను సర్ జాన్ మార్షల్ పరిశోధించి ప్రకటించడంతో, సింధు నాగరికతా వైశిష్ట్యం ప్రపంచానికి వెల్లడైంది. •

## 11.2 ప్రాముఖ్యం

సింధు లోయ నాగరికత బయల్పడక ముందు, భారతదేశంలో ఋగ్వేద, లేదా తొలి వేద కాలం (Rigvedic or Early Vedic age) నుండి నాగరికత ప్రారంభమయిందని చరిత్రకారులు విశ్వసిస్తుండేవారు. సింధు నాగరికతను గుర్తించటంతో, భారతీయ నాగరికత ప్రాచీనతా పరిమితి, (antiquity) ఒక్కసారిగా వేయి సంవత్సరాలు వెనుకకు, క్రీ.పూ. 3000 ప్రాంతానికి జరిగింది. జవాహర్‌లాల్ నెహ్రూ చెప్పినట్లు, ఈ త్రవ్వకాలు ప్రాచీన చరిత్రను గురించిన భావాలలో విప్లవాత్మకమైన మార్పును తెచ్చి ( " These excavations have revolutionised the conception of ancient history " J. Nehru ), సుమేర్, అక్కడ్, బాబిలన్, ఈజిప్ట్ మొదలయిన అత్యంత ప్రాచీన నాగరికతా కేంద్రాలతో పాటు, నేడు భారతదేశాన్ని కూడా ప్రపంచంలోని ప్రథమ నాగరికతా కేంద్రాలలో ఒకటిగా చరిత్రకారులు పరిగణిస్తున్నారు.

సింధు నాగరికతతోపాటు, పైన పేర్కొన్న ప్రాచీన నాగరికతలన్నీ, క్రీ.పూ. 4000 ప్రాంతంలో మధ్యధరా ప్రాంతం నుండి జపాన్ వరకు విస్తరించి ఉన్న తామ్రశిలా నాగరికత (chalco - lithic or copper -stone civilization) వివిధ రూపాలుగా చరిత్రకారులు గుర్తించారు. మానవ నాగరికతా పరిణామంలో, సింధు నాగరికత కాంస్య యుగాని(Broze Age) కి చెందినది. • ఈ ప్రాచీన నాగరికతలు, వాటి లక్షణాలలో కొన్ని పోలికలు ఉన్నాయి. ఈ పోలికలు పాత్రలు, పనిముట్లు, శిలతోకాని, లేదా రాగి, లేదా కంచుతో కాని చేయటం, కొన్ని జంతువులను మచ్చిక చేయటం ; వ్యవసాయ పరిజ్ఞానం ; నగర నిర్మాణ పరిజ్ఞానం ; పరిణతి చెందిన

• Sir J. Marshall (ed)., **Mohenjodaro and the Indus Civilization ( 1931)**

• భారతదేశంలో కాంస్య యుగం ఉండిందని చెప్పడానికి వీలులేదని, అందువల్ల సింధు నాగరికతను తామ్ర - శిలా నాగరికత అనే పిలవాలని కొందరు చరిత్రకారులు భావించారు.

బొమ్మల లిపి; కొన్ని కళారూపాలు. సింధు నాగరికతలో ఈ సామాన్య లక్షణాలను అధిగమించిన కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. ఉదాహరణకు పత్తి వాడకం సింధు నాగరికతకు మాత్రమే పరిమితం; నైల్ ( ఈజిప్ట్ ) నదీ నాగరికతలో సన్నని వస్త్రాల తయారీకి జనుము (Flax) ను వాడారు. అట్లే, మొహంజొదారోలోని మహా స్నానవాటిక (Great Bath), హరప్పాలోని పెద్ద ధాన్యాగారం (Great Granary) వంటి నిర్మాణాలు, మిగిలిన ప్రాచీన నాగరికతా దేశాలలో కానరావు. అట్లే , భూగర్భ మురికి నీటి కాలువల ఏర్పాటు (Underground drainage) కూడా సింధు నాగరికతకు ప్రత్యేకం. మధ్య ఆసియా లోని ప్రాచీన నాగరికతా దేశాలలో ధనమూ, మానవుని మేధస్సును, గొప్ప దేవాలయ నిర్మాణానికి, రాజుల ప్రాసాదాలను, సమాధులను నిర్మించటానికి వెచ్చించగా, సింధు నాగరికతలోని నిర్మాణాలు పౌరుల సౌఖ్యం కోసం నిర్మించబడ్డాయి. సింధు నాగరికతలోని మతం, కొన్ని కళారూపాలు, ఆ నాగరికతకు ప్రత్యేకమయినవి.

భారతదేశంలో సింధులోయ నాగరికతతో ప్రారంభించి, లోహం వాడకంలో సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధిని సాధించడం జరిగింది. సింధు నాగరికత ప్రజలకు ఇనుము, దాని ఉపయోగం తెలియదు. సింధు ప్రజలు ఆయుధాలను, నిత్యోపయోగంలోని వివిధ పరికరాలను, పనిముట్లను తయారు చేయటానికి ఎక్కువగా రాయి (సంస్కృతం - శిల ) ని, పరిమితంగా రాగి లోహాన్ని ( సంస్కృతం - తామ్రం) ఉపయోగించారు. భారత దేశంలో, నేటికి తెలియవచ్చినంతవరకు, ' హరప్పా సంస్కృతి ' అతి ప్రాచీనమయింది. ఈ హరప్పా సంస్కృతి (సింధు నాగరికత) , దానికి సమకాలీనంగా ఉన్న, తర్వాత వచ్చిన అనేక తామ్ర - శిలా సంస్కృతులన్నింటిలో, చాలా పరిణత దశకు చెందిన పట్టణ నాగరికత (Urban civilization) .

హరప్పా నాగరికత లోహం వాడకంలో సాధించిన సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధి, భారత ఉపఖండంలోని కొన్ని ప్రాంతాలలో, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ (Agricultural economy) మీద ఎంతో ప్రభావాన్ని చూపింది. ఈ ప్రాంతాలలో మొట్టమొదటగా పట్టణ నాగరికత అభివృద్ధి చెందటానికి ఇది పునాదైంది. క్రీ.పూ. 3000 నాటి దక్షిణాసియాలోని మొట్టమొదటి పట్టణ నాగరికతగా, హరప్పా నాగరికతకు విశిష్టస్థానముంది. అందువల్లనే, K.N దీక్షిత్ దీనిని " మూల భారతీయ నాగరికత " (Proto - Indian Civilization) అని పేర్కొన్నాడు •. సుప్రసిద్ధ పురావస్తు శాస్త్రవేత్త స్టూవర్ట్ పిగాట్ (Stuart Piggot), ' వాయవ్య భారతంలో పేరు తెలియని మహా సామ్రాజ్యానికి ముఖ్య పట్టణాలు మొహంజొదారో, హరప్పాలు ' అని అన్నాడు.

## 11.3. వ్యాప్తి

పురావస్తు శాస్త్రజ్ఞుల నిరంతర కృషివల్ల, హరప్పా నాగరికత వ్యాప్తి మనకు తెలుస్తున్నది. ప్రధాన నగరాలైన హరప్పా, మొహంజొదారోలు గాక, ఈ నాగరికతకు సంబంధించిన పట్టణాలు, స్థావరాలు చిన్నవి, పెద్దవి నేటికి నాటికి పైబడి, భారత్ - పాకిస్తాన్ ఉపఖండం (Indo - Pak Sub - Continent) లో బయటపడ్డాయి.

• హెచ్.డి. సంకాలియా, సింధు నాగరికతా వాసులకు ఉన్న లిపి జ్ఞానాన్ని బట్టి, అది ప్రాగైతిహాసిక యుగానికి (Proto - Historic Age) చెందుతుందని తెలిపాడు. ఈ ప్రాగైతిహాసిక యుగంలో సంకాలియా, వైదిక యుగాన్ని కూడా చేర్చాడు. సంకాలియా మాటలలో " This literature ( the Vedic and Sastra) can and has been a source of Indian history. But, since it is not written down, it is called here proto - history.

" Likewise, the Indus Valley or Harappan Civilization, though included by some writers under pre-history, should be, and is here included under proto - history . "

- H.D. Sankalia , **The Pre-history and Proto - history of India and Pakistan**, P. 8.

BRAOU

ప్రపంచంలో అతి ప్రాచీన నాగరికతలైన మెసపటోమియా, ఈజిప్ట్, సింధు నాగరికతలలో, సింధు నాగరికత మిగిలిన రెండు నాగరికతల కంటే విస్తృతమైన వ్యాప్తిని పొందింది. మార్టిమర్ వీలర్ చెప్పినట్లు, నాగరికతలన్నిటిలో, హరప్పా నాగరికత మిగిలిన నాగరికతలన్నిటికంటే, ఎక్కువ ప్రదేశంలో విస్తరించింది. ( " Harappan civilization is the most spatially extensive of all civilizations " - Mortimer Wheeler ). బెలూచీ పర్వతాలు, సింధ్ మైదానాలు, కచ్ - కథియవార్ ద్వీపకల్పం, ఘగ్గర్ - యమునా లోయ అనే స్పష్టమైన నాలుగు భౌగోళిక ప్రాంతాలు, ఈ నాగరికతా పరిధిలో ఉన్నాయి. ఈ నాగరికత ఉత్తరంలో జమ్ము నుండి దక్షిణంలో నర్మదా లోయ వరకు, పశ్చిమంలో బెలూచీస్థాన్‌లోని మక్రాన్ తీరం నుండి ఆగ్నేయంలో ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్ వరకు, దాదాపు ఒక మిలియన్ చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో, భారత - పాక్ ఉపఖండం లోని సింధ్, పంజాబ్, బెలూచీస్థాన్, గుజరాత్, రాజస్థాన్, పశ్చిమ ఉత్తర ప్రదేశ్ ప్రాంతాలలో విస్తరించింది. ఇది, ఈజిప్ట్, మెసపటోమియా నాగరికతల విస్తరణ ప్రదేశాలకన్నా, చాలా అధికం. క్రీ.పూ. మూడు, రెండు సహస్రాబ్దులలో ఇంత విస్తారమైన ప్రదేశాన్ని ఆక్రమించిన సంస్కృతీ మండలం మరొకటి లేదు.

భారత్ - పాక్ ఉపఖండంలో నేటికి బయల్పడిన హరప్పా సంస్కృతీ స్థావరాలలో ప్రముఖమైన వాటిలో కొన్నింటిని ఈ క్రింద పేర్కొనడమైంది.

| రాష్ట్రం లేదా ప్రాంతం | హరప్పా నాగరికతా స్థావరాలు |
|---|---|
| బెలూచీస్థాన్ | సుక్తా జెందార్ ( పాకిస్థాన్ ) |
| సింధ్ | మొహంజొదారో, కోట్‌డిజి, చన్హుదారో ( పాకిస్థాన్ ) |
| పంజాబ్ | హరప్పా ( పాకిస్థాన్), రూపర్ ( భారత్) |
| హర్యానా | బన్వాలీ |
| రాజస్థాన్ | కాలీబంగన్ |
| ఉత్తర ప్రదేశ్ | ఆలంగీర్‌పూర్ (మీరట్ సమీపం) |
| గుజరాత్ | లోథాల్, రంగపూర్, సుర్కోతాడ, దైమాబాద్, ధోలవీరా |

B R A O U

నేటికి కనుగొన్న హరప్పా సంస్కృతీ స్థావరాలలో మిక్కిలి దక్షిణంగా ఉన్న స్థావరం, గోదావరీ నదికి ఉపనది అయిన ప్రవరానదీ తీరంలో ఉన్న దైమాబాద్. ఇది హరప్పా నాగరికత మలి దశకు చెందినది. హరప్పా, మొహంజొదారో, చన్హుదారో, లోథాల్, కాలీబంగన్, బన్వాలీ స్థావరాలు, హరప్పా సంస్కృతీ పరిణత దశకు చెందినవి. ఇటుకలతో నిర్మించిన వేదికలు, తీరైన భవనాలు, మురుగునీటి పారుదల (Drainage) మొదలైన లక్షణాలు, ఈ పరిణత దశకు చెందినవి.

## 11.4 ఉత్పత్తి, కాలం, పరిణతి (Origin, time and maturity)

మట్టి ఇటుకలతో నిర్మించిన వేదికలు, తీర్చిదిద్దిన భవనాలు, మురుగునీటి పారుదల సౌకర్యాల వంటి పరిణతి చెందిన నాగరికతా లక్షణాలు ఆరంభమయిన నాటి నుండి, హరప్పా నాగరికత ఆరంభమయినట్లు

చెప్పాలి. 'హరప్పా సంస్కృతి' నగరాల ఆవిర్భావానికి, అవి ఏర్పడటానికి ముందు బెలూచిస్థాన్‌లో, కాలీబంగన్‌లో వెలసి ఉన్న తామ్ర - శిలా నాగరికతా స్థావరాలకూ మధ్య గల సంబంధం తెలియదు. ఈ స్థావరాల నుండి, బహుశా, 'హరప్పా సంస్కృతి' క్రమ పరిణామం చెంది ఉండవచ్చు. అట్లే, మెసపటోమియా ( నేటి ఇరాక్) లోని ప్రాచీన నగరాలతో గల సంబంధం, హరప్పా సంస్కృతి అభివృద్ధికి కొంత దోహదం చేసి ఉండవచ్చు. కాని, హరప్పా సంస్కృతి భారతదేశానికి ప్రత్యేకమై, ఆదేశంలోనే పుట్టిందనే విషయంలో ఎలాంటి సంశయం లేదు. అనేక స్థావరాలలో క్రీ.పూ. 2500 ప్రాంతానికి ఈ నాగరికత స్థిరపడిందని అంచనా. హరప్పా సంస్కృతి విస్తరించిన విశాల ప్రాంతంలో సాంస్కృతిక ఐక్యత (cultural unity) నెలకొని ఉండటం, ఆ సంస్కృతిలోని విశిష్టత.

హరప్పా నాగరికత కాలపరిమితిని గురించి పురావస్తు శాస్త్రజ్ఞులలో విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. దీనిని మొదటగా కనుక్కొన్నప్పుడు, అప్పటి శాస్త్రజ్ఞులు, మెసపటోమియాలోని కాంస్య యుగ నాగరికతలతో దీనికి గల పోలికలను బట్టి, సమకాలీనతను బట్టి, ఈ నాగరికత క్రీ.పూ. 3250-2750 మధ్య కాలంలో విలసిల్లిందని అభిప్రాయపడ్డారు. హరప్పాలో నగర శిథిలాలు ఆరు స్తరాల ( Strata, పొరలు) లో లభించాయి. ఈ స్తరాలనంతా ఖచ్చితంగా గుర్తించి, పై స్తరం నుండి ప్రారంభించి, వరసగా చివరి (Later), మధ్య (Inter), తొలి (Early) అని, మూడు ప్రధాన కాలాలకు చెందిన వాటిగా విభజించారు. మొహంజొదారోలో నగర నిర్మాణ అవశేషాలు (శిథిలాలు) ఏడు స్తరాలలో లభించాయి. ఈ ఏడు స్తరాలకు పురావస్తు శాస్త్రజ్ఞులు ఇచ్చిన కాలం, 500 సంవత్సరాలు. సర్ జాన్ మార్షల్ (Sir John Marshall) ఈ ఏడు తరాల సింధు నాగరికతకు ఇచ్చిన కాల పరిమితి, క్రీ.పూ. 3250 - 2750. మరొక పురావస్తు శాస్త్రజ్ఞుడు (Archaeologist) అయిన ఎర్నెస్ట్ మాకె (Earnest J. Mackay) ఇచ్చిన కాలపరిమితి, క్రీ.పూ. 3050-2550. మొహంజొదారో, లేదా హరప్పా సంస్కృతి కాల పరిమితిని గురించి మరి కొందరు పండితులు తెలిపిన వివిధ కాల పరిమితులు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

మార్టిమర్ వీలర్ (Mortimer Wheeler) క్రీ.పూ. 2500-1500; ఎఫ్. ఆర్. అలిసిన్ (F.R. Allicin) క్రీ.పూ. 2150 - 1700; డేల్స్ (Dales) క్రీ.పూ. 2700-2050; డా. ఛార్లెస్ ఫ్యాబ్రి (Dr. Charles Fabri) క్రీ.పూ. 2800 - 2500; యస్.ఆర్. రావ్ (S.R. Rao) క్రీ.పూ. 2500 - 1500.

కాని, ఇటీవలి కాలంలో జరిగిన త్రవ్వకాల ఫలితంగా తెలియవచ్చిన కొత్త విషయాల, పరిశోధనల వల్ల, కాల నిర్ణయం చేయటంలో అనుసరించిన కార్బన్ - 14, 'డెండ్రొ క్రొనాలజీ' ( Dendro chronology) లేక, వృక్ష వలయ పద్ధతి (Tree - ring analysis) మొదలుగా గల శాస్త్రీయ పద్ధతులవల్ల, ఈ నాగరికత క్రీ.పూ. 2300 - 1750 మధ్య కాలం నాటిదని, ఖచ్చితమైన అభిప్రాయం వెలువడింది. ఈ నాగరికత ఉజ్జ్వల, లేదా పరిణత దశ, క్రీ.పూ. 2300 / 2200 - 2000 నాటిదని చెప్పొచ్చు. క్రీ.పూ. 18వ శతాబ్దం నాటికి హరప్పా సంస్కృతికి చెందిన ప్రధాన నగరాలు, హరప్పా, మొహంజొదారోలు అదృశ్యం కాగా, మిగిలిన స్థలాలలో, స్థావరాలలో ఈ సంస్కృతి క్రమంగా క్షీణించి, గుజరాత్‌లో, రాజస్థాన్‌లో, హర్యానాలో, పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లో మరికొంత కాలం కొనసాగింది.

సింధులిపి భాషను గుర్తించడంలో విశేష కృషి సల్పి, దానిని ఋగ్వేద సంస్కృత భాషకు పూర్వం ఉన్న సంస్కృత భాషా విశేషంగా, S.R. రావ్, M.V.N. కృష్ణారావ్ మొదలగు కొందరు పండితులు గుర్తించారు.• S.R. రావ్, కృష్ణారావ్ మొదలగు కొందరు పురావస్తు శాస్త్రజ్ఞుల, లిపి శాస్త్రజ్ఞుల అభిప్రాయంలో, బుద్ధ ప్రకాశ్ మొదలగు కొందరు చరిత్ర కారుల అభిప్రాయంలో•, ఋగ్వేద సంస్కృతి హరప్పా సంస్కృతి మలి దశ , లేదా

• సింధు లిపిని తెలిపే భాషను గురించిన విభిన్న అభిప్రాయాల కోసం సింధు లిపి శీర్షిక కింద చూడొచ్చు.

• వీరి గ్రంథాలకై, ఉపయుక్త గ్రంథ పట్టిక (Bibliography) ను చూడండి.

BRAOU

క్షీణ దశ తర్వాత ఏర్పడిన దాని కొనసాగింపే కాని, దాని కంటే (పూర్తిగా) భిన్నమైనది కాదు. వీరు హరప్పా సంస్కృతిని పరిణత దశ, మలి దశ అనే రెండు దశలకు చెందిన దానినిగా గుర్తించి, ఈ దశల కాల పరిమితిని ఈ క్రింది విధంగా పేర్కొన్నారు: పరిణత దశ (Mature Harappan Culture) - క్రీ.పూ. 2500 - 1900; మలి (క్షీణ ) దశ (Later Harappan Culture) - క్రీ.పూ. 1900 - 1600/1500.

## 11.5 సింధు లిపి

ప్రాచీన మెసపటోమియా (ఇరాక్) లోని ప్రజల వలెనే, సింధు ప్రజలు గూడా లిపిని రూపొందించారు. ఈ లిపిని సింధు నగరాలలో లభించిన ముద్రల మీద, ముద్రికల మీద ఉన్న చిన్న శాసనలలో చూడొచ్చు. ఈ లిపి తెలిపే భాష ఏదో గుర్తించడానికి పురావస్తు శాస్త్రజ్ఞులు, లిపి శాస్త్రజ్ఞులు, చరిత్ర కారులు గత అర్థ శతాబ్దంగా విశేష కృషిని సల్పి , విభిన్నాభిప్రాయాలను వెలిబుచ్చారు. పండితులందరి అంగీకారం, ఆమోదం పొందిన అభిప్రాయమొకటి కూడా, నేటికి లేదు.

1965కు ముందు సింధులిపి తెలిపే భాషను గుర్తించటానికి కృషిసల్పిన పండితులలో ప్రముఖులు, G.R. హంటర్, ఫాదర్ హీరాస్ (Father Heras) లు. 1965 తర్వాత కృషి సల్పిన వారిలో పేర్కొన దగినవారు: భారతీయ పండితులైన S.R. రావ్, M.V.N. కృష్ణారావ్, ఐరావతం మహాదేవన్ ; విదేశీయ పండితులు, ఫిన్నిష్ (Finnish) పండితులైన ఆస్కొ (Asko), పరపోల (Parapola) మొదలయినవారు ; రష్యన్ పండితులైన యూరిజ్. వి . నొరోజోవ్ (Yuriz . v. Knorozov) , అతని ఆధ్వర్యంలోని ఇతర రష్యన్ శాస్త్రజ్ఞులు ; విడిగా కృషి చేసిన ఫెయిర్ సర్విస్ (Fairservis) , కిన్నియర్ విల్సన్ (Kinnier Wilson) మొదలగు వారు•.

కంప్యూటర్ పద్ధతులననుసరించి సింధులిపిని విశ్లేషించి, దాని భాషను నిర్ధారించటానికి మొదటగా ప్రయత్నించినవారు రష్యన్ పండితుడైన యూరిజ్.వి. నోరోజోవ్ (Yuviz . v. Knorozov) , అతని ఆధ్వర్యంలోని రష్యన్ పండిత సముదాయం.

పై పండితులలో ఫాదర్ హీరాస్, తన స్ఫురణే (Intuition) ఆధారంగా, సింధులిపి తెలిపే భాష ప్రాచీన ద్రావిడమని నిర్ధారించాడు. ఫాదర్ హీరాస్ అభిప్రాయాన్ని తర్వాత ఇరవై ఏండ్లుగా రష్యన్, ఫిన్నిష్ పండిత సముదాయాలు స్వీకరించి, సింధులిపి తెలిపే భాష ద్రావిడమనే ముందు నిర్ధారణతో, ఆ లిపిని కంప్యూటర్ పద్ధతుల ద్వారా విశ్లేషించి, పద ప్రయోగ కోశాలను (concordances) రూపొందించారు.

ఇటీవలి కాలంలో ఈ లిపి మీద విశేష కృషి , పరిశోధన చేసిన భారతీయ పండితులు, S.R. రావ్ , M.V.N.కృష్ణారావ్. వీరు సెమెటిక్ లిపి ఆధారంగా సింధులిపిని విశ్లేషించి, ఆ లిపి తెలిపే భాష వైదిక సంస్కృత భాషకు ముందటి రూపమైన సంస్కృత (Indo - Aryan) భాషగా నిర్ణయించారు. S.R. రావ్ అభిప్రాయంలో ఈ లిపి బొమ్మల లిపి (Pictographic script) గా ప్రారంభమై, తర్వాత ఈ లిపి సంకేతాలు, క్రమ క్రమంగా భావ సంకేతాలు (Ideograph, logograph, Rebus writing) గా మారి, చివరి దశలో మాత్రారూపమైన శబ్ద సంకేతాలు (Syllabic and phonetic) గా రూపొంది, అక్షరాలు (alphabet) గా స్థిరపడ్డాయి. ఋగ్వేద భాషకు పూర్వరూపమైన ఈ సంస్కృత భాషలో వచనానికి, లింగానికి మధ్య రాయటంలో భేదాన్ని పాటించలేదని, నాలుగు విభక్తులు మాత్రమే ఉండేవని, S.R. రావ్ అభిప్రాయపడ్డాడు. హరప్పా పరిణత దశలో 62 మౌలిక

• వీరిలో కొందరి రచనలకై ఉపయుక్త గ్రంథ పట్టిక (Bibliography) ను చూచేది.

BRAOU

సంకేతాలతో కూడిన ఈ లిపి, మలి హరప్పా సంస్కృతి కాలానికి ( క్రీ.పూ. 1900 - 1600 ) 22 సంకేతాలకు పరిమితమైందని, ఈ సంకేతాలకు సెమెటిక్ అక్షరాలకు దగ్గర పోలిక ఉందని, S.R. రావ్ భావించాడు. ఈ లిపి సంయుక్తాక్షరాలను తెలుపుతుందని భావించి, ఈ అక్షరాలను మౌలిక సంజ్ఞలుగా, సహాయక సంజ్ఞలుగా S.R. రావ్ విభజించాడు. S.R. రావ్ అభిప్రాయంలో ఒక లిపిలోని మౌలిక సంకేతాలు, లేక సౌజ్ఞలు 50 నుండి 100 కు మించకపోతే, ఆ లిపి సంకేతాలు మాత్రారూపమైన (phonetic script), అక్షర రూపమైన శబ్ద సంకేతాలు. అట్లుగాక, ఈ సంకేతాలు చాలా ఎక్కువగా ఉంటే, అంటే వెయ్యి అంతకు మించి ఉంటే, అవి భావ సంకేతాలు (Ideographic script).

ఐరావతం మహాదేవన్, డా. వాటర్. ఎ. ఫేర్ సర్విస్ ( జూనియర్ ) , డా. ఆస్కో, ప్రపోలా, ప్రొ. Y. u.v. నోరుజోవ్, లిపిని గురించి చేసిన పరిశోధనలలో రెండు ప్రధానమైన లోపాలున్నాయని S.R. రావ్ అభిప్రాయం. 1) ఈ పరిశోధకులు సింధు లిపిని సంయుక్తాక్షరాలుగా గుర్తించక, భావ సంకేతాలుగా మాత్రమే గుర్తించి, అక్షరాలను ప్రధాన సంకేతాలుగా, సహాయక సంకేతాలుగా విశ్లేషించకుండటం 2). వారు విశ్లేషణకు ముందే, ఈ లిపి తెలిపే భాష ప్రాచీన ద్రావిడ భాష అని నిర్ణయించుకొని, విశ్లేషణకు పూనుకోడం.

యస్.ఆర్. రావ్ అభిప్రాయాలను ఐరావతం మహాదేవన్ నిశితంగా విమర్శించాడు (Indian Historical Review, No. 8, 1983). సింధు లిపికి సంబంధించి, తెలిసిన ఒక భాషతో కూడిన ద్విభాషా శాసనమో, మరి ఇతర ఆధారమో లేని పరిస్థితిలో, చాలా భావ సంకేతాలను తెలిపే ఈ లిపిని, ఏక మాత్రలతో (monosyllables), విచిత్ర లక్షణాలతో కూడిన సంస్కృత భాషగా, తన ఆలోచనా విధానానికి అనువుగా, నిరాధారంగా, మార్చారని, మహాదేవన్, S.R. రావ్ అభిప్రాయాలను తీవ్రంగా విమర్శించాడు.

సింధు లిపిని రాసే పద్ధతిని గురించి కూడా, పండితులలో ఏకాభిప్రాయం లేదు. అది కుడి నుండి ఎడమకు రాయబడిందని, ఎడమ నుండి కుడికి రాయబడిందని, 'వృషభాగతి' పద్ధతి (Boustrophedon) లో, కుడి నుండి ఎడమకు, ఎడమ నుండి కుడికి రాయబడిందనీ, పండితులు రకరకాలుగా అభిప్రాయపడ్డారు.

సింధు లిపికి, సుమేరియన్, ఈజిప్ట్, క్రీట్, చైనా, లిపులకు మధ్య, కొన్ని పోలికలున్నాయి. ఇవి కాకతాళీయమై ఉండవచ్చు. అశోకుని కాలం ( క్రీ.పూ. 3వ శతాబ్దం) నాటి బ్రాహ్మీలిపి, సింధు లిపి నుండి ఉద్భవించిందని, లాంగ్డెన్ (Langden) , కన్నింగ్‌హామ్ (Cunningham) , పాండే (Pandey) మొదలైన కొందరు పండితుల అభిప్రాయం.

## 11.6 నిర్మాతలు (Founders)

సింధు నాగరికత నిర్మాత లెవ్వరనే సమస్యకు సమాధానం నేడు సింధులిపి భాషను గుర్తించటంతో ముడిపడి ఉంది. సింధు లిపి తెలిపే భాష ద్రావిడ భాష అని భావించిన ఫాదర్ హీరాస్ మొదలగు పండితులు, సింధు నాగరికతా నిర్మాతలు ద్రావిడులని ఘంటాపథంగా పేర్కొన్నారు. ఈ భాషను వైదిక సంస్కృత భాషకు ముందు ఉన్న 'ఇండో - ఆర్యన్' భాషగా గుర్తించిన యస్.ఆర్. రావ్ మొదలైన పండితులు, అంతే ఘంటాపథంగా సింధు నాగరికతా నిర్మాతలు ఆర్యులని పేర్కొన్నారు.

సింధు నాగరికతా నిర్మాతలు ద్రావిడులని చెప్పేవారు, వారి అభిప్రాయాలకు ఉపబలంగా ఈ క్రింది విషయాలను పేర్కొన్నారు.

BRAOU

1) బెలూచీస్థాన్‌లో ఉన్న ' బ్రాహ్వీ ' జాతి వారి భాష ద్రావిడ భాషా సంబంధిగా ఉండటం.

2) సింధు నగరాలలో ( మొహంజొదారోలో) బయల్పడిన మానవ అస్థి పంజరాలు, నీగ్రిటో (Negrito) ఆస్ట్రోలాయిడ్ (Austroloid), మెడిటెర్రేనియన్ (Mediterranean), అల్పనాయిడ్ (Alpanoid)జాతులకు చెందినవనీ, వీటిలో ఎక్కువ భాగం మెడిటెర్రేనియన్, అంటే ద్రావిడ జాతులకు చెందినవనీ, శాస్త్రజ్ఞుల తీర్మానం. (ప్రస్తుతం దక్షిణ భారత దేశ ప్రజలలో, ద్రావిడ భాషలైన తమిళం, తెలుగు, కన్నడం, మళయాళం మాట్లాడే ప్రజలలో ఎక్కువ భాగం మధ్యధరా జాతీయులే ).

3) హరప్పా ప్రజల సంస్కృతి, జీవన విధానం, ఆర్యుల వైదిక సంస్కృతి, జీవన విధానం మౌలికంగా వేరైనవి. ఉదా ॥ హరప్పా ప్రజలు పట్టణవాసులు ; ఆర్యులది గ్రామీణ నాగరికత. హరప్పా సంస్కృతి ప్రజలు విగ్రహారాధకులు. ఋగ్వేద (వైదిక) ఆర్యులు విగ్రహారాధకులు కారు. ఋగ్వేద ఆర్యులు సంపదగా భావించి, ' అఘ్నునా ' ( చంపదగనిది) గా పేర్కొన్న ఆవు, అట్లే ఆర్యుల జీవితంలో ప్రముఖపాత్ర వహించిన గుర్రం, సింధు లోయ నాగరికతా స్థావరాలలో ఎక్కడా ఏ రూపంలోగాని గోచరించవు. సింధు నాగరికతలో ఆవు స్థానాన్ని ఎద్దు ఆక్రమించింది; గుర్రం ఉన్నట్లు ఖచ్చితమైన సాక్ష్యం లేదు.

సింధు నాగరికతకు చెందిన నగరాలు నాటికే ప్రసిద్ధ వాణిజ్య కేంద్రాలయినందువల్ల, ఆ నగరాలలో ఆసియా ఖండంలోని వివిధ జాతుల కలయికకు అవకాశం ఏర్పడింది. ఆర్యులకు విరోధులైన దాస - దస్యులను గురించి, వారు కృష్ణ వర్ణులనీ ( నల్లని శరీరచ్ఛాయ కలవారనీ), అనాసులనీ (చప్పిడి ముక్కులు కలవారనీ) , అయజ్వాలనీ (యజ్ఞాలు చేయనివారనీ), మృధ వచనులనీ, అవవ్రతులనీ ఋగ్వేదంలో ఉన్న వర్ణనలు, సింధు ప్రజలకు ఇంచుమించుగా సరిపోతాయి. ఆర్యులు, దాస - దస్యులు భిన్న జాతీయులని, రంగులో, శరీర నిర్మాణంలో, భాషలో, మతంలో వేరైన వారని ఈ వర్ణనలు నిరూపిస్తున్నాయి. అందువల్ల, హరప్పా సంస్కృతీ నిర్మాతలు ఆర్యేతరులే అనీ, ప్రధానంగా ద్రావిడులై ఉంటారనీ చెప్పటమే భారతదేశ చరిత్ర గతికి అనుగుణమయిందని ఆర్.సి. మజుందార్ వంటి ప్రసిద్ధ చరిత్రకారుల అభిప్రాయం.

BRAOU

సింధు నాగరికత నిర్మాతలు ద్రావిడులు కారు, వారు ఆర్యులే అనేవారి వాదనలు కొన్ని క్రింది విధంగా ఉన్నాయి.

1) సింధు నాగరికతా నిర్మాతల శవ సంస్కార పద్ధతులు ద్రావిడుల శవ సంస్కార పద్ధతుల కంటే వేరుగా ఉండటం. సింధు నాగరికతలో, ద్రావిడులవలె, శవాలను పూడ్చేవారు కాదు.

2) ద్రావిడ భాషలు మాట్లాడే ప్రజలు అత్యధిక సంఖ్యలో ఉన్న దక్షిణ భారత దేశంలో నేటి వరకు సింధు నాగరికత స్థలాలు బయటపడక పోవడం.

3) బెలూచీస్థాన్‌లోని బ్రాహ్వీ జాతి వారి భాష ద్రావిడ సంబంధమైనా, వారు టర్కీ జాతి వారై ఉండటం.

4) సింధు లిపి తెలిపే భాష సంస్కృత సంబంధమైన భాషగా గుర్తించిన రావ్ గారి వాదన. ఈ క్రింది విధంగా ఉంది.

i) నేడు గుజరాత్, సింధ్, పంజాబ్‌లలో నివసించే ప్రజలను సాధారణంగా ఆర్యజాతికి చెందిన ప్రజలుగా పేర్కొన్నారు. ఈ ప్రజలలోని జాతి లక్షణాలనే, హరప్పా ప్రజలలో ఎక్కువ మంది కలిగి ఉండినారు.
ii) సింధ్, గుజరాత్, రాజస్థాన్‌లలో నివసించిన హరప్పా సంస్కృతీ ప్రజలు అగ్నిని ఆరాధించేవారు : యజ్ఞాలలో

జంతు బలులను ఇచ్చేవారు. మొహంజొదారోలో , లోథాల్‌లో, కాలీబంగన్‌లో యజ్ఞ (బలి) వేదికలను కనుగొన్నారు. అగ్నిని వారు అర్కుడని, అథ అని పిలిచారు•. ఇలాంటి మతాచారాలను ఆర్యులు గూడా అనుసరించారు. సింధు లిపి , తెలిపే భాష ఋగ్వేద భాషతో సన్నిహిత సంబంధాన్ని కలిగింది. iii) హరప్పా సంస్కృతి ప్రజలకు గుర్రం, వరి ధాన్యం తెలియునని, అందువల్ల వారు ఆర్యులు కారని చెప్పేవాదం ఇక ఎంత మాత్రం నిలవదు. ఎందువల్లంటే, ఇటీవలి కాలంలో చాలా హరప్పా నాగరికత స్థావరాలలో గుర్రపు ఎముకలు లభించాయి. లోథాల్, రంగపూర్‌లలో వరి ధాన్యం ఉండినట్లు కనుగొన్నారు. ఈ కారణాలవల్ల, హరప్పా సంస్కృతి ప్రజలు ద్రావిడులని, వారి స్థావరాల మీద ఆర్యులు దాడులు జరిపి, వాటిని నాశనం చేసి, ఆ నాగరికతను అంతమొందించారనే వాదన నేడు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు.

సింధు నాగరికత బయల్పడినప్పుడు, దానికి సుమేరియన్ నాగరికతతో గల కొన్ని పోలికలను బట్టి సింధు నాగరికత నిర్మాతలు సుమేరియన్‌లని కూడా, కొందరు వాదించారు. కాని, సింధు నాగరికత నిర్మాతలెవరైనా, అది భారతదేశంలో ఆవిర్భవించిన నాగరికత అనేది నేడు నిర్వివాదాంశం.

## 11.7 సంగ్రహంగా

1. 1921-1922లలో సర్ జాన్ మార్షల్, దయారాం సాహ్ని, ఆర్.డి.బెనర్జీ మొదలైన పురావస్తు శాస్త్రజ్ఞులు మొహంజొదారో, హరప్పాల వద్ద జరిపిన త్రవ్వకాల ఫలితంగా, సింధులోయ నాగరికత ఆవిష్కరణ జరిగి, దాని ప్రాముఖ్యం , వైశిష్ట్యం వెల్లడయినాయి.

2. ' హరప్పా సంస్కృతి ' లో అతి విశిష్టమయిన విషయం, నగర నిర్మాణ కౌశలం.

3. సింధు లిపి తెలిపే భాషను గుర్తించటానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. కాని, ఈ విషయంలో పండితులకు ఏకాభిప్రాయం కుదరలేదు. సింధు లిపి తెలిపే భాష గుర్తింపుకు, సింధు నాగరికత నిర్మాతలెవరనే సమస్యకు, అవినాభావ సంబంధం ఉంది.

## 11.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. సింధులోయ నాగరికత ఆవిష్కరణ, వ్యాప్తి , కాలాలను గురించి చర్చించి, భారతదేశ చరిత్రలో దానికి గల ప్రాముఖ్యతను తెలియజేయండి.

2. సింధు లిపిని గుర్తించడానికి నేటి వరకు జరిగిన ప్రయత్నాలను సమీక్షించండి. సింధు నాగరికతా నిర్మాతలెవ్వరు ?

**II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. సింధు నాగరికత ప్రాముఖ్యం

• మొహంజొదారోలో లభించి, శివ పశుపతి విగ్రహంగా ప్రఖ్యాతమైన ఒక ముద్రమీది విగ్రహాన్ని, ఋగ్వేదంలో ' త్రిథా ' ( అగ్ని , సూర్యుడు, జ్యోతిస్) అని పేర్కొన్న అగ్నిదేవునిగా S.R. రావ్ గారు గుర్తించి, వారి సిద్ధాంతానికి ఉపబలంగా పేర్కొన్నారు.

BRAOU

2. సింధు నాగరికత పుట్టుక, కాలం

3. సింధు లిపి

4. సింధు నాగరికతా నిర్మాతలు

## 11.9 ఉపయుక్త గ్రంథాలు


Agarwal & Ghosh : **D.P. Radio - Carbon and Indian Archaeology,**1978.

Agarwal & Chakrabarti : **Essays in Indian Proto - history,** New Delhi, 1979.

Allichin R & Allichin B: **The Birth of Indian Civilization : India and Pakistan before 500 B.C.** 1968 : Rev Ed, 1983.

Child Gordan. V: **What Happened in History ?**

Deo.S.B & Dhanelikar M.K.: **Studies in Indian Archaeology,** Bombay, 1970.

Dikshit K.N: **Pre - historic Civilization of the Indus Valley,** Madras, 1935.

Heras H. : " Were Mohenjodarians Aryans or Dravidians ?", **Journal of Indian History XXI,** pp 23 - 33.

Hunter G.R. : **The Script of Harappa and Mohenjodaro and its connection with other scripts,** London, 1934.

Jain K.C. : **Pre - history and Proto - history of India,** 1979.

Karashima, Nobuhar (ed) : **Indus Valley to Mekong Delta,** Madras, 1954.

Krishna Rao, M.V.N. : **Indus Script Deciphered,** Delhi, 1982.

Mahadevan. I : **Indus Script, Memoirs of ASI : 77** Delhi, 1977.

Rao S.R. : **The Decipherment of Indus Script,** Bombay, 1982.

Sankalia H.D. : **The Pre - history and Proto - history of India and Pakistan** 2nd ed, 1974.

Vats M.S. : **Excavations at Harappa, 2 vols.** 1940 .

Wheeler, Mortimer : **The Indus Civilization,** 1968.


BRAOU

# భాగం - 12 : హరప్పా సంస్కృతీ లక్షణాలు

విషయక్రమం


12.0 లక్ష్యాలు

12.1 హరప్పా సంస్కృతీ నగరాలు - నగర నిర్మాణం

12.1.1 కోట

12.1.2 పౌర నగరం - భవనాలు

12.1.3 భూగర్భ మురుగునీటి కాలువలు

12.1.4 పౌర నిర్మాణాలు

12.1.4.1 మొహంజొదారో

12.1.4..2 హరప్పా

12.1.4.3 కాలీబంగన్, లోథాల్

12.2 క్షీణత, నాశనం

12.3 సంగ్రహంగా

12.4 పరీక్ష నమూనా ప్రశ్నలు

12.5 ఉపయుక్త గ్రంథాలు


## 12.0 లక్ష్యాలు

- ఈ భాగాన్ని చదవడం వల్ల, ఈ క్రింది విషయాలను తెలుసుకోగలగాలి.
- హరప్పా సంస్కృతిలో నగర నిర్మాణ కౌశలం అతి విశిష్టమయినది.
- హరప్పా సంస్కృతీ నగరాల నిర్మాణంలోని సాధారణ లక్షణాలు
- మురుగు నీటి కాలువల ఏర్పాటు (Drainage System) లోని ప్రత్యేకత
- మహా స్నానవాటిక, ధాన్యాగారాలు - వీటి నిర్మాణంలో గల ప్రత్యేకత

## 12.1 హరప్పా సంస్కృతీ నగరాలు - నగర నిర్మాణం

'హరప్పా సంస్కృతి' లో అతి విశిష్టమైన విషయం, నగర నిర్మాణ కౌశలం (Town-planning). మొహంజొదారో, హరప్పాల వద్ద బయల్పడ్డ నగరాలు, సింధు ప్రజల నగర, భవన నిర్మాణ నైపుణ్యాన్ని చాటుతున్నాయి. హరప్పా, మొహంజొదారో కంటే పెద్ద నగరం. హరప్పా ఎక్కువ కాలం మనినట్లు కూడా తెలుస్తుంది. లోథాల్, రూపర్ నగరాలు చిన్నవి. మొహంజొదారో, హరప్పా ప్రధాన నగరాలుగా గల సింధు



BRAOU

నాగరికతా సామ్రాజ్యానికి, లోథాల్ రేవు పట్టణం (Port - town). మెసపటోమియా (నేటి ఇరాక్) లోని ప్రాచీన నగరాలైన ఉర్ (UR), నినేవె (Nineveh) నగరాలతో పోలిస్తే, సింధు నగరాలు వాస్తు శిల్పం (Architecture) లో, నగర నిర్మాణంలో నిర్దిష్టమైన సూత్రాల ననుసరించినట్లు స్పష్టమవుతుంది.

### 12.1.1 కోట

మొహంజొదారో, హరప్పా నగరాలలో రెండు ప్రధాన భాగాలు కనిపిస్తాయి. పడమటి దిశలోని మెరక ప్రాంతంలో దుర్గం, లేదా కోట, తూర్పున పల్లపు ప్రాంతంలో పౌర నివాస భాగం ఉండేవి. ఈ నగరాల చుట్టు కొలత 4.. 8 కి.మీ. (3 మైళ్లు) పైబడి ఉంది.

ఇక్కడి దుర్గాలు అష్టముఖ దుర్గాలు (Octogonal). మట్టితో, మట్టి ఇటుకలతో 6 నుండి 12 మీటర్ల (20-40 అడుగుల) వరకు ఎత్తు చేసిన నేల మీద ఈ దుర్గాలను నిర్మించారు. పునాదుల చెంత గోడ మందం 13.5 మీటర్లు ఉండి, పైకి పోను పోను మందం తగ్గుతుంది. కోట గోడలు హరప్పాలో దాదాపు 14 మీటర్లు (46 అడుగుల) ఎత్తు ఉండేటట్లు నిర్మించారు. మొహంజొదారోలో కోట గోడ దక్షిణాన 8 మీ. (26 అ. ) , ఉత్తరాన 12.4 మీ. (41 అ . ) ఉండేటట్లు నిర్మించారు. ప్రభుత్వ భవనాలు, మత సంబంధమైన నిర్మాణాలు, ఇతర ముఖ్య కట్టడాలను, సాధారణంగా కోటలోనే ఎత్తైన వేదిక మీద నిర్మించారు.

### 12.1.2 పౌర నగరం - భవనాలు

ఈ నగరాలలోని భవనాలను 1) నివాస గృహాలు (Residential Houses) 2) పౌర నిర్మాణాలు (Public Buildings) అని విభజించవచ్చు.

1) పౌర నగర మంతా నిర్మాణంలో, చదరంగపు పటంవలె, అడ్డ నిలువు ఊచలతో కూడిన చట్రంలో బిగించబడిందా అన్నట్లు ఉంటుంది. ఇట్లాంటి నిర్మాణాన్ని ' గ్రిడ్ సిస్టమ్ ' (Grid system) అంటారు. మొహంజొదారోలో ప్రధాన వీధులు ఉత్తర దక్షిణాలు గానూ, చిన్న వీధులు తూర్పు పడమరలుగాను ఉన్నాయి. ఇవి పరస్పరం లంబ కోణాల ( $90^0$ ) లో ఖండించుకొంటూ, నగరాన్ని, దాదాపు 366 × 183 మీటర్లు ( 400 × 200 గజాలు) విస్తీర్ణం గల దీర్ఘ చతురస్రాకారపు పేటలు (Rectangular Blocks) గా విభజిస్తూ ఉంటాయి. మొహంజొదారోలో ఇట్లాంటి పేటలు దాదాపు 12 ఉన్నాయి. తూర్పు వీధి మిగిలిన అన్ని వీధులకన్నా విశాలంగా ఉండి ' రాజవీధి ' అనదగి ఉంది. తూర్పు వీధి, దక్షిణ వీధి కలిసే కూడలి, లండన్ నగరంలో ' ఆక్స్‌ఫర్డ్ సర్కస్' (Oxford Circus) ను పోలి, ఆకర్షణీయంగా ఉన్నందువల్ల, పురాతత్త్వవేత్తలు ఈ కూడలిని ' ఆక్స్‌ఫర్డ్ సర్కస్ ' అని పిలిచారు. సింధు నగరాలలో పెద్ద వీధుల రహదారుల వెడల్పు 4.3 మీ. నుండి 10.2.మీ. (14 నుండి 33.5 అడుగుల) వరకూ, చిన్న వీధుల వెడల్పు 2.8 మీ. నుండి 3.7 మీ. (9 అడుగుల నుండి 12 అడుగుల) వరకు ఉన్నాయి.

సాధారణంగా వీధులకు రెండు వైపులా నివాస గృహాలు, అంగళ్లు ఉండేవి. వరదల భయం వల్ల ఇండ్లను ఎత్తైన వేదికల (అరుగుల) మీద నిర్మించుకొన్నారు. సంపన్నుల గృహాలు ఐదారు గదులతో విశాలంగా ఉండేవి. సామాన్యుల ఇండ్లు చిన్నవి. ఇండ్లన్నిటినీ ఒక పద్ధతిలో నిర్మించారు. పెద్ద భవనాలు, మండువా లోగిళ్లవలె, మధ్య పెరడు ఉండి, దాని చుట్టూ అయిదారు గదులు ఉండేవి. ఇండ్లను కాల్చిన ఇటుకతో కట్టేవారు. గోడలు మందంగా ఉండేవి. కిటికీలు చాలా తక్కువ. వాటిని కూడా గోడలో చాలా ఎత్తున అమర్చేవారు. పై అంతస్తులు ఉండే

ఇళ్ల గోడలు 2 మీ. (7 అడుగుల) మందం వరకూ ఉండేవి. హరప్పాలో కూలీల ఇండ్ల వరసలు బయల్పడినాయి. వీటిలో ప్రతి ఇంటిలో రెండే గదులు ఉండేవి. వెనక గది చిన్నది. మొహంజొదారోలో దాదాపు ప్రతి ఇంటికి బావి ఉండింది. హరప్పాలో బావులు తక్కువగా బయల్పడ్డాయి. కాని, కూలీల ఇండ్లన్నిటికీ కలిపి ఒకే బావి. ఇళ్లలో స్నానపు గదులు, మరుగు దొడ్లు, మురికి నీరు పోయే కాలువలు, గొట్టాలను అమర్చుకొన్నారు. ప్రతి ఇంటికి వెలుపల చెత్త కుండీ, చెత్తను కుండీలో వేయటానికి వీలుగా వెలుపలి గోడకు రంధ్రం ఉండేది. వీధి దీపాల ఏర్పాటు ఉండింది. హరప్పా నాగరికతలోని పట్టణ వాసులు పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చారు.

### 12.1.3 భూగర్భ మురుగు నీటి కాలవలు

స్నానాల గదుల నుండి నీటి గొట్టాలు, పై అంతస్థుల నుండి నీరు పోవడానికి, గోడలకు నిలువు గొట్టాలను అమర్చేవారు. ప్రతి వీధికి మధ్య, భూగర్భంలో, ఇటుకలతో కట్టిన మురుగు నీటి కాలువలున్నాయి. ఇండ్ల నుండి మురుగు నీరు మట్టి గొట్టాల ద్వారా ఈ కాలువలలోకి ప్రవహించేది. ఈ కాలువలను శుభ్రం చేయడానికి, అక్కడక్కడా మనిషి దూరే రంధ్రాలు (Man holes) పెద్ద మట్టి జాడీల ఆకారంలో, ఉండేవి. చిన్న కాలువలను పెద్ద కాలువలకు కలిపేవారు. ఈ కాలువలన్నీ చేరి, నగరానికి వెలుపల నదిలో కలిసేవి. ఇంతటి విశిష్టమైన మురుగు నీటి కాలువల ఏర్పాటు (Drainage system), మరే ప్రాచీన నగరంలోనూ లేదని పురావస్తు శాస్త్రజ్ఞుల పరిశీలన.

### 12.1.4 పౌర నిర్మాణాలు

సింధు నాగరికత ప్రజల నిర్మాణ కౌశలం వారి పౌర నిర్మాణాలలో ప్రతిఫలించింది. సామాన్యంగా ప్రభుత్వ భవనాలు, మత సంబంధమైన నిర్మాణాలు, ఇతర ముఖ్య కట్టడాలను కోట లోనే నిర్మించేవారు.

#### 12.1.4.1 మొహంజొదారో

**i) మహా స్నానవాటిక (The Great Bath) :** మొహంజొదారోలో కోట లోని భవనాలన్నిటికీ కేంద్రం, మహా స్నానవాటిక. ఇది చాలా క్లిష్టమయిన నిర్మాణ సముదాయం; ఇటుకలతో నిర్మించిన చక్కని కట్టడం. ఈ సముదాయం వెలుపలి గోడల పొడవు, ఉత్తర, దక్షిణాలుగా 55 మీటర్లు (180 అ.), తూర్పు, పడమరలుగా 32.9 మీటర్లు (108 అ.) . వెలుపలి గోడలు 2 మీ. నుండి 2.4 మీ ( 7 - 8 అ. ) మందంలో, లోపలి గోడలు 1.2 మీ. (4 అ.) మందంలో ఉండేవి. ఈ కట్టడం లోపల, మధ్యలో వున్న స్నానవాటిక, లేదా కొలను పొడవు 11.88 మీటర్లు, వెడల్పు 7.01 మీటర్లు; లోతు 2.43 మీటర్లు (39 అ × 23 అ × 9 అ. ). ఈ కొలనుకు ఉత్తర, దక్షిణ దిక్కులలో మెట్ల వరసలు, నైరుతి మూల 1.98 మీ. (6.5 అ. ) ఎత్తుగల తూము ఉండేవి. కొలను చుట్టూ, పడమటి వైపు తప్ప, మిగిలిన మూడు వైపులా రెండు అంతస్తుల వసారా, దాని వెనక గదులు, ఒక గదిలో పైకి పోవడానికి మెట్లు, మరొక గదిలో బావి ఉన్నాయి. తూర్పు వైపు గదిలోని ఈ బావి నుండి కొలను లోకి నీటిని పంపేవారు. వేడి నీటిని పంపడానికి కూడా ఏర్పాట్లు (Turkish Bath) ఉన్నట్లు తెలుస్తుంది. ఈ స్నానవాటిక సింధు ప్రజల నిర్మాణ కౌశలానికి గీటురాయి. సర్‌జాన్‌మార్షల్ దీన్ని " వాస్తు నిర్మాణంలో ఒక అద్భుతం " (A marvel of engineering) అన్నాడు. కొలను అడుగు భాగాన్ని బాగా కాలిన ఇటుకలతో తాపడం చేశారు. నీటి లోతును వివిధంగా ఉంచటానికై, ఈ అడుగు భాగాన్ని ఏటవాలుగా నిర్మించారు. కొలను గోడల నుండి నీరు ఊరకుండా శిలాజిత్తు (Bitumen) ను వాడారు. మత సంబంధమైన పర్వదినాలలో, పండుగలలో స్నానార్థమై, ఈ స్నానవాటికను ఉపయోగించి ఉండవచ్చునని భావించారు.

Dr. BRAOU LIBRARY Acc. No. Class No.

**2) ఇతర కట్టడాలు :** స్నానవాటిక పక్కన, దానిని వెంబడించి ఉన్న ఒక పెద్ద కట్టడాన్ని ' కాలేజీ ' (College) అని పిలిచారు. ఇది మతాధికారుల నివాసమై ఉండవచ్చునని భావించారు. కోట లోనే నిర్మించిన రెండు సభాగారాలు ఉన్నాయి. వీటిలో ఒకటి, ఇరువైపులా ఉన్న నాలుగు, లేదా అయిదు స్తంభాల మీద నిర్మితమైంది. దీని పొడవు 69 మీటర్లు (226 అ. ) వెడల్పు 23.4 మీటర్లు (77 అ. ).

**3) ధాన్యాగారం:** మొహంజొదారోలో అతి పెద్ద కట్టడం, పై స్నానవాటికకు పశ్చిమంగా ఉన్న పెద్ద ధాన్యాగారం. దీని పొడవు 45.71 మీటర్లు ( 150 అ. ), వెడల్పు 15.23 మీటర్లు ( 50 అ. )

## 12.1.4.2 హరప్పా

హరప్పాలో రావీ నదికి, కోటకు మధ్య 274 మీటర్ల దూరం ఉంది. ఈ మధ్య ప్రదేశంలో నిర్మించిన ఒక ధాన్యాగార సముదాయం చాలా విశిష్టమైన నిర్మాణం. ఇటుకలతో నిర్మించిన ఎత్తైన వేదిక మీద, రెండు వరసలలో, వరుసగా ఆరు చొప్పున, ధాన్యాగారపు గదులను, వాటి ముందు చావడుల (Corridors) తో నిర్మించారు. ఒక్కో ధాన్యాగారపు గది కొలతలు, పొడవు 15.23 మీటర్లు ( 50 అడుగులు) , వెడల్పు 6.09 మీటర్లు ( 20 అ . ) ఈ గదుల ముందు గల చావడు (Corridors) ల వెడల్పు 1.68 మీ.(5 అ.6 అం.) ఈ పండ్రెండు ధాన్యాగారాల మొత్తం నేల వైశాల్యం 838 చదరపు మీటర్లు (9020 చదరపు అడుగులు) ఈ మొత్తం సముదాయం కొలతలు, ఉత్తర, దక్షిణాలుగా 51.5 మీ. (169 అ. ) తూర్పు, పడమరలుగా 41 మీ. (135 అ .)

ఈ ధాన్యాగారాలకు దక్షిణంలో, ఎత్తైన ఇటుక వేదికలపై నిర్మించిన వృత్తాకారపు కళ్లాముల వరసలు బయల్పడినాయి. బహుశా వీటిని ధాన్యాన్ని నూర్చడానికి, లేదా బాగుచేయడానికి ఉపయోగించి ఉంటారు. ఈ కళ్లాములలో బార్లీ, గోధుమలు లభించాయి. ఈ కళ్లాముల సమీపంలోనే రెండు గదులతో నిర్మించిన ఇండ్ల వరసలు కూడా వున్నాయి. బహుశా వీటిలో కూలీలు నివసించి వుంటారు. కోటకు దగ్గరగా నదీ మార్గానికి సమీపంలో నిర్మించిన ఈ ధాన్యాగారం, పురపాలక ప్రభుత్వాధీనంలో శిస్తు రూపంలో వసూలు చేసిన ధాన్యాన్ని భద్రపరచడానికి నిర్మించి వుండవచ్చు.

## 12.1.4.3 కాలీబంగన్ , లోథాల్

కాలీబంగన్ లో కూడా ధాన్యాగారపు పునాదులుగా తలచిన ఎత్తైన వేదికలను కనుగొన్నారు. లోథాల్‌లో నౌకాశ్రయంకాక, ఇతర నగరాల కోట స్థలాలలో బయల్పడిన వేదికల వంటి ఒక వేదికను కనుగొన్నారు. ఈ వేదిక ఒక గిడ్డంగికి సంబంధించనదని భావించారు. విశాలమైన ఈ ధాన్యపు గిడ్డంగులు ఆనాడు ధాన్యపు నిల్వలకు గల ప్రాధాన్యాన్ని తెలియజేస్తాయి. ధాన్యపు పంపిణీ, బహుశా ప్రభుత్వాధీనంలో ఉండి ఉండవచ్చు.

' హరప్పా సంస్కృతి ' నగర నిర్మాణాలలో కాల్చిన ఇటుకలను విస్తారంగా వాడారు. సమకాలికంగా ఈజిప్ట్‌లో నిర్మించిన కట్టడాలలో పచ్చి ఇటుకలనే ప్రధానంగా వాడారు. భారీ గృహ నిర్మాణం, కాల్చిన ఇటుకల వాడకం, సింధు ప్రజల నాగరికతాభివృద్ధికి నిదర్శనం.

మొహంజొదారో, హరప్పాలలోని ఈ బృహత్ నిర్మాణాలు, పాలక వర్గానికి గల సామర్థ్యాన్ని తెలుపుతాయి. పాలక వర్గం ఈ నిర్మాణాలకయిన వ్యయాన్ని పన్నుల రూపంలో ప్రజల నుండి వసూలు చేసి వుండాలి. వీటిని నిర్మించడానికి పెద్ద ఎత్తున కూలి వారిని సమీకరించి ఉండాలి. ఇటుకలతో నిర్మించిన ఈ పెద్ద కట్టడాలు, పాలకుల ప్రాభవోన్నతులను చాటి చెబుతాయి.

B R A O U

సింధు నగరాలు చాలా పెద్దవి. మొహంజొదారో విస్తీర్ణం 8,50,000 చ.మీ, జనసంఖ్య 30-40 వేల మధ్య ఉండవచ్చునీ, అట్లే హరప్పా విస్తీర్ణం 8,50,000 చ.మీ , దాని జన సంఖ్య 24-35 వేల మధ్య ఉండవచ్చునీ, పురావస్తు శాస్త్రజ్ఞులు అభిప్రాయపడ్డారు.

## 12.2 క్షీణత, నాశనం

హరప్పా సంస్కృతి క్షీణించి, నశించటానికి స్పష్టమైన కారణాలు తెలియవు. మెసపటోమియా లోని ప్రాచీన నాగరికతలు క్రీ.పూ. 1800 తర్వాత కూడా కొనసాగగా, హరప్పా నాగరికత ఆ కాలానికి క్షీణించిపోయింది. కాని, నేడు హరప్పా సంస్కృతి క్షీణత, నాశనాల గురించి పండితులలో ఏకాభిప్రాయం లేదు. గత మూడు దశాబ్దాలలో, గంగా, యమునాలోయ, గుజరాత్‌లలో మలికాలపు హరప్పా సంస్కృతికి చెందిన స్థావరాలు దాదాపు 400ను కనుగొన్నారు. వీటిని కనుక్కోవడం వల్ల తెలియవచ్చిన నూతన విశేషాలు, అంశాలు సింధు నాగరికత స్వభావాన్ని, లక్షణాలను గురించి పరిజ్ఞానంలో మార్పులను తెచ్చాయి. క్రీ.పూ. 1900 ప్రాంతంలో సింధు నాగరికత (హరప్పా సంస్కృతి) ఆకస్మికంగా అంతమయి పోలేదని, అది తర్వాత మరి నాలుగు శతాబ్దాలు కొనసాగి, ఈ నాలుగు శతాబ్దాల కాలంలో అది పట్టణ నాగరికత నుండి క్రమ క్రమంగా క్షీణించి, గ్రామీణ నాగరికతగా మారిందనీ, S.R.రావ్ మొదలుగా కొందరు పురావస్తు శాస్త్రజ్ఞుల అభిప్రాయం. [" the discovery of as many as 400 late Harappan sites in the Indo-Gangetic divide and Gujarat has changed considerably the character of Indus Civilization during the last 20 years. It is now widely recognised that the Indus civilization did not die a sudden death in 1900 B.C, but survived for four centuries more, shedding in the process its urban character and assuming rural garb" S.R. Rao, **the Decipherment of Indus Script** (1982) preface) సింధు లిపి తెలిపే భాషను ఋగ్వేద కాలానికి ముందున్న సంస్కృత భాష ప్రాచీన రూపంగా భావించి గుర్తించిన ఈ పురావస్తు శాస్త్రజ్ఞుల, చరిత్రకారుల అభిప్రాయంలో, సింధు నాగరికత ప్రజలు ఋగ్వేద ఆర్యుల కంటే భిన్నమయిన వారు కారు. హరప్పా సంస్కృతి క్రీ.శ. 1600/1500 నాటికి, దాని స్వరూపాన్ని మార్చుకొని, ఋగ్వేద గ్రామీణ సంస్కృతులుగా కొనసాగింది. ఒకవేళ అది, స్పష్టంగా తెలియని అనేక కారణాల వల్ల, సింధులోయ నగరాలలో అంతమయిపోయినప్పటికి, సింధు లోయకు దక్షిణంగా ఉన్న స్థావరాలలో, గంగా - యమున లోయ లోని స్థావరాలలో అవిచ్ఛిన్నంగానే కొనసాగింది. సింధులోయలో కూడా, ఆర్యుల దండయాత్రల వల్ల, మొహంజోదారో మొదలయిన హరప్పా సంస్కృతి నగరాలు ధ్వంసమయినాయనే వాదాన్ని ఈ చరిత్రకారులు ఒప్పుకోరు. అందువల్ల, సింధునాగరికతా క్షీణత, నాశనాలకు సంబంధించిన ఈ చర్చ సింధులోయలోని హరప్పా సంస్కృతీ స్థావరాలకు మాత్రం పరిమితం చేయవలసి వుంది.

సింధు నాగరకత క్షీణతకు వివిధ కారణాలను సూచించారు. సింధు ప్రజలలో సహజంగా ఉన్న సంప్రదాయ పియత్వమే, అభివృద్ధి నిరోధకమై, ఆ నాగరికత క్షీణించడానికి కారణమయిందని స్టువర్ట్ పిగట్ (Stuart Piggot) వంటి పురావస్తు శాస్త్రజ్ఞుల అభిప్రాయం. శీతోష్ణస్థితుల వల్ల వర్షపాతంలో వచ్చిన మార్పులు, ఈ క్షీణతకు కారణమని మరొక అభిప్రాయం. సింధు ముద్రల నుండి తెలియవచ్చే ఎనుము, పులి, ఖడ్గమృగం, ఏనుగు మొదలైన జంతువుల ఉనికిని బట్టి, క్రీ.పూ . 3000 ప్రాంతంలో సింధు లోయలో జీవనానికి చాలా అనుకూలమైన శీతోష్ణ పరిస్థితులు, భోగోళిక పరిస్థితులు ఉన్నట్లు భావించాలి. ఆ ప్రాంతం చాలా వరకు వృక్ష సంపదతో, అడవులతో, జల సమృద్ధితో ఉండింది. కాల్చిన ఇటుకల వాడకాన్ని బట్టి గూడా, ఈ శీతోష్ణస్థితి ఎక్కువ తేమతో ఉండింది. ఇటుకలను కాల్చడం కోసం అడవులను విస్తారంగా నరకివేయడంతో, శీతోష్ణస్థితిలో

BRAOU

జీవనానికి అనకూలమైన మార్పులు ఏర్పడ్డాయి. వర్షపాతం తగ్గడం, భూసారం తగ్గడం వంటి మార్పులు ఏర్పడ్డాయి. రాజస్థాన్ లోని ఎడారి విస్తరించి, భూసారం తగ్గిపోయి, భూమి చౌడుబారిపోయింది. వ్యవసాయం, పశుపోషణను సరిగా నిర్వహించలేక, నాగరికత క్షీణించింది.❁

సింధు నదిలో నాడు తరచుగా వస్తున్న వరదలే, ఈ నగరాలు నిర్మూలం కావడానికి ప్రధాన కారణమని అధికుల విశ్వాసం. వరదలకు విదేశీయులైన శత్రువుల దండయాత్రలు తోడై ఉండవచ్చు. భారతదేశం వెలుపల నుండి వచ్చి, సింధు స్థావరాల మీద దండయాత్ర చేసిన ఈ శత్రువులు ఆర్యులని కొందరు చరిత్ర కారుల అభిప్రాయం. సింధులిపి తెలిపే భాష సంస్కృత భాష ( ' ఇండో ఆర్యన్ ' ) అని నిర్ణయించిన పండితులు ఈ అభిప్రాయాన్ని అంగీకరించారు. వైదికార్యుల ప్రధాన దైవం, యుద్ధ దేవత అయిన ఇంద్రునికి పురంధరుడనే పేరు ఉంది. పురంధరుడంటే పురాలను నిర్మూలించినవాడు. అతడు నిర్మూలించిన పురాలు మొహంజొదారో, హరప్పా మొదలైన సింధులోయ నగరాలై ఉండవచ్చు. ' హరియూపీయం ' వద్ద వృచీవంతులను ఆర్యులు ఓడించినట్లు ఋగ్వేదం చెబుతుంది. హరియూపీయమే హరప్పా అని ఒక అభిప్రాయం. కాని, ఈ అభిప్రాయం హరప్పా ప్రజలు ద్రావిడులని, వారి స్థావరాలపై ఆర్యులు దాడి జరిపారనే సిద్ధాంతం మీద ఆధారపడింది. నేడు గుజరాత్, సింధ్, పంజాబ్‌లలో నివసిస్తూ సామాన్య పరిభాషలో ఆర్యులని పిలువబడే ప్రజల జాతి లక్షణాలు కలిగిన ప్రజలే, హరప్పా ప్రజలలో ఎక్కువ మంది ఉండేవారని, అందువల్ల హరప్పా ప్రజలు ద్రావిడులని, వారిపై ఆర్యులు దండెత్తినారని చెప్పే వాదం నిలువదని, S.R. రావ్ మొదలైన కొందరు పురావస్తు శాస్త్రజ్ఞుల అభిప్రాయం. [ " The theory that the Harappans were Dravidians and their settlements were destroyed by invading Aryans is now discarded. The mixed Harappa population included a large section having ethnic affinities similar to those of the present population of Gujarat, and Punjab who are called " Aryan " in popular parlance "____ S.R. Rao. **The Decipherment of Indus Script,** preface, p.x].

BRAOU

భారత - పాక్ ఉపఖండంలో అతి విస్తృత ప్రదేశంలో వ్యాపించి ఉండిన హరప్పా సంస్కృతి, ఆ సంస్కృతికి నెలవైన అన్ని స్థావరాలు ఒకేసారి అంతం కావటానికి వీలు లేదు. సింధు నగరాల మీద దాడి చేసిన వారెవరైనా, ఆ నగరాలలో ఒక్క మొహంజొదారో మాత్రమే ఆకస్మిక దాడికి, ధ్వంసానికి గురి అయినట్లు కనపడుతుంది. శత్రువులు ఈ నగరంపై ఆకస్మికంగా దాడిచేసి, దానిని ధ్వంసం చేసి, ఎక్కడి మృతులను అక్కడ విడిచిపోయినట్లున్నారు. మొహంజొదారో లోని ఒక ఇంటిలో స్త్రీలకు, పురుషులకు, పిల్లలకు చెందిన 13 అస్థి పంజరాలు చెల్లా చెదరుగా పడి ఉన్నాయి. వీటిలో రెంటి తల మీద కత్తివేట్లు, గొడ్డలి వేట్లు కనబడుతున్నాయి. మరొక చోట, వికృత స్థితి నందిన తొమ్మిది అస్థిపంజరాలు ఒక గుంపుగా లభించాయి. వీటిలో అయిదు పిల్లల అస్థిపంజరాలు. వీధిలోని ఒక బావి మెట్ల వద్ద ఇద్దరిని చంపివేశారు ; వీరిద్దరిలో ఒకరు స్త్రీ. దీనికి సమీపంలోని ఒక వీధిలో రెండు అస్థిపంజరాలు లభించాయి. మరికొన్ని వీధులలో కూడా కొన్ని అస్థి పంజరాలు లభించాయి. ఈ అవశేషాలన్నీ మొహంజొదారో నగర త్రవ్వకాలలోని చిట్ట చివరి స్తరం పై స్తరం (Strata) లో లభించి, దాని అంతిమ ఘడియలకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. కాని, ఈ దాడి చేసినవారు ఆర్యులేనని నిర్ధారించటానికి తిరుగులేని సాక్ష్యం లేదు.

కాని, ఒక విషయం స్పష్టంగా తెలుస్తుంది. ఈ శత్రు దాడుల ముందు నాటికే, మొహంజొదారో నగరం

❁ సింధునాగరికతా వాసులు వారి సహజ వనరులను సరియైన రీతిలో వాడుకోక పోవడం, సింధునాగరికత పతనానికి గల ప్రధాన కారణాలలో ఒకటిగా, రింఫింజైన రచించిన Down to Earth, August 15, 1993 లో ఒక వ్యాసంలో పేర్కొన్నారు.

ఆర్థికంగా, సాంఘికంగా ఎంతో క్షీణతకు లోనై ఉండింది. ఉపద్రవకరమైన వరదలు ఆ నగరంలోని అనేక విస్తార ప్రాంతాలను అనేక సార్లు ముంచి వేశాయి✿. గృహ నిర్మాణం లోని పాశస్త్యం నశించింది. చివరకు ఇండ్లు బీద జనం నివసించే గూండ్లవలె తయారయ్యాయి. అన్ని రంగాలలో ప్రమాణాలు పడిపోయాయి. నగరం మీద పడ్డ చివరి దెబ్బ ఆకస్మికమైనా, ఆనగరం అప్పటికే మృత్యోన్ముఖంగా ఉంది.

హరప్పా సంస్కృతికి ముందు కాలంలో ఉన్న నాగరికతా స్థావరాలు లోహ వాడకాన్ని సూచిస్తాయి. ఈ నాగరికతా స్థావరాల నుండే పరంపరాగతంగా హరప్పా నాగరికత రూపుగొని, అవిచ్ఛిన్నంగా కొనసాగింది. హరప్పా, మొహంజోదారో వంటి నగరాలు, క్రీ.పూ. పద్దెనిమిదో శతాబ్దం మధ్యలో నశించగా, సింధు లోయకు దక్షిణంగా ఉన్న ప్రాంతం లోని హరప్పా సంస్కృతీ స్థావరాలు కాలక్రమంలో క్షీణించాయి. రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లలోని అవశేషాలు, హరప్పా నాగరికత క్షీణ దశకు చెందినవిగా కనిపిస్తున్నాయి. కొందరి అభిప్రాయంలో క్షీణ దశకు చెందిన ఈ హరప్పా సంస్కృతి రూప పరిణామం చెంది, ఋగ్వేద నాగరికతగా ఏర్పడింది.

ఏ కారణాలవల్ల హరప్పా, మొహంజొదారో మొదలైన నగరాలు నాశనమైనప్పటికీ, సింధులోయ నాగరికతలోని అంశాలనేకం భారతీయ సంస్కృతిలో నేటికీ సజీవంగా ఉండటం గమనించదగింది.

---

## 12.2 సంగ్రహంగా

1. మొహంజొదారో, హరప్పా నగరాలలోని భవనాలను (1) నివాస గృహాలు (2) పౌర నిర్మాణాలని విభజించవచ్చు. నగరం ' గ్రిడ్ సిస్టమ్ ' లో నిర్మించబడి, అనేక పేటలుగా నిర్మితమైంది.

---

✿ ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి చెందిన షిరీన్ రత్నాగర్ (Sheereen Ratnagar), అమెరికాలోని విస్కాన్‌సిన్ యూనివర్సిటీకి చెందిన డా. మార్క్ కెనోయర్ (Dr. Mark Kenoyer), సింధు నాగరికత వాసులు, సింధు వరదల స్వభావాన్ని ఎరిగి ఉండటం వల్ల, వారి నీటి వనరుల కోసం, సేద్యపునీటి కోసం సింధునది మీద మాత్రమే ఆధారపడలేదనీ, వారు దాని ఉపనదులైన ఘగ్గర్, హక్రా, సరస్వతి మొదలైన వాటి మీద, రాజస్థాన్‌లోని లంకరన్సర్ సరస్సు (Lunkaransar), సంభర్ సరస్సు, మొదలైన సరస్సుల నీటి మీద కూడా ఆధారపడ్డారని తెలిపారు. పచ్చి ఇటుకలు కాల్చడానికి, కొలుముల్లో రాగిని కరిగించి కంచుగా మార్చడానికి, సింధు నాగరికత ప్రజలు విపరీతంగా కలపను వాడారు. కొలిమిలో రాగిని కరిగించి, ఒక కంచుగొడ్డలిని రూపొందించడానికి 35 కిలోగ్రాముల కలప అవసరమవుతుందని అంచనా వేశారు. ఫలితంగా, అడవులు తగ్గిపోవడంతో, వర్షపాతం కూడా తగ్గి,నీటి ఎద్దడి ఏర్పడింది. వీటన్నిటి ఫలితంగా ఏర్పడిన ఎడారిలో, ఘగ్గర్, హక్రా నదులు ఇంకి పోయాయి. సరస్సులు చౌడుబారి, ఉప్పు నీటి సరస్సులుగా మారాయి. డా॥ కెనోయర్ మాటలలో " The Harappans were not environmentally conscious ... they thoughtessly hacked and used the rich forests . . " షిరీన్ రత్నాగర్ అభిప్రాయంలో, సింధు నాగరికత వ్యాపించి ఉన్న రాజస్థాన్ ప్రాంతమంతా, నదులు, సరస్సులు ఇంకిపోయి, క్రీ.పూ. 1800 - 1700 మధ్య ఎడారిగా మారిపోవడం ప్రారంభమైంది. సింధు నాగరికత వాసులు చివరకు తమ సేద్యపు అవసరాలకోసం, ఎత్తిపోత సేద్యపు నీటి (Lift irrigation) మీద ఆధారపడవలసి వచ్చింది. ఈ ఎత్తిపోత సేద్యపునీటి సేకరణకు ఎక్కువ మంది మనుషులు, పశువులు కావాలి. మందలుగా చేర్చిన ఈ పశువులు తమ మేతకోసం అడవులను హరించివేయసాగాయి. ఇట్లా అడవులు హరించిపోవడంతో, వర్షపాతం కూడా తగ్గిపోసాగింది. ఈ ఉపనదుల, సరస్సుల ప్రాంతంలో లభించిన వివిధ వృక్షజాతులకు చెందిన పుప్పొడి మీద శాస్త్ర పరిశోధనలు జరిపి, కొందరు వృక్ష శాస్త్రజ్ఞులు, వాతావరణ శాస్త్రజ్ఞులు ( డా. గురుదీప్ సింగ్, Birbal Sahni Institute of Paleobotany, Lucknow, R.A. Bryson and A.M Swain, Claimatologists from Wisconsin), నేటికి 3700 సంవత్సరాల క్రిందట రాజస్థాన్ సరస్సులు వర్షాభావం వల్ల నేటికి చౌడుబారి, ఉప్పు నీటి సరస్సులుగా మారి, వ్యవసాయానికి, తాగడానికి ఉపయోగం లేకుండా పోయినాయని తెలిపారు. ఫలితంగా, వృక్ష సంపద అంతా హరించి, ఆ ప్రాంతమంతా ఎడారిగా మారింది.

- From D. Balasubramanian. " The Fall of Harappa ", **The Hindu**, Sept 22, 1993, p.19.

BRAOU

2. హరప్పా సంస్కృతీ నగరాలలోని విశిష్టమైన మురుగు నీటి కాలువల ఏర్పాటు, మరే ప్రాచీన నగరంలోనూ లేదు.

3. మొహంజొదారోలోని స్నానవాటిక, వాస్తు నిర్మాణంలో ఒక అత్యద్భుతం. అది, సింధు ప్రజల నిర్మాణ కౌశలానికి గీటురాయి.

4. మొహంజొదారో, హరప్పాల లోని ధాన్యాగార సముదాయాలు చాలా విశిష్టమైన నిర్మాణాలు.

5. మొహంజొదారో, హరప్పాల లోని బృహత్ నిర్మాణాలు, పాలక వర్గానికి గల సామర్థ్యాన్ని తెలుపుతాయి. ఇటుకలతో నిర్మించిన ఈ పెద్ద కట్టడాలు, పాలకుల ప్రభావోన్నతులను చాటుతాయి.

## 12.4 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. **క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.**

1. హరప్పా సంస్కృతికి చెందిన నగర నిర్మాణ కౌశలాన్ని గురించి రాయండి.

2. సింధు నాగరికతా క్షీణత, నాశనానికి గల కారణాలను సమీక్షించండి.

II. **క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. భూగర్భ మురుగు నీటి కాలువలు

2. మహా స్నానవాటిక

3. ధాన్యాగారాలు.

## 12.5 ఉపయుక్త గ్రంథాలు


Allichni. R & Allichin. B : **The Birth of Indian Civilization : India and Pakistan before 500 B.c.** 1968, Rev. Ed 1983.

Basham A.L. (Ed) : **A Cultural History of India;** Oxford, 1975.

Dikshit K.N: Pre-historic Civilization of the Indus Valley **(Sir William Meyer Lectures)**, Madras, 1935.

Jain K.C. **Pre-history and Proto-history of India,** 1979.

Karashima, Noburu (Ed) : **Indus Valley to Mekong Delta,** Madras, 1954.

Mackay, E.H.J : **Further Excavations at Mohenjodaro, 2 vols.** New Delhi.

Marshall, Sir John : **Mohenjodaro and Indus Valley Civilization, 3vols.** London, 1931.


B R A O U

Possehl. G : **South Asian Archaeological Studies.**

Rao S.R : **Lothal,** Delhi, 1980.

Sankalia H.D. **The Pre-history and Proto-history of India and Pakistan,** 2nd Ed, Poone, 1974.

Vats M.S : **Excavations at Harappa**, 2 vols, 1940.

Wheeler , Mortimer : **The Indus Civilization,** 1968; **Harappa,** 1947.

BRAOU

# భాగం - 13 : సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు

విషయక్రమం

13.0 లక్ష్యాలు

13.1 రాజకీయ వ్యవస్థ

13.2 సామాజిక వ్యవస్థ

13.2.1 ఆహారపు అలవాట్లు - మచ్చిక జంతువులు

13.2.2 వేషధారణ, అలంకరణ

13.2.3 గృహ సామాగ్రి

13.2.4 వేడుకలు, వినోదాలు

13.2.5.పనిముట్లు, పరికరాలు

13.3. ఆర్థిక వ్యవస్థ

13.3.1 వ్యావసాయిక ఆర్థిక వ్యవస్థ

13.3.2 వ్యాపార వాణిజ్యాలు

13.3.3 తూనికలు, కొలతలు

13.4 సంగ్రహంగా

13.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

13.6 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

## 13.0 లక్ష్యాలు

- ఈ భాగాన్ని చదవడం వల్ల, ఈ క్రింది విషయాలను తెలుసుకోగలగాలి.
- సింధు ప్రజల ఆహారపు అలవాట్లు, వేషధారణ, అలంకరణ, వినోదాలు, వేడుకలు.
- హరప్పా సంస్కృతి లోని వ్యవసాయ పద్ధతులు
- సింధు నాగరికతా ప్రజల వ్యాపార వాణిజ్యాలు - వీటివల్ల, వారికి భారతదేశం లోని వివిధ ప్రాంతాలతో, విదేశాలతో ఏర్పడిన సంబంధాలు
- తూనికలు, కొలతలలో సింధు ప్రజలు పాటించిన ప్రమాణాలు.

## 13.1 రాజకీయ వ్యవస్థ

హరప్పా నాగరికతలోని రాజకీయ వ్యవస్థను గురించి కాని, పరిపాలనా విధానాన్ని గురించి గాని, ఖచ్చితంగా చెప్పటానికి ఆధారాలు లభించలేదు. హరప్పా సంస్కృతి వ్యాపించిన ప్రదేశమంతా రాజకీయంగా ఒకే అధికారంలో ఉండిందని భావిస్తే, తర్వాత కాలంలో మౌర్య రాజ్య స్థాపన వరకు భారత ఉపఖండంలో ఇంత పెద్ద రాజ్యం ఏర్పడలేదు. దాదాపు 600 ఏండ్లు కొనసాగిన హరప్పా రాజ్య స్థిరత్వం గమనించదగింది. హరప్పా త్రవ్వకాలలోని పురావస్తు ఆధారాల వల్ల, నాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో పౌరపాలన, పట్టణ పాలన చక్కగా జరిగినట్లు తెలుస్తున్నది.

హరప్పాలో బయల్పడిన బలిష్ఠమైన దుర్గం, దానికి కిందుగా కొంత దూరంలో ఉన్న పౌర నగరం వల్ల, ఆనాడు చక్కని రాజకీయ వ్యవస్థ ఉన్నట్లు తెలుస్తుంది. కాని, ఈ రాజకీయ వ్యవస్థ యదార్థ స్వరూపాన్ని తెలుసుకోవటానికి ఆధారాలు లేవు. పురావస్తు శాస్త్రజ్ఞుడు పిగాట్ (Piggot) అభిప్రాయంలో, హరప్పా రాజ్య వ్యవస్థ, " నిరంకుశమైన, నిరపేక్షమైన రాజ్యాధికారం గలిగిన, మతాధికారులైన ప్రభువులు పాలించిన రాజ్యవ్యవస్థ (" A State ruled over by priestly Kings wielding autocratic and absolute power " - Piggot) కొందరు చరిత్రకారులు మొహంజొదారో, హరప్పాలు ఒకే సంస్కృతికి చెందిన రెండు వేర్వేరు రాజ్యాలకు రాజధానులయి ఉండవచ్చు; లేదా, ఒకే రాజ్యానికి రెండు మార్లు రాజధానులయి ఉండవచ్చునని భావించారు. ఒకే సామ్రాజ్యానికి రెండు రాజధానులున్న సందర్భాలు భారతదేశ చరిత్రలో చాలానే వున్నాయి. ఈ రాజ్యానికి మొదటలో రాజధానిగా ఉన్న మొహంజొదారో, తరచుగా వస్తున్న సింధు వరదల వల్ల నాశనం కాగా, తరవాత హరప్పా రాజధానిగా మొహంజొదారో స్థానాన్ని ఆక్రమించి ఉండవచ్చునని మరొక అభిప్రాయం. మూడు మైళ్ళ (4.8 కి.మీ) కు మించిన విస్తృత పరిధి గల మొహంజొదారో, హరప్పా నగరాలు, రాజకీయాధికార కేంద్రీకరణను సూచిస్తాయి.

హరప్పా పాలకులు వాణిజ్య సంస్థలకు సంబంధించిన వారై ఉండవచ్చు. వారి శ్రద్ధ యుద్ధ విజయాల మీద గాక, వాణిజ్యం మీద కేంద్రీకృతమైనట్లు భావించాలి.

B R A O U

## 13.2 సామాజిక వ్యవస్థ

సింధు నగరాలలో లభించిన వస్తు అవశేషాల (Material remains) ను బట్టి, అక్కడి ప్రజల సాంఘిక, ఆర్థిక జీవనం ఉన్నత ప్రమాణాలతో కూడినదని చెప్పాలి. ఈజిప్ట్, క్రీట్‌లలో వలె గాక, సింధు లోయలోని నగరాలు మధ్య తరగతి ప్రజల స్వర్గధామాలని వర్ణించారు. ( " Unlike Egypt and Crete, the Indus Valley was a paradise of the middle classes " V. Rangachari)

### 13.2.1 ఆహారపు అలవాట్లు - మచ్చిక జంతువులు

సింధు ప్రజలు ప్రధానంగా పట్టణవాసులైనప్పటికీ, వ్యవసాయం భారీ ఎత్తున సాగింది. గోధుమలు, బార్లీ, బఠాణీలు, నువ్వులను పండించారు. లోథాల్, రంగపూర్‌లలో వరి ధాన్యం లభ్యమయింది. నిమ్మ ఆకు రూపంలో వున్న ఒక పతకం, కొబ్బరికాయ , దానిమ్మ రూపాలలో ఉన్న రంగుల జాడీలు, పుచ్చకాయ గింజలు లభ్యమయినందువల్ల, సింధు ప్రజలకు నిమ్మకాయలు, టెంకాయలు, దానిమ్మ కాయలు, పుచ్చకాయలు (melon) కూడా తెలుసునని భావించాలి. సింధు ప్రజలు, పాలు, కూరగాయలు, పండ్లు, ముఖ్యంగా ఖర్జూర

పండ్లను ఆహారంగా తీసుకునేవారు. ఎద్దు, ఆవు, గొర్రె, పంది, కోడి, మొసలి, తాబేలు, ఈ జంతువుల మాంసాన్ని ఆహారంగా తీసుకొనేవారు. ప్రజలు వృషభం, మహిషం, గొర్రె, పంది, కుక్క, ఆవు మొదలయిన జంతువులను మచ్చిక చేసి పెంచేవారు. గాడిదలను మచ్చికచేసి, బరువులు మోయటానికి వాడేవారు. గంగిరెద్దు (పెద్ద గంగడోలుతో ఉన్న ఎద్దు) సింధు కాలపు ముద్రలపై తరచుగా కనబడుతుంది. మొహంజొదారో, హరప్పా నగరాలలో గుర్రం, ఒంటె, పిల్లి బొమ్మలుకాని, వాటి అవశేషాలు కాని లభించలేదు. హరప్పా సంస్కృతీ ప్రజలకు గుర్రం తెలియదని పండితులు భావిస్తున్నారు. సుర్కొతాద్‌లో లభించిన కొన్ని అవశేషాలు గుర్రానికి చెందినవని అనుమానించారు. కాని, ఇటీవలి కాలంలో, హరప్పా సంస్కృతీ స్థావరాలు చాలా వాటిలో గుర్రపు ఎముకలు లభ్యమయినాయి. లోథాల్‌లో మట్టితో చేసిన ఒక గుర్రపు బొమ్మ దొరికింది. వీటిని బట్టి ఎస్.ఆర్. రావ్ హరప్పా సంస్కృతీ ప్రజలకు గుర్రం తెలుసుననే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. ఎనుబోతు, ఏనుగు, ఖడ్గమృగం, పెద్దపులి, కోతి, కుక్క, ఎలుగుబంటు, గాడిద, ముంగిస, మొసలి, ఉడుత, పాము, తేలు, కప్ప, తాబేలు, చిలుక, నెమలి, బాతు, గుడ్లగూబ ఇవన్నీ ముద్రలపై బొమ్మల నుండి, మట్టితో చేసిన ఆటబొమ్మల నుండి తెలుస్తున్నాయి. హరప్పా నాగరికతకు సమకాలికంగా ఉన్న మెసపటోమియాలోని నాగరికతా నగరాలలో కూడా, దాదాపు ఈ ఆహార ధాన్యాలనే పండించడం, ఈ జంతువులనే మచ్చిక చేయడం గమనించాల్సిన విషయం. కాని, మెసపటోమియన్ నగరాలకు ఏనుగు, వరి ధాన్యం తెలియవు.

### 13.2.2 వేషధారణ, అలంకరణ

హరప్పా నాగరికతా నగరాలలో లభించిన ముద్రల మీది ప్రతిమలను బట్టి, విడిగా లభించిన శిల్పాలు, ప్రతిమలను బట్టి, నాటి ప్రజల వేషధారణ, అలంకరణ తెలుస్తున్నది. సింధు ప్రజలు సామాన్యంగా అంతరీయం (ధోవతి), ఉత్తరీయాన్ని (పై గుడ్డ) ధరించే వారు. ఉత్తరీయాన్ని ఉపవీతంగా (జంధ్యం వలె) వేసుకొనేవారు. దుస్తులకు నూలు, ఉన్ని బట్టలను వాడారు. స్త్రీ, పురుషుల దుస్తులు దాదాపు ఒకే తీరుగా వున్నాయి. ఈ ప్రదేశాలలో లభించిన సూదుల వల్ల, వీరికి కుట్టడం తెలుసునని చెప్పవచ్చు.

స్త్రీ పురుషుల శిరోజాలంకరణ వివిధంగా ఉండేది. స్త్రీలు వెంట్రుకలను జడలుగ అల్లుకొనేవారు. ముడులు వేసేవారు. పురుషులు దీర్ఘకేశాలను ధరించేవారు. వాటిని వెనకకు దువ్వి, బంగారుతోకాని, వెండితోకాని, రాగితోకాని చేసిన శిరోబంధంతో, చెదరకుండా ఉంచేవారు. కొందరు పురుషులు జుట్టు, మీసాన్ని తీసివేసి, గడ్డాన్ని పెంచేవారు.

స్త్రీ పురుషులు తమ తాహతుకు తగినట్లు, వెండి, బంగారు, రాగి, విలువైన రాళ్లు, ముత్యాలు, గవ్వలు, మొదలగు వాటితో చేసిన ఆభరణాలను ధరించేవారు. మొహంజొదారోలో అధిక సంఖ్యలో లభించిన ఈ నగలు, స్త్రీ పురుషులకు అలంకరణపై గల ఆసక్తిని తెలుపుతాయి.

హరప్పా స్త్రీలు సౌందర్య పోషణ కోసం వహించిన శ్రద్ధ, అక్కడ లభించిన ముస్తాబు బరిణె (Vanity or toilet box) ల వల్ల తెలుస్తుంది. వీటిని దంతంతో, లోహంతో, శిలతో, మట్టితో చేసేవారు. మొహంజొదారో స్త్రీలకు కాటుక, మైపూతలు తెలుసు. పెదవులకు రంగు వేసే పరికరాలు చన్హుదారో శిథిలాలలో లభించాయి. అలంకరణ సామాగ్రికి అవసరమైన మేజాలు, కంచు అద్దాలు, దంతపు దువ్వెనలు లభించాయి.

### 13.2.3 గృహ సామాగ్రి

గృహసామాగ్రిని మట్టితో కాని, శిలతోకాని, వెండితోకాని, దంతంతోకాని, రాగి లేదా కంచుతో కాని,

చేసేవారు. ఎక్కువగా మట్టితోనే చేసేవారు. కుర్చీలు, మంచాలు, చిన్న బల్లలు, గదులు అలంకరించి ఉండేవి. దారుశయ్యలుండేవి. రాగి, లేదా మట్టి దీపపు సెమ్మెలు ఉండేవి.

### 13.2.4 వేడుకలు , వినోదాలు

ప్రజల వేడుకలు, వినోదాలకు సంబంధించిన చంద్రశిలలు, బంతులు, చదరంగ పాచికలు లభించాయి. జంతువుల వేట ఒక వినోదం. ఆటవస్తువులలో వాహనాలు, ఎద్దు బండ్లు, గొర్రెపోతులు, వివిధ జంతువుల బొమ్మలు, స్త్రీ పురుషుల ప్రతిమలు, అవయవాలను అనేక భంగిమలలో కదిలించే దానికి వీలుగా చేసిన జంతువుల బొమ్మలు, ఈలలు, గిలకలు లభించాయి.

### 13.2.5 పనిముట్లు, పరికరాలు

తమ నిత్యావసరాలకు సింధుప్రజలు వివిధ రకాలైన పనిముట్లమీద, పరికరాల మీద, ఆయుధాల మీద ఆధారపడ్డారు. వీటిని రాగితోకాని, కంచుతోగాని చేశారు. వీటిలో (చెప్పులు కుట్టే) ఆరెలు, సూదులు, మంగలి కత్తులు, కొడవళ్లు, కత్తులు, అంకుశాలు, చేపలు పట్టే గాలాలు, ఉలులు, గొడ్డళ్లు, నాగలి కర్రులు, చర్మం ఒలిచే కత్తులు లభించాయి. వీటిని బట్టి సింధు ప్రజల జీవన సరళిని ఊహించుకోవచ్చు. యుద్ధానికి పనికి వచ్చే ఆయుధాలు పరిమితంగా లభించాయి. వీటిలో బల్లేలు, బాకులు, ఈటెలు, ఖడ్గాలు, గదలు, బాణపు ములుకులు లభించాయి.

---

## 13.3 ఆర్థిక వ్యవస్థ

---

సింధు నాగరికత ప్రజలు వ్యవసాయ రంగాన్ని పెంపొందించి, వివిధ రకాలైన పంటలను పండించారు. మిగులు ధాన్యాన్ని భద్రపరచటానికి, నదీ తీరాల సమీపంలో పెద్ద ధాన్యాగారాలను నిర్మించారు. గ్రామాలలో రైతులు పండించిన ఆహారోత్పత్తులపై, నగరవాసులైన వృత్తిపనివారు, వర్తకులు మొదలగువారు ఆధారపడ్డారు.

వ్యాపార వాణిజ్యాలలో సింధు వాసులకు భారతదేశం లోని వివిధ ప్రాంతాలతోనే గాక, మెసపటోమియా, ఈజిప్ట్ మొదలయిన విదేశ ప్రాంతాలతో కూడా, విస్తృత సంబంధాలుండేవి.

### 13.3.1 వ్యావసాయిక ఆర్థిక వ్యవస్థ

సింధు నాగరికత ప్రజలు వ్యవసాయ రంగాన్ని పెంపొందించి, గోధుమ, బార్లీ, వరి వంటి ధాన్యాలను పండించారు. గోధుమలలో రెండు రకాలు ఉండేవి. ఇవి గాక నువ్వులు, ఆవాలు, ఖర్జూరాలు, బఠాణీలు మొదలైన వాటిని పండించారు. బన్వాలీలో బార్లీ (యవలు) ఎక్కువగా లభ్యమయ్యాయి. క్రీ.పూ. 1800 నాటికే లోథాల్ లోని ప్రజలు వరి ధాన్యాన్ని సాగుచేసినట్లు, అక్కడ లభించిన ధాన్యాన్ని బట్టి, వరి పొట్టును బట్టి తెలుస్తుంది. మొహంజొదారోలో, హరప్పాలో, బహుశా కాలీబంగన్‌లో కూడా ఉన్న పెద్ద ధాన్యాగారాలను బట్టి, ధాన్యోత్పత్తి సమృద్ధిగా ఉండేదని, మిగులు ధాన్యాన్ని వీటిలో భద్రపరిచేవారని భావిస్తున్నారు. ధాన్యాగారాలు చాలా వరకు నదీ తీరాలకు సమీపంలో ఉండటం వల్ల, నదుల మీద ధాన్యాన్ని ఒకచోట నుండి మరొక చోటికి చేర్చినట్లు భావించొచ్చు.

బహుశా, రైతుల వద్ద నుండి పన్నుల రూపంలో వసూలు చేసిన ధాన్యాన్ని, ఈ గిడ్డంగులలో భద్రపరిచి ఉండొచ్చు. మెసపటోమియా నగరాలలో బార్లీని జీతాల కింద చెల్లించినట్లే, ఇక్కడ కూడా ఈ ధాన్యాన్ని జీతాలు

చెల్లించటంకోసం వినియోగించి ఉండొచ్చు. పత్తిని పండించిన అతి ప్రాచీన ప్రజలు సింధు ప్రజలే. అందువల్లనే గ్రీకులు, సింధు నుండి వచ్చినది కాబట్టి, పత్తిని ' సింథన్ ' (Sinthan) అని పిలిచారు.

నేటి వలె గాక, నాడు సింధు ప్రాంతం చాలా సారవంతంగా ఉండేది. ప్రతి ఏటా వచ్చే వరదలు ఒండ్రు మట్టిని తెచ్చి, భూమిని సారవంతం చేసేవి. ఈ వరదల నుండి నగరాలను రక్షించటం కోసం, సింధు ప్రజలు కాల్చిన ఇటుకలతో గోడలను నిర్మించేవారు. నవంబర్ (శీతాకాలం) లో విత్తనాలు నాటి, ఏప్రిల్ (వేసవి) లో పంటలను కోసేవారు. అవశేషాలలో నాగలికాని, పారకాని లభించలేదు. ఇటీవల, కాలీబంగన్ వద్ద హరప్పా సంస్కృతికి ముందు కాలంలోని సంస్కృతీ అవశేషాలలో, నాగలి చాళ్లను కనుగొన్నారు. దీనిని బట్టి, వారు పొలాలను నాగలితో దున్నేవారని భావించారు. వారు బహుశా కొయ్య నాగలిని వాడి ఉండొచ్చు. నాగళ్లను మనుషులు లాగేవారో, ఎద్దులు లాగేవో చెప్పలేం. పంటల కోతకు రాతి కొడవళ్లను ఉపయోగించి ఉండొచ్చు. రాగితో, లేదా కంచుతో చేసిన కొడవళ్లు కూడా లభించాయి. నీటి పారుదల సౌకర్యాలకు సింధు నదీ వరద నీటి మీద ఎక్కువగా ఆధారపడి ఉండాలి. వరద నీటి మీద సేద్యం ఆధారపడేది కాబట్టి, అట్లాంటి ప్రాంతాలలోనే గ్రామాలు వెలిశాయి. మెసపటోమియాలో కనిపించినట్లు, హరప్పా నాగరికతా స్థావరాలలో నీటి పారుదల కాలువల ఆనవాళ్లు గోచరించలేదు.

గ్రామాలలో రైతులు పండించిన ఆహారోత్పత్తులపై, నగరవాసులైన వృత్తి పనివారు, వర్తకులు, మతాధికారులు, పాలకులు మొదలైనవారు ఆధారపడేవారు. వ్యవసాయంతో పాటు, పశుపోషణను గురించి కూడా, సింధు ప్రజలు శ్రద్ధ వహించినట్లు, ముద్రికల మీద చిత్రించిన ఆటబొమ్మలుగా తయారు చేసిన ఆవులు, దున్నలు, మేకపోతులు, గొర్రెలు, గంగిరెద్దులు మొదలైన జంతువులను బట్టి తెలుస్తుంది.

## 13.3.2 వ్యాపార వాణిజ్యాలు

హరప్పా సంస్కృతీ నగరాలైన హరప్పా, మొహంజొదారో, లోథాల్‌లలో బయల్పడిన అనేక ధాన్యాగారాలు, విస్తారంగా లభించిన ముద్రలు, ముద్రికలు, చక్కగా రూపొందించిన లిపి, క్రమబద్ధమైన తూకాలు, కొలతలు, సింధు ప్రజల జీవనంలో వ్యాపారానికి గల ప్రాముఖ్యాన్ని సూచిస్తాయి. సింధు నాగరికత విస్తరించి వున్న వివిధ ప్రాంతాల మధ్య, నిత్యోపయోగాలైన లోహం, శిల, గవ్వలు మొదలైన వస్తువులలో వ్యాపారం జరిగింది. కాని, చాలా వస్తువుల తయారీకి కావలసిన ముడి పదార్థాలు, సింధు నగరాలలో లభ్యమయ్యేవి కావు. విదేశాలతో వాణిజ్యాన్ని సాగించి, ముడి సరుకులను దిగుమతి చేసుకొన్నారు. సింధు నాగరికతా స్థలాలలో లభించిన బంగారంలో, కోలార్ గనులలో లభించే బంగారంలో వలె వెండి కలిపి ఉంది. వెండిని, బంగారాన్ని ఆఫ్ఘనిస్థాన్ నుండి కూడా దిగుమతి చేసుకొని ఉండొచ్చు. కెంపులను దక్షిణ భారతం నుండి దిగుమతి చేసుకొన్నారు. ' టర్క్వాయిస్ ' , ' అమెథిస్ట్ ' ' కార్నీలియన్ ' , 'అగేట్ ' (పగడం, గురువిందం, నీలం ) మొదలగు ఆభరణాలకు పనికి వచ్చే విలువైన రాళ్లను, పశ్చిమ భారతం నుండి తెచ్చుకొన్నారు. బహుశా వస్తు మార్పిడి (Barter) విధానం ద్వారా వర్తకం సాగించి ఉంటారు. రాజస్థాన్‌లో ఖేతి గనుల నుండి రాగిని, ఆఫ్ఘనిస్థాన్ నుండి తగరాన్ని తెచ్చుకొన్నారు. మట్టిలో చేసిన ఎడ్ల బండ్ల బొమ్మలనేకం లభించడం వల్ల, రవాణాకు ఎడ్ల బండ్లను ఎక్కువగా వాడారని తెలుస్తుంది. పడవలను నిర్మించి, నదుల ద్వారా కూడా రవాణా సాగించారు. పడవ బొమ్మతో ఉన్న సింధు ముద్రలు లభించాయి. పశ్చిమ (అరేబియా) సముద్ర తీరం వెంబడి నౌకా వ్యాపారాన్ని చేశారు. కాని, సింధు ప్రజల ప్రధాన వాహనం ఎద్దు బండి.

సింధు ప్రజలకు భారతదేశం లోని వివిధ ప్రాంతాలతో మాత్రమే గాక, విదేశాలతో కూడా వాణిజ్య

B R A O U

సంబంధాలు ఉండేవి. ఆఫ్ఘనిస్థాన్ మీదుగా, మధ్య ఆసియా దేశాలతో వ్యాపార సంబంధాలు ఉన్నాయి. లోథాల్‌లో బయల్పడిన నౌకాశ్రయం ద్వారా, సముద్ర మార్గాన విదేశ వాణిజ్యం జరిగినట్లు భావిస్తున్నారు. పురావస్తు శాస్త్రజ్ఞుడు డా. మాకే (Dr. Mackay) అభిప్రాయంలో, సింధు నాగరికతా ప్రజలకు సముద్ర మార్గాన ఈలాం, సుమేరియన్ నాగరికతలతో వ్యాపార సంబంధాలు ఉండేవి. హరప్పా నగరాలలో స్వదేశీయమైన హరప్పా నాగరికతకు చెందిన ముద్రలే కాక, మెసపటోమియాకు చెందిన ముద్రలు కూడా లభించాయి. ఈ రెండు నాగరికతల మధ్య వాణిజ్య సంబంధాలు కొనసాగినట్లు, మెసపటోమియాకు చెందిన క్రీ.పూ. 2350 నాటి వాఙ్మయాధారాల వల్ల తెలుస్తుంది. ఈ ఆధారాలు సింధు ప్రాంతాన్ని మెలూహ (Meluha) అని పేర్కొన్నాయి. హరప్పా, మొహంజొదారోలలో బయల్పడిన ముద్రలపై ఓడల బొమ్మలున్నాయి.

వివిధ సింధు నాగరికతా స్థలాలలో లభించిన వస్తు అవశేషాలను, వస్తువులను బట్టి , సింధు నాగరికతా ప్రజలు భారతదేశం లోని ఏ ఏ ప్రాంతాలతో, ఏ విదేశాలతో వాణిజ్య సంబంధాలను కలిగి ఉండినారో కొంతవరకు ఊహించొచ్చు. వాటిని ఈ క్రింద ఇస్తున్నాం. •

| వస్తువు / వస్తు అవశేషం | | ప్రాంతం/ విదేశం |
|---|---|---|
| 1) ' స్టియటైట్ ' , రాగి, సీసం | - | 1) రాజస్థాన్ |
| 2) రాగి | - | 2) దక్షిణ ఆఫ్ఘనిస్థాన్, బెలూచీస్థాన్ |
| 3) సీసం | - | 3) కర్షాఫ్ (ఉత్తర ఇరాన్) |
| 4) 'అగేట్ ', సూర్యకాంతం, గురువిందం, గోమేధికం, పుష్యరాగం | - | 4) కథియవాడ్, రాజ్‌పిప్లా. |
| 5) బంగారం | - | 5) దక్షిణ భారతం, ఆఫ్ఘనిస్థాన్ |
| 6) వెండి | - | 6) ఆఫ్ఘనిస్థాన్ |
| 7) 'హెమొటైట్ ', గైరిక | - | 7) హోర్ముజీ, పర్షియన్ సింధుశాఖ ద్వీపాలు. |
| 8) పలకరాయి | - | 8) రాజస్థాన్, గుర్‌గాంవ్, కాంగ్రా జిల్లాలు |
| 9) 'అమెజొనైట్ ' | - | 9) గుజరాత్, కాశ్మీర్ |
| 10) స్ఫటికం | - | 10) తంజావూర్, కథియవాడ్, మియాన్‌వాలీ జిల్లాలు |
| 11) పచ్చ | - | 11) ఖొరాసాన్ (పర్షియా) |
| 12) వైడూర్యం | - | 12) బాదక్షాన్ |
| 13) జడైట్ (Jadeite) | - | 13) పామీర్‌లు |

• M.S. Vats : " Indus Valley Civilization " - **The Cultural Heritage of India , Vol. I,** PP. 111 - 112.

B R A O U

సింధు నాగరికతా స్థలాలలో లభించిన శంఖం, పగడం, గవ్వలు మొదలగు వాటిని బట్టి, సింధు ప్రజలకు సముద్రంతో గల సంబంధాన్ని ఊహించొచ్చు.

### 13.3.4 తూనికలు, కొలతలు

ద్రవ్య ఆర్థిక వ్యవస్థ (Money economy) అభివృద్ధి చెందకపోయినప్పటికీ, వ్యాపార వాణిజ్యాలలో కొలతలు, తూనికలు చాలా ముఖ్యమైన పాత్ర వహించాయి. ప్రామాణికతకు సంబంధించిన ప్రయోజనాలను గుర్తించిన సింధు ప్రజలు, ఒకే ప్రమాణాలతో కూడిన పరికరాలను, పనిముట్లను, ఆయుధాలను, ఆభరణాలను మాత్రమే గాక, ప్రామాణికమైన తూనికలు, కొలతలను కూడా రూపొందించారు. కొలతలు దశాంశ పద్ధతిలో ఉండేవి. వివిధ కొలతల గుర్తులతో ఉన్న కొలమానపు దండాలు లభ్యమయ్యాయి. వీటిలో ఒకటి ఇత్తడితో చేసింది. తూచే బరువులు ఒకదానికొకటి రెండింతల నిష్పత్తిలోను, లేదా 16 గుణింత సంఖ్యతోనూ (16,32,64 మొదలగు) ఉండేవి. త్రాసులు లభించాయి. తూకపు బరువులు సరిగా ఉండేటట్లు ఖచ్చితమైన పర్యవేక్షణ ఉండేది.

## 13.4 సంగ్రహంగా

1. సింధు నాగరికత లోని రాజకీయ వ్యవస్థను గురించి, అది " నిరంకుశ, నిరపేక్ష, మతాధికార రాజ్యవ్యవస్థ అనీ, మొహంజొదారో, హరప్పాలు ఒకే సంస్కృతికి చెందిన వేర్వేరు రాజ్యాలనీ, భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.
2. సింధు నగరాల ప్రజల సాంఘిక, ఆర్థిక జీవనం ఉన్నత ప్రమాణాలతో కూడినది.
3. సింధు నాగరికతా ప్రజల వ్యావసాయిక ఆర్థిక వ్యవస్థ సంపన్నమైనది.
4. సింధు నాగరికతా ప్రజల వ్యాపారం, వాణిజ్యం విస్తారమైంది. వీటివల్ల, భారత దేశంలోని వివిధ ప్రాంతాలతో, విదేశాలతో సంబంధాలు ఏర్పడ్డాయి.
5. తూనికలు, కొలతలలో ప్రామాణికతకు సంబంధించిన ప్రయోజనాలను సింధు ప్రజలు గుర్తించారు.

## 13.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. సింధు నాగరికత నాటి సామాజిక పరిస్థితులను వివరించండి.
2. సింధు నాగరికతకు చెందిన ఆర్థిక వ్యవస్థను విశ్లేషించండి.

**II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. వ్యాపార వాణిజ్యాల వల్ల సింధు ప్రజలకు భారతదేశంలోని వివిధ ప్రాంతాలతో, విదేశాలతో ఏర్పడిన సంబంధాలు.
2. సింధు ప్రజల రాజకీయ వ్యవస్థ

BRAOU

## 13.6 ఉపయుక్త గ్రంథాలు


Allichi R.& Allichin B : **The Birth of Indian Civilization before 500 B.C; India and Pakistan** 1968, Revised, 1983.

Basham . A.L. (Ed) ; **A Cultural History of India,** Oxford, 1975.

Chaudhury N.C. : **Mohenjodaro and the Civilization of Ancient India with Reference to Agriculture,** 1974.

Mackay . E.J.H : **Further Excavations at Mohenjodaro, 2. vols,** New Delhi; **Early Indus Civilization,** Revised and Enlarged, Delhi, 1986.

Marshall, Sir John : **Mohenjodaro and Indus Civilization, 3 vols,** London, 1931.

Piggot . S : **Pre-historic India ( to 1000 B.C)** , 1950

Sankalia. H.D: **The Pre-history and Proto-history of India and Pakistan,** 2nd Ed. Poona, 1974.

Vats. M.S : **Excavations at Harappa, 2 vols,** 1940.

Wheeler Martimer : **The Indus Civilization,** 1968.


BRAOU

## భాగం - 14 : మతం, కళలు, వృత్తి కళలు

విషయ క్రమం


14.0 లక్ష్యాలు

14.1 మతాచారాలు, విశ్వాసాలు

14.1.1 స్త్రీ దేవతామూర్తులు - అమ్మతల్లి

14.1.2 పురుష దేవతలు - పశుపతి

14.1.3 వృక్ష పూజ, జంతు పూజ

14.1.4 సింధు మతాచారాలు - ఋగ్వేద మతాచారాలు

14.1.5 మృత సంస్కారాలు

14.2 కళలు, వృత్తి కళలు

14.2.1 చిత్రకళ

14.2.2 శిల్పకళ

14.3 వృత్తి కళలు - సాంకేతిక పరిజ్ఞానం

14.3.1 కంచు పనిముట్లు , పరికరాలు

14.3.2 ఆభరణాల తయారీ

14.3.3 పూసల తయారీ

14.3.4 ముద్రల, ముద్రికల తయారీ

14.3.5 మట్టి బొమ్మలు, కుండలు

14.3.6 ఇటుకల తయారీ

14.3.7 నేతపని

14.3.8 పడవల తయారీ

14.4 సంగ్రహంగా

14.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

14.6 ఉపయుక్త గ్రంథాలు


BRAOU

## 14.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల, ఈ క్రింది విషయాలను తెలుసుకోగలగాలి.

- సింధు ప్రజల మతాచారాలు, మత విశ్వాసాలు - ప్రధానంగా అమ్మతల్లి, శివ - పశుపతి ఆరాధన
- చిత్ర కళలో, శిల్ప కళలో సింధు ప్రజల నైపుణ్యం
- సింధు ప్రజలు వివిధ వృత్తి కళలలో సాధించిన సాంకేతిక పరిజ్ఞానం.

## 14.1 మతాచారాలు, విశ్వాసాలు

సింధు నాగరికతా స్థావరాలలో లభించిన వస్త్వావశేషాలను, వస్తువులను బట్టి, సింధు నాగరికతా ప్రజలు అనుసరించిన మతం, లేదా మతాల యదార్థ స్వరూపాన్ని గురించి, స్వభావాన్ని గురించి, స్పష్టంగా చెప్పటం కష్టం. ఇట్లాంటి ప్రాచీన సంస్కృతికి సంబంధించి, దానిలోని మతాచారాలను, మత విశ్వాసాలను, లౌకిక భావాల నుండి ఖచ్చితంగా వేరుచేసి పేర్కొనడం, పెద్ద సమస్య.

ఇది దేవాలయమని ఖచ్చితంగా నిర్దేశించి చెప్పగల కట్టడమేదీ, హరప్పా సంస్కృతీ స్థావరాలలో కనుక్కోబడలేదు. అందువల్ల, నాటి ప్రజల మతాచారాలను, మత విశ్వాసాలను గురించి, తెలుసుకోటానికి, మనం సింధు ముద్రల, ముద్రికల మీద, చిన్న రాగి ఫలకాల మీద, మట్టితో, లేదా జేగురు మట్టితో చేసిన అనేక రకాల చిన్న బొమ్మల మీద, ఫెయన్స్, రాగి, లేదా కంచుతో, శిలతో చేసిన విగ్రహాల మీద, ఆధారపడవలసి ఉంది.

### 14.1.1. స్త్రీ దేవతా మూర్తులు : అమ్మతల్లి

హరప్పా నాగరికతా స్థలాలలో, పరిమాణంలో చిన్నవైన స్త్రీ మూర్తులు అధికంగా లభించాయి. ఇట్లాంటి విగ్రహాలు బెలూచీస్థాన్‌లో చాలా లభించాయి. ఇట్లాంటి విగ్రహాలే ఇరాన్‌కు, ఏజియన్ సముద్రానికి మధ్య గల ప్రాచీన నాగరికతా స్థావరాలైన ఈలాం (Elam), మెసపటోమియా, ట్రాన్స్‌కాస్పియా, ఆసియా మైనర్, సిరియా, పాలెస్తీనా, సైప్రస్, క్రీట్, సైక్లేడ్స్, బాల్కన్లు, ఈజిప్టులలో లభించాయి. ఈ దేశాలలో, ప్రాంతాలలో అంతా మతపరంగా ఉన్న ఒక భావ సమైక్యం ఈ స్త్రీ దేవతా విగ్రహాల ఉత్పత్తికి కారణమై ఉండొచ్చు. ఈ విగ్రహాలు, ప్రకృతి స్వరూపిణి, శక్తి స్వరూపిణి అయిన అమ్మ తల్లి (Mother Goddess) వని పండితులు అందరూ అంగీకరించిన అభిప్రాయం. వీటిలో కొన్ని విగ్రహాలకు ధూప, దీపాల మసి సోకి ఉంది. నడుమున ధరించిన వస్త్రాన్ని వడ్డాణంతో బంధించి ( కొన్ని విగ్రహాలలో వడ్డాణం, లేదా అనేక ఆభరణాలు ధరించి), విసన కర్ర వలె విప్పారిన వింత గొలిపే శిరోవేష్టనంతో, చెవుల వద్ద రెండు దొప్పలవంటి ఆకారాలు కలిగి వున్న స్త్రీ దేవతా విగ్రహం, అతి తరచుగా కానవస్తుంది. అట్లే, మూడు కాళ్ల పీఠం ( కుర్చీ) మీద కూర్చొని ఉన్న విగ్రహాలు, పుష్పాలంకృతమైన శిరోవేష్టనం ( తల పాగా) తో ఉన్న విగ్రహాలు లభించాయి. వీటన్నిటినీ అమ్మ - తల్లి విగ్రహాలుగా భావించారు. హరప్పాలోని ఒక ముద్రలో, ఒక స్త్రీ గర్భం నుండి వృక్షం ఉదయిస్తున్నట్లు చూపించారు. బహుశా, ఈమె భూదేవత అయి ఉండవచ్చు. హరప్పాలో లభించిన మరొక ముద్రలో, అశ్వత్థ (రావిచెట్టు) కొమ్మల మధ్య, శక్తిని (దేవతను) నిలిపి, భక్తుడు బలి ఇవ్వడం కోసం మేకను తెస్తున్నట్లూ, ఈ బలి ఇవ్వడాన్ని చూడటానికి వచ్చిన దారిని చిత్రించాడు. జంతు బలులు కాక, దేవికి నర బలులు కూడా ఇచ్చేవారని, కొన్ని ముద్రలు సూచిస్తాయి. తరవాత కాలంలో, నేటికీ హిందూమతంలో, గ్రామ శక్తుల రూపంలో, దుర్గ, శక్తి, గౌరి, పార్వతి అనీ, ఇంకా అనేక పేర్లతో, ఈ అమ్మతల్లి ఆరాధన కొనసాగుతున్నది.

BRAOU

### 14.1.2. పురుష దేవతలు - పశుపతి

మొహంజొదారో , హరప్పాలలో దొరికిన పురుష విగ్రహాలు, స్త్రీ విగ్రహాల సంఖ్యలో దాదాపు సగం ఉంటాయి. వీటిలో కూడా కొన్ని బొమ్మలు, కొన్ని పూజా విగ్రహాలు, మరికొన్ని దేవతా మూర్తులు. ఏవో కొన్ని మినహా, పురుష మూర్తులన్నీ నగ్నంగా వున్నాయి. సామాన్యంగా స్త్రీ విగ్రహాలు నిలబడి వుంటాయి. పురుష మూర్తులు, బహుశా ఏదో ఒక మతాచారానికి సంబంధించి అయి ఉండొచ్చు. తమ చేతులను మోకాళ్ల చుట్టూ మడిచో, లేదా భక్తి పారవశ్యంలోనో ఉన్నట్లు చూపబడ్డాయి.

పురుష దేవతల కంతా కొమ్ములతో కూడిన శిరోవేష్టనం ఉంది. బహుశా కొమ్ములు, అలౌకిక, లేదా అతి మానుష శక్తులకు ప్రతీకలై ఉండొచ్చు. మొహంజొదారోలో పద్మాసనం వేసుకొని, యోగముద్రలో ఉన్న పురుష దేవతా విగ్రహం ఉన్న అతి ముఖ్యమైన ఒక ముద్ర లభించింది. ఈ దేవతకు మూడు ముఖాలు ఉన్నాయి. త్రిశూలాకారంలో ఉన్న రెండు కొమ్ములు, విసన కర్ర ఆకారంలో ఉన్న పొడవైన శిరోవేష్టనం మధ్య, కలిసి వున్నాయి. బారుగా చాచిన చేతులు, మోకాళ్ల మీద ఆని వున్నాయి. ఈ విగ్రహం ఊర్ధ్వ మేఢ్రంతో ఉన్నట్లు కనబడుతుంది. ఈ దేవతా మూర్తి కుడివైపున ఏనుగు, పులి ఉన్నాయి. ఎడమ వైపున ఖడ్గ మృగం, ఎనుం (దున్నపోతు) ఉన్నాయి. పద్మాసనానికి క్రిందుగా రెండు జింకలు, వాటి కొమ్ములు మధ్యకు వచ్చేటట్లు, ఒక దాని ఎదురుగా మరొకటి నిల్చి, తలలు వెనకకు తిప్పి వున్నాయి. యోగ ముద్రలో ఉన్న ఈ విగ్రహానికి గల మూడు ముఖాలు, ఊర్ధ్వ మేఢ్రం, త్రిశూల రూపం లోని శిరోవేష్టం, చుట్టూరా వున్న మృగాలు – వీటన్నిటిని బట్టి, ఈ విగ్రహం చారిత్రక యుగంలో శివ - పశుపతిగా ఆరాధనలందిన దేవుని ప్రాచీన మూల రూపమని, సర్ జాన్ మార్షల్ సూచించాడు. •

### 14.1.3 వృక్ష పూజ, జంతు పూజ

అనాదిగా సింధు ప్రజలు చెట్లను, జంతువులను పూజించినట్లు కనబడుతుంది. తొట్టతొలిగా రావి చెట్టు (అశ్వత్థ వృక్షం) కు దాని ఆకును సంకేతంగా చూపిన ఒక ముద్ర లభించింది. ఆకుల తోటి వున్న కొమ్మలను తోరణ రూపంలో వంచిన ఒక అశ్వత్థ వృక్షం కింద, తేజోరూపమయిన వృక్ష దేవత ఉన్నట్లు, హరప్పాలో లభించిన ఒక ముద్రలో చూపడం జరిగింది. మొహంజొదారోలో లభించిన ఒక ముద్రలో, అశ్వత్థ వృక్షం లోపల వృక్ష దేవత నిల్చొని ఉన్నట్లు చూపడం జరిగింది. అక్కడే లభించిన మరొక ముద్రలో, ఆ వృక్షం బోదెకు ఇరు వైపులా ఏక శృంగ శిరస్సులు ఉన్నాయి. హరప్పాలో లభించిన చాలా ముద్రికలలో కసివింద చెట్టు (ACACIA) ఒక వేదిక మీద నిలిచి ఉన్నట్లు, లేదా ఆ చెట్టు చుట్టు కటకటాల ప్రాకారమున్నట్లు చూపడం జరిగింది.

హరప్పాలో లభించిన చిన్న ముద్రలపైన చాలా ఆసక్తికరమైన ఒక చిత్రణ కనబడుతుంది. ఇది ధూప పాత్ర. ఇది విడిగా కాని, లేదా దానిని ఒక మనిషి మోస్తున్నట్లు గాని, చూపడం జరిగింది. చాలా ముద్రలలో ఒక ఏక శృంగ మృగం (UNICORN)మెడ కింద ఈ ధూప పాత్ర ఉన్నట్లు చూపారు. (ఇది ఏక శృంగ మృగం కాదని, ఇది పక్కకు నిలిచినట్లు చూపినందువల్ల, రెండో కొమ్ము అగపడటం లేదని కొందరి అభిప్రాయం). ఈ ఏక శృంగ మృగం నగర దేవత (tutelary deity of the city) అయి ఉండవచ్చునని కొందరి అభిప్రాయం.

ముద్రల మీద చిత్రించిన జంతువులలో ఖడ్గమృగం, పులి, ఏనుగు, ఎనుం వున్నాయి. వీటిలో

• ఎస్.ఆర్.రావ్, సింధు లిపి తెలిపే భాష ప్రాచీన ఇండో - ఆర్యన్ భాష అనేవారి సిద్ధాంతానికి అనుగుణంగా, ఈ విగ్రహాన్ని ఋగ్వేదంలో "త్రిధా" (అగ్ని, సూర్యుడు, జ్యోతిస్ ) గా వర్ణితమైన అగ్నిదేవునిగా గుర్తించారు. ( Sec. **South Asian Archaeology Studies, ed.,** By G. Possehl.)

BRAOU

ఖడ్గమృగం, పులి వాటి ముందు గల తొట్టిలోని మేతను మేస్తున్నట్లు చూపడం జరిగింది. ఏనుగు, ఎనుము, మేత తోనో, మేత లేకుండానో చూపడం జరిగింది. ఈ మేత తొట్టి జంతువులను మచ్చిక చేయడానికి ఉద్దేశించింది కాదు. ఎందువల్లనంటే, వృషభాల ముందు ఇట్లాంటి మేత తొట్లు కనబడవు. వన్య మృగాల ఆరాధనలో వాటి కర్పించిన ఆహార వైవిధ్యానికి ఈ తొట్లు ప్రతీకలుగా కనబడతాయి. కొన్ని ముద్రల మీద ఊహా మృగాలు (Chimeras) చిత్రితమైనాయి. ఒకే శరీరానికి రెండు, లేదా అయిదు, లేదా ఆరు తలలున్నట్లు చిత్రించారు. మానవ శరీరాలకు మృగ శిరస్సులు, లేదా మృగ శరీరాలకు మానవ శిరస్సులు ఉన్న నర-మృగ ఆకృతులను చిత్రించారు. ఈ ఆకృతులకంతా ఎద్దు కొమ్ములు ఉన్నాయి. ఈ కొమ్ములు బహుశా దైవత్వానికి చిహ్నాలయి ఉండొచ్చు. ఇలాంటి మిశ్రమాకృతులలో ఎద్దు తలకాయతో ఉన్న ఒక మానవాకృతి లభించింది. ఈ ఆకృతిని సూమర్ పురాణ గాథలలోని వీరుడైన 'ఎంకిడు' (Enkidu)గా భావించారు. ఈ ' ఎంకిడు ' కొమ్ములున్న పులితో పోరాడుతున్నట్లు చిత్రించడం జరిగింది. కొన్ని ముద్రల మీద ఈ వీరుడు అతనికి ఇరువైపులా ఉన్న రెండు పులులతో పోరాడుతున్నట్లు చిత్రించడం జరిగింది. ఈ ఎంకిడు, మెసపటోమియా (సూమర్) ఇతిహాస నాయకుడైన గిల్గామెష్‌కు ప్రతినాయకుడు. మొహంజొదారోలోని ఒక ముద్రిక మీద ఎత్తు తక్కువగా ఉన్న ఒక సింహాసనం మీద యోగ ముద్రలో ఒక దేవతా మూర్తి ఆసీనుడయి ఉన్నాడు. అతని కిరువైపులా నాగ శిరస్సులు ఆచ్ఛాదనంగా కలిగిన ఇద్దరు భక్తులు మోకరిల్లి ఉన్నారు. భారతదేశ పురాణ గాథలలోని నాగులను వీరు జ్ఞప్తికి తెస్తారు.

శివ - పశుపతి విగ్రహాలు కాకుండా, లింగాలు, యోనులు విడిగా, రెండూ కలసి ఉన్న విధంగా, లభించాయి. యోనులు, లేదా పానవట్టాలు, ఆకారంలో గుండ్రంగానో లేదా అలలు అలలుగానో ఉన్నాయి. వీటి మధ్య రంధ్రం ఉంది. అలల ఆకృతిలో వున్న చిన్న నమూనాలను రాతితో, గవ్వతో, ఫెయన్స్‌లో, గురువింద రాతిలో మలిచారు.

ముద్రల మీద చిత్రించిన మరొక పవిత్ర, ఆరాధనా చిహ్నం స్వస్తిక. ఈ ముద్రలను తాయెత్తులుగా ధరించేవారు. స్వస్తికను సూర్యారాధనకు సంకేతంగా కూడా కొందరు భావించారు.

### 14.1.4 సింధు మతాచారాలు - ఋగ్వేద మతాచారాలు

సింధు ప్రజల మతాచారాలను, మత విశ్వాసాలను గురించిన పై సమీక్షను ముగించే ముందు, ఇక్కడ ఒక విషయాన్ని ప్రస్తావించాలి. ఇటీవలి కాలంలో ఎస్.ఆర్. రావ్, ఎం.వి.ఎన్. కృష్ణారావ్, బుద్ధ ప్రకాష్ మొదలైన కొందరు పురావస్తు శాస్త్రజ్ఞులు, చరిత్ర కారులు సింధు నాగరికత, ఋగ్వేద నాగరికత కంటే భిన్నమయినది కాదని, సింధు పట్టణ నాగరికత అనేక కారణాలవల్ల క్షీణతకు లోనయి, తర్వాత ఋగ్వేద గ్రామీణ నాగరికతగా కొనసాగిందని, సింధు ప్రజల మతాచారాలకు, విశ్వాసాలకు, ఋగ్వేదంలో పేర్కొన్న మతాచారాలకు, విశ్వాసాలకు మధ్య, నిశితంగా పరిశీలిస్తే, చాలా సామ్యాలు చూడవచ్చునని వాదిస్తూ, గ్రంథాలు, వ్యాసాలను రచించారు. ఎస్.ఆర్.రావ్, ఎం.వి.ఎన్. కృష్ణారావ్‌ల అభిప్రాయంలో, సింధు లిపి తెలిపే భాష ఋగ్వేద కాలానికి ముందు కాలం నాటి ప్రాచీన సంస్కృత భాష.• సింధు ప్రజలు ఋగ్వేద ఆర్యుల కన్నా భిన్నులుకారని ఎస్.ఆర్. రావ్ వాదన. సింధ్, గుజరాత్, రాజస్థాన్‌లలో నివసిస్తున్న సింధు నాగరికత ప్రజలు అగ్నిని ఆరాధించేవారని, యజ్ఞాలలో జంతు బలులు ఇచ్చేవారని, మొహంజొదారో, లోథాల్, కాలీబంగన్‌లలో యజ్ఞ (బలి) వేదికలను కనుక్కొన్నారని ఎస్.ఆర్. రావ్ అభిప్రాయం. ఇట్టి మత కర్మలనే తరవాత వైదికార్యులు ఆచరించారని ఎస్.ఆర్. రావ్ అభిప్రాయం. ఈ వాదాలు, అభిప్రాయాలు ఇంకా పండితులలో వివాదాంశాలుగా ఉన్నాయి. ఇవి పండితులందరి ఆమోదాన్ని, అంగీకారాన్ని పొందలేదు.

---

• ఈ విషయంగా పైన " లిపి " శీర్షిక క్రింద చూచేది.

B R A O U

సింధు ప్రజల మతాచారాల, మత విశ్వాసాలలోని ప్రధానాంశాలు క్లుప్తంగా - అమ్మతల్లి ఆరాధన ; శివుని, శివ - పశుపతిగా విగ్రహ రూపంలో, లింగ రూపంలో ఆరాధించటం; వృక్షాలను, జంతువులను, కొన్ని వింత నర-మృగ మిశ్రమాకారాలతో కూడిన దేవతలను పూజించటం; స్వస్తిక ఆరాధన. వీటిలో అమ్మ-తల్లి ఆరాధన, స్వస్తిక ఆరాధన, ప్రాచీన నాగరికతా ప్రపంచంలో సామాన్యంగా ఉన్నాయి.

నేడు హిందూ మతంలో ఉన్న అనేక మత విశ్వాసాలు, ఆచారాలు, ఆరాధనలు, సింధు నాగరికతా కాలం నుండి అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నాయనే విషయాన్ని, పై సమీక్ష స్పష్టం చేస్తుంది.

### 14.1.5 మృత సంస్కారాలు

హరప్పా నాగరికతలో మూడు విధాలైన మృత సంస్కారాలు ఉండేవి.

1) శవాలను వివిధ గృహోపకరణాలతోను, కానుకలతోనూ పూడ్చడం. హరప్పాలో కోటకు దక్షిణంగా ఉన్న ఒక శ్మశానంలో 57 సమాధులున్నాయి. వీటిలో, సాధారణంగా, మృతుని తల ఉత్తర దిశలో ఉంది. ప్రతి సమాధిలో, పరిణత హరప్పా సంస్కృతీ దశకు చెందిన మట్టి పాత్రలు, ఆభరణాలు, అలంకార సామాగ్రి లభించాయి.

2) శవ పేటికలో శవాన్ని, కానుకలను ఉంచి పూడ్చిపెట్టడం. పై శ్మశానంలోనే ఒక సమాధిలో, మృతుని కొయ్య శవపేటికలో కానుకలతోపాటు ఉంచి, పైన రెల్లు చాపను ఆచ్ఛాదకంగా కప్పి, పూడ్చిపెట్టారు. ఇట్లాంటి శవ సంస్కారం క్రీ.పూ. మూడు వేల నాటి సూమర్ సమాధులలో గూడా గోచరిస్తుంది.

3) కళేబరాన్ని అడవి మృగాలకు, పక్షులకు వేసి, తర్వాత కొన్ని అస్థికలను కుండలలో వుంచి పూడ్చటం. ఇట్లాంటి శవ సంస్కారం పైన పేర్కొన్న శ్మశానానికి, కోటకు మధ్యన ఉన్న మరొక శ్మశానంలోని సమాధులలో కనబడుతుంది. ఈ సమాధులు హరప్పా సంస్కృతీ క్షీణ దశ కాలం నాటివి. కాని, చిన్న బిడ్డలను, బిడ్డ తల్లి గర్భంలో వుండే స్థితిలో ఉంచి, నేరుగా పూడ్చారు.

ఈ సమాధులలోని కుండల మీద నెమలి, గద్దలు, జింక, ఎద్దు, కుక్క, చేపలు, మొదలైన జంతువులను, పక్షులను, మొక్కలు, చెట్లు, ఆకులు, నక్షత్రాలు మొదలైన వాటిని చిత్రించారు. ఒక జాడీ మీద మూడు నెమళ్లు, వాటి మధ్య నక్షత్రాలను చిత్రించడం జరిగింది. ఈ మూడు నెమళ్లు, తమ శరీరాలలో మృతుని సూక్ష్మ శరీరాన్ని, నర–మృగ రూపంలో మోసుకొని పోతున్నట్లు చిత్రించడం జరిగింది. సమాధుల మీద తరచూ కానవచ్చే నెమలి చిత్రానికి, మృత సంస్కారంతో సంబంధం ఉండాలి. ఇట్లాంటి మృత సంస్కారంతో సంబంధం గల మరికొన్ని జంతువులు, పక్షులు మొదలైన సమాధులలోని కుండల మీద చిత్రించారు. వీటిలో ఒక కుండ మీద చూపిన పేగులు తీసివేసిన ఒక వృషభం, ఋగ్వేదంలో పేర్కొన్న ' అనుస్తరణీ ' గోవును సూచిస్తుందని, పేగులతో వున్న మరొక వృషభం ' వైతరణీ ' గోవును సూచిస్తుందనీ భావించారు. (అనుస్తరణి ప్రేతం ఉత్తర గతులకై చంపబడు గోవు; వైతరణి యమలోకం లోని నది; ఈ నదిని దాటడానికి ఈ గోవు సహాయం చేస్తుందని విశ్వాసం); అట్లే ఈ కుండ మీదనే చిత్రించిన వేట కుక్క యముని జాగిలం అయి ఉండొచ్చునని సూచన. ఋగ్వేద ఆర్యులు మృత సంస్కారంలో, దహనం, ఖననం రెండింటినీ అనుసరించారు. సింధు నాగరికతలోని కొన్ని మృత సంస్కారానికి సంబంధించిన ఆచారాలు, విశ్వాసాలలో, కొన్నింటిని ఋగ్వేద ఆర్యులు గ్రహించి ఉండొచ్చునని భావించారు.

## 14.2 కళలు, వృత్తి కళలు

హరప్పా సంస్కృతిలో చిత్రకళ, శిల్పకళ, నాట్యం మొదలైన లలిత కళలు పెంపొందాయి. శిల్ప కళలో వీరి నైపుణ్యానికి నిదర్శనంగా, పూజారి శిరస్సు, చక్కని అవయవ సౌష్ఠవంతో నాట్య భంగిమలో ఉన్న ఒక పురుష విగ్రహం, నాట్యకత్తె కాంస్య విగ్రహం, ప్రతీకలుగా నిలుస్తాయి. ఇవి గాక, ముద్రల మీద, ముద్రికల మీద ఉబ్బెత్తుగా చిత్రించిన జంతువులు, మానవ ప్రతిమలు, దేవతా ప్రతిమలు, శిల్ప కళలో వారికి గల నైపుణ్యాన్ని తెలియజేస్తాయి.

### 14.2.1 చిత్ర కళ

హరప్పా ప్రజల కళకు, వారి దైనందిన జీవితంతో సన్నిహిత సంబంధం ఉంది. వారి గృహాల లోను, కట్టడాలలోను, అలంకరణ ఏ మాత్రం లేదు. మట్టి కుండలపైన , పాత్రలపైన, జాడీలపైన వారు చిత్రించిన పక్షులు, జంతువులు, జలచరాలు, వృత్తాలు, రేఖలు, అందమైన వివిధ ఆకృతులు, చిత్ర కళలో వారికి గల నైపుణ్యాన్ని తెలుపుతాయి. ముద్రల మీద, ముద్రికల మీద, తాయెత్తుల మీద కొంచెం ఉబ్బెత్తుగా వారు రచించిన వివిధ జంతువులు, దేవతలు, మానవులు, ఈ ముద్రల , ముద్రికల మీద తీర్చిదిద్దినట్లు ఉన్న బొమ్మ లిపి - ఇవన్నీ చిత్రకళ కిందకే వచ్చి, వారి చిత్ర కళా నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తాయి. ముద్రల మీద చక్కగా చిత్రించిన దేవతలలో, పైన వర్ణించిన యోగ ముద్రలో వున్న శివ - పశుపతి చిత్రాన్ని పేర్కొనవచ్చు.

### 14.2.2 శిల్ప కళ

హరప్పా, మొహంజొదారోలలో పూర్తిగా మలచిన కొన్ని మానవ, లేదా దేవతా విగ్రహాలు, ప్రతిమలు, జంతువుల బొమ్మలు లభించాయి. ఇవి సింధు ప్రజలకు శిల్పకళలో గల నైపుణ్యాన్ని తెలుపుతాయి. జంతువుల బొమ్మలలో, జేగురుమట్టితో చాలా ప్రతిభావంతంగా రూపొందించిన ఒక వృషభాన్ని ' స్టియటైట్ ' లో మలచిన ఒక శునకాన్ని , కూర్చొని ఉన్న రెండు పొట్టేళ్ళను పేర్కొనవచ్చు. 'స్టియటైట్' లో లేదా 'ఫెయన్స్(Faience)' లో రూపొందించిన ఉడుతలు, కోతులు, మేకలు, ఖడ్గమృగాలు, చేపలు, సర్పాలు, చిలుకలు, గుడ్లగూబలు, పావురాలు, బాతులను కూడా ఈ సందర్భంలో పేర్కొనవలసి ఉంటుంది. వీటిలో కొన్ని పిల్లలకు ఆటబొమ్మలుగా ఉద్దేశించబడినాయి. వీటిలో జీవకళ ఉట్టిపడుతున్నది.

రాతిలో మలచిన మానవ విగ్రహాలలో, విరిగి పోయిన కొన్ని విగ్రహాలు మొహంజొదారోలో లభించాయి. కాని, వీటిలో చెప్పుకోదగ్గ శిల్ప కళా నైపుణ్యం గోచరించదు. అద్భుతమైన శిల్పకళా చాతురిని కనబర్చే ఒకే ఒక మానవ విగ్రహం మొహంజొదారోలో లభించింది. ఇది తల మొదలు నడుం వరకు మాత్రమే వున్న అర్థాకృతి ప్రతిమ (Bust). దీనిని స్టియాటైట్‌లో మలచారు. దీనిని ఒక పూజారి (Priest) ప్రతిమగా భావించారు. ఈ పూజారి అర్ధనిమీలిత నేత్రుడై ఉన్నాడు. కుడి చేతి కింద నుండి ఎడమ భుజం మీదికి కప్పిన అతని శాలువా మీద చక్కని త్రిదళాకృతులు చిత్రించి ఉన్నాయి. వెనకకు దువ్విన అతని జుట్టు, ముందు కొక్కెం (Buckle) కల ఒక కేశ బంధం చేత, చెదరకుండా ఉంచబడింది. ఇట్టి కొక్కెమే అతని కుడి చేయి మీద కూడా కనబడుతుంది. పొట్టి గడ్డం, దగ్గరగా కత్తిరించిన మీసాలు ఉన్నాయి. పెదిమలు లావుగా, ముక్కు వెడల్పుగా, నుదురు తక్కువగా, మెడ కురచగా వున్నాయి.

సింధు ప్రజల శిల్పకళా నైపుణ్యానికి గీటురాయి అనదగ్గ రెండు పురుష విగ్రహాలు హరప్పాలో లభించాయి. కాని, ఇవి కాళ్లు, తల విరిగిపోయిన మొండేలుగా లభించాయి. వీటిలో ఒకటి ఎర్ర ఇసుక రాతితో మలచిన నగ్న

B R A O U

పురుష విగ్రహం, ఎత్తు 9.5 సెం.మీ (3 3/4 అంగుళాలు) . నల్లని పలకరాతితో మలచిన రెండవ విగ్రహం నాట్య భంగిమలో ఉంది. వీటి అవయవ సౌష్ఠవం మెచ్చుకోతగ్గది. తలను, చేతులను కదిలే విధంగా విడిగా తగిలించటానికై, ఈ విగ్రహాల మెడలో, భుజాలలో రంధ్రాలు అమర్చబడి ఉన్నాయి. ఈ విగ్రహాల లోని అవయవాల పొందిక, అంగ సౌష్ఠవం, శిల్పకళలో అత్యున్నత ప్రమాణాలను కనబరుస్తాయి. నాట్య విగ్రహంలో, నర్తకుడు, కుడి కాలిమీద నిలిచి, ఎడమ కాలిని కుడికాలి మీద మోపి, నడుము పై నుండి శరీరాన్ని ఎడమ వైపుకు తిప్పి, చలనాన్ని, చైతన్యాన్ని ప్రస్ఫుటింప చేశాడు. ఇది నటరాజు విగ్రహమై ఉండవచ్చునని భావించారు. ఇవి ప్రాచీన గ్రీక్ నాగరికతా శిల్పంలోని ఉత్తమ శిల్పాలకు దీటు వస్తాయని విమర్శకుల ప్రశంస.

మొహంజొదారోలో లభించిన ఒక నాట్యకత్తె కాంస్య విగ్రహం, సింధు ప్రజల లోహకార శిల్పానికి చక్కని ఉదాహరణ. కుడి చేతికి ఒక కడియంతో, ఎడమ చేతి నిండా కడియాలతో, మెడలో ఒకటి రెండు దండలతో, కుడి చేతిని నడుముపై ఆన్చి, ఎడమ చేతిని కొద్దిగా పైకి వంచిన ఎడమ కాలిపై ఆన్చి ఉన్న ఆ నగ్న ఆటవిక నర్తకి విగ్రహం, ఒకేసారిగా కంచుతో పోతపోయబడింది. వీపు, కంటి భాగం, పిరుదులు చక్కగా తీర్చిదిద్దిన ఈ విగ్రహం, కళాకారుని పరిశీలనా శక్తికి నిదర్శనంగా ఉంది.

విలువైన రాళ్లమీద, ముద్రల మీద ఉబ్బెత్తుగా మలచిన జంతువుల బొమ్మలు, చిన్న చిన్న విగ్రహాలు కూడా హరప్పా కళాకారుల శిల్ప నైపుణ్యాన్ని తెలుపుతాయి.

## 14.3 వృత్తి కళలు - సాంకేతిక పరిజ్ఞానం

సింధు నాగరికతా వాసులు కంచు పనిముట్లను తయారుచేయడం, ముద్రలు, ముద్రికల తయారీ, మొదలయిన వృత్తి కళలలో విస్తారమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని కనబరిచారు. ఇటుకల తయారీలో, పూసల తయారీలో, మట్టి బొమ్మలు, కుండలను తయారు చేయడంలో, నేత పనిలో, పడవల తయారీలో, విశేష నైపుణ్యాన్ని కనబరిచారు.

### 14.3.1 కంచు పనిముట్లు , పరికరాలు

హరప్పా నాగరికత తామ్ర - శిలా నాగరికత. అది కాంస్య యుగానికి చెందినదని చెప్పినప్పటికీ, ఆ నాగరికతలో పనిముట్లు , పరికరాల తయారీకి, కంచు కంటే రాగి లోహాన్నే ఎక్కువగా వాడటం జరిగింది. రాతి పనిముట్ల స్థానంలో క్రమ క్రమంగా లోహపు పనిముట్లు చోటు చేసుకోసాగాయి. లోహ పరిశ్రమలో, లోహకారక కళలో, సాంకేతికాభివృద్ధి సాధన కోసం ఎక్కువ ప్రయత్నాలు జరిగాయి. రాతి పనిముట్లు కూడా అధికంగానే వాడుకలో ఉండేవి. రాగిని తగరంతో కలిపి, కంచును తయారుచేసేవారు. కాని, ఈ రెండు లోహాలు సులభంగా లభ్యం కానందువల్ల , హరప్పా నాగరికతలో కంచు పనిముట్లను విస్తారంగా వాడ లేదు. హరప్పా నాగరికతా వస్త్వావశేషాలలో లభించిన కంచు పాత్రలలో, పరికరాలలో, తగరం పాలు చాలా తక్కువగా ఉంది. కాని, కంచును తయారు చేసే సాధనాలు చాలానే లభించినందువల్ల, కంచును తయారుచేయటం క్లిష్టమైన పని కావటం వల్ల, ఆ పని చేసే కమ్మరి వారికి వృత్తిపరంగా సంఘంలో ప్రముఖస్థానం ఉండి ఉండాలి. వారు కంచుతో గృహోపకరణాలను మాత్రమే గాక, కంచు గొడ్డళ్లు, రంపాలు, కత్తులు, ఈటెలు మొదలైన ఆయుధాలను గూడా తయారు చేశారు. విగ్రహాలను తయారుచేశారు. కంచులో ఒకేసారిగా పోతపోసిన నగ్న ఆటవిక నాట్యకత్తె విగ్రహం, కంచు పనిలో వీరి నైపుణ్యానికి ఒక మచ్చుతునక. ( ఈ విగ్రహాన్ని పైన వర్ణించాం).

సింధు ప్రజలకు ఇనుము తెలియదు.



B R A O U

## 14.3.2 ఆభరణాల తయారీ

సింధు నాగరికతలో ప్రముఖంగా ఉన్న మరొక వృత్తికళ, ఆభరణాల తయారీ. వివిధ రకాలైన ఆభరణాలను తయారు చేయడంలో నేర్పరులైన కంసాలులు ఉండేవారు. బంగారుతో, వెండితో, కెంపులతో ఆభరణాలను తయారు చేసేవారు. వీరు తయారు చేసిన ఆభరణాలలో, కేశ బంధాలు, పట్టబంధాలు ( ' రిబ్బన్ ' లు) , జడ పిన్నులు, ఉరో భూషణాలు (పమిట పిన్నులు), కర్ణ భూషణాలు, ముక్కెరలు, కంఠహారాలు, పతకాలు, ఉంగరాలు, ఒడ్డాణాలు, బాహుపురులు, కంకణాలు, కరవలయాలు (bangles) మొదలుగా వివిధ ఆభరణాలు ఉండేవి. దువ్విన జుట్టు చెదరకుండా కేశ బంధాలను, పట్ట బంధాలను తలకు ధరించేవారు. పమిట పిన్నులు 8 ఆకారంలోనూ, నాలుగు ముఖాల నక్షత్ర ఆకారంలోనూ ఉండేవి. కర్ణాభరణాలు గుబ్బలుగా, కమ్మలుగా, చెవి నుండి వేలాడే విధంగా, బొట్లుగా, గుండీలుగా ఉండేవి. రక రకాల ముక్కరలుండేవి. వీటిని ముక్కుకు బిగించటానికి మరలుండేవి. ముక్కరలో విలువైన రాళ్లను పొదిగేవారు. ఎనిమిది రేకుల తోటి పుష్పాకారంలో వున్న ఒక ముక్కెరలో ఎర్రరాళ్లు, వైడూర్యాన్ని (నీలపు రాళ్లు ) పొదిగారు. బంగారు , వెండి, విలువైన రాళ్లు, ' ఫెయన్స్ ' – వీటిలో ఒకదానితో చేసిన పతకానికి పూసలను చేర్చి, కంఠహారాలను తయారు చేసేవారు. ఈ హారాలు ఒకటి, ఒకటికి మించిన సరాలలో, లేదా పేరులలో తయారుచేసేవారు. బాహుపురులు, కంకణాలు, కరవలయాలను మట్టితో, గవ్వతో, రాతితో, రాగితో, వెండితో, బంగారంతో, ' ఫెయన్స్ ' తో తయారుచేశారు. బంగారంతో, వెండితో, పాలరాయితో, తెల్లరాయి (alabaster) తో , ఫెయన్స్‌తో చేసిన ఉంగరాలు లభించాయి. విడిగా లభించిన వివిధ ఆభరణాలు కాకుండా, ఆభరణ సముదాయాలు మొహంజొదారోలో మూడు, హరప్పాలో ఒకటి లభించాయి. హరప్పా కుప్పలో బంగారం, వెండి, రాయి, గవ్వ, ఫెయిన్స్‌లతో చేసిన రకరకాల ఆభరణాలు ఉన్నాయి.

## 14.3.3 పూసల తయారీ

ఆనాటి ప్రజలలో బాగా విస్తరించిన మరో చేతి పరిశ్రమ, వృత్తి కళ, పూసల తయారీ . పూసల తయారీలో హరప్పా నాగరికతా ప్రజలు అతి నేర్పరులు. చన్హుదారోలో, లోథాల్‌లో ఈ పరిశ్రమ విస్తారంగా ఉండేది. ఈ రెండు స్థావరాలలో ఉన్న కట్టడాలలో, పూసలు అసంఖ్యాకంగా బయల్పడినాయి. వీటిని బంగారం, వెండి, మట్టి, శిలలు, దంతాలతో తయారుచేశారు.

## 14.3.4 ముద్రల, ముద్రికల తయారీ

ముద్రల, ముద్రికల తయారీలో కూడా హరప్పా ప్రజలు నిపుణులు. సామాన్యంగా ముద్రలు సమ చతురస్రాకారంగా వుండేవి. వీటి నిడువు 19 - 22 మిల్లీ మీటర్లు ( 3/4' - 1 1/ 4' ) ఉండేది. వీటిని మత సంబంధంగాను, వాణిజ్యపరంగా కూడా వాడారు. వీటి తయారీలో గొప్ప కళా నైపుణ్యాన్ని కనబరచారు. వీటి మీద ' స్టియటైట్ ' తో తయారు చేసిన తెల్లని మలామా పూసి, కాల్చి, అవి తెల్లగా ఉండేటట్లు, ధృఢంగా ఉండేటట్లు చేశారు. వీటి మీద చిన్న పదాలు, లేదా వాక్యాలతో పాటు, ఎద్దు, దున్న, పులి, ఖడ్గమృగం, ఏనుగు మొదలగు జంతువులను చిత్రించారు.

## 14.3.5 మట్టి బొమ్మలు, కుండలు

జేగురు మట్టి బొమ్మలను, మట్టితో పాత్ర సామాగ్రి. కుండలు, జాడీలు మొదలగునవి తయారుచేసే పరిశ్రమలు బాగా అభివృద్ధిలో ఉండేవి. ఆడ, మగ బొమ్మలను, పక్షుల, జంతువుల ఆటబొమ్మలను, ఎద్దు బండ్లు మొదలగు బొమ్మలను తయారుచేశారు. గృహ సామాగ్రిగా మట్టి పాత్రలను అతి నైపుణ్యంతో చేశారు. వీటిని

మత కార్యకలాపాలలో కూడా వాడినారు. వీటిపైన చెట్లను, పక్షులను, జంతువులను, అందమైన వివిధ వృత్తులను, రేఖలను చిత్రించారు. కొన్ని మట్టి పాత్రల మీద మానవాకృతులను చిత్రించారు. ఎర్రని పూతవేసిన మట్టి పాత్రలపై నల్లని వివిధాకృతులను చిత్రించారు.

### 14.3.6 ఇటుకల తయారీ

ఇటుకలతో నిర్మించిన పెద్ద భవనాలు, కట్టడాలు, ధాన్యాగారాలు, ఇటుకల తయారీకి చేతి పరిశ్రమలలో గల ప్రాముఖ్యాన్ని సూచిస్తాయి. సింధు నాగరికతకు చెందిన స్థావరాలలో ఇటుక బట్టీలు చాలా ఎక్కువ బయల్పడ్డాయి. ఇటుకలను తయారు చేసే ప్రత్యేక వృత్తివర్గం ఉండి ఉండాలి.

### 14.3.7 నేత పని

మొహంజొదారోలో నూలుతో నేసిన వస్త్ర ఖండం లభించింది. అద్దకంతో ఉన్న బట్టలు, ఆనాటి నేత పనిలోని నైపుణ్యాన్ని తెలియజేస్తాయి. నూలు దారం వడకటానికి కదుళ్లను వాడారు. ఉన్నితో, పత్తితో వస్త్రాలను నేసేవారు .

### 14.3.8 పడవల తయారీ

హరప్పా ప్రజలకు తెలిసిన మరొక పరిశ్రమ పడవల తయారీ. పడవ బొమ్మలతో ఉన్న ముద్రలు లభించాయి.

B R A O U

## 14.4 సంగ్రహంగా

1. సింధు నాగరికతా ప్రజలు ప్రధానంగా పూజించిన దేవతలు అమ్మ - తల్లి, శివ - పశుపతి.
2. సింధు ప్రజలు వృక్షాలను, జంతువులను కూడా ఆరాధించారు.
3. సింధు మతాచారాలకు, ఋగ్వేద మతాచారాలకు మధ్య, కొన్ని సామ్యాలు ఉన్నాయని కొందరు పండితుల అభిప్రాయం.
4. హరప్పా నాగరికతలో మూడు విధాలైన మృత (శవ) సంస్కారాలు ఉండేవి.
5. హరప్పా ప్రజల కళకు, వారి దైనందిన జీవితంతో సన్నిహిత సంబంధం ఉండింది. శిల్పకళలో, లోహకార శిల్పంలో వారు చక్కని నైపుణ్యాన్ని కనబరిచారు.
6. వృత్తి కళలలో చక్కని సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు.

## 14.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. సింధు ప్రజల మతాచారాలను, మత విశ్వాసాలను పరిశీలించండి.

2. "మృణ్మయ విగ్రహాలు ( మట్టి బొమ్మలు) , ముద్రలు సింధు ప్రజల మతాచారాల, మత విశ్వాసాల మీద వెలుగును ప్రసరిస్తున్నాయి " చర్చించండి.

3. సింధు ప్రజలు వృత్తికళలలో సాధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమీక్షించండి.

II. **క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. అమ్మ - తల్లి

2. శివ - పశుపతి

3. జంతుపూజ, వృక్షపూజ

4. మృత సంస్కారాలు

5. సింధు ప్రజల శిల్పకళ

---

## 14.6 ఉపయుక్త గ్రంథాలు

---


Allichin. R & Allichin. B : **The Birth of Indian Civilization : India and Pakistan before 500 B.C.** 1968 : Rev Ed. 1983.

Agrawal & Chakrabarti : **Essays in Indian Proto-history**, New Delhi, 1979.

Child . Gordan . V : **New light on the Most Ancient East**, 1958; **What Happened in History?.**

Basham : A.L. (Ed) : **A Cultural History of India,** Oxford, 1975.

Buddha Prakash : **Rigveda and the Indus Valley Civiiization,** 1966.

Chandra A.N. : **The Rigvedic Culture and Indus Civilization**, Calcutta, 1980.

Deshmukh . P.R. : **Indus Civilization, Rig - Veda and Hindu Culture.**

Piggot. S : **Pre-historic India ( To 1000 B.C)**, 1950.

Subba Rao. B : **The Personality of India**.

Vats. M.S : **Excavations at Harappa, 2 vols.**

Wheeler, Mortimer : **The Indus Civilization**, 1968.


BRAOU

BRAOU

## ఖండం - V: చైనా

### పరిచయం

ఆసియా ఖండం తూర్పు భాగాల్లో పసిఫిక్ మహా సముద్రానికి పడమర గల పెద్ద దేశం, చైనా. పింగాణికి, పట్టు పరిశ్రమకు, గ్రేట్ వాల్‌కు, చైనా అందరికీ తెలిసిందే ! ఈ దేశంలో గల గొప్ప నదులు, నాగరికతకు ఆటపట్లు. చైనా నాగరికతను ఈ రాబోయే భాగాలలో ఈ క్రింది విధంగా వివరించడం జరిగింది.

15వ భాగంలో ప్రాచీన శిలాయుగ కాలం నుండి మానవ నాగరికతా పరిణామాన్ని గురించి తెలియజేయడం జరిగింది.

16వ భాగంలో చైనాలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ, వ్యవస్థలను వర్ణించడం జరిగింది.

17వ భాగంలో చైనాలో వచ్చిన తత్వ పరిణామాన్ని, మతంపై దాని ప్రభావాన్ని గురించి విశ్లేషించడం జరిగింది.

18వ భాగంలో చైనాలో వచ్చిన పారిశ్రామిక కళలయిన పింగాణీ, గాజు, పరిశ్రమలు, పట్టు వస్త్రాల తయారీ, అల్లిక పనులు, నగల తయారీ, చిత్రలేఖనం, విజ్ఞానశాస్త్ర పరిణామం, సాహిత్య, కళా, వాస్తు కళలను గురించి వివరించడం జరిగింది.

ఈ పరిణామాలన్నీ ప్రాచీన చైనా నాగరికత విశిష్టతను సూచిస్తున్నాయి.

BRAOU

BRAOU

## భాగం - 15 : చైనా నాగరికతా లక్షణాలు

విషయ క్రమం

15.0 లక్ష్యాలు

15.1 పరిచయం

15.2 నాగరికతా లక్షణాలు

15.2.1 భౌగోళిక నేపథ్యం

15.2.1.1 నదీ వ్యవస్థ

15.2.1.1.1 ఉపనదీ వ్యవస్థ

15.2.1.1.2 ఇతర భౌగోళికాంశాలు

15.3 చైనా నాగరికతల ప్రాథమిక వికాసం - ఒక పరిశీలన

15.3.1 చైనాలో ప్రాచీన శిలా యుగపు నాగరికత

15.3.2 చైనాలో నవీన శిలా యుగపు నాగరికత

15.3.3 యాంగ్ షాజ్ చిత్రిత ఘట సంస్కృతులు (Painted Pottery Cultures)

15.3.4 చైనా నాగరికతకు, నేపథ్యాంశాలకు గల సంబంధం

15.4 చైనా నాగరికతలో వివిధ కాలమాన దశలు

15.4.1 చైనా కాలమాన దశలకు, భారతీయ నాగరికతలకు పోలిక

15.5 చైనా నాగరికతా స్వభావం

15.6 సంగ్రహంగా

15.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

15.8 ఉపయుక్త గ్రంథాలు

15.9 పదకోశం

## 15.0 లక్ష్యాలు

ఈ భాగంలో ప్రధానమైన లక్ష్యాలుగా ఈ క్రింది వాటిని గమనించొచ్చు.

1. చైనా నాగరికతకు గల నేపథ్యాంశాలను గురించి తెలుసుకోడం.

BRAOU

2. చైనా నాగరికత లోని ప్రప్రథమ దశలలో గల నాగరికతా వికాసాన్ని గురించి తెలుసుకోడం.

3. నాగరికతకు, నేపథ్యాంశాలకు గల సంబంధాన్ని అంచనా వేయడం.

4. చైనాలోని నాగరికతా వికాసంలోని వివిధ కాలమాన సంబంధమైన దశలను తెలిపి, వాటిలో ఇతర ఆసియా రాజ్యాలలో గల నాగరికతా వికాస క్రమాన్ని సూచించడం.

5. ఈ పై అంశాల దృష్ట్యా, చైనా నాగరికతా స్వభావాన్ని విమర్శనాత్మకంగా సూచించడం.

## 15.1 పరిచయం

తూర్పు ఆసియాలోని రాజ్యాలలో చైనా అతి పెద్ద రాజ్యం. చైనా, దక్షిణ కొరియా, ఉత్తర కొరియా, జపాన్, తైవాన్‌లను కలిపి ప్రస్తుతం చరిత్రకారులు తూర్పు ఆసియా అని వ్యవహరిస్తున్నారు. ఏ విధంగా భారతదేశం పరిణామ దశలలో వివిధ శక్తులను ఎదుర్కొని, దక్షిణ ఆసియాలో భిన్నత్వంలో ఏకత్వం రూపుదిద్దుకొన్న దేశంగా అభివృద్ధి చెందిందో, చైనా కూడా తూర్పు ఆసియాలో కొన్ని ప్రత్యేకమైన నాగరికతా సంప్రదాయాలకు శ్రీకారం చుట్టింది. ఆ రకమైన ప్రత్యేకతలు ఉండటం, ఆ ప్రాంతపు ప్రకృతిలోను, ఆ ప్రాంతీయులలో గల భావపరమైన, వస్తుపరమైన లక్షణాలలోను, కళ్ళకు కట్టినట్లు చూడగలం. ప్రాక్ చారిత్రక (Pre-historic) యుగంలోను, తొలి చారిత్రక యుగం (early historic period) లోను, ఇటువంటి సామ్యాలనే మనం చూడగలం. దీనిని ఏవిధంగానో పరిశీలన చేయడమే, ఈ భాగంలో గల యీ క్రింది అంశాల లక్ష్యం. ఇవన్నీ చైనాకు గల నాగరికతా వ్యక్తిత్వ కారకాలను సూచించేవే. ఇవన్నీ ఆ నాగరికతకు నేపథ్యంగాను, ఉత్ప్రేరకాల (Catalysts) కార్యాలను త్వరగా జరగడానికి ప్రోత్సహించే అంశాలుగాను కూడా, వ్యవహరించేవే.

BRAOU

## 15.2 నాగరికతా లక్షణాలు

చైనా నాగరికతా లక్షణాలను క్రింది విధంగా పరిశీలన చేద్దాం.

### 15.2.1 భౌగోళిక నేపథ్యం

భౌగోళికంగా చైనా ఎంతో విశాలమైన దేశం. తూర్పు, ఆగ్నేయ భాగాలలో సముద్రం, దక్షిణ, నైరుతి, పడమటి భాగాలలో పర్వతాలను, ఉత్తర, వాయవ్య దిశలలో ఎడారులు హద్దులుగా వున్న చైనా దేశం, ఎంతో భౌగోళికమైన, భూతత్త్వపరమైన (Geological) నేపథ్యాన్ని ప్రకటిస్తున్నది.

భూతత్త్వపరంగా చైనా దేశంలోని భూమి అట్టడుగు భాగమంతా ప్లీస్టోసీన్ హిమయుగం (Pleistocene) లోని చివరి దశలకు చెందిన పసుపుపచ్చని ఒండ్రుమట్టితో కూడుకొన్నవి. ఈ ఒండ్రు మట్టి మందం వేర్వేరు ప్రాంతాలలో 25 అడుగుల నుండి 250 అడుగుల వరకు మారుతూ, భూమి ఉపరితలాన్ని నిర్ణయించే ఒక ప్రధానమైన అంశంగా రూపొందింది.

మధ్య చైనా ప్రాంతమంతా ఉష్ణోగ్రతా అసమతౌల్యాలు ( సమానంగా లేని వేర్వేరు ఉష్ణోగ్రతా స్థితులు) ఎక్కువగా లేని సమ శీతోష్ణమండల స్వభావాన్ని కలిగి ఉండగా, ఉత్తర చైనా ప్రాంతం ప్రధానంగా ధ్రువ ప్రాంతపు (Polar region) లక్షణాలను వ్యక్తం చేస్తుంది. దీనికి కారణం, ఉత్తర చైనా ప్రాంతం హిమాలయ పర్వత

శ్రేణులకు సమీపంలో ఉన్న టిబెట్, మంగోలియా మొదలైన భూభాగాలతో సన్నిహితమైన స్వభావాన్ని కలిగి వుండటమే. పశ్చిమ, దక్షిణ చైనా ప్రాంతాలలో, పై రెండు ప్రాంతాల స్వభావానికి విరుద్ధమైన పీఠభూమి ప్రాంతం వంటి రాళ్ళతో కూడిన, తక్కువ వర్షపాతం గల భూభాగం ఉంది.

ఈవిధమైన భౌగోళిక పరిస్థితులవల్ల, చైనాలోని నదీ వ్యవస్థ ( నదులు, ఉపనదులు ఏర్పడి ప్రవహించే తీరుతెన్నులు) ఎన్నో మార్పు చేర్పులను పొందింది.

## 15.2.1.1 నదీ వ్యవస్థ

చైనా నదీ వ్యవస్థలో నాలుగు ప్రధానమైన నదులు ఎంతో ముఖ్య పాత్రను వహిస్తున్నాయి. అవి అముర్ (Amur), లియాఓ (Liao), హోయాంగ్ హో (Hoang Ho), యాంగ్‌ట్జె కియాంగ్ (Yangtze-kiang). ఈ నదులన్నీ చైనా దేశపు రాజకీయ భౌగోళిక వ్యవస్థ (Politico - geographical system) మీద ఎంతో ప్రభావాన్ని కలిగివున్నాయి. ఉత్తర మంచురియాలో సుంగరి (Sungari) నదీ వ్యవస్థకు చెందిన అముర్ (Amur) నది ఒకటి . ఈ నది వేసవి కాలంలో మాత్రం నీటితో నిండి, నది వలె ఉంటుంది. మిగిలిన కాలాల్లో ఉష్ణోగ్రత మార్పు వల్ల నీరంతా కేవలం మంచుముక్కలుగా వుంటుంది. దక్షిణ మంచూరియాలో లియాఓ (Liao) నది ప్రవహిస్తున్నది. చైనా ఉత్తర భాగంలో యిన్‌షాన్ (Yinshan), మరియు త్సిన్ లింగ్ షాన్ (Tsin ling shan) ల మధ్య ప్రాంతంలో 4,86,486 చదరపు మైళ్ళలో పారుతూ, పసుపుపచ్చనది అనే హోయాంగ్-హో (Hoang Ho) నది ఉన్నది. ఈ నది పారే ప్రాంతంలో హిమ యుగానికి చెందిన పసుపు పచ్చని ఒండు మట్టి (Loess) ఉన్నందువల్ల, దీనిని ' పసుపు పచ్చని నది ' అంటారు. నైల్ నది ఏవిధంగా ఈజిప్ట్ నాగరికత మీద ప్రభావాన్ని చూపిందో, ఈ నది కూడా అదే ప్రభావాన్ని చైనా మీద చూపింది. ( పైన గల ' షాన్ ' అంటే చైనా భాషలో పర్వతం అని అర్థం. అనగా, ) ఈ నది యిన్ - త్సిన్‌లింగ్ (Yin Tsin Ling) పర్వతాల మధ్యగా ప్రవహిస్తుంది. మధ్య చైనాలో త్సిన్‌లింగ్ (Tsin Ling), నాన్‌లింగ్ (Nanling)ల మధ్య, చియాంగ్‌చింగ్ (Chiang Ching) అనే యాంగ్‌ట్జె (Yang - tze) నది 7, 56, 498 చదరపు మైళ్ళ మేర ప్రవహిస్తున్నది. ఈ యాంగ్‌ట్జె నది సాధారణ ఉష్ణ మండల ప్రాంతపు నదీ లక్షణాలు గల దక్షిణ చైనాలో హ్వాయ్‌హో (Huaiho) అనే నది 64,000 చదరపు మైళ్ళ దూరం ప్రవహిస్తున్నది.

### 15.2.1.1.1 ఉప నదీ వ్యవస్థ

పైన పేర్కొన్న మహానదీ వ్యవస్థలన్నీ, ఉపనదీ వ్యవస్థ మీద ఆధారపడి ఉన్నాయి. మధ్య చైనాలో ప్రవహించే 'యాంగ్‌ట్జె' నదికి ఎన్నో ఉప నదులున్నాయి. తూర్పుగా ' పోయాంగ్ హు (Po-yanghu) అనే సరస్సు ద్వారా 'కాన్ నది ' (Kan river), ఉత్తరంగా హాన్‌కౌ (Hankau) ద్వారా ' హాన్ ' (Han) నది; దక్షిణంగా 'టుంగ్ టింగ్ హు ' (టుంగ్ టింగ్ సరస్సు ) ద్వారా 'హ్సియాంగ్ ' (Hsiang) నది; ' ఫౌడింగ్ ' (Fouding) ద్వారా 'వూ' (Wu) నది; యాంగ్‌ట్జెని చేరతాయి. అదేవిధంగా, ' చంగ్ కింగ్ ' (Cheng - king) ద్వారా ' చియాలింగ్ '(Chia ling) ; పశ్చిమ 'జెక్‌వాన్ ' (Szchwan) ద్వారా 'మిన్ ' (Min) నది, ఉత్తర దిశ నుండి 'యాంగ్‌ట్జె' ని చేరే మరి రెండు నదులు. పశ్చిమ దిశగా ప్రవహిస్తూ, దక్షిణ చైనాలో 1,70,000 చదరపు మైళ్ళ మేరకు 'హ్సికియాంగ్' (Hsichiang) అనే ఇంకొక ఉప నది కూడా ప్రధానమయినదే. ఈ 'హ్సికియాంగ్ ' నది వైవిధ్యంగల భూభాగం ద్వారా ప్రవహిస్తున్నది. ఈ రకమైన ఉపనదులన్నీ మహా నదీ వ్యవస్థలో భాగం కాగా, మహానదులన్నీ చైనాను సస్యశ్యామలం చేశాయి. చైనా నాగరికతను అందువల్లనే ప్రధానమయిన మహానదుల పేర హొయాంగ్ - హో -హ్సి – యాంగ్‌ట్జె కియాంగ్ నాగరికత అనడం కూడా ఉంది.

### 15.2.1.1.2 ఇతర భౌగోళికాంశాలు

చైనా దేశంలో నదీ వ్యవస్థ, ఉప నదీ వ్యవస్థ మాత్రమే గాక, ఇతర భౌగోళికాంశాలను గురించి కూడా తెలియడం కొంత వరకు అవసరం. అందువల్ల, దానిని గురించి కొంత సంక్షిప్తంగా రాయడం జరుగుతున్నది.

భౌగోళికపరంగా చైనాను పరిశీలిస్తే, అది ఎక్కువ ఉష్ణోగ్రతతో కూడిన, సుదీర్ఘ వేసవులు గల ఖండాంతర్గత శీతోష్ణస్థితికి, ఇది కూడా ఆసియాలోని దక్షిణ మంచూరియా, వాయవ్య కొరియా మొదలయిన వాటివలెనే, ఒక ఉదాహరణ. ఈ ప్రాంతం అంతా $45^0$ ఉత్తర అక్షాంశానికి ఎగువన, సమ వర్షపాత రేఖల (290 hycts) ప్రమాణంలో 50 సెంటిమీటర్ల వర్షపాతాన్ని నమోదు చేసే ప్రాంతంలో ఉన్నది. ఈ ప్రాంతంలో శీతోష్ణస్థితి (Climate) తీవ్రమైన చలితో వున్న శీతాకాలాలు, ఎక్కువ వేడి గల వేసవులతో ఉంటుంది. ఏడాదంతా నాలుగు ప్రధానమైన ఋతువులుగా ఉంటుంది. ఈ ఋతువులు కూడా ప్రతియేటా ఒకేలా ఉండక, మార్పు చెందుతాయి. చైనాలోని హ్వాంగ్‌హో (Hwangho) నదీ పరీవాహక ప్రదేశం, మంచురియాలోని లియాఓ (Liao) నదీ పరివాహక ప్రదేశం, తీవ్రమైన అల్పపీడన, అధిక పీడన ప్రాంతాలుగా గుర్తించబడ్డాయి. ఈ ప్రాంతాలలో ఉష్ణోగ్రత సగటున జనవరి - జులై నెలల్లో $25^0$ - $75^0$ వరకు మారుతుంది. కాని, వేసవిలో కూడా అప్పుడప్పుడు వీచే చల్లని గాలులు ఈ ఉష్ణోగ్రతను తగ్గిస్తాయి. వేసవిలో ఉత్తర చైనాలో 75 సెం.మీ వరకూ, వర్షపాతం పెరుగుతూ వుంటుంది.

ఈ ఉష్ణోగ్రతాశీతోష్ణస్థితుల పరిణామంలో, భూమి ఉపరితలంలో కూడా తగినన్ని మార్పులు, ప్రత్యేకతలు సంభవించాయి. ఇదంతా కూడా ప్రధానంగా పర్వత ప్రాంతం. సముద్ర మట్టానికి 3000 అడుగుల ఎత్తు లోనే చైనాలో ఎక్కువ భాగం ఉంది. కేవలం పది శాతం మాత్రం, సముద్ర మట్టానికి 1,600 అడుగుల లోపల వుంది. చైనాలో ఉండే షాయిర్ పర్వత శ్రేణులు 20,000 అడుగులు, చిన్లింగ్ (Chinling) శ్రేణులు 13,000 అడుగుల ఎత్తున వున్నాయి. హ్వాయాంగ్ (Huaiyang), తపే (Tapieh) పర్వత శ్రేణులు చైనా మధ్యకు విస్తరించి, ఉత్తర, దక్షిణాలుగా చైనాను విభజిస్తాయి. తూర్పు, పడమరలుగా కారకోరం (Karakorum) పర్వతాలు, దక్షిణంగా హెంగ్‌టువాన్ (Hengtuan) పర్వతాలు, ఉత్తరాన టియెన్‌షాన్ (Tienshan) , ఆల్ఫ్ (Alfai) , తన్ను (Tannu), సయన్ (Sayan), యబ్లొనోవీ (Yablonovy), హ్సింగాన్ (Hsingan) పర్వతాలు విస్తరించాయి. ఈ పర్వతాలన్నీ అన్ని దిశల్లో చైనాకు సరిహద్దు గోడల్లా మిగిలాయి. ఇవేకాక, తూర్పు చైనాలో వుయి (Wuyi), చాంగ్‌పై (Changpai) పర్వతాలు, ఈశాన్య సముద్రతీర ప్రాంతంలో అలిన్ (Alin) పర్వతాలు ఉన్నాయి.

ఈ దేశంలో పై పర్వతశ్రేణులే కాక, మంచూరియా మైదానం, ఉత్తర చైనా మైదానం, దిగువ యాంగ్‌ట్జె పరీవాహక ప్రదేశం , మధ్య యాంగ్‌ట్జె పరీవాహక ప్రదేశం, పెర్ల్ నదీ పరీవాహక ప్రదేశం అనే మైదానాలున్నాయి. మెట్ట భూముల ప్రాంతాలను దక్షిణ మంచురియా, షాంటుంగ్ (Shantung), చైనా ఆగ్నేయ తీరం, దక్షిణ చైనాలలో చూడగలం. నదీ ప్రాంతాలుగా షెన్సి (Shensi), కన్సు (Kansu), సెచ్వాన్ (Sechuan) త్సైదాం (Tsaidam), డ్సుంగేరియన్ (Dsungarian) లను గుర్తించొచ్చు. కేవలం పీఠభూమి ప్రాంతాలుగా, షాన్సి పీఠభూమి (Shansi plateau) నైరుతి పీఠభూమి, మంగోలియా పీఠభూమి, టిబెట్ పీఠభూములను గుర్తించొచ్చు.

చైనా సముద్ర ప్రాంతాలలో ఉత్తర ప్రాంతం దుర్గమంగా ఉండగా,దక్షిణ ప్రాంతం ఎంతో ప్రాధాన్యం సంతరించుకొంది.

నదీ వ్యవస్థ ప్రభావం వల్ల, చైనాలో కూడా విశిష్టమైన వ్యావసాయిక ప్రధానమైన ఆర్థిక వ్యవస్థతో కూడుకొన్న



BRAOU

నాగరికత రూపుదిద్దుకొన్నది. కాని, వ్యవసాయ పూర్వపు నాగరికతలు కూడా, ప్రత్యక్షంగా ఆనవాళ్ళతో సహా కన్పిస్తున్నాయి. ఈ నాగరికతలోని కర్తృత్వ (Chorological) పరిణామాన్ని కూడా సూచిస్తున్నాయి.

## 15.3 చైనా నాగరికతల ప్రాథమిక వికాసం – ఒక పరిశీలన

ఇరవయ్యో శతాబ్దపు తొలి దశాబ్దాలలో ఆండర్సన్ (Anderson), హెన్రీ బ్రూయెల్ (Henrie Bruel), ఎమిలీ లైసెంట్ (Emile Licent), టీల్ హార్డ్ డికార్డిన్ (Teal Hard Decordin) మొదలయినవారు భూతత్వపరంగా ఇంచుమించు 5,00,000 సంవత్సరాల వెనుకకు చెందిన సున్నపురాళ్ళ గుహలు మొదలైన వానిని, ఇతర సాంస్కృతిక స్థావరాలను పరిశీలించగా, అనేక నాగరికతా విశేషాలు తెలిసాయి. చౌకోటియెన్ (Choukoutian) గుహ, ఆర్డాస్ (ordos) పచ్చిక బీళ్ళు (Steppes), జారాఒస్సో, గోబీ ఎడారికి చెందిన షాబరాక్ ఉసు(Shabarak Usu) , చింగ్‌టి (Chingti) లిన్‌హ్సి (Linhsi) , ఉలన్‌హటా (Ulanhata) , యంగ్‌షాఓ (Yang Shaho), పాన్‌షాన్ (Panshan), మాచియాంగ్ (Machiang), హ్సిన్‌టీన్ (Hsintien), షాషింగ్ (Shashing) మొదలయిన ప్రాంతాలలో, ప్రథమ ప్రాచీన శిలా యుగ కాలం నుండి నవీన శిలా యుగం వరకు గల నాగరికతల పరిణామాన్ని సూచించడానికి మచ్చుతునకలు. ఈ నాగరికతలన్నీ తొలి దశలలో గొడ్డళ్ళు లేని (Non-hand axe) నాగరికతలకు, భారతదేశం లోని ' సోన్ ' (Soan) నదీ నాగరికత వలె, ఉదాహరణలే. వీని కర్తలను గురించి తెలియడానికి గాను, ఒక శిలాజం (Fossil) తోడ్పడుతుంది. ఇది 1921-1949 మధ్యలో చౌకోటియెన్ (Choukoutien) గుహలో జరిపిన తవ్వకాల్లో బయటపడింది. దానిని ' సినాంథ్రోపస్ పెకినాన్సిస్ (Sinanthropus Pekinansis) అని, ' పెకింగ్ కు చెందిన చైనా మనిషి ' (Peking man) అని వర్ణించారు. ఈ గుహ పెకింగ్ నగరానికి 30 మైళ్ళుగా నైరుతి దిశలో ఉండటం వల్ల, ఈ పేరు వచ్చింది. ఈ వ్యక్తి శరీరం ' జావా ' లో ' పెడ్జిటా ' (Pedjita) నదీ తీరంలో దొరికిన ' మెగాంథ్రోపస్ పాలియో జావానియస్ (Meganthropus Palaeo Javanias) జావాకు చెందిన పెద్ద శరీరం గల పాత కాలపు మనిషి అని వర్ణించబడిన, నిటారుగా నిలవగలిగిన మనిషి (హోమోఎరెక్టస్ - Homoerectus) తో సంబంధం కలిగినదిగా పేర్కొన్నారు. ఆ సూచన దృష్ట్యా, చైనా నదీ లోయలలోను, ఇతర ప్రాంతాలలోను విలసిల్లిన నాగరికతల కర్తలు, విశిష్టమైన బుద్ధివికాసాన్ని (Cramia capacity), స్థూలమైన, క్రమమయిన శారీరక పరిణామాన్ని పొందారని తెలియొచ్చు.

BRAOU

### 15.3.1 చైనాలో ప్రాచీన శిలా యుగపు నాగరికత

చైనాలోని ప్రాచీన శిలాయుగపు పనిముట్లలో చేతిగొడ్డళ్ళు లేవు. కేవలం నరుకుడు రాళ్ళు (Adzes), బరుకుడు రాళ్ళ (Scrapers)వంటివి, ఎర్రని, పసుపు పచ్చని ఒండు దిబ్బలలో వ్యక్తమవుతున్నాయి. జారా ఒస్సో (Tsara Osso) లో, శిలాజాలతో కూడుకొన్న ఇసుక దిబ్బలలోను, నదీపరీవాహితమైన మట్టి దిబ్బలలోను, సూక్ష్మ శిలా యుగ (Microlithic) సంప్రదాయానికి చెందిన కొన్ని పనిముట్లను, హెన్రీబ్రూయెల్ (Henrie Bruiel) కనుగొన్నాడు. దక్షిణ చైనాకు చెందిన 'క్వాన్ సి ' (Kwansi) మినహా, ఇతర చోట్లలో సూక్ష్మశిలాయుగ (Microlithic) సంప్రదాయంగాని, ఇతర శిలాయుగ సంప్రదాయాలుగాని, ఎంతో అరుదుగా వున్నాయి. గోబీ ఎడారి ప్రాంతానికి చెందిన ' షబారక్ ఉసు ' (Shabarak usu) లో లభ్యమయిన ఆధారాలు, సూక్ష్మశిలా యుగానికి చెందిన రేఖా గణితేతరమయిన నమూనాలతో కూడిన వస్తువులనే చూపుతున్నాయి.. అవి టార్డోనీషియా (Tardonisia), అజీలియా (Azilia) మొదలైన ప్రాంతాలలోని నాగరికతలను పోలి వున్నాయి. ఇవి రెండూ ఐరోపాకు చెందినవి. అంటే, ప్రధానంగా ప్రాచీన శిలాయుగం ఎన్నో విశాలమైన, విస్తృతమైన,

పరిణామాత్మకమైన, ఆధారాలను తొలి నుండి చూపలేదు. దానికి కారణం, ఈ నాగరికత కర్తలు ' జింజాంత్రోపస్ ఆఫ్రికానస్ ' (Zinzanthropus Africanus), ప్లైజియాంత్రోపస్ ట్రాన్స్‌వాలెన్సిస్ ' (Plesianthropus Transvalensis) మొదలైన తొలి మానవ పూర్వుల కన్న ఎంతో ఎక్కువయిన శారీరక పరిణామాన్ని పొంది ఉండటమే. వీరిని కొందరు ' హోమోసపియన్ ఆషియాటికస్ ' (Homosapien Asiaticus) అని కూడా వర్ణించారు.

## 15.3.2 చైనాలో నవీన శిలా యుగపు నాగరికత

క్వాటర్నరీ (Quaternary) యుగానికి చెందిన తెల్లని ఇసుక దిబ్బల మీద, హిమయుగం (Pleistocene) తరవాత ఏర్పడిన నల్లమట్టి పొరలు, షింగ్‌టె (Shing te) , లిన్‌హ్సి (Lin hsi) , ఉలన్‌హటా (Ulan Hata) మొదలయిన చోట్ల, నవీన శిలా యుగపు నాగరికతలకు చెందిన సాంస్కృతికావశేషాలను చూపుతున్నాయి. ఈ నాగరికతలు ఉత్తర మంచూరియా నుండి మరింత ఉత్తరంగా, మంగోలియా (Mangolia) కు వ్యాపించాయి. ఇక్కడ మెరుగుపెట్టిన పరికరాలుగాని, నిజమైన చేతిగొడ్డళ్ళు (True hand axes) గాని లేవు. లిన్‌హ్సి (Linhsi) లో కొన్ని వ్యావసాయిక పరికరాలు, కొంత భాగం కుండలకు చెందిన పెంకులు, కొన్ని సూక్ష్మ శిలా యుగ పరికరాలు దొరికాయి. పశ్చిమ కన్సు (Western Kansu) , లియోటుంగ్ (Liaotung) అఖాతం మధ్య భాగాలలో గల ఉలన్ హటా (Ulan hata) మొదలైన చోట్ల కూడా, ఈ రకమైన సంస్కృతి విస్తరణను చూడొచ్చు. రాను రాను ఈ నాగరికతలలో రంగులు దిద్దబడిన కుండలతో కూడిన సాంస్కృతిక సంప్రదాయాలు ఎక్కువగా పెంపొందాయి. చి–చియా–పింగ్ (Chi-chia-ping) అనబడే దక్షిణ 'కాన్సు'కి చెందిన స్థావరంలో, దువ్వెనల పోలికలతో ముద్రలు గల కొన్ని ఆభరణాలు దొరికాయి. ఇవన్నీ పూర్తిగా చైనీయేతరమయిన సాంస్కృతిక పరిణామాన్ని సూచిస్తాయి.

## 15.3.3 యాంగ్‌షొఓ చిత్రిత ఘట సంస్కృతులు (Yangshao Painted Pottery Cultures)

ఈ నాగరికతలు పశ్చిమ కాన్సు (Western Kansu) . ఉత్తర హానాన్ (North Hanan) , మధ్య వ్యాపించాయి. దీనిని ' జెక్‌వాన్ ' (Szekwon), ' షెంగ్‌టె ' (Shengte), లియానింగ్ (Lianing) మొదలైన ప్రాంతాలలో కూడా విస్తరించినట్లు చూడగలం. ఇది ప్రధానంగా 'హ్సినింగ్' (Hsyning), టా ఓ ఎర్ (Taoer), వీ (Wie), షియాహింగ్ (Shiahing), హాన్ (Hon), హ్వాంగ్‌హో (Hwangho) నదులకు సమీపంగా వృద్ధిపొందాయి. ' పాన్‌షాన్ ' (Panshan), ' మాషాంగ్ ' (Mashang), హ్సిన్‌టీన్ (Hsintien), షాషింగ్ (Shashing) ముఖ్య స్థావరాలు. ' పాన్‌షాన్ ' (Panshan) లోని చిత్రిత ఘటాలన్నీ ఎక్కువగా ' ఆంఫోరా ' (Amphorae) అనే వస్తు విశేషానికి చెందినవి. ఇది మట్టి అయినా, గాజువలె వుంటుంది. దీనిలోని పాత్రలు ఎంతో ఉదాత్తంగా ఉండి, చూపరులను ఆకట్టుకొనే అలంకరణ నమూనాలను కలిగి ఉంటాయి. అటువంటి వాటిలో, అంటే అలంకరణ నమూనాలలో , గుండ్రంగా పరిసర్పితమైన 'S' వంటి గీతలు, 'చెక్' డిజైన్లు ( అంటే  వంటివి), డైమండ్ వంటి నమూనాలు, 'జిగ్‌జాగ్' నమూనాలు ముఖ్యమైనవి. మాషాంగ్‌లోని పాత్రల అవశేషాలు, నల్లని అలంకరణ వైవిధ్యం గల ఎర్రని మట్టితో చేసినవి. ఈ పాత్రల మీది చిత్రాలు వర్ణ చిత్రణంలో, చిత్రకారుడు చూపిన నిర్లక్ష్యాన్ని పొందుపరుస్తాయి. అందరి అలంకరణలలో సమావృత వలయాలు (concentric circles) , సమ బాహు చతుర్భుజాకారం (Phombus) లో ఉండేటటువంటి కొక్కెము (Hook) లు, సమాంతరరేఖలతో కూడిన నది మలుపులను చూపే చిత్రాలు ఉన్నాయి. మూడవ స్థావరమైన హ్సింగ్ టీన్ (Hsingtien)లో మొదటి రెండు స్థావరాల కన్న ఎంతో వైవిధ్యం చోటు చేసుకొన్నది. చిన్న చిన్న కంచు పాత్రలు కూడా, యీ నాగరికతలో ఉన్నాయి. నాలుగో స్థావరమయిన షాషింగ్ (Shashing)లో ఆధారాలన్నీ, హ్సిన్‌టీన్‌కి వారసత్వాన్ని చూపుతున్నాయి.

B R A O U

స్థూలంగా పరిశీలించినట్లయితే, చైనాలోని అన్ని సాంప్రదాయిక నవీన శిలా యుగ స్థావరాల దృష్ట్యా, ఈ క్రింది ఆధారాలను సామాన్య లక్షణాలుగా గ్రహించొచ్చు.

1. దీర్ఘచతురస్రాకారపు వంపులున్న బలమైన పెద్ద గొడ్డళ్ళు.

2. బల్లపరుపు నరుకుడు రాళ్ళు

3. చిన్న నరుకుడు రాళ్ళు

4. దీర్ఘ చతురస్రాకారంగా గాని, ఘన త్రిభుజ (Trepez) ఆకారంలోగాని ఉండే కత్తులు

5. జేడ్ (Jade), అమెజానయిట్ (Amazonite), పాలరాయి (Marble)వంటి వాటితో చేసిన పూసలు, దండలు.

ఇవి తప్ప, మనకు తొలి వ్యావసాయిక సంస్కృతులను చైనాలో సూచించే ఆధారాలేమీ లభ్యం కావడం లేదు.

## 15.3.4 చైనా నాగరికతకు, నేపథ్యాంశాలకు గల సంబంధం

పైన కన్పించే తొలి నాగరికతావశేషాల దృష్ట్యా, నాగరికతకు నేపథ్యాంశాలుగా చెప్పబడిన వానికి గల సంబంధాన్ని అంచనా వేయాలి. అది లేనట్లయితే, రాను రాను చైనాలో ప్రపంచ విఖ్యాతి పొందిన చైనా మహా కుడ్యం (Great Wall of China) వంటి, ప్రపంచంలో ఆశ్చర్యావహకమైన నిర్మాణాలకు దోహదం చేసిన కారణాలను, కర్తృత్వ అంశాలను ఇదమిత్థంగా నిర్ణయించలేం. భౌగోళిక నేపథ్యంలో గల పర్వతాలు, నదులు, చైనీయుల మానసిక భావాలను ఎంతో ప్రభావితం చేశాయి. అందువల్లనే, పర్వతం అని అర్థం ఇచ్చే 'షాన్' అనే పేరిట, తొలి రాజ వంశం రూపుదిద్దుకొని, క్రీ.పూ. 1500 - 1100 మధ్య పరిపాలన కొనసాగించింది. వెల్స్ (Wells) ప్రకారం, షాన్ రాజ వంశం క్రీ.పూ. 1125 లోనే అంతమైంది. ఆ తరవాత, క్రీ.పూ. 1100 – క్రీ.పూ. 221 మధ్య పాలించిన ' చౌ ' (Chou)రాజవంశీకులు కూడా ప్రకృతికి , ప్రకృతి నేపథ్యానికి ప్రతీకలే. ఇంత ఉత్తేజకరమయిన పరిపాలనలు ఇంచుమించు 1280 సంవత్సరాల పాటు కొనసాగినా, చైనా నాగరికతకు చెందిన అవశేషాలను – సాంస్కృతికమయిన వానిని, అదేవిధంగా శారీరకమైన వానిని వారసులు ఎక్కువగా పొందలేకపోయారు. దానికి కారణం చైనాలో గల మహా నదులు, ఉపనదులు, అన్నీకూడా, టిబెట్, మంగోలియా మొదలైన ధ్రువ ప్రాంతపు వాతావరణ వ్యవస్థ గల ప్రాంతాలతో సంబంధాన్ని కలిగి ఉండడం వల్ల, ప్లైస్టోసీన్ (Pleistocene) హిమ యుగాంతంలో ఎంతో విస్తృతంగా వచ్చిన అతి వర్షకాలాల(Pluvials) , నిర్వర్షకాలాల(Inter pluvials) (నిర్వర్ష కాలం అంటే, ఒక అతి వర్ష కాలానికి, ఇంకొక అతి వర్ష కాలానికి మధ్య గల వర్షాలు లేని కాలాలు. అతి వర్ష కాలాలను గుంజ్–మిండెల్, రిస్, వూం అని గుర్తించగా, నిర్వర్ష కాలాలను గుంజ్-మిండెల్; మిండెల్-రిస్, రిస్-వూం అని గుర్తించారు.) ప్రభావాలకు గురై, మానవ స్థావరాలనే నిర్వాసితం చేసాయి. దొరికిన స్థావరాలన్నీ ఎక్కువగా ఎగువ నదీ పరీవాహక ప్రాంతాలకు చెంది ఉండటమే దీనికి తార్కాణం. ఈ రకమైన పరిస్థితి హిమాలయ పర్వతాల ప్రభావానికి లోనైన ఉత్తర భారతదేశంలో కూడా ఉండటంవల్లనే, ప్రాచీన శిలా యుగపు ఆనవాళ్ళు అక్కడ ఎక్కువగా మృగ్యమై, కేవలం గుర్తులు మాత్రం దొరికాయి.

మతపరమైన అంశాలలో కూడా ఈ విధమైన ప్రభావం గమనార్హమైనది. కన్ఫ్యూషియస్ (Confucius), మెన్షియస్ (Mencius), టావో (Tao) మొదలైన తత్త్వ వేత్తలు క్రీ.పూ. 6వ శతాబ్దంలో సంస్కరించే వరకు, మత వ్యవస్థలో ప్రబలిన దివ్యత్వ సంప్రదాయం (Tradition of Divination) –ప్రభువును స్వర్గపుత్రుడు

BRAOU

(Son of the Heaven) గా భావించడం వంటివి – చైనా లోని సంస్కృతి, ఆలోచన, నాగరికతలపై మానవ సమాజ ప్రభావాన్ని గాక, నైసర్గిక అంశాల ప్రభావాన్ని మాత్రం చూపుతున్నాయి. అంటే, మానవుడు ఆ దశలో తనను తాను నిగ్రహించుకోలేక, ప్రకృతి పారవశ్యానికి గురై, ప్రకృతి ఔన్నత్యాన్నే తన ఔన్నత్యంగా భావించి అనుసరించాడని, చైనా వాస్తవ్యుల తీరువల్ల తెలుస్తున్నది.

## 15.4 చైనా నాగరికతలో వివిధ కాలమాన దశలు

చైనా నాగరికతలో క్రీ.పూ.2800 - క్రీ.పూ. 1530 మధ్య 'చిన్'(Chin) అనే రాజవంశీకులు పాలించారు. వారి పేరిటనే, ఇది చైనా అని పిలువబడింది. వారు కేవలం చైనాలో పౌరాణిక సంబంధమైన రాజవంశస్థులు. క్రీ.పూ. 1500 - క్రీ.పూ 1100 మధ్య చైనా దేశాన్ని 'షాన్' (Shan) వంశస్థులు పాలించారు. ఆ తరువాత క్రీ.పూ. 1100 నుండి క్రీ.పూ. 221 వరకు 'చౌ' (Chou) రాజవంశస్థులు చైనాను పరిపాలించి, ఆ దేశానికి గల ఇదమిత్థమయిన స్వరూపాన్ని, దానిలోని భాగాలయిన 17 రాష్ట్రాలను గుర్తించడం జరిగింది. అవి : అన్హ్వి (Anhwi), షెకియాంగ్ (Shekiang), ఫుకిన్ (Fukin), హోపి (Hopi), హునాన్ (Hunan), హుపే (Hupe), కాన్సు (Kansu), కియాంగ్సి (Kiangsi), కియాంగ్సు (Kiangsu), క్వాన్సి (Kwansi), క్వాంగ్‌టుంగ్ (Kwangtung), క్వీచౌ (Kweichou), షాన్సి (Shansi), షాన్టుంగ్ (Shantung) షెన్సి (Shensi), జెక్వాన్ (Sjekwon), యునాన్ (Yunan). క్రీ.పూ 206 – క్రీ.శ 220 మధ్య గల 426 ఏళ్ళలో, లి–యు–పాంగ్ (Li-u-pang) స్థాపించిన 'హాన్' (Han) రాజవంశస్థులు పాలించారు. వీరి తొలి రోజుల పాలనలో, క్రీ.పూ. 221 - 206 లలో, చిన్–షి–హ్వాంగ్‌టి (Chin-shih-huangti) చైనా మహా కుడ్య (Great Wall) నిర్మాణాన్ని కొనసాగించాడు. అది 1500 మైళ్ళ పొడుగు, 22 అడుగుల ఎత్తు, 20 అడుగుల వెడల్పు (అంటే 11,11,60,000 ఘనపు అడుగులు) గలది. రాను రాను చైనాలో నాగరికత, క్రీ.శ. 2వ శతాబ్దం నుండి బౌద్ధ మత ప్రవేశంతో ఎన్నో మార్పులను పొందింది.

### 15.4.1 చైనా కాలమాన దశలకు , భారతీయ నాగరికతతో పోలికలు

చైనాలో చిన్ యుగ కాలం, భారతదేశంలో సింధు నాగరికత కాలంతో సరిపోతున్నది. కాని, భారతదేశంలో హరప్పా, మొహంజొదారో, లోథల్ మొదలైన చోట్ల అభివృద్ధి చెందిన పట్టణ నాగరికత, చైనాలో లేదు. షాన్ పాలనకు సరిగా, భారతదేశంలో తొలి వేద కాలపు, మలి వేద కాలపు సంస్కృతులను చూడగలం. ఇవి కూడా, షాన్ నాగరికతలో వలెనే, నైసర్గిక శక్తుల ఆరాధనకు మూల స్తంభాలు. చౌ రాజ వంశస్థుల పాలనకు సరిగా, భారతదేశంలో ఉపనిషద్యుగం, పురాణేతిహాస యుగం వ్యాపించాయి. ఈ కాలాల్లో ప్రకృతి ప్రతికృతులను అవగాహన చేసుకొని, కర్మసహితమైన యజ్ఞాలు, క్రతువులు వ్యాప్తిలోకి వచ్చాయి. చైనాలో ఏవిధంగా కన్‌ఫ్యూషియస్ (Confucius), టావో (Tao) లు వ్యక్తి భావానికి, ప్రబలమైన సిద్ధాంతాలను చేసి, నవీన సమాజ నిర్మాణానికి కృషిచేశారో, భారతదేశంలో కూడా సత్యాహింసలతో కూడిన ధర్మబద్ధమైన రాజ్య , సమాజ నిర్మాణానికి తోడ్పడే సిద్ధాంతాలను, వర్ధమానుడు, గౌతమ బుద్ధుడు బోధించారు. ఈ విధమైన పోలిక వల్ల, ఆసియాలో హిమాలయ పర్వతాలకు సమీపంలో గల అన్ని ప్రాంతాలలోను, వానికి సన్నిహితత్వంగల ప్రాంతాల లోనూ, ఒకే రకమైన ఆలోచనా విధానం, జీవన విధానం, నమ్మకాలు, తిరుగుబాటు ధోరణులు ప్రబలినట్లు గ్రహించొచ్చు. ఈ విధానం యాదృచ్ఛికం కాదనే వాదమే, నిసర్గ అంశాలను తనవిగా చేసుకొని పురోగమించిన మానవ ప్రగతీ వికాసానికి మచ్చు తునకలుగా, పై అంశాలు అభివ్యక్తం చేస్తాయి.

## 15.5 చైనా నాగరికతా స్వభావం

చైనా నాగరికత వ్యావసాయకమైనది. మత వ్యవస్థ ప్రకృతి ఆరాధనతో కూడినది. దీని కర్తలు ఎంతో

అభివృద్ధి పొందిన బుద్ధి వికాసాన్ని కలిగి, ప్రకృతిని తమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకోడంలో సిద్ధహస్తులయ్యారు. వీరి నాగరికతపై, మంగోలియా, టిబెట్, మంచూరియా వంటి సమీప ప్రాంతాల ప్రభావం ఎంతో విస్తృతంగా వుంది. ఈ నాగరికత లోని మార్పులు కేవలం ' చౌ ' రాజవంశం వంటి పడమటి రాజవంశాల వారి ప్రభావంవల్లనే కాక, కన్‌ఫ్యూషియస్ వంటి ప్రవక్తల ఆలోచనాబలం వల్ల కలిగిన విధానాల ప్రభావం వల్ల కూడా, ఏర్పడినాయి. చైనా నాగరికత పడమటి నుండి తూర్పుకు పరిణమించిన నాగరికత.

## 15.6 సంగ్రహంగా

1. చైనా, యాంగ్‌ట్జె, కియాంగ్, హోయాంగ్‌హో వంటి మహా నదీ వ్యవస్థలలో విలసిల్లిన నాగరికత కలది.
2. ఇక్కడి శిలాజాలు తొలి కర్తృత్వ సంప్రదాయాన్ని సూచిస్తున్నాయి.
3. ప్రాచీన శిలా యుగం నుండి నవీన శిలా యుగం వరకు, ఆ తర్వాత చారిత్రక దశల లోను, చైనాలో నాగరికత అవిచ్ఛిన్నంగా పరిణమించింది.
4. ఆండర్సన్ అన్న ' నవీన శిలా యుగ శూన్యత ' (Neolithic hiatus) కేవలం అసాంప్రదాయికమే.
5. మత వ్యవస్థ, రాజ్య వ్యవస్థ , సామాజిక వ్యవస్థ మొదలైన నాగరికత అంశాలన్నీ, మానవుని ఉనికిని నిర్లక్ష్యం చేసి, కేవలం ప్రకృతి ప్రతికృతిగా ఏర్పడినవే.
6. అందువల్లనే, మానవతా వాదం చైనాలోని ప్రధాన తాత్త్విక సమస్యగాను, లక్ష్యంగాను పరిణమించింది. దాని ఫలితాలను తుది ' చౌ ' వంశం కాలం నుండి చూడొచ్చు.

## 15.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. చైనా నాగరికతకు గల భౌగోళిక నేపథ్యాన్ని వివరించండి.
2. చైనాలో ప్రాథమిక నాగరికతా వికాసక్రమాన్ని పరిశీలించండి.

**II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. చైనాలో నదీ వ్యవస్థ
2. చైనాకు, భారతదేశానికి గల సాంస్కృతికమైన పోలికలు
3. చైనా నాగరికతకు, నేపథ్యాంశాలకు గల సంబంధాన్ని తెల్పండి.
4. చైనాలోని చిత్రితఘట సంస్కృతుల గురించి రాయండి.

## 15.8 ఉపయుక్త గ్రంథాలు

**Encyclopaedia Britannica, vol. III.**, P. 570

BRAOU

Wells, H.G. : **A Short History of the World**, London, 1930

Sastri, O.A.N. : **Essentials of World History**

Bodo Veethoff : **Introduction to Chinese History from Ancient Times to 1912**, London.

Heenjikdun & Highsmith : **World Regional Geography**, Prentice Hall of India, Pvt., Ltd., Bombay.

## 15.9 పదకోశం

లోవెకిన్ : హిమ యుగ కాలం నాటి పచ్చని ఒండ్రుమట్టి

షాన్ : చైనా భాషలో పర్వతం

సినాంత్రోపస్ పెకివాన్సిస్ : పెకింగ్‌కు చెందిన చైనా మనిషి (పెకింగ్ మనిషి)

మెగాంత్రోపస్‌పాలియోజావానియస్ : జావాకు చెందిన పెద్ద శరీరం గల పాత కాలపు మనిషి

ఆడ్జ్ (Adze) : నరుకుడు రాయి

స్క్రేపర్ : బరుకుడు రాయి

జింజాంత్రోపస్ ఆఫ్రికానస్ : ఆఫ్రికాకు చెందిన మనిషి

ప్లెజియాంత్రోపస్ టాన్స్‌వాలెన్సిస్ : ట్రాన్స్‌వాల్ కు చెందిన మనిషి

హోమోసపియన్ ఆసియాటికస్ : ఆసియాకు చెందిన తొలి మానవుడు

ఆంఫోరా : గాజు వంటి మట్టి

ప్లూవియల్ (Pluvial): దీనినే అతి వర్ష కాలాలంటారు. ఇవి భూమధ్యరేఖకు దక్షిణంగా సంభవించాయి. అవి కగేరాన్, కమాసియన్, కంజీరాన్, గాంబ్లియన్‌గా వర్గీకరించబడినాయి.

చిన్ : క్రీ.పూ. 2800 - 1500 మధ్య చైనాను పాలించిన రాజవంశం

షాన్ : క్రీ.పూ. 1500 - 1100 మధ్య చైనాలో రాజవంశం

చౌ : క్రీ.పూ. 1100 - 221 లలో చైనాను పాలించిన రాజవంశం.

# భాగం - 16 : సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు

విషయ క్రమం


16.0 లక్ష్యాలు

16.1 పరిచయం

16.2 చైనాలో సామాజిక వ్యవస్థ

- 16.2.1 సామాజికతత్త్వం
- 16.2.2 చైనా సమాజంలో జాతి భావం
- 16.2.3 చైనా సమాజంలో అంతరాలు
- 16.2.4 కుటుంబ వ్యవస్థ
- 16.2.5 ఆహార వ్యవస్థ
- 16.2.6 సమాజ సమీక్ష

16.3 చైనా ఆర్థిక వ్యవస్థ

- 16.3.1 తొలిదశ
- 16.3.2 వ్యావసాయిక వ్యవస్థ
- 16.3.3 వ్యావసాయేతర ఆర్థిక వ్యవస్థ

16.4 చైనా రాజ్య వ్యవస్థ

- 16.4.1 రాజ్య వ్యవస్థ నేపథ్యం
- 16.4.2 రాచరికం
- 16.4.3 మంత్రులు - వారిశాఖలు
- 16.4.4 న్యాయ వ్యవస్థ
- 16.4.5 రాష్ట్ర పరిపాలన
- 16.4.6 ప్రాంతీయ పాలన

16.5 సంగ్రహంగా

16.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

16.7 ఉపయుక్త గ్రంథాలు


BRAOU

16.8 పదకోశం

## 16.0 లక్ష్యాలు

ఈ భాగంలో ఈ క్రింది వానిని ప్రధాన లక్ష్యాలుగా పేర్కొనవచ్చు.

1. చైనా ప్రాచీన నాగరికతా కాలంలో సామాజిక వ్యవస్థ స్వరూపాన్ని తెలుసుకోవడం.

2. చైనాలో ప్రాచీన ఆర్థిక వ్యవస్థ స్వరూప స్వభావాలను గ్రహించగల్గడం.

3. చైనాలోని రాజకీయ వ్యవస్థను గురించి పరిశీలన చేయడం.

## 16.1 పరిచయం

భౌగోళికంగా యాంగ్‌ట్జె, హోయాంగ్‌హో నదులు ఎడతెగక పారే ప్రాంతంలో చైనా నాగరికతా పరిణామం, ఎంతో క్రమబద్ధమైన మానవ వనరుల అభివృద్ధి వల్ల సంభవించింది. చైనాలో అమలులో వున్న రాజకీయ వ్యవస్థ ప్రధానంగా రాచరిక వ్యవస్థ కావడం వల్ల, మానవ వనరుల అభివృద్ధిలో ఎంతో సహకారాన్ని అందజేయడం మాత్రమేకాక, చైనాలో సమాజాన్ని, సామాజిక వ్యవస్థను, దానికి అనుగుణంగా తీర్చిదిద్దడానికి తోడ్పడింది. చైనాలోని భౌగోళిక వైవిధ్యం ప్రజల అభిప్రాయాలను సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో ప్రభావితం చేసి, స్థిరమైన సామాజిక ప్రవృత్తిని, ఆర్థిక అభివృద్ధిని, రాచరిక ప్రగతిని పెంపొందించడంలో తోడ్పడింది.

## 16.2 చైనా సామాజిక వ్యవస్థ

సామాజికంగా, చైనాకు సంబంధించి దాని తత్త్వాన్ని, దాని వ్యవస్థలో వున్న ప్రధాన తరగతులను, వారి ప్రత్యేకమైన ఆచార వ్యవహారాలను గురించి క్లుప్తంగా తెలుసుకోవచ్చు.

B R A O U

### 16.2.1 సామాజిక తత్త్వం

ఇతర ప్రపంచం నుండి చైనా దేశం ఆధునిక యుగంలో అడుగుపెట్టే దాకా, ఎంతో కాలం వేరుగానే వుంది. ఆ దేశంలో ప్రకృతికి - మానవుడికి మధ్య ఐకమత్యాన్ని ఏర్పర్చడమే ప్రధాన లక్ష్యంగా ఉండేది. వారు టియెన్ (Tien) అనే విశ్వజనీన సమైక్యానికి మానవుడు దోహదం చేసినంతకాలం, అతడు ప్రకృతి వల్ల తగిన ఫలితాన్ని ఎల్లప్పుడూ పొందుతాడని భావించేవారు. మానవ సంబంధాలను సక్రమంగా ఏర్పరచుకొని, అవగాహన చేసుకొనని పరిస్థితిలో ఉన్నంతకాలం, మానవుని అధికారపరమైన, వస్తుపరమైన పెరుగుదల, మానవ సమస్యలను పెంచగలదనే చైనా తత్త్వవేత్తలు భావించారు. దాని కొరకే వారు సామరస్యం (Harmony) , స్థిరత్వం (Stability) గల సమాజాన్ని ఏర్పరచుకొన్నారు. దీని ప్రకారం వ్యక్తి సామాజిక స్థితి (social status) జన్మవల్ల మాత్రానియతమై ఉంటుంది. అయినా కూడా, అది కేవలం దృఢమైన (Rigid) అభిప్రాయం కాక, కొంత సరళత (Flexibility)ను కలిగి ఉండేది. వ్యక్తుల విధులు ఎంతో ప్రాధాన్యం వహించాయి. ఈ రకమైన సమాజంలో వ్యక్తి నిర్వహించే విధులన్నీ, ప్రధానంగా కుటుంబానికి చెందాలి. కుటుంబం, గోత్రం అనేవి చైనా సమాజంలోని ప్రాథమికాంశాలు. వంశంలోని వృద్ధులను ఆదరించి, గౌరవించడం ద్వారా, పిల్లలను వంశ గౌరవం నిలబెట్టే దృక్పథంలో పెంచడం ద్వారా, వారు సమాజంలో పూర్వుల పట్ల తమకున్న గౌరవాన్ని వ్యక్తం చేసేవారు.

కుటుంబం పట్ల వారి గౌరవం ఎటువంటిదంటే, ప్రభుత్వాన్ని వారు కుఓచియా (Kuvochia) జాతీయ కుటుంబం అని పిలుచుకొనేవారు. ఇటువంటి ప్రాచీన చైనా సమాజంలో వర్తకుడు , వ్యాపారి, సేనాని మొదలైన వారిని కాక, భూస్వామ్య స్థితిలో అధికారం ఉన్న పండితుడిని ఆదర్శ మానవుడని గౌరవించేవారు.

### 16.2.2 చైనా సమాజంలో జాతిభావం

చైనాకు చెందిన సమాజంలో దానిని (అంటే చైనా దేశాన్నే) దేశంగాను, సంస్కృతిగాను కూడా గుర్తించేవారు. ఆ గుర్తునే చుంగ్‌కుఓ (Chung Kuo), చుంగ్ హువా (Chung Hua) అనే మాటలలో చూపారు. క్రీ.పూ. 2000 ప్రాంతంలో ఇంచుమించు ఎనిమిది సంస్కృతులకు చెందిన మానవ కుటుంబాల వారు చైనాలో నివసించేవారు. ఈశాన్య దిశలో ప్రోటో - సుంగుసిక్ (Proto Sungusik) జాతివారు, వాయవ్య దిశలో ప్రోటో - టర్కిక్ (Proto - Turkik) జాతివారు, పశ్చిమ ఆగ్నేయ దిశలలో ప్రోటో – టిబెటన్ (Proto - Tibetan) జాతివారు ప్రధానమైనవారు. క్రీ.పూ . 2000 తరవాత హోపీ (Hopei) ప్రాంతానికి చెందిన వివిధ తెగలవారు హోనాన్ (Honan) వ్యావసాయిక భూములను ఆక్రమించి, ఆన్యాంగ్ (Anyang) మొదలైన పట్టణాలను ఏర్పర్చుకోడమేకాక, తొలి చైనా సామాన్యమైన షాంగ్ రాజ్యాన్ని వీరు సృష్టించడం జరిగింది. దీనివల్ల, సమాజంపై గల వివిధ జాతుల ప్రభావాన్ని , వారి పరస్పర పోషక భావాన్ని గమనించొచ్చు.

### 16.2.3 చైనా సమాజంలో అంతరాలు

జన్మతః సామాజిక స్థితితో కూడిన హోదా ఏర్పడుతుందనే చైనా వారి విశ్వాసం. సమాజంలో అంతరాలు పెరగడానికి దోహదపడింది.

ఆనాటి సమాజంలో ప్రధానంగా రెండు తరగతులు ఉండేవి. మొదటిది విద్యావంతులయిన ధనిక వర్గం, రెండోది సామాన్య ప్రజానీకం.

ప్రాచీన చైనాలో విద్యావంతులయిన ధనిక వర్గాన్ని ఇంచుమించు పాలక వర్గంగా గుర్తించొచ్చు. వారు ఆనువంశికమైన ఆచార వ్యవహారాలను ఎక్కువగా ఆశ్రయించేవారు. తాము వారసత్వంగా పొందనటువంటి, ఉద్యోగంవల్ల, చదువువల్ల, అధికారంవల్ల వచ్చిన భూములపై ఆదాయంతో వారు జీవించేవారు. కానీ, వీరు స్వయంగా అరకగట్టి సాగుచేసే రైతు కుటుంబాలకు చెందినవారు కాదు. ధనవంతులవడం వల్ల, విద్యార్జనకు, అధికారం కోసం పోటీకి తగిన అంగ బలం, అర్థ బలం రెండూ ఉండి, ప్రభుత్వాన్ని, భూమిని, ఆర్థిక వ్యవస్థను కూడా, వీరు ప్రభావితం చేసేవారు. వీరికి హోదా, అధికారం రెండూ ఉండేవి. వీరిని షి (Shih) అనేవారు.

సామాన్య ప్రజానీకంలో ఎక్కువ మంది రైతు కుటుంబాలకు చెందినవారే. వీళ్ళలో కూడా కొంతమంది మాత్రం స్వయంగా భూమిని కలిగి ఉండి, వ్యవసాయం చేసుకొనేవారు. మరి కొందరు భూమిని కౌలుకు సాగుచేసేవాళ్ళు. మరి కొంతమంది కేవలం వ్యవసాయ కూలీలు మాత్రమే. ఈ విధంగా ప్రత్యక్షంగా వ్యవసాయ రంగం మీద ఆధారపడినవాళ్ళేకాక, చేతిపనివాళ్ళు, చిన్న చిన్న వ్యాపారులు, సేవక వర్గానికి చెందినవారు, సైనిక వర్గానికి చెందినవారు, మతోద్యోగులు, కళాకారులు మొదలైన వారంతా వున్నారు. అయినా, చైనా సాంస్కృతిక వికాసానికి, అభివృద్ధికి, కీలకం విద్యావంతుల, మేధావి వర్గానికి చెందిన ధనికుల చరిత్ర అని ఆల్బర్ట్ ఫ్యూర్‌వెర్కర్ (Albert Feuerwerkar) అభిప్రాయం.

పూర్తిగా వ్యవసాయం మీద ఆధారపడిన వారిని నంగ్ (Nung) అనే వారు. చేతిపనివారిని కుంగ్ (Kung) అని, వ్యాపారస్తులను షాంగ్ అని పిలిచేవారు. సైనిక వ్యవస్థకు చెందిన వారిని షి (Shih) అనేవారు. ఈ నాలుగు

వర్గాల వారిని కలిపి, చైనా భాషలో స్సుమిన్ (Ssu min) అంటారు. ఆ కాలంలో చైనాలో గౌరవమైన కుటుంబం, లియాంగ్-చియా (Liang chiya) అని పిలువబడేది. వారు వర్తకం వంటి అగౌరవమైన వృత్తులతో జీవించేవారు కాదు. కాని పాన్‌కు (Panku) ప్రకారం 'చౌ' (Chou) రాజవంశ పతనం తరవాత మాత్రమే, విస్తృతమైన వర్తక, వాణిజ్య వ్యవస్థ స్థిరత్వం పొందింది. సేవకులు , గాయకులు, నటులు, సంగీత వేత్తలు, మంగలులు, వెట్టివారు, మొదలైన వారిని చీన్ మీన్ (Chien mein), అంటే అసాంప్రదాయ వర్గాలని పిలిచేవారు. చేతిపనివారికి ప్రత్యేకమైన గుర్తింపు ఉండేదా, లేదా, అన్నది కూడా, చర్చనీయాంశమే అయింది.

## 16.2.4 కుటుంబ వ్యవస్థ

చైనా సామాజిక వ్యవస్థలో కుటుంబ వ్యవస్థకు వున్న ప్రాముఖ్యం ఎంతో గణనీయమయినది. కుటుంబ వ్యవస్థ కేవలం గృహపరమైన వ్యవస్థగా మాత్రమే కాక, ఆర్థిక ప్రమాణంగాను, మత పరమైన ప్రమాణంగాను గుర్తించడం జరిగింది. చౌ వంశానికి చెందిన రాజులలో కుటుంబ వ్యవస్థకు ఫుహ్సి (Fuhsi), యావో (Yao) అనే ఇద్దరు పురాణ వ్యక్తులు మూలంగా చెప్పబడ్డారు. సాంప్రదాయికంగా చెప్పిన చైనా కుటుంబంలో ఐదు తరాల వ్యక్తులు , తాతలు, ముత్తాతలు, ప్రపితామహులు, కుమారులు, మనుమలు, మునిమనమలు వుండేవారు. ఈ కుటుంబ వ్యవస్థ పితృస్వామికమైనది. అంటే, తండ్రి ఇంటికి చట్టపరమైన, మతపరమైన అధికారిగా వ్యవహరిస్తాడు. ఈ రకమైన కుటుంబం అవిభక్త కుటుంబం . దీనిలో అనేకులు రక్తసంబంధంతో జీవించినట్లే, వర్గీయులు ఇరుగు, పొరుగు సంబంధాలతో జీవించేవారు.

ఈ కుటుంబ వ్యవస్థలో ప్రధానమైన కొన్ని ప్రత్యేకతలలో, బాల్య వివాహాలు, వితంతు పునర్వివాహాలు, గర్భస్రావ విధానాలు, శిశు హత్యా సంప్రదాయాలు వుండేవి. అదే విధంగా, ఇద్దరు కంటే ఎక్కువ మంది సంతానం గల కుటుంబాల మీద ప్రత్యేకమైన పన్నులు విధించడం, చట్టం దృష్ట్యా ఎక్కువని, అనవసరమని భావించబడిన పిల్లలను చంపడం, నీటిలో ముంచడం, మొదలైనవి కూడా వ్యాప్తిలో ఉండేవి.

## 16.2.5 ఆహార వ్యవస్థ

ఆ రకమైన సమాజంలో ఆహార వ్యవస్థ ప్రధానంగా వ్యావసాయిక ఉత్పత్తుల మీద ఆధారపడి వుండేది. చైనాలోని వ్యావసాయిక ఉత్పత్తులలో గోధుమలు, సోయా చిక్కుళ్ళు, జొన్నలు, బియ్యం, బార్లీ ముఖ్యమైనవి. గోధుమలు వేసవిలోనూ, శీతాకాలంలోను కూడా పండేవి. తొలి రోజులలో ఎక్కువ మంది గోధుమల మీదనే ఆధారపడి వుండేవారు.

## 16.2.6 సమాజ సమీక్ష

చైనాలో సనాతన సామాజిక వ్యవస్థలో వావివరుసల వంటి మానవ సంబంధాలు, వాని వాని సరిహద్దులతో పాటుగా, చారిత్రకపరమైన, సాంస్కృతికపరమైన, ఇదమిత్థతను పొందగలుతున్నాయి. దీనిలో రాజకీయ, సామాజిక వ్యవస్థల సాన్నిహిత్యాన్ని పరిరక్షించే కొన్ని సంబంధాలను, వున్నత వర్గాలకు చెందిన భూస్వాములు కాపాడేవారు. మొత్తం సామాజిక వ్యవస్థ కన్ఫ్యూషియస్ ప్రతిపాదించిన సిద్ధాంతాల మీద ఆధారపడి వుండేది. రాజ్య వ్యవస్థ, భూస్వాములు, ప్రాంతీయ సామాజిక వ్యవస్థలు, సామాజిక ఐక్యాన్ని , సాంస్కృతిక స్ఫూర్తిని పెంపొందించేవి.

ఈ సామాజిక వ్యవస్థలో 'చౌ' రాజవంశ పాలనలోని మధ్యకాలంలో, అనేక మంది యాంగ్‌ట్జె పరీవాహక ప్రదేశం లోని అనాది సంస్కృతులు గల ప్రాంతాలకు వలసపోయారు. ఈ కాలంలోనే ప్రాంతీయ మాండలిక

కేంద్రాలు రాజ్య వ్యవస్థలో స్వతంత్రంగా ఒక స్థితిని పొందగలిగాయి. ఈ స్థితిలో చైనా సమాజంలో, గ్రీస్‌లోని 'ఆటిక్' (Athic) సంస్కృతులతో పోల్చదగిన సాంస్కృతికాభివృద్ధి సంభవించింది. చైనా సమాజంలో హాన్ రాజవంశస్థుల పాలనలో, పాలక - పాలితులు, తండ్రి – కొడుకులు, అగ్రజులు - అనుజులు, భార్య - భర్త - మిత్రులు అనే సంబంధాలు నిర్దిష్టమైన, స్థిరమైన, విశ్వాసపూరితమైన సామాజికాంశాలుగా రూపొందాయి. ఈ కాలంలోనే చైనా సమాజంలో సాంస్కృతిక సమ్మేళనం (Cultural assimilation) కూడా సంభవించింది. ఎంత విస్తరించినప్పటికీ, చైనాలోని సిసలయిన సమాజం, పరిధి, వివాహం, రక్త సంబంధం, వావివరుసలను ప్రధాన సామాజిక సూత్రాలుగా పరిగణించిన పక్షంలో, హ్సీన్ జిల్లాను దాటిపోదు.

స్థానిక సామాజిక వ్యవస్థకు గ్రామం కేంద్రకంలా వ్యవహరించేది. శాంతియుతమైన రాజకీయ పరిస్థితులలో స్థానిక ప్రభువులు పన్నుల వసూళ్ళలోను, రక్షణను కలిగించడంలోను, గ్రామ ప్రాంతాలలో ప్రతినిధులుగా వ్యవహరించేవారు. రాజ్యవ్యవస్థ తాను స్వయంగా గ్రామ వ్యవస్థలో జోక్యం కలుగ చేసుకొన్న ఘట్టాలు కూడా లేకపోలేదు. గ్రామాలకు చెందిన షె (She), లిషియా (Lichia), పఓషియా (Paochia) వంటి వ్యవస్థలు, ఈ చర్యలకు ఉదాహరణలుగా నిలుస్తాయి. సిద్ధాంతపరంగా స్థానిక ప్రభువులు, రాజ్య వ్యవస్థను, గ్రామ వ్యవస్థను కలిపే మాధ్యమంగా ఉండేవారు. వారు విఫలమైన సందర్భాలలో, రాజ్యవ్యవస్థ ప్రత్యక్షంగా గ్రామ వ్యవస్థలో జోక్యం కలగజేసుకొనేది. చైనా సామాజిక వ్యవస్థ పరిణామ దశను దాటి, సుంగ్ రాజవంశకాలం నాటికి స్థిరత్వాన్ని పొందింది. ఈ వ్యవస్థ ఆధునిక యుగ ప్రారంభ దశ వరకు ఏ మాత్రం చెక్కు చెదరకుండా, ఏ రకమైన మౌళికమైన మార్పులను పొందకుండా నిలబడి వుంది. చైనా సామాజిక వ్యవస్థలోని పరిణామం క్రీ.శ. 18వ శతాబ్దారంభంలోనే గోచరించినా, 19వ శతాబ్దంలో జరిగిన నల్లమందు యుద్ధాలు, తైపింగ్ విప్లవం వల్ల, ఈ పరిణామం ఎంతో త్వరితగతిని చైనా సమాజాన్ని పారిశ్రామికీకరణ వైపు నడిపించింది. ఈ కాలంలో సనాతన భూస్వామ్య ధోరణులు క్రమంగా విచ్ఛిన్నమై, నవీన వలస విధాన దోరణులు క్రమేణా వ్యాప్తి పొంది, చైనా సమాజానికి కొత్తదనాన్ని కలిగించాయి. అయినా, కాలానుగుణంగా చైనా సామాజిక వ్యవస్థలో కొన్ని మార్పులు వచ్చినా , ప్రాథమికమైన అభిప్రాయాలు ఏమాత్రం చైనా సమాజం నుండి తొలగిపోలేదని, కొందరు చరిత్రకారుల అభిప్రాయం.

B R A O U

## 16.3 చైనా ఆర్థిక వ్యవస్థ

చైనా ఆర్థిక వ్యవస్థలో నగరీకరణ తొలి సాంప్రదాయం కాగా, రైతాంగం కూడా వ్యావసాయిక వ్యవస్థలో ఎంతో మార్పును తీసికొని వచ్చింది. తొలి రోజులలో చైనాలో వర్తకవాణిజ్యాలకు తగిన గుర్తింపు లేదు.

### 16.3.1 తొలి దశ

చైనా ఆర్థిక వ్యవస్థ పరిశీలనను ప్రధానంగా, గ్రామీణ స్థాయి ఆర్థిక వ్యవస్థ నుండి నగరీకరణ (దీనినే పట్టణాలు ఏర్పడే దశ అంటారు, నగరం – నగరీకరణ అనే పదాలు, వర్తక ప్రధానమైన పట్టణాలకు వాడే పదాలు. దీనినే ఇంగ్లీష్‌లో అర్బనైజేషన్ (Urbanisation) అంటారు.) సహితమైన ఆర్థిక వ్యవస్థకు, వ్యావసాయిక ఆర్థిక వ్యవస్థ నుండి పారిశ్రామికీకరణ సహితమైన ఆర్థిక వ్యవస్థకు, పరిణామంగా చెప్పుకోవచ్చు. చైనా ఆర్థిక వ్యవస్థను గురించి తెలుసుకోడానికి గల ఆధారాలను, సాహిత్యాధారాలని, పురావస్త్వాధారాలని రెండుగా వర్గీకరించవచ్చు. సాహిత్యాధారాలలో క్రీ.పూ. నాల్గవ శతాబ్దికి చెందిన 'కువాన్‌ట్సు'(Kuantsu) అనే పుస్తకం ఎంతో ప్రామాణికమైంది. కువాన్‌ట్సు (Kuantsu) ప్రకారం, అప్పటి రైతులు , రవాణాదారులు, స్త్రీలు, నిత్యం దైనందిన జీవనంలో ఎంతో

అవసరంగా భావించి, వాడిన నాగటి చాళ్ళు, కొడవళ్ళు, స్లెడ్జి బళ్ళు, రంపాలు, గొడ్డళ్ళు, సారె (Wheel naves) లు, రంధ్రాల మరలు (drills) , ఉలులు, చక్రాలు, కత్తులు, సూదులు మొదలైన పరికరాలను గురించి తెలుసుకోలుగుతున్నాం. ఆయా కాలాల్లో దొరుకుతున్న పురావస్తావాధారాలు కూడా ధ్రువపరుస్తున్నాయి. పురావస్త్వాధారాలలో ఆయా వస్తువులు, శాసనాలు, నాణేలు ప్రధానమయినవి . వీటి దృష్ట్యా, చైనా ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్ని ఈ క్రింది విధంగా గ్రహించొచ్చు.

## 16.3.2 వ్యావసాయిక వ్యవస్థ

ప్రాచీన చైనా ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం ఎంతో ప్రధానమైనది. బోడో విథోవ్ (Bodo Wiethoff) ప్రకారం, ప్రాచీన చైనాలో ఇంచుమించు 90 % రైతులే. వ్యావసాయిక సంప్రదాయం అన్ని ప్రాంతాలలో వలెనే, కొత్త రాతి యుగం నుండి చైనాలో కూడా ప్రారంభమైంది. కొత్త రాతి యుగంలో చైనాలో ప్రధానంగా ఆటవిక జంతువులను మచ్చిక చేసి, వ్యవసాయాన్ని ప్రారంభించేవారు. అట్లాగే, దానితో బాటుగా వచ్చిన పరిణామాలే, షాంగ్ రాజవంశ కాలానికి అక్కడక్కడ చెల్లాచెదురుగా ఉండే స్థావరాల్లానే వుండేవి. మార్పంతా కూడా ప్రత్యేకంగా తొలి చారిత్రక యుగంలోనే ప్రారంభమైంది.

రైతులకు సమాజంలో ప్రత్యేకమైన సౌకర్యాలేమీ కల్పించబడలేదు. వీళ్ళంతా జాగీర్దారుల్లాంటి భూస్వాముల వద్ద కౌలుకి పనిచేయవలసి వచ్చేది. చైనా సంప్రదాయంలో ఉండే ఉన్నత వర్గాల ప్రభావం, రైతులను ఒక ప్రత్యేకమైన అంశంగా తీర్చిదిద్దింది. వాళ్ళు తలకు మోయలేని పన్నుల నన్నింటినీ కట్టేవారు. అదే విధంగా, తగిన చోటులేని స్థితిలో ఒక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతానికి వలస పోయేవారు. అదీ సహించలేని స్థితిలో ఉంటే, తిరుగుబాట్లు చేశారు. ఏ రకమైన సామాజిక ప్రాముఖ్యం, ప్రాతినిధ్యం లేనటువంటి యీ రైతులు, ధనికులు, భూస్వాములు వంటి సామాజిక పరాన్నభుక్కులు (Social parasites) - అంటే, సమాజంలో వివిధ వర్గాలను పరోక్షంగా దోచుకొని బతికేవాళ్ళు – జీవించడానికి బానిసటగా ఉండి, ఏ మాత్రం ఆవాహన, విసర్జన లేకుండా ఉండేవాళ్ళు (ఆవాహన, విసర్జన అనేవి, దైవ పూజలో వాడే అంశాలు. ఆవాహనమంటే ముందు దేవుని పిలవడం, విసర్జన అంటే పూజ పిదప నిమజ్జనం చేయడం. ఈ రెండు పదాలు తెలుగులో ఏ మాత్రం గౌరవం లేనివారనే భావనను సూచించడానికి వాడే పదాలు)(Phrases).

ఆ రోజులలో వ్యవసాయాన్ని రైతుల కోసం కాకపోయినా, వివిధ ఉన్నత వర్గాల అభివృద్ధికోసం అనేక కృత్రిమమయిన నీటి పారుదల వసతులను కల్గించడం ద్వారా ప్రోత్సహించారు. కాలువల తవ్వకం, వంతెనలు, రిజర్వాయర్లు, ఆనకట్టలను నిర్మించడం జరిగింది. క్రీ.పూ. 220లో తొలికాలువ హన్స్ కౌ (Huns Kau) లో తవ్వడం జరిగింది. క్రీ.పూ. 600లో తొలి రిజర్వాయర్‌ను షాహ్సీన్ (Shah Hsien) లో నిర్మించారు. దాని ఆయకట్టులో 1,000 చదరపు మైళ్ళ భూమి నీటి పారుదల వసతిని పొందింది.

చైనాలో రైతుల స్థితి పూర్తిగా భూస్వాముల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి వుండేది. ఈ రకమైన భూస్వామ్య వ్యవస్థ (Feudalism) మార్క్సియన్ సంప్రదాయాన్ని ప్రోత్సహించే చరిత్రకారుల ప్రకారం, ' చౌ ' (Chau) రాజవంశంలో ప్రారంభమయి, ఇంచుమించు క్రీ.శ. 19వ శతాబ్దం దాకా, అంటే క్రీ.శ. 1800 వరకు కొనసాగింది. ఈ రకమైన భూస్వామ్య వ్యవస్థలో భూమి సొంతదారు, కౌలుదారుని కాని, రైతుని కాని, దోపిడీకి గురిచేసి ఉత్పత్తిచేస్తూ ఉండే ; భూమి సొంతదారు. భూమిలోని పనివాళ్ళ మధ్య గల సంబంధాలాధారంగా ఉండేవి. ఈ అభిప్రాయాన్ని మార్క్సిస్ట్ వర్గం కన్న వేరైన చరిత్రకారులు కూడా కొంత ఖండించారు. షాంగ్ చౌ రాజ వంశాల కాలంలో ఈ పద్ధతులు ప్రారంభమయ్యాయి. బానిసగా మారిన రైతుని, రైతాంగ వర్గం నుండి ఇంచుమించు వెలివేసేవాళ్ళు.

BRAOU

ఈ పరిస్థితులలోనే రైతులలో తిరుగుబాట్లు కూడా వుండేవి. రైతులు ఒక భూస్వామి వద్ద, లేదా భూమి సొంతదారు వద్ద, కౌలుకి కుదిరినప్పుడు భూమిలోని సాలుసరి ఉత్పత్తిలో సగ భాగం భూమి సొంతదారునికే చెందేది. అంతేకాకుండా, ఎప్పుడు పడితే అప్పుడు కౌలుదార్లు భూస్వాముల ఇంట్లోని అన్ని పనులు చేయడానికి సిద్ధంగా ఉండాలి. కాని, భూస్వాములు తమ మొత్తం ఆదాయంలో కేవలం ముప్పైవ వంతు మాత్రమే ప్రభుత్వానికి చెల్లించేవారు. ఈవిధంగా రైతుల ఆదాయం అంతా భూమి సొంతదారునికే చెందేది. రైతులు అందుకే తిరుగుబాటు చేసిన సంఘటనలు కూడా లేకపోలేదు. 1814-1864లో జరిగిన హంగ్ స్యు చ్వాన్ (Hung Hsiu Chuan) తిరుగుబాటు, ఒక తర్వాతి వృత్తాంతం మాత్రమే. తొలి రోజుల్లో విశ్వసనీయంగా నమోదయిన తిరుగుబాట్లు గుర్తించబడలేదు.

వ్యవసాయనికి రైతులు కొడవలి, నాగలి మొదలైన పరికరాలనే ఉపయోగించేవాళ్ళు. ఆ విషయం 'కువాన్ ట్సు' (Kuantsu) అనే పుస్తకం ద్వారా క్రీ.పూ. 4వ శతాబ్దానికే ఎంతో వ్యాప్తిలో ఉన్నట్లు తెలుస్తున్నది.

వ్యవసాయంలో పండే పంటలు వివిధ ప్రాంతాలలో వివిధ రకాలుగా వుండేవి.

మైదాన ప్రాంతాలయిన మధ్య మంచూరియా, ఉత్తర చైనా మైదానం, దిగువ యాంగ్‌ట్సె (Yangtse) మైదానం, మధ్య యాంగ్‌ట్సె మైదానం, పెర్ల్ (Pearl) నదీమైదానాలలో సాగుబడికాలం 150 నుండి 360 రోజుల దాకా ఉండేది. మధ్య మంచూరియాలో అది 150 - 180 రోజుల మధ్యకాగా, పెర్ల్ నదీ మైదానంలో 360 రోజులు సాగుకు అనుకూలంగా వుండేది. వాళ్ళు గోధుమలు, సోయా చిక్కుళ్ళు, జొన్నలు, సజ్జలు, బియ్యం, చలి కాలంలో పండించే గోధుమలు, మొదలైన పంటలను పండించేవారు.

నదీ పరీవాహక ప్రదేశాలయిన షెన్సి (Shensi), కాన్సు (Kansu), స్సెష్వాన్ (Ssechuan), డ్సుంగేరియా (Dsungaria), తరిం (Tarim) లలో సాగుబడి 115 - 200 రోజులలో వుండేది. డ్సుంగేరియా (Dsungaria) లో 115 - 140 మధ్య ఉండగా, షెన్సి (Shensi) లో 200 రోజులలో ఉండేది. వీరు సాగులో గోధుమలు (వేసవి, శీతా కాలాల్లో పండేవి) , చిరుధాన్యాలు, బియాన్ని, పండించేవారు.

పీఠభూమి ప్రాంతాలలో షాన్సి పీఠభూమి, నైరుతి పీఠ భూమి , మంగోలియా పీఠభూమి, టిబెట్ పీఠభూమి ప్రాంతాలలో వ్యవసాయం 200 నుండి 300 రోజుల దాకా చేసుకొనే సౌకర్యం ఉండేది. మంగోలియాలో 90 - 100 రోజులలో కాగా, నైరుతి పీఠభూమిలో 270 - 300 రోజులు వ్యవసాయం చేసుకొనే సౌకర్యం ఉండేది. ఈ ప్రాంతం యునాన్ (Yunnan), క్వుషౌ (Kuichow) రాష్ట్రాలకు చెందింది. ఈ ప్రాంతాలలో గోధుమ, బార్లీ, చిరుధాన్యాలు, బియ్యాన్ని పండించేవారు.

కొండ ప్రాంతాలలో కూడా వ్యవసాయానికి అనుగుణమైన పరిస్థితులు ఉండేవి. దక్షిణ మంచూరియా మెరక భూములు, షాంటుంగ్ (Shantung) మెరక భూములు, ఆగ్నేయ కోస్తా మెరక భూములు, దక్షిణ చైనా మెరక భూములు, వివిధ వ్యావసాయిక సౌకర్యాలను కలిగి వుండేవి. వ్యవసాయం 150 - 210 రోజుల మధ్య చేసేవారు. దక్షిణ మంచూరియాలో కేవలం 50 రోజుల సాగుబడికి అనువైనది. కాగా ఆగ్నేయ కోస్తా మెరక భూములలో ఇంచుమించు 300 - 360 రోజులు సాగుబడికి అనువైన కాలమే. ఈ ప్రాంతాలలో గోధుమలు, జొన్నలు, సజ్జలు, సోయాచిక్కుళ్లు, బియ్యం, టారో (taro) ను పండించేవాళ్ళు.

పంటలు పండించే ఈ విధానాన్ని చూచినట్లయితే, చైనాలో ఎక్కువ భాగం పంటలు ఆహారపరమైనవని గమనించొచ్చు.

BRAOU

## 16.3.3 వ్యావసాయేతర ఆర్థిక వ్యవస్థ

చైనాలో వ్యావసాయేతర ఆర్థిక వ్యవస్థను ప్రధానంగా వర్తక వాణిజ్యాలు, ఇతర ఉత్పత్తులు నిర్ణయించాయి.

క్రీ.పూ. 350కి ముందుగా చైనాలో రవాణా కోసం, పోతు ఒంటెలు, కంచర గాడిదలు, గాడిదలు, వినియోగంలో ఉండేవి. చైనా వాయవ్య రాష్ట్రాలలో నుండి అశ్వికులు, గుర్రపు బళ్ళ వంటివి పరిచయమవడం జరిగింది. దాని ఫలితంగా రవాణాలో వేగం పెరిగి, వర్తక వాణిజ్య వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. ఆంతరంగికమైన, విదేశీపరమైన వర్తకాలు రెండూ ఎంతో పరిగణనీయమయిన మార్పును పొందాయి. కాని, ఆ రకమైన మార్పు రావడానికి ఎంతో కాలం పట్టింది. దానికి ఎంతో ప్రేరణ, మార్పు రావలసి వచ్చింది.

చౌ రాజ వంశ పరిపాలనకు ముందు రోజుల్లో, వర్తకులకు గాని, వర్తకానికి గాని ఎంతో గుర్తింపు లేదు. వర్తకాన్ని కేవలం నీచమైన, మోసపూరితమైన వృత్తిగా పరిగణించడం జరిగింది. ధనికులెవ్వరూ ముందుగా వాణిజ్యాన్ని వర్తకాన్ని ఎన్నుకొనేవారే కాదు. వారిలో కొందరు కేవలం ప్రభువులకు 'సుంకరు' లుగా, అంటే పన్ను వసూలుదార్లుగా కూడా ఉండేవారు. దానివల్ల, హీన స్థితిలో వుండే వర్తకం, చౌ రాజవంశం చివరి నాటికి సంపన్నులకే ఒక సవాలయిన స్థితి ఏర్పడింది.

రాను రాను ధనికులైన వారు తాము వర్తకాన్ని చేపట్టి, పట్టు పరిశ్రమ వ్యాప్తికి, చేతి పనిముట్ల సంపూర్ణత్వానికి, చేపల, ఉప్పు పరిశ్రమల అభివృద్ధికి , ఆయా వస్తువుల వర్తకానికి ఎంతో దోహదం చేశారు. వర్తక వర్గాల వారు ఎంతో గౌరవాన్ని పొందారు. వారు ప్రయాణం చేసే వాహనాలను బంగారు రేకులతోను, జేడ్ (Jade) పూసలు, బళ్ళంతోను అలంకరించేవారు. వారి వస్త్రాలను పూవుల అలంకరణలతో కూడిన అల్లిక పనులతో సుందరంగా తీర్చిదిద్దేవారు. వారు ఇతర భూస్వాముల వంటి ప్రముఖులకు, ఇతర అధికారులకు, గుర్రాలను, భూమిని, బానిసలను, ఆయుధాలను, జేడ్ (Jade) వస్తువులను, రథాలను, పశుగణాన్ని, ఎర్రని పాదరక్షలను, పట్టు వస్త్రాలను, చిరు ధాన్యాలతో చేసిన మత్తు పానీయాలను, బహుమానాలుగా అందజేసేవారు. 'సుంగ్' రాజ వంశ కాలం నుండి వర్తక ప్రాధాన్యమయిన ఆర్థిక వ్యవస్థ సర్వాంగ సుందరంగా పరిణమించింది.

ఇంత వర్తక వ్యవస్థ, దానిలోని విదేశీ వాణిజ్యం అభివృద్ధి పొందడానికి కారణాలు లేకపోలేదు.

టాంగ్ (Tang) పరిపాలనా కాలం నాటికి వ్యాప్తి పొందిన బౌద్ధ మతం మాత్రమే కాక, ఇతర మతాలైన యూదులు, మహమ్మదీయులు మొదలైన వారి ప్రభావం, చైనా మీద ఎంతో వుంది. ఆ కాలం నాటికి, చైనాకు విదేశీయులతో ఉండే సంబంధాలు ఎంతో హెచ్చుగా వుండేవి. అవి ప్రధానంగా వర్తక సంబంధాలే. విదేశీయులు ఎక్కువ మంది భూమార్గం ద్వారాను, జలమార్గం ద్వారాను వర్తకం చేసేవారు. అప్పటి చైనా రాజధాని చాంగన్ (Chiang-an) మధ్య ఆసియాకు వర్తక మార్గంగా పేరొందిన పట్టు రహదారికి ఒక చివరన ఉండేది. అతి పెద్ద వర్తక కేంద్రం కూడా.

టాంగ్ (Tang) రాజవంశస్థుల కాలంలో ఎక్కువ మంది చైనీయులే సముద్ర వర్తకాన్ని పెంపొందించారు. ఇంచుమించు 12వ శతాబ్దం నాటికి ఆగ్నేయాసియా ద్వీపాలు, జపాన్, చైనా వర్తక సామ్రాజ్యంలో భాగాలుగానే వుండేవి. ఆ రోజులలో ప్రభుత్వం 'షిపోస్సు' (Shih possu) అనే నౌకా నియంత్రణ కేంద్రాన్ని ఏర్పర్చి, సముద్ర వాణిజ్యాన్ని నిర్వహించేది. పట్టువస్త్రాలు, పింగాణీ పాత్రలు, 'జేడ్' వస్తువులు, పూసల వంటివి, చైనా విదేశీ ఎగుమతులలో ఎంతో ప్రధానమైనవి.

ఈ రకమైన పరిశ్రమల పరిణామం కూడా విదేశ వాణిజ్యానికి తోడ్పడింది. చైనాలో ప్రాచీన

BRAOU

పారిశ్రామికీకరణ వివిధ దశలుగా పరిణమించింది. ' చౌ ' (Chou) రాజవంశస్థుల కాలంలో ఇనుము వినియోగం ఎంతో పెరిగింది. చవకగా లభించే, గట్టిదనం కలిగిన ఇనుము, ఎంతో ఖరీదైన, మెత్తదనాన్ని గల రాగి, ఇత్తడి, కంచు లోహాలను త్వరలో అధిగమించింది. అన్ని దేశాలలో వలెనే చైనాలో కూడా, ఇనుము వాడకం వర్తకంలోను, వ్యవసాయంలోను ఎన్నో మార్పులను తెచ్చింది. చైనాలో వ్యాప్తి పొందిన ' సిల్కు ' (పట్టు) పరిశ్రమ ఎంతో ప్రాచీనమయినది. చైనా లోని ఈ పట్టు వస్త్రాలు ' చీనాంబరాలని ' పేరు పొందాయి. మధ్య ఆసియాకు, చైనాకు గల వర్తక రహదారిని, పట్టు త్రోవ (Silk Road) అని పిలిచేవారు. దానితోబాటు, చైనాలో వ్యాప్తిపొందిన ' జేడ్ ' (Jade) వస్తువుల తయారీ, గాజు, మట్టి, పింగాణీ పరిశ్రమలు ఆర్థిక వ్యవస్థలో ఎంతో ప్రభావాన్ని చూపాయి. చైనాలో తయారైన బేరియం (Barium) తో గల గాజు వస్తువులు, ఆనాటి మధ్యధరా ప్రాంత అలంకరణ నమూనాలను పోలిన అనేక నమూనాలు ఉండేవి. ' జేడ్ ' పరిశ్రమలో రోటరీ చక్రం, తీగతో చేసిన రంపం, వజ్రాల రంధ్రపు మర ఎంతో ప్రధానమైన పనిముట్లుగా రూపుదిద్దుకొన్నాయి.

చైనాలో పై ఉత్పత్తులతో బాటుగా ఉప్పు ఉత్పత్తి , చేపల ఉత్పత్తి ఎంతో ప్రధానస్థానాన్ని పొందాయి. అవి రెండు రాష్ట్ర పరిధిలోనే ఉండేవి. ఈ రకమైన పారిశ్రామికీకరణలోని ధోరణి, పై రీతిలో వర్ణించినట్లు, వర్తక - వాణిజ్య వ్యవస్థకు ఎంతో తోడ్పాటును కలిగించింది.

ఇటువంటి పరిణామానికి రాష్ట్ర విధానం తోడ్పాటు కూడా గుర్తించదగిందే. క్రీ.పూ. 119 నాటికి హాన్‌వుటి (Hanwuti) ప్రారంభించిన రాష్ట్రీయ గుత్త దారీ విధానం (State monopoly policy)ఎంతో పరిణామాన్ని పొందింది. ఉప్పు, ఇనుము తయారీ, మద్యముల తయారీ, అమ్మకం, రాష్ట్ర పరిధిలోకి వచ్చాయి. క్రీ.పూ . 112 నాటికి నాణేలు రాష్ట్రంచే చేయబడ్డాయి. వ్యాపారాన్ని నియంత్రించడానికి రకరకాల నాణేలను విడుదల చేశారు. వాటి విలువలు కాలానుగుణంగా మారడం కూడా గమనించవలసిందే. ముందు నుండి వున్న నాణేల స్థానంలో, మంగోల్‌ల కాలం నుండి కాగితపు నోట్ల (Currency) వినియోగం వాడుకలోకి వచ్చింది. ఈ రకమైన ద్రవ్యమారక వ్యవస్థ కూడా, వర్తకులతో కూడిన వ్యావసాయకేతర ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి తోడ్పడింది.

## 16.4 చైనా రాజ్య వ్యవస్థ

చైనాలోని రాజకీయ వ్యవస్థ కొన్ని సిద్ధాంతాల ఆధారంగా పరిణమించింది. ఈ ఆధారాలను కన్ఫ్యూషియస్ కాలంలోను, అతనికి ముందు కాలంలోను కూడా, సిద్ధాంతాల రూపంగా చూడగలం. కన్ఫ్యూషియస్ సాంప్రదాయాలను 'జు' అని కూడా అంటారు. రాచరికం కేంద్రంగా రాష్ట్ర పరిపాలన, మాండలిక పాలన పెంపొందింది.

### 16.4.1 రాజ్య వ్యవస్థ నేపథ్యం

చైనా రాజ్య వ్యవస్థ కాలానుగుణమైన కొన్ని పరిణామాలను, ప్రమాణాలను పొందింది. చైనీయులు ప్రభుత్వ వ్యవస్థను గురించి, దాని నిర్వహణ స్వరూపాన్ని గురించి, ఆయా వ్యవస్థల తత్త్వాన్ని గురించి, ఎంతో జాగ్రత్తగా పరిశీలించారు. వీనిలో ఏకాభిప్రాయం లేకపోయినా, ప్రాచీన, మధ్య యుగాల్లో వివిధ దశలలో కొన్ని ప్రత్యేకమైన రాజ్య పరిపాలనాపరమైన , రాజ్యతత్త్వ పరమైన సూత్రాలను పెంపొందించుకొన్నారు.

ఈ తత్త్వాన్ని, సిద్ధాంతాలను ప్రధానంగా కన్ఫ్యూషియస్ వాదం ఎంతో ప్రభావితం చేసింది. ప్రాచీన కాలంలో రాజ్య వ్యవస్థలో వృత్తిని స్వీకరించడం ఎంతో గౌరవప్రదమయిన అంశంగా భావించేవారు. రాజకీయ

B R A O U

సమస్యలను చర్చించడం , విశ్లేషించడం, పరిష్కరించడం అనేవి వివిధ గ్రంథాలలోను, భాష్యాల లోను జరిగింది. రాజ్యపరమయిన తర్కాన్ని ప్రతిపాదించే అంశాలను గురించి పలకడం, ఎంతో సముచితమయినదిగా భావించే వారు. చియన్ ట్వాన్ షెంగ్ (Chien Twan Sheng) వ్రాసిన 'The Govt and Politics of China' అనే గ్రంథాన్ని బట్టి, ప్రాచీన కాలంలో వైవిధ్యంకల రాజకీయ వాదాలు కన్ఫ్యూషియస్ కి సమకాలీనంగాను, ముందుగాను కూడా ఉండేవని తెలుస్తున్నది. అటువంటి వానిలో యిన్ - యాంగ్ (yin - yang) వాదులు (వీరిని మాధ్యమిక వాదులంటారు). నామవాదులు (వీరిని తార్కికులు అని అంటారు) గురించి ఎక్కువగా తెలియడం లేదు. కాని, లావోట్జు (Lao Tzu) అనుయాయులయిన టావోవాదులు, అనంతర సిద్ధాంతవేత్తలలో ప్రధానులు. ఇతడు న్యాయవ్యవస్థతోను, సంస్థలతోను సమాజాన్ని రూపొందించవలసిన అవసరాన్ని తిరస్కరించాడు. అతడు అప్రయత్నంగా మానవునికి ప్రకృతితో ఏర్పడే సాన్నిహిత్యం వల్లనే మేలు, ఆసాన్నిహిత్యం నుండి దూరం కావడం వలన ఇబ్బందులు సంభవిస్తాయని పేర్కొన్నాడు. అతి తక్కువ ప్రభావాన్ని సమాజంపై చూపే ప్రభుత్వమే ఉత్తమ ప్రభుత్వమని, లావోట్జు (Lao Tzu) అనుయాయి అయిన చ్వాంగ్‌ట్జు (Chauang Tzu) పేర్కొన్నాడు. మానవులు మంచి చెడులకు, ఉన్నత అధమాలకు, సుందర వికారాలకు విచక్షణ చూపరాదని, ఆ విధంగా చూపితే నైతిక విధానాలు తలెత్తి, జీవితంలోని సరళత ఉపసంహరింపబడుతుందని వీరి భావన.

కాని, దీనికి వ్యతిరేకంగా నైయాయికులు (న్యాయ సిద్ధాంతాలను నమ్మి ప్రవచించేవారు) అయిన క్రీ.పూ. 5వ శతాబ్దానికి చెందిన లిలి (Li Li); క్రీ.పూ 4వ శతాబ్దికి చెందిన షంగ్‌యాంగ్ (Shang Yang); క్రీ.పూ. 3వ శతాబ్దానికి చెందిన హాన్‌ఫే (Han Fei) ప్రవచించారు. వీరు ప్రధానంగా స్మృతి కర్తలు. మానవ చర్యలను ఆదరణ, శిక్ష అనే సిద్ధాంతాలతో కూడిన క్రమబద్ధమయిన చట్టాలు నియంత్రిస్తాయని వీరు చెప్పారు.

వేరు సిద్ధాంతాలను క్రీ.పూ. 5వ శతాబ్దానికి చెందిన మోట్జు (Motzu) అనుయాయులయిన మోవాదులు సూచించారు. వీరు సంక్షేమ వాదులు; యుద్ధ వ్యతిరేకులు. ప్రభువులు సమర్థులయిన అనుయాయులతో రాజ్యాలనేలాలని వీరు నమ్మేవారు. పరస్పర ఆదరణాభిమానాలు, పరస్పర ప్రయోజనాలు కేంద్రమని మోట్జు (Mo tzu) సిద్ధాంతీకరించాడు.

కన్ఫ్యూషియన్ లను ' జు ' (Ju) సాంప్రదాయకులు అని కూడా అంటారు. కన్ఫ్యూషియన్ సిద్ధాంతాలలో, మానవుడు ఇతర మానవుల కోసం, ఇతర మానవులతో జీవిస్తాడనేది ప్రధాన కేంద్రం. ఇతడు ప్రమాణాలను, సుగుణాలను, నామకరణాన్ని, ఇతర ఐదు సంబంధాలను సూచించాడు. ప్రమాణాలు ఆరోగ్యవంతమైన సామాజిక జీవనాన్ని ఉద్బోధిస్తాయి. ఆ జీవనం కొనసాగించే విధానాన్ని 'జెన్' (Jan) అంటారు. కొద్ది సుగుణాల ద్వారా వ్యక్తమవుతుంది. నామకరణం సమాజంలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక , బౌద్ధిక వర్గాలలోని వివిధ స్థాయిలను సూచిస్తుంది. కారణం, సమాజమనేది స్థాయికి సంబంధించినది మాత్రమే. ఇతడు పాలక పాలితుల మధ్య విధులు, సంబంధాలను సూచించాడు. ఈ రకంగా అభివృద్ధి పొందే వ్యవస్థలో, రాచరిక వ్యవస్థ ప్రధాన రాజ్య స్వరూపంగా వివిధ అనుబంధాంశాలలో రూపొందింది.

## 16.4.2 రాచరికం

రాజు ప్రధాన అధికారి. ఇతడు అనంతమైన అధికారాన్ని కలిగి వుండేవాడు. కాని, అనుసరణలో దీనిలో కొంత నియంత్రణ జరిగేది. దైనందిన జీవితంలో అధికారాన్ని రాజు మాత్రమే పూర్తిగా నిర్వహించే వాడు కాదు. రాజు బంధువులు, కొజ్జాలు, సేనానులు, ధనిక కుటుంబాలు మొదలయిన వారు కూడా రాజు తరపున అధికారాన్ని

నిర్వహించేవారు. రాను రాను సత్రుభుత్వం, వ్యక్తుల ప్రభుత్వం అనే భావన ఏర్పడింది. మానవతా వాదాన్ని జోడించి, నిరంకుశ రాచరిక వ్యవస్థను అవసరమైనదిగా తీర్చారు. కరవు కాటకాలకు, వరదలకు, తెగుళ్ళకు, ఇతర వ్యాధులకు ప్రభువు దుష్పరిపాలనే కారణమని, మంచూరియా రాజవంశ కాలంలో కూడా భావించారు. సిద్ధాంత పరంగా రాజు నిర్వహణాధికారాన్ని కలిగి వున్నా, నిర్వహణలో అతడు వేర్వేరు ఆచార, సంప్రదాయాలకు తలొగ్గి వుండవలసి వస్తుంది. కుమారునికి వారసత్వంగా రాజ్యం సంక్రమించేది. ఉంపుడుగత్తెల కుమారులు కూడా రాజ్యార్హులే. కుమారులు లేనట్లయితే, దగ్గర వరసయిన బంధువులకు చెందిన పిల్లలకు రాజ్యం సంక్రమించేది. రాజు తన అధికారంలో ఎంత నిరంకుశుడైనా, సాంప్రదాయానికి, ఆచారానికి, గతంలో జరిగిన వివిధ సమస్యల పరిష్కారాలకు కట్టుబడివుండేవాడు. రాజులు తమ మంత్రులు, అంతఃపురంలోని సేవకుల అభిప్రాయాలకు కూడా చెవి ఒగ్గేవారు. వారు సేవకుల సలహాలను బట్టి, ఇతర ధనిక కుటుంబాలలోని స్త్రీలలో పట్టపురాణి (చక్రవర్తిని) ఎన్నుకొనేవారు. బహు భార్యాత్వం కూడా ఉండేది. ఉంపుడుగత్తెలు కూడా ఉండేవారు. వీరిలో ధనికులు, సామాన్యులు కూడా వుండేవారు.

### 16.4.3 మంత్రులు - వారి శాఖలు

వీనిలో ఆరు ప్రధానమైన శాఖలు ఉండేవి. అవి ఉద్యోగ నియామకాలు, భూమిశిస్తు, పండుగలు, యుద్ధం, శిక్షలు, ప్రజా సౌకర్యాలకు చెందినవి. కాలువలు తవ్వడం, కరవు నివారణ, వరదల నివారణ వంటివి, ప్రజా సౌకర్యాలుగా భావించబడ్డాయి. ఇవి ఆరే కాక, సర్వస్వతంత్రంగా సైనిక వ్యవహారాల శాఖ, నిషేధాజ్ఞల శాఖలు ఉండేవి. చిన్న చిన్న ఉద్యోగాలయిన సాహిత్య అకాడమి, నేరస్థుల సమీక్ష శాఖ, చరిత్ర రచనాశాఖ వంటివి వుండేవి. మంత్రులకు, రాజ సేవకులకు పదవులలోను, సంఖ్యలోను, అధికారంలోను ఎన్నో భేదాలుండేవి. మంత్రులు తాము చేయగలిగిన సమర్థవంతమైన పనులను నిర్వహించేవారు.

నిషేధాజ్ఞల శాఖ ఎంతో ఆసక్తికరమైంది. దానిలో రెండు ప్రధానాంశాలుండేవి. ఒక అంశం, దోషులయిన ఉద్యోగులను పదవుల నుండి తొలగించడం. రెండవ అంశం, న్యాయవిధులను, తీర్పులను విమర్శించి, తగిన పరిష్కారాలను సూచించడం. మింగ్ (Ming) వంశ కాలం నాటికి, న్యాయశాఖపై వీటి ప్రభావం బాగా క్షీణించింది.

### 16.4.4 న్యాయ వ్యవస్థ

చక్రవర్తి తన ప్రవర్తన ద్వారా నీతికి ఆదర్శంగా ఉండే వాడు. దానివల్ల, ప్రాచీన చైనాలో నాగరికులలో చట్టాలు అంత అవసరంకాదనుకొనేవారు. కాని, క్రీ.పూ. 3వ శతాబ్ది నుండి నైయాయకులు చట్టాన్ని నిరంకుశ రాచరికానికి పట్టుగొమ్మగా చెప్పారు. దానివల్ల, టాంగ్ (Tang), సుంగ్ (Sung), యువాన్ (Yuan), మింగ్ (Ming), చింగ్ (Ching) కాలాల్లో వివిధ స్మృతులు ఏర్పడ్డాయి. చట్టాలు అనధిగమ్యాలనికాక, అవి ఉదాహరణ పూర్వకంగా జీవనాన్ని శాసించే అంశాలని కన్ఫ్యూషియస్ అభిమతం. నైతికత (Morality) చట్టం కన్నా ఉన్నతమైనదిగా భావించడం జరిగింది. చైనాలో చట్టం రాజు చేసేవాడు. చట్టం అంతా, పరిపాలనాపరమయినది, శిక్షాపరమయినది అని రెండు రకాలుగా ఉండేది. వాణిజ్య సంస్థల గురించి ప్రత్యేకమైన చట్టాలుండేవి కాదు. కారణం, వారు వాణిజ్యాన్ని కేవలం కుటుంబ, లేదా వ్యక్తిగత అంశంగా భావించడమే. న్యాయం లక్ష్యం ప్రాచీన చైనాలో రాజకీయ స్వాతంత్ర్యాన్ని గాని, వ్యక్తిగతమైన ఆస్తిని గాని కాపాడటం కాదు. చట్టాన్ని నిర్వహించడం పరిపాలనాపరమైన అంశంగానే ఉండేది.

BRAOU

## 16.4.5 రాష్ట్రపాలన

పెకింగ్ రాజధానిగా ఉండేది. ఇతర రాష్ట్రాలు ఇంచుమించు స్వయంనిర్ణయాధికారాన్ని (autonony) కలిగి వుండేవి. ప్రతి రాష్ట్రం కొన్ని టావో (Tao) లుగా విభాగింపబడేది. టారో అంటే 'సర్కిల్' వంటిది. అలాగే హ్సీన్ (Hsien) అని కూడా విభాగించేవారు. హ్సీన్ (Hsien) లు జిల్లా, తాలుకాల వంటి వాటికి సరైనవి. ఈ ప్రాంతాలను నియమిత హోదా గల ఉద్యోగులు నిర్వహించేవారు. ప్రతి హోదాలోను, పెద్ద, చిన్న అంతరాలుండేవి. ఈ ప్రాంతాలు ప్రభువు అధికారాలను అనుసరిస్తూ, కాలానుగుణంగా ఆదాయాన్ని అందజేస్తున్నంత కాలం, ఇంచుమించు స్వేచ్ఛగా ఉండేవి. కేంద్ర ప్రభుత్వమే వీరి నియామకాలను, బదిలీలను, తొలగింపులను నిర్వహించేది. ప్రతి ఉద్యోగం మూడేళ్ళకి పరిమితం అయ్యేది. పెద్ద ఉద్యోగులు వారి సొంత రాష్ట్రాలలో నియమితులయ్యేవారు కాదు. రాష్ట్రానికి గవర్నర్ అధికారిగా ఉండేవాడు. ఇతడి కింద ఒక సైనికాధికారి కూడా వ్యవహరించే వాడు. కోశాధికారి, న్యాయవేత్త, లవణాధికారి, ధాన్యాధికారి, విద్యాధికారి, ఇతర ఉద్యోగులు. కోశాధికారి ఆదాయాలను రాజధానికి పంపేవాడు. న్యాయవేత్త ప్రాంతీయ న్యాయస్థానాలలోని తీర్పులను సవరించేవాడు. లవణాధికారి ఉప్పు తయారీని పర్యవేక్షించేవాడు. విద్యాధికారి ప్రభుత్వ పరీక్షలను పర్యవేక్షించేవాడు.

## 16.4.6 ప్రాంతీయ పాలన

టావో (Tao) లు, హ్సీన్ (Hsien) లు ప్రధానమయిన ప్రాంతీయ విభాగాలు. ప్రతి హ్సీన్ (Hsien) ఒక ప్రాకారంతో కూడిన పురాన్ని, ఇతర గ్రామాలు, పట్టణాలను కలిగి వుండేది. న్యాయాధికారి ప్రధాన ఉద్యోగిగా వుండేవాడు. అతడు పన్నుల వసూలు, న్యాయ వ్యవహారాలు, భూమి వ్యవహారాలు, కరువులు, జబ్బులు, తెగుళ్ళు, ప్రభుత్వ భవనాలు, ఇతర నిర్మాణాలను పర్యవేక్షించేవాడు. శాంతి భద్రతలను రక్షించడం, శారీరక, మానసిక సంక్షేమాన్ని ప్రజలు పొందేలా చూడటం, ఇతని ప్రధాన విధి.

'జెంట్రీ' (Gentry) అనే ఉద్యోగులు కూడా, చైనా స్థానిక ప్రాంతీయ పాలనా వ్యవస్థలో ఎంతో ముఖ్య పాత్ర వహించేవారు. వీరు స్వచ్ఛందంగా ప్రభుత్వంతో సమీకరిస్తూ, ప్రభుత్వాంశాలను పర్యవేక్షించేవారు, నిర్వహించేవారు. వీళ్ళు ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తూ, సమస్యల మీద ఉన్నతాధికారులతో చర్చించేవారు కూడా. కాని, వీరు ధనిక ప్రముఖులు కారు. దీనిలో సభ్యులు విద్య ద్వారా కాని, నియామకం ద్వారా కాని, అధికారాన్ని పొందేవారు. ఎక్కువ మంది భూస్వాములు కాదు కూడా. వీరు స్థానికులకు అన్యాయం కలగ కుండా, అవసరాల్లో సంక్షేమం కొరత కాకుండా చూసేవాళ్ళు. వీరు ప్రాంతీయ పాలనలో కళ్ళు, చెవులు వంటివారు. గ్రామాల్లోను, పట్టణాలు, ఉద్యోగులు, స్థానికులయిన పెద్దలచే ఎన్నుకోబడేవారు. అటువంటివారి నియామకాన్ని హ్సీన్ (Hsien) పాలకుడు అంగీకరించేవాడు కూడా. ప్రభుత్వంలో ఆచార వ్యవహారాలు, సంప్రదాయం ప్రధాన పీఠాలుగా, గ్రామ పాలన అభివృద్ధి పొందింది. అది పూర్తిగా నైతిక ప్రభుత్వమే.

చైనా రాజ్య వ్యవస్థలో రక్షణకు ఎంతో సముచితమైన పాత్ర వుండేది. వంపు విల్లు (Crossed bow)ను కనిపెట్టడం, చైనాలోని ఆయుధాలలో విశిష్టమైన అంశానికి తావు దీసింది. ఈ చైనా వ్యవస్థలో అశ్విక దళాలు ఎంతో ప్రముఖ పాత్ర వహించాయి. ఇవి క్రీ.పూ. 350 ప్రాంతం నుండి చైనా దేశంలో ప్రవేశ పెట్టబడి, అగ్రగామిగా రూపొందాయి.

ప్రభుత్వం విద్యను నిర్వహించేది కాదు. కేవలం ప్రోత్సహించేది. కేవలం గురుకుల రీతిలో విద్య పారంపర్యంగా వచ్చేది. ధనికులే ఎక్కువగా విద్యను నేర్చుకొనేవారు. ఉద్యోగులను పరీక్షలు నిర్వహించి,

BRAOU

ఎన్నుకొనేవారు. హ్సెన్‌లో 2 శాతం ఉత్తీర్ణులయ్యేవారు. వీరు రెండు పరీక్షలు పాసయితే, చిన్న ఉద్యోగాలను పొందేవారు. విద్యా విధానం పరీక్షల పరంగా, కేవలం కన్ఫ్యూషియన్ సంప్రదాయానికే ప్రాముఖ్యాన్ని సూచించేది. నీతి, మానవతావాదం, న్యాయ సమగ్రత, చైనా రాజ్య వ్యవస్థలోని మూడు ప్రధాన లక్షణాలు.

## 16.5 సంగ్రహంగా

1. సామాజిక వ్యవస్థ, చైనాలో రాజ్యవ్యవస్థకు, ప్రాంతీయ సామాజిక వ్యవస్థలకు జరిగిన భావ వినిమయం ప్రకారం పరిణమించింది.

2. చైనాలో ఆర్థిక వ్యవస్థ, వ్యావసాయిక ప్రధానమైన నాణేలతో కూడిన ఆర్థిక వ్యవస్థగా రూపొందింది.

3. చైనాలో రాజకీయ వ్యవస్థ వికేంద్రీకృత పాలన, స్థానిక ప్రభువులు, ఉద్యోగి బృంద వ్యవస్థ, జెంట్రీలు ప్రధాన కారకాలుగా, నైతిక నేపథ్యంతో గల రక్షణ రాజ్యవ్యవస్థగా రూపొందింది.

## 16.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. **క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.**

1. చైనాలో సామాజిక వ్యవస్థ స్వభావాన్ని తెలియజేయండి.
2. చైనాలో ఆర్థిక వ్యవస్థ లక్షణాలను పరిశీలిచండి.
3. చైనా రాజకీయ వ్యవస్థ పరిణామాన్ని వివరించండి.

II. **క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. చైనా సామాజిక తత్వం
2. చైనా సమాజంలోని అంతరాలు
3. చైనాలో రైతుల పరిస్థితి
4. చైనా విదేశీ వాణిజ్యం
5. చైనాలో ప్రాంతీయ పాలన

## 16.7 ఉపయుక్త గ్రంథాలు


**Encyclopaedia of Social Sciences, Vol - I**

**Encyclopaedia of Britannica, Vol. V.**

P.H. Clyde & Burton F. Beers : **Far East**

Bodovith off : **Introduction to Chinese History from Ancient Times to 1912**


BRAOU

## 16.8 పదకోశం

టయెన్ : విశ్వజనీన సమాన సమైక్యత

కుజోబియా : జాతీయ కుటుంబం

చుంగ్‌కు ఓ : దేశానికి గుర్తు

చుంగ్ హువా : సంస్కృతికి గుర్తు

నంగ్ : వ్యవసాయం మీద ఆధారపడినవారు.

కుంగ్ : చేతిపనులవారు

షాంగ్ : వ్యాపారస్తులు

షి : సైనిక వ్యవస్థకు చెందేవారు

స్సుమిన్ : నాలుగు వర్గాల వారు

లియాంగ్‌చియూ : గౌరవమైన కుటుంబం

షపోస్సు : నౌకా నియంత్రణ విభాగం

జెన్ : ప్రమాణాలతో కూడిన, ఆరోగ్యవంతమైన, సామాజిక జీవన విధానాన్ని కొనసాగించే పద్ధతి

జెంట్రీ : ప్రాంతీయ అధికారులు

టావో : ప్రాంతీయ పాలనా విభాగం

హ్సీన్ : ప్రాంతీయ పాలనా విభాగం.

BRAOU

# భాగం - 17 : తత్త్వ వివేచన - మత వ్యవస్థ

విషయక్రమం


17.0 లక్ష్యాలు

17.1 పరిచయం

17.2 తత్త్వ వివేచనా సంప్రదాయాలు

17.2.1 కన్ఫ్యూషియస్ వాదం

17.2.1.1 కన్ఫ్యూషియస్ జీవితం

17.2.1.2 కన్ఫ్యూషియస్ సిద్ధాంతాలు

17.2.1.3 వ్యక్తి స్వభావం

17.2.1.4 సమాజానికి వ్యక్తికి గల సంబంధం

17.2.2 టావో వాదం

17.2.3 లావోట్జు సిద్ధాంతాలు

17.2.4 ఛువాంగ్‌ట్జు

17.2.5 మోవాదం

17.2.6 తార్కిక వాదం

17.2.7 యిన్ - యాంగ్ వాదం

17.2.8 నైయాయిక వాదం

17.2.9 ప్రేతాత్మారాధన

17.2.10 షాన్ రాజవంశ కాలంలో వింతాచారాలు

17.2.11 చౌ రాజవంశ కాలంలో మతాచారాలు

17.2.12 చైనాకు, భారతదేశానికి తత్త్వపరమైన పోలికలు - భేదాలు

17.2.13 చైనాలో బౌద్ధమత పరిణామం - వ్యాప్తి

17.2.14 సమాజంపై మత వ్యవస్థ ప్రభావం

17.3. సంగ్రహంగా

17.4 పరీక్ష నమూనా ప్రశ్నలు


BRAOU

17.5 ఉపయుక్త గ్రంథాలు

17.6 పదకోశం

## 17.0 లక్ష్యాలు

ఈ భాగంలో ప్రధానమైన లక్ష్యాలుగా ఈ క్రింది వాటిని గమనించొచ్చు.

1. క్రీ.పూ. 221 వరకు పరిణమించిన తత్త్వవివేచనా ధోరణులను పరిశీలించడం.
2. మొదటిదిగా గుర్తింపబడిన ప్రేతారాధనా వ్యవస్థను గురించి తెలుసుకోడం.
3. షాన్ రాజవంశ కాలంలో మతవ్యవస్థను గురించి వివరించడం.
4. చౌ రాజవంశ కాలంలో మతవ్యవస్థను గురించి తెలుసుకోవడం.
5. చైనాలోని తాత్త్విక ధోరణులకు - భారతీయ తాత్త్విక ధోరణులకు గల భేదాన్ని తెలుసుకోవడం.
6. చైనాలో బౌద్ధమత ప్రగతిని వివరించడం.
7. చైనాలోని సమాజం మీద మత వ్యవస్థ ప్రభావాన్ని వివరించడం.

## 17.1 పరిచయం

చైనా వైశాల్యం లోను, చారిత్రక పరిమాణం లోను, వ్యవస్థా పరిణామం లోను ఇంచుమించు భారతదేశాన్ని పోలి వుంటుంది. ప్రకృతిని అవగాహన చేసుకొనడంలో కార్యకారణ ధోరణులను (కార్యకారణ ధోరణి అంటే, తత్త్వ సంప్రదాయం ప్రకారం ఒక పనికి, లేదా కొన్ని పనులకు, దానికి గల కారణానికి, లేధా కారణాలకు గల సంబంధాలను సూచించే వ్యవస్థలు), సిద్ధాంతాలను ఏర్పరచుకోడంలోను, కట్టుబాట్లను, ఆచారాలను తీర్చిదిద్దుకోడంలోను, మానవ సమాజ సంస్కారాన్ని, సభ్యతను పెంపొందించుకోడంలోను, ఆలోచనా వైవిధ్యం, ప్రాంతీయ ధోరణులు అసంఖ్యాకంగా వుంటాయి. ఈ పరిశీలన చైనా దేశానికి కూడా వర్తిస్తుంది. కాగా, చైనా మత పరమైన, తత్త్వపరమైన అభిప్రాయాలలో రహస్యం గురించి నేర్చుకోటం, సత్యాన్ని తెలుసుకోడం అనేవి ప్రధానమయినవి. అయినప్పటికీ, వారు మానవుని నడవడికను గురించి, ఉత్తమ మానవుని స్థితిని గురించి, సంఘ వ్యవస్థ గురించి కూడా విస్తృతంగా పరిశీలించి, సమస్యలను ప్రశ్నించి, పరిష్కారాలను పొందడానికి ఎంతో శ్రమించారు. ప్రజలలోని వేర్వేరు వర్గాలు, తమ తమ ఆచారాలను ఏర్పరచుకోడం, తమకు నచ్చిన సంప్రదాయాల ఆధారంగా, చైనాలోని ఏకీకరింపబడిన వ్యవస్థలను పెంపొందించుకోవడం జరిగింది. ఇది చైనాలోని 'బాహుళ్యం నుండి ఏకత్వం'( Unity in diversity)వైపు అనే భావాన్ని వ్యక్తం చేస్తున్నది. సమాజం అంతా వేర్వేరు నదీలోయలలో వివిధ వర్గాలుగాను, కుటుంబాలుగాను జీవించినా, ఒకేసారి సాంస్కృతిక భావం లక్ష్యంగా రూపొందింది. చెల్లాచెదరుగానున్న చైనీయుల భాషను, భావాలను, ఆచారాలను, వ్యవహారాలను ఒకే రకంగా చేసి, చైనాను 'బాహుళ్యం నుండి ఏకత్వం వైపు' మళ్ళించారు. ఆవిధమైన ప్రక్రియలో చైనా సమాజానికి, తాత్త్వికతకు, మతానికి దిగంతమయిన కీర్తిని, గుర్తింపును అనేక మంది కలిగించారు. వారంతా తత్త్వవేత్తలు, పాలకులు, అర్చకులు. వారి కృషి పరిణామంగా వివిధ తాత్త్విక సంప్రదాయాలు, మత విధానాలు చైనాలో వ్యాపించాయి. వాటి పరిశీలన ఈ భాగంలో ప్రధానమైన అంశం.

BRAOU

## 17.2 తత్త్వవివేచన సంప్రదాయాలు

ప్రాచీన యుగంలో చైనాలో ఇంచుమించు నూరు రకాల ఆలోచనాధోరణులు, తాత్త్విక సంప్రదాయాలు ఉన్నట్లుగా, వింగ్‌ట్సిట్ చాన్ (Wing T'sit chan) అనే పండితుడు తెలిపాడు. ఈ వివిధ సంప్రదాయాల ప్రవక్తలు ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని పొందినవారు మాత్రమే కాదు. వారంతా వ్యవసాయదారులు, రాజనీతి కోవిదులు, సైనిక వ్యూహజ్ఞులు, రాజ్య తంత్రజ్ఞుల వంటి వారు. వీరంతా, సమాజం మానవుని అధిగమించలేదని, మానవుడు సమాజ పరిధిని దాటి ఎదగలేడని, విశ్వసించారు. అంటే, సమాజం చేత నిర్దిష్టమైన పరిధిలో ఒక వ్యక్తి వ్యక్తిగా జీవిస్తూ, ఇతరులకు, తనకు, సహకారిగా వ్యవహరించేవాడు. ఇది క్రమ పరిణామమే.

షాన్ రాజవంశస్థుల కాలంలో, అంటే, క్రీ.పూ. 1100 వరకు, చైనీయులు దివ్యత్వానికి ప్రాధాన్యమిచ్చేవారు. ఆ పిదప ' చౌ ' రాజవంశీకుల కాలంలో, దివ్యత్వానికి సమాధికట్టి, మానవత్వాన్ని మోపుచేసి, భావాలను, తాత్త్విక చింతనను మళ్ళించడం ప్రారంభమైంది. ఈ మళ్ళింపు స్వర్గం వైపు జరిగింది. దానినే 'టైన్ '(Tien) అనేవారు. దీనిలో ప్రధాన దృక్పథం వ్యక్తిలోని సుగుణాలను , సామర్థ్యాన్ని మానవావసరాలవైపు మళ్ళించడం. మానవ జీవితం మానవుడు తీర్చిదిద్దుకొన్నదే కాని, ' టి ' (Ti) వంటి దేవుళ్ళు తీర్చిదిద్దినది కాదనే నమ్మకం, ఈ పై దృక్పథం వల్ల పెరిగింది. ఆ నమ్మకాలలోని వివిధ సూత్రాలనే ఆచరణయోగ్యమైన రీతిలో, సమీకృత సిద్ధాంతాలుగా ఏర్పరచడం జరిగింది. ఆ సిద్ధాంతాలను వాటి కర్తలను బట్టి , సిద్ధాంతాలలోని భావాలను బట్టి, కన్ఫ్యూషియన్ వాదం ; టావో వాదం ; మోవాదం ; తార్కికవాదం ; 'యిన్‌యాంగ్ ' (Yin yang) వాదం ; నైయాయిక వాదం (Legalists) అని వ్యవహరించడం జరిగింది. ఈ భావాలే కాకుండా, బౌద్ధమతం భారతదేశం నుండి చైనా వరకు వ్యాపించి, చైనాలోని ఆలోచనా ధోరణులలోను, మత వ్యవస్థలోను విప్లవాత్మకమైన మార్పులను కలిగించింది. ఈ తాత్త్విక స్వరూపాన్ని సంక్షిప్తంగా, ఈ క్రింది విధంగా వివరించొచ్చు.

### 17.2.1 కన్ఫ్యూషియన్ వాదం

ఈ వాదాన్ని క్రీ.పూ. 551 - 479 లలో జీవించిన కన్ఫ్యూషియస్ అని పేరు పొందిన ఫుట్సె (Futse) అనే రాజవంశీకుడు ప్రవచించాడు. దీనిని, అతని అనుయాయులయిన మెన్షియస్ (Mencius)(క్రీ.పూ. 372-298); హ్సుట్జు (Hsuntzu) (క్రీ.పూ. 313 - 238) వంటి వారు, వ్యాప్తి చేసి, ఎంతో పేరుప్రఖ్యాతులను పొందారు.

#### 17.2.1.1 కన్ఫ్యూషియస్ జీవితం

కన్ఫ్యూషియస్ అనేది కుంగ్‌ఫుట్జు (K'ung Futzu - కుంగ్ గురువు) అనే దాని ఐరోపీయ రూపం. ఇతని పూర్తి పేరు కుంగ్‌ఛియు. ఇతడు తన 19వ ఏట వివాహం చేసుకొని, కొన్ని ఏండ్లకే భార్యకు విడాకులు ఇచ్చాడు. ఇతడు లూ రాష్ట్రంలో కొంత కాలం ఉద్యోగిగా పనిచేశాడు. వివిధ రాష్ట్రాలలో తిరిగి, విశేషమైన అనుభవాన్ని పొందాడు. క్రీ.పూ. 501 లో ఇతడు లూ రాష్ట్రానికి ప్రధానమంత్రి అయ్యాడు. క్రీ.పూ. 497 ప్రాంతంలో రాజు దుర్వర్తన వల్ల, పదవిని పరిత్యజించాడు. ఆ తరువాత వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ, రాజనీతిని, సామాజిక సంస్కారాన్ని, ఔన్నత్య పథాన్ని బోధించాడు. ఇతడు గొప్ప వ్యక్తిత్వమున్నవాడు. క్రీ.పూ. 206 లో హాన్ రాజ వంశ స్థాపన జరిగినప్పటి నుండి, కన్ఫ్యూషియస్ మహర్షిగాను, దివ్య పురుషుడుగాను, చైనాలో ఆరాధించబడ్డాడు. క్రీ.పూ. 206 - 194 మధ్య కౌతే (Kaow te) చక్రవర్తి ఇతని సమాధిని దర్శించి, అతనికొక ఎద్దును బలి యిచ్చిన నాటి నుండి, కన్ఫ్యూషియస్ సంప్రదాయం, ఆరాధన వ్యాపించిది. కన్ఫ్యూషియస్ ఆలయాలు 1500 కు పైగా వున్నాయి. ఇతన్ని దివ్య పురుషునిగాను, నూతన బోధనలు, నైతిక సంప్రదాయాన్ని ప్రవచించిన జగద్రక్షకునిగాను

కూడా, భావించడం జరిగింది. ఇతని గ్రంథాలను 1687లో 'కన్ఫ్యూషియస్ సినారం ఫిలాసఫస్' (Confucius Sinarum Philosophus) అనే పేర ప్రచురించడం, తొలిసారి జరిగింది.

### 17.2.1.2 కన్ఫ్యూషియస్ సిద్ధాంతాలు

కన్ఫ్యూషియస్ మతపరమయిన అంశాలను గురించి, పెద్దలను, భూమి, ఆకాశాలను, నదులను, పర్వతాలను పూజించడం, వాటికి వివిధ కాలాల్లో బలులను ఇవ్వడం, తప్పక చేయవలసిందిగా భావించాడు. కాని, మానవులను గురించి, వారి పట్ల ఆచరింపవలసిన ధర్మం గురించి , జీవితాన్ని గురించి, సరిగా అర్థం చేసుకోడం ఎంతో అవసరమని; పెద్దలను గురించి, పంచభూతాలను గురించి, మరణం తరవాత ఏమి జరుగుననే స్థితి గురించి ఎక్కువ ఆలోచించడం, తర్కించడం అనవసరమని, కన్ఫ్యూషియస్ వివరించాడు.

ఇతడు ఎక్కువ నైతికమైన విషయాలకే ప్రాముఖ్యమిచ్చాడు. నైతిక వ్యవస్థను ' హో ' (Ho) అని పిలిచేవారు. ఈ వ్యవస్థలో స్వాభావికమైన మార్గాన్ని, టైన్ (Tien) ఇచ్చిన నియమాలను పాటించుట, ' హో ' లోని ప్రధానాంశం. అందువల్లనే, ఇతడు ప్రధానంగా ఉత్తమ పురుషుని గుర్తించాడు. ఇతని ప్రకారం, నైతిక వ్యవస్థ, సమాజంలోని క్రమబద్ధత, పరస్పర పోషకాలు. కాని, కన్ఫ్యూషియస్ తన సిద్ధాంతాలను ఏర్పరిచేవరకు, చున్ట్జు (Chuntzu) అంటే, రాజకుమారుడు, ఉన్నతమైన మానవునిగా గుర్తించబడేవాడు. అంటే, మానవులలో ఉన్నతత్వం కేవలం రాజకీయపరమైన, ఆర్థికపరమైన అధికారాలను బట్టి నిర్ణయించడం జరిగేది. కాని, కన్ఫ్యూషియస్ ఆ భావానికి భరత వాక్యం పలికాడు. కన్ఫ్యూషియస్ ప్రకారం సన్మార్గాన్ని - టారొ (Taro) ను అనుసరిస్తూ , సాటి మానవులను ప్రేమించే వాడే వున్నత వ్యక్తి; ఇది, ఇతని కొత్త నిర్వచనం. ఈ స్థితిని సత్యశీలురు, ఋజువర్తనులు అయిన వారే పొందగలరు. వీరికి విచారం కాని, సంశయం కాని , భయం కాని వుండవు. అతడు ఎట్టి స్థితిలో ఉన్నప్పటికి, దానితోనే సంతుష్టుడుగా ఉండగలడు. దేశ, కాల పరిస్థితులను బట్టి, అతని నిశ్చయం, వ్యవహారం ఉంటాయి. అతడు మానవులంతా మంచివారని, ఒకేలా ఉంటారని, కర్మవల్ల వేరవుతారని మాత్రం చెప్పాడు.

### 17.2.1.3 వ్యక్తి స్వభావం

మానవుని స్వభావాన్ని ' చి ' (Chih) అంటారు. అదే 'జెన్' (Jen) అని కూడా పిలువబడుతుంది. 'జెన్' అంటే ధర్మం. వారు తమ ధర్మాన్ని, 'లి' (Li) అంటే విద్యుక్తమైన ఆచారాలను అనుమతించడం ద్వారాను, 'ఇ' (i) అంటే ఋజువర్తన ద్వారాను ఏర్పరచుకొంటారు. కన్ఫ్యూషియస్ శిష్యులు వ్యక్తి స్వభావాన్ని ఎంతో వివరించారు. మెన్షియస్ (Mencius) వారిలో ఒకడు. అతని ప్రకారం, వ్యక్తులందరూ స్వతహాగా మంచివారే. వారిలో 'జెన్' అంటే మానవత్వం ; 'ఇ' అంటే నైతికత; 'లి' అంటే ఆత్మవిశ్వాసం, తెలివితేటలు, మంచిని చేయాలనే ఆకాంక్ష, తెలుసుకోడం కూడా వున్నాయి. కేవలం సాంగత్య దోషం వల్ల మాత్రమే వ్యక్తి తనలోని సద్గుణాలను కోల్పోయి, దుర్గుణాలకు ఆలవాలమవుతున్నాడు. కాని, అతని సతీర్థుడైన హ్సున్ట్జు (Hsuntzu) ఎంతో వ్యతిరేకమైన అభిప్రాయాలను చెప్పాడు. అతడు మానవుడు సహజంగా చెడ్డవాడని, స్వలాభాపేక్షగలవాడని, అసూయ గలవాడని, అది కేవలం సత్సమాజంలోనే నియంత్రణ చేయబడుతుందని వివరించాడు.

### 17.2.1.4 సమాజానికి, వ్యక్తికి గల సంబంధం

కన్ఫ్యూషియస్ సమాజాన్ని సద్గుణవంతులు పాలించాలని వివరించాడు. మెన్షియస్ సమాజాన్ని ప్రభువులే పరిపాలనను దోషరహితంగా చేసి, పాలించాలని చెప్పాడు. హ్సున్ట్జు సమాజంలో చట్టం, ధర్మ ప్రవచనం అవసరమని చెప్పాడు.

B R A O U

సమాజానికి, వ్యక్తికి గల సంబంధాన్ని 'ది గ్రేట్ లెర్నింగ్ '(The Great Learning) అని పేరుపడ్డ ట్సుంగ్ట్జు (Tsung Tzu) పాత్రలో ఒక అష్టాంగ మార్గం ద్వారా వివరించాడు. వస్తు పరిశోధన , జ్ఞానవ్యాప్తి, ఆత్మశుద్ధి, తప్పుదిద్దుకొనే విధానం, స్వీయ జీవితాన్ని దిద్దుకొనడం, కుటుంబాన్ని తీర్చిదిద్దడం, జాతీయ రక్షణ, ప్రపంచ శాంతి - అనేవి ట్సుంగ్ట్జు ఆశయాలు. వీటన్నింటికి గమ్యం శాంతితో గల చక్కని ప్రపంచమే. దీనికి పునాది 'జెన్' (మానవత్వం). దీనిలో 'చుంగ్' (Chung); ఆత్మస్పందన ; 'షు' (Shu =Altruism)అతిముఖ్యమైన భాగాలు. వీనితో బాటుగా 'చుంగ్ చుంగ్' (Chung Chung) ఎంతో అవసరం. కన్ఫ్యూషియస్ ప్రకారం, ఇది సమాజంలో మానవత్వాన్ని పెంపొందించడానికి గాను, ఒక సూచిక వంటిది. ఇవన్నీ కేంద్రీకరణ గమ్యంగా గలవి.

కన్ఫ్యూషియస్ మనుమడయిన ట్జు - స్సు (Tzu - ssu) (క్రీ.పూ. 492-331) వ్రాసిన ' ది డాక్ట్రిన్ ఆఫ్ ది మీన్ ' (The Doctrine of the Mein) అనే గ్రంథంలో, కేంద్రీకరణ భావాన్ని గురించి, దాని స్వభావాన్ని గురించి, ఎంతో విపులంగా రాయడం జరిగింది. దాని ప్రకారం 'చుంగ్ ' (Chung) అనే కేంద్రీకరణ, 'మీన్' (Mein) అనే సూచికను ఉల్లంఘించదు. 'యంగ్ ' అనే సౌహార్ద్రత విశ్వవ్యాప్తమైన, అతి సామాన్యమైన అంశం. కేంద్రీకరణ అనేది ఒక వ్యక్తిలో భావ స్పందన కలగక ముందు స్థితి. సౌహార్ద్రత భావ స్పందన కలిగిన తరవాత స్థితి.

వ్యక్తులు, సమాజం నైతికంగా ప్రవర్తించినట్లయితే, 'టావో' (మార్గం) ఏర్పడుతుంది. అదే, ధర్మం, స్వర్గానికి రహదారి. కన్ఫ్యూషియస్ ప్రకారం ఆత్మైక నియంత్రణ గల ఒక ఉన్నత పురుషుని పుష్టియే స్వర్గం.

### 17.2.2 టావో వాదం (Taoist School)

దీనిని లావోట్జు (Lao Tzu) వెలుగులోకి తెచ్చాడు. కన్ఫ్యూషియస్ కంటే దాదాపు ఏభై ఏండ్ల ముందు జన్మించిన లావోట్జు గొప్ప తత్త్వవేత్త అని, అతడు ఒక దర్శన నిర్మాణం చేశాడని, అతడు టావోటే ఛింగ్ (Tao Te Ching) అనే కృతిని రాశాడని, చైనా సంప్రదాయంవల్ల తెలుస్తున్నది. ఇతడు చైనాలోని హోనాన్ (Honan) రాష్ట్రంలో క్రీ.పూ. 604 లో పుట్టాడు. కొంతకాలం చౌ రాజ వంశస్థుల ఆస్థానంలో ఉద్యోగిగా ఉండేవాడు. కాని, చౌ రాజ వంశ పతనాన్ని ముందుగానే గుర్తించి, పదవీ విరమణ చేశాడు. ఆ తర్వాత వివిధ ప్రాంతాలలో సంచరిస్తూ, అతని జాడ దొరకని స్థితి ఏర్పడింది. అతడు కన్ఫ్యూషియస్‌ను కూడా కలిసి, అతని మహోన్నత వ్యక్తిత్వానికి ఎంతో ఆశ్చర్యం పొందినట్లు కూడా, చైనీయ సంప్రదాయంలో చెబుతారు. కాని, వాటిని అందరూ నమ్మడం లేదు. అంతేకాక, " అందులోని విషయాలను బట్టి, శైలిని బట్టి, టావోటేఛింగ్ క్రీ.పూ. 300 ప్రాంతంలో రాయబడి ఉంటుందని కొందరు ఆధునిక పండితులంటారు. ఈ పుస్తకాన్ని రాసినది చు రాష్ట్రంలో లిహ్‌సియాంగ్ గ్రామంలో పుట్టిన లిఎర్హ్ (Li Erh) అని, ఇతనికొడుకు పై రాజ్యంలో క్రీ.పూ. 273 లో దండనాయకుడుగాను, సామంతుడు గాను వుండేవాడని కొందరి ఆధునికుల నిశ్చయం". కాని, లావొట్జు కృషిని గురించి సరైన స్థిరత్వం లేని వైవిధ్యాలతో కూడిన అభిప్రాయాలే హెచ్చుగా కన్పిస్తున్నాయి. కొందరి ప్రకారం, లావోటాస్ (Lao Tos) అనే ఋషి రచనగా, తన రచననే లిఎర్హ్ ప్రచారం చేసి ఉండవచ్చును కూడా. కాని, కాలక్రమంలో, లావొట్జు మరణించలేదని, అతడు దివ్య పురుషుడని, అమరుడని, వివిధ ఐతిహ్యాలు వ్యాప్తిలోనికి రావడం జరిగింది. అతడు పది అవతారాలెత్తిన సర్వజ్ఞుడని చెప్పుకొనడం జరిగింది. క్రీ.పూ. 221లో చక్రవర్తి అయిన చిన్‌షిహ్ హువాంగ్‌టి (Chin Shih Huang ti), క్రీ.పూ. 140 - 610లో రాజ్యం చేసిన వూ (Wu) చక్రవర్తి, టావో సాంప్రదాయపు గురువుల ప్రభావానికి లోనయ్యారు. క్షుద్ర లోహాలను బంగారంగా మార్చడం, అమరత్వాన్ని ప్రసాదించే మూలికలను, రసాయనాలను (Chemicals) ను కనుక్కొనడం, వేర్వేరు గుడ్డి నమ్మకాలకు, పూజా ప్రక్రియలకు లోనవడం, ఆనాటి టావో సంప్రదాయంలో వుండేవి. 'వూ' (Wu) మృతి తరవాత, ఆచార వ్యవహారాల్లోను, గుడ్డి నమ్మకాల్లోను కొంత క్షీణత ఏర్పడింది. ఆ తర్వాతనే టావో చెప్పిన

తాత్త్విక, దార్శనిక అంశాలు ప్రచారం పొందాయి. క్రీ.శ. 147 - 168లలో చైనాలో పాలించిన హవాన్ చక్రవర్తి టావో మతాన్ని ఆశ్రయించి, లావోట్జు జన్మస్థలంలో వున్న అతని దేవాలయంలో తిరిగి బలుల నిచ్చి, ఆరాధనలు చేసేవాడు. మళ్ళీ కొంతకాలం క్షీణత పొందింది. తిరిగి 424 - 452లలో టాయ్‌వుటే (Tai Wute); క్రీ.శ. 477 - 500 మధ్య పాలించిన టాయ్‌హో(Tai Ho) మొదలైన చక్రవర్తులు టావో మతాన్ని గౌరవించారు. కాని, మంచూ రాజ వంశ కాలంలో టావో మతం పూర్తిగా ప్రజలకు దూరమైంది.

### 17.2.3 లావోట్జు సిద్ధాంతాలు

లావోట్జు (Lao Tzu) ప్రకారం, 'టావో' (Tao) ప్రకృతి మాత్రమే. అదే స్వర్గం - టైన్ (Tien). అదే ఆత్మ (Truzan). అదే వ్యక్తి. అది అనంతం. నామరహితం, వర్ణనాతీతం, యాదృచ్ఛికం. అదే స్థిరమైనది, సనాతనమైనది. ఒక వ్యక్తి ఆ భావాన్ని పొందగలిగినపుడు, అదే టె (Te) అంటే, గుణము అవుతుంది. జీవితంలో ప్రధానంగా నిరాడంబరత, యాదృచ్ఛ, నిశ్చలత, బలహీనత, అకర్మణ్యత, అంటే వు - వీ (Wu-Wi) ముఖ్యమని, ప్రకృతి అనధిగమ్యమని, అదే టావో (Tao) దారి, లేదా గమ్యమని లావోట్జు అభిప్రాయం. దీనినే ప్రత్యేకంగా 'టావో చియా' (Tao chiah) అని పిలవడం జరిగింది.

లావోట్జు చెప్పిన టావో అంటే, మార్గం. ఈ శబ్దం, అంటే టావో, జనుల జీవిత విధానానికి, ప్రకృతి తీరునకు, పరమ తత్త్వం వున్న తీరునకు కూడా వర్తిస్తున్నది. టావో ప్రధానంగా ప్రపంచంలో వుండే నియమం. ఏ సూత్రం ప్రకారం విశ్వంలోని వివిధ ప్రక్రియలు జరుగుతున్నాయో, ఆ ప్రక్రియనే టావో అంటారు. అది నైతికీకరణకు, నైతిక జీవనానికి కూడా ప్రేరణ. అదే గ్రహాల మార్గం, అదే సూర్య చంద్రుల మార్గం, అదే భూమి మార్గం. సమస్త వస్తువుల సహజ స్వభావాన్ని, సారాన్ని టావో అనే అంటారు. జీవన్మరణాలు, మంచి చెడులు, చక్రం వలె ఒకదాని తర్వాత మరొకటి ఏర్పడుతూనే వుంటాయి. దీనికంతా కూడా టావో అనే పేరు వచ్చింది.

ఈ రకమైన నియమాన్ని, ప్రాపంచిక సూత్రాలను, ఒక వ్యక్తి విరక్తి ద్వారా, త్యాగంద్వారా, సన్యాసం ద్వారా పొందగలడు. టావోననుసరించి నడుచుకొనిన వారి టె (Te) ప్రకటమవుతుంది. టె అంటే సద్వర్తనం, ధర్మం, నైతిక శక్తి. ఇతరులకు మార్గదర్శికాగల స్వభావం. వస్తువులు, మనుషులు స్వభావసిద్ధంగా, స్వతంత్రంగా ప్రవర్తించడం జరిగినపుడు, వస్తువులలోను, మనుషులలోను ఉన్నట్లే, పరిపూర్ణంగా అభివృద్ధి పొందగలదు. సహజ కర్మలలో యాదృచ్ఛికంగా ప్రవర్తించేవాడు, చేసీ చేయనివాడే. స్వభావాన్ని అనుసరించువాడు, తన సంకల్పం లేక పోయినా చేస్తాడు. అందువల్ల, పరిపూర్ణత గల 'టె' ను పొందినవాడు, చేసీ చేయనివాడే. ఈ స్థితిని 'వె యు వెన్' (Way Wu Wen) అని 'టావో టెచింగ్' (Tao Teching) వర్ణించింది.

సుఖం, దీర్ఘ జీవితం, సంపద సాధారణంగా అందరు మనుషులు కోరుకొనేవి. టావో మతం వీటిని పొందే మార్గాలను కూడా వివరించింది. తపస్సువల్ల, ఆన్‌పాన్ (An Pan) అంటే ప్రాణాయామం మొదలైన పద్ధతుల ద్వారా, శరీరంలోని వాయువును, ఉచ్ఛ్వాసనిశ్వాసాలను నియమించడం వల్ల, మంత్రాల వల్ల, మందుల వల్ల, బ్రహ్మచర్యం వల్ల, కొన్ని తంత్రప్రక్రియలలో జరిపే మైథునం (coitus) వల్ల, వృద్ధాప్యం, మరణం లేని స్థితి లభించగలదని టావో మతం చెప్పడం జరిగింది. తక్కువ విలువ గల లోహాలను బంగారంగా మార్చడం వల్ల, ఎక్కువ సంపద లభిస్తుందని కూడా టావో మతంలో చెప్పడం జరిగింది.

### 17.2.4 ఛువాంగ్‌ట్జు (Chuang Tzu)

క్రీ.పూ. 369-286 మధ్య జీవించిన ఛువాంగ్ ట్జు (Chuang Tzu) లావోట్జు శిష్యులలో ముఖ్యుడు.

ఇతడు పెద్ద పండితుడు, తార్కికుడు, గ్రంథకర్త. హొనాన్‌లో చిన్న ఉద్యోగిగా వుండేవాడు. చు రాష్ట్రానికి ప్రధాన మంత్రి పదవి ఇస్తానని వచ్చినా, నిరాకరించిన విరాగి . ఇతడు కూడా టావోను సర్వాంతర్యామిగాను, జగత్కారణంగాను, స్వయంపూర్ణమైన, స్వతంత్రమైన, సమగ్ర తత్త్వంగాను వర్ణించాడు. చు వాంగ్‌ట్జు టావోను నిశ్చలమైనది గాక, నిరంతర పరిణామ మార్గంగా పేర్కొన్నాడు. సువిశాలమైన, విశ్వవ్యాప్తమైన, అనంతమైన పరిణామంలో, అన్ని వస్తువులలోను సమతౌల్యం ఏర్పడుతుంది. పరిణామం అనేది వైయక్తికమని, వ్యక్తిగత ప్రకృతి గౌరవనీయమని చువాంగ్‌ట్జు చెప్పాడు. ఇతడు విశ్వైకత్వాన్ని, అంటే ప్రపంచమంతా ఒకటే అనే భావనను, వైయక్తికత్వాన్ని, అంటే ఒక మనుష్యుడు పొందే 'టె' పరిపూర్ణతా స్థితికి గల మార్గాన్ని, సమ్మేళనం చేసి నిరూపించాడు. లావొట్జు క్రమబద్ధత గల ప్రభుత్వం వైపు మొగ్గు చూపాడు. కాని, చువాంగ్‌ట్జు ఆధ్యాత్మికపరమైన స్వేచ్ఛకు, శాంతికి, దోహదం చేసే ఒక 'టావో' కోసం యత్నించాడు. ఇతని సిద్ధాంతంలో వ్యక్తి కాని, సమాజంకాని గమ్యం కాదు. ఇతని గమ్యం – నాతో కలిసి సమస్త వస్తువులు ఒక్కటే; భూమి, ఆకాశం, నాతో పాటే వచ్చినవని భావిస్తూ, ఆత్మలేని, పేరులేని, వాహకతలేని ఒక పూర్ణ పురుషుడు . ఇతని సిద్ధాంతం విశ్వానికి, మానవునికి మధ్య సమైక్యాన్ని, సమగ్రతను సూచిస్తుంది. ఇదేవిధంగా ఇతడు కన్ఫ్యూషియస్ వాదుల నుండి, లావొట్జు నుండి కూడా, వేరైన విశిష్టతను పొందాడు.

### 17.2.5 మో (MO) వాదం (MO School)

క్రీ.పూ. 468-376 మధ్య వున్న మోట్జు (Mo Tzu) ఈ వాదాలను ప్రతిపాదించాడు. ఇతడు క్రీ.పూ. 479 - 381 మధ్యకు చెందినవాడని కూడా, కొందరి అభిప్రాయం. ఇతడు హొనాన్ రాష్ట్రానికి చెందిన వాడని కొందరు, లూ రాష్ట్రానికి చెందిన వాడని కొందరు అంటున్నారు. మీ యి పావొ (Mei yi -pao) అనువదించి, 1929లో ప్రచురించిన, ' ది ఎథికల్ అండ్ పొలిటికల్ వర్క్స్ ఆఫ్ మోట్స్ ' (The Ethical and Political Works of Motse) అనే గ్రంథం ద్వారా ఇతని సిద్ధాంతాల వివరాలు తెలుస్తున్నాయి. మోట్జు పరస్పర ప్రేమను, పరస్పర లాభాన్ని, ఏ రకమైన ప్రజాస్వామిక సిద్ధాంతం గాని, రాజకీయ యంత్రాంగం గాని లేకపోయినా, ఇంచుమించు ప్రజాస్వామ్య సిద్ధాంతాలను, భావాలను పోలే సిద్ధాంతాన్ని ప్రవచించాడు. ఇతణ్ణి కొందరు గుర్తింపబడని కన్ఫ్యూషియస్ " శత్రువు" (Neglected Rival of Confucius) అని కూడా వ్యాఖ్యానించారు.

BRAOU

ఇతణ్ణి క్రైడ్ పండితుడు చైనా దేశపు ప్రత్యేక మత ప్రవక్తగా పేర్కొన్నాడు. కాని, ఇతడు చెప్పిన మత సిద్ధాంతాలు కేవలం రెండు శతాబ్దాలు మించి, ప్రజాదరణను చూరగొనలేక పోయాయి.

ఇతడు కన్ఫ్యూషియస్ చెప్పిన జెన్ (Jen), ఇ (i) అనేవి ఏ మాత్రం ఆవశ్యకం కాదని చెప్పాడు. పండుగలు, మతపరమైన ఉత్సవాలు అన్నీ అనవసరమని వాదించాడు. ఇతడు విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని, సమాదరణను కోరి, సామాజిక వ్యవస్థకు గండి కొట్టాడు. ఇతరుల తల్లిదండ్రులను తమ తల్లిదండ్రుల వలెనే ప్రేమించవలెనని మోట్జు ప్రబోధించాడు.

ఇతడు ఉపయోగితవాది. లి (Li) అనగా ఉపయోగము లేదా లాభం ; కుంగ్ (Kung) అనగా నిర్వాహం; రెండూ ఎంతో ముఖ్యమైనవిగా పేర్కొన్నాడు. అతడు విశ్వమానవ సౌందర్యాన్ని ప్రతిపాదించాడు. యుద్ధాన్ని ఖండించాడు. దేవతలను మంచిని పోషిస్తూ, విజయాన్ని కలిగిస్తూ, చెడును శిక్షించే ఆది భౌతిక (Super Natural) శక్తులుగా గుర్తించి, వారి సేవలను, ఆరాధనను ప్రోత్సహించాడు. కన్ఫ్యూషియస్ ప్రతిపాదించిన కుటుంబం పట్ల విశ్వాసం అనే సిద్ధాంతం ముందు, మోట్జు చెప్పిన విశ్వమానవ సౌందర్యం అనే భావన నిలవ లేక, అనతి కాలంలోనే వీగిపోయి, జనాదరణను కోల్పోయింది.

కాని, మోట్జు ప్రతిపాదించిన చీన్ అయ్ (Chien Ai) అనగా, పక్షపాతంలేని విశ్వప్రేమ, విపత్తు లేకుండా ఇతరులను అందరిని తన వలెనే భావించడం ద్వారా చేయగలదని తెలుస్తూంది. మోచింగ్ (Moching) అనే గ్రంథం ద్వారా క్రీ.పూ. 221కి ముందే, అతని అనుయాయులు తర్క ప్రమాణాలలో మోట్జు వాదనలను వ్యాప్తిలోనికి తేవడానికి కృషి చేసినట్లు తెలుస్తున్నది. మోట్జూ వాదనలలో ప్రయోజనాత్మక వాదం, నైతిక వాదం రెండూ సమన్వయింపబడ్డాయి.

### 17.2.6 తార్కిక వాదం

క్రీ.పూ. 380 - 305కి చెందిన హ్యూషి (Hui Shi), కుంగ్‌సుంగ్‌లుంగ్ (Kung Sung Lung) లు యీ వాదాన్ని స్థాపించారు. వీరు 'మోట్జూ' వాదాన్ని బలపరిచారు. ప్రప్రథమంగా చైనా తత్త్వ వివేచనలో ఉనికి(existence) , సాపేక్షత (Relativity), ఆవరణ (Space), కాలం (time), గుణం (quality), వాస్తవికత (actuality) కారకత్వం (causes) అనే వానిని బోధించారు. హ్యూషి సాపేక్షతను ఉదాహరించాడు. అదే, పరిణామానికి తోవ తీసిందని అతని భావన. కాని, కుంగ్‌సుంగ్‌లుంగ్ ధ్రువీకృతత్వం, విశ్వజనీనత, శాశ్వతత్వం అనే అంశాలను గుర్తించాడు. వీరు అతీంద్రియ సంబంధ, జ్ఞాన మీమాంసా సంబంధమైన అనేక పలుకుబడులను, తత్త్వ వివేచనలో విశ్లేషించారు.

### 17.2.7 యిన్ - యాంగ్ వాదం

క్రీ.పూ. 305 - 240 కి చెందిన వూహ్సింగ్ (Wuh' sing), త్సాయెన్ (Tsanyen)లు యిన్-యాంగ్ (Yin yang) వాదాన్ని ప్రవేశపెట్టారు. వీరి ప్రకారం ఈ విశ్వమంతా రెండు రకాల శక్తులతో కూడి ఉంది. ఒక తరహావి ఋణాత్మకమైనవి. వేరొక తరహావి ధనాత్మకమైనవి. ఋణాత్మకత, అలసట, బలహీనత, వికేంద్రీకరణత, అన్నీ యిన్ (Yin) అనేవి. ధనాత్మకత , చురుకుదనం, బలవత్తత, కేంద్రీకరణ, అన్నీ యాంగ్ (yang) అనేవి. లోహం, ధారువు, భూమి, జలం, అగ్ని అనేవి ఐదు మౌలిక పదార్థాలు. మౌలిక పదార్థాలన్నీ పరస్పరపోషకంగా వ్యవహరిస్తూ, క్రమ ప్రాధాన్యమున్నవి. ఇవన్నీ నిర్ణీత సూత్రాలకు లోబడి, ఇదమిత్థమైన విధానంలో చరించేవి. ఈ చరాత్మక విధానం మానవుని, ప్రకృతి సమైక్యతా భావాలను ఏకదత్తుగా నిర్ణయించేది. ఈ విధానమంతా ఒక విశ్వానికి లోబడ్డది. ఆవిశ్వం విధానాత్మకమైనది, నిర్ణయాత్మకమైనది, నిర్ణీతాత్మకమైనది, వర్ణనాత్మకమయినది, దర్శనాత్మకమైనది. ఇంగ్ యాంగ్ (ying yang) వాదం ప్రకారం, ఈ విశ్వమంతా అనంతమైన, పరిభ్రమణాత్మకమైన అతీంద్రియ భావాలను, వివాహాది సంస్కారాలను, వంట వంటి దైనందిన కృత్యాలను కూడా ప్రభావితం చేస్తుంది.

### 17.2.8 నైయాయిక వాదం

క్రీ.పూ. 233లో మృతి పొందిన హాన్‌ఫేట్జు (Han Feitzu) నైయాయిక సిద్ధాంతాల వ్యాఖ్యాత, ప్రవక్త. నైయాయికులు అంటే, న్యాయమే అత్యున్నత స్థితి అని, సంస్కారమని భావించేవారు. చైనా తత్త్వ భావాలలో ఎంతో కించిన్మాత్ర (కొద్దిదైన) గౌరవం గల యీ వాదం, చిన్ రాజ వంశస్థుల పోషణను పొందింది. వీరు చట్టాన్ని అమలుపరచడం, రాజ్య వ్యవస్థను తీర్చిదిద్దడం, అధికారాన్ని వినియోగించడం వంటి భావాలకు ప్రాధాన్యతమిచ్చారు.

పైన వివరించిన వాదాలన్నీ చైనీయుల జీవన విధానంలో వ్యక్తికి, సమాజానికి మధ్య గల సంబంధాన్ని, మానవ భావాల దృష్ట్యాను, మానవాతీత భావాల, మానవాతీత వ్యవస్థల దృష్ట్యాను నిర్వచించేవే. అవి కేవలం సిద్ధాంతాలనేది మరవలేం. వానిలో కొన్ని ఆచరణ యోగ్యాలు, మరికొన్ని అచరణయోగ్యం కానివి. కాల

పరిణామంలో, ఆచరణ యోగ్యమైన విధానాలన్నీ మత వ్యవస్థగా రూపొంది, ప్రాథమిక నాగరికతా వికాస కాలంలోను, షాన్, చౌ రాజ వంశాల కాలంలోను, వైవిధ్యమైన ఆరాధనా సంప్రదాయాలుగా మారాయి.

## 17.2.9 ప్రేతాత్మారాధన

తొలిదశలలో ఇది ఎంతో గౌరవాన్ని, ఆదరణను పొందింది. 'వీ' (Wei) నదీ పరీవాహక ప్రదేశ ప్రాంతంలో దీనికి ఎక్కువ దాఖలాలు లభ్యమవుతున్నాయి. అనేక సమాధులలో వీనిని చూడవచ్చు. కొన్నింట వ్యక్తి శిరస్సు సామూహికంగా ఒకే దిశలో పెట్టబడి వుండేది. ఒక్కొక్కసారి 20 నుండి ఎనభై వరకు గల వివిధ సమాధులలో ఎముకలను పోగు చేసి, కుప్పగా సమాధి చేసేవారు. ఈ సమాధులతో బాటు, నివాస స్థలాలు, నివాస గృహాలు, తెల్లని రాళ్ళతో ఏర్పరిచిన వలయాలు ఎక్కువగా ఉండేవి. సమాధులలో మద్య పాత్రలు, పంది దవడ ఎముకలు చెల్లాచెదురుగా ఉంచడం కూడా ఉంది. వ్యక్తిగతమైన సమాధులకు ప్రేతాత్మ తృప్తి కోసం అనేక సమర్పణలు జరిగేవి. పరికరాలు, మట్టి పాత్రలు, జేడ్ రాతి వస్తువులు, కుక్కలు, మానవులు కూడా అటువంటి సమర్పితమైన బలులలో కొన్ని. ఎర్ర రంగును శరీరాలకు, ముఖాలకు పూసేవారు. ఇది ఆ ప్రత్యేక వ్యక్తి మరణించలేదని, జీవించే వున్నాడనే నమ్మకానికి గుర్తు. తొలిదశలలోని యీ మత వ్యవస్థలో ఇటువంటి పూర్వీకుల ఆరాధన ఎంతో ముఖ్యమైనది, విశ్వవ్యాప్తమయినది.

## 17.2.10 షాన్ రాజవంశ కాలంలో మతాచారాలు

షాన్ రాజవంశస్థుల కాలంలో (క్రీ.పూ. 1027 వరకు) కూడా, మరణానంతర జన్మ అనే భావన కొనసాగింది. జోస్యం చెప్పే ఎముకలపై గల వ్రాతలు, యజ్ఞయాగాలలో వాడిన పాత్రలపై గల వ్రాతలు, ఈ మతాచారాలను గురించి తెలుసుకోడానికి ప్రధానాధారాలు.

రాజవంశీకుల సమాధులన్నీ ఎంతో విశాలంగా వుండేవి. వారి హోదాకు తగినట్లుగా ఆయా సమాధులలో దాస దాసీ జనం, గుర్రాలు, కుక్కలు, కంచు పాత్రలు, రాతి, శంఖపు, వస్తువులు, రథాలు కూడా ఉండేవి. ఇది ఇంచుమించు ఈజిప్ట్ మత వ్యవస్థలోని 'మరణానంతర జన్మ' సంప్రదాయాన్ని తలపింపచేస్తున్నది.

షాన్ రాజవంశీయుల కాలంలో ఇంకొక ప్రధానమైన సంప్రదాయం, దివ్యత్వాపాదన. ప్రభువులు తమను తాము 'స్వర్గపుత్రుడు' (Sun of the Heaven) అని వర్ణించుకొనేవారు. నదులు, పర్వతాలు, వర్షపాతం, వాయువు, మొదలైన శక్తులన్నీ ప్రభువుల్లో వున్నట్లు భావించడం జరిగేది. వీరు దానితోబాటుగా అనేక పూజలను, ఆరాధనలను నిర్వహించేవారు. వారు తాబేటి చిప్పలనుగాని, ఎద్దులనుగాని, గొర్రెల ఎముకలనుగాని, కంచు కడ్డీలతో కాల్చి,ఆ ఫెళ ఫెళ మనే శబ్దం బట్టి వాతావరణం, యుద్ధం, అనారోగ్యం, పరిపాలనా సమస్యలు, పంటలు మొదలైన వాటిని గురించి జోస్యం (oracle) చెప్పేవారు. అట్లాగే పూర్వీకులకు, దేవతలకు ఇవ్వవలసిన బలులను కూడా అడిగి తెలుసుకొనేవారు. దేవతలకు ప్రీతిగా మాంసాన్నిగాని, ధాన్యాన్నిగాని, తెరవబడ్డ బలిపీఠాల మీద కాల్చేవారు. అంతేకాక, మద్య పానీయాలు, నీళ్ళు, జేడ్ పూసలవంటివి కూడా సమర్పించేవారు. పశువులను, కుక్కలను, గొర్రెలను, మానవులను కూడా బలి ఇచ్చేవారు. ఈ బలులతోపాటుగా, దేవతలను అనేక కోరికలు కోరేవారు. వీటన్నింటికి కేంద్రంగా 'టి' (Ti) అనే దేవుడు వుండేవాడు.

## 17.2.11 చౌ రాజవంశ కాలంలో మతాచారాలు

చౌ రాజవంశీకుల కాలంలో, అంటే క్రీ.పూ. 1027 - 256ల మధ్యకాలంలో, పూర్వీకుల ఆరాధన, భగవదారాధన రెండూ ఉండేవి. దేవతలకు కేంద్రంగా టయేనీ (Tiene) ను భావించేవారు. హౌచి (Hau chi)

BRAOU

అనే తమ పూర్వీకుని కూడా పూజించేవారు . వీరు కూడా దివ్యత్వాన్ని మత వ్యవస్థలో వినియోగించినా, అది కేవలం యుద్ధాలు స్వప్నశకునాలు, నగర స్థాపనవంటి దానికి మితమై ఉండేది.

వీరి మత వ్యవస్థను గురించి ఇచింగ్ (IChing)అనే గ్రంథం తెలుపుతున్నది. 'ఇచింగ్' అంటే పరిణామ పురాణం. దీని ప్రకారం మానవులంతా ఆరు క్రమ (horizontal) శాఖలుగా, అరవై నాలుగు వర్గాలుగా వర్గీకరించబడ్డారు. ఈ శాఖలు కొన్ని చీలినవి; మరికొన్ని చీలనవి. చీలిన రేఖలను 'కున్' (kun) అంటారు. అంటే, అవి స్త్రీత్వ ప్రతీకలు. చీలని రేఖలను 'చియెన్ ' (Chien) అంటారు. అవి పురుషత్వ ప్రతీకలు. వీనిలో కున్, చియెన్ రెండు ధ్రువాల వంటివి. ఆ భావమే యిన్-యాంగ్ (yin yang) వాదానికి దారితీసింది.

వారు ప్రతి ఊరిలోను, ఊరి మధ్య గల 'షి ' (She) అనబడే మట్టి దిబ్బను పూజించేవారు. వీరు ఋతువుల ప్రకారం వేర్వేరు పండుగలను జరుపుకొనేవారు.

వీరి కాలంలో ప్రధానంగా 'టై యెన్ మింగ్ ' (Tiene Ming) అనే సిద్ధాంతం వచ్చింది. అంటే, స్వర్గాధిపత్యం. ఇది టైయెన్‌ట్జు (Tiene Tzu) అనే స్వర్గపుత్రుని హక్కులకు, అధికారాలకు, వారసత్వానికి భరతవాక్యం పలికింది. దీని పరిణామమే, క్రీ.పూ. 6వ శతాబ్దంలో కన్ఫ్యూషియస్, లావోట్జు మొదలైన తత్త్వవేత్తల ప్రాబల్యానికి దారితీసింది.

క్రీ.శ. 2వ శతాబ్దం తర్వాత బౌద్ధ మతం చైనాలో వ్యాప్తి పొందినప్పటి నుండి, ప్రాచీన మత వ్యవస్థ మరుగున పడిపోయింది.

## 17.2.12 చైనాకు , భారతదేశానికి తత్త్వ పరమైన పోలికలు, భేదాలు

షాన్, చౌ రాజవంశాలలోని మతాచారపరమైన అంశాలు, ప్రభువుల అధికారంలోని గొప్పదనం, అనేక ప్రశ్నలకు, సమస్యలకు, వాటిని సాధించడానికి, లేదా పరిష్కరించడానికి గల ప్రయత్నాలకు అవకాశాన్నిచ్చింది. అదే విధంగా, భారతదేశంలోని వైదిక సంప్రదాయం కూడా, కొన్ని ప్రశ్నలకు అవకాశాన్నిచ్చింది. కన్ఫ్యూషియస్ ప్రతిపాదించిన సిద్ధాంతాలు భారతదేశంలోని నాస్తిక ధోరణులకు సూచికగా వుంటుంది. అంతేకాకుండా, లావోట్జు ప్రతిపాదించిన వాదం, రాజయోగ సంప్రదాయానికి సరిపోలి ఉంటున్నది. అలాగే యిన్ - యాంగ్ వాదం కణందుని వైశేషిక సూత్రాలను పోలి ఉన్నది. నైయాయికులు ప్రతిపాదించిన న్యాయ ప్రాతిపదిక, గౌతముడు ప్రతిపాదించిన న్యాయ దర్శనాన్ని పోలి వుంటుంది. ఈ రకమైన పరిణామం చైనాలోను, భారతదేశంలోను ఇంచుమించు ఒకే కాలంలో సంభవించిన పృచ్ఛను, హేతుజిజ్ఞాసను సూచిస్తున్నది. బౌద్ధమతం చైనాలో ప్రవేశించిన తరవాత, చైనా భారతదేశానికి మతపరంగా సామంత ప్రాంతంగా పరిణమించిదనడంలో సందేహం లేదు. భారతదేశంలో బౌద్ధం రాకతో అంతకు ముందు గల తాత్త్విక సంప్రదాయాలు, వైదిక యజ్ఞయాగాది సంప్రదాయాలు ఇంచుమించు 200 సంవత్సరాలు ఏవిధంగా నేపథ్యంలోకి పోయాయో, అదేవిధంగా చైనాలో బౌద్ధమతం కన్ఫ్యూషియస్, లావోట్జు, మోట్జు మొదలైన తాత్త్వికుల ప్రవచనాలను ప్రజల ఆచారాలకు దూరం చేసింది.

భేదాలను పరిశీలించినట్లయితే, భారతదేశంలో బౌద్ధం క్రీ.శ. 800 నాటికి పూర్తిగా ప్రజల నుండి దూరమైంది. కాని, చైనాలో బౌద్ధం ఇప్పటికీ జన జీవన స్రవంతిలో ఒక భాగంగానే వుంటున్నది.

## 17.2.13 చైనాలో బౌద్ధమత పరిణామం - వ్యాప్తి

బౌద్ధం మొదట క్రీ.శ. ఒకటో శతాబ్దంలో మధ్య ఆసియా గుండా చైనాలో ప్రవేశించింది. దానిని కశ్యప మతంగుడు చైనాలో ప్రవేశపెట్టాడు. క్రీ.శ. 220లో హాన్ రాజవంశ పతనం తర్వాత, చైనాలో ప్రధాన మతంగా రూపొందింది. క్రీ.శ. 4వ శతాబ్దం నుండి 11వ శతాబ్దం వరకు ఉన్న కాలాల్లో, చైనాలో దార్శనికులు అందరూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో బౌద్ధమత ప్రభావానికి లోనవుతూనే వుండేవారు. క్రీ.శ. 549 - 623ల మధ్య, ఛిట్జాంగ్ (Chit zang) మాధ్యమిక శాస్త్రంపై వ్రాసిన టీకను బట్టి , క్రీ.శ. 221 - 589ల మధ్య , చైనాలో ఏడు బౌద్ధ సంప్రదాయాలున్నట్లు తెలుస్తున్నది.

ఆ సంప్రదాయాలలో మొదటి దానిని టావో అన్ (Tao An) అనే భిక్షువు ప్రతిపాదించాడు. అతడు క్రీ.శ. 312 - 385 ల మధ్య జీవించాడు. ఇతడు బౌద్ధమతంలో టావో దర్శన భావాలను పరిశీలించాడు. అతని ప్రకారం ముందు అన్నిటికంటే వు (Wu ) వుండేది. వు అంటే అసత్తు. అదేవిధంగా, కుంగ్ (Kung) అంటే శూన్యత నుండి భౌతిక వస్తువులు ఆరంభమయ్యాయి.

రెండవ దానిని క్రీ.శ. 285 - 374 మధ్య జీవించిన ఫా - షెన్ (Fa Shen) అనే ఉపనామమున్న ఛుఛియన్ (Chu chien) ప్రతిపాదించాడు. దాని ప్రకారం భౌతిక వస్తువుల ఉనికికి ముందున్న మూల అసత్తు నుండి అన్నీ ఆవిర్భవించాయి. ఈ మూల అసత్తు ఏ రకమైన ఆకృతులు లేని శూన్యత.

మూడవ దానిని క్రీ.శ. 314 -366 మధ్య గల చిహ్‌టావోలిన్ (Chih Taolin) ప్రతిపాదించాడు. దీని ప్రకారం వస్తువులకు గల రూపం - అనాత్మం (ఆత్మలేనిది) ; శూన్యం కాని అటువంటి రూపానికి అధిష్ఠానమైన మూల స్వభావం శూన్యం కాదు. కాని, నామ రూపాలు రెండు స్వభావపరంగా శూన్యాలు. ఇదే శూన్యం కాదను దానికి ఛిహ్‌టావొలిన్ చేసిన సవరణ.

నాలుగో దానిని ఫాషెన్ (Fa Shen) శిష్యుడైన ఛుఫావెన్ (Chu Fa Wen) ; క్రీ.శ. 326 - 342లలో జీవించిన ఛిహ్‌మిన్‌టు (Chih Min Tu ) ప్రతిపాదించారు. వీరి ప్రకారం అన్ని ధర్మాలు శూన్యాన్ని, ప్రతిపాదన మనస్సును శూన్యంగా చేయడానికి, దానిని అవిద్యాత్మకమైన ఉపాదానం నుండి విడిపించడానికి, చేయడం జరిగింది. వెన్ మతంలో జీవితంతో గల బంధం తెగడం వల్ల , మనస్సు రిక్తం, అసత్తు, అగును. దానినే మియావో యు (Miao yu) అంటారు. అంటే, అది మనస్సు పొందే నాశనంలేని, కామ, క్రోధ, మదం, మాత్సర్య, లోభ, మోహాలకు లొంగని, రహస్యమైన స్థితి. కాని, మిన్‌టు మనస్సు గొప్ప వివృత శూన్యమయినా, విషయాలను గ్రహించడానికి తగినదని చెప్పాడు.

ఐదవ దానిని ఫా - షెన్ సమకాలికుడైన యుఫకై (Yu Fa Kai) బోధించాడు. ఇతని ప్రకారం సంవృత్తి జగత్తు ఒక దీర్ఘరాత్రి. అందులో సంభవించే స్వప్నానికి మనస్సు, విజ్ఞానం హేతువులు. మనకిప్పుడు ప్రత్యక్షమవుతున్న అస్తిత్వమంతా ఆ స్వప్నంలోని ఆభాసాలు. దానిలోంచి మేల్కొని, ఆ రాత్రి పగలుగా అయినప్పుడు, ఈ మాయను కల్పించిన విజ్ఞానం నశిస్తుంది. అప్పుడు జగత్తు శూన్యంగా అవగతమవుతుంది.

ఆరో దానిని క్రీ.శ. 397 - 401 మధ్యలో జీవించిన టావోయి (Tao Yi) ప్రతిపాదించాడు. అతని ప్రకారం అన్ని ధర్మాలు మాయయే. కాబట్టి, సంవృత్తి సత్యం. కాని, షెన్ (Shen) అంటే మనస్సారం వాస్తవం. శూన్యం కాదు. ఇది పరమార్థ సత్యం.

ఏడో దానిని యుఫక్తై సతీర్థుడైన యూ టావో స్యు (Yu Tao Sui) బోధించాడు. ఇతని ప్రకారం హేతువుల సంఘాతంచే సత్తు కలుగుతున్నది. ఇది విడి పోవడం వల్ల, అసత్తు పర్యవసిస్తుంది.

వీరి తర్వాత 343 - 413 లో జీవించిన కుమారజీవుడు, అతని శిష్యుడై 384 - 414లలో జీవించిన సెంగ్‌ఛావో లు బౌద్ధమతాన్ని విస్తృతంగా బోధించారు. సెంగ్ ఛావో ' ప్రజ్ఞ ' జ్ఞానమా కాదా అని మీమాంసించి, అది నిర్గుణాన్ని గురించిన జ్ఞానం, జ్ఞానం కానట్టిది అని చెప్పడం జరిగింది. వీరే కాక, కుమారజీవుని మరొక శిష్యుడైన క్రీ.శ. 360 - 434లలో జీవించిన ఛుటావొషెంగ్ (Chu Tao Sheng); 334 - 416ల మధ్య జీవించిన షెంగ్, హీయువాన్ (Sheng Hei Yu wan)లు ; క్రీ.శ. 596 - 664 లలో జీవించిన హ్యుయన్‌త్సాంగ్ (Hiuen Tsang); 647 - 712లలో జీవించిన ఫాటంగ్ (Fa T'sang); క్రీ.శ. 578 - 597లలో జీవించిన ఛిహ్‌కై (Chih Kai) చైనాలో బౌద్ధ సంప్రదాయాలను, తాత్త్విక వివేచనలను పోషించి, సిద్ధాంతీకరించి, ప్రచారం చేశారు. అట్లాగే క్రీ.శ. 520లో భారతదేశం నుండి చైనాను చేరిన బోధి ధర్ముడు, చైనాలో బౌద్ధమతానికి ఎనలేని సేవచేశాడు. ఇతడు కాంచీపురానికి చెందినవాడు , పల్లవ రాజ వంశానికి చెందినవాడని ఐతిహ్యం. అతడు చైనాలో తొమ్మిది సంవత్సరాలు బౌద్ధాన్ని ప్రచారం చేశాడు. షెన్ కువాంగ్ (Shen Kuang) అతని ప్రధాన శిష్యుడు.

లంకావతార సూత్రం, వజ్రచ్ఛేదిక, ప్రజ్ఞా పారమిత మొదలైన బౌద్ధ సంప్రదాయిక గ్రంథాల దృష్ట్యా, చైనాలో గల బౌద్ధమతం మహాయాన మతానికి వేరొక శాఖగా రూపొందిన ధ్యాన బౌద్ధమత మని అవగాహన చేసుకోవచ్చు. క్రీ.శ. 618 - 713 లలో వున్న హ్యు - నెంగ్ (Hui Neng) ఈ ధ్యాన బౌద్ధమతాన్ని చైనాలో బాగా వ్యాప్తిపర్చాడు. దీనిలో అమితాభా మతం, చెన్ యెన్ (Chen yen) అని పిలువబడిన మంత్రయానం, ధ్యాన బౌద్ధ పరిణామాలు విశేష వ్యాప్తిని , ప్రాచుర్యాన్ని , జనాదరణను పొందగలిగాయి. వీరు ధ్యాన బౌద్ధులను, అమితాభుడు మొదలైన బౌద్ధ పురుష దేవతలను, తార మొదలైన స్త్రీ మూర్తులను పూజించినట్లు, సాధనమాలి మొదలైన గ్రంథాల ద్వారా వెల్లడవుతుంది.

ఈ రకంగా మహాయానంతో ప్రారంభమైన చైనా బౌద్ధమతం, ధ్యాన బౌద్ధమతంగాను, అమితాభ మతం గాను, మంత్రయానంగాను రూపొంది, విశేష మన్ననలను, పూజలను పొంది, యీ నాటికి ప్రసిద్ధంగా నిలబడింది.

### 17.2.14 సమాజంపై మత వ్యవస్థ ప్రభావం

చైనా సమాజంపై తత్త్వవేత్తల ప్రభావం కన్న మతాల ప్రభావమే హెచ్చుగా వుండేది. తొలిరోజుల్లో ఉండే ప్రేతాత్మారాధన, దివ్యత్వాపాదన వంటి సంప్రదాయాలు వ్యక్తుల మీద ఎంతో ప్రభావాన్ని చూపాయి. తత్త్వవేత్తలు అనేకులున్న కన్ఫ్యూషియస్ మార్గం ప్రభావమే హెచ్చుగా వుండేది. ఉదాహరణకు సంస్కరణ పదాన్ని చెప్పిన లావొత్సుగాని, విశ్వమానవ సౌందర్యాన్ని చెప్పిన మోత్సు కాని, ప్రజాభిమానాన్ని పొందలేదు. కాని, కన్ఫ్యూషియస్ కుటుంబ జీవనం ఆధారంగా ధర్మాన్ని నియంత్రించడం వల్ల, అందరూ దాన్ని స్వీకరించారు. బౌద్ధమతం చైనాలో అడుగుబెట్టాక జ్ఞాన ప్రధానంగా గల కన్ఫ్యూషియస్ మతానికి బదులుగా, శూన్యవాదమే అయినా ధ్యాన బౌద్ధం పేర ప్రతిపాదించిన ప్రపత్తి తావుగా చేసుకొని, విగ్రహారాధనా పూర్వకమైన సుస్థిర మత వ్యవస్థను చైనా వారు పొందగలిగారు. తద్రీతిగా భారతదేశం వదలిన బౌద్ధానికి చైనా ప్రధాన కేంద్రంగా రూపొందింది..

---

### 17.3 సంగ్రహంగా

---

1. చైనాలో టి (Ti)మొదలైన తెగల దేవతల నుండి హౌచి (Hauchi) మొదలైన కులీన దేవతల వరకు ప్రాబల్యం వచ్చింది.

2. చైనాలో షాన్ రాజవంశ కాలంలో ఉన్నతంగా ఎక్కువగా దివ్యత్వాన్ని ఆపాదించుకొని, వారిని వారు 'టైయెన్ ట్జు ' (Tien Tzu) అని పిలుచుకొనేవారు.

3. జోస్యాలు మతాచారాల్లో ముఖ్యమైనవి.

4. నరబలులు, వివిధ రకాల జంతుబలులు వుండేవి.

5. భూమిని ఆరాధన చేయడంలో 'షీ' (she) పూజ ముఖ్యమైంది.

6. 'ఇచింగ్' (Iching) అనే పరిణామ పురాణం ప్రకారం, స్త్రీ పుంస్త్వ భేదం గలిగి, యింగ్ - యాంగ్ (Ying yang) వాదానికి దారితీసింది.

7. ప్రేతాత్మారాధన కూడా తొలిదశల్లో ఎంతో ముఖ్యమైంది.

8. సామూహిక సమాధులతో బాటు , ఉప సమాధులు కూడా ఉండేవి.

9. వ్యక్తిగత సమాధులకు అన్ని రకాల వస్తువులు, దాస దాసీ జనంతోసహా సమర్పించేవారు.

10. చౌ వంశ కాలంలో వ్యాప్తి పొందిన మానవ ప్రాబల్యం తత్త్వ వివేచనకు తోడ్పడింది.

11. కన్ఫ్యూషియస్ ఉత్తమ మానవుని సమాజాన్ని కోరాడు.

12. మెన్షియస్ ఉత్తమ మానవుడు ఎట్లా కాగలడో వివరించాడు.

13. హ్స్యుట్జు మానవునిలోని అరిషడ్వర్గాల ప్రభావాలను చూపి, మానవుని సంస్కరించుకొనవలసిందిగా చెప్పాడు.

14. లావొట్జు ఆ సంస్కరణ ప్రధాని టావొ (Tao) అన్నాడు.

15. లావొట్జు శిష్యుడైన చువాంగ్‌ట్జు స్వర్గపథాన్ని నిరంతర పరిణామమని చెప్పి, దానిలో వైయక్తికత్వాన్ని, విశ్వత్వాన్ని ఏకం చేశాడు.

16. మోట్జు (Motzu) నైతికతను, ప్రయోజనాత్మకతను కలిపి, విశ్వజనీన భావాలను బోధించాడు.

17. తార్కికుల పరిణామంలో సాపేక్షత, కాలం, ఉనికి వంటి దానిని గుర్తించి, మోట్జు వాదాన్ని బలపరిచాడు.

18. ఇంగ్ - యాంగ్ (ying yang) వాదులు బలవత్తత, బలహీనత మధ్య ఏర్పడ్డ ఒక వారధిగా సమాజాన్ని, మతాన్ని గుర్తించారు.

19. నైయాయికులు మానవ జీవితంలో న్యాయ, ధర్మాల ప్రాముఖ్యాన్ని, పరిపాలనావశ్యకతను ఎంతో ప్రస్తుతించారు.

20. బౌద్ధమత వ్యాప్తి జరిగాక, తాత్త్విక చింతనా ప్రాముఖ్యం తగ్గింది.

21. క్రీ.శ. 221 - 589 ల మధ్య చైనాలో ఏడు తరహాల బౌద్ధతాత్త్విక సంప్రదాయాలు పెంపొందాయి.

22. తర్వాత కుమారజీవుడు, బోధి ధర్ముడు మొదలైన వారి కృషివల్ల, చైనాలో ధ్యాన బౌద్ధం, అమితాభమతం, మంత్ర యానం ఎంతో వ్యాప్తి చెందాయి.

BRAOU

23. ఫలితంగా బౌద్ధం ఒక ప్రధాన మతంగా ఈనాటికీ ఉండే స్థితిని చేరుకొన్నది.

24. సమాజం మీద తాత్త్వికుల ఫలితాల కన్నా, బౌద్ధ ఆచార ఆరాధనా ప్రభావమే హెచ్చుగా పెంపొందింది.

## 17.4 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.**

1. కన్ఫ్యూషియస్ జీవితం, వాదం, సిద్ధాంతాలను వివరించండి.

2. తొలి చారిత్రక దశలో చైనాలో మత వ్యవస్థను సమీక్షించండి.

3. చైనాలోని మతాచారాలు, బౌద్ధ మత పరిణామం, వ్యాప్తిని పరిశీలించండి.

**II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. టావో వాదం

2. లావో సిద్ధాంతాలు

3. మో వాదం

4. షాన్ రాజవంశ కాలంలో మతాచారాలు

5. చౌ రాజవంశ కాలంలో మతాచారాలు

6. చైనాకు భారతదేశానికి తత్త్వ వివేచనలో పోలికలు, భేదాలు

## 17.5 ఉపయుక్త గ్రంథాలు


**Encyclopaedia Britannica, vol. V.,** P. 570

Paul Elide : **The Encyclopaedia of Philosophy,** 1967

Miraya Elide : **The Encylopaedia of World Religion, vol.3,** p. 257.

K. Satchidananda Murthy (Ed) : **Philosophical Treatises & Religions, vol. 7 , Telugu**

Paul H. Clyde & B.F. Beers : **The Far East,** 1981.

Bodo Vithoff : **Introduction To Chinese History From the Earliest Times,** 1912, London.


## 17.6 పదకోశం

టైనీలే ద్దాటైయెన్ : (Tien) స్వర్గం

టి : (Ti) షాన్ రాజుల కాలంలో తెగల దేవుడు

చున్ట్జు (ChunTzu) : రాజకుమారుడు

టావో : (Tao) సన్మార్గం

జెన్: (Jen) : మానవత్వం

ఇ : (I) నైతికత

లి : (Li) : ఆత్మవిశ్వాసం

చుంగ్ చంగ్ (Chung - Chang) : మానవత్వ పెంపుదల సూచిక

షు : (Shu) : నాస్తికవాదం

చంగ్ : (Chung) : కేంద్రీకరణ

టుజాన్ (Tuzun) : ఆత్మ

టె : (Te) : గుణం

వు - వీ : (wu - wei) : అకర్మణ్యత

టావో : (Tao) దారి లేదా గమ్యం

టావోచియా: (Tao chia) టావో వాదం

యిన్ : (yin) : సృష్టిలోని బలహీన భావాలు

యాంగ్ : (yang) సృష్టిలోని బలమైన భావాలు : సౌహార్ద్రత

వీ: (Wei) : ప్రేతాత్మారాధన గుర్తులు తెలుపునది

హౌ చి : (Hauchi) : చౌ వంశస్థుల పౌరాణిక దేవుడు

ఇచింగ్ : (Iching) : పరిణామ పురాణం

కున్: (Kun) : చీలిన రేఖలు, స్త్రీత్వ ప్రతీకలు

చియెన్ : (Chien) : చీలని రేఖలు, పుంస్త్వ ప్రతీకలు

షి : (She) : ఊరి మధ్య పూజార్హమైన మట్టి దిబ్బ.

టైయెన్ మింగ్ : (Tien Ming) : స్వర్గాధిపత్యం

టైయెన్ ట్జు : (Tien Tzu) : స్వర్గ పుత్రుడు

మియావొయు : (Miao yu) : మనస్సు పొందే నిర్వికార స్థితి

షెన్ : (Shen) : మనస్సారం

BRAOU

## భాగం - 18 : కళలు - వాస్తువు

విషయక్రమం

18.0 లక్ష్యాలు

18.1 పరిచయం

18.2 కళలు

18.2.1 పింగాణీ పరిశ్రమ

18.2.2 గాజు పరిశ్రమ

18.2.3 పట్టు వస్త్రాల, అల్లకం, తివాచీల తయారీ

18.2.4 నగల తయారీ

18.2.5 చిత్రలేఖనం

18.2.5.1 చిత్రలేఖనం : క్రీ.శ. 264 వరకు

18.2.5.2 ఇళ్ళలో అలంకరణ

18.2.5.3 హాన్ వంశం నుండి చిత్రలేఖనం

18.2.5.4 చిత్రలేఖన పద్ధతులు

18.2.6 సాంకేతిక శాస్త్ర పరిణామాలు

18.2.7 సాహిత్య కళ

18.2.8 వాస్తు కళ

18.3 సంగ్రహంగా

18.4 పరీక్ష నమూనా ప్రశ్నలు

18.5 ఉపయుక్త గ్రంథాలు

18.6 పదకోశం

## 18.0 లక్ష్యాలు

1. చైనాలో అభివృద్ధిచెందిన పారిశ్రామిక కళ అయిన పింగాణీ పరిశ్రమ, గాజు పరిశ్రమల గురించి తెలుసుకోడం.

BRAOU

2. చైనాలో అభివృద్ధి చెందిన పట్టు వస్త్రాల తయారీని, దాని లోని లలిత కళాస్ఫూర్తిని గ్రహించడం.

3. చైనాలోని చిత్రలేఖనం, నగల తయారీలను గూర్చి అవగాహన పొందడం.

4. చైనా నాగరికత పెరుగుదలలో వచ్చిన సాంకేతిక, శాస్త్ర పరిణామాలను గ్రహించడం.

5. చైనాలో వ్యాప్తి చెందిన సాహిత్య కళను గురించి తెలుసుకోడం.

6. చైనాలో అభివృద్ధిచెందిన నిర్మాణాల స్వభావాన్ని గూర్చి, నిర్మాణాల విశేషాలను గురించి స్పష్ట అవగాహనను పొందడం.

## 18.1 పరిచయం

చైనా దేశం పేరు చెప్పగానే ఎవరికైనా వెంటనే స్ఫురించేది ప్రపంచపు వింతలలో ఒకటైన, పెకింగ్ నగరానికి చెందిన చైనా మహాకుడ్యం (Great Wall of China) . ఆ నగరానికి, రాజ్యానికి, రక్షణ కోసం నిర్మించిన అటువంటి లౌకిక నిర్మాణాలే కాక, చైనాలో వ్యాప్తి పొందిన మహాయాన బౌద్ధమతానికి చెందిన అనేక సంఘారామాల వంటి మతపరమైన భవనాలను కట్టించడం జరిగింది. ఇవన్నీ చైనాలోని వాస్తు నిర్మాణ ప్రక్రియలుగా పెంపొంది వుండగా, అనేక పరిశ్రమలు హాన్ (Han), టాంగ్ (Tang) , సుంగ్ (Sung) , మింగ్ (Ming) మొదలైన రాజవంశీకుల చారిత్రక అనుక్రమణికలో పరిణమించాయి. హ్వాంగ్‌హో - యాంగ్‌ట్జె - కియాంగ్ నదీ పరీవాహక ప్రాంతాలలో విస్తృతంగా వ్యాప్తి పొందిన సన్నని, మృదువైన, పసుపుపచ్చని మట్టి, చైనా చేతిపనులలో ఎంతో ప్రాముఖ్యం వహించిన పింగాణీ పరిశ్రమ అభివృద్ధికి ఎంతో దోహదం చేసింది . అనేక నమూనాలతో కూడిన అలంకరణ సహితమైన వస్తు విశేషాలు చైనా సంస్కృతికి, ఆర్థిక వ్యవస్థకు రెండింటికి - అలంకార ప్రాయంగా ఉండేవి. అట్లే, చైనా చీనాంబరాలు అనే పేరిట భారతదేశం మొదలైన దక్షిణ ఆసియా రాజ్యాలన్నింట విశేష ప్రచారాన్ని పొందిన చైనా వస్త్రాలు నిరుపమానమైనవి. తొలిరోజులలో పట్టును కొనుక్కుని , దాని దారాలను తీసి, వస్త్రాలను చేసి, అలంకరణ చేయడంలో వారెంతో విశేష ప్రజ్ఞను, అనుభవాన్ని పొంది, పట్టు పరిశ్రమ చైనా వారి గుత్తాధిపత్యంలాగే పెంపొందింది. పట్టు వస్త్రాలు అనే విశేష్యానికి, ' చీనాంబరాలు ' అనే మాట పర్యాయపదంగా మారింది. అంటే, చైనా వారి వస్త్రాల ప్రాబల్యం, ప్రాముఖ్యం, ప్రత్యేకత ఏ యే రీతులలో ఉన్నాయో అవగతమవుతుంది. అట్లాగే, చైనా సంస్కృతిలో చిత్ర లేఖనంతో కూడా కొన్ని ఆలంకారిక సంకేతాలు, ఆలంకారిక నమునాలు, చైనా నాగరికతా దీప్తిని ద్విగుణీకృతం చేసే అంశాలు. ఈ రకంగా చేతిపనులు, వస్త్రాలు మొదలైనవి ఎంతో చారిత్రకమైన గొప్పదనాన్ని పొందాయి. చైనా వారి పింగాణీ పరిశ్రమ, గాజు పరిశ్రమ, పట్టు వస్త్రాల తయారీ, నగల తయారీ, చిత్రలేఖనం మొదలైన కళలను, చైనా వారి హస్తకళల అభివృద్ధికి గొప్పదనంగా భావించాలి. అవేగాక, చైనాలో పరిణమించిన తుపాకి మందు తయారీ, బాంబుల తయారీ, అచ్చు యంత్రం తయారీ, మొదలైనవి వారి శాస్త్ర సాంకేతిక దృక్పథానికి మచ్చుతునకలు. ఈ రకమైన అంశాలను గురించి యీ క్రింది విధంగా తెలుసుకోవచ్చు.

## 18.2 కళలు

చైనాలో కళలన్న ఎక్కువగా పారిశ్రామికమైనవే. వానిని ఈ క్రింది విధంగా వివరించొచ్చు.

### 18.2.1 పింగాణీ పరిశ్రమ

చైనాలోని యీ పింగాణి పరిశ్రమ ఎంతో స్థానికమైనది. దీనిలో కుండలు, జాడీలు, కప్పులు వంటి వివిధ

రకాలైన మట్టి, రాయి, పోర్సిలిన్ లతో చేయబడిన వస్తువులు చేరతాయి. చైనాలో కుండల వంటి మృణ్మయ పాత్రలనన్నిటినీ, టావో (Tao) అనే మాటతో పిలుస్తారు. ఆ మాటకు 'ఆవం ' (కుమ్మరి ఆవం - Kiln) అనేది సంకేతం. ఆ మాట మాత్రమే కాక, యావ్ ( yao = ఆవం అనే అర్థం); కువాన్ యో (Kuan yao) అంటే, imperial ware అనే రెండు మాటలు మృణ్మయ పాత్రలను సూచిస్తాయి. 'వ ' (Wa) అనే మాటకు కుండ అని అర్థం. కేవలం మట్టితో చేసినవి మాత్రమే కాక, ఎంతో సన్నని రేణువులతో ఉండి, గట్టి పేశంలా తెల్లగా ఉండి, త్వరగా విరగని పోర్సిలెన్, పూర్తిగా చైనా వారి సృష్టియే. ఇది పారదర్శకమైన (Transperancy) గుణాన్ని తప్పక కలిగి వుండాలి. అది లోపించినట్లయితే పోర్సిలెన్ కాబోదు.

హాన్ రాజవంశ కాలంలో ( క్రీ.పూ. 206 క్రీ.పూ 220 ) 'పోర్సిలెన్' పదార్థాన్ని చైనా గ్రంథాలు సూచించాయి. దానిని వారు 'ట్జు ' (Tzu) అనేవారు. ఇది కత్తితో బరకడానికి వీలు కాని వస్తువు. దాని మీద లోహపు, లేదా అలోహపు పదార్థంతో కొడితే, స్పందనపు స్వరం వస్తుంది. చైనాలో ముదురు రంగులు గల రాతి పాత్రలను, పోర్సిలెన్ నుండి వేరుగా ఉంచేవారు. చైనాలో తొలి మృణ్మయ పరిశ్రమల గురించి, ' చౌ ' రాజవంశ కాలానికి చెందిన కఓకుంగ్ చి (Kao - Kung - Chi) అనే పుస్తకంలో వివరించడం జరిగింది. పూర్తిగా చేతితో కుండలను సారెపై చేసి , ఆమంలో కాల్చే కులాలులను (కుమ్మరి వారిని) 'టాఓ జెన్ ' (Ta'o Jen) అని పిలిచేవారు. అట్లా కాక, మూసల వంటి నమూనాలతో పాత్రలను చేసేవారిని 'ఫంగ్ జేన్ ' (Fang - J'en) అని వ్యవహరించేవారు. అన్ని దేశాలలో వలెనే చైనాలో కూడా మృణ్మయ పరిశ్రమ చేతితో చేసిన కుండలు (Hand - made pottery), సారెపై తిప్పిన (Wheel thrown) కుండలు , ఎండబెట్టిన ఇటుకలు, కాల్చబడిన ఇటుకలు మొదలైన దశలుగా అభివృద్ధి చెందింది. చైనా సంస్కృతిలో కుమ్మరిసారెను కనిపెట్టడం ఎంతో ఘనమైనది. వారి ప్రకారం 'హ్వాంగ్ టి ' (Huang - Ti) అనే తొలి చక్రవర్తి ' మట్టి ని కాల్చే కళను ' నేర్పాడు. ప్రాచీన చక్రవర్తులలో ఒకడైన 'షన్' (Shun) రాజ్యానికి రాక ముందు కులాలుడట ! క్రీ.పూ . 12 వ శతాబ్దంలో చౌ రాజ వంశ స్థాపకుడైన 'వువాంగ్' (Wu - Wang) తాను 'షన్' వారసులలో ఒకడినని చెప్పుకొన్నాడు. అంతేకాక, హోనాన్ (Honan) రాజ్యంలో ఇప్పుడు 'షెన్‌షౌపు ' (Chen - Chou Fu) అని పిలువబడతున్న 'షెన్ ' (chen) అనే మాన్యాన్ని 'షన్' (Shen) పూజ కోసం కేటాయించాడు. లియాంగ్ రాజ వంశస్థాపకుడైన వూటి (Wuti) ఐదో సంవత్సర కాలంలో, మట్టితో చేసిన ఒక శవ పేటికను తవ్వి బయటకు తీసినట్లు, చైనా చరిత్రలో చెప్పడం జరిగింది. మృణ్మయ పాత్రలను ప్రాచీనుల పూజల్లో మాంస నివేదనకు, మద్య సమర్పణకు వినియోగించేవారు. చౌ రాజవంశ కాలంలో కుండలు మొదలైన మృణ్మయ పాత్రలు, పై భాగంలో అనేక శాసనాలను కలిగి వుండేవి. అలాగే 'హాన్' రాజవంశ కాలంలో మృణ్మయ పాత్రల మీద, ఇటుకల మీద తేదీలు ముద్రించబడి వుండేవి. ఇటుకల వంటివి పౌరాణిక వ్యక్తుల ప్రతిమల పీఠాలకు సంబంధించి ఉండేవి. ఈ ఉదాహరణలన్నీ చైనా సంస్కృతిలో మృణ్మయ పాత్రలకు ఉండే ఉన్నత స్థానాన్ని తెలుపుతున్నాయి.

చైనాలో మృణ్మయ పాత్రలు, మృణ్మయ వస్తువులు, వాస్తుకళలో ఎంతో ప్రయోజనాత్మకమైన, అలంకరణాత్మకమైన అనుబంధంగా ఉండేవి. చైనాలో ఈ పాత్రల తయారీలో వాడే రంగులన్నీ పొడి పొడిగా నూరి, దానికి సీసం రజను కలిపేవారు. వస్తువులను ఆమంలో పేర్చాక, దానికి నిప్పు పెట్టేవారు. ఒక ప్రత్యేక స్థితిలో ఆమంపై భాగంలోని రంధ్రాల గుండా రంగుల మిశ్రమాలను ఆమంలోకి పోసేవారు. అవి కరిగి, పెంకులు మొదలైన వస్తువులపై పేరుకొని, వాటికి ఎంతో అందాన్నిచ్చేవి. ఈ పూతలలో వాడే రంగులు ఒకటిగా గాని, అనేక రంగుల మిశ్రమంగా గాని ఉండేవి. తేదీపరంగా ఎప్పుడు చైనాలో ఈ రకమైన మృణ్మయ పాత్రల అలంకరణ చోటు చేసుకుందో, ఖచ్చితంగా చెప్పలేం. కాని, దొరికిన పాత్రల పరిశీలన వల్ల, ఇంచుమించు క్రీ.పూ. 206 - క్రీ.శ. 220 లకు, అంటే 'హాన్ ' రాజవంశ కాలానికి చెంది వుండగలదని గ్రహించొచ్చు.

BRAOU

ఈ రకమైన పాత్రలలో వాడే రంగులు ముదురు ఆకుపచ్చ, ముదురు ఎరుపు, పసుపుపచ్చని, ఎర్రని రంగుల ఛాయలు. అలంకరణలలో 'డ్రాగన్' (Dragon) శిరస్సులు, పెద్ద పులులను వేటాడే విలుకాళ్ళ వంటివి కూడా తరచుగా ఉండేవి.

కియాంగ్సు రాష్ట్రానికి చెందిన యిస్సింగ్ యా ఓ (Yi-Hsing-Yao) ; క్వాంగ్‌టుంగ్ రాష్ట్రానికి చెందిన క్వాంగ్ యా ఓ (Kuang - Yao) రెండూ ప్రధాన కేంద్రాలుగా, చైనాలోని మృణ్మయ పరిశ్రమ అభివృద్ధి చెందింది. యిస్సింగ్ యా ఓ లో టీ పాత్రలు, అలంకరణ సామాగ్రికి చెందిన వస్తువులు, 'డీలక్స్ ' (Deluxe) వస్తువులు, అత్తరు బుడ్ల వంటివి తయారయ్యేవి. ఈ కేంద్రం 'మింగ్ ' రాజ వంశానికి చెందిన ' షెంగ్ టె ' (Sheng - Te) కాలంలో కుంగ్‌షున్ (Kung - Chun) అనే వ్యక్తి స్థాపించాడు. క్వాంగ్ యా ఓ లో ఎక్కువ రాతి పాత్రలు, జాడీల వంటివి రూపొందించబడేవి. చైనాలో ఈ రకంగా మృణ్మయ, 'పోర్సిలెన్' , పాత్రల తయారీ, 960 - 1280 మధ్య, 'సుంగ్' రాజ వంశ కాలం నుండి, యువాన్ (Yuan) రాజ్యస్థాపకుడయిన కుబ్లై ఖాన్ కాలం వరకు, ఎంతో ప్రాశస్త్యాన్ని పొంది, జాతీయ కళగా, పరిశ్రమగా రూపొందింది.

చైనాలో మృణ్మయ, రాతి, పోర్సిలెన్ పాత్రల మీద గల సంకేతాలను ఆరు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి : 1). తేదీల చిహ్నాలు ; 2) గదుల , వసారాల, భవనాల చిహ్నాలు (Hall marks) 3) అంకిత, అభినందనపరమైన చిహ్నాలు ; 4) పొగడ్త చిహ్నాలు; 5) కుమ్మరుల గుర్తులు; 6) ఇతర గుర్తులు , బొమ్మలు. తేదీలలో శకాలకు చెందిన ఇ యు (Iyu) ; హ్సిన్‌షౌ (Hsin - chow) ; పింగ్ షూ (Ping - Hsu) ; కు యి యు (Kuei-yu) వంటివి మింగ్, చింగ్ రాజ వంశాలకు చెందిన హాంగ్‌వు (Hang wu); యుంగ్‌లో (Yung Lo) ; హ్స్వాన్‌టె (H'swan Te) వంటి ప్రభువుల గుర్తులను గమనించగలం. అలాగే అంకిత, అభినందనాత్మక చిహ్నాలలో టాచి (Tachi) అంటే Great Good Luck ; ' షాంగ్‌మింగ్ ఫుకుయి ' (Shang Ming Fu Kui) అంటే, దీర్ఘాయువు, సంపదలు, గౌరవాలు ; చి (chi) అంటే, రాజాజ్ఞ ప్రకారం ; ఫులుషౌ (Fulu Chau) అంటే, సంతోషం, హోదా, దీర్ఘాయువు వంటి వానిని చూడగలం. ఈ రకంగా చైనాలో మృణ్మయ పరిశ్రమ ఎంతో వున్నతమైన సాంస్కృతికాంశంగా రూపొందింది.

## 18.2.2 గాజు పరిశ్రమ

చైనాలో గాజును 'పోలి' (poli) అని, 'లియులి' (Liyuli) అని పిలిచేవారు. 'పోలి' అంటే రంగులేని, తెల్లని పారదర్శకమైన గాజు. దీనినే ' పోతి' (Poti) అని కూడా అప్పుడప్పుడు వ్రాసేవారు. 'లియులి' అంటే రంగుల ఛాయలను కలిగిన గాజు. 'లియులి' అనే మాట 'ఫిలియులి ' (Fei-Liu-Li) లేదా పిలియులి (Pei-liu-Li) అనే వైడూర్యానికి (Lapis Lazuli) కి ప్రత్యామ్నాయంగా వుండేది. 'హాన్' (Han) రాజవంశ కాలంలో రోమన్ సామ్రాజ్యాన్ని టాచిన్ (Ta - chin) అని పిలిచేవారు. అలెగ్జాండ్రియాకు చెందిన కర్మాగారాల నుండి గాజును చైనా వారు దిగుమతి చేసుకొనేవారు. వీలు ఓ (Wei Luo) చారిత్రక ఆధారం వల్ల, చైనా వారు పది రకాల రంగులు గల గాజును దిగుమతి చేసుకునేవారని , ఆ రంగులు ధవళం, తెలుపు, నలుపు, ఆకుపచ్చని, పసుపుపచ్చని, నీలి, నారింజ, పచ్చని,లేతనీలి, ఎరుపు మరియు పొగఛాయలోని గోధుమకు చెంది ఉండేవని తెలుస్తున్నది. వారు క్రీ.శ. 5వ శతాబ్ది నాటికి గానీ, గాజు వస్తువులను తమంత తాము తయారు చేసుకొనేటటువంటి నైపుణ్యాన్ని సంతరించుకోలేకపోయారు.

చైనాలో ఉత్తరాది చరిత్ర అయిన పీషి (Pei-Shih) ప్రకారం, టయూటి (Ta-Yueh-Ti) నుండి వచ్చిన వర్తకులు కొన్ని వస్తువులను కలిపి గాజును చేసేవారు. కాని, దక్షిణాది చరిత్రల ప్రకారం క్రీ.శ. 424 - 454 ల మధ్య పాలించిన వెంటి (Wem-Ti) కాలంలో చైనాలో గాజు తయారీ ప్రారంభమైంది.

ఆకుపచ్చని గాజుతో చేసిన నిలువెత్తు అద్దాలు, గోధుమ రంగు పాత్రలు, స్ఫటికాన్ని పోలిన ద్రాక్షాసవ పాత్రలు (Chia-Shui-Ching) , జేడ్, అగేట్ వంటి రాళ్ళు పొదిగిన గాజు వస్తువులను తయారు చేసేవారు. మొత్తం మీద చైనాలో గాజు వస్తువుల తయారీ ఒక నిర్లక్ష్య ధోరణిని కలిగి వుండేది. ఎల్ ఎడ్రిసి (El Edrici) అనే సిసిలీ దేశంలో క్రీ.శ. 1154లో రాయబడిన భూగోళ గ్రంథం ప్రకారం, చైనాలో డ్జాన్‌కౌ (Djan Kow) నగరంలో గాజును తయారుచేసేవారని తెలుస్తున్నది. చైనాలో తయారైన గాజు వస్తువులన్నీ చిన్న చిన్నవిగానే ఉండేవి.

### 18.2.3 పట్టు వస్త్రాల, అల్లికల, తివాచీల తయారీ

చైనాలో నేతతో చేసిన వస్త్ర విశేషాల్లో, పట్టు ఎంతో ఉన్నత స్థానాన్ని పొంది వుంది. చైనీయుల భాషలో దీన్ని 'స్సు' (Ssu) అని పిలిచేవారు. పట్టు వస్త్రాలకు రంగు రంగుల నమూనాల నిచ్చిన తొలి దేశం చైనా దేశమే. పట్టు వస్త్రాలను 'చిన్' (Chin) అని, అల్లికలను 'హ్సియు' (Hsiu) అని పిలిచేవారు. అల్లికలలో బంగారు, రాగి తీగలను కూడా కలిపి, అల్లిక పనులను చేసేవారు. చైనా దేశంలోని ప్రాచీన గ్రంథాల్లో, జెండాల మీద, బ్యానర్ల మీద, అధికారుల బట్టల మీద, సామ్రాజ్య చిహ్నాల మీద గల అనేక రకాలయిన అల్లికలు వుండేవి. 'షాంగ్' (Chang) అనే అలంకరణలతో కూడిన పన్నెండు రకాల చిహ్నాలు ఉండేవి. షుచింగ్ (Shu - Ching) అనే చరిత్ర గ్రంథంలో, ఈ రకమైన అలంకరణలను గురించి వివరించడం జరిగింది. క్రీ.శ. 1621-1627 లకు చెందిన 'పోవుయ ఓలాన్' (Powu - Yao - lan) అనే పుస్తకంలో ప్రాచీన పట్టు వస్త్రాలను 'చిన్' అని, 'హ్సియూ' (Hsiyu) అని వర్గీకరించడం జరిగింది. డ్రాగన్లు, పక్షులు, పూలు, రాళ్ళు, ద్రాక్షల వంటి వివిధ అలంకరణలను 'హాన్' వంశ కాలం నుండి వాడేవారు. 'సుంగ్' వంశ కాలంలో ఏభైకి మించిన అలంకరణ నమూనాలకు ప్రశస్తి వుండేది.

తివాచీల తయారీ పట్టువస్త్రాల తయారీతోను, అల్లికలతోను ఎంతో సంబంధాన్ని కలిగినది. ఇతర ఐరోపా దేశస్థుల వలెనే, తివాచీల తయారీని చైనా వారు పశ్చిమ ఆసియా రాజ్యాల నుండి నేర్చుకొన్నారు. ఈ తివాచీల తయారీలోని అలంకరణలన్నీ ఎక్కువ భాగం చైనా జాతీయేతరమైనవే. దీని తయారీ ఎరుపు, నలుపు అంచులుగల ఒంటె బొచ్చుతో చేస్తారు. చైనాలో కాంగ్ (K'ang) అని చెప్పే చిన్న చిన్న ఎత్తయిన పీఠాలు, సభా వేదికలు మొదలైన వానిలో ఈ తివాచీలను వినియోగిస్తుంటారు. బౌద్ధ సంఘారామాల్లో భిక్షువుల, భక్తుల ప్రార్థనా సమావేశాల్లో ఎన్నో చదరపు గజాల వైశాల్యం ఉండే తివాచీలను, కంబళ్ళను వాడటం జరుగుతుంటుంది. పట్టు వస్త్రాల తయారీ, అల్లిక పనులు, తివాచీల తయారీ అనే మూడూ, మూడు మితులు (Dimensions) గా చైనాలోని వస్త్ర పరిశ్రమ అభివృద్ధి చెందింది.

### 18.2.4 నగల తయారీ

ఇతర తూర్పు దేశాలలో వలెనే, చైనాలో కూడా నగలకు ఎంతో ప్రాముఖ్యం వుంది. ఇవి కేవలం అలంకరణకే కాక, జంగమమైన ఆస్తిగా కూడా వ్యవహరించబడుతుండేవి. హారాలు, గాజులు, అందెలు, వడ్డాణాల వంటివి, స్వచ్ఛమైన బంగారంతో చేయబడుతుండేవి. ఇవే కాక, దుద్దులు, కుండలాలు, జడ పిన్నుల వంటివి కూడా, చైనావారి అలంకరణలో ఎంతో చోటు చేసుకొన్నాయి.

చైనాలోని యీ నగల తయారీలో ఫిలిగ్రి పని ఎంతో నైపుణ్యాన్ని పొందింది. చిన్న చిన్న రేకులుగా సాగగొట్టి, బంగారు, వెండి లోహాలతో యీ పనిచేసేవారు. ఈ ఫిలిగ్రీ పనిలో అలంకరణ వివరాలను విడివిడిగా పోతపోసి, వస్తువులను అమర్చేవారు. అదేవిధంగా, పూత పోయడం (Enamelling) కూడా ప్రచారంలో ఉండేది. రాళ్ళు, రత్నాలు పొదిగిన అనేక ఆభరణాలు తయారుచేయబడుతుండేవి. నవ రత్నాలను కేవలం మెరుగుపెట్టి,

పొదిగేవారు. రోమన్ల వలెనే చైనావారు కూడా ముత్యాల దండలు, హారాల వంటి వాని పట్ల, ఉంగరాల వంటి చిన్న చిన్న అలంకరాల పట్ల, ఎంతో ఆసక్తిని కలిగి వుండేవారు.

### 18.2.5 చిత్రలేఖనం

చైనాలో చిత్రలేఖనం మూడు దశలుగా అభివృద్ధి చెందినట్లు, పరిణమించినట్లు చెబుతారు. తొలి దశ ప్రాచీన కాలం నుండి క్రీ.శ. 264 వరకు, రెండో దశ క్రీ.శ. 265-900 మధ్య కాలం, మూడో దశ క్రీ.శ. 960 - 1643 మధ్య కాలం, వాని వివరాలను క్రింది విధంగా గ్రహించొచ్చు.

#### 18.2.5.1 చిత్రలేఖనం : క్రీ.శ. 264 వరకు

చైనాలో చిత్రలేఖనాన్ని పౌరాణికంగా పసుపుపచ్చని చక్రవర్తి అనే పాలకుని మంత్రి అయిన షిహ్వాంగ్ (Shih - Huang) ప్రారంభించినట్లు చెబుతారు. అతడు చైనాలో తొలి చిత్ర లిపిని పరిచయం చేసి, చైనా లిపిని అభివృద్ధి చేసిన ట్సాంగ్ షియ్ (Tsang - Hsieh) సమకాకులికుడని చెప్పబడుతున్నది. తొలి రోజులలో యీ చిత్రలేఖనం టోపీల మీద, అధికార వస్త్రాల మీద, జెండాల మీద, బ్యానర్ల మీద ఉండేది. చౌ రాజ వంశ కాలానికి చెందిన చౌలి (Chou Li) అంటే, చౌ వంశస్థుల ఆరాధనలు (Ritual of the Chou dynasty) అనే పుస్తకంలో, క్రీ.పూ. 12వ శతాబ్దం నాటికి చైనీయులు అనుసరించిన రంగుల విధానాలు, రంగులను వేసే సూత్రాలు మొదలైన వానికి వివరణాత్మక వ్యాఖ్యానాలున్నాయి.

#### 18.2.5.2 అలంకరణ

ఇళ్ళలో లోపలి గోడల మీద గల అలంకరణ, చైనాలో వ్యాప్తి పొందిన తొలి చిత్రలేఖనాలకు ఉదాహరణ. ప్రభువుల దర్బార్ హాల్‌లలోను, సమావేశ మందిరాలలోను, గోడలు అనేక రకాల అలంకరణలను కలిగి ఉండేవి. లైఫ్ ఆఫ్ కన్ఫ్యూషియస్ (Life of Confucius) అనే గ్రంథం ప్రకారం, క్రీ.పూ. 517లో 'చౌ ' రాజవంశానికి చెందిన ఛింగ్‌వాంగ్ (Ching Wang) రాజధాని అయిన లోయాంగ్ (Loyang) లో సమావేశ మందిరాలు, సభా భవనాలు, పూర్వపు చక్రవర్తులైన యాం (Yam) , షన్ (Shun) వంటి వారి బొమ్మలతోను, నియంతలయిన ' చౌ '(Chou), చిన్ (Chin) ల చిత్రాలతోను, 'చౌ' , షాంగ్ ' రాజ వంశాలకు చెందిన చివరి ప్రభువుల చిత్రాలతోను నిండి వుండేది. అట్లాగే , చెంగ్ ప్రభువు తన సామంత ప్రభువులకు దర్శనాన్ని ఇస్తున్న చిత్రాలు కూడా ఉండేవి. షు.(Shu) డ్రాగన్ (Dragon) రెండూ ఎంతో పరిపూర్ణత పొందిన అలంకార చిత్రాలుగా, న్యాయాధిపతి సభా స్థలాల వద్ద ఉండేవి. ఆ పిదప, దానిలో గండభేరుండ పక్షిని పోలిన పెద్ద రాబందు, జంతువులను తన్నుకు పోతున్నట్లున్న చిత్రాలు ఎంతో ప్రశస్తమయినవి. షిచి (Shichi) ప్రకారం, వాస్తుపరమైన చిత్రలేఖనం, అంటే భవనాలు మొదలైన వానిని చిత్రాలలో చూపడం కూడా, ఎంతో అభివృద్ధి చెందింది.

#### 18.2.5.3 హాన్ వంశం నుండి చిత్రలేఖనం

హాన్ రాజవంశ కాలం నుండి చిత్రలేఖనంలో ఎంతో మార్పు వచ్చింది. కేవలం ప్రభువుల, జంతువుల, పక్షుల బొమ్మలు మాత్రమే కాక, గొప్ప గొప్ప అమాత్యుల, సేనానుల, రాణుల, పండితుల చిత్రాలు, టావో (Tao) మత దేవతల బొమ్మలు కూడా, చిత్రాలంకారాలలో చోటుచేసుకున్నాయి. మింగ్ టె (Ming Te) కాలంలో, అనగా క్రీ.శ. 58–75 లలో, చైనాలో తొలి బౌద్ధ చిత్రాలను గుర్తించగలం. భవనాల, బౌద్ధారామాల, ఇతర

దేవాలయాల నిర్మాణాల అలంకరణగా చోటుచేసుకొన్న అనేక చిత్రలేఖనాలు వానితోనే అంతమవడం వల్ల , వాటిని గురించి కేవలం సాహిత్యపరమైన సందర్భాలే తప్ప, వాస్తవంలో దొరకడం లేదు. హాన్ రాజవంశ కాలానికి చెందిన సువు (Su Vu) అనే జీవిత చరిత్రవల్ల, 'హాన్' రాజవంశానికి చెందిన 'షుహాన్ టి ' (Hsuan Ti) కాలంలో, క్రీ.పూ. 51లో షాన్ - యు (Shan Yu), హో యుంగ్‌ను తురుష్కుల ప్రభువు మొదటి సారిగా దర్శనానికి వచ్చాడని, అతడి చిత్రలేఖనం చాటుతూంది. అప్పుడు మాఓయెన్ షౌ (Maoen Chau) అనే గొప్ప ఆస్థాన చిత్రకారుడు ఉండేవాడు. అట్లాగే క్రీ.శ. 2వ శతాబ్దంలో ట్సాఇయుంగ్ (Tsa Yung) కాలం 133 - 192; లియుపాఓ (Liu Pao) అనే ఇద్దరు ప్రసిద్ధ చిత్రకారులుండేవారు. క్రీ.శ. 181-234కి చెందిన చుకోలియాంగ్ (Chuko-liang) భూమ్యాకాశాలు, సూర్యచంద్రులు, రాజా, అమాత్యులు, నగరాలు, దేవతలు, రక్షణ దేవతలు, ఎద్దు, గుర్రం, ఒంటె, మేక వంటి పెంపుడు జంతువులు, రాజ ప్రతినిధి ప్రయాణాలు, విదేశీయుల సమావేశాల వంటి అంశాలపై అనేక చిత్రాలను గీసేవాడు. ఇతనితోబాటు కన్సట్సావొఫుహ్సింగ్ (Tsao Fu Hsing) గొప్ప చిత్రకారుడు. తొలి చిత్రలేఖనాచార్యుల్లో చైనాలో పేరెన్నికగన్నవాడు. ఇతడు 'వు' (Wu) సంస్థానాధీశుడైన 'సన్ చువాన్' (Sun chuan) ఆ స్థానానికి చెందిన వాడు. ఇతడు గీచిన డ్రాగన్ చిత్రాలు, పెంపుడు, వన్య జంతువుల చిత్రాలు, దృశ్యాలు, ఐతిహాసిక కథనాలు ఎంతో పేరు పొందాయి.

## 18.2.5.4 చిత్రలేఖన పద్ధతులు

క్రీ.శ. నాల్గవ శతాబ్దానికి చెందిన కుకైచి (Ku-Kai-Chih) వ్రాసిన చిత్రలేఖన గ్రంథంలో, అప్పుడు నీటి రంగులు పూయడానికి పట్టు వస్త్రాలను నేపథ్యంగా వాడేవారని, మంచి వస్త్రం ఎన్నిక చేసుకొని, బొమ్మగీసిన తరవాత, దానిని దళసరి కాగితం మీద అతికించి వుండేవారని తెలుస్తున్నది. ఈ రకమైన వస్త్రం పొడుగు ఒక అడుగు నుండి నలభై అడుగుల వరకు మారుతుండేదని తెలుస్తున్నది. ఈ రకంగా వుండే ఒకే వెడల్పయి - దీర్ఘ చతురస్రంగా కాని, సమచతురస్రంగా కాని వుండే గుడ్డను చువాన్ (chuvan) అని, జపనీస్ భాషలో 'దుకిమోనో' (Duki Mono) అని పిలిచేవారు. ఇదేకాక, ఉండగా చుట్టిన చుట్టవంటి పొడుగైన వస్త్రం కూడా అలంకరణకు తోడ్పడేది. దీన్ని జపనీస్ భాషలో కకమోనో (Kakemono) అంటారు. దీనిపై నిలువుగా బొమ్మలను గీసేవారు. వెదురును చిత్రలేఖనంలో ఉపకరణాలకు ఉపయోగించేవారు. క్రీ.పూ. 209లో మెంగ్‌టీన్ (Mengtien) 'పి' (Pe) అనే జుత్తుతో చేసిన బ్రష్‌ను తయారుచేసేవరకు, ఎక్కువగా వెదురునే వినియోగించుకునేవారు. క్రీ.శ. 89 - 105 లలో హాన్ వంశస్థుడైన 'హొ టి ' (HoTe) అధికారి అయిన ట్సాయిలున్ (T'sai Lun) తొలిసారిగా కాగితాన్ని చైనాలో కనిపెట్టినట్లు తెలుస్తున్నది. ఇది పట్టుకు ప్రత్యామ్నాయంగా చిత్రలేఖనంలో వాడబడేది. కాగితం తయారీలో పట్టు చెత్త, దూది, వెదురు, ఈనెలు, గడ్డి, మల్బరీ ఆకుల వంటివి వేసి, చేసేవారు. ఇది చైనాలోని సమర్ఖండ్‌లో మొదలు ప్రారంభమై, మహమ్మదీయుల ద్వారా ఐరోపా దేశాలకు చేరింది.

క్రీ.శ. 265 - 96ల మధ్య కాలంలో అనేక పరిణామాలు చిత్రలేఖనంలో సంభవించాయి. ఈ కాలంలో కళలో బౌద్ధమత ప్రభావం హెచ్చుగా వుంది. అంతేగాక, చైనా చిత్రలేఖనంలో ఉత్తరాది, దక్షిణాది సంప్రదాయాలు అభివృద్ధి లోకి వచ్చాయి. ట్సావో ఫుహ్సింగ్ (Tsao FuHsing) శిష్యుడైన వీహ్సి (Wei Hsie); పూహ్సి (ఇప్పటి నాన్కింగ్) వాస్తవ్యుడైన కుకై (Ku-Kai-hi) అనే ఇద్దరూ చిన్ రాజవంశీకుల కాలంలో ఎంతో ప్రసిద్ధి పొందిన చిత్రలేఖకులు. వీహ్సి టావొ (Weihsie Tao) బౌద్ధ దేవతల తొలి చిత్రకారుడు. శాక్యముని బుద్ధుణ్ణి అనుసరించిన బుద్ధుల చిత్రం వీహ్సి చిత్రాలలో పేరెన్నిక గన్నది. కు కైషి ,వీహ్సి (Weihsie) శిష్యుడే, కాని, గురువును మించిన నైపుణ్యం , పాండిత్యం వుండేవి. ఇతడు ప్రభువులు, పాలకులు, రాణులు, చారిత్రక దృశ్యాలు, పులులు, చిఱుతలు, సింహాలు, డ్రాగన్లు, బాతులు, మైదానాలు, కొండ చరియలు, కొండల వంటి వన్నీ

గీసేవాడు. ఎక్కువ పని పట్టు మీదనే చేసేవాడు. జల పక్షులతో కూడిన ఒక సరోవర దృశ్యం, ఇతని చిత్రాలలో ప్రసిద్ధి పొందింది. ఇతడు వాక్వాన్స్సు(WaKuanSsu) అనే సంఘారామంలో బౌద్ధ చిత్రాలను కూడా గీశాడు. ఇతని రేఖా చిత్రాల్లోని శైలి, లాలిత్యం నిరుపమానమైనవి, సొగసైనవి. ఈ కాలంలో లలిత కళలలో సామాన్యంగాను, చిత్రలేఖనంలో ప్రత్యేకంగాను, సంస్కరణ (Refinement); తీరుబాటుతో కూడిన ఆలోచన (Leisured thought); నాగరికమైన లాలిత్యం (civilised grace) ప్రధాన లక్షణాలుగా ఉండేవి. అవే కుకైషి చిత్రాలలో కనిపిస్తాయి. క్రీ.శ. 479 - 501కి చెందిన హ్సీహో (Hsie Ho) అనే చిత్రకళా విమర్శకుడు, చిత్రాలలో లలితమైన శైలి(Rhythmic vitality) ; దేహనియతి (anatomical structure) ప్రకృతికి సాన్నిహిత్యం(Conformity with nature) ; వర్ణమిశ్రణం (Harmonious colouring) ; కళాత్మకమైన కూర్పు (artistic composition) , తుది మెరుగులు (finish) అనే ఆరు అతి ముఖ్యమైన సూత్రాలుగా పేర్కొన్నాడు. రేఖలలో, రేఖల కూర్పులలో గల ఆలోచనా సరళి, చైనా లలిత కళలలో, చిత్రలేఖనంలో ఎంతో స్ఫూర్తినిచ్చింది. చిత్రకారుని గొప్పదనం ప్రతి రేఖ విడివిడిగా గొప్పదనాన్ని కలిగి, సామూహిక విన్యాసంలో మహోన్నతమైన కళాత్మకతను వ్యక్తీకరింపచేయడంలో నిబిడీకృతమై వుంటుంది.

క్రీ.శ. 420 - 478లలో 'లుటాన్ వి ' (Lu-T'anwei) ఎంతో పేరుపొందిన చిత్రకారుడు. ఇతడు బౌద్ధ, టావో అంశాలను ఉలితో చెక్కినట్లు, గీతల స్ఫూర్తిని కలిగించేవాడు.

క్రీ.శ. 581 - 618 లకు చెందిన సుయి రాజ వంశ కాలానికి చెందిన టుంగ్‌పో జెన్ (Tung Po Jene), చాన్ ట్జు చీన్ (Chan Tzu chien) అనే ఇద్దరు చిత్రకారులు, టాంగ్ చిత్రలేఖనానికి స్రష్టలుగా చెప్పబడ్డారు. వీరేకాక, సున్‌షాంగ్‌ట్జు , (Sun Shang Tzu) , యాంగ్‌చితాన్ (Yang chitan) అనే ఇద్దరు ప్రసిద్ధ చిత్ర లేఖకులు కూడా ఉండేవారు. ఈ కాలంలో బౌద్ధ సంఘారామంలో బౌద్ధమత ప్రేరితమైన చిత్రకళ అభివృద్ధి చెందింది. ఈకాలంలో భారతదేశం నుండి వచ్చిన ఒటిచు (Otichu) , మొలోపుటి (Moloputi) అనే చిత్రకారులు, సమర్ఖండ్ కు చెందిన ట్సావో చుంగ్ టా (Tsao Chung Ta) , ఖోటాన్‌కు చెందిన వీచీ పోచిన (Wei Chie Pochina), వీచీఇసేంగ్ (Weichie Iseng), బౌద్ధ భిక్షువు అయిన టాన్ మోచోచా (Tan Mo chocha), కుఫొటొ (Kufoto) అనేవారు ప్రసిద్ధి పొందిన చిత్రలేఖకులుగా ఉండేవారు. క్రీ.శ. 618 - 906లలో పాలించిన టాంగ్ రాజ వంశ కాలంలో యెన్‌లీటే (Yen - Lei - Te), వుటావోట్జు (Wu Tao Tzu) అనేవారు ప్రసిద్ధ చిత్రలేఖకులు. యెన్‌లీటే (Yen-Lei-Te), అతని సోదరుడైన యెన్‌లీపేన్ (Yen -Lei -Pen) ఇద్దరు గొప్ప ఉద్యోగులు, చిత్రలేఖకులు కూడా. యెన్‌లీటే (Yen - Lei - Te) టావో చిత్రాలను, చారిత్రక దృశ్యాలను రాసేవాడు. వుటావోట్జు, ఆధునిక, ప్రాచీన చిత్రలేఖకులకు, గైల్స్ ప్రకారం ' తలమానికం వంటివాడు' . ఇతని ప్రకృతి దృశ్యాలు, బౌద్ధ దృశ్యాలు ఎంతో పేరుపొందాయి. టాంగ్ వంశ కాలంలో వాంగ్ వీ (Wang Wei) ; హన్‌కున్ (Hunkun) అనే ఇద్దరు చిత్రకారులు కూడా ఉండేవారు. వారిలో వాంగ్‌వీ కవి కూడా. ఈ కాలంలోనే హ్వాంగ్‌హో పరీవాహక ప్రదేశంలో ఉత్తరాది శైలి, యాంగ్‌ట్జె ఎగువ పరీవాహక ప్రదేశంలో దక్షిణాది శైలి రూపుదిద్దుకొన్నాయి. ఉత్తరాది శైలి ఎక్కువ సనాతనమైంది. చిత్రకారునికి మరింత స్వేచ్ఛ ఇవ్వనిది. కాని, దక్షిణాది శైలిలో చిత్రకారునికి స్వేచ్ఛ వుండేది.

చైనాలో క్రీ.శ. 960 - 1643ల మధ్యకాలంలో సుంగ్ రాజవంశం చిత్రలేఖనాన్ని ఎంతగానో పోషించింది. ప్రకృతి చిత్రాల రచన సుంగ్ కాలంలో ఎంతో ప్రతిభావత్తతను, కళాస్ఫూర్తిని సూచిస్తుండేవి. చవోమెంగ్‌ఫు (Chao-Meng-Fu) ఒక ప్రసిద్ధ చిత్రలేఖకుడు . ఈ కాలంలో చిత్రాలను పది రకాలుగా వర్గీకరించారు. అవి: టావోషి (Tao che) అంటే, టావో బౌద్ధ చిత్రాలు ; జెన్‌వు (Jen - Wu) అంటే, మానవ చిత్రాలు:కుంగ్‌షి

(Kung - She) అంటే, భవన నిర్మాణాలు; ఫాన్‌ట్సు (Fan Tsu) అంటే, ఆటవిక జాతులు; లుంగ్‌యు (Lung - Yu) అంటే, డ్రాగన్లు, చేపలు ; షన్‌షు ఇ (Shun-Shu - i) అనగా, కొండలు, నదులు; చుచౌ (Chu Chou) అంటే, పెంపుడు జంతువులు ; వన్య జంతువులు; హ్వానియా ఓ (Hua - niao) అంటే ; పూవులు, పక్షులు ; మోచు (Mochu) అంటే, వెదుళ్ళు ; సుకువొ (Sukuo) అంటే, బంకలు, పళ్ళు అనబడేవి. మింగ్ రాజవంశ కాలం నుండి ఈ చిత్రలేఖనం చైనాలో క్షీణదశను పొందింది.

## 18.2.6 సాంకేతిక శాస్త్ర పరిణామాలు

చైనా నాగరికతలో హస్తకళలకు, లలిత కళలకు దోహదం చేస్తూ, అనేక సాంకేతిక, శాస్త్ర విధానాలు, పరిణమించాయి. అవి చైనాలోని కళలనేకాక, ఇతర అంశాలైన రాజకీయ, ఆర్థికాంశాలను కూడా ప్రభావితం చేశాయి. వైజ్ఞానిక పరిణామాలు ఖగోళశాస్త్రం, జీవశాస్త్రం, భూతత్త్వశాస్త్రం, భూగోళశాస్త్రం, గణితశాస్త్రం మొదలైన అంశాలకు చెందినవి.

పశ్చిమ చౌ రాజ్యంలో క్రీ.శ. 500 నాటికే, వారు దుక్క ఇనుము (cast iron) ను ఉత్పత్తి చేశారు. షాంగ్ వంశ కాలం నాటికి, అయస్కాంత సూచికతో గల దిక్సూచిని ఏర్పరచుకోగలిగారు. చౌ రాజవంశకాలంలో గాజును, టాంగ్ వంశస్థుల కాలంలో తుపాకి మందును; 1161 ప్రాంతంలో బాంబును ; 1261 ప్రాంతంలో శతఘ్ని (ఫిరంగి) ని పెంపొందించుకొన్నారు. క్రీ.శ. 105 నాటికి ట్సాయిలున్ (T'sai Lun) తొలిసారిగా కాగితాన్ని కనుగొన్నాడు. క్రీ.శ. 600 నాటికి అచ్చుపని; క్రీ.శ. 1100 నాటికి అచ్చుయంతాన్ని ఏర్పరచాల కొన్నారు. అదేవిధంగా, 2వ శతాబ్దం నాటికి భూప్రకంపనాలను రికార్డ్ చేసే సీస్మోగ్రాఫ్ (Seismograph) ను కనుగొన్నారు. మధ్య యుగంలో శరీర నిర్మాణ శాస్త్రాన్ని (Anatomy) బాగా పెంపొందించుకోగలిగారు. క్లైడ్ ప్రకారం, ఐరోపాలో 16, 17 శతాబ్దాలలో ఆధునిక విజ్ఞానం అనేది, మధ్యయుగంలో చైనాలో ఆవిష్కరింప బడింది.

## 18.2.7 సాహిత్య కళ

చైనాలో సాహిత్యం ఒక కళగా బాగా వృద్ధి పొందింది. వివిధ మత గ్రంథాలు, ఉదాహరణకు 'ఇచింగ్' అనే పరిణామ పురాణం ; వివిధ శాస్త్ర గ్రంథాలు ; ఉదాహరణకు, చిత్రలేఖనాన్ని గురించి చెప్పే కుకైచి నాల్గవ శతాబ్దంలో వ్రాసిన గ్రంథం ; వివిధ కుటుంబ విషయిక గ్రంథాలు ; ఉదాహరణకు చౌలి ; వంటివి సాహితీ కళలోని వివిధాంశాలను సూచిస్తున్నాయి.

## 18.2.8 వాస్తుకళ

వాస్తుపరంగా చైనాలో అతి ప్రసిద్ధి పొందినది, చైనా మహాకుడ్యం (The Great Wall of China). ప్రపంచపు వింతలలో ఒకటిగా దీనిని పేర్కొనడం జరిగింది. వారి కాలంలో వివిధ రకాలైన కోటలు, మతపరమైన నిర్మాణాలైన సంఘారామాల వంటివి నిర్మితమైనాయి. కాని, ఎక్కువ సంఘారామాలు నశించి పోయాయి. అయినా, వివిధ గ్రంథాల వల్ల ఈ రకమైన బౌద్ధ సంఘారామాలు వివిధ చిత్రలేఖనాలను అలంకరణగా కలిగి, ఎంతో విశేషంగా అభివృద్ధి పొందినట్లు తెలుస్తున్నది.

## 18.3 సంగ్రహంగా

1. చైనాలో కళలలో పింగాణీ పరిశ్రమ, గాజు పరిశ్రమ, పట్టుపరిశ్రమ, చిత్రలేఖనాలు ఎంతో ఉన్నతమైనవి.

2. గాజు తయారీని విదేశాల నుండి క్రీ.శ. 5వ శతాబ్దంలో చైనావారు నేర్చుకొన్నారు.

3. పింగాణీ పరిశ్రమ, పట్టు, కాగితం తయారీ, మూడు పూర్తిగా చైనా వాతావరణానికి, ప్రకృతికి సంబంధించినవే.

4. చిత్రలేఖనంలో క్రీ.శ. 9వ శతాబ్దంలో ఉత్తరాది, దక్షిణాది శైలులు అభివృద్ధి పొందాయి. ఉత్తరాది శైలి సనాతనమైంది. దక్షిణాది శైలి స్వేచ్ఛాయుతమైంది. సుంగ్ (Sung), సు ఇ (Sui), హాన్ (Han) రాజవంశాల కాలంలో, చిత్రలేఖనం ఎంతో అభివృద్ధి చెందింది.

5. నగల తయారీ లలిత కళల్లో ఒక ఉపకళగా మాత్రం వ్యవహరించదగిన హోదాలో వుండేది.

6. చైనాలో మధ్య యుగం నాటికే, ఐరోపాలో 16,17 శతాబ్దాలలో ఆధునిక విజ్ఞానంగా చెప్పిన విజ్ఞానం ఆవిష్కరింపబడింది.

7. చైనాలో కనిపెట్టిన కాగితం, అచ్చుపని వ్రాతలో ఒక విప్లవానికి దోహదం చేసే వివిధ సాహితీ పరిణామాలకు దారితీసింది.

8. మత గ్రంథాలు, శాస్త్ర గ్రంథాలు, చరిత్ర గ్రంథాలు విస్తృతంగా పెంపొందాయి.

9. వాస్తుపరంగా చైనాలో ఏర్పరచిన మహాకుడ్యం ప్రపంచ వింతలలో ఒకటి.

10. బౌద్ధ సంప్రదాయం విస్తృతంగా వ్యాపించిన రోజులలో అనేక సంఘారామాలు నిర్మితమైనట్లు, మత గ్రంథాల వల్ల, చిత్రలేఖనానికి చెందిన గ్రంథాల వల్ల తెలుస్తున్నది.

## 18.4 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1.. చైనాలో పింగాణీ పరిశ్రామాభివృద్ధి గూర్చి తెలపండి.

2. చైనాలో చిత్రలేఖన ప్రాముఖ్యత, పరిణామాన్ని సమీక్షించండి.

**II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. పట్టు వస్త్రాలు, అల్లికలు, తివాచీల తయారీ

2. గాజు పరిశ్రమ

3. సాంకేతిక శాస్త్ర పరిణామాలు

4. సాహిత్య, వాస్తుకళలు

## 18.5 ఉపయుక్త గ్రంథాలు

Sphiden, W. Bushel : **Chinese Art,** 1985.

**Encyclopaedia Britanica, Vol. 5**

Clyde & Beers : **Far East,** 1985.

BRAOU

## 18.6 పదకోశం

టావో : మట్టితో చేసిన వస్తువులు, కుమ్మరి ఆమం

యాఓ : కుమ్మరి ఆమం

కువాన్‌యో : రాజోచితమైన మట్టి వస్తువులు

వ : కుండ

పోర్సిలెన్ : మట్టివంటి తెల్లని గట్టి పదార్థం

ట్జు : చైనాలో పోర్సిలిన్ ను పిలిచే మాట

టావోజేన్ : కుమ్మరివారు

పరిన్‌జేన్ : ముద్రల వంటి మూసలతో మట్టి వస్తువులను చేసేవారు.

షెన్ : చైనాలో షన్ పూజతో సరిఇచ్చిన మాన్యం.

ఇహ్సింగ్‌యాఓ : కియాంగ్స్ రాష్ట్రానికి చెందినది : మట్టి పరిశ్రమకు కేంద్రం.

క్వాంగ్ యా ఓ : క్వాంగ్‌టుంగ్ రాష్ట్రానికి చెందినవి : మట్టి పరిశ్రమకు కేంద్రం.

ఇయు : చైనాలో వరస సంవత్సరాలలో ఒకటి.

హ్సిన్‌షా : చైనాలో వరుస సంవత్సరాలలో ఒకటి

పింగ్‌హ్సు : చైనాలో వరుస సంవత్సరాలలో ఒకటి

కుయియు : చైనాలో వరస సంవత్సరాలలో ఒకటి

టాచి : గొప్ప అదృష్టం.

షాంగ్‌మింగ్ ఫుకుయి : ఆయుర్దాయం, సంపదలు, హోదా.

ఫులుషా : సంతోషం, హోదా, ఆయుర్దాయం

పోలి : తెల్లని గాజు

లియులి : రంగు గాజు

వీలు ఓ : గాజులను గురించి చెప్పే గ్రంథం

షీషి : చైనాలో ఉత్తరాది చరిత్ర గ్రంథం

ఎల్ప్ డ్రసి : క్రీ.శ. 1154కి చెందిన సిసిలీ భూగోళ గ్రంథం.

స్సు : పట్టు

చిన్ : పట్టు వస్త్రాలు

హ్సాయు : అల్లికలు

షాంగ్ : పట్టుపై గల అలంకరణ చిహ్నాలు

పోవుయా ఓలాన్ : ప్రాచీన పట్టు పరిశ్రమ గురించి చెప్పే గ్రంథం.

క ఆంగ్ : చిన్న చిన్న ఎత్తైన సభా వేదికలు

షిహ్వాంగ్ : చైనా వారి ప్రకారం చిత్రలేఖన ప్రారంభకుడు

ట్సాంగ్హ్సా : చైనాలో తొలి లిపి స్రష్ట

చౌలి : ' చౌ వంశంలో మతం ' అనే పుస్తకం.

మా ఓ యెన్ షౌ : హాన్ వంశపు చిత్రకారుడు.

ట్సు ఇయుంగ్ : హాన్ వంశపు చిత్రకారుడు.

లియుపాంఓ : హాన్ వంశపు చిత్రకారుడు.

చాకోలియాంగ్ : హాన్ వంశపు చిత్రకారుడు.

ట్సావో పుహ్సింగ్ : తొలి చైనా చిత్రలేఖనాచార్యుడు

కుకైచి : చిత్రలేఖన శాస్త్ర కర్త

చువాన్ : సమచతురస్రంగా ఉండేపట్టు బట్ట

దుకియెనో : జపనీస్ భాషలో చువాన్

కకమోనో : ఉండచుట్టిన పొడుగైన పట్టుబట్ట

ఫి : వెంట్రుకలతో చేసిన బ్రష్

ట్సాయిలున్ : చైనాలో తొలుత కాగితం చేసిన వ్యక్తి

వీహ్సి : చిన్ చిత్రకారుడు ట్సావొపుహ్సింగ్ శిష్యుడు

కుకైషి : చిన్ చిత్రకారుడు; వీహ్సి శిష్యుడు

లుటానేవి : 5వ శతాబ్దపు చిత్రలేఖకుడు

టుంగ్పోజేన్ : సుయి రాజవంశపు చిత్రలేఖకుడు

చాన్ట్జుచీన్ : సుయి రాజ వంశపు చిత్రలేఖకుడు

BRAOU

యెన్‌లీటే : టాంగ్ చిత్రకారుడు

వుటావొట్జు : టాంగ్ చిత్రకారుడు.

టావోషి : టావో బౌద్ధ చిత్రాలు

జెన్‌వు : మానవ చిత్రాలు

కుంగ్‌షి : భవన నిర్మాణాలు

ఫాన్‌ట్సు : ఆటవిక జాతులు

లుంగ్‌యు : డ్రాగన్లు, చేపలు

షన్‌షు ఇ : కొండలు, నదులు

చుషౌ : పెంపుడు జంతువులు, వన్య జంతువులు

హ్వాయా ఓ : పూవులు, పక్షులు

మోచు : వెదుళ్ళు

సుకుహో : బంకలు, పళ్ళు.

BRAOU

## ఖండం - VI: గ్రీస్

ఐరోపాలో తూర్పు వైపున మధ్యధరా సముద్రానికి వాయవ్యంగా వుండే ఒక చిన్న దేశం గ్రీస్. చిన్న దేశమే అయినా, గ్రీక్ నాగరికత యావత్ ప్రపంచ నాగరికతకే పునాదిగా పరిణమించింది. ఈ నాగరికత ముందు ఒక తెగ, లేదా కొన్ని తెగల నాగరికతగా ప్రారంభమై, రాను రాను గొప్ప సామ్రాజ్యంగా పరిణమించింది. ఈ పరిణామంలో వివిధ దశలను ఈ క్రింది విధంగా వివరించడం జరిగింది.

19 వ భాగంలో గ్రీక్ నాగరికతా లక్షణాల గురించి చెప్పడం జరిగింది.

20 వ భాగంలో గ్రీస్ వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను వివరించడం జరిగింది.

21 వ భాగంలో గ్రీస్ దేశంలో వ్యాప్తిలో వున్న మతాలు, గ్రీకుల తత్త్వ వివేచనను విశ్లేషించడం జరిగింది.

22 వ భాగంలో గ్రీక్‌ల నాగరికత లోని వివిధ కళలు, సాహిత్యం, వాస్తువు వంటి వాటిని పరిశీలించడం జరిగింది.

పైన చెప్పిన నాలుగు భాగాలు ప్రాచీన గ్రీక్ నాగరికతా విశిష్టత, విశేషాలను స్పష్టీకరించడం జరిగింది.

BRAOU

BRAOU

# భాగం - 19 : గ్రీక్ నాగరికతా లక్షణాలు

విషయ క్రమం

19.0 లక్ష్యాలు

19.1 పరిచయం

19.2 చరిత్ర ఆధారాలు

19.2.1 పురావస్తు ఆధారాలు

19.2.2 సాహిత్యాధారాలు

19.3 గ్రీస్ భౌగోళిక పరిస్థితులు

19.4 గ్రీక్ నాగరికతా లక్షణాలు

19.4.1 సామాజిక వ్యవస్థ

19.4.2 రాజకీయ వ్యవస్థ

19.4.3 ఆర్థిక వ్యవస్థ

19.4.4 మత వ్యవస్థ

19.4.5 తత్త్వ చింతన

19.4.6 కళలు

19.5 సంగ్రహంగా

19.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

19.7 ఉపయుక్త గ్రంథాలు

19.8 పదకోశం

BRAOU

## 19.0 లక్ష్యాలు

గ్రీక్ నాగరికత ఐరోపా ఖండంలో నాగరికతకు పునాది వంటిది. గ్రీస్ దేశం చాలా చిన్న దేశం అయినప్పటికీ, గ్రీక్‌లు ఈజిప్ట్, సుమేరియా, భారతదేశాలతో ఏర్పరచుకొన్న సంబంధం దృష్ట్యా, కనీ వినీ ఎరగని సాంస్కృతిక పరిణామాలను పొందారు. గ్రీక్‌ల వారసత్వాన్ని రోమన్‌లు కొంతకాలం కొనసాగించినా, ఐరోపా చరిత్రలో క్రీ.శ. 1453 నుండి ప్రారంభమైన సాంస్కృతిక పునరుజ్జీవన (Renaissance) కాలంలో మళ్ళీ గ్రీక్‌ల సంప్రదాయాలను, సిద్ధాంత విశేషాలను, విజ్ఞాన వైశిష్ట్యాన్ని ఆధారంగా చేసుకొని, ఆధునిక ఐరోపాలోని ప్రగతి పథాన్ని తీర్చిదిద్దుకోవడం జరిగింది. అందువల్ల , గ్రీక్ నాగరికతను ప్రాచీన నాగరికతల్లో ఒక ప్రత్యేకత, విశిష్టత

వున్న నాగరికతగా గుర్తించాలి. ఆ రకంగానే నాగరికతను పరిశీలించాలి. ప్రతి నాగరికతకు తనదైన ఒక స్వభావం, స్ఫూర్తి వుంటాయి. స్వభావం నాగరికతలోని అవశేషాల ద్వారా తెలుస్తుంది. స్ఫూర్తి అవశేషాల వల్ల తెలియగలిగే మానవుల వ్యక్తిగతమైన సామాజికమైన ప్రవర్తను బట్టి, అవగాహన చేసుకోవచ్చు. స్వభావం, స్ఫూర్తి రెండూ కూడా విడిగా కనిపించినా, ఒక ప్రాంతపు, లేదా దేశపు భౌగోళిక పరిస్థితుల ప్రభావానికి, బొమ్మ, బొరుసు వంటివి. అంటే, స్వభావం, స్ఫూర్తి తెలియాలంటే ఆ దేశపు భౌగోళిక స్థితిగతులను అవగాహన చేసుకొని, ఒక వివరణాత్మకమైన రూపాన్ని కలిగి వుండాలి. ఆ రకంగా భౌగోళిక పరిస్థితుల ద్వారా వివరణాత్మకమైన రూపాన్ని అందించడం, ఈ నాగరికతా పరిశీలనలోని లక్ష్యాలలో ఒకటి. అట్లాగే ప్రతి నాగరికతలోను భద్రత రాజ్యవ్యవస్థవల్ల, వ్యక్తుల ఉనికి ఆర్థిక వ్యవస్థ వల్ల, వ్యక్తుల హోదాతో కూడుకొన్న స్థితి సామాజిక వ్యవస్థవల్ల నిర్ణయించబడతాయి. కాబట్టి, సామాజిక వ్యవస్థ; ఆర్థిక వ్యవస్థ ; రాజ్య వ్యవస్థల స్వరూపాన్ని అవగాహన చేసుకోడం ద్వారా, ఆ నాగరికతలోని మూడు కోణాలను (Three dimensions) విడివిడిగాను, సామూహికంగాను గ్రహించడం జరుగుతుంది. వాటి విశ్లేషణ కూడా ఎంతో అవసరం. ఆ విశ్లేషణకు, ఈ మూడు వ్యవస్థలను పోల్చడం ద్వారా వచ్చే అభిప్రాయాలను, జతపరచాలి. ఈ ప్రక్రియ లేకపోతే ఒక నాగరికతను గురించి సమాహారంగా చదవడం సాధ్యం కాదు. కాబట్టి, సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థల విశ్లేషణను రెండవ లక్ష్యంగా గుర్తించొచ్చు. అలాగే ప్రతి నాగరికతలోను ప్రకృతి బీభత్సాల పట్ల భయాందోళనలు, ప్రకృతి సౌందర్యాన్ని చూసి ఆరాధించడం ; ప్రకృతిలోని ఆనందాన్ని, భయాందోళనలను విడివిడిగాను, సామూహికంగాను అవగాహన చేసుకోడానికి యత్నించడం జరిగింది. ఈ యత్నంలోనే మతం, తత్త్వ వివేచన, శిల్పకళ, వాస్తుశిల్పం అవతరించాయి. క్రోబర్ అనే మానవ శాస్త్రజ్ఞుడు అభిప్రాయపడ్డట్లు, ఈరకమైన సాంస్కృతికావతరణ అంతా, మానవ భావానికి, ప్రకృతికి వ్యవహ్రియమాణమైన సంబంధంవల్ల ఏర్పడ్డదే. గ్రీక్ నాగరికతా విషయం లో కూడా, మతం, తత్త్వ వివేచన, శిల్పకళ, వాస్తుశిల్పం, సాహిత్యం, విజ్ఞాన సాహిత్యం వంటి ఆలోచనాజన్యమైన తత్త్వ, శాస్త్ర, కళారీతులను అన్వయించడం, వాటిని గురించి వివరంగా తెలియడం, ఇంకో లక్ష్యం. ఈ రకమైన పరిణామం గ్రీక్‌లదే అయినా, ప్రత్యేక వ్యక్తిత్వాన్ని , లక్షణాలను సంతరించుకోడం జరిగింది. దానినే సోఫ్రోసైన్ (Sophrosyne), లేదా మాడరేషన్ (Moderation) అని చెప్పడం జరిగింది. అంటే , గ్రీక్‌ల వ్యవస్థలో ప్రకృతి, మానవుల మధ్య గల ఎడతెగని సంబంధాలను, కాలానుగుణంగా వివేచించడం ద్వారా పరిణయించిన రాజకీయ, తాత్త్విక సిద్ధాంతాల నేపథ్యాలను తెలుసుకొనడం ; ఆ నేపథ్యంలో మార్పును సమీక్షించడం ఇంకొక ప్రధానమైన లక్ష్యం.

---

## 19.1 పరిచయం

గ్రీస్ దేశంలో సహజసిద్ధమైన భౌగోళిక పరిస్థితులలోను, అస్తవ్యస్తంగా విస్తరించిన పర్వతాల ద్వారాను, చుట్టూ ఉండే సముద్రాల, అఖాతాల ప్రభావాల వల్ల, వివిధ స్థావర విశేషాలు ఏర్పడ్డాయి. డోరియన్‌లు, అయోనియన్‌లు మొదలైన వివిధ జాతుల వారు గ్రీస్ దేశంలోకి రావడంవల్ల ఏర్పడ్డ సమ్మేళన స్థితితో, గ్రీస్ దేశంలో వివిధ రాజకీయ కేంద్రాలకు అవకాశం వచ్చింది. ప్రతి ప్రాంతానికి ఒక చిన్న నివేశన స్థలం, రక్షణ ప్రాంతం, దేవాలయం, ప్రజల సహకారంతో నడపబడే ప్రభుత్వం ఏర్పడ్డాయి. ఆ వ్యవస్థ గ్రీస్ దేశంపైకి పర్షియా దాడి చేయడం ద్వారా కొంత క్షీణించి, నగర రాజ్య వ్యవస్థకి అవకాశం వచ్చింది. సమాజంలో పెరిగిన ఆర్థిక అంతరాలు, సామాజిక అంతరాలకు కూడా అవకాశమిచ్చాయి. ఆ అంతరాలలో అతి ముఖ్యంగా గ్రహించ దగినది బానిస వ్యవస్థ. మిగిలిన వ్యక్తులంతా వ్యవసాయం మీద ఆధారపడేవారు ; యుద్ధం మీద ఆధారపడేవారు, పరిపాలనతో సాన్నిహిత్యాన్ని కలిగినవారు అనే మూడు వర్గాలుగా విభక్తమయ్యారు. ఈ వర్గాల ప్రభావమే పారశీక యుద్ధాల కాలం నుండి అవతరించిన నగర రాజ్య వ్యవస్థలో కొన్ని ప్రత్యేకమైన చట్టాల ఏర్పాటుకు, అరిస్టాటిల్,

ప్లేటో, సోక్రటీస్ వంటి వారు ప్రతిపాదించిన వివిధ రాజ్య జీవిత సిద్ధాంత విశేషాలకు అవకాశమిచ్చింది. ఆ అవకాశంలోనే మానవకృతమైన అంశాలే గొప్పవి. ప్రకృతి పై మానవుని ఔన్నత్యం అనివార్యమైనది అనే అభిప్రాయాలకు దారితీసింది. హేతువాద పూర్వకంగా ప్రారంభమైన గ్రీస్ దేశంలోని తత్వచింతన, మానవుని ఔన్నత్యాన్ని సహేతుకంగా , సగౌరవంగా గుర్తించడం జరిగింది. దాని పరిణామమే అలెగ్జాండర్ ది గ్రేట్ కాలం నుండి హెలెనిస్టిక్ నాగరికతగా , గ్రీక్‌ల సాంప్రదాయికమైన హెలెనిక్ నాగరికత పరిణమించడం. ఫొనీషియన్‌ల నుండి గ్రీక్ వారు నేర్చుకొన్న ద్రవ్యమారక వ్యవస్థ, వాణిజ్యాభివృద్ధి, అక్షరమాల వంటి హెలెనిస్టిక్ నాగరికతా కాలం నాటికి, ఎన్నో ప్రత్యేకమైన రూపాంతరాలు చెందాయి. వాటి స్పందనలు, ప్రతిస్పందనలు, గ్రీక్‌ల జీవితంలోని వివిధ వ్యవస్థల మీద ఎంతో ప్రభావాన్ని చూపాయి.

## 19.2 చారిత్రక ఆధారాలు

గ్రీస్ సంస్కృతి, నాగరికతల గురించి తెలుసుకోడానికి, రెండు ప్రధానాధారాలున్నాయి. మొదటివి, పురావస్తు ఆధారాలు, రెండోవి సాహిత్యాధారాలు.

### 19.2.1 పురావస్తు ఆధారాలు

19వ శతాబ్దంలో మైకెనె వద్ద జరిపిన తవ్వకాలు, ట్రాయ్ నగరపు త్రవ్వకాల వంటి పురావస్తు ఆధారాల ద్వారా, ఆనాటి కోటలు, నగరాలు, వీధులు, భవనాలు, ఇండ్లు, వ్యాయామశాలలు, క్రీడాస్థలాల వంటివి, ఏ ఏ రకాలుగా నిర్మించబడ్డాయో తెలుస్తున్నది. అదేవిధంగా, ఆనాటి దేవాలయాలలోను, తదితర ప్రాంతాలలోను గల వివిధ శిల్పాలు, తవ్వకాలలో బయల్పడ్డ సాలంకృత, నిరలంకృత ఉపకరణాలలో రోజూ ఉపయోగపడేటటు వంటివి, అలనాటి గ్రీక్‌ల జీవితాలకు సంబంధించిన అనేక విషయాలను తెలుపుతున్నాయి.

BRAOU

### 19.2.2 సాహిత్యాధారాలు

సాహిత్యాధారాలలో అతి ప్రాచీనమైనవి హోమర్ వ్రాసిన ' ఇలియడ్', ' ఒడిస్సీ ' అనే కావ్యాలు. అందులో వర్ణించబడ్డ కాలాన్నే 'హోమరిక్ యుగం' అని కూడా పేర్కొనడం జరిగింది. ఆ కావ్యాలలో హెలెన్ ల పుట్టు పూర్వోత్తరాలను గురించి తొలి దైవాలయిన జీయస్, అపోల్లో వంటి వారిని గురించి పేర్కొనడం జరిగింది. ఇలియడ్ కావ్యంలో ట్రాయ్ కోట ముట్టడికి చెందిన గాథలు, ఒడిస్సీ కావ్యంలో పెనెలోప్ (Penelope) పాతివ్రత్యం వంటి విషయాలు చెప్పబడ్డాయి. హెసియాడ్ రాసిన 'వర్క్ అండ్ డేస్ ' , ' డిసెంట్ ఆఫ్ ది గాడ్స్' అనేవి మరో రెండు ఉత్కృష్టాధారాలు. ' వర్క్ అండ్ డేస్' లో కర్షకులకు తిథి, వార, నక్షత్ర, ఋతువిషయాలను చూసి శ్రమపడాలని, వ్యావసాయిక రంగంలో ఎటువంటి పనులు ఎప్పుడు చేయాలో చెప్పడం జరిగింది.

గ్రీక్ ప్రజల గేయ సాహిత్యం ఇంకొక అపూర్వ ఆధారం. దీనిలో ఆనాటి మానవుల వ్యక్తిగతమైన భావాలు, అనుభూతులను వర్ణించడం జరిగింది. ఆర్కిలోకస్ (Archilocus) , సాఫో(Saffo) , అనాక్రియన్ (Anacrean), పిండార్ (Pindar), బెకిలిడ్స్ (Bachyiides) వంటి గొప్ప గేయకర్తలు శాంతిని ప్రబోధించారు.

గ్రీక్ ప్రజలను గురించి తెలుసుకోడానికి వారి రూపక సాహిత్యం ఎంతో తోడ్పడుతుంది. ఆ రూపక సాహిత్యంలో ప్రజాజీవనం, మతాచారాలు, నృత్య సంప్రదాయం వంటివి వివరించబడ్డాయి. ఎస్కెలిస్, (Aeschylus) సోఫోకిల్స్ (Sophocles) , యురిపైడ్స్ (Euripides) విషాదాంత నాటకాలను, అరిస్టోఫేన్స్, (Aristophanes), మినాండర్ (Menander) లు ప్రహసనాలను రాశారు.

గ్రీక్‌ల చారిత్రక సాహిత్యమే వారి చరిత్రను గురించి చెప్పే గొప్ప ఆధారం. హెరోడోటస్, థూసిడైడ్స్, గ్జెనాఫోన్, పాలిబియస్‌లు రాసిన చరిత్రలు, మనకు వారి చరిత్రను యదాతథంగా తెలుసుకోడానికి ఎంతో తోడ్పడతాయి.

గ్రీక్‌ల శాస్త్ర సాహిత్యం, ప్లేటో, అరిస్టాటిల్ వంటి తత్త్వవేత్తల రచనలు, గ్రీక్ ప్రజల సంస్కృతిని గురించి తెలుసుకోడానికి, వారి ఆలోచనలను గురించి అవగాహన చేసుకోడానికి, ఎంతో ప్రధానమైన ఆధారాలని నిస్సందేహంగా చెప్పొచ్చు.

## 19.3 గ్రీస్ భౌగోళిక పరిస్థితులు

గ్రీస్ దేశం కర్కాటక రేఖకు ఉత్తర భాగంలో, మధ్యధరా సముద్రానికి వాయవ్యంగా, ఏజియన్ సముద్రానికి పడమట వున్నది. ఒక వైపున, అంటే ఈశాన్య భాగంలో, ఈ రాజ్యానికి ఆసియా మైనర్‌తో భూపరమైన సంబంధం వుంది. గ్రీస్ దేశం అంతా చూడడానికి ఒక ద్వీపకల్పంలా వున్నా, వివిధ సముద్రాలు, అఖాతాలు చొచ్చుకొని పోవడం వల్ల, నీటికి, భూమికి మధ్య ఎడతెగని దగ్గరతనం ఏర్పడింది. గ్రీస్ దేశంలో ఎక్కువ భాగం పర్వతాలతో నిండి వుంది. ఈ పర్వతాలు నిట్టనిలువుగా వున్న శిఖరాలను, చరియలను కలిగి వుంటాయి. పర్వత ప్రాంతాలలో ఎక్కువగా పొదలు వుండేవి. గడ్డి శాతం చాలా తక్కువ. కొండల ప్రాంతంలోగల లోయలు ఎంతో సారవంతమైన భూభాగాన్ని కలిగి వుండేవి. అందువల్ల, ఆ ప్రాంతాలలో విశిష్టమైన గ్రీక్ నగరాలు ఆవిర్భవించాయి. మధ్య గ్రీస్‌లో గల డెర్ఫి, థెబ్స్, హెలోనియాలు, దక్షిణ గ్రీస్‌లో గల ఎలీస్, ఒలింపియా, కోరింథ్, ఆటికా, ఏథెన్స్, మైకెనే, మెసేనియా, పిలోస్, స్పార్టా, లకోనియాలు ఈ రకమైన స్థావరాలకు ఉదాహరణలు. అయోనియన్ సముద్రం గ్రీస్ దేశంలోకి చొచ్చుకొనిపోయి, గ్రీస్‌ను మధ్య గ్రీస్‌గాను, దక్షిణ గ్రీస్ గాను వేరుచేసింది. గ్రీస్‌లోని పర్వత ప్రాంతాలలో ఇనుము, రాగి, వెండి, పాలరాయి నిక్షేపాలున్నాయి. పెరికిల్స్ కాలంలో అతడు పాలరాతిని అనేక భవనాలకు వినియోగించడం వల్ల, పెరికిల్స్ శకాన్ని పాలరాతిశకం (The Age of Marbles) అని కూడా పేర్కొనడం జరిగింది.

BRAOU

సముద్రానికి, గ్రీక్ నాగరికతకు, గ్రీస్ దేశానికి ఎంతో సంబంధం వుంది. అయోనియన్ సముద్రం గ్రీస్ దేశంలోకి చొచ్చుకొని పోగా, ఏజియన్ సముద్రం వల్ల అతి సాన్నిహిత్యం గల వివిధ ద్వీపాలు ఏర్పడ్డాయి. సముద్ర సాన్నిహిత్యం వల్లనే గ్రీక్‌లకు నౌకాయానం, వారి ఆహారంలో చేపలు ప్రధానంగా ఉండటం వంటివి, సంభవించాయి.

గ్రీస్ దేశంలో భూకంపాలు వస్తుంటాయి. శీతకాలంలో తరచుగా వర్షాలు వస్తాయి. ఆ కాలంలోనే ఒక్కొక్కసారి ప్రచండమైన తుఫానులు వస్తాయి. సంవత్సరంలో శీతాకాలం కాక, మిగిలిన కాలంలో ఎండ బాగా కాస్తుంది. ఆకాశం నిర్మలంగా, నీలంగా ఉంటుంది. వేసవిలో దాదాపు అన్ని నదులు పూర్తిగా ఎండిపోతాయి.

నైసర్గిక పరిస్థితులను బట్టి, గ్రీస్‌ను ఉత్తర గ్రీస్, మధ్యగ్రీస్, దక్షిణ గ్రీస్, అని విభజించొచ్చు. ఉత్తర గ్రీస్‌లో ఒలింపస్ శిఖరం పేరు పొందింది. దక్షిణ గ్రీస్‌నే పెలొపొనేషస్ అని వ్యవహరిస్తారు. మధ్య గ్రీస్‌కి, దక్షిణ గ్రీస్‌కి మధ్య అఖాతం ఉండేది. సముద్ర తీరంలో మాత్రం, పర్వతాలకు, సముద్రానికి మధ్య ఒక ఇరుకైన కనుమ మార్గం వుంది. దానినే థెర్మోపైలా (Thermopyla) అని పిలుస్తారు. ప్రాచీన కాలంలో మధ్య గ్రీస్ నుండి ఉత్తర గ్రీస్‌కి పోవడానికి ఇదొక్కటే ముఖ్యమైన మార్గంగా ఉండేది.

## 19.4 గ్రీక్ నాగరికతా లక్షణాలు

### 19.4.1 గ్రీక్ సామాజిక వ్యవస్థ

గ్రీక్ నాగరికతలో సామాజిక వ్యవస్థ రెండు ప్రధానమైన వర్గాలుగా వుండేది. ఒక వర్గం ధనికులు, రెండో వర్గం బానిసలు. క్రీట్ రాష్ట్రంలో యుద్ధవీరులు, కౌలు రైతులు అయిన బానిసల వంటి వారు ఉండేవారు. కొన్ని ప్రత్యేకమైన పరిస్థితులలో ఒక రాష్ట్రం వారు కాని, ఒక నగరం వారు కాని, ఇంకొక రాష్ట్రాన్ని, లేదా నగరాన్ని యుద్ధంలో లొంగదీసుకుంటే, ఆ లొంగదీసుకున్న రాష్ట్రానికి, లేదా నగరానికి చెందిన వారు ఇంచుమించు అదే సామాజిక స్థితిని అనుభవిస్తూ ఉండేవారు. ఒక్కొక్కసారి మూడవ వర్గంగా కూడా ఏర్పడేవాళ్ళు. కాని, ఆ స్థితి చాలా అరుదుగా వుండేది. బానిస రైతులలో కూడా రెండు వర్గాలు కనిపిస్తున్నాయి. ఒక వర్గం వారిని నాయ్‌టాయ్ (Mnoitai) అని పిలిచేవారు. వీరంతా రాష్ట్రానికి చెందిన వారు. రెండో వర్గం వారిని ఎఫమియొటాయ్ (Aphamiotai) అని పిలిచేవారు. వీరినే క్లారోట్స్ (Clarotes) అనేవారు. క్లారోట్స్ అనే వాళ్ళు కొన్ని గుంపులు గుంపులుగా నిర్దేశించిన పౌరుల సమూహాలకు చెంది ఉంటూ, ఆయా పౌరుల సమూహాల నాయకుల క్రింద పనిచేసేవారు. ఈ రకమైన వారిలో, స్పార్టా, క్రీట్, లకోనియా వారిలో, అనేక వైవిధ్యాలు కనిపిస్తున్నాయి. స్పార్టాలో వీరినే హెలట్స్ (Helots) అనడం జరిగింది.

ఈ సామాజిక వ్యవస్థలో విద్యకు కూడా తగినంత ప్రాముఖ్యం వుండేది. ఉదాహరణకు స్పార్టాలోను, క్రీట్‌లోను, చదవడం, రాయడం, చట్టబద్ధంగా అంగీకరించబడిన కొన్ని పాటలను నేర్పడం జరిగేది. కాని, మంచి సైనికులను తయారుచేసే ఉద్దేశంతో శారీరకమైన శిక్షణ నిచ్చేవారు. పదిహేడు సంవత్సరాలు నిండిన అందర్నీ, అగెలాయి (Agelai) అనే సముహాల్లో చేరుస్తారు. వారందర్నీ కూడా ప్రభుత్వం నిర్వహించే డ్రొమాయ్ (Dromoi)లు అనే వ్యాయామశాలల్లో చేరుస్తారు. వాటిలో సభ్యులను డ్రొమీ (Dromei)లు అనేవాళ్ళు. వారికి యుద్ధ విద్యలను ధనిక కుటుంబాలకు చెందినవారు నేర్పేవారు. వివిధ డ్రొమాయ్‌ల మధ్య పోటీలను నిర్వహించేవారు. అగెలాయి స్థితి గడచిన పిదపనే, వైవాహిక జీవితానికి అర్హత పొందేవారు. ఇదే విధానం ఇంచుమించు అన్ని ప్రాంతాలలోను వ్యాప్తిలో ఉండేది. అంటే, గ్రీక్ నాగరికతలో సామాజికమైన లక్షణాలను, ఆస్తిపరమైన తరతమ భేదాలతో అంచనా వేయడం , సమాజంలో విద్యావిధానాన్ని యుద్ధ ప్రగతి లక్ష్యంగా తీర్చిదిద్దడం, గమినించొచ్చు.

### 19.4.2 రాజకీయ వ్యవస్థ

రాజకీయపరంగా గ్రీక్‌ల నాగరికతలో అనేక ప్రయోగాలు జరిగాయి. సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ మొదలైన వారి రచనల ద్వారా, రాజకీయ వ్యవస్థా విధానాన్ని గురించి తెలుసుకోడానికి, ఎంతో విలవుతున్నది. రాజకీయ వ్యవస్థలో నగర రాజ్యాలు ఎంతో ముఖ్యమైనవి. ఏథెన్స్, స్పార్టా వంటివి నగర రాజ్యాలుగా రూపొందాయి. కాని, థూసిడైడ్స్ తన రాతలలో గ్రీక్‌లను సమైక్యంగా గాని, సమైక్యాన్ని ప్రభావితం చేసే అంశాలను లేనివారుగాను, వాణిజ్యంలోను, కేవలం కూడు, గూడు, బట్ట, తగినంత సంపాదించడం మినహా జీవితంలో ఏ మాత్రం పరమోత్కృష్టమైన లక్ష్యం లేనివారుగాను, అభివర్ణించాడు. ఈ రాతల్లో వాస్తవం శాతం ఎంత మాత్రం వున్నా, లేకున్నా, ఆరాతలు గ్రీక్‌ల రాజకీయ లక్షణాలకు ఒక స్వరూపాన్ని ఇస్తాయి.

గ్రీక్‌ల రాజకీయ వ్యవస్థలో నిరంకుశ ప్రభుత్వాలను, రాచరికాలను, ధనిక స్వామ్య ప్రభుత్వాలను, ప్రజాస్వామ్యాన్ని మనం చూడొచ్చు. ఏథెన్స్ నగర రాజ్యం ప్రజాస్వామ్య వ్యవస్థా పరిణామానికి తోడ్పడింది. మాసిడోనియాలో రాచరిక వ్యవస్థను చూడొచ్చు. స్పార్టా వంటి చోట్ల నిరంకుశ రాచరిక వ్యవస్థను చూడొచ్చు.

ఏథెన్స్, థేబ్స్ మొదలయిన చోట్ల ధనిక స్వామ్యాన్ని చూడొచ్చు. ఇవన్నీ అన్ని రాజ్యాలలోను, అన్ని కాలాల్లోను, ముందు వెనకలుగా గ్రీక్‌ల్లో సంభవించాయి. కారింథ్‌లో నిరంకుశ వ్యవస్థ పేరుపొందిన వానిలో ఒకటి.

గ్రీక్ రాజకీయ వ్యవస్థలో మరొక లక్షణం, వైవిధ్యం. సముద్రం చేత, సింధుశాఖల చేత, అఖాతాల చేత, పర్వతాల చేత, గ్రీస్ దేశం వివిధ వైయక్తికమైన రాజకీయ ప్రాంతాలుగా రూపొందింది. దానివల్ల, ప్రతి ప్రాంతంలోను రాజకీయ వ్యవస్థా పరిణామాన్ని వ్యక్తిగతంగా చూడొచ్చు. ఈ స్థితివల్ల గ్రీక్‌ల రాజకీయ వ్యవస్థలో వైవిధ్యం తప్పనిసరికాగా, నైసర్గిక లక్షణాలయిన సముద్రం, పర్వతాల వంటి వాని ప్రభావం ఎడతెగనిదిగా వుండి, ఏకత్వాన్ని ప్రోత్సహించింది. అంటే, గ్రీక్ రాజకీయ వ్యవస్థలో ఏకత్వాన్ని చాటి చెప్పే ఒక వైవిధ్యాన్ని చూడొచ్చు.

గ్రీక్‌ల వ్యవస్థలో అంతర్యుద్ధాలు, దండయాత్రలు ఒక విశిష్టమైన లక్షణం. దక్షిణ గ్రీస్ ప్రాంతాలను ఆక్రమించుకోడానికి జరిపిన పెలెపోనీషియన్ యుద్ధాలు, క్రీ.పూ. 629లో ఏథెన్స్‌కు, మెగారాకు మధ్య జరిగిన యుద్ధం, స్పార్టా ఏథెన్స్‌ను ఆక్రమించడం వంటివి, అంతర్యుద్ధాలకు కొన్ని ఉదాహరణలు . కాగా, పారశీకులు సైరస్, డేరియస్, క్జెరెక్సెస్ మొదలైన వారి కాలాల్లో, గ్రీస్ దేశంలోని వివిధ ప్రాంతాలపై దండెత్తి, వారు జరిపిన సలామిస్ యుద్ధం ( క్రీ.పూ. 480) , ప్లాటియా యుద్ధం (క్రీ.పూ. 479), హిమెపాయుద్ధం (క్రీ.పూ. 480), మారథాన్ యుద్ధం వంటివి గ్రీక్‌ల చరిత్రలో ఎంతో ప్రధాన ఘట్టాలుగా పరిగణించబడ్డాయి. ఈ రకమైన అంతర్యుద్ధాల, యుద్ధాల ప్రభావం వల్ల, గ్రీక్‌లంతా ఒక సామూహికమైన సమైక్యాన్ని పెంపొందింపజేసుకొని, క్రీ.పూ. నాల్గవ శతాబ్దాంతానికి, అలెగ్జాండర్ కాలంలో విశిష్టమైన రాజకీయ వ్యవస్థ ఏర్పడటం జరిగింది.

## 19.4.3 ఆర్థిక వ్యవస్థ

దేశంలో వుండే ఆర్థిక వ్యవస్థ లక్షణం, అస్థిరత్వం. క్రీ.పూ. 8వ శతాబ్దానికి చెందిన బోయ్‌షియా (Boeotia) కు చెందిన హెసియాడ్ (Hesiod) కవనం వంటివి, ఆనాటి ఐరోపాలోని తూర్పు భాగానికి చెందిన ఆర్థిక వ్యవస్థను వివరిస్తున్నాయి. డొరియన్ దండయాత్రలకు ముందు, గ్రీస్ దేశంలో చిన్న చిన్న గ్రామాలు మాత్రం ఉండేవి. విడివిడిగా ఉండే కొన్ని గ్రామాలు ఒక సమూహంగా ఉండటానికి, ఒక గోడను కట్టేవారు. గ్రామాలలో వివిధ వర్గాలకు చెందిన వారుండేవారు. వ్యవసాయ వృత్తుల ప్రాబల్యమున్నా, భూమి వ్యవసాయపరమైన ఫలసాయం అందించడానికి తగినంత సుసంపన్నమైనది కాదు. అందువల్ల, వారు వ్యావసాయికేతరమైన ఆహార వ్యవస్థను, చేపల వగైరాల ద్వారా పెంపొందించుకొన్నారు. దానివల్ల వారి ఆర్థిక వ్యవస్థలోనే నౌకాయానం ప్రధానంగా పెంపొంది, పారశీకుల కాలం నాటికి గ్రీక్‌లు బలవత్తరమైన నౌకా శక్తిగా కూడా పెంపొందారు. వ్యవసాయం సరిగా ఉండనందువల్ల, తొలి రోజుల్లో దోపిడీ ఒక ప్రధాన వృత్తిగా వుండేది. క్రీ.పూ. 8వ శతాబ్దం నాటికి బోయ్‌షియా మొదలైన ప్రాంతాలలో రైతుల స్థితి ఎంతో దుస్తరంగా వుండేది. ధనికుల ప్రాబల్యం సామాన్య రైతుల మీద ఎంతో హెచ్చుగా వుండేది. హెలికాన్ వంటి చోట్ల, పర్వతపు చరియల వద్ద సాగుచేసుకొనే రైతులు సైతం, ధనికుల దోపిడీకి గురి అవుతుండేవారు. ఈ రకమైన అస్థిరత్వమే, గ్రీస్ వ్యవస్థలో సైనికులను, దొంగలను పెంపొందించింది.

గ్రీక్‌లు ధనికస్వామ్యకాలం నాటికి, వర్తక వ్యవస్థను పెంపొందించుకొన్నారు. ఆ వర్తక వ్యవస్థ మొత్తం జలమార్గాల మీదనే ఆధారపడి వుండేది. అందువల్లనే, గ్రీక్‌లలో కొన్ని పుణ్యక్షేత్రాలను మినహాయించి, రోడ్ల నిర్మాణాన్ని చేపట్టడం జరగలేదు. వాళ్ళు సముద్రయానానికి ఎంత అలవాటుపడ్డా, సముద్ర జలాల స్వభావం పట్ల ఎంతో భయాన్ని, పిరికితనాన్ని వ్యక్తం చేసేవారు. రాను రాను వలసలు పెరగడం మొదలయ్యాక, 17 మంది

తెడ్డు వేసే వాళ్ళు గల పెద్ద పెద్ద యుద్ధనౌకలను ఏర్పరచుకొన్నారు. దీనిని మొట్టమొదట కారింథ్‌లో ప్రవేశపెట్టడం జరిగింది.

## 19.4.4 మత వ్యవస్థ

గ్రీక్‌ల కాలంలో మత వ్యవస్థ ఒక ప్రత్యేకమైన స్వభావాన్ని కలిగి వుంది. అన్ని దేశాలలోలాగే గ్రీస్ దేశంలో కూడా, ప్రపంచ ప్రసిద్ధమైన రీతిలో ప్రకృతి శక్తుల ఆరాధన ముందుగా చోటుచేసుకుంది. వీరి దేవుళ్ళలో ప్రసిద్ధులైన అపోల్లో, జీయస్, పొసిడాన్ అంతా పురుషులే. సూర్యుణ్ణి, మెరుపులు, వానలను సృష్టించే వరుణ దేవుని, సముద్ర భూగర్భాధిపతిగా ఉంటూ, భూకంపాలను సృష్టించే దేవుని ఆరాధించేవారు. అట్లాగే స్త్రీత్వం మూర్తీభవించిన వీనస్‌ను, ఇతరత్రా ఉండే యక్షిణులు, అప్సరసల వంటి దేవతలు గ్రీక్ సంస్కృతిలో ఎంతో ముఖ్యాంశం. అదేవిధంగా వీరు డెల్ఫి మొదలైన చోట్ల ,పెద్ద పెద్ద దేవాలయాలను నిర్మించడం, వారి ఆచారాలలో ఒకటి. అంతేగాక, గ్రీక్‌ల జన జీవనంలో మతాచారాలకు చెందినది జోస్యం ఒకటి. దానినే ఓరకిల్ (Oracle) అని వ్యవహరించేవారు. డెల్ఫి దేవాలయంలో చెప్పబడే ఈ జోస్యం ఎంతో ప్రసిద్ధి పొందింది.

గ్రీక్‌ల సంస్కృతిలో ఇంకొక ముఖ్యమైన మతౌన్నత్యాన్ని సూచించే అంశం, పౌరాణిక గాథలు. వివిధ వీరుల అద్భుత కృత్యాలను, అసాధరణ సాహస యాత్రలను వర్ణించే అనేక గేయాలను, ప్రాచీన గ్రీస్ దేశపు కవులు కల్పించారు. హోమర్ రాసిన ఇలియడ్ , ఒడిస్సీ కావ్యాలు, థేబ్స్‌కు చెందిన పిండార్ కవి రాసిన 'ఓడ్స్ ' వంటి ఖండ కావ్యాలు, రాజకీయపరమైన చర్యాక్షేత్రాలు వేరయినా, సామూహికత్వాన్ని, జాతీయతను అభివ్యక్తం చేస్తూ, గ్రీకుల మత వ్యవస్థకు ఆనుషంగికమైన వ్యవస్థగా రూపొందాయి. కాగా, రాను రాను కొన్ని కొత్త మత విధానాలు కూడా రూపొందాయి. వానిలో అతి ముఖ్యమైనది,భక్తి తత్త్వంవంటి ఓర్ఫిక్ (Orphic) మతం. ఈ మతం బాబిలోనియాలోని కొన్ని సంప్రదాయాల నుండి, పారశీక దండయాత్రల కాలంలో, గ్రీస్ దేశంలోకి వ్యాపించింది. ఈ విధానంలో కాలం ప్రధానమైన సూత్రం. 'కాలాయనమః ' అనే సిద్ధాంతంలో, యావత్ సృష్టి కాలం వల్ల జన్మించిందే. ఈ విధానాన్ని అనేకమంది విజ్ఞాన వేత్తలు, శాస్త్రవేత్తలు ఆకృష్టులై స్వీకరించారు. వారిలో పైథాగరస్ అనే గణిత శాస్త్రవేత్త ఒకడు. కాని, ఈ రకమైన మత సిద్ధాంతాలు ఎంతో కాలం గ్రీక్‌ల ఆదరణను పొందలేక పోయాయి.

## 19.4.5 తత్త్వ చింతన

గ్రీక్‌ల మత వ్యవస్థ వలెనే, తత్త్వచింతన కూడా ఎన్నో దశలను దాటింది. వాటిలో ప్రధానంగా రాజ్య రాజకీయ వ్యవస్థకు చెందినవి ఒకటి. సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ మొదలైన తత్త్వవేత్తలు సామాజిక వ్యవస్థను, రాజకీయ వ్యవస్థను తమ తత్త్వచింతనకు ఆధారంగా చేసుకొని, తార్కికమైన విశ్లేషణల ద్వారా, రాజ్యేతరమైన అంశాలను వేటినీ నిరూపించక, రాజకీయ పరమైన స్థిరత్వం, ప్రగతిని జీవిత లక్ష్యంగా రూపించి, బోధించారు. కాగా, స్టొయిక్స్ అనే.వారు వేరొక బుద్ధి విశేషాన్ని ప్రోత్సహించారు. వీరేకాక హిపోక్రట్స్ వైద్య విజ్ఞానం ద్వారాను, హెరోడోటస్ చారిత్రక విశ్లేషణ ద్వారాను, తార్కిక చింతనను, విజ్ఞాన వివేచనను, తత్త్వ వివేచనలో ప్రోత్సహించారు.

## 19.4.6 కళలు

గ్రీక్‌ల కళా వ్యవస్థ, వాస్తు శిల్పం ఎన్నో ప్రత్యేకతలను కలిగి వుంది. సోఫికిల్స్, ఎకిలిస్ వంటి వారు రాసిన విషాదాంత నాటకాలు, పిండార్ వంటి వారు రాసిన ఓడ్స్ ; హోమర్ రాసిన ఐతిహాసిక కావ్యాలు, గ్రీక్‌ల భాషాపరమైన కళా విపరిణామంలోని అనేక పరిణామ దశలే. కాగా, గ్రీక్‌ల శిల్పం ఎంతో ప్రశస్తమయిన

BRAOU

లక్షణాలను కలిగి వుంది. పురుషుల శిల్పాలను చెక్కడంలో, గ్రీక్‌లు అంగ సౌష్టవానికి ఎంతో ప్రాముఖ్యమిచ్చారు. ఎత్తైన పర్వతాలు ఇచ్చిన స్ఫూర్తితో, మానవులలో పర్వతాలకు ప్రతీకగా పురుషులను, చంచలమైన ప్రకృతికి ప్రతీకగా స్త్రీలను రూపొందించారు. గ్రీక్‌ల కాలం నాటి వాస్తు నిర్మాణాలు నిరుపమానమైన లక్షణాలు కలిగి వున్నాయి. సూసా, ఎక్బటనా వంటి ప్రాంతాలలో పారశీకులు రూపొందించిన విధానాలు గ్రీక్‌ల వాస్తు సంస్కృతిలో భాగం కాగా, డోరియన్, అయోనియన్ వంటి నిర్మాణ ప్రక్రియలు, గ్రీక్‌లు సహజంగా పెంపొందించుకొన్న వాస్తు నిర్మాణాలకు, వాని శైలీ విన్యాసానికి గుర్తులు. ఎత్తైయిన స్తంభాలు, రేఖా గణిత నమూనాలతో కూడిన వివిధాలంకరణలు, గ్రీస్ దేశంలోని వాస్తు అంశాల లక్షణాలు. గ్రీక్‌ల లౌకిక నిర్మాణాలలో నాటక ప్రదర్శన శాలలు ఎంతో పేరుపొందాయి.. వాటిని స్కేనె అనేవారు. దేవాలయాలు, తదితర నిర్మాణాలలోని శిల్పాలు, మానవ జంతు విగ్రహాలు, ఉబ్బెత్తు శిల్పాలు ఉండేవి. ఏథెన్స్ లోని ఆక్రోపోలిస్‌లోని దేవాలయం కూడా ఎంతో పేరు పొందిన కట్టడం. ఇవన్నీ ప్రధానంగా స్థిరాత్మకమైన రేఖా గణిత ప్రవృత్తికి వస్తురూప ప్రతీకలే.

## 19.5 సంగ్రహంగా

1. గ్రీస్ దేశం, గ్రీక్ నాగరికత పర్వతాల చేత, సముద్రం, అగాథాల చేత ప్రభావితమయింది.

2. పురావస్తు ఆధారాలు, సాహిత్య ఆధారాలు రెండూ కూడా గ్రీస్ దేశపు నాగరికతను అవగాహన చేసుకోడానికి ఎంతో ముఖ్యమైనవి.

3. గ్రీస్ దేశంలో వైవిధ్యంలో ఏకత్వం ఒక ప్రధాన లక్షణం.

4. గ్రీస్ దేశపు సమాజంలో ధనికులు, బానిసల వంటి వారి వ్యవస్థ ఎంతో ప్రాథమికమైనది. అన్ని కాలానుగుణమైన మార్పులు కేవలం ఈ పునాది మీదనే సంభవించాయి.

5. గ్రీస్ దేశపు రాజకీయ వ్యవస్థలో ప్రజాస్వామ్యం, నిరంకుశత్వం, రాచరికం మూడూ కూడా యథోచితమయిన, కాలానుగుణమైన స్థానాన్ని పొందాయి.

6. నగర రాజ్యాలు గ్రీస్ దేశపు రాజకీయ వ్యవస్థలో పేరెన్నికగన్నవి. స్పార్టా, ఏథెన్స్, కారింథ్, థేబ్స్ వంటి నగర రాజ్యాలు ఎంతో పేరుపొందాయి.

7. పర్వతాలు, సముద్రం, పారశీకుల ఎడతెగని దాడులు, గ్రీక్‌లను ఇంచుమించు ఒక యుద్ధజాతిగా తీర్చిదిద్దాయి.

8. విద్యావిధానం యుద్ధ ప్రమాణాలకు అనుగుణంగా వుండేది.

9. గ్రీస్ దేశంలో బలహీనమైన వ్యావసాయిక వ్యవస్థ వుంది.

10. ప్రకృతి వనరులు సరిగా లేకపోవడం, సామాజికమైన అంతరాలు వ్యావసాయిక వ్యవస్థను మరింత బలహీనపరిచి, ఆర్థిక వ్యవస్థను కూడా మరింత బలహీనంగా పరిణయించడంలో తోడ్పడింది.

11. నగర రాజ్యాలు విస్తృతమైన విధానాన్ని అనుసరించిన తరవాత మాత్రమే, గ్రీక్‌ల వాణిజ్య వ్యవస్థ కొంత మెరుగుపడింది.

12. గ్రీక్‌లు ప్రకృతి శక్తుల ప్రధానమైన ఆరాధనను, జోస్యం లాంటి నమ్మకాలను కలిగి వుండేవారు.

BRAOU

13. అపోల్లో, జీయస్, పోసిడాన్ మొదలైన శక్తివంతమైన దేవతామూర్తులకు గ్రీక్‌లు స్వాలంకృతమైన పెద్ద పెద్ద దేవళాలను నిర్మించేవారు.

14. గ్రీక్‌లలో ప్రకృతి విశ్లేషణ, రాజ్య విశ్లేషణతో కూడి, పరమ తార్కికమైన భావాలు తత్త్వవివేచనకు పునాదులుగా ఏర్పడ్డాయి.

15. గ్రీస్ దేశపు నాగరికతలో పౌరాణిక గాథలను చాటి చెప్పే ఐతిహాసిక కావ్యాలు, జాతీయైక్యాన్ని ప్రోత్సహించే ఓడ్స్ వంటి కావ్య ఖండికలు, ఎంతో పేరుపొందాయి.

16. వ్యాయామశాలలు, నాటకశాలలు, పెద్ద పెద్ద పోటీలు, గ్రీక్‌ల జీవన విధానంలో ఎంతో ప్రాముఖ్యాన్ని పొందాయి.

17. విజ్ఞానం, సాహిత్యం, లైకికోత్త్రేరకమైన దార్శనికత, గ్రీక్‌ల ఆలోచనా సరళికి మూడు కోణాలు (Dimensions) గా ఆ నాగరికత పెంపొందింది.

18. స్టాయిక్స్‌ల వంటి తత్త్వవేత్తలు, ఆర్ఫిక్ వంటి మత వ్యవస్థ, గ్రీక్‌లలో కొన్ని అసాంప్రదాయిక భావనల ప్రాశస్త్యాన్ని వివరిస్తాయి.

19. గ్రీక్ శిల్పకళ, వాస్తుకళ, పర్వతాలు, సముద్రం వంటి ప్రాకృతికాంశాలు కలిగించే స్ఫూర్తివల్ల, ఎంతో ప్రభావితమయినవి దాని వల్లనే.

## 19.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. గ్రీక్ నాగరికతా లక్షణాలను సమీక్షించండి.

**II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. గ్రీక్‌ల నాగరికతా సంస్కృతులను తెలుసుకోడానికి గల చారిత్రకాధారాలు

2. గ్రీస్ భౌగోళిక పరిస్థితుల ప్రభావం

3. గ్రీక్ కళాభివృద్ధి లక్షణాలు

## 19.7 ఉపయుక్త గ్రంథాలు


J.B. Bury : **A History of Grece,** 1913.

F. Korodkin : **Ancient World History,** 1987.

George Guest : **The March of Civilization,** 1966

W. Ward Foler : **The City State of the Greeks and Romans.**


BRAOU

## 19.8 పదకోశం

రినైసాన్స్ : సాంస్కృతిక పునరుజ్జీవన కాలం క్రీ.శ. 1453 నుండి

పెలోపోనీషియన్ : దక్షిణ గ్రీస్‌కు గల పేరు

థెర్మోపైలా : గ్రీస్ లోని ఒక కనుమ

నాయ్‌టాయ్ : రాష్ట్రంచే నిర్వహించబడే బానిస రైతు

అఫమియొటాయ్ : ప్రైవేట్ రైతు బానిసలు

క్లారోట్స్ : పౌర సమూహాల బానిసలు

హెలట్స్ : స్పార్టా లోని బానిసలు

అగెలాయి : బాలుర సైనిక సమూహం

డ్రొమాయ్ : ప్రభుత్వం నిర్వహించే వ్యాయామశాలలు

డ్రొమీ : వ్యాయామశాలల్లో సభ్యులు

అపోలో : సూర్యుడు

జీయస్ : వరుణ దేవుడు

పోసీడాన్ : సముద్ర దేవుడు

వీనస్ : స్త్రీ దేవత

ఓరకిల్ : జోస్యం ( డెల్ఫిలో చెప్పేవారు)

స్టాయిక్స్ : తత్త్వజ్ఞులలో ఒక శాఖ

ఓర్ఫిక్ : భక్తితత్త్వం వంటి ఒక మతం

BRAOU

చెల్లిస్తూ భూమికి హక్కుదారులయ్యారు. ఇతని కాలంలో లారియన్ (Laurion) లో వుండే వెండి గనులను తవ్వడంతో బాటు, ఆటికాలో ఆలివ్ తోటల పెంపకం హెచ్చు చేశాడు. వీని ద్వారా పిసిస్ట్రాటస్ ప్రభుత్వాదాయాన్ని పెంచడానికి గల మార్గాలను ఆచరణపూర్వకంగా చూపించాడు. ఇతడు డార్డనెల్స్ పర్యంతం తన అధికారాన్ని పెంచుకొన్నాడు. పిసిస్ట్రాటస్ క్రీ.పూ. 528 - 527లలో మరణించాడు. ఇతడు స్పార్టాతో ఎన్నో సత్సంబంధాలను పెంచుకొన్నాడు. ఇతని మృతి తరవాత ఇతని సోదరుడయిన హిప్పియాస్ స్పార్టాతో స్నేహాన్ని కాంక్షించాడు. కాని, అతనిని స్పార్టన్లు పారశీకుల మద్దతుదారుడుగా భావించడంతో, క్లియోమెన్స్ ప్రభువయ్యాడు. కాని, అతడు స్పార్టాతో ఉండే వైరం ఫలితంగా, బలహీనుడయ్యాడు. స్పార్టా, ఏథెన్స్ వ్యవహారాలలో జోక్యం కలగజేసుకొంది. దానిని సహించని స్థితిలో, ఆల్కమెనిడ్ వంశానికి చెందిన క్లీస్థనిస్ క్రీ.పూ. 508లో అధికారంలోకి వచ్చాడు.

క్లీస్థనిస్ ఏథెన్స్ రాజ్యాంగంలో ఎన్నో కొత్తవైన, మౌలికమైన మార్పులను చేపట్టాడు. వేర్వేరు తెగల రాజకీయ ప్రాబల్యం పెరగడం వల్ల , ప్రతి పక్షాలు స్థానికంగా అభిప్రాయ తేడాలు కలిగి వుండటం వల్ల, రాజకీయ అస్థిరత్వం ఏర్పడింది. అందువల్ల, అతడు తెగలకున్న రాజకీయ ప్రాముఖ్యానికి స్వస్తిచెప్పి, ప్రత్యామ్నాయంగా కొత్త విధానాన్ని అమలు చేశాడు. ఇతడు వాస్తవంగా ఆచరణ దృక్పథంతో కొత్త విధానాన్ని అనుసరించి, ప్రజాస్వామ్యాన్ని ఒక వాస్తవంగా చేయాలనుకొన్నాడు. అయోనిక్ జాతుల వారి ప్రాబల్యాన్ని, బంధుత్వ వర్గాలను సూచించే ఫ్రాట్రీలు, తెగలను వారి రాజకీయ ప్రాబల్యాన్ని, నౌకలను ఏర్పరచడం కోసం గాను, తెగలలో ఏర్పరిచిన నౌక్రరీ అనే విభజనలనుగాని, అంతం చేసే రీతిలో ఒక కొత్త ప్రణాళికను ఏర్పరచాడు. తత్ఫలితంగా స్థానిక పక్షాల ప్రాబల్యం తొలగించబడి, దానివల్ల ప్రజాస్వామ్యానికి ఏ రకమైన ప్రమాదం వాటిల్లని స్థితి ఏర్పడింది. ప్రజా వ్యవహారాలలో నగర రాజ్యంలోని ప్రతి ఒక్కరికి నిర్దిష్టమైన, స్పష్టమైన స్థిరమైన పాత్ర లభించింది.

ఏథెన్స్‌కు అనుబంధంగా వున్న ఆటికా సమాఖ్యను నగర భాగంగాను, తీర భాగంగాను, అంతర్భాగంగాను విభజించాడు. వాటిని మళ్ళీ ఒక్కొక్కదానిని పది ట్రిట్టీలు (Trittyes) గా విభాగించాడు. మొత్తం 30 ట్రిట్టీలు ఏర్పడ్డాయి. వానిలో వుండే ప్రధాన ప్రజల జాతుల పేర్ల ఆ ట్రిట్టీలుగా పిలవబడ్డాయి. వాటిని మళ్ళీ పది ప్రధానమైన భాగాలుగా ఏర్పరిచాడు. ప్రతి భాగంలోను మూడు ట్రిట్టీలుంటాయి. ఏ భాగంలోను ఒకే ప్రాంతం నుండి అంటే నగర, తీర, అంతర్భాగ ప్రాంతాల నుండి రెండు ట్రిట్టీలు కలిగి వుండవు. పట్టణ ప్రాంతంలోని ట్రిట్టీలను కైడథెనయన్ (Kydathenaion) అంటారు. అంతర్భాగంలోని ట్రిట్టీలను పానియా (Paenia) అంటారు. తీర ప్రాంతంలోని ట్రిట్టీలను మైరినస్ (Myrrhinus) అంటారు. వీటి మూడింటి ఏర్పాటులోను ఒకే జాతి మనుషులు ఉంటారు. ఆ రీతిగా కొత్తగా పది జాతులను ఏర్పరిచారు. అవి ఎరెక్థిసిస్ (Ericthesis), ఏజిస్ (Aggis), పాండియానిస్ (Pandianis), లియాంటిస్ (Leontis), అకమాంటిస్ (Acamantis), ఓనిస్ (Oenis), కెక్రోపిస్ (Cecropis), హిప్పోథోంటిస్ (Hippothontis), ఆంటిస్ (Aeantis), ఆంటియోకిస్ (Antiochis) అనేవి. ఈ జాతులకు డెల్ఫిలో వుండే పూజారిణి ఆమోదం లభించింది.

ఈ జాతుల వాళ్ళు, ప్రజలు, ప్రభుత్వాధికారులు, ప్రభుత్వ సభలు, ప్రభుత్వ ఆస్తితో సంబంధం కలిగి వుండేవారు. దీని సాధారణ నాయకుని డెమార్క్ అనేవారు. డెమార్క్ ఆధ్వర్యంలో ప్రతి 17 ఏళ్ళు దాటిన వ్యక్తి పౌరుడిగా నమోదయ్యేవాడు. ఈ తెగలు ఒక్కొక్కటి ఒక పదాతి దళాన్ని, ఒక అశ్వ దళాన్ని ప్రభుత్వానికి ఇవ్వవలసి ఉంటుంది. ట్రిట్టీలకు ఇటువంటి రాజ్యాంగం ఏదీ ఉన్నట్లు కనిపించదు. ప్రజలకు, తెగలకు గల సంబంధం మీదనే, క్లీస్థనిస్ సంస్కరణలన్నీ ఆధారపడి వున్నాయి. వారి వారి ప్రాంతాల ఆసక్తులు, సమస్యలతో సంబంధం లేకుండా, ఆటికాలో అందరు ఏథెన్స్‌లో సమావేశమై, ప్రభుత్వాంశాలను చర్చించవలసి ఉండేది. ఈ వ్యవస్థను రాజకీయావసరాల కోసం ఏర్పరిచినా, సామాజిక వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా చేసి, రాజకీయ

BRAOU

వసూళ్లకు వినియోగించుకోడం జరిగింది. ఈ పది జాతులు కృత్రిమంగా ఏర్పడ్డా, పూర్వం గల జన్మమీద ఆధారపడ్డ నాలుగు జాతుల స్థానే అభివృద్ధి చెందాయి. ఇది క్లీస్థనిస్ చేసిన గొప్ప మార్పు. ఈ పద్ధతిలో ప్రజలను వారి నివాసం ఆధారంగా గుర్తించేవారు కాని, వారి తండ్రి పేరు వల్ల కాదు. అప్పుడు నివాసం మారినా కూడా, తొలి నివాసం లెక్కలోనే ప్రజలను లెక్కించేవారు.

క్లీస్థనిస్ పాత పద్ధతిలో నాలుగు అయోనిక్ జాతుల ప్రాబల్యం గల 400 మంది సభ్యుల సంఘం కాక, కొత్తగా ఏర్పరచిన పది తెగల / జాతులతో కూడిన 500 మంది సభ్యులు గల సంఘాన్ని ఏర్పరిచాడు. ప్రతి తెగ నుండి 50 మందిని లాటరీ పద్ధతిలో ఎన్నుకునేవారు. వారిలో సత్ప్రవర్తన లేని వారిని, పదవీ విరమణ చేయబోయే 50 మంది సంఘం తిరస్కరించవచ్చు. ఇది రాజ్యంలో ఉన్నత సంస్థ ; న్యాయవాదుల, న్యాయమూర్తుల సలహా, సహకారాలతో ప్రజా వ్యవహారాలను నిర్వహించేది. ఆర్కాన్‌ల మీద, తదితర న్యాయమూర్తుల మీద అధికారం వుండేది. రాజ్యంలోని ఆర్థికాధికారాలు ఈ సంఘానికే చెందేవి. కొత్తగా పదిమంది అపోడెక్టాయ్ (Apodectoi) అనే ఆర్థికాధికారులను, ఒక్కొక్క తెగ నుండి ఒక్కొక్కర్ని, నియమించడం జరిగింది. ఈ సంఘం ప్రజాహిత కార్యక్రమాలను, యుద్ధ విషయాలను కూడా పర్యవేక్షించేది. దీనికి యుద్ధ ప్రకటనచేసే అధికారం లేదు. కాని, విదేశీ వ్యవహారాలను సమీక్షించడం జరిగేది. ఈ సంఘం న్యాయపరమైన విధులను, శాసనపరమైన విధులను నిర్వహించేది. ఉన్నత ప్రభుత్వ సభను ఎక్లీషియా అనేవారు. దానిలో ఆమోదించిన ప్రతిదీ, ప్రొబులోమా (Probuloma) అనే రీతిలో ఈ సంఘానికి పంపేవారు. దీని ఆమోదం పొందిన తరవాత, అది సెఫిస్మా (Psephisma) గా మారేది. న్యాయపరమైన విధులలో పదవి నుండి తొలగించడం, జరిమానా వేయడం, శిక్ష విధించడం, లేదా ఇంకొక కోర్టుకి పంపడం వంటివి, దీని విధులు.

ప్రభుత్వ కార్యాలన్నిటినీ 500 మంది కూర్చొని నిర్వహించడం వీలు కాదు కనుక, సంవత్సరానికి గల 360 రోజులను పది భాగాలు చేసి, ప్రతి 36 రోజులకి ఒక్కొక్క తెగలోని 50 మంది సభ్యులు నిర్వహించేవారు. ఆ సభ్యులను ప్రిటానీ (Prytanies) లు అనేవారు; అప్పటి తెగను ప్రిసైడింగ్ తెగ అనేవారు. అలాగే సంవత్సరంలోని యీ విభజనలను కూడా, ప్రిటానీలు అనేవారు. తన రాజ్యాంగ సంస్కరణలకు, కార్య కలాపాలకు అనుగుణంగా ఉండేటట్లు, క్లీస్థనిస్ సంవత్సరాన్ని కూడా సవరించాడు. చాంద్రమాన సంవత్సరానికి, సౌరమాన భ్రమణానికి మధ్య గల తేడా ఎనిమిదేళ్ళుండగా, ప్రతి 1, 3, 6 సంవత్సరాలలో అధిక మాసాలు ఉండేవి. కాగా, సామాన్య వత్సరం 354 రోజులు వుండగా, అధికంతో కూడా సంవత్సరం 384 రోజులు అవుతుంది. అందువల్ల, క్లీస్థనిస్ 360 రోజులను ప్రమాణంగా తీసుకొని, ప్రతి ఐదేళ్ళకు ఒక అధిక మాసం వచ్చేటట్లు, ఆ మాసం ఎప్పుడు ఒకటిగానే కాక, వరసగా అన్ని మాసాలలోను వచ్చేటట్లు ఏర్పాటు చేశాడు. ఈ కాలం క్రీ.పూ. 503 - 2 లో ప్రారంభమైంది.

ఇతని కాలంలో పౌరసత్వం కూడా పరిమితంగా వుండేది. ద్రవ్య మారక వ్యవస్థ వల్ల వచ్చిన ఆదాయ గణనంలోని మార్పు, సోలన్ కాలం నుండి క్లీస్థనిస్ కాలం వరకు వచ్చిన మార్పులకు కారణమైంది.

క్లీస్థనిస్ కాలంలో సైనిక నిర్వహణలో కూడా మార్పు వచ్చింది. ప్రధానంగా ఈ పది జాతుల నుండి 10 మంది సేనానులను ఎన్నుకొనేవారు. ప్రతి జాతి నుండి 1 దళం పదాతులు, 1 దళం అశ్వాలు ఇవ్వబడేవి. సేనానులను నియామకం ద్వారా గాక, ఎన్నిక ద్వారా తీసుకొనేవారు.

ఈ రకమైన సంస్కరణల ద్వారా గ్రీస్ దేశంలో ఒక ప్రజాస్వామ్య వ్యవస్థ అంకురించి, అభివృద్ధి చెందింది. చిన్న రాజ్యాలవడం వల్ల, ప్రజా సంస్థలకు, సంపూర్ణాధికారం ఇవ్వలేదు. ఈ పరిణామమే, పెరికిల్స్

BRAOU

కాలం ఏథెన్స్‌కు స్వర్ణ యుగాన్ని సంప్రాప్తింపచేసింది. పై పరిశీలనల వల్ల, డ్రాకో, సోలన్, పిసిస్ట్రాటిస్, క్లీస్థనిస్ మొదలైన వారి కాలాల్లో తీసుకొనిన రాజకీయ చర్యల ఫలితంగా, రాచరిక వ్యవస్థ మందగించి, హెలెనిక్ నాగరికతకు ఫలప్రాయమైన ప్రజాసామ్య విధానం అభివృద్ధిలోకి వచ్చింది. కాని, పారశీక యుద్ధాలు, పెలోపొనీషియన్ యుద్ధాలు చూపిన ప్రభావం వల్ల, ప్రజాస్వామ్య వ్యవస్థ అనతి కాలంలోనే మందగించింది. దాని స్థానంలో, అలెగ్జాండర్ కాలం నుండి తిరిగి రాచరిక వ్యవస్థ కొత్త దనం సంతరించుకొని, హెలెనిస్టిక్ నాగరికతకు నాంది పలికింది. హెలెనిస్టిక్ నాగరికతలో ప్రజాస్వామ్యం లేదు. ఈ రకమైన పరిణామంలో ఏథెన్స్ , స్పార్టా నగర రాజ్యాలు ఎంతో గొప్ప పాత్రను నిర్వహించాయి.

## 20.4.2 నగర రాజ్యాలు

**స్పార్టా :** ఇది ప్రధానంగా సైనిక రాజ్యం. శరీరదార్ఢ్యం వున్న అందరూ దీనిలో సైనికులే. వారు ఎక్కువగా సైనిక శిక్షణనే కేంద్రీకరించారు. ప్రభుత్వమే ఈ రకమైన శిక్షణా సౌకర్యాలను కలిగించేది. బానిసలు సేద్యం, ఇతర శారీరక శ్రమను నిర్వహించేవారు. పౌరుడు రాజ్యం కోసం యుద్ధం చేయడం, ప్రాణాలర్పించడం అతి మామూలు విషయం. సైనిక శిక్షణ, వ్యాయామం, రెండింటికీ ప్రతి పౌరుడు లొంగవలసి వచ్చేది. రాజ్యాన్ని పదవీ విరమణ చేసిన కొందరు వృద్ధులు నిర్వహించేవారు. వారందరికి ప్రజల మీద సంపూర్ణాధికారం వుండేది. వృద్ధుల మండలిని గెరూసియా (Gerusia) అనేవారు. దానిలో ఇద్దరు రాజులు, ఇరవై ఎనిమిది మంది పెద్దలు ఉండేవారు. ప్రభుత్వాన్ని నిర్వహించడానికి ఎఫార్స్ అనే ఐదుగురు అధికారులుండేవారు. వారికి అపరిమితమైన అధికారాలుండేవి. వారు రాజ్యానికి, పౌరులకు, రక్షణగా వుండేవారు. స్పార్టాలో పరిశ్రమలు తక్కువ. ఏథెన్స్‌తో పోలిస్తే ,పేద నగర రాజ్యం. స్పార్టాలో పౌరులు వెండి బంగారాలు ఉపయోగించకుండా, వ్యాపారంలో ప్రవేశించకుండా నిషేధించారు. స్పార్టా , సైన్యం కోసం, సైన్యం చేత ఏర్పడ్డ, సైనికుల రాజ్యంగా ఉండేది.

**ఏథెన్స్ :** ఏథెన్స్ ఏజియన్ సముద్రానికి చెందిన సరోనిక్ అఖాతం తీరానికి సమీపంలో వుండేది. ఇది అట్టికా అనే సమాఖ్యకు చెందింది. సముద్ర తీరానికి సమీపంలో ఉండటం వల్ల, ఏథెన్స్ తప్పనిసరిగా వర్తక వ్యాపారాలలో పాల్గొనవలసివచ్చింది. అంతేకాక, ఏథెన్స్‌ను పాలించిన డ్రాకో, సోలన్, పిసిస్ట్రాటస్, క్లీస్థనిస్ వంటి ప్రభువుల సంస్కరణ వల్ల, ఏథెన్స్‌లో ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందింది.

ఈ రాజ్యాన్ని 9 మంది ఆర్కాన్‌లు పాలించేవారు. ఏరియోపాగస్, ఎక్లిషియా, అనే రెండు సభలు ఎంతో ప్రాముఖ్యాన్ని కలిగి వుండేవి. ఏరియోపాగస్ , ఎక్లిషియా అనే రెండు సభలు ఎంతో ప్రాముఖ్యాన్ని కలిగి ఉండేవి. ఏరియోపాగస్ అనేది వృద్ధుల సభ కాగా, ఎక్లిషియా అనేది, ఏరియోపాగస్‌కు, 500 మంది సభ్యుల సభకు సలహాల నిచ్చే సంఘం. అంతేకాక, వారి నుండి కూడా ఆజ్ఞలను తీసుకోడం జరిగేది. ఏథెన్స్‌లో డ్రాకో, సోలోన్, క్లీస్థనిస్ సంస్కరణవల్ల, రాజకీయపరంగా ఉన్న తెగల, ముఖ్యంగా అయోనిక్ తెగల ప్రాబల్యం పూర్తిగా తగ్గి, రాజకీయాభివృద్ధి సంభవించింది. గ్రీక్ సంస్కృతికి ఏథెన్స్ హృదయం, మెదడు కూడా.

ఇతర నగర రాజ్యాలైన కారింథ్, థీబ్స్, థెసలీ వంటివి ఉన్నప్పటికీ, అవేవీ సాంస్కృతిక, సాహిత్య రంగాలలో ఏథెన్స్ ఘనతను, సైనిక సంప్రదాయాల్లో, స్పార్టా ఘనతను అతిక్రమించలేక పోయాయి. దానివల్ల, ఏథెన్స్‌కు, స్పార్టాకు మధ్య స్పర్థ సంభవించే పరిస్థితులు ఏర్పడ్డాయి.

గ్రీస్ దేశం మీదకి పారశీకుల దండయాత్రలు రాజ్యవ్యవస్థలో చెప్పదగినంత ప్రభావాన్ని చూపించాయి.



B R A O U

క్రీ.పూ. 490లో మారథాన్ యుద్ధం, క్రీ.పూ. 480లో సాలయిస్ యుద్ధం వంటివి, గ్రీక్ - పర్షియన్‌లకు జరిగిన యుద్ధాలలో గొప్పవి. గ్రీస్ దేశం మీదకు పర్షియాకు చెందిన సైరస్, డేరియస్, క్జెర్క్సెస్‌లు దాడులు సల్పడం ద్వారా, గ్రీస్ దేశంలో సమైక్యం పెరిగింది. తత్ఫలితంగానే గ్రీక్ రాజ్యాల సామూహిక ఐక్య సంఘటన సంభవించి, పర్షియన్‌ల పరాజయానికి తోడ్పడింది.

కాగా, తత్ఫలితంగా స్పార్టా, ఏథెన్స్‌ల మధ్య వైరం అంకురించి, పెలోపొనీషియన్ యుద్ధాలనేవి సంభవించాయి. ఈ యుద్ధాలకు కారణం, గ్రీస్ దేశం మీద ఆధిపత్యం, రెండు రాజ్యాల ఆదర్శాల, సంస్కృతుల మధ్య సంఘర్షణ. స్పార్టా సాంప్రదాయిక పద్ధతులు సంఘంలో కొన్ని వర్గాల అధికారానికి మద్దతునివ్వగా, ఏథెన్స్ ప్రజలందరి సామూహికాభివృద్ధిని , హక్కులను బలపర్చింది. ఈ యుద్ధాల ఫలితంగా గ్రీస్ దేశం యావత్తు నిర్వీర్యమైంది. ఏథెన్స్ , స్పార్టాల మధ్య క్రీ.పూ. 459 - 446 ల్లో మొదటి పెలోపొనీషియన్ యుద్ధం; క్రీ.పూ. 471 లో రెండో పెలోపొనీషియన్ యుద్ధం వల్ల ఏథెన్స్ పూర్తిగా పతనమైంది. ఆల్సిబయాడ్స్ (Alcibiades)ప్రోత్సాహం వల్ల జరిగిన మూడో పెలోపొనీషియన్ యుద్ధంలో స్పార్టా గెల్చినా, క్రీ.పూ. 405 నాటికి మళ్ళీ పారశీకుల స్పార్టాతో చేరి ఏథెన్స్‌ను ఎగొస్పొట్మి (Agospotmi) యుద్ధంలో ఓడించారు. క్రీ.పూ. 404 లో ఏథెన్స్ లొంగిపోయింది. కాగా, క్రీ.పూ. 371లో తెబ్స్ స్పార్టాను ల్యూక్రా (Leucra) యుద్ధంలో ఇపామిమాండస్ (Epamimondas) కృషివల్ల ఓడించింది. కాని, క్రీ.పూ. 362లో అతని మరణం తరవాత, తేబ్స్ తన ప్రతిష్ఠను కోల్పోయింది. ఈ స్థితిలోనే మాసిడోనియాకు చెందిన ఫిలిప్ నగర రాజ్యాలను సంధి ద్వారాను, యుద్ధం ద్వారాను లొంగదీసుకొని, తిరిగి హెలెనిస్టిక్ యుగారంభాన్ని చేశాడు.

ఫిలిప్ కుమారుడైన అలెగ్జాండర్ ( 337 - 321) తన తండ్రి ప్రారంభం చేసిన విజయాలను కొనసాగించి, యావత్ పారశీకుల రాజ్యాన్ని, ఈజిప్ట్‌ను ఆక్రమించి, భారతదేశంలోని రావి నది వరకు తన అధికారాన్ని విస్తరింప చేసి, హెలెనిస్టిక్ నాగరికతకు దోహదం చేశాడు.

## 20.4.3 రాజకీయ సిద్ధాంతాలు

పైన సంభవించిన రాజకీయ వ్యవస్థలోని పరిణామాల దృష్ట్యా, జాతి వ్యవస్థ, రాచరిక వ్యవస్థ, ప్రజాస్వామ్య పరిణామం, పర్షియా దాడులు, పెలోపొనీషియన్ యుద్ధాలు, హెలెనిస్టిక్ నాగరికతావతరణ అనే వివిధాంశాల ద్వారా గ్రీక్‌ల రాజ్య వ్యవస్థ స్వభావాన్ని, వారి రాజకీయ, సిద్ధాంతాలను ఈ క్రింది విధంగా అవగాహన చేసుకోవచ్చు.

గ్రీక్‌ల రాజకీయ సిద్ధాంతాలకు తొలిరూపం ఇచ్చిన వాడు ఏథెన్స్‌కు చెందిన ప్లేటో. ఇతడు రాజ్య వ్యవస్థను పొలిటిక్స్ అని వ్యవహరిస్తూ, దాన్ని మౌలికంగా మానవ ప్రవర్తనను నిర్దేశించే మూల సూత్రాల కలయిక అని భావించాడు. గ్రీక్‌లకు రాజ్యం, రాజకీయ వ్యవస్థ రెండూ కూడా సర్వం చేర్చుకొని వుండేవి. ప్లేటో మానవ ప్రవృత్తిలో ఉన్న ఉచ్చనీచ గుణాలను తెలుసుకొని, న్యాయ నిర్వహణకు సామాన్య జీవితాన్ని పరిపూర్ణం చేసుకోవాలి ; అది అవసరం అన్నాడు. మానవులంతా సమంగా సృష్టించబడరని భావిస్తే " గాడిదలు గుర్రాలతో బాటు, స్వతంత్ర పౌరుల హక్కులన్నిటితోను , హోదాలతోను ప్రవర్తించడానికి వీలుంటుంది. " అన్నాడు. మానవులలో వైవిధ్యం ఉన్నట్లే ప్రభుత్వంలో కూడా వైవిధ్యం వుండాలని, మానవులందర్నీ ఒకే విధంగా పాలించలేమని వివరించాడు. అతడు ప్రజాస్వామ్యంలోని లోపాలను వివరిస్తూ, ఆ వ్యవస్థలో అమర్యాదను శీలంగాను, అరాజకత్వాన్ని స్వేచ్ఛగాను, దుబారాను శ్రేష్ఠ లక్షణంగాను, సిగ్గుమాలినతనాన్ని సాహసంగాను పరిగణించడం జరుగుతుందన్నాడు. అతడు ప్రజాస్వామ్యం భయంకరమైన అడ్డంకులను ఎదుర్కొంటుందని; ఆ వ్యవస్థలో

BRAOU

ప్రజలకు ఉత్తమ పాలకులను ఎన్నుకోడానికి సరియైన విద్య ఉండదని, ప్రజాబాహుళ్యం పొగడ్తలకు లోనయి అవినీతి పరులైన పాలకుల చేతులలో చిక్కుకొని పోతుందని రాశాడు.

కాగా ప్లేటో శిష్యుడైన అరిస్టాటిల్ కూలిపని మనసును మొద్దుబార్చి అతని కుశాగ్రతను క్షీణింపజేస్తుందని, తద్వారా రాజకీయ చతురతకు అవకాశం ఉండదని, తీరిక ఉండే వ్యక్తులే ప్రభుత్వ యంత్రాంగంలో ఉండాలని అన్నాడు. ఆ అరిస్టాటిల్ ప్రకారం ఉత్తమ రాజకీయ వ్యవస్థ శ్రామికులకు పౌరసత్వాన్ని సమ్మతించడ మంటాడు. అరిస్టాటిల్ ఉద్దేశంలో రాజ్యం, సమాజం వేరు కాదు. రాజ్యం ప్రజలకు అత్యధిక శ్రేయస్సును కలగచేయాలి. అతడు సరైన రాజు ఉంటే రాచరికం శ్రేష్ఠమైనదని విశ్వసించాడు.

ఈ అభిప్రాయాల అభివృద్ధికి కారణం ప్రజాస్వామ్యం గల ఏథెన్స్ అనవసర స్పర్థలలో దిగి, యుద్ధాలు చేసి, ఆత్మహత్యా సదృశంగా మారిపోవడమే. దాని వల్లనే, అరిస్టాటిల్ సమర్థులైన , నిస్వార్థపరులైన కులీన వర్గీయుల పాలనను, మధ్య తరగతి పాలనను గౌరవించాడు. నిరంకుశ రాజ్యం, అల్పజన పాలన, ప్రజాస్వామ్యాలను నిరుపయోగంగా భావించాడు.

## 20.5 సంగ్రహంగా

గ్రీస్ దేశంలో ఏఖియన్‌లు, ఈలిస్‌లు, మినోవన్‌లు, డోరియన్‌లు, మొదలైన వివిధ జాతుల వారు ఒకరి తర్వాత ఒకరు నాగరికతా వికాసంలో చోటుచేసుకొన్నారు. డోరియన్‌ల రాకకు ముందు, పౌరాణిక వ్యక్తిత్వం గల హెలన్‌లను, డోరియన్‌ల రాక నుండి రాజకీయ వ్యక్తిత్వం గల హెలన్‌లను చూడొచ్చు. హెలెన్‌లు అనే ఈ గ్రీక్ సమాజంలో ఒకరి తర్వాత ఒకరి ప్రాబల్యం పెరగడం వల్ల , బానిస వ్యవస్థ అనివార్యమైంది. బానిసలను అమ్మడం, కొనడం, వారిని సేద్యానికి , యుద్ధానికి, ఇతర పనులకు వినియోగించడం, స్పార్టా వంటి చోట్ల వినోదానికి, విద్యకు బానిసలను చంపడం, గ్రీక్ సమాజంలో సామాన్యమైంది. స్త్రీలకు కూడా గౌరవంగాని, ప్రాబల్యం గాని, ఇంటి గడప దాటి రాలేదు. వారు ఏథెన్స్ వంటి చోట్ల తక్కువగా తెలిస్తే ఎక్కువగా గుర్తింపు పొందినట్లు భావించబడ్డారు. అన్ని చోట్ల యుద్ధంలోను, మతంలోను, వినోదాలలోను, రాజకీయాలలోను, పురుషులదే ప్రధానమైన భాగం. అయినా అక్కడక్కడ సాఫో వంటి రచయిత్రులు, ఆ గ్రీక్ నాగరిక సమాజంలో స్త్రీల సరళికి ఉన్నతమైన గుర్తులు.

గ్రీస్ దేశంలో ఆర్థిక వ్యవస్థ వ్యవసాయం మీద, వర్తకం మీద ఆధారపడి వుండేది. వ్యవసాయం తొలి రోజులలో కొయ్య నాగలితో చేస్తూ, క్రీ.పూ. 1000 నుండి ఇనుప పనిముట్లను వినియోగించారు. వారు గోధుమ, బార్లీ, అత్తిపండ్లు, ద్రాక్ష, ఆలివ్, వంటి వానిని ఉత్పత్తి చేసేవారు. ఆలివ్ మొక్క ఎదీనా దేవత గుర్తు కూడా. సారవంతం కాని భూములవడం వల్ల, వారికి వస్తూత్పత్తి తక్కువయి, వర్తకం అనివార్యం అయింది. ఏథెన్స్ , కోరింథ్ వంటి పట్టణాల నుండి వారు సిసిలీ, ట్యునీషియా, ఫియోనీషియా, జిబ్రాల్టర్ జలసంధి వంటి ప్రాంతాలకు , ఇటు ఈజిప్ట్, ఆసియా మైనర్‌లకు నౌకాయానం చేసేవారు. మట్టి పాత్రలు, వెండి వస్తువులు, మద్యం, ఆలివ్ నూనె, ఇచ్చి, కంబళ్ళు, ధాన్యం, పశువులు, బానిసల వంటి వాటిని కొనేవారు. క్రీ.పూ. 800 నాటి నుండి ద్రవ్య విధానాన్ని అనుసరించడం జరిగింది. లారియన్ లో గల వెండి గనుల నుండి తవ్వి, వస్తువులను చేసి, వెండి వస్తువులుగా అమ్మేవారు. అలెగ్జాండర్ కాలం నుండి గ్రీస్ దేశంలో వర్తక వాణిజ్యాలు కొత్త పుంత తొక్కాయి. సిరియాలోని రోడ్స్, ఆంటియోక్ ; ఈజిప్ట్ లోని అలెగ్జాండ్రియా వంటి పట్టణాలు అభివృద్ధిచెంది, హెలెనిస్టిక్ నాగరికతకు కేంద్రమయ్యాయి.

ఈ రకమైన పరిణామంతోబాటు, ఒక క్రమమైన రాజకీయ పరిణామం అనివార్యమయింది

భూగోళ ప్రభావం వల్ల, వివిధ జాతుల వారు వివిధ స్వతంత్ర రాజ్యాలను ఏర్పరచుకొన్నారు. దానికి రాజు, వృద్ధుల సభ, పురమందిరం వంటి సంస్థలను ఏర్పరచి, సాలీనా ఐదు వందల మెడిమ్ని కంటే ఎక్కువ ధాన్యాదాయం గల వారిని అత్యున్నత వర్గంగా గుర్తించడం జరిగింది.

కాని, ఈ రకమైన విధానం ఏథెన్స్, స్పార్టా, కారింథ్, థేబ్స్ వంటి వివిధ నగర రాజ్యాల అవతరణకు తోడ్పడింది. ముందుగా ఈ నగర రాజ్యాలలో నిరంకుశులయిన ప్రభువులుండేవారు. ఏథెన్స్ కు చెందిన డ్రాకో, సొలన్, క్లీస్థనిస్ వంటి ప్రభువుల రాజ్యాంగ సంస్కరణల వల్ల, ఏథెన్స్ గొప్ప ప్రజాస్వామ్య రాజ్యంగా పేరొందింది. కాగా, స్పార్టా గొప్ప సైనిక రాజ్యం అయింది. గ్రీస్ దేశం మీదికి పారశీకుల దాడుల వల్ల ఒకటిగా నిలిచిన గ్రీక్ నగర రాజ్యాలు , స్పార్టా, ఏథెన్స్‌ల మధ్య స్పర్థతో పతనోన్ముఖమయ్యాయి. స్పార్టా, ఏథెన్స్‌ల మధ్య జరిగిన మూడు పెలోపొనీషియన్ యుద్ధాలు, ఏథెన్స్‌లో ప్రజాస్వామ్య ప్రభావం, స్పార్టాలో సమర్థులయిన పాలక వర్గం ఉండక పోవడం, కేవలం ప్రజల శక్తి మీద ఆధారపడిన రీతిగా, నగర రాజ్యాలు పరస్పరం స్పర్థించి పతనమయ్యాయి. కాగా, క్రీ.పూ నాల్గవ శతాబ్దంలో అలెగ్జాండర్ అనే మాసిడోనియా రాజు ప్రభావం వల్ల, గ్రీక్ నాగరికత హెలెనిస్టిక్ నాగరికతగా పరిణమించింది.

ఈ మార్పులలోనే, రాజకీయ వ్యవస్థలో అనేక లోపాలు గుర్తించబడ్డాయి. ప్లేటో, అరిస్టాటిల్ అనే వారు, రాజ్యంలో ప్రజాస్వామ్యం అసమర్థులైన పాలకుల ఆవిర్భావానికి , రాజ్య పతనానికి దోహదం చేస్తుందని, సరైన రాజు ఉంటే రాచరికమే ఉత్తమమని, నిరంకుశ పాలన, అల్పజన వర్గ పాలన, ప్రజాస్వామ్యం నిరుపయోగాలని పేర్కొన్నారు.

## 20.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. గ్రీస్ దేశంలోని సామాజిక పరిస్థితులను పరిశీలించండి.
2. గ్రీస్ దేశ ఆర్థిక వ్యవస్థలో సంభవించిన మార్పులను తెలుపండి.
3. గ్రీస్ నగర రాజ్యాలలో ప్రజాస్వామ్య పరిణామాన్ని విశ్లేషించండి.

**II. క్రింది వాటికి లఘు వాఖ్యలను రాయండి.**

1. గ్రీస్‌లో సామాజిక వైవిధ్యం
2. గ్రీస్ రాజకీయ వ్యవస్థ
3. సోలన్ సంస్కరణలు
4. క్లీస్థనిస్ ప్రవేశపెట్టిన మార్పులు
5. గ్రీక్‌ల రాజకీయ సిద్ధాంతాలు

BRAOU

## 20.7 ఉపయుక్త గ్రంథాలు


J.B. Bury : **A History of Greece**, 1913.

Edgar Swain, J : **History of World Civilization**, 1984.

Korodkin, F : **Ancient World History**, 1987.

Muzeer, M. : **World History our Heritage**, 1960

Wardfoler, W : **The City State of the Greeks and Romans**, 1960


## 20.8 పదకోశం

హోమోగలక్టైన్ : ఎథీనియన్ల కందరకు పూర్వీకుడు, పాలు పితికేవాడు

పోలిస్ : నగర రాజ్యం

అర్బ్స్ : నగర రాజ్యానికి సరి అయిన లాటిన్ పదం

సినోయికియా : ఏథెన్స్ వారు ఏకీకరణకు గుర్తుగా, ఎథీనాకు నిర్వహించే పండుగ

యుపాట్రిడ్స్ : ధనికులు

ఎఫెటా : న్యాయ విచారణ సంఘం

జార్జి : సొంత రైతులు

డెముర్జి : వర్తక, వాణిజ్యాల ద్వారా జీవించేవారు.

థెట్స్ : ఆయుధ జీవులు

పెంటాకోసియోమెడిమ్ని : సాలీనా 500 మెడిమ్నిలకు పైగా ధాన్యాదాయం గలవారు.

హిప్స్ : సాలీనా 300, 500 మెడిమ్నిల మధ్య ధాన్యాదాయం గలవారు.

జుగిటా , సాలీనా కనీసం 200 మెడిమ్నిల ధాన్యాదాయం గలవారు.

పోలెటాయ్ : గనుల తవ్వకం

ఎలెవెన్ : న్యాయవాదవృత్తి

కోకూక్రిటాయ్ : ఆర్థికాధికారులు

ఎక్లిషియా : ఏథెన్స్‌లో ఉండే న్యాయ సభ

హెలైయా : ప్రజాసభ

BRAOU

ఆర్కాన్ : ఏథెన్స్‌లో గొప్ప అధికారి

గెరూషియా : స్పార్టాలోని వృద్ధుల సభ

ఏరియోపాగస్ : ఏథెన్స్‌లో వృద్ధుల సభ

ఎఫార్ : స్పార్టాలోని ఉన్నతాధికారి

ఫ్రాట్రీ : తెగల బంధుత్వాలను సూచించే సంబంధాలు

నౌక్రరీ : అయోనిక్ తెగలలో నౌకలను ఇవ్వడానికి ఏర్పరిచన విభజనలు

ట్రిట్టి : క్లీస్థనీస్ ఏర్పరిచిన ఉప పరిపాలనా భాగం

కైడథెనయన్ : పట్టణ ప్రాంతంలోని ట్రిట్టీలు

పానియా : అంతర్భాగంలోని ట్రిట్టీలు

డెమార్క్ : ప్రజాసభ నాయకుడు

అపోడెక్టాయ్ : ఆర్థికాధికారులు, క్లీస్థనిస్ కాలంలో

ప్రొలోమా : ప్రభుత్వ సభ నుండి ప్రజాసభకు ఆమోదించిన చట్టాన్ని పంపేరీతి

సెఫిస్మా : ప్రజా సభ ఆమోదం తరవాత చట్టం స్థితి.

ప్రిటానీ : ప్రజాసభలో ప్రభుత్వ వ్యవహారాలు చూటడానికి ప్రతి 36 రోజులకి గల అధికారుల సంఘం

B R A O U

# భాగం - 20 : సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు

విషయ క్రమం


20.0 లక్ష్యాలు

20.1 పరిచయం

20.2 సామాజిక వ్యవస్థ

20.2.1 స్త్రీలు - కుటుంబ జీవితం

20.2.2 బానిసలు

20.2.3 సామాజిక వైవిధ్యం

20.3 ఆర్థిక వ్యవస్థ

20.3.1 వ్యవసాయం - వర్తకం

20.3.2 హెలెనిస్టిక్ యుగంలో ఆర్థిక వ్యవస్థ

20.4 రాజకీయ వ్యవస్థ

20.4.1 ప్రజాస్వామ్య పరిణామం

20.4.2 నగర రాజ్యాలు

20.4.3 రాజకీయ సిద్ధాంతాలు

20.5 సంగ్రహంగా

20.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

20.7 ఉపయుక్త గ్రంథాలు

20.8 పదకోశం


## 20.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని అధ్యయనం చేయడం వల్ల, క్రింది విషయాలను గ్రహించగల్గాలి.

1. గ్రీక్ సమాజ అవతరణం ఏ విధంగా ఏర్పడిందో తెలుసుకోడం.
2. గ్రీక్ సమాజంలో ఏర్పడిన వైవిధ్యాలు, వాటి కారణాలను తెలుసుకోవడం.
3. గ్రీక్‌ల నగర రాజ్యాలలో సమాజాలు, వాని లక్షణం తెలుసుకోడం.
4. హెలెనిస్టిక్ కాలం నాటికి గ్రీక్‌ల సమాజంలో మార్పులను తెలుసుకోడం.

BRAOU

5. గ్రీస్ దేశంలో ఆర్థిక వ్యవస్థ మీద భౌగోళిక పరిస్థితుల ప్రాబల్యాన్ని వివరించడం.

6. హెలెనిక్ యుగంలో గ్రీక్‌ల వర్తక వాణిజ్యాల వివరాలను పేర్కొనడం.

7. హెలెనిస్టిక్ యుగంలో గ్రీక్‌ల ఆర్థిక వ్యవస్థ లక్షణాలను వివరించడం.

8. గ్రీక్‌ల రాజకీయ వ్యక్తిత్వాన్ని నిర్వచించడం.

9. గ్రీక్‌ల రాజ్య వ్యవస్థలో గ్రామ, నగరాల సంబంధాన్ని తెలపడం.

10. గ్రీక్‌ల నగర రాజ్యాలు ఆవిర్భవించిన పరిణామ విధానాన్ని గ్రహించడం.

11. గ్రీక్‌ల ప్రధానమైన కొన్ని నగర రాజ్యాల లక్షణాలను పరిశీలించడం.

12. గ్రీక్‌ల నగర రాజ్యాలపై యుద్ధాల ప్రభావం - వారి యుద్ధ రీతులను నిర్మించడం

13. గ్రీక్ జాతి వారి రాజకీయ సిద్ధాంతాల స్వభావాలను తెలిపి, వాటి ప్రాధాన్యాన్ని అంచనా వేయడం.

---

## 20.1 పరిచయం

---

గ్రీస్ దేశం దాని చరిత్ర, సంస్కృతి అతి ప్రాచీనమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలకు గుర్తు. ఎఖియన్‌లు, మినోవన్‌లు, డోరియన్‌లు, క్రీటన్లు, అయోనియన్‌లు మొదలైన జాతుల వారంతా, ఈజిప్ట్ నుండి తూర్పున గల ఆసియా మైనర్ నుండి, ఈ దేశంలోకి వలస రావడం సంభవించింది. ఆ రకంగా వలసలు రావడం వల్ల, గ్రీక్‌ల నాగరికత అంతా ఒక సంకీర్ణ భావాన్వితమైంది. అయినా, ఆ సామాజికులంతా తమ వైవిధ్యాన్ని ఏ విధంగా మరవలేకపోయారో, తమ సమ్మిశ్రణాన్ని కూడా వారు మరవలేకపోయారు. గ్రీస్ దేశాన్ని ఆక్రమించుకోడానికి సైరస్, డేరియస్, క్జెరెక్సెస్ మొదలైన పర్షియాకు చెందిన ఆఖెమెనిడ్ రాజవంశస్థులు విడతలు విడతలుగా దండ యాత్రలు చేయడం వల్ల, ఆ దండయాత్రలను తప్పనిసరిగా గ్రీక్ వారు ఎదుర్కొనవలసి రావడం వల్ల, వారు తమలోని వైవిధ్యాన్ని మరిచి, జాతీయ ఐక్యాన్ని పెంపొందించుకొనడానికి, జాతీయ భావాన్ని ఏర్పరచుకొన్నారు. ఆ జాతీయ భావంలో ఒకే భాష, ఒకే వర్ణ సమామ్నాయం, ఒకే పౌరాణిక, సంప్రదాయం వంటివి, గ్రీక్ ప్రజల పుట్టుకను, పరిణామాన్ని చూపే సూచికలుగా మారాయి. స్పార్టా, ఏథెన్స్, కారింథ్, థేబ్స్, అటువంటి వివిధ నగర రాజ్యాలు గ్రీస్ దేశంలోని జాతీయతా భావ సమగ్రతకు జీవం పోశాయి. అంతేకాక, పారశీకుల దాడులను, మారథాన్, సలామిస్, థెర్మోపైలా మొదలైన యుద్ధ రంగాల్లో ఓడించడం, గ్రీక్ జాతి వారి ఏకత్వానికి, ఐక్యత లోని బలానికి సూచనలుగా మిగిలాయి. ఈ పరిణామంలోనే నగరం - నగర రాజ్యం అనేవి, గ్రీక్ సంస్కృతితో సమైక్యం పొందాయి. నగర రాజ్యమే సంస్కృతి, సంస్కృతే నగర రాజ్యం అన్నంతగా పరిణమించింది. కాని, పారశీకుల వైఫల్యం తరవాత స్పార్టా, ఏథెన్స్ నగర రాజ్యాలలో పరస్పరం స్పర్థ పెరగడంతో, వారిద్దరి మధ్య పెలోపొనీషియన్ యుద్ధాలు జరిగాయి. తత్ఫలితంగా గ్రీక్ నగర రాజ్య వ్యవస్థ నిర్వీర్యమైంది. దానితోబాటు వారంతా పవిత్రంగా భావించిన హెలెనిక్ నాగరికత, సంస్కృతి కూడా, నామమాత్రావశేషాలయ్యే స్థితి ఏర్పడింది. ఈ దశలో అలెగ్జాండర్ అనే మాసిడోనియా రాజు, తన తండ్రి అయిన ఫిలిప్ తరవాత రాజ్యానికి వచ్చి, యావద్గ్రీక్ పట్టణాలను ఏకీకరించి, పర్షియాకు చెందిన అఖెమినియన్ సామ్రాజ్య పతనానికి కారణమయ్యాడు. ఇతని కాలంలోనే, అలెగ్జాండ్రియా, రోడ్స్ మొదలైన వివిధ పట్టణాలను నిర్మించి, ప్రాగ్దేశసంప్రదాయాలతో సమ్మిశ్రితమైన గ్రీక్ సంస్కృతికి ఆధారభూతుడయినాడు. ఆ గ్రీక్ సంస్కృతిని హెలెనిస్టిక్ సంస్కృతి అనడం జరిగింది.

BRAOU

ఈ రకమైన సాంస్కృతిక పరిణామాన్ని గ్రీస్ దేశంలో ఎంతో ప్రాచీన కాలం నుండి చూడొచ్చు. క్రీ.పూ. 4750 తరవాత గ్రీక్‌ల దేశంలో, నవీన శిలా యుగ సంస్కృతులు వ్యాపించాయి. అలాగే తూర్పున హిమాలయాలు, థార్ ఎడారి, ఉత్తరాన కాకసస్, ఎల్‌బెర్గ్, హిందూకుష్ పర్వతాలు, పడమట మధ్యధరా సముద్రం, సహారా ఎడారులు, దక్షిణాన కర్కాటక రేఖ సరిహద్దులుగా అభివృద్ధిచెందిన సాంస్కృతిక వ్యక్తిత్వం, సాంస్కృతిక లక్షణాలు, గ్రీస్ దేశంలో క్రీ.పూ. 2000 నుండి అభివృద్ధిచెందాయి. ఈ పరిణామ క్రమంలో గ్రీక్ సమాజంలోను, ఆర్థిక వ్యవస్థలోను, రాజకీయ జీవనంలోను, వివిధ పరిణామాలు, ప్రమాణాలు, ఆచరణ వైవిధ్యాలు, ఫలితాలు వచ్చాయి. వాటిని మనం ఈ క్రింది విధంగా తెలుసుకోవచ్చు.

## 20.2 సామాజిక వ్యవస్థ

గ్రీస్ దేశంలో సమాజం ఒక జాతికి గాని, ఒక తెగకు కాని పూర్తిగా చెందలేదు. ముందుగా ఎఖియన్లు, డోరియన్లు కలిసి ఉండేవారు. రాను రాను డోరియన్ల ప్రాబల్యం పెరిగి, వారు మినోవన్ల సంస్కృతిని నాశనం చేయడంతోబాటు, హెలెనిక్ సంస్కృతికి ప్రాణం పోశారు. క్రీ.పూ. 8వ శతాబ్దారంభం నాటికి, గ్రీక్‌లలో డోరియన్లు, ఈలియన్‌లు, అయోనియన్లు అనే మూడు ప్రధాన వర్గాలు రూపొందాయి. ఈ వర్గాల మధ్య గల సంబంధాలలో మార్పులు, సమాజంలో మార్పులను సూచించడం జరుగుతుంది. ఒక జాతిని దూరం చేసి, వేరొక జాతి ఔన్నత్యంలోకి రావడం, ఒక జాతి ఇంకొక జాతిని ఓడించడం మొదలైన విషయాలవల్ల, విజేతలు, పరాజితులు అనే భేదం ఏర్పడి , గ్రీక్ సమాజంలో బానిస వ్యవస్థ అంకురించింది. వారిలో సమానత్వం లేకపోవడం, సామాన్యమైన అంశంగా వుండేది. డ్రాకో, సోలన్ మొదలైనవారు తమ స్మృతుల ద్వారా గ్రీస్ దేశంలో చట్టబద్ధమైన సమానత్వాన్ని తేవడానికి ఎంతగానో ప్రయత్నించారు.

### 20.2.1 స్త్రీలు, కుటుంబ జీవితం

గ్రీస్ సమాజంలో స్త్రీలకు ఏరకమైన ప్రత్యేకమైన గుర్తింపు ఉండేది కాదు. ఉదాహరణకు, ఎథీనియన్ సమాజంలో వేడుకలు, వినోదాలలో భర్తలతోపాటు భార్యలు పాల్గొనే వారు కాదు. వాళ్ళు వేరే ఇళ్ళలో కూడా నివసించేవారు. ఏ స్త్రీ మంచి చెడ్డల గురించి చాలా తక్కువగా చెప్పుకోవడం జరుగుతుందో, ఆ స్త్రీని ఆదర్శ స్త్రీ అని పెరికిల్స్ వర్ణించాడు. ఎథీనియన్ సమాజంలో కుటుంబ జీవనానికి, వారు తమ సంతానానికి నాగరికమైన విద్యను పెంపొందించడానికి అవకాశం వుండేది.

కాగా, ఇంకొక నగర రాజ్యం అయిన స్పార్టాలో, కుటుంబ జీవితం తక్కువ. మగవాళ్ళు ఎక్కువగా యుద్ధాలలో పాల్గొనేవారు. ఏ బాలుడైనా తన తల్లి వద్ద ఏడు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు ఉండొచ్చు. ఆ తరవాత పన్నెండేళ్ళ వరకు సైనిక శిక్షణ తప్పనిసరిగా పొందాలి. ఏడేళ్ళ వయస్సు వారందరినీ ఒక చోట చేర్చి, దళాలుగా విభజించేవాళ్ళు. అందరూ సమానులుగా కలసి భోజనం చేస్తూ, కలిసి జీవిస్తూ, కలిసి ఆడుకుంటూ, పరస్పర సాహచర్యానికి అలవాటుపడేవాళ్లు. సైనిక పోటీలలో, అత్యంత సాహసాన్ని ప్రదర్శించి, తెలివితేటలు కలిగిన పిల్లవాడిని దళానికి నాయకుడనేవారు. అందరూ అతనిని ఆదర్శంగా స్వీకరించి , ఆజ్ఞలు పాటించి, అతను విధించే శిక్షలను తప్పనిసరిగా స్వీకరించవలసి వుండేది. పందొమ్మిది సంవత్సరాల వయస్సు నాటికి అతడు సైన్యంలో భాగమయ్యేవాడు. స్పార్టన్ తల్లి తన కొడుకును డాలుతో గాని, డాలుపైన గాని తిరిగిరా అనేది. యుద్ధరంగంలో పోరాడి వీరమరణం పొందిన వారిని, డాలు మీద తెచ్చేవారు. ఓడిపోయిన తరవాత బతికి బయటపడిన సైనికుల తల్లులు రోదించేవారు. వీర మరణం పొందిన సైనికుల తల్లులు పూలమాలలు ధరించేవారు. ఈ రకంగా సమాజంలో స్పార్టా నగర రాజ్యంలో యుద్ధం ప్రధాన ప్రమాణంగా ఉండేది.

## 20.2.2 బానిసలు

బానిసల ప్రాబల్యం కూడా ఎక్కువగా వుండేది. ఉదాహరణకు, అటికా నగర రాజ్యంలో సౌభాగ్యవంతమైన స్థితిలో జనాభా 5,00,000 ఉండేవారు. వారిలో 1,50,000 బానిసలే. స్పార్టాలో బానిసలను హెలిట్లు అని పిలిచేవారు. స్పార్టాలో విద్యార్థులకు క్రౌర్యాన్ని నేర్పడానికి, హెలిట్లను చంపించేవారు. దీని దృష్ట్యా, బానిసల స్థితిని మనం అంచనా వేయొచ్చు. ఆ సమాజంలో బానిసలను కూడా ఇతర వ్యాపార వస్తువుల వలె అమ్మడం, కొనడం ఉండేది. వీరు ఎక్కువగా వ్యవసాయంలో ఉండేవారు. తమ ఫలసాయంలో సగ భాగాన్ని యజమానులకిచ్చేవారు. స్పార్టాలో వారు తిరుగుబాటు చేయకుండా, బలమైన వారిని చంపించేవారు. బానిసలు కూడా విజయం పొందడానికి అక్కడికక్కడ కొన్ని ప్రయత్నాలు చేసినా, వారి ప్రభావం తాత్కాలికంగాను, అరుదుగాను మిగిలిపోయింది.

## 20.2.3 సామాజిక వైవిధ్యం

హెలెనిస్టిక్ యుగంలో కూడా సమాజంలో వైవిధ్యం పెరిగిందే కాని, సామాజిక ప్రాథమిక అవగాహనలో ఏ మార్పు రాలేదు. అంతరాలు పెరిగాయే కాని, తరగలేదు. అప్పులిచ్చినవాళ్ళు అప్పుతీసుకొన్న వాళ్ళ ఆస్తిని, వస్తువులను స్వాధీనం చేసుకోవచ్చనే అవగాహన ఉన్నందువల్ల, ప్రతి కార్మికునిలోను తన మీద ఋణగ్రస్తత్వం, దాస్యం దాడి చేస్తాయోమోననే బెదురు ఉండేది. అంతేకాక, నిర్బంధ సేవ పెరిగిపోవడం వల్ల, గ్రీస్ దేశంలో స్వర్ణయుగం అనే కాలం అంతమైంది.

సమాజంలో ఈ రకమైన వైవిధ్య విశేషంతో బాటు, ఒక సన్నని ఛాయలాగ ఏకీకృత భావన ఉండేది. ఉదాహరణకు ఎథీనియన్లంతా తమ వారసత్వాన్ని హోమోగలక్టెస్ (Homogalaktes) అనే పాలు పిదికేదానికి చెందినట్లు చెప్పుకొంటారు. కాని, అనతికాలంలోనే ఆ రకమైన శౌభోతృత్వం అంతరించి, గ్రీస్ సమాజంలో స్వార్థపూరితులయిన రాజకీయ నాయకులు తమ సొంత ప్రయోజనాలను నెరవేర్చుకోడానికి అన్ని వర్గాల ప్రజలను పీడించారు. దాని ద్వారా సమభావన గగన కుసుమంగా మారింది. పారశీక దాడుల ప్రభావం, పెలోపొనీషియన్ యుద్ధాల ఆంతరంగిక వైరం, అలెగ్జాండర్ విస్తరణ ఫలితంగా వచ్చిన వైవిధ్యం, గ్రీక్, సమాజాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశాయి. దానికి ఆర్థిక పరిస్థితులు కూడా తోడ్పడ్డాయి.

BRAOU

---

## 20.3 ఆర్థిక వ్యవస్థ

---

గ్రీస్ దేశపు ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం, పశుపోషణ, చేతిపనులు, సముద్రయానంతో కూడిన వర్తక వ్యాపారులు క్రమంగా ప్రధాన జీవన విధానాలుగా అభివృద్ధిచెందాయి. గ్రీస్ దేశంలో ఉన్న ఆయన రేఖాంశ శీతోష్ణ స్థితి ఉండటం వల్ల, సంవత్సరం పొడువునా పంటలు పండించుకొనే వారు. గోధుమ, బార్లీ ప్రధానమైన పంటలు. బటానీ, లెంటిల్స్ ప్రధానమైన శాకాలు. ఆపిల్ పండ్లు, ద్రాక్ష, అత్తిపండ్లు వారి ప్రధానమైన ఆహారం.

## 20.3.1 వ్యవసాయం - వర్తకం

తొలిరోజులలో వ్యవసాయం కొయ్య నాగలితో చేయవలసి వచ్చేది. రాతినేల అవడం వల్ల, చాలా కష్టమైన పనిగా ఉండేది. అతివృష్టి అనావృష్టి ఫలితాలు ఎక్కువగా వుండేవి. క్రీ.పూ. 1000 నాటికి ఇనుప పనిముట్లు వ్యాప్తి చెందడంతో, భూమిని సాగుచెయ్యడం సులభతరమైంది. పంటలలో రకాలు పెరిగాయి. మాసూళ్ళు కూడా

ఎక్కువయ్యాయి. రైతాంగం ముతక బట్టలను, ఉన్నితో చేసిన ముతక కంబళ్ళను, మట్టితో కుండలను, చర్మాలతో చెప్పులను చేసుకొనేవారు.

జనాభా పెరుగుతున్న కొద్దీ, ఆహార ధాన్యాల ఉత్పాదన చాలకపోవడం వల్ల, దిగుమతుల మీద ఆధారపడవలసి వచ్చేది. అందుకోసం, కారింథ్, ఏథెన్స్ మొదలైన ప్రాంతాలలో అనివార్యంగా సముద్రయానం ప్రారంభమైంది. క్రీ.పూ. 800 నాటికి పినీషియా, క్రీట్ వర్తకులు పశ్చిమ మధ్యధరా సముద్ర ప్రాంతాలను అన్వేషించి, సిసిలీ, ట్యునీషియా జలసంధులను దాటి స్పెయిన్ చేరారు. జిబ్రాల్టర్ జలసంధిని కూడా దాటారు. క్రీ.పూ. 568 - 525 నాటికి, ఈజిప్ట్ లోని సోక్రటీస్, ఈజిప్ట్, గ్రీక్ ఆర్థిక వ్యవస్థల సాంగత్యానికి కేంద్రంగా మారింది. గ్రీస్ దేశస్థులు ఎక్కువగా ఆలివ్ నూనెను, మద్యాన్ని, ఉత్పాదిత వస్తువులను ఇచ్చి, పశువులను, బానిసలను, ధాన్యాన్ని తెచ్చుకొనేవారు. ఆలివ్ మొక్కను ఎథీనా గుర్తుగా భావించి, పవిత్రంగా చూసేవారు. అలాగే డయోనిసస్ అనే మద్య దేవతకు పూజా, పురస్కారాలు చేయడం, మద్యానికి వారి వర్తక - వ్యాపార వ్యవస్థలో ఉండే స్థానమే కారణం. గ్రీకులు పినీషియన్ల అడుగుజాడలలో నడవడం వల్ల, వలస వ్యవస్థాపకులుగాను, వ్యాపారులుగాను మారారు. నల్ల సముద్రతీరం, ఆసియా మైనర్ దక్షిణభాగం, దక్షిణ ఇటలీ, సిసిలీ వంటి చోట్ల వలసలను ఏర్పరచుకొన్నారు. కారింథ్ మొదట విస్తృత వ్యాపారాన్ని కలిగి వున్నా, ఏథెన్స్ అనతి కాలంలో దానిని అధిగమించింది. ఎథీనియన్లు డాన్యూబ్ ప్రాంతం నుండి పశువులను, బానిసలను తెచ్చుకొనేవారు. వర్తకులు ఈజిప్ట్, మెసపటోమియాల నుండి తివాచీలు, కంబళ్ళు, రత్నాలు, పట్టువస్త్రాలు, సాంబ్రాణి, సుగంధ ద్రవ్యాలను తెచ్చేవారని, పశ్చిమ మధ్యధరా సముద్ర ప్రాంతం నుండి ధాన్యం, పాల పదార్థాలు, కలప, వెండి, బంగారాలు, ద్రాక్షను తెచ్చుకొని, మట్టి వస్తువులు, వెండి ఆభరణాల వంటివి ఉత్పత్తి చేసి, అనేక వస్తువులను వినిమయంగా ఇచ్చి, తెచ్చుకొనేవారు.

క్రీ.పూ. 500 ల నుండి గ్రీస్ దేశంలో నాణేలను ప్రవేశపెట్టడం ద్వారా, వస్తు మారక వ్యవస్థ ద్రవ్య మారక వ్యవస్థగా పరిణమించింది. తద్వారా అనివార్యమైన పెట్టుబడిదారీ వర్గం అవతరించింది. ఇది గ్రీస్ దేశంలో ఎంతో ప్రభావాన్ని చూపింది.

B R A O U

## 20.3.2 హెలెనిస్టిక్ యుగంలో ఆర్థిక వ్యవస్థ

అలెగ్జాండర్ దండయాత్రల వల్ల హెలెనిస్టిక్ యుగంలో ఆర్థిక వ్యవస్థ ఎంతో మార్పు చెందింది. ప్రపంచ మార్కెట్ ఏర్పడి, పశ్చిమ ఆఫ్రికా, మధ్య ఆసియా, భారతదేశం వరకు విస్తరించింది. ఈజిప్ట్‌లో అలెగ్జాండ్రియా, సిరియాలో ఆంటియోక్, రోడ్స్ పట్టణాలు ప్రధానమైన అంతర్జాతీయ స్థాయి వ్యాపార కేంద్రాలయ్యాయి. భారతదేశం, మధ్య ఆసియా, ఇరాన్‌ల నుండి ఆంటియోక్‌కు సరుకులు రవాణా అయ్యేవి. మధ్యధరా సముద్రపు రేవు పట్టణాలకు సరుకులు రోడ్స్ నుండి పంపిణీ అయ్యేవి. రహదార్ల నిర్మాణం, ఓడ రేవులను బాగా అభివృద్ధి పరచడం జరిగింది. జయించిన దేశాల నుండి ఖరీదైన లోహాలను పెద్ద మొత్తంగా తీసుకొని రావడం వల్ల, అలెగ్జాండర్ కన్న ముందుగా, ఎంతో తక్కువగా వున్న ద్రవ్యమారక వ్యవస్థ బాగా పెరిగింది. అలెగ్జాండ్రియా పారిశ్రామిక కార్యకలాపాలకు కేంద్రమయింది. గాజు, నూలు బట్టలు, సుగంధ ద్రవ్యాలు, లోహాలను ఉత్పత్తి చేసి, విశ్లేష పరిమాణంలో విదేశీమార్కెట్లకు ఎగుమతి చేయడం జరిగింది. వ్యవసాయం కూడా పెరిగింది. హెలెనిక్ యుగం భూసారం తగ్గకుండా ఉండేందుకు అనుసరించిన పద్ధతులు, అనివార్యంగా దూరమయ్యాయి. దానివల్ల సాగు పెరిగింది. భూసారం తరిగింది. ఈజిప్ట్‌లో కూడా పెద్ద ఎత్తున ఆలివ్ తోటలను, ద్రాక్ష తోటలను పెంచడం జరిగింది. వ్యవసాయం చేయడానికి మాత్రమేగాక, వినోదానికి కూడా గుర్రాలను వినియోగించారు. ఆర్థిక వ్యవస్థలో వివిధ వర్గాల మధ్య అసమానతలు పెరిగాయి. నైసర్గిక వనరులను విచక్షణారహితంగా

ఉపయోగించుకోవడం జరిగింది. తత్ఫలితంగా ఎక్కువగా అనేక ప్రాంతాలలో గ్రీస్ దేశంలో పాతకాలపు రాజకీయ స్థిరత్వం తగ్గింది. తిరుగుబాట్లు పెరిగాయి. దానివల్ల వర్తక వ్యాపారాలు అనతి కాలంలో లాభదాయకాలు కాకుండా ఉన్నందువల్ల గ్రీస్‌వారు రోమన్‌ల ప్రభావానికి లోనవాల్సొచ్చింది. జూలియస్ సీజర్ ఈజిప్ట్‌ను ఆక్రమించిన దగ్గర నుండి, హెలెనిస్టిక్ ఆర్థిక వ్యవస్థ, తద్వారా రాజకీయ, సామాజిక వ్యవస్థలు పతనమయ్యాయి.

## 20.4 రాజకీయ వ్యవస్థ

గ్రీస్ దేశంలో రాజకీయ వ్యవస్థ ఒక ప్రధాన నాగరికత లక్షణంగా రూపొందింది. నగరం, దానిలో వుండే పౌరులు, దేవతలు అంతా కూడా నాగరిక జీవనంలో అత్యంత ముఖ్యమైనవారే. థూసిడైడ్స్, డెమొస్థనీస్, లివీ, సిసిరో, ప్లేటో, అరిస్టాటిల్‌ల రచనల ద్వారా, గ్రీస్ దేశంలో రాజకీయ వ్యవస్థ గురించి ఎంతో తెలుస్తున్నది. ఈ రచయితలు ఏ ప్రాంతం వారైనా, వారి వారి రచనలో, వారి పౌరత్వ ధర్మమయిన జాతీయతా భేదమే వెల్లడవుతున్నది. గ్రీస్ దేశంలో ప్రధానమైన రాజకీయ వ్యవస్థ ప్రమాణం పోలీస్. ఇది లాటిన్ భాషలోని అర్బ్స్ (urbs) అనే పదాన్ని పోలి వుంటుంది. 'అర్బ్స్ ' కొండ మీద నిర్మితమయ్యే ఒక దుర్గం, దానికి చుట్టుపట్ల గల ఇతర ప్రజలంతా అనుబంధితులై ఉండి, కష్టనష్టాలలో రక్షణ పొందడానికి సౌకర్యం ఉంటుంది. కాని, ఈ రకమైన వ్యవస్థ గ్రీస్ దేశంలో అవతరించడానికి చాలా కాలం పట్టింది.

గ్రీస్ దేశంలో భౌగోళిక పరిస్థితులు వివిధ స్వతంత్ర రాజ్యాలు ఏర్పడటానికి తోడ్పడ్డాయి. ఈ రకమైన స్వతంత్ర్య రాజ్యాలన్నీ ఒక వృద్ధుల మండలిని, ఒక సభను కలిగి వుండేవి. రాను రాను ఇవి నగర రాజ్యాలుగా పెంపొందాయి. ప్రతి నగర రాజ్యానికి ఒక కోట, చుట్టు ప్రక్కల అనుబంధితమైన పల్లెలు, సైన్యం, ప్రతి నగరానికి రక్షక దేవతలు ఉండేవారు. రక్షక దేవతలు ప్రజల అభిప్రాయాలకు స్ఫూర్తినిస్తుండేవి. ప్రతి నగర రాజ్యం తన సైనిక వ్యవస్థను తాను పెంపొందించుకొంది. ఈ రకమైన నగర రాజ్యాలు, గ్రామీణ సముదాయాలు సంవిలీనం అవడం వల్ల ఏర్పడ్డవే. అరిస్టాటిల్ ప్రకారం గ్రామీణ భాగాలు నగర రాజ్యాల ఉపభాగాలే. ఈ రకంగా గ్రామీణులకి సంబంధం రక్త సంబంధం దృష్ట్యాను, సామాన్య దేవతారాధన దృష్ట్యాను ఏర్పడి, బలపడింది. రాజకీయ వ్యక్తిత్వం గల హెల్లాలను (గ్రీకులను), పౌరాణిక గ్రీకులను వేరుచేసే ఒక విస్తృతమైన రేఖ వుంది. అది డోరియన్‌ల దండయాత్ర ద్వారా ఏర్పడ్డదే. ఈ రేఖకు అవతల గల ప్రాచీన కాలంలో తమ మీద ఆధారపడ్డ వారి గుడిసెల మధ్య గల మహోన్నతమైన రాజకుమారుల దుర్గాలను చూడొచ్చు. కాని, ఈ రేఖకు ఇవతల గల అర్వాచీన కాలంలో అనేక ఉత్సాహవంతులయిన జాతులవారు తమ తమ ప్రభుత్వాలను ఏర్పరుచుకొని, మధ్యధరా సముద్రం యుక్జిన్ ప్రాంతంలోని వివిధ ప్రాంతాలతో వర్తక వ్యాపారాలను ఏర్పరచుకొనేవారు. ఈ రకమైన పరిణామం ఆగమెమ్నన్ జాతి పూర్తిగా అంతరించి పోయాక ఏర్పడింది. ఉదాహరణకు ఏథెన్స్ గురించి థుసిడైడ్స్ రాస్తూ, సిక్రోప్స్ కాలంలోను, థిసియస్ పాలన వరకు గల తొలి రాజుల కాలంలోను, ఏథెన్స్ తమ తమ పుర మందిరాలు, న్యాయమూర్తులు గల వివిధ కమ్యూన్‌లుగా విభక్తమయింది. అత్యవసర పరిస్థితులలో మినహా ప్రజలెవ్వరూ రాజుతో కలిసి సమావేశం కారు. కాని, వారి వారి వ్యవహారాలు వారే నిర్వహించుకొంటూ, వివిధ పట్టణాలకు సలహా ఇస్తుండేవారు. కొందరు ఎరెక్థియస్‌తో యుయోల్పస్ (Euoulpus) నాయకత్వం లో ఎలూసినియన్‌ల వలె వారి రాజుతో పోరాడటం కూడా సంభవిస్తుంది. కాని, థిసియస్ సింహాసన మధిష్ఠించ గానే, సమర్థుడైన తెలివయిన పాలకుడవడం వల్ల, వివిధ సంఘాలను ప్రభుత్వాలను రద్దు చేసి, ఏథెన్స్ నగరంలో నగర రాజ్యంలో ఆటికాకు చెందిన అందర్నీ ఏకీకరించి, ఒకే సంఘాన్ని, ఒకే పుర మందిరాన్ని

ఏర్పరిచాడు. వారు తమ తమ ప్రాంతాలలో నివసిస్తూ, ఏథెన్స్ ను వారి రాజధానిగా గుర్తిస్తూ, వారందరూ ఏథెన్స్ పౌరులుగా కూడా గుర్తించబడ్డారు. ఆ విధంగా ఏర్పడ్డ పట్టణం థీసియస్ నుండి అతని వారసులకు సంక్రమించింది. ఆ రోజు నుండి ఈ రోజు వరకు ఎథీనియన్‌లు తమ దేవత అయిన ఎథీనా గౌరవార్థం, తమ జాతీయ పండగ అయిన కమ్యూన్ల ఏకీకరణని సూచించే సినోయికియా (Synoikoa) అనే ఉత్సవాన్ని క్రమం తప్పకుండా జరుపుకొంటున్నారని రాశాడు. థూసిడైడ్స్ వ్రాతల ద్వారా, నగర రాజ్యాల తొలిదశలో అవి కేవలం రాచరికాలుగా పరిణమించాయని, ఆ తరవాతనే అక్కడ పరిపాలనా విధానంలో మార్పు వచ్చిందని తెలుస్తున్నది.

## 20.4.1 ప్రజాస్వామ్య పరిణామం

క్రీ.పూ. 600 - 500 మధ్య కాలంలో నిరంకుశ ప్రభువులు అధికారంలోకి వచ్చారు. వీరు క్రూరులు, దౌర్జన్యవంతులు కాదు. వీరంతా ప్రజాశ్రేయస్సు కోసం ఎంతో పాటుపడినవారే. కొరంథ్‌కు చెందిన పెరియాండర్, ఏథెన్స్ రాజు పిసిస్ట్రాటస్ వంటి వారు ఎంతో గొప్పవారు.

ఏథెన్స్‌నగర రాజ్యంలో డ్రాకో ఎంతో ప్రముఖుడు. ఇతడు క్రీ.పూ. 621లో స్మృతిని అందించాడు. కేవలం వర్గ సంఘర్షణల వల్ల వచ్చిన దుష్ఫలితాలను అణచివేయాలని డ్రాకోయి స్మృతిని ఇచ్చాడు. ఇతడు థెస్మో థెట్స్ (Thesmothetes) అనే శాసన సభ్యుని నియమించి, చట్టాలను తయారుచేశాడు. అవి కేవలం నేరాలకు సంబధించినవే. చిన్న చిన్న నేరాలైన, కాజేసి దొంగలించడం వంటి వానికి కూడా ఉరిశిక్ష విధించేవారు. అందువల్లనే ఏథెన్స్ కు చెందిన ఒక వక్త , ఆ శాసనాలను సిరాతో కాక, నెత్తురుతో రాశారని వ్యాఖ్యానించాడు. ఈ చట్టాలలో ఎఫెటా (Ephetae) అనే 51 మంది న్యాయమూర్తుల సభ ఉండేది. దీనికి యుపాట్రిడ్స్ (Eupatrides) నుండి సభ్యులను ఎన్నుకొనేవారు. యుపాట్రిడ్స్ అంటే ధనికులు. కాని, అది ఏరియోపాగస్ అనే వృద్ధుల సభలో భాగం అవునో కాదో తెలియదు. ఏరియోపాగస్ ముందుకు రాని నేరాలను ఎఫెటా (Ephetae) విచారించేది. డెల్ఫికి చెందిన అపోలో దేవాలయంలోను, ఫాలెరాన్ వద్ద గల పలాడియన్‌లోను, మ్యునిషియాన్ ద్వీపకల్ప ప్రాంతంలో వున్న ఫ్రెట్టోలోను, వారు విచారణ కొనసాగించేవారు. విదేశాలలో మానవ హత్యలు చేసిన వారి నేరాలను ఫ్రెట్టోలో విచారించేవారు. వారు తమ దేశం భూమి మీద అడుగు పెట్టకూడదు కనుక, వారు ఒడ్డు వరకు చేర్చబడిన ఒక నావలో ఉండగా విచారించే వారు. డ్రాకన్‌కు చెందిన ఇతర ఏ శాసనాల వివరాలు తెలియడం లేదు.

డ్రాకన్ తరవాత ఏథెన్స్‌కు చెందిన సోలన్ క్రీ.పూ. 594 లో మరొక స్మృతిని ఏర్పరిచాడు. డ్రాకన్ స్మృతుల వల్ల తక్కువ సంఖ్యగల ధనికుల అణచివేత కార్యక్రమాలు, ఎక్కువ సంఖ్య గల సామాన్య రైతుల పేదరికం పెరిగిపోవడంవల్ల, సోలన్ తిరిగి స్మృతిని ఏర్పరచవలసి వచ్చింది. ఇతడు తన స్మృతుల ద్వారా ఏథెన్స్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వేశాడు. ఇతడు జనాభాను నాలుగు వర్గాలుగా విభజించాడు. అవి : యుపాట్రిడా (Eupatridae) ధనిక వర్గం; జార్జి (Georgi) సొంతంగా భూములను చేసుకొనే రైతులు; డెమ్యుర్జి (Demiurgi) అంటే వర్తక వాణిజ్యాల ద్వారా జీవించేవారు; థెట్స్ (Thetes) అంటే ఆయుధజీవులు. అతడు థెట్స్ నే వారికి కొన్ని రాజకీయ పరమైన హక్కులు కూడా మంజూరు చేశాడు. ఆర్కన్ అనే పదవికి పెంటాకోసియోమెడిమ్ని (Pentacosiomedimni) అనే వర్గీయులు మాత్రమే అర్హులు. నూనె, మద్యం వుత్పత్తి గుర్తించదగిన స్థాయిలో లేనపుడు, ధాన్యం మీద ఆదాయం ఏటా ఐదు వందల మెడిమ్ని (Medimni) కలవారిని పెంటాకోసియోమెడిమ్ని అని పిలిచేవారు. వీరు ఏథెన్స్ సమాజంలో అత్యున్నత వర్గానికి చెందినవారు. ఇతర పదవులను హిప్స్(Hippes), జుగిటా (Zeugitae) అనే వర్గీయులకు కేటాయించారు. హిప్స్ అంటే సాలీనా ఆదాయం 300 - 500 మెడిమ్ని మధ్య గల వారు. జుగిటా అంటే సాలీనా ఆదాయం కనీసం 200 మెడిమ్ని ఉన్నవారు. ఈ రెండు వర్గాల వారికి

BRAOU

పోలెటాయ్ (Poletai), అంటే గనులు త్రవ్వకం వంటి ప్రభుత్వపు పనులు, ఎలెవెన్ (eleven) అంటే న్యాయ మూర్తులు, కోలాక్రిటాయ్ (Kolakretai), అంటే ఆర్థికాధికారుల వంటి పదవులను హిప్పిక్, జుగెటాకు ఇచ్చేవారు. థెట్స్ అనేవారు ప్రభుత్వ పదవులు పొందడానికి అర్హత లేకపోయింది. ఎక్లీషియా (ecelesia) అనే సంఘపు సమావేశాలలోను, న్యాయమూర్తుల ఎన్నికలలోను పాల్గొనే హక్కును కలిగి వుండేవారు.

ఈ రకమైన సంస్కరణలతో బాటు సోలన్ ప్రజా న్యాయస్థానాలను ఏర్పరిచాడు. దీనిని హెలైయా (Heliaea) అనేవారు. ఇది ఎక్లిషియా కన్న వేరైనది. వీనివల్ల ప్రజలకు సంపూర్ణంగా ప్రభుత్వ నిర్వహణ మీద ఒక అధికారాన్ని ఇవ్వడం జరిగింది. ముందుగా ఆర్కన్‌లకు అధికారం తగ్గక పోవడం వల్ల, హెలైయా కేవలం అప్పీలు చేసుకొనే న్యాయస్థానంగా వుండేది. రాను రాను ఆర్కాన్ల అసమర్థత హెలైయా సర్వంసహాధికారత్వానికి దారితీసింది. సాంప్రదాయిక రాజకీయ స్థితికి ఏ మాత్రం భంగం కలిగించకుండా, ఉన్నత వర్గాల హక్కులకు ఏ మాత్రం అవరోధాన్ని కలిగించకుండా, నూతన విధానాలను ప్రవేశపెట్టిన సోలన్‌ను ఏథెన్స్‌లో ప్రజాస్వామ్య నిర్మాతగా అభివర్ణించొచ్చు. ఇతడు ఏరియోపాగస్ అనే వృద్ధుల సభ కుండే శాసనాధికారాలను రద్దు చేశాడు. కాని, దానిని శాసనాలకు రక్షక అంగంగాను, రాజ్యాంగాన్ని రక్షించే భాగంగాను, న్యాయపరమైన, మతపరమైన హక్కులు గల దానిగాను తీర్చిదిద్దాడు. ఆర్కాన్స్‌లో కనీసం తొమ్మిది మంది తమ పదవీ విరమణకు చివరి సంవత్సరంలో, ఏరియోపాగస్ యావజ్జీవసభ్యులుగా అధికారాన్ని పొందేవారు.

అతడు వేరొక నాలుగు వందల మంది సభ్యులు గల సభను ఏర్పరిచాడు. ప్రతి వర్గం నుండి వంద మందిని ఎన్నుకోడంగాని, నియమించడంగాని, లాటరీ పద్ధతిలో ఎన్నుకోడం జరిగేది. థెట్స్‌కు దీనిలో అర్హత లేదు. ఇది స్పార్టాలోని గెరూషియా వలె గాని, రోం లోని సెనేట్ వలె గాని వుండేది కాదు. ఏరియోపాగస్‌కు సమర్పించడానికి ముందుగానే ప్రజాసమస్యలను చర్చించే అధికారం దీనికి వుండేది. లాటరీ పద్ధతి సోలన్ అనుసరించిన గొప్ప సంస్కరణ. కారణం, ఆ రోజులలో లాటరీ ద్వారా ఎన్నికైన వారిని భగవంతుడు ఎన్నుకొన్నట్లు భావించేవారు. దీనివల్ల ప్రజలలో వారి పట్ల భయభక్తులు రెండూ పెరగడానికి అవకాశం వుంటుంది. అసమర్థులను ఎన్నుకోకుండా ఉండటానికి ఎన్నికలను కూడా సోలన్ ప్రవేశపెట్టాడు. కాని ఈ రకమైన స్మృతిలో గల బలహీనతలు రెండున్నాయి. ఒకటి, తెగ, వర్గం కన్నా బలవంతంగా వుండటం వల్ల, వర్గ భేదం వల్ల వచ్చే అస్థిరత; రెండోది ఆటికాను విభక్తం చేసే వివిధ పక్షాల అభిప్రాయాలు.

దీనివల్లనే సోలన్ సంస్కరణలు పూర్తిగా ప్రజాస్వామ్యానికి తావివ్వలేక పోయాయి. సోలన్ తరవాత పిసిస్ట్రాటస్ (Pisistratus)అనే రాజు అధికారాన్ని పొందాడు. ఇతడు చౌరాన్‌కు చెందిన హిపోకోట్స్ కుమారుడు. ఇతడు సాలయిన్ యుద్ధం తర్వాత, 561 లో అధికారాన్ని, కోమియా ఆర్కాన్ పదవిని హస్తగతం చేసుకొన్నాడు. కాని, 556 - 555 లలో అతడు రాజకీయ పక్షాల విధానాల వల్ల, పదవిని వదిలేశాడు. తిరిగి 550 - 549 లలో అధికారాన్ని పొందాడు. మళ్ళీ అనతి కాలంలోనే అధికారాన్ని కోల్పోయి, మూడోసారి 540 - 539లలో అధికారాన్ని పొంది, క్రీ.పూ. 528 - 527 వరకు పాలించాడు. ఇతడు రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యాన్ని నిరోధించలేదు. కాని, ఇతడు తన మాట ప్రజలమాటగా, ప్రజాస్వామ్యంగా నియమించుకోగలిగాడు. అతడు ఆర్కాన్‌లలో తన వంశస్థుడిని ఒకనిని తప్పక ఉంచుకోవడానికి గాను, సోలన్ ప్రతిపాదించిన లాటరీ విధానంలో కొన్ని మార్పులను చేశాడు. కొంత స్థిరమైన సైన్యాన్ని సిథియాకు చెందిన విలుకాళ్ళతో ఏర్పాటు చేసి, రక్షణ కోసం ఉంచుకొన్నాడు. తాను అనుమానించే కొందరు ధనికుల పిల్లలను తనవద్ద ఉంచుకొన్నాడు. ఆటికాకు చెందిన ఆల్కమెనిడ్ వంశంతో వైరం వుండేది. ఆల్కమెనిడ్ వంశీకులు తమ భూములను వదిలి వెళ్ళగా, పిసిస్ట్రాటస్ స్వాధీన పరుచుకొని, వాటిని తన ఆశ్రితుల మధ్య పంపిణీ చేశాడు. వారు సాలీనా 1 / 10 శాతం ఉత్పత్తిని పన్నుగా

BRAOU

# భాగం 21 : మతం - తత్త్వ వివేచన

విషయ క్రమం

21.0 లక్ష్యాలు

21.1 పరిచయం

21.2 మత పరిణామం

21.2.1 వివిధ దేవతల, దేవుళ్ళ వివరాలు

21.2.2 దేవతామూర్తుల ప్రాశస్త్యం

21.2.3 ఆరాధనా విధానాలు, ఇతర మతపరమైన నమ్మకాలు

21.3 తత్త్వ వివేచన, జిజ్ఞాస, పరిణామం

21.3.1 సోక్రటీస్ పూర్వయుగం

21.3.2 సోక్రటీస్ యుగం - సోక్రటీస్ పరంపర

21.3.2.1 సోక్రటీస్

21.3.2.2 ప్లేటో

21.3.2.3 అరిస్టాటిల్

21.3.3. సోక్రటీస్ అనంతర యుగం

21.3.3.1 ఎపిక్యూరియన్లు

21.3.3.2 స్టాయిసిజం

21.3.3.3 సినిక్‌లు

21.3.3.4 సమీక్ష

21.4 సంగ్రహంగా

21.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

21.6 ఉపయుక్త గ్రంథాలు

21.7 పదకోశం

BRAOU

## 21.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని అధ్యయనం చేయడం వల్ల, ఈ క్రింది విషయాలను తెలుసుకోగలగాలి.

1. గ్రీక్‌ల మత వ్యవస్థలో తొలి దశలను తెలుసుకోవడం.
2. గ్రీక్‌ల ప్రాంతీయ దేవతలు, లేదా నగర దేవతలు జాతీయతా విలువలను పొందిన రీతులను వివరించడం.
3. గ్రీక్ దేవతల, దేవుళ్ళ స్వరూపాన్ని, వారి వారి ఐతిహ్యాలను వివరించడం ; వారికి గల పూజాదికాలను వివరించడం.
4. గ్రీక్‌ల ఆలోచనా సరళిలో వచ్చిన ప్రధానమైన పరిణామాలను వివరించడం.
5. గ్రీక్‌ల తత్త్వ వివేచనలో ప్రధానమైన దశలు, వారి వారి తాత్త్వికుల వివరాలను, ప్రవచనాల సూత్రాలను గ్రహించడం.
6. గ్రీక్‌ల తత్త్వ వివేచన ఆధునిక శాస్త్రీయ పణితి వైపు మరలిన విధానాన్ని చర్చిస్తూ, గ్రీక్ తత్త్వవేత్తలు ఆధునిక ప్రపంచానికి మూలంగా నిలిచిన ఐరోపా నాగరికతల పునాది అవునా, కాదా అని పరిశీలించడం.

## 21.2 పరిచయం

గ్రీక్‌లు తమ దేవతలను ప్రసిద్ధ పురుషులుగాను, మానవులవలె బతుకుతూ పనిచేసుకునే వాళ్ళుగాను, అవినీతిపరులుగాను, అమరులుగాను పేర్కొంటుండేవాళ్ళు. ప్రకృతి శక్తులైన పిడుగును ధరించిన జీయస్‌ను, అధోలోక దేవతైన హేడీస్‌ను, సముద్రానికి దేవతైన పోసీడాన్‌ను, మద్యానికి దేవతైన డయోనీసస్‌ను, జ్ఞానానికి దేవతైన ఎథీనాను, విలు విద్యకు దేవతైన అపోలోను పూజిస్తారు. గ్రీక్‌లు తమ దేవతలను గురించి, వివిధ పౌరాణికాంశాలను గురించి, అనేక పురాణాలను రాయడం జరిగింది. వారు తమ పురాణాలలో మానవుని పుట్టుక ఎట్లా జరిగిందో వివరిస్తారు. గ్రీక్‌ల పూజా విధానం ఎంతో పరిమితమైనది. వీళ్ళు దేవతల మీదే కాకుండా, అనేక సోదెల మీద కూడా నమ్మకాన్ని పెంచుకొన్నారు. డెల్ఫి నగరంలో చెప్పబడే సోదె ఎంతో పౌరాణిక, చారిత్రక ప్రాముఖ్యాన్ని పొందింది. వీళ్ళు దేవతల గౌరవార్థం, పండుగలను నిర్వహించడం కూడా జరుగుతుంది.

గ్రీక్‌ల జీవన విధానంలో మతానికి, తత్త్వ వివేచనకు ఒక సూక్ష్మమైన విభేదాన్ని మాత్రం చూడగలం. స్థూల దృష్టికి, రెండు కూడా ఇంచుమించు ఒకటేనా అనే స్థితిని కలిగినట్లు కన్పిస్తుంది. కాని, వివిధ తాత్త్వికులైన అనాగ్జిమాండర్, ఎంపెడోకిల్స్, డెమోక్రిటస్ వంటి వారి రచనల ద్వారా, మూఢ నమ్మకాన్ని ప్రోత్సహించే తత్త్వ చింతన నుండి హేతువాదాన్ని, తర్కాన్ని, ప్రామాణికంగా మార్చుకొన్న శాస్త్రీయ తాత్త్వికతా దృక్పథ పరిణామాన్ని మనం చూడొచ్చు. దీనిని ప్రోత్సహించడంలో, సోఫిస్ట్‌లనే శాఖ వారు ఎంతో కృషిచేశారు. సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ అనే మూడు తరాలకు చెందిన గురు పరంపరంలో, గ్రీక్ తాత్త్విక చింతన కొత్త పుంతలు తొక్కి, మానవుల జీవనంలోని మౌళికమైన, సార్వత్రికమైన, నైతికమైన అంశాల పరిణామ, పరిమాణాలలో విశ్లేషణ జరిగింది. వీరే కాకుండా, ఎపిక్యూరియన్‌లు, స్టాయిక్‌లు, సినిక్‌లు అనే వివిధ తాత్త్విక శాఖల వారు ఒక ప్రత్యేకమైన ధోరణికి బాటలు వేశారు. ఈ గ్రీక్‌ల తత్త్వ వివేచన అంతా మానవునికి విశ్వపు మూలాన్ని

BRAOU

తెలియబరచి, గమ్యాన్ని ఉపదేశించడమే ప్రాథమిక లక్ష్యంగా పెంపొందింది. వారి విశ్లేషణలో, మానవులు అనేక సమస్యలను ఆత్మవిశ్వాసంతో మాత్రం ఎదుర్కోవలసి ఉంటుందని, అదే సార్వత్రికమైనదని ఉద్బోధించడం జరిగింది.

## 21.2 మత పరిణామం

గ్రీక్‌ల చరిత్ర పరిణామంలో తొట్టతొలి దశలను ఏజియన్ సముద్ర ప్రాంతమైన క్రీట్ లోని నగరాలలో చూడొచ్చు. ఈ నగరాలలో గల నోసస్ (Cnossus), ఫాస్టస్ (Phaestus) వద్ద గల భవనాలు ఇంచుమించు క్రీ.పూ. 2000 కు చెందినవి. ఆ నాగరికత క్రీ.పూ. 1700 వరకు విరివిగా విస్తరించి, ప్రవర్థిల్లింది. ఈ నాగరికత ట్రోజన్ యుద్ధంతో అంతమైంది. ఈ నాగరికతలో వారు ప్రధానంగా రియా (Rhea) అనే దేవతను పూజించేవారు. ఈమెను అమ్మతల్లి అని, బ్యూరీ అభిప్రాయపడుతున్నాడు. ఈమె కొన్ని పర్యాయాలు సింహాల చేత, మరికొన్ని పర్యాయాలు పావురాల చేత, పరివేష్టించబడి వుండేది. ఈమెను పూజారిణులు పూజిస్తుండేవారు. ఆమె ఒక పురుష దేవునితో కూడి వుండేది. ఆ దేవుని కొందరు ఆమె భర్తగాను, మరి కొందరు ఆమె కుమారునిగాను పేర్కొన్నారు. కాని, తర్వాత తరాలలో, గ్రీక్‌లు ఆ దేవుని జీయస్ అని పిలిచేవారు. ఆ దేవుని సంప్రదాయం ప్రధానంగా ఇడయా (Idaea) వద్ద గల ఒక గుహలో అభివృద్ధి పొందింది. ఈ జీయస్‌ను సంస్కృత సాహిత్యంలో అభివర్ణితమైన ద్యాః గాను, లాటిన్ సంప్రదాయంలో చెప్పిన డయెస్‌పిటర్ గాను, చెప్పడం జరిగింది. అంటే, ఈ దశలో అమ్మతల్లి ఆరాధన నుండి ఆకాశ దేవతల ఆరాధన వరకు, ఒక పరిణామాన్ని చూడొచ్చు.

రెండో దశలో, క్రీ.పూ. 1600 - 1100 మధ్య, క్రీట్ నాగరికతా ప్రభావానికి నిర్ద్వంద్వంగా లోనైన, మైసినియన్ (Mycenaean) నాగరికత పెంపొందింది. ఈ నాగరికత రాగి, కంచు యుగానికి చెందింది. ఈ కాలంలో ఈజిప్ట్‌లో లానే, మైసినియా ప్రభువులను ఖననం చేయడానికి పెద్ద పెద్ద సమాధులు ఏర్పడ్డాయి. క్రీ.పూ. 1500 ప్రాంతంలో స్తంభం ఆకారంలోను, క్రీ.పూ. 1400 - 1300 లలో గోళాకారపు సమాధులు నిర్మితమయ్యాయి. ఈ కాలంలో ఈజిప్ట్ ప్రభావం వున్నా, గ్రీస్‌లో 'మృతుల మతం' పెంపొందలేదు. దీనికి కారణం, క్రీటన్ల ప్రభావం హెచ్చుగా వుండటమే. ఈ కాలంలోనే కొన్ని పట్టణాలైన అట్టికా, ఏథెన్స్, థేబ్స్‌లోని కాడ్మియా, కొపాయిక్ లోని భూములలో ఆర్కొమినస్ వంటివి ఆవిర్భవించాయి. ఈ పట్టణాల ఆవిర్భావం, ప్రాంతీయ నగర దేవతల సంప్రదాయానికి శ్రీకారం చుట్టడానికి తోడ్పడింది.

ఆ తర్వాతి దశలో, గ్రీస్ దేశంలో అఖియన్లు (Achaeans) ద్వీపకల్పంలో ప్రసిద్ధి పొందారు. వీరిని గురించి ఇలియడ్, ఒడిస్సీ అనే పురాణాలు ఎన్నో వివరించాయి. ఎంతో ప్రసిద్ధమైన ట్రోజన్ యుద్ధం వీరి కాలంలోనే జరిగింది. వీరి కాలంలో రాజ్య వ్యవస్థ పూర్తిగా అవతరించకపోవడం వల్ల, శిక్షలు, శాసనాల వంటివి, పూర్తిగా మతంతోనే ముడిపడి వుండేవి. వీరి కాలంలో 'జీయస్' ను, ఆదరించే దేవుడని వర్ణించాడు. అఖియన్లు క్రీ.పూ. 1300 - 1200 మధ్య వారు.

ఇనుప యుగం తొలి దశల్లో ఇల్లిరియన్లకు చెందిన డొరియన్‌లు, ఇనుప ఆయుధాలను ధరించి, పదాతులు గావచ్చి, గ్రీస్ దేశంలో ఎంతో ప్రభావాన్ని కలుగజేశారు. వీరే, దొదోనావద్ద, తొలిసారిగా జీయస్ ఆరాధనను ప్రవేశపెట్టారు. అనతి కాలంలోనే, జీయస్ గ్రీక్‌ల జాతీయ దేవునిగా పరిణమించడం జరిగింది. వీరు క్రీ.పూ. 1000 ప్రాంతంలో వచ్చారు.

BRAOU

క్రీ.పూ. 850 ప్రాంతానికి చెందిన హోమర్ 'ఇలియడ్ ' అనే జాతీయ ఇతిహాసాన్ని రచించాడు. ఈ ఇతిహాసంలో హెలెన్ అనే దేవుని సూచించడం జరిగింది.

హోమర్ ప్రకారం 'హెలెన్ ' నుండి జన్మించిన వారే గ్రీక్‌లు. అందువల్లనే, గ్రీక్‌లను హెలెన్లనడం జరిగింది. ఈ హెలెన్ దేవుడు థెసలీ ప్రాంతీయుడు. ఈ హెలెన్ దేవుని వుత్పత్తిని గూర్చి, హోమర్ ఈ క్రింది విధంగా చెప్పాడు.

పండోరా
|
ప్రామిథియస్ (దంపతులు)
|
డ్యుకాలియన్
|
జీయస్
|
హెలెన్

దీని ప్రకారంగా హెలెన్ స్వయంగా ఆకాశదేవుడైన జీయస్ కుమారుడుగా భావించబడినాడు. ఈ భావన గ్రీక్‌లకు, తమ జాతి పుట్టుకలోని మతపరమైన విశ్వవ్యాపకత్వాన్ని సూచిస్తున్నది. క్రీ.పూ. 850 నాటికి డోరియన్ నాగరికతలో చెప్పిన అమ్మతల్లి, జీయస్‌ల బాంధవ్యం పూర్తిగా మరుగున పడింది.

హోమర్ అనంతర యుగంలో పౌరాణిక గ్రీక్ రాచరికాలు పతనమయి, వాని స్థానంలో వివిధ స్థానిక గణతంత్ర రాజ్యాలు ఏర్పడ్డాయి. స్పార్టా, ఏథెన్స్, కారింథ్, థేబ్స్, థెసలీ వంటి వివిధ నగర రాజ్యాలు ఆవిర్భవించాయి. స్పార్టా , ఏథెన్స్‌లలో రాచరికం వున్నప్పటికీ, అది మరింత ప్రాచీన రాచరికాలవలె లేదనడం సత్యం. నగర రాజ్యాలు రావడం వల్ల, వాటి వాటి అధిష్ఠాన దేవతలు గ్రీక్‌ల జీవితంలో చోటుచేసుకోడం జరిగింది. ఏథెన్స్ నగర దేవత ఎథీనా.

నగర రాజ్యాలు వలసలను పూని విస్తరించడం వల్ల, తూర్పు ప్రాంతాలలో ఎన్నో మార్పులు వచ్చాయి. అపోల్లో ఆరాధన ఈ కాలంలో ఎంతో వ్యాప్తిలోకి వచ్చింది.

క్రీ.పూ. 700 ప్రాంతంలో బోషియాలోని అస్క్రాకు చెందిన హెసియాడ్ రచనల్లో ముఖ్యంగా ' థియోగోనీ' అనే రచనలో, దైవపరమైన అంశాలు కొన్ని చెప్పబడ్డాయి. హెలికాన్ ప్రాంతంలో గల కొండచరియల్లో గొర్రెలను మేపుతున్నప్పుడు, హెసియాడ్‌కు జీయస్ కుమార్తెలు విద్య నేర్పినట్లు చెప్పడం జరిగింది. ఈ కావ్యంలోని ఆధారాలు, మానుష ప్రపంచంలో దేవతల, దేవుళ్ళ ప్రభావానికి ఒక సూచిక.

ఇటువంటి దేవుళ్ళను నగర రాజ్యాలలో ఎంతో శ్రద్ధగా పూజించేవారు. స్పార్టాలో ప్రతి నెలా అపోల్లో దేవునికి పూజలు, బలులు జరిపేవారు. యుద్ధాలకు ముందు ప్రత్యేకంగా పూజలు, బలులు జరిపేవారు. పాలకులు పూజారులుగా కూడా ఉండేవారు. దానికి వారు మాన్యాలను పొందేవారు. జ్యూస్ లసెడమన్ (Zeus Lacedaemon), జ్యూస్ యురేనియన్ (Zeus Uranios) అనే రకాలైన మాన్యాలను కలిగివుండేవారు.

ఏథెన్స్‌కు చెందిన ఐతిహ్యం ఇంకొకటి వ్యాప్తిలో వుంది. ఒకసారి ఎథీనా, పోసిడాన్ ఇద్దరూ నగరానికై పోటీపడతారు. ఆలివ్ వృక్షాన్ని ఎథినా గుర్తుగాను, ఉప్పు నీటి ఊటను పోసిడాన్ గుర్తుగా ఉంచుకొంటారు. ఈ

ఎథీన్ అనే దేవత క్రీ.పూ. ఇంచుమించు 1581 ప్రాంతంలో ఎక్రోప్స్ (Ecropes) ను ఆక్రమించడం వల్ల, ఆటిక్ సమాఖ్యను ఏథెన్స్‌కు పరిచయం చేయడం జరిగింది. నగరం పేరు కూడా ఎథీనాయ్ (Athinai) గా మారింది. అదే ఏథెన్స్. ఇద్దరికీ మధ్య పోటీ, రాజీలో ప్రతిఫలించింది. అంతేకాక , ఏథెన్స్ కొండ మీద ఎరెక్థియస్ (Erechtheus) అనే సర్పదేవుని నివాసాన్ని ఏర్పరచడం జరిగింది.

ఇదొక్కటే కాక, ఇంకొక ఐతిహ్యంలో ఎథీనా అనే దేవత, హిఫాస్టస్ (Hephaestus) అనే దేవుని సమాదరించినట్లు చెప్పడం జరిగింది. హిఫాస్టస్ విశ్వకర్మ వంటివాడు. ఇతడు రహస్యంగా సంపదలను ఇచ్చేవాడు. హిఫాస్టస్‌ను ఎథీనా భర్తగా కూడా కొన్ని సందర్భాలలో వర్ణించడం జరిగింది.

ఈ ఐతిహ్యంలో ప్రధాన భాగంగా మనం నగర దేవత ఎథీనాకు, జలదేవత పోసీడాకు గల వివాదం, ఎరెక్ థియస్ అనే నాగ దేవుని రక్షణ, చివరిగా హిఫాస్టసనే ధన దేవుని ఎథీనా వివాహమాడటం, ఇవన్నీ ఎంతో సంకేతమైనవి.

ఏథెన్స్ నగరంలో గల అందరూ తమ వారసత్వాన్ని హోమోగలక్టెస్ (Homogalaktes) అనే పాలు పిదికే వానికి చెందినట్లు, అందరూ ఒకే తల్లి నుండి జన్మించినట్లు చెప్పుకొంటారు. వాళ్ళంతా జ్యూస్ హెర్కియాస్ (Zeus Herkeios), అపోల్లో పాట్రూస్ (Apollopatroos) అనే ప్రధాన దేవతలను పూజించేవారు. వీరిని పూజించడానికి వివిధ పరిపాలనా శాఖలుండేవి. ప్రతి శాఖకు ఆకన్ (Aaakan) ఒక అధికారిగా ఉండేవాడు.

ఎథీనియన్ మతవ్యాప్తిలో డెయిటర్ పాత్ర ఇంకొక ముఖ్యమైంది. డెమిటర్ అనే భూ దేవత వస్తుతః ఎథీనియన్‌లకు చెందినది కాదు. ఆమె ఎలూసిస్(Eleusis) దేవత. ఈ రాజ్యం ఏథెన్స్‌కు, మెగారాకు మధ్య గల రాజ్యం. ఒక శ్రుతి ప్రకారం తాను కోల్పోయిన, తప్పిపోయిన తన కుమార్తైన పెర్సిఫోన్ (Persephone) ను వెదుకుతూ, డెయిటర్ ఎలూసియస్ రాజ్యానికి వస్తుంది. రాజు ఆదరణ పొందిన మీదట, డెయిటర్ అదే రాజ్యంలో స్థిరపడుతుంది. ఈ వృత్తాంతంలో ఎథీనాతో బాటు, ఇతర దేవతలు ఏ రకంగా ఏథెన్స్‌లో చోటుచేసుకొన్నది గమనించొచ్చు. అదే విధంగా, ఏథెన్స్ రాజ్యానికి చెందిన కలేరియా (Calauria) ద్వీపంలో పోసిడాన్ (Poseidon)కు పూజ సలిపేవారు. క్రీ.పూ. 7వ శతాబ్దంతానికి ఆమెకు కలేరియాలో ఒక దేవాలయం కూడా నిర్మితమైంది. ఏజినా పర్వతం మీద హెలెనిక్ సమూహానికి చెందని జీయస్‌ను పూజించినట్లే, వారు పోసీడాను పూజించేవారు. పోసీడాన్ సముద్ర దేవత. ఇతని పూజ కలేరియాలో జరపడానికి ప్రధాన కారణం, కలేరియా ఒక ద్వీపం అయి ఉండటమే తప్ప, వేరు లేదు.

ఏథెన్స్ రాజ్యం, అభివృద్ధి చెందిన కొద్దీ, మత వ్యవస్థలో కూడా కొంత మార్పు అనివార్యంగా వచ్చింది. ఇలిసస్ నది ఒడ్డున జీయస్‌కు ఒక ప్రసిద్ధ దేవాలయాన్ని డోరిక్ శైలిలో నిర్మించడం జరిగింది. ఈ దేవాలయాన్ని పిసిస్ట్రాటస్ ప్రారంభించినా, దానిని పోడ్రియన్ చక్రవర్తి పూర్తి చేశాడు. పిసిస్ట్రాటస్ కాలంలో డయొనీసస్ అనే మద్య దేవతారాధన ఎంతో వ్యాప్తిలోకి వచ్చింది. అతడు పాత పండుగైన లెనయా (Lenaea) ను మించేటట్లుగా వసంతోత్సవాలను డయొనీసస్ ప్రీతి కోసం ఏర్పరిచాడు. ఈ పండుగలో మేక చర్మాలు ధరించి ' మేకపాట ' (Goat song) ను పాడేవారు. బోషియా, అట్టికాలలో కూడా ఈ దేవతారాధన వ్యాప్తి చెందింది. వాళ్ళు రాత్రులు కొండలపై జింక చర్మాలు ధరించి, చేతులలో కర్రలు పుచ్చుకొని, డప్పులు మోగుతుండగా, వికటుగా నృత్యం చేసేవారు. స్త్రీ పురుషులు దేవతా ప్రీతికోసం కొందరి శరీర భాగాలను ఖండించి, తినేవారు. వస్తుతః ఈ దేవతారాధన అపోల్లో ఆరాధనగా డెల్ఫివద్ద ప్రారంభమయింది. క్రీ.పూ. 338కి చెందిన ఒక లోక్రియాకు చెందిన కవి, అపోల్లో, డయొనీసస్ ఇద్దరూ ఒకటే అని కూడా వర్ణించాడు.

BRAOU

ఈమెను గురించి మరికొన్ని అంశాలు గమనించాలి. కొంతమంది ప్రకారం, ముఖ్యంగా ఆర్ఫిక్ శాఖ వారి ప్రకారం, జీయస్, పెర్సిఫోన్‌లకు జన్మించిన కుమారుడు డయొనీసస్ జగ్రియస్ (Dionysus Zagreus). ఇతని చిన్నతనంలో స్వర్గ రాజ్యాన్ని పొందగా, టిటాన్లు ఇతనిని తరుముతారు. ఇతడు ఒక ఎద్దు రూపం పొందగా, టిటాన్లు ఇతనిని ముక్కలుగా చేస్తారు. కాని, ఎథీనా ఇతని గుండెను రక్షిస్తుంది. దానిని ఇతని తండ్రి అయిన జీయస్ మింగి, కొత్త డయొనీసస్‌ను సృష్టిస్తాడు. ఈ ఐతిహ్యంలో ప్రధానమైన అంశం, నగర దేవత ఎథీనా. అధోలోకాధిపతైన జీయస్ కుమారుని రక్షించడం, అతడు తిరిగి స్వర్గాధిపతిగా అవతరించడం. దీనిలోని భావం, బ్యూరీ ప్రకారం, మానవాత్మలోని ఒక దివ్యత్వాన్ని ప్రోత్సహించడమే.

పై విషయాలను పరిశీలించిన మీదట, గ్రీక్‌ల మత విశ్వాసం లోని పరిణామాలను క్రింది విధంగా వివరించొచ్చు.

1. క్రీట్ నాగరికతలో రియా అనే అమ్మతల్లి, జీయస్‌ల పూజ ఉండేది. తర్వాత ఎథీనియన్‌ల ఐతిహ్యం ప్రకారం జీయస్ అనే ఆకాశ దేవునికి, డెమిటర్ అనే భూదేవత కుమార్తైన పెర్సిఫోన్ లకు జన్మించినవాడే, డయొనీసస్ జగ్రియస్. ఇతడే మానవాళి కారకుడు.

2. జీయస్ ఆరాధన క్రీ.పూ. 1600 కి ముందు ఇడయా వద్ద ప్రారంభమైంది. ఈ జీయస్ 1300 - 1200 మధ్య ఆదరించే దేవుడుగా పేరుపొందాడు.

3. మైసినియన్ దశలో పెద్ద పెద్ద సమాధులు ఉన్నా, ఈజిప్ట్‌లో లాగా మృతుల మతం ఏర్పడ లేదు.

4. డోరియన్‌ల కాలం నాటికి జీయస్ ఎంతో గొప్ప దేవుడుగా రూపొందాడు. దొదోనా వద్ద అతని పూజ ఎంతో ప్రసిద్ధి పొందింది. క్రీ.పూ. 850 నాటికి ఈ జీయస్ ' హెలెన్ ' లకు జన్మనిచ్చినవాడే. అంటే, ఎథీనియన్ సంప్రదాయంలో తర్వాత చెప్పబడిన డయొనీసస్ జగ్రియస్‌కు, హెలెన్ అని హోమర్ కాలంలో చెప్పబడిన దేవునికి భేదం లేదు.

5. నగర రాజ్యాలను పొందినా, జీయస్ గౌరవం తగ్గలేదు. ఇతని కుమార్తెలు హెలికాన్‌కు చెందిన హెసియాడ్‌కు జ్ఞానదాతలట !

6. నగరానికి చెందిన 'ఎథీనా' అనే దేవత, ఏథెన్స్ నగరౌన్నత్యంలో ఎంతో పాత్ర వహించింది. సాగర దేవతైన పోసిడాన్‌కు, ఎథీనాకు జరిగిన యుద్ధం, ఎథీనియన్‌ల ఇతర ద్వీపాల ఆక్రమణకు సంకేతం.

7. యుద్ధాలకు విలువిద్య ప్రధానం కనక, విలు విద్యకు అధి దేవతైన అపోల్లోను పూజించడం, స్పార్టాలోను, ఏథెన్స్‌లోను ఆనవాయితీగా మారింది.

8. ఎథీనాకు , పోసీడాన్‌కు జరిగిన యుద్ధం, కేవలం ఏథెన్స్ ఇతర ద్వీపాల మీద సాధించిన విజయాలకు ప్రతీక.

9. ఎరెక్ థియస్ అనే సర్పదేవుడు, హిఫాస్టస్ అనే విశ్వకర్మను కొలవడం, గ్రీక్‌ల మత వ్యవస్థలో ఆనుషంగిక దేవతల పరిణామాలకు గుర్తు.

10. ఎథీనియన్‌లు పెంపొందించిన డెమిటర్ ఆరాధనను భూదేవత పూజగానే పరిగణించాలి.

B R A O U

11. కలౌరియా ద్వీపంలో వ్యాప్తి పొందిన పోసీడాన్ ఆరాధన, ద్వీపస్థులకు సముద్రంపట్ల గల భయ భక్తులకు గుర్తు.

12. డయొనీసస్ ఆరాధన ఆర్ఫిక్ మతానికి కూడా చెంది, గ్రీస్ దేశంలో పెంపొందిన ఒక వామాచార మార్గానికి గుర్తు.

13. గ్రీక్‌ల పరిపాలనలో పెంపొందిన ఆర్కాన్‌ల వంటి పూజారుల ప్రాశస్త్యం, పరిపాలనలో కూడా మతం ఎంత ఉన్నత స్థానాన్ని పొందినది సూచిస్తున్నది.

## 21.2.1 వివిధ దేవతల, దేవుళ్ళ వివరాలు

1. **జీయస్ :** గ్రీక్‌ల ప్రధాన దేవత. ఇతడు పిడుగును ధరించేవాడని, ఇతడు ఆకాశానికి అధిపతి అని నమ్మే వారు. ఇతని సంతానమే గ్రీక్‌ల నాగరికతావిర్భావానికి గుర్తు. జీయస్ ఆరాధన ఇడయా, దొదోనా వంటి చోట్ల బాగా వ్యాప్తి చెందింది. ఇతడు ప్రధానంగా గ్రీక్‌ల జాతీయ దేవుడు.

2. **ఎథీనా :** ఈమె ఒక గ్రామ, లేక నగర దేవత. ఈమె ఏథెన్స్ నగర రక్షక దేవత. ఈమె కిక్రోప్స్ అనే ప్రాచీన దేవత నుండి ఆవిర్భవించింది. ఈమె జనులను రక్షించడంలో ఎరెక్థియస్ అనే సర్పదేవుని, హిఫాస్టస్ అనే విశ్వకర్మ సహాయాన్ని పొందింది. ఏథెన్స్ సామ్రాజ్య కాలంలో ఎథీనా ఎంతో గౌరవాన్ని పొందింది. ఈమెకు గుర్తు ఆలివ్ చెట్టు. అమాసిన్ ఒక పాత్ర మీద చిత్రించిన బొమ్మ ఆధారంగా, ఎథీనా శిరస్త్రాణాన్ని, ఎడమ చేత బల్లేన్ని ధరించినట్లు, కంఠం వరకు పొడుగాటి దుస్తులు ధరించి ఉన్నట్లు తెలుస్తున్నది.

3. **పోసీడాన్ :** ఇతడు గ్రీకుల ప్రకారం సముద్రానికి దేవుడు. ఇతనికి ఉప్పునీటి ఊటు గుర్తు. ఇతడు ఎడం చేతిలో త్రిశూలాన్ని ధరించి, కుడిచేతిని కట్టె మీద ఉంచుకొంటాడు. కలౌరియా వంటి ద్వీపాలలో పోసీడాన్‌కు దేవళాలు కట్టడం, పెద్ద ఎత్తున పూజలు జరగడం జరిగింది.

4. **డయొనీసస్ :** ఈమె మద్య దేవత. ఈమె ఆరాధన ఏథెన్స్ ప్రభువయిన పిసిస్ట్రాసస్ కాలంలో ఎంతో వ్యాప్తి చెందింది. ఏథెన్స్, బోషియా, అట్టికా వంటి ప్రాంతాలలో వ్యాపించింది. ఈమెకు వసంతోత్సవాలు జరపడం, వికట నృత్యాలు నిర్వహించడం, ఆర్ఫిక్ మత శాఖలో డయొనీసస్‌ను ఒక ప్రధాన దేవతగా చూడటం జరిగింది.

5. **అపోల్లో :** ఇతడు విలు విద్యకు దేవుడు. యుద్ధోత్సాహం కల రాజ్యాలైన ఏథెన్స్, స్పార్టా వంటి చోట్ల, అపోల్లో ఆరాధన ఎంతో విస్తృతంగా వ్యాప్తి చెందింది. అపోల్లో పాట్రూస్ అనే పేరిట, ఏథెన్స్ నగరంలో అపోల్లో ఆరాధన పెంపొందింది.

6. **డెయిటర్ :** ఈమె భూదేవత. ఈమె కుమార్తె పెర్సిఫోన్. ఈమెను ఆకాశ దేవుడైన జీయస్ పెళ్ళాడగా, వారికి జన్మించిన వాడే డయొనిసస్ జగ్రుయస్ అనబడి, హెలెన్‌గా కూడా వ్యవహరించబడిన గ్రీక్‌ల మూల దేవుడు.

7. **ఆనుషంగిక దేవతలు / దేవ మూర్తులు :** హేడిస్ అధోలోక దేవత ; హెర్మీజ్ దేవతలకు దూత; ఎరెక్థియస్ సర్పదేవుడు ; హిఫాస్టస్ విశ్వకర్మ ; వీరంతా ప్రధాన దేవ / దేవతలైన జీయస్ , అపోల్లో, ఎథీనా వంటి వారలకు పార్శ్వ, పరివార దేవతల వంటి వారు.

**21.2.2 దేవతామూర్తుల ప్రాశస్త్యం :** గ్రీస్ దేశంలో వివిధ దేవుళ్ళను, దేవతామూర్తులను పూజించినా, ఎక్కువ ప్రాశస్త్యం జీయస్, అపోల్లో లకు మాత్రం ఏర్పడింది. జీయస్ ఆకాశ దేవుడని చెప్పబడుతూ, గ్రీక్‌ల మూల పురుషుడైన / మూల దేవుడైన హెలెన్‌కు జన్మనిచ్చి ఉండటం వల్ల, జీయస్ ఆరాధన ఎంతో విశిష్టంగా మారింది. క్రీటన్‌ల కాలం నుండి జీయస్ ప్రాముఖ్యం అనివార్యంగా గుర్తించబడింది. కాగా, అపోల్లో ప్రాముఖ్యం జీయస్ అంత గొప్పది, ప్రాచీన మైంది కాదు. కాని, గ్రీక్‌లు పారశీకులతో నిర్వహించిన యుద్ధాలు, గ్రీక్ నగర రాజ్యాలలో అంతర్యుద్ధాలుగా వచ్చిన పెలోపొనీషియన్ యుద్ధాలు, గ్రీక్ భావాలను పూర్తిగా యుద్ధోన్ముఖంగా మలిచాయి. ఆ పరిస్థితులలో విలువిద్యకు అధిదేవుడైన అపోల్లో అనివార్యమైన గౌరవాన్ని, ఔన్నత్యాన్ని చూరగొన్నాడు. ఇక అగ్రగామి అయిన దేవతల్లో, ఎథీనా ఎంతో ముఖ్యమైంది. కేవలం ఒక చిన్న సంచార జాతుల వారి దేవతవలె ప్రారంభమైన ఈమె ఔన్నత్యం, ఆమెను ఏథెన్స్ నగరానికి గ్రామ దేవతగా గుర్తించడం వల్ల, ఆమె అభ్యున్నతి ఏథెన్స్ నగరంతోబాటుగానే పెరిగింది. ఒక స్థాయిలో యావత్ గ్రీక్ రాజ్యం, దాని సంస్కృతి మొత్తం ఎథీనియన్‌ల సంస్కృతిగానే మారడంతో, ఎథీనా కూడా జీయస్, అపోల్లో వలెనే, ఉత్కృష్టమైన దేవతామూర్తిగా పెంపొందింది. పైన చెప్పిన ఎథీనా - పోసీడాన్‌ల యుద్ధం, ఎథీనా ఎరెక్థియస్, హిఫాస్టస్ వంటి వారి చేత పరివేష్టించబడినట్లు చెప్పడం, ఈమెకు గల రాజకీయ ప్రాముఖ్యానికి, మత ప్రాముఖ్యానికి మధ్య భేదం లేదని సూచించడమే.

### 21.2.3 ఆరాధనా విధానాలు - ఇతర మతపరమైన నమ్మకాలు

గ్రీక్‌లు తమ తమ దేవతలను, దేవుళ్ళను ఆరాధించడానికి గాను, శాశ్వతమైన వ్యవస్థలను ఏర్పరచుకొన్నారు. ప్రధానంగా వివిధ ప్రాంతాలలో వారికి దేవాలయాలను నిర్మించారు. ఒలింపిక్ పర్వతశిఖరం, ఇడయా, దొదోనా వంటి గుహలు, డెల్ఫీ నగరం, ఏథెన్స్ నగరం వంటి చోట్ల వివిధ దేవాలయాలను నిర్మించారు. వారికి వివిధ రకాలైన బలులివ్వడం, పాటల ద్వారా, ఆటల ద్వారా, వివిధ సంగీత వాయిద్యాల ద్వారా జాతరలను నిర్వహించడం, ఎంతో క్రమబద్ధంగా జరిగేవి. డయొనిసస్ వంటి దేవతలకు, ఆర్ఫిక్ మత సంప్రదాయంలో జింక చర్మాలు ధరించి, 'మేకపాట' పాడుతూ నృత్యం చేయడం, పునీతులైన వారిని బలి ఇచ్చి, వారి శరీర భాగాలను స్త్రీ పురుషులు వికట నృత్యం చేసి తినడం, వసంతోత్సవాల వంటివి నిర్వహించడం, ప్రధానమైన ఉదాహరణలుగా గ్రహించొచ్చు. స్పార్టాలో ఎఫార్‌లు, ఏథెన్స్‌లో ఆర్కాన్‌ల వంటి ఉద్యోగులు, కేవలం మత వ్యవస్థను నిర్వహించడం ప్రత్యేక విధిగా కలవారు.

ఈ ఆరాధనలే కాక, వీరికి సోదెలు / భవిష్యద్వాణి పై ఎంతో నమ్మకం వుండేది. డెల్ఫి నగరంలో అపోల్లో దేవాలయంలో చెప్పే భవిష్యద్వాణి, గ్రీస్ సంప్రదాయంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని పొందింది. అలాగే, హెసియాడ్ కథల వంటి వాని ద్వారా దేవుళ్ళు, దేవతలు మానవ సృష్టిలోను, మానవుల దైనందిన చర్యలలోను, ఎంతో ప్రభావాన్ని కలిగి వుంటారని కూడా నమ్మేవారు. ఆ నమ్మకాన్ని అందరూ ఆదర్శంగాను, స్థిరంగాను గ్రహించకపోవడం వల్ల, గ్రీక్‌ల ఆవిర్భావం, సృష్టి స్థితి రహస్యాల వంటివి తార్కికంగా తెలుసుకోవడం లక్ష్యంగా, గ్రీక్‌లలో తత్త్వ జిజ్ఞాస పెరిగింది.

## 21.3 తత్త్వ వివేచన, జిజ్ఞాస, పరిణామం

తత్త్వ జిజ్ఞాస పెరిగిన కొద్దీ, వివేచనలో వివిధ పరిణామ దశలను గ్రీస్ దేశంలో మనం గమనించొచ్చు. యావత్ గ్రీస్ దేశపు తాత్త్విక విశ్లేషణలో, సోక్రటీస్, అతని శిష్యుడు ప్లేటో, అతని ప్రశిష్యుడు అరిస్టాటిల్, కేంద్రకం

వంటి వారు. దాని దృష్ట్యా, మనం గ్రీస్ దేశంలోని తత్త్వ వివేచనలోని పరిణామాన్ని, సోక్రటీస్ పూర్వయుగానికి చెందినదానిగాను, సోక్రటీస్ శకానికి, లేదా సోక్రటీస్ పరంపరకు చెందినదానిగాను, సోక్రటీస్ అనంతర యుగానికి చెందినదానిగాను గ్రహించి, సమన్వయించుకోవచ్చు.

## 21.3.1 సోక్రటీస్ పూర్వయుగం

క్రీ.పూ. 470 ముందు కాలాన్ని సోక్రటీస్ పూర్వ యుగం అని వ్యవహరించొచ్చు. ఈ యుగంలో రెండు ప్రధాన దశలున్నాయి. తొలి దశలో పారశీక యుద్ధాలకు వెరచి, మొత్తం గ్రీస్ రాజ్యంలోని వివిధ నగర రాజ్యాలు ఏకీకృత వ్యవస్థను, నమ్మకాన్ని పెంచుకొని, తమ నమ్మకాలకు మతం ఆధారంగాను, మతాన్ని తమ నమ్మకాలకు ప్రతీకగాను చేసుకోడం జరిగింది. ఈ కాలంలో మత తత్త్వ భావాలలోను, తత్త్వ జిజ్ఞాసలోను, కేవలం కేంద్రీకృత విధానం వ్యాప్తిలో ఉండేది. అందువల్ల, ఈ కాలంలో హోమర్ యుగం నుండి వచ్చినా, స్థిరపడిన నమ్మకాలే కొద్ది మార్పులతో అంగీకరించబడ్డాయి. దానికి తోడు, అప్పుడు విస్తృతమైన రాచరిక విధానం, కొంత మంది నియంతల వంటి వారైన కారింథ్‌కు చెందిన పెరియాండర్, ఏథెన్స్‌కు చెందిన డ్రాకో, సోలన్, పిసిస్ట్రాటస్ వంటి వారి కాలాల్లో, ఏకత్వానికే కాని, అనేకత్వానికి ఏ రకంగాను అవకాశం ఇవ్వలేదు. కాని, ఎప్పుడైతే ఏథెన్స్ వంటి చోట్ల ప్రజాస్వామ్య వ్యవస్థ ముదరడం, ఏథెన్స్, స్పార్టాతో పడి, పెలోపొనీషియన్ యుద్ధాలను నిర్వహించి, మొత్తం నగర రాజ్యాల వ్యవస్థకే ఆత్మహత్యా సదృశంగా మారడం సంభవించిందో, అప్పుడు అనేక వికేంద్రీకృత భావాలు వ్యాప్తమయ్యాయి. గ్రీక్‌లంతా ఒకరు అంటే ఒక జాతి వారు కారని, వారి అభిప్రాయాలు వేరని, వారి ప్రవృత్తులు, వ్యావృత్తులు వేరని, అనివార్యంగా భావించడం జరిగింది. అప్పుడే వారు గ్రీక్‌లకు మూల పురుషుడైన హెలెన్‌ను, అతని పూర్వులైన జీయస్ వంటి దేవతల ఔచిత్యాన్ని, ఔన్నత్యాన్ని శంకించి, ప్రశ్నించడం జరిగింది. ఆ స్థితిలోనే, ఆ దేవతలు లేరనుకొనే నాస్తికవాదం, ఆ దేవతలు ఉన్నా వారిని ఎంత వరకు సమర్థించవచ్చునే హేతువాదం, గ్రీక్‌ల నమ్మకాలను వారి వారి వస్తుగత, వాస్తవిక అనుభవం దృష్ట్యా పరిశీలించడంలో వచ్చిన భౌతికవాదం, కొన్ని విధాలైన విషయాలను, లేదా భూతార్థాలను గురించిన నిశ్చయ జ్ఞానం మనకుందని, 'అస్తిత్వం' ఉందని భావించబడే మరికొన్ని విషయాలను గురించి స్థిరమైన నిశ్చయ జ్ఞానం మనకు లేదని, అది కలగడం కూడా అసంభవమని భావించే అజ్ఞేయతావాదం (Agnosticism) మొదలైనవి వ్యాప్తిచెందాయి. ఈ రకమైన భావాల ప్రధాన స్వభావాన్ని ఈ క్రింది విధంగా సూచించొచ్చు.

సోక్రటీస్ పూర్వ యుగపు మొదటి దశలో అందరూ అనివార్యంగా సృష్టి ఆవిర్భావం, స్థితి వంటి అంశాలను గురించి ఆలోచించారు. హోమర్ తన కావ్యాలైన ఇలియడ్, ఒడిస్సీలలోను, హెసియాడ్ తన కవితలలోను, సృష్టిని గురించి అనేక ఆలోచనలను చేశారు. హోమర్ దేవతల సంకల్ప బలం వల్ల మాత్రం యీ సృష్టి సిద్ధిస్తుందని, దీనిలోని మార్పులు కూడా వారి సంకల్ప బలం వల్లనేనని చెప్పాడు. హెసియాడ్ కూడా ఇంచుమించు జీయస్ కుమార్తెలు తనకు జ్ఞానాన్నిచ్చారని వ్రాస్తూ, అదేవిధంగా చెప్పడం జరిగింది. థేబ్స్ ను ఆంఫియన్ (Amphion), జేతస్ (Zethus) అనేవారు, కారింథ్‌ను సముద్రానికి కుమార్తైన ఎఫైర్ (Ephyre) నిర్మించినట్లు రాస్తాడు. ఇతని ఉద్దేశంలో దేవతామూర్తుల సంకల్పం స్థితికి, సృష్టికి అనివార్యం. దాన్నే వారు దేవతలకు, వస్తు ప్రపంచానికి అభేదంగా భావించి, దివ్యజత్వం (Theosonig) అని వ్యవహరించడం జరిగింది.

కాని, ఈ అభిప్రాయాలను అందరు యథాతథంగా అంగీకరించలేదు. అంతేకాక, వైవిధ్యంతో కూడిన పరిశీలనలను, వ్యాఖ్యానాలను పొందుపరిచారు. అటువంటి వారిలో మొదటివాడు థేల్స్ (Thales). ఇతడు క్రీ.పూ. 624 - 548 ల మధ్య జీవించాడు. ఇతడు మిలెటస్ నగరానికి చెందినవాడు. ఈజిప్ట్‌లో ఖగోళ శాస్త్రాన్ని

అధ్యయనం చేసి, సూర్యగ్రహణాన్ని క్రీ.పూ. 585 ముందుగానే తెలిపాడు. అతడు యావత్ప్రపంచంలో వైవిధ్యాన్ని వివరిస్తూ, ఆ వైవిధ్యం నుండి ఏకత్వానికి, ఏక వ్యవస్థకు నివృత్తి చెందే ఒకే ఒక సామాన్య పదార్థాన్ని, సామాన్య సూత్రాన్ని కనుక్కోడానికి ప్రయత్నించాడు. అంటే, అతని ప్రకారం ఏకత్వం నుండి అనేకత్వం వచ్చిందని, .అనేకత్వం తిరిగి ఏకత్వంగా మారగలదని తెలుస్తున్నది. నీటిని సమస్త వస్తువులకు మూల పదార్థమని వివరించాడు. ఇతడు అయోనియన్‌ల ఏకత్వం కూడా తప్పక ఉండాలని అభిప్రాయపడ్డాడు. ఆవిధంగా థేల్స్ రాజకీయ ప్రవృత్తిని కూడా పెంచుకొన్నాడు. మిలెటస్ నగరానికి చెంది, థేల్స్‌కు దగ్గరివాడైన అనాగ్జిమాండర్ (క్రీ.పూ. 611 - 545), మొదటి పటాన్ని తయారు చేశాడు. ఇతడు దార్శనికుడు కూడా. దేని నుండి వ్యతిరేక విషయాలు వేరు పడటంవల్ల ప్రపంచమంతా ఉద్భవించిందో, దేనిలో ప్రళయ వేళ ప్రపంచమంతా తిరిగి లయమవుతుందో, అట్లాంటి నిత్యమైన, నాశనం లేని, అనంతమైనదే ప్రథమతత్త్వం అని అనాగ్జిమాండర్ అభిప్రాయం. కాగా, అనాక్జిమేనిజ్ ప్రథమ ద్రవ్యం వాయువని, దాని సాంద్రతలోని మార్పుల వల్లనే సమస్తం జనిస్తున్నాయని సిద్ధాంతీకరించాడు. ఒక విధంగా చూస్తే థేల్స్, అనాగ్జిమాండర్, అనాక్జి ానిజ్ ముగ్గురు ఇంచుమించు ఒకే సూత్రాన్ని, భాష్య భేదాలతో వివరించారు. ఇంచుమించు సోక్రటీస్‌కు సమకాలికుడైన డెమోక్రిటస్ (Democritus) అణు సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఇతడు క్రీ.పూ. 460 - 370 కి చెందినవాడు. ఇతడు వస్తువు ఏకరూపతను అంగీకరించినా , దాని ఏకత్వాన్ని, నిశ్చలత్వాన్ని నిరాకరించాడు. ఇతని ప్రకారం సత్తు పూర్ణం, అసత్తుశూన్యం ; " నిత్యాలు, అగోచరాలు, కేవల సూక్ష్మాలు, పూర్ణాలు, అసంకోచనీయాలు, ఆకృతి స్థితి పరిణామ భారాలలో మాత్రమే భేదించే ఏక రూపాలైన, అసాంఖ్యాకాలైన అణువులు చలించే అనంతమైన అవధి ఈ శూన్యం. దృశ్య వస్తువులన్నీ ఒకేవిధమైన అణువులతో నిండి వున్నవి. " ఈయన దృష్టిలో శరీరంలోని అత్యుత్తమ భాగం ఆత్మ. ఇది రెండు శరీరాణువుల మధ్య వుండే మానసికాణువును ఆవరించి ఉంటుంది. ఆత్మలో సున్నితమైన ప్రత్యేక చలనం కలిగిన ద్విస్వభావం కలిగిన అణువులుంటాయి.

డెమోక్రిటస్ ఈ సిద్ధాంతాన్ని చెప్పే నాటికి, వేరొక వైవిధ్యం గల సిద్ధాంతం అవతరించింది. దాని అనుయాయులను యుక్త్యాభ్యాసవాదులంటారు. వీరినే గ్రీక్ సంప్రదాయంలో సోఫిస్ట్‌లంటారు. సోఫిస్ట్ అంటే వివేకవంతుడని అర్థం. గ్రీస్ దేశంలో జిజ్ఞాస, ప్రభు, హేతువాద విచారణ పెరిగిన దృష్ట్యా , అప్పటి ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రకారం యువకులకు ఉన్నత విద్యాబోధన చేయవలసిన స్థితిలో సోఫిస్ట్‌ల వక్తృత్వం, తర్కం వంటి వాటిలో శిక్షణను ఇచ్చేవారు. సోఫిస్ట్‌లు ప్రజలలో సార్వత్రికత పట్ల, సంపూర్ణత పట్ల ఉండే అపనమ్మకాలను తొలగించేవారు. ఈ సోఫిస్ట్‌ల ఆలోచనలను దర్శనశాస్త్ర చరిత్రలో మధ్య దశగా పరిగణించేవారు. వీరి సిద్ధాంతాలను ప్లేటో, వారి చర్చలలో గాని, వివరణలోగాని సత్యం కనిపించడం లేదనే నింద మోపాడు. వీరిలో ఎపిండకిల్స్ (Epindacles) శిష్యుడైన గార్జియాస్ (Gorgias), అభావ సిద్ధాంతాలను ప్రతిపాదించాడు. అతని ప్రకారం ఏదీ లేదు. ఏది రెండు అగునో అది మనం ఉన్నదంటే లేదని చెప్పలేం. అధవా ఉన్న దానిని మనం తెలుసుకోలేం. తెలుసుకున్నా, ఇంకొకరికి చెప్పలేం. దీనికి వక్తృత్వ శిక్షణ చాలా అవసరమని ఇతని అభిప్రాయం. వీరిలోనే సోక్రటీస్‌కు సమకాలికుడైన ప్రోటాగొరస్ (481 - 411) అయోనియా సంప్రదాయంలో విశ్లేషిస్తూ, ఉన్న వస్తువులు ఉన్నవని చెప్పడానికి, లేని వస్తువులు లేవని చెప్పడానికి, మానవుడే ప్రమాణమని సాపేక్షతా వాదాన్ని వ్యక్తం చేశాడు. ప్రోటాగొరస్ ఐరోపా భాషకు తొలి వైయాకరణి కూడా. ఇతడు ఉపాధ్యాయ వృత్తిని శ్లాఘిస్తూ బౌద్ధిక యత్నానికి తగిన లక్ష్యం ధర్మం, లేదా శ్రేష్ఠతే నని, సత్యం కాదని, వివేకం కాదని ప్రకటించాడు. సోఫిస్ట్ విధానం ఆడంబరమైన వ్యక్తిత్వానికి, వితండ వాదానికి దారి తీయడం వల్ల, ప్లేటో మొదలైన వాళ్ళు వీరికి సత్యచింతన లేదని చెప్పడం జరిగింది. ఈ రీతిగా సోక్రటీస్ పూర్వయుగంలోగల సంశయాన్ని సాధించడానికి

కేవలం తర్కం ముఖ్యమని భావించడం వల్ల, నిజం పట్ల లక్ష్యం, ఆసక్తి లేకపోయాయి. కేవలం బౌద్ధిక వాదులైన సోఫిస్టల వల్ల, తత్త్వ చింతన వాక్పరిధిని దాటలేకపోయింది. లియోంటనిక్‌కు చెందిన గార్జియాస్ నూతన శైలిలో గ్రీక్ వచనాన్ని రాయడం నేర్పగా, ప్రోటాగొరస్ వైయాకరణిగా మారాడు. కాని, నిజం భాషకు అతీతమా, కాదా అనే ద్వంద్వం కొనసాగుతునే వుంది.

## 21.3.2 సోక్రటీస్ యుగం - సోక్రటీస్ పరంపర

ఈ యుగంలో గ్రీక్‌ల తత్త్వ వివేచన సోక్రటీస్ (క్రీ.పూ.399), ప్లేటో (క్రీ.పూ. 428 - 347) , అరిస్టాటిల్ (384 - 325) అనే వారి పరంపరగా అభివృద్ధి పొందింది. వీరు సోఫిస్టల వలె ప్రశ్నోత్తర విధానాన్ని అనుసరించినప్పటికీ, వారివలె నిరాడంబరానికి, వితండవాదానికి, కేవలం సత్యాన్వేషణకు కృషి చేయడం జరిగింది.

### 21.3.2.1 సోక్రటీస్

ఇతడు ఏథెన్స్‌కు చెందిన ఒక పేద కుటుంబానికి చెందినవాడు. కొంత కాలం సైన్యంలో పనిచేసి, మరి కొంత కాలం ఏథెన్స్‌లోని కౌన్సిల్ ఆఫ్ ఫైవ్ హండ్రెడ్‌లో కూడా పనిచేశాడు. సోక్రటీస్ అభిప్రాయాలు అతని శిష్యుడైన ప్లేటో రచనలవల్ల తెలుస్తున్నాయి. వాటిలో ముఖ్యమైనవి 'ఏపాలజీ ఆఫ్ సోక్రటీస్ ', ' క్రిటో ', ' ఫెసిడో' అనే గ్రంథాలు. సోక్రటీస్ సోఫిస్టలను విమర్శించాడు. దేవుడొక్కడే జ్ఞానవంతుడని సోక్రటీస్ అభిప్రాయం. అతడు శీల మొక్కటే జ్ఞానమని, దానిని ఆర్జించడానికి యావజ్జీవితం కృషి చేయాలని బోధించాడు. మనుష్యుడు తానేది తెలుసుకొవాలనుకొన్నాడో, అది అతనికి నిజంగా తెలియదని రుజువు చేయడం, అతనిని జ్ఞానార్జనకు ప్రోత్సహించినట్లేనని, సోక్రటీస్ అభిప్రాయం. ఇతడు ఎక్కువగా ఏథెన్స్ లోని యువకులలో శీల సముపార్జనకు తర్కవాద పద్ధతిలో కృషి చేశాడు. కాని, దీనిని ఎక్కువ మంది అవినయం గాను, దైవదూషణగాను భావించడం వల్ల, తన డెబ్బదవ ఏట విషపాదం అనే శిక్షకు గురై, చక్కని నిజాయితీకి దృష్టాంతంగా, అజరామరంగా నిలిచిపోయాడు.

BRAOU

### 21.3.2.2 ప్లేటో

ప్లేటో ఏథెన్స్‌లో 'అకాడెమి ' అనే సంస్థను స్థాపించి, తన దార్శనిక రీతులను తెలిపాడు. అతని ప్రకారం ద్రవ్యం, భావాలు, దేవుడు అనేవి ప్రాథమిక సూత్రాలు. ద్రవ్యం దేవుని వలె శాశ్వతమైనదని, దేవుడు ద్రవ్యం నుండే సమస్త సజీవ, నిర్జీవ పదార్థాలను సృష్టించాడని ప్లేటో అంటాడు. ప్రత్యక్షమయ్యే వస్తువులు త్వరలో నశిస్తాయని, భావాలు శాశ్వతమైనవని, విశ్వజనీన భావన సత్యమని ప్లేటో అన్నాడు. అతడు జ్ఞాన సముపార్జనలో స్వతంత్రమైన వ్యక్తి. స్వతంత్రమైన వ్యక్తి వలె వ్యవహరించాలని, నిర్బంధ పరిస్థితులలో జ్ఞాన సముపార్జన చేసినట్లయితే మనసుకు హత్తుకోదని, అబద్ధం హీనమైనదని చెప్పాడు. ఇతని ప్రకారం వస్తువులు ( ప్రత్యక్షమైనవి ) మానసిక ప్రతిబింబాలకన్న స్థిరంగా వున్నట్లున్నప్పటికి, అవి ఉత్పత్తి, పరిణామం, వినాశంకలవని, అవి సదసత్తుగా ఉండగలవని చెప్పాడు. వస్తువులు సుబోధం కావడానికి, అవి బౌద్ధిక ఆకృతుల, లేదా భావాల ప్రతిబింబాలని తెలియవలసి వుందని ప్లేటో అభిప్రాయం. ప్లేటో ప్రకారం జీవితంలో అనేక కల్పనలను ఏర్పరుచుకొన్నప్పటికీ, వాటిని బాహ్య ప్రకృతిని, మానవ ప్రకృతిని బోధపరచుకోడానికి సాధనాలని గాక, వాటిని భావాల మానసిక ప్రతిబింబాలని, పర్యావలోకా లని తలచాలని పేర్కొన్నాడు. ప్లేటో ప్రకారం మంచిని ఒకే భావం సహాయంతో చేరలేకపోతే, సౌందర్యం, అనుపాతం (Propostion), సత్యం అనే మూడు అంశాలతో గ్రహించాలని చెప్పాడు. ప్లేటోను విశ్వాసయుగ సృష్టి కర్త అని, క్రైస్తవ మతం ఉద్భవించకముందే జన్మించిన క్రైస్తవుడని పేర్కొన్నాడు.

## 21.3.2.3 అరిస్టాటిల్

ఇతడు ప్లేటో శిష్యుడు. మాసిడోనియాకు చెందిన అలెగ్జాండర్‌కు గురువు. ప్లేటో వ్యాపకతత్త్వాన్నిక దానిని అంగీకరించి, జ్ఞానైకత్వాన్ని సమర్థించగా, అరిస్టాటిల్ విషయ విభేదాలననుసరించి తగిన విధాన వైవిధ్యాన్ని సూచించాడు. ప్లేటో భావవాదికాగా, అరిస్టాటిల్ ఆచరణాత్మకతను కోరినవాడు. అందువల్లనే, ఏకత్వంతో బాటు, అనేకత్వానికి తగిన ప్రాముఖ్యమిచ్చాడు. అరిస్టాటిల్ విశేషం నుండి సార్వత్రికాన్ని నిర్ణయించ డానికి తగిన కృషి చేశాడు. అరిస్టాటిల్ ' హిస్టరీ ఆఫ్ ఆనిమల్స్ ' (History of Animals) అనే గ్రంథాన్ని రాశాడు. ఇతడు జ్ఞానాన్ని ప్రత్యక్ష వైవిధ్యం దృష్ట్యా, భౌతిక శాస్త్రం, అతి భౌతిక శాస్త్రం, తర్కం, నీతి శాస్త్రం అని నాలుగు రకాలుగా వర్గీకరించాడు. శాస్త్రమీమాంసలో అరిస్టాటిల్ ఖచ్చితంగా యుగ పురుషుడు. ఇతని ప్రభావం కనీసం 2000 ఏళ్ళు శాస్త్ర విశ్లేషణలో నిరవధికంగా కొనసాగింది.

సంగ్రహంగా చెప్పాలంటే, సోక్రటీస్ యుగంలోని పరంపరలో గల ప్లేటో , అరిస్టాటిల్‌లు, సోఫిస్ట్‌లు మొదలైనవారు వాదంలోను, తర్కకుతర్కాలలోను మలచిన నిజాన్ని, శీలం, సార్వత్రిక భావన, వైవిధ్య విశేషాల ద్వారా సార్వత్రిక భావనను సాధించడమనేది జరిగింది.

## 21.3.3. సోక్రటీస్ - అనంతర యుగం

క్రీ.పూ. 322 పిదప సోక్రటీస్ అనంతర యుగంగా గ్రహించొచ్చు. ఈ కాలంలో ఎపిక్యూరియన్‌లు, స్టొయిక్‌లు, సినిక్‌లు అనే మూడు ప్రధాన దృక్పథవాదులు గ్రీక్ తత్త్వ వివేచనను ప్రభావితం చేశారు.

BRAOU

## 21.3.3.1 ఎపిక్యూరియన్‌లు

ఈ మతానికి ఎపిక్యూరస్ ప్రవక్త. ఇతడు క్రీ.పూ. 342 - 270లలో జీవించాడు. ఇతడు వ్యక్తి వాది. మానవుని కోసం రాజ్యం ఉందని, రాజ్యం కోసం మానవుడు లేడని చెప్పాడు. అతడు మతాలు వాస్తవిక జీవితంతో జోక్యం చేసుకొని, మానవకోటిని కలవరపెట్టాయని భావించాడు. ఇతడు డెమోక్రిటస్ సిద్ధాంతాలను కొన్నింటిని ఆమోదించాడు. భగవంతుని గురించి ఆలోచించడంకన్న , మానవుడు తాను తన బుద్ధినంతా సుఖ జీవనం వైపు కేంద్రీకరించాలని చెప్పాడు. అంతేకాక, అతి పనికి రాదు, అది అసౌఖ్యానికి దారి తీస్తుందని, అవివేకం, పాపం రెండూ దుర్దశకు దారి తీస్తాయని చెప్పాడు. ఇతడు సంతోషదాయకం కానటువంటి వాటి నుండి, కలవరపెట్టేవాటి నుండి విముక్తి పొందడమే, ఆనందమని భావించాడు.

## 21.3.3.2 స్టొయిసిజం

క్రీ.పూ. 350 - 260 ల మధ్య నివసించిన జీనో ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. వీరు భౌతికవాదాన్ని, నిరాశావాదాన్ని ఏర్పరిచారు. రాజ్యం ప్రజ్ఞావంతులను కట్టిపారవేయకూడదని, అది కేవలం ఒక సౌకర్యం వంటిదని భావించారు. వీరు హేతుబద్ధతను ప్రోత్సహించారు. ఈ విశ్వం అంతా మంచితో కూడినదని, మానవుడు చిన్న విశ్వం వంటి వాడని స్టొయిక్‌లు చెప్పారు. మానవుడు ప్రకృతి సిద్ధాంతాలకు అనుగుణంగా బతకలేక పోతున్నాడంటే, అతడు తనహోదాను పాటించని క్రూరుడని, అంతరంగికంగా బానిస అయ్యాడని, ప్రధాన కారణంగా స్టొయిక్‌లు చెప్పారు. క్రైస్తవ మతం తొలిదశలో స్టొయిక్‌లు ఎంతో ప్రధాన పాత్ర వహించారు.

### 21.3.3.3 సినిక్‌లు

వీరిని నిరాశావాదులంటారు. క్రీ.పూ. 412 - 323 ల మధ్య నున్న డయోజనిస్, ప్రధానులైన నిరాశా వాదులలో ఒకడు. వీరు జీవితాన్ని సుగుణంగాను, సుగుణాన్ని జ్ఞానంగాను, జ్ఞానాన్ని ఆత్మకు సంబంధించిన దానిగాను పేర్కొన్నారు. వీరి వాదం సామాజిక వైఫల్యానికి ప్రతి రూపం. వీరు సాంఘికాచారాలను, పాలకులను పరిహసించి, నిర్లక్ష్యం చేశారు.

### 21.3.3.4 సమీక్ష

పై రకాలైన రీతిలో సోక్రటీస్ పూర్వయుగంలోను, సోక్రటీస్ యుగంలోను, సోక్రటీస్ అనంతర యుగంలోను అభివృద్ధిచెందిన గ్రీక్ తాత్త్విక వివేచనలో గ్రీక్‌లు నగర రాజ్యాలుగా మారడం, నగర రాజ్యాలు వైఫల్యం పొందడం, తర్వాత స్థితిలో గ్రీక్‌ల నాగరికత హెలెనిస్టిక్ నాగరికతగా మారినప్పటి స్థితి, మొదలైన అంశాల ప్రభావాన్ని చూడొచ్చు. అనాగరక స్థితిలోని అనేకత్వాన్ని, నగర రాజ్య స్థితిలో ఏకత్వంగా చూడటం, తరవాత వచ్చిన వైవిధ్యంలో ప్రోత్సహించిన హేతువాదం, అజ్ఞేయతావాదం వంటి ధోరణులు వాక్పటిమకు, సత్యాన్వేషణకు దారితీయడం, సత్యాన్వేషణలో శీల, జ్ఞానాది అంశాల ప్రభావాన్ని చెప్పడం, ఉత్కృష్ట స్థితిగా మారింది. కాగా, సార్వభౌమత్వకాలంలో, పెంపొందిన భావాలైన ఎపిక్యూరియన్‌లు, స్టొయిక్‌లు, సినిక్‌ల వంటి వారిలో నీరవత్వ స్థితిని పొందిన హేతుబద్ధత లక్షణాలను చూడొచ్చు. మొత్తం మీద, గ్రీక్‌ల తత్త్వ వివేచన వివిధ పరిణామ దశల్లో సత్తును చూచి, దాని నిత్యత్వాన్ని అంచనా వేసిన ప్రక్రియగా మారింది.

## 21.4 సంగ్రహంగా

గ్రీక్‌ల మత వ్యవస్థ క్రీట్ నాగరికతా కాలం నుండి ఎంతో సుస్పష్టమైంది. క్రీట్ నాగరికతలో రియా అనే అమ్మతల్లి, జీయస్‌ల పూజ వుండేది. తర్వాత ఎథీనియన్‌ల ఐతిహ్యం ప్రకారం, జీయస్ అనే ఆకాశ దేవునికి, డెయిటర్ అనే భూదేవత కుమార్తైన పెర్సిఫోన్‌లకు జన్మించిన వాడే డయోనీసస్ జగ్రియాస్. ఇతడే మానవాళి కారకుడు. జీయస్ ఆరాధన క్రీ.పూ. 1600 కి ముందు ఇడయా వద్ద ప్రారంభమైంది. ఈ జీయస్ 1300 - 1200 మధ్య, ఆదరించే దేవుడుగా పేరుపొందాడు. ఈజిప్ట్‌లో వలె పెద్ద పెద్ద సమాధులు గ్రీస్ దేశంలో ఉన్నా, గ్రీస్‌లో మృతుల మతం ఏర్పడలేదు. క్రీ.పూ. 850 నాటికి జీయస్ , 'హెలెన్ ' కు జన్మనిచ్చినవాడు; ఆ హెలెన్ గ్రీక్‌ల మూల దేవతగా, దేవుడుగా భావించబడి, వారు తమను తాము హెలెన్‌ల మని, తమ నాగరికత హెలెనిక్ నాగరికత అని పేర్కొన్నారు. నగర రాజ్యాలలో కూడా జీయస్ గొప్పదనం కొనసాగుతూనే వుంది. నగర దేవతల సంప్రదాయంలో ఏథెన్స్‌కు చెందిన ఎథీనా, కలేరియాకు చెందిన పోసీడాన్‌ల వంటి వారిని గుర్తించొచ్చు. ఎథీనా జ్ఞానానికి, కళలకు కూడా ప్రధాన దేవతగా చెప్పడం జరిగింది. స్పార్టా, ఏథెన్స్‌ల మధ్య, గ్రీస్, పర్షియాల మధ్య యుద్ధాలు జరిగినప్పుడు, గ్రీస్‌లో జాతీయభావం పెరగడమే గాక, ధనుర్విద్యకు అధిదేవుడుగా చెప్పబడిన అపోల్లో, ఏథెన్స్ నగరాధి దేవతైన ఏథెన్స్ వంటి వారి ప్రాబల్యం ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. ఈ విధానం లోనే నగరి దేవతల వంటి స్థానిక దేవతలు, జాతీయ స్థాయి దేవతలుగా మారడం జరిగింది. గ్రీక్‌ల పరిపాలనలో పెంపొందిన ఆర్మాన్‌ల వంటి పూజారుల ప్రాశస్త్యం, పరిపాలనలో కూడా మతం ఎంత ఉన్నత స్థానాన్ని పొందినది సూచిస్తున్నది. గ్రీక్‌లకు మతం మీద, సోదెల వంటి ఇతర అంశాల మీద ఎంతో నమ్మకం ఉండేది. ఇటువంటి నమ్మకాలు హేతువాదంతో కలిసే స్థితిలోనే, తత్త్వ వివేచన ప్రారంభమైంది.

గ్రీక్‌ల తత్త్వ వివేచనను సోక్రటీస్ పూర్వయుగానికి చెందినదని, సోక్రటీస్ పరంపరకు చెందినదని,

BRAOU

పెర్సిఫోన్ : డెమిటర్ కుమార్తె

లెనయా : డయొనీసస్‌కు జరిపే ఉత్సవం

గోట్‌సాంగ్ : డయొనీసస్ పండుగలో పాడే ఒక పాట

హెర్మీజ్ : దేవతలకు దూత

ఆర్ఫిక్ మతం : గ్రీక్ మత శాఖలో ఒక వామాచారం వంటిది

ఎఫార్ : స్పార్టాలోని ఉద్యోగులు

ఆర్కాన్ : ఏథెన్స్‌లోని మత ఉద్యోగులు

అజ్ఞేయతా వాదం : సృష్టిపట్ల స్థిరమైన జ్ఞానం కలగడం అసంభవం అని భావించే సిద్ధాంతం

ఎఫైర్ : సముద్రానికి కుమార్తె ; కారింథ్ నగర దేవత

సోఫిస్ట్‌లు : వివేకవంతులయి, సంశయాలను తీర్చే గ్రీక్ తత్త్వశాఖ వారు.

ఎపిక్యూరియన్‌లు : సుఖభోగాలకు ప్రాముఖ్యమిచ్చే తత్త్వ శాఖ వారు

స్టాయిక్‌లు : భౌతిక నిరాశావాదులు.

సినిక్‌లు : నిరాశావాదులు

BRAOU

# భాగం - 22 : కళలు - వాస్తువు

విషయక్రమం


22.0 లక్ష్యాలు

22.1 పరిచయం

22.2 కళలు

22.2.1 సాహిత్యం

22.2.1.1 ఐతిహాసిక సాహిత్యం

22.2.1.2 గేయ సాహిత్యం

22.2.1.3 రూపక సాహిత్యం

22.2.1.4 చరిత్ర

22.2.1.5 శాస్త్ర సాహిత్యం

22.2.1.5.1 గణితం

22.2.1.5.2 జంతుశాస్త్రం - శరీర ధర్మశాస్త్రం

22.2.1.5.3 వైద్యం

22.2.2. సంగీతం

22.2.3 శిల్పకళ

22.2.4 చిత్రలేఖనం

22.3 వాస్తుకళ

22.3.1 డోరిక్ శైలి

22.3.2 అయోనిక్ శైలి

22.3.3 కారింథియన్ శైలి

22.4 సంగ్రహంగా

22.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

22.6 ఉపయుక్త గ్రంథాలు


B R A O U

22.7 పదకోశం

## 22.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల , క్రింది విషయాలను అవగాహన చేసుకోగలగాలి.

1. గ్రీస్ దేశం లో వ్యాప్తి పొందిన కళాసాంప్రదాయాలకు చెందిన నేపథ్యాలను పరిశీలించడం.
2. గ్రీక్‌ల సాహిత్యాన్ని , దాని పరిణామాన్ని పరిశీలించడం.
3. గ్రీక్‌ల సంగీత కళలోని సంప్రదాయాలను, వాటి ప్రయుక్తతను తెలుసుకోడం.
4. గ్రీక్‌ల కాలంలో వ్యాప్తి పొందిన చిత్రలేఖనం గురించి తెలుసుకోడం.
5. గ్రీక్‌ల కాలంలో పరిణమించిన శిల్ప, వాస్తు సంప్రదాయాలను సోదాహరణంగా పరిశీలించడం.
6. గ్రీక్ కళల వ్యక్తిత్వాన్ని, దాని ప్రాముఖ్యాన్ని వివరించడం.

## 22.1 పరిచయం

గ్రీక్‌ల నాగరికత అయోనియన్ సముద్రానికి దాపులో గల పెలోపొనిసస్ అనే మైదానానికి చెందినటు వంటిది. ఇది గ్రీస్‌కు పడమటగా, క్రీట్‌కు దగ్గరగా వుంది. ఆ మైదాన ప్రాంతంలో ముందుగా మినోవన్లు, అఖియన్లు ఉండేవారు. వారిని కూల ద్రోసి, డోరియన్‌లు అనే తెగవారు తమ అస్తిత్వాన్ని పెంపొందించుకొన్నారు. సముద్ర సమీప ప్రాంతాలుకావడం వల్ల, వారు నివాసాలను రెండు రకాలుగా ఏర్పరచుకొన్నారు. మొట్టమొదటి దశలో రేగడి భూములను వ్యవసాయ యోగ్యంగా చేసుకొన్నారు. తరవాత కొంచెం ఎత్తుగా ఉండే కొండ చరియల పైన నగరాలు కట్టడం ప్రారంభం చేశారు. వాటికి ఆక్రొపోలిస్ అనే పేరు వుంది. ఈ నగరాలను వారు రక్షణకు, తమ తమ నగర దేవతల, లేదా జాతీయ దేవతల నిర్మాణాలకు తగినట్లుగా ఉపయోగించుకొనేవారు. ఆ విధంగా గ్రీస్ దేశంలో కొండల మీద, కొండ చరియల మీద పెద్ద పెద్ద దేవాలయాలు వెలిశాయి. ఉదాహరణకు, ఏథెన్స్‌లోని, ఎథీనా, పార్థనాన్‌ల దేవాలయాలు, కలౌరియాలోని పోసిడాన్ దేవాలయం చెప్పదగినవి. వీటి నిర్మాణాలలో కొయ్యనే కాక, ఏథెన్స్ నగరానికి ఉత్తరాన వున్న పెంటెలికస్ (Pentelicus) అనే పర్వతంలో వుండే పాలరాళ్ళను ఎక్కువగా నిర్మాణాలకు వినియోగించుకొనేవారు. వాస్తవానికి ఏథెన్స్ ప్రభువైన పెరికిల్స్ కాలాన్ని పాలరాళ్ళ యుగం (Age of Marbles) అనడం జరిగింది. ఈ నిర్మాణాలలో ప్రధానమైనవి కోటలు, ప్రజోపయోగకరమైన వ్యాయామశాలలు, పాఠశాలలు, నాటక శాలలు, దేవాలయాలు ముఖ్యమైనవి. ఈ నిర్మాణాలలో వాళ్ళు శిల్పానికి కూడా తగిన ప్రాముఖ్యమిచ్చారు. గ్రీక్ శిల్పంలో ప్రకృతి మీద మానవుని ఆధిపత్యాన్ని ప్రధానమైన నమూనాగా గ్రహించి, ప్రకృతిని సౌష్ఠవంగా చూపించారు. దానివల్లనే, గ్రీక్ శిల్పాలలో ప్రకృతికి చెందిన బాహిరమైన యథాతథ స్థితి విశేషంగా రూపొంది, సకల మానవాళి మెచ్చుకొనే గొప్ప శిల్ప పరంపరగా రూపొందింది. గ్రీక్‌ల శిల్పాన్ని దేవాలయంలో కూడా వినియోగించారు. కాని, ఆ వినియోగం కేవలం ఆనుషంగికమైనదే. వారు దారు, శిల్ప, లోహ ప్రతిమలను, కొయ్య, పాలరాయి, కంచు వంటివి ఉపయోగించి తీర్చిదిద్దారు.

BRAOU

గ్రీక్‌ల శిల్పకళలో ఇంకొక ప్రధానమైన ఇతివృత్తం వుంది. అది గ్రీక్‌ల జాతీయత, గ్రీక్‌ల ఔన్నత్యం. దానిని వారు తమ శిల్పాల్లో చూపించారు. గ్రీక్‌లు కేవలం శిల్ప, వాస్తు కళలకే తమను పరిమితం చేసికోలేదు. వారి చిత్రకళ కూడా ఎంతో శోభాయమానమైనది. దానికి కేవలం ఆలంకారికమైన సౌకర్యమే తప్ప, వేరొక ప్రయోజనం లేకపోవడం గమనించొచ్చు. ఈ గ్రీస్ ప్రజలు ఏజియన్ ప్రాంతపు నాగరికతతోమమైక్యం పొందినప్పటి నుండి, కూలంకషంగా సమగ్రమైన గ్రీస్ సంస్కృతి, ప్రధానంగా హెలెనిక్ సంస్కృతి అని పిలువబడిన సంస్కృతిగా పరిణమించింది. దానివల్ల, ట్రోజన్ యుద్ధం వంటి అనేక సంఘటనలు గ్రీక్‌ల జాతీయ సంఘటనలుగా పరిణమించాయి. వాటిని కాపాడటానికి ఒక సాహిత్యం, పాడేటప్పుడు రాగ, తాళ, లయాన్వితమైన ఒక సంగీతం ఆవిర్భవించాయి. ఆ ఆవిర్భావం సామాన్య జానపదుల స్థితి నుండి నాగరికులు పొందే వైవిధ్యం కోసం పరిణమించింది. ఆ పరిణామంలో పురాణాలు, గేయాలు, దుఃఖాంత, సుఖాంత రూపకాలు ఎంతో గొప్పగా చోటుచేసుకొన్నాయి. హెలెనిక్ సంస్కృతి కొంచెంగా పతనమైనా, తత్స్థానంలో వచ్చిన హెలెనిస్టిక్ సంస్కృతి మరి కొంత కాలం గ్రీక్‌ల ఔన్నత్యానికి దర్పణం పట్టింది. ఆ కాలంలోనే గ్రీక్‌లు తమ శాస్త్ర సంప్రదాయాలను కూడా పెంపొందించుకొన్నారు. ఈ యావత్పరిణామంలోను గ్రీక్‌లు గ్రీక్‌లకే సాటి అనే రీతిలో ఒక సాంస్కృతిక వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకొన్నారు. తత్త్వ వివేచనంలో పరిణామం కూడా దీనికి దోహదం చేసింది. ఈ పరిణామ కాల ఫలితంగానే హోమర్, పిండార్, సాఫో వంటి రచయితలు, రచయిత్రులు, డోరిక్ వంటి వాస్తు శైలులు, ప్లేటో వంటి జ్ఞానులు, అరిస్టాటిల్, పైథాగొరస్ వంటి తత్త్వవేత్తలు, శాస్త్రవేత్తలు పెంపొందారు. గ్రీక్‌ల నగర రాజ్యాలు, సామ్రాజ్యాలు, వారి వారి నాయకులు, అందరూ కాలం స్మృతులలో కలిసిపోయినా, వారి హెలెనిక్, హెలెనిస్టిక్ సంస్కృతుల వ్యక్తిత్వం ఈ నాటికీ ఎంతో మహోదర్శానికి, మానవ విజయానికి ప్రతీక గా, గత కాలపు తోరణాలలో నుండి వర్తమానంలోకి ప్రతిధ్వనిస్తుంది.

## 22.2 కళలు

కళలలో ఏదేశంలో నైనా సాహిత్యం, సంగీతం, శిల్పం, చిత్రలేఖనమనేవి ఎంతో ముఖ్యమైనవిగా లలిత కళలని పేర్కొన్నారు. ప్రతి దేశంలోను, గ్రీస్ దేశంలో కూడా, ఈ రకమైన లలిత కళల అభివృద్ధికి ఎంతో కృషి జరిగింది. ఆ లలిత కళలు ఆ దేశపు సంస్కృతికి అద్దం పడతాయి. గ్రీస్ దేశంలో కూడా వ్యాప్తి చెందిన సాహిత్యం, సంగీతం, శిల్పం, చిత్రలేఖనం వంటి వాటిని గురించి తెలపడానికి ఎన్నో ఆధారాలు వున్నాయి. అలాగే వారు అన్ని ప్రాంతాలలో వలెనే తాము ఉపాసన చేసే దేవుళ్ళకు, దేవతలకు ప్రీతికరంగా అనేక దేవళాలను నిర్మించారు. ఆ దేవళాలన్నీ కొన్ని ప్రత్యేకమైన వాస్తు విధానాలతో అభివృద్ధి చెందాయి. డోరిక్ శైలి, అయోనియన్ శైలి, గ్రీస్ దేశపు వాస్తువులో ఒక పరిణతి పొందిన శైలీ విశేషానికి, పరిణామ స్ఫూరకతకు గుర్తు. వీటన్నిటి దృష్ట్యా, గ్రీస్ దేశంలో వుండే సాహిత్యం, సంగీతం, శిల్పం, చిత్రలేఖనం, వాస్తు కళ అనే వాని స్వరూప స్వభావాలను, పరిణామాన్ని ఈ క్రింది విధంగా గ్రహించొచ్చు.

### 22.2.1 సాహిత్యం

గ్రీక్‌లు తమ సాహిత్యాభివృద్ధి తొలి దశల్లో ఫియొనీషియన్ల వర్ణ సమామ్నాయాన్ని కొంత సంస్కరించి, తమదిగా చేసుకొన్నారు. ఆ సంస్కరణలో కొన్ని అక్షరాలను చేర్చడం, కొన్ని హల్లుల

BRAOU

సంకేతాలను తీసివేయడం జరిగింది. వీరు భాషలో సరళతను, స్పష్టతను, తర్కసహమైన నిర్మాణ పద్ధతులను పెంపొందించుకొన్నారు. వారి వాక్య నిర్మాణం ఎంతో కళాత్మకంగా రూపొందింది. ప్రోటాగొరస్ గ్రీక్‌ల వ్యాకరణ సంప్రదాయాన్ని ఏర్పరిచాడు కూడా. ఏ భాషలోనైనా వ్యాకరణం ఏర్పడే దశ, అనంతర దశ తప్పక అవుతుంది. దానికి ముందే, వివిధ సాహిత్య రీతులు, సాహిత్య పరిణామాలు ఏర్పడి ఉంటాయి. అట్లాగే, గ్రీక్ సాహిత్యం కూడా ఒక భావ ప్రక్రియాస్ఫోరకత్వ సంప్రదాయంలో గుణం, అలంకారం, శైలి, ధ్వని ప్రధానంగా రూపొందాయి. ఇది ఐతిహాసిక సాహిత్యం, గేయ కవిత్వం, రూపక సాహిత్యం, చరిత్ర, శాస్త్ర సాహిత్యం అనే వివిధ అంశాలు కల దానిగా రూపొందింది.

### 22.2.1.1 ఐతిహాసిక సాహిత్యం

గ్రీక్‌లకు ప్రీతిపాత్రులైన వివిధ వీరుల అద్భుత కృత్యాలను, సాహసాలను జాతి ఏకత్వ స్ఫోరకతను ఉద్దీపింప చేయడానికి పాటలుగాను, ఛందోబద్ధమైన రూపాలగాను పరిణమింపజేయడంలో, గ్రీక్‌ల ఐతిహాసిక సాహిత్యం ఎంతో వ్యాప్తిలోకి వచ్చి, అది జనశృతిలోను, సంస్కృతి సంప్రదాయంలోను, ఒక అవిభాజ్యనీయమైన భాగంగా కలిసిపోయింది. ఇతిహాసాలకు హోమర్ ఆద్యుడు. హోమర్ అనే వ్యక్తి నిజంగా ఉన్నాడో లేడో, ఇలియడ్, ఒడిస్సీ కావ్యాలను హోమర్ ఒక్కడే రాసినాడా, లేదా అనేకులు రాసినవా అనేది ఒక సందేహంగా ఉన్నా, అవి ఇతిహాస సాహిత్యానికి మహత్తరమైన ఉదాహరణలు. హోమర్ వ్రాతలన్నీ పాడుకోదగినవి, వర్ణించదగినవి. ఆ ఇతిహాసాల్లో ఎంతో సౌందర్యం నిబిడీకృతమై వుంది. ఇలియడ్ కావ్యంలో ట్రాయ్ కోట ముట్టడికి చెందిన కొన్ని చివరి సన్నివేశాలు, మరికొన్ని గ్రీక్‌ల పౌరాణిక విషయాలు వర్ణితమైనాయి. అఖిలిస్ అనే ధీరుడు, ట్రాజన్ రాజకుమారుడైన హెక్టర్‌ను చంపివేయడం ఇందులోని ఇతివృత్తం. కాగా, ఒడిస్సీ కావ్యం ట్రోజన్ యుద్ధం తర్వాతి కథకు నాంది. యులిజెస్ భార్య అయిన పెనెలోప్ (Penelope) తన భర్త అయిన యులిసెస్ కోసం చూడటం, ఆమె అనేక మంది విటుల ప్రలోభాలకు లొంగకపోవడం, చిట్ట చివర ఆమె భర్త మధ్యధరా సముద్రంలో అనేక బృహత్తర, మహత్తర కార్యాలు చేసి తిరిగి రావడం, ఒడిస్సీలోని ప్రధాన ఇతివృత్తం. ఒడిస్సీకి ఇలియడ్‌కు దగ్గరి పోలికలున్నాయి.

హోమర్‌కు సాటి అయిన వేరొక రచయిత హెసియాడ్. ఇతడు తనకు జీయస్ కుమార్తెలు తాను కొండచరియల మీద గొర్రెలను మేపుతుండగా జ్ఞానాన్ని అందించారని చెప్పుకొన్నాడు. ఇతని రచనలలో వస్తువు సరళమైనది, కాల్పనికత తక్కువ. ఇతని కాలంలో గల వివిధ పౌరాణిక అతి ప్రాకృత విషయాలు ఇతని రచనలలో కనిపిస్తాయి. ఇతడు 'వర్క్స్ అండ్ డేస్' (Works and Days), 'డిసెంట్ ఆఫ్ ది గాడ్స్' (Descent of the Gods) అనే రెండు గ్రంథాలను రచించాడు. తొలి గ్రంథంలో కర్షకులకు తిథి, వార, నక్షత్ర, ఋతు విషయాలను చూసి శ్రమపడాలని, వ్యావసాయిక రంగంలో ఏ ప్రశస్తమైన రోజుల్లో ఏ ఏ పనులు చేయాలో చెప్పాడు. అతడు వైవాహిక జీవితం, రాజుల దుష్ప్రవర్తన వంటి వాటిని నిశితంగా చర్చించి, విమర్శించాడు. రెండో గ్రంథంలో మానవ దేవతామూర్తుల సంబంధాలను వివరించాడు. ఇతని రచనలు హోమర్ గ్రంథాల కన్నా చారిత్రక ప్రామాణ్యం కలవి. ఒక విధంగా హెసియాడ్‌ను సంధియుగ రచయితగా గుర్తించొచ్చు.

### 22.2.1.2 గేయ సాహిత్యం

ఇవి లైర్, పిల్లనగ్రోవి వంటి వాద్యాల మీద పాడటానికి అనువైన రచనలు. అందువల్లనే వీనిని 'లిరిక్స్' ( లైర్ మీద పాడే పాటలు) అని సామాన్యీకరించడం జరిగింది. వీనిలో కథలు, అద్భుత కృత్యాలు కాక, మానవులకు చెందిన వివిధ మనోభావాల చిత్రీకరణ, వస్తుగత భావం కన్న ఆత్మగతా భావం ఎక్కువ చోటు చేసుకొన్నాయి. ఈ భావాలలో ప్రేమ, విరహం, విషాదం, సానుభూతి, విశ్వవ్యాప్తమైన గుణాలు ప్రధానమైనవి. ఈ తరహా రచయితలలో మొదటి వాడు క్రీ.పూ. 7వ శతాబ్దికి చెందిన ఆర్కిలోకస్. ఇతడు వ్యంగ్య కవిత్వంలో ఎంతో మెప్పుదల పొందినవాడు. ఇతని తర్వాత తరంలో సాఫో గొప్ప రచయిత్రి. ఈమెకు హోమర్‌కున్న గౌరవం, పేరు వుంది. ఈమెకు పదోకావ్య దేవత అనే బిరుదు ఉండేది. ఇంచుమించుగా అదే కాలంలో, క్రీ.పూ. 560 - 455లలో అనాక్రియన్ అనే వేరొక భావ కవి వుండేవాడు. ఇతడు ఆడంబరాన్ని, అధికారాన్ని, సంపదను ద్వేషించకుండా, శాంతిని, సౌఖ్యాన్ని అన్వేషిస్తూ, వివిధోద్వేగ భావాలను చిత్రించాడు. ఇతడు యుద్ధాన్ని ఏవగించుకొన్నాడు. తర్వాత శతాబ్దంలో పిండార్ గొప్ప కవి. ఇతడు సంగీత దేవతకు ప్రీతికరమైనవాడని పేరుపొందాడు. ఇతనేకాక బెకిలిడ్స్ (Bachylids) ఇంకొక గొప్ప కవి. హెలెనిక్ యుగం లోని గేయ కవిత్వం కన్న హెలెనిస్టిక్ యుగంలో కవిత్వంలో ప్రమాణాలు తక్కువ. దానికి కారణం, హెలెనిక్ యుగంలో కవితలు పాడదగినవి, వల్లించదగినవి. హెలెనిస్టిక్ యుగంలో కవితలు ఎక్కువగా చదవదగినవి. ఆ కాలంలో థియోక్రటస్ (Throcritus) రచనలు పేరొందాయి.

### 22.2.1.3 రూపక సాహిత్యం

డయొనీసస్ ఉత్సవాలలో పురాణ గాథలను బృందగానం చేసేవారు. ఆ గాథలలోని కొన్ని అంకాలను పూర్తిగా నటించేవారు; కొందరు సెటీల్‌లు అనబడేవారు అనుకరిస్తూ, వ్యంగ్యంగా నటించే వాళ్ళు. ఈ పరిస్థితులలోనే గ్రీక్ భాషలో రూపకం పరిణమించింది. ఈ రకమైన రూపకాలను ఇప్పటికీ పరిపూర్ణతకు ప్రమాణాలుగానే పరిగణించడం జరుగుతున్నది. వాళ్ళ నాటకాలలో మతం, ప్రజా జీవితం ఎంతో ప్రధాన పాత్ర వహించేవి. అందువల్ల, వాటికి జనాదరణ కూడా హెచ్చుగా ఉండేది. నృత్యానికి కూడా ఈ రకమైన రూపకాలలో సముచితమైన స్థానం వుండేది. స్త్రీ పాత్రలను పురుషులే పోషించేవారు. రంగ స్థలాలను అండాకార శైలిలో నిర్మించేవారు. వాటిని ఆరు బయట, వృత్తాకారంగా కాక, అర్ధ వలయాకారంలో నిర్మించేవారు. అప్పటి ప్రధాన రచయితలలో ఎస్కిలస్, సోఫోక్లిస్ , అరిస్టోఫేన్స్ , మినాండర్ మొదలైన వారు ప్రసిద్ధ రూపక కర్తలు.

ఎస్కిలస్ (Aeschylus) క్రీ.పూ. 525 - 456లలో జీవించాడు. ఇతడు గొప్ప విషాదాంత నాటకాలను రాశాడు. మతపరమైన , పౌరాణికపరమైన అంశాలు ప్రధాన వస్తువుగా ఉండేవి. ప్రామెథియస్ బౌండ్ (Promethius Bound), ఆగమెమ్నాన్ (Agamemnon) వంటి ప్రసిద్ధ రూపకాలను రాశాడు. ఇతని కాలంలో తొలిసారిగా రెండో ప్రధాన నాయకుని ప్రవేశపెట్టడం జరిగింది. ఇతడు తొలి విషాదాంత నాటక కర్త.

సోఫోకిల్ (Sophocles) క్రీ.పూ. 496 - 406 లలో జీవించాడు. ఇతడు వందకు పైగా నాటకాలను

రాసినా, వాటిలో కేవలం ఏడే మిగిలి వున్నాయి. వాటిలో ఆంటిగోన్ (Antigone), ఎలెక్ట్రా (Electra), ప్రసిద్ధ నాటకాలు. ఇతని కాలంలో మూడో ప్రధాన పాత్రధారిని కూడా ప్రవేశపెట్టడం జరిగింది. ఇతని కాలంలో గ్రీక్ రంగస్థలం ఉచ్ఛ స్థితిని పొందింది.

యురిపిడిస్ (Euripides) విషాదాంత నాటక కర్తలలో మూడవ వాడు. ఇతడు క్రీ.పూ. 480 - 406 లలో జీవించాడు. ఇతడు మానవ జీవితాల ప్రాధాన్యాన్ని, యుద్ధం చెప్పే బాధలను ఎక్కువగా వర్ణించాడు. ఇతడు మానవుల కోర్కెలను, ఉద్వేగాలను, వారి బాధలను విస్తృతంగా వివరించాడు. ది ట్రోజన్ విమెన్ అనేది యురిపిడిస్ రూపకాలలో అత్యుత్తమమైనది. ఇతడు రూపక రంగంలో కాల్పనికతను ప్రవేశ పెట్టాడు.

విషాదాంతకాలే కాక, గ్రీక్ సాహిత్యంలో హాస్యరసస్ఫోరకాలైన ప్రహసనాల వంటి రచనలు కూడా ఉన్నాయి. అరిస్టోఫేన్స్ (Aristophanes) ఆ రకమైన సాహిత్యాన్ని సృష్టించడంలో ఎంతో పేరుపొందాడు. అరిస్టోఫేన్స్ క్రీ.పూ. 445 - 385 ల మధ్య జీవించాడు. ఇతని రచనలలో ప్రధాన వస్తువు రాజకీయ విమర్శ. ఇతని తర్వాత పేరొందిన వాడు మినాండర్. మినాండర్ క్రీ.పూ. 342 - 291 ల మధ్య జీవించాడు. ఇతని కథావస్తువు జానపదులు, ప్రేక్షకులు జానపదులు. జానపదుల ప్రేమ, కుటుంబ సమస్యలు, దైనందిన జీవితం వంటి వానిని మినాండర్ రాశాడు. అతడు సభ్యత మాటున నగరంతో పరిచయం ఉంచుకొన్నప్పటికీ, అతని మాటలలో జీవితాన్ని ప్రతిబింబింపచేసి దానిని వ్రాత మూలకంగా తెలిపాడు.

### 22.2.1.4 చరిత్ర

గ్రీకుల సాహిత్యంలో చరిత్ర కూడా ఎంతో ప్రాధాన్యం వహించింది. చరిత్రకు తొలిసారిగా హెరోడోటస్ (Herodotus) శ్రీకారం చుట్టాడు. అతడు క్రీ.పూ. 484 ప్రాంతానికి చెందినవాడు. అతడు గ్రీస్‌లో సాధించిన ఘన విజయాలను గ్రంథస్థం చేద్దామనుకొనే ఒక ప్రయత్నంలో చరిత్రను రాశాడు. తాను చూచినది, విన్నది, తాను వేర్వేరు ప్రాంతాలలో పర్యటించి, ప్రత్యక్ష జ్ఞానంతో రాశాడు. ఇతనిని చరిత్ర శాస్త్రానికి తండ్రి వంటి వాడని గౌరవించడం జరిగింది. థూసిడైడ్స్ (Thucydides) ఇంకొక చరిత్రకారుడు. ఇతడు క్రీ.పూ. 460 - 400 ల మధ్య జీవించాడు. ఇతడు పెలోపొనీషియన్ యుద్ధాలను ప్రధాన ఇతివృత్తంగా, ఆత్మాశ్రయ భావనతో రాశాడు. గ్జెనాఫోన్ (Xenophon) అనే ఇంకొక చరిత్రకారుడు పారశీక - గ్రీక్ యుద్ధాల చరిత్రను రాశాడు. ఇతడు క్రీ.పూ. 434 - 355 ల మధ్య జీవించాడు. ఇతని గ్రంథం పేరు ' అనబాసిస్ '. పోలిబియస్ (Polybius) అనే ఇంకొక చరిత్రకారుడు రోమన్ రాజ్య స్థాపన గురించి రాశాడు. ఇతడు క్రీ.పూ. 205కు చెందిన వాడు. వీరిందరిలో హెరోడోటస్, థూసిడైడ్స్‌లలో చరిత్ర రచనలో సాహిత్య గుణం వుంది.

### 22.2.1.5 శాస్త్ర సాహిత్యం

గ్రీక్‌లలో పెలోపొనీషియన్ యుద్ధాల తర్వాత జాతీయ భావం మొదలవడం, సాంప్రదాయిక మత వ్యవస్థపై నమ్మకం తగ్గడం వల్ల ,హేతువాదం అంకురించింది. దాని వల్ల, డెమోక్రిటస్ , పైథాగరస్ వంటి వారు వివిధ దృక్పథాలతో ప్రకృతిని పరిశీలించడంతో, శాస్త్ర సాహిత్యాభివృద్ధి అనివార్యమైంది. అరిస్టాటిల్

BRAOU

రచనలు కూడా, బాహుళ్యానికి ప్రాముఖ్యతనివ్వడంలో గ్రీస్ దేశపు విజ్ఞానశాస్త్రం కొత్త పుంతలు తొక్కింది. అరిస్టాటిల్ రాసిన మత్స్యశాస్త్రం థియొఫ్రాస్టస్ (Theophrastus) రాసిన వృక్షశాస్త్రం, డైయాస్కోరైడ్స్ (Dioscorides) నిర్వహించిన వృక్ష వర్గీకరణ శాస్త్రం (Taxonomoy) ; అరిస్టార్కస్ (Aristarchus) ప్రతిపాదించిన సౌరకేంద్ర సిద్ధాంతం (Heliocentric theory) ; ఎరాటోస్థెనెజ్ (Eratosthenes) రాసిన భూగోళ శాస్త్రం ఎంతో ప్రధానమైనవి. గణితం, జంతుశాస్త్రం, శరీర ధర్మశాస్త్రం, వైద్యం ప్రధాన శాస్త్రాలుగా రూపొందాయి.

## 22.2.5.1 గణితం

తొలి గణిత శాస్త్రజ్ఞుడు మిలేటస్‌కు చెందిన థేల్స్ . ఇతడు బిందువు, రేఖ, వృత్త సమద్వి ఖండన, రెండు సరళరేఖల ఖండన వద్ద ఏర్పడ్డ కోణ సమానత్వాన్ని, ఒక భుజం రెండు కోణాలు సమానంగా ఉన్న త్రిభుజాల సమానత్వాన్ని విశదీకరించాడు. పైథాగరస్ ( 570 - 500) సంఖ్యలను తాత్త్విక విషయాల పునాదులుగా చూపడం, భూమి గుండ్రంగా ఉందని నిరూపించడం, లంబకోణ త్రిభుజంలో కర్ణం మీది చతురస్రం మిగతా రెండు భుజాల మీద చతురస్రాల మొత్తానికి సమానమని చెప్పడం, చేశాడు. యూక్లిడ్ (Luclid) అనే గణిత శాస్త్రజ్ఞుడు రేఖా గణితాన్ని రాశాడు. ఇతడు క్రీ.పూ. 300 ప్రాంతం వాడు. ఆర్కిమెడీస్ (Archimedis) ద్రవ, ఘన పదార్థాలలో భారత్‌కు సంబంధించి సూత్రీకరించాడు. ట్యూబ్యులర్ స్క్రూ (Tubular screw) ను కనుగొన్నాడు. ఆర్కిమెడిస్ 287 - 212లలో జీవించాడు. హిపార్కస్ (Hipparchus) అనే శాస్త్రజ్ఞుడు త్రికోణమితి (Trigonometry) అనే శాఖకు విస్తృతంగా దోహదపడ్డాడు. ఇతడు సమతలానికి చెంది, గోళాలకు చెందిన త్రికోణమితికి సూత్రాలు రాశాడు.

## 22.2.1.5.2 జంతు శాస్త్రం - శరీర ధర్మ శాస్త్రం

ఈ రకమైన శాస్త్రానికి తొలుత అనాగ్జిమాండర్ శ్రీకారం చుట్టాడు. అతడు ప్రాణులు తొలుత నీటిలో నివసించి, తర్వాత భూమి పైకి వచ్చాయని అభిప్రాయపడ్డాడు. ఎన్‌పెడొకిల్స్ (Enpedocles) జీవ పరిణామానికి నాంది చేశాడు. డయోజినెస్ (Diosenes) అనే అపోలోనియాకు చెందిన శాస్త్రజ్ఞుడు, శరీర నిర్మాణ శాస్త్ర గ్రంథాన్ని రాశాడు. ఇతడు క్రీ.పూ. 500 - 430లలో జీవించాడు. ఇతడు సృష్టి మట్టిలో జరుగుతుందని, సూర్యకిరణాల వేడి దానికి కారణమని భావించాడు. డెమోక్రిటిస్ జంతువులను వర్గీకరించాడు. దానికి ప్రధాన ప్రమాణం రక్త గుణం.

## 22.2.1.5.3 వైద్యం

ఈ రంగంలో నీడస్ శాఖ వారు, క్రోటన్ శాఖ వారు ఎంతో కృషి చేశారు. కోస్ వైద్య సంస్థకు చెందిన హిపోక్రటిస్ (Hippocrates) గొప్ప వైద్యుడు. ఇతనిని వైద్య శాస్త్రానికి తండ్రి అని భావిస్తారు. ఇతడు క్రీ.పూ. 460 - 377 ల మధ్య జీవించాడు. ఈతడు ప్రకృతి కారణాల వల్ల రోగాలు కలుగుతాయని నమ్మాడు. హిరోఫిలస్ అనే వైద్యుడు శరీర నిర్మాణ శాస్త్రానికి తండ్రి వంటి వాడు. ఇతడు శరీరాన్ని కోసి, పరిశీలన చేశాడు. ఎరాసిస్ట్రాటస్ (Erasistratus) ఇంకొక ప్రసిద్ధ వైద్యుడు . ఇతడు శరీర ధర్మ శాస్త్రాన్ని పెంచాడు.

BRAOU

ఈ విధంగా గ్రీస్ దేశంలో సాహిత్యం అలంకారం నుండి జ్ఞానం దాకా, ఆనందం నుండి ప్రయోజనం దాకా, సంప్రదాయం నుండి హేతుబద్ధత దాక, వివిధ దశలలో మార్పు చెందింది.

## 22.2.2 సంగీతం

గ్రీక్‌ల లలిత కళలలో సాహిత్యం ఎంతో వ్యాప్తి పొందినట్లే, సంగీతం కూడా అనివార్యంగా వ్యాప్తి చెందింది. హోమర్ కాలం నుండే సాహిత్యానికి వలెనే సంగీతం వ్యాప్తి చెందింది. హోమర్ స్వయంగా పాటలను హెక్స్‌మీటర్ అనే ఛందస్సులో రాసి, పాడేవాడు. క్రీ.పూ. 670లో టెర్‌పాండర్ హోమర్ కావ్యాన్ని సితారుకు అనుగుణంగా పాడాడు. క్రీ.పూ. 4వ శతాబ్దం నుండి ఉత్తర కాల కవాతు పాటలు, వివాహ, మృతి క్రియలకు సంబంధించిన పాటలు వెలుగులోకి వచ్చాయి. ఆవేశాన్ని ఉద్దీపింప చేయడానికి ఫ్లూట్‌ను వాడేవారు. సితారా తీగలను నాలుగు ఆరు నుండి ఏడువరకు పెంచడం జరిగింది. ఆలోస్ (Alous) వంటి సంగీత వాద్యాలను ఉపయోగించేవారు. పైథాగరస్ ( 570 - 500 ) సంగీతానికి శాస్త్రాన్ని ఏర్పరిచాడు. క్రీ.పూ. 483లోసోలోఆరియా (Soloaria) అనే సంగీతాన్ని రంగస్థలం మీద ప్రదర్శించాడు. ఈ సంగీతంలో డోరియన్ శైలి గంభీరమైనది, ఉత్కృష్టమైనది; ఫ్రిజియన్ శైలి ఉత్సాహకరమైనది, పవిత్రమైనది ; లిడియన్‌శైలి బలహీనపరిచేది ; వినాశనకరమైనది. హెలెనిస్టిక్ కాలంలో సంగీతం వ్యాపార సంబంధమైనదిగా మారింది.

## 22.2.3 శిల్పకళ

గ్రీక్‌ల శిల్పాలు మానవుని విసర్గ లక్షణాలలో నమ్మకం, అతని ఆకృతిలోని సౌందర్యం, అతని స్వభావంలోని మర్మాన్ని కలిగి ఉండేవి. అతి ప్రాచీనమైన పురుషుని నగ్న శిల్పం క్రీ.పూ. 600 ప్రాంతాలలో చెక్కబడింది. కాగా, ప్రాచీనమైన స్త్రీ నగ్న శిల్పం క్రీ.పూ. 375 ప్రాంతాలకు చెందినది. గ్రీక్ నగర రాజ్యాలలో శిల్పులకు ఎంతో గౌరవం వుండేది. శిల్పకళను అలంకరణకు, నగరాలను సౌందర్యవంతం చేయడానికి హెచ్చుగా ఉపయోగించేవారు. శిల్పాన్ని ప్రకృతిలో భాగంగా ఆదర్శవంతమైన పద్ధతిలో చూపించడం జరిగింది.

ప్రాచీన గ్రీక్ శిల్పంలో మానవాకృతులు ముందు రోజుల్లో గజిబిజిగా ఉండేవి. అవయాలలో సజీవమైన సౌష్ఠవం ఉండేది కాదు. ముఖాలు కూడా ఎంతో కృత్రిమంగా , ఏరకమైన మార్పులేని నవ్వుతో వుండేవి. దుస్తులు ధరించిన స్త్రీ చేయి చాపి నివేదనను అందిస్తున్నట్లు ప్రత్యేకంగా చెక్కే శిల్పం విశేషమైంది. తొలి యత్నాలలో రంగులున్న మెత్తని రాళ్ళను, రంధ్రాలతో ఉన్న వాటిని శిల్పాలు చెక్కడానికి ఉపయోగించేవారు. రాను రాను పాత రాతిని ఉపయోగించడం జరిగింది. తొలి రోజులలో విగ్రహాలకు రంగు పూసేవారు. ఆ రంగు పూయడం నునుపు చేయడానికే. కాని, ఆ విషయంలో పనితనం పెరిగాక, రాళ్ళకు రంగు వేసే పద్ధతిని విడిచిపెట్టారు. కంచు శిల్పాలను కూడా పెంపొందించారు. డెల్ఫిలోని రథికుని శిల్పం ఎంతో ఉత్తమమైనది. ఫిడియాస్ అనే శిల్పి ఎంతో ప్రసిద్ధుడు. ఇతడు క్రీ.పూ. 500 - 435ల మధ్య ఏథెన్స్‌లో జీవించాడు. పార్థనాన్ దేవాలయంలో శిల్పాలను ఇతడు చెక్కాడు. ఈ శిల్పాలు పరిమాణంలో ఎక్కువగా వున్నా, సజాతీయత, అధిక వైవిధ్యం, ప్రశాంతమైన శోభను కలిగి వున్నాయి. థీసియస్ (Thesius) ప్రతిమ / శిల్పం ఎంతో పేరుపొందిన నగ్న పురుష శిల్పం. ఈ కాలానికే చెందిన

మైరాన్ (Myran) కూడా ఇంకొక గొప్ప శిల్పి. ఇతడు ఎలుథ్రియా (Eleuthtrae) నివాసి. ఇతని శిల్పాలలో ఫిడియాస్ శిల్పాలలో ఉండే ఆదర్శ భావం ఉండదు. పోలిక్లిటస్ (Polycletus) ఇంకొక గొప్ప శిల్పి. ఇతడు క్రీ.పూ. 480 - 420 ల మధ్య జీవించాడు. ఇతడు కంచు విగ్రహాలను చేయడంలో దిట్ట.

ఇతడు మానవ శరీరాన్ని పరిపూర్ణంగా చూపించాలని ఆశిస్తూ, కదలికలలో వున్న మానవ శిల్పాలను చెక్కాడు. సోక్రటీస్ ప్రశంసకు పాత్రుడైన ఇతడు ఎందరో సౌందర్యవంతుల శరీర మానాలను తీసుకొని, శాస్త్రీయంగా సౌందర్య సూత్రాలు రూపొందించడానికి యత్నించాడు. ఈ దశలో శిల్పాలన్నీ అవ్యక్తానుగతమైన హుందాతనాన్ని, ప్రశాంతతను కలిగి వుండేవి.

కాని, క్రీ.పూ. 4వ శతాబ్దం నుండి శిల్పంలో మార్పు వచ్చింది. వ్యక్తిగత స్వభావం, భావ ప్రకటన, చర్యలు, కదలికలు, అనుభూతులను చూపించడం జరిగింది. క్రీ.పూ. 395 - 350 ల మధ్య గల స్కోపోస్ ఒక గొప్ప శిల్పి. ఇంకొక గొప్ప శిల్పి ప్రాక్సిటెలిస్ (Fraxiteles). ఇతని శిల్పాలలో శరీర దార్ఢ్యం తెలివి తేటలు, సౌందర్యం తొంగి చూస్తుండేవి. ఇతను ఎక్కువగా యువకుల శిల్పాలు చెక్కేవాడు. ఇతడు చెక్కిన హెర్మిజ్ (Hermes) దేవతా ప్రతిమ ఎంతో గొప్పది.

హెలెనిస్టిక్ యుగంలో శిల్పులు నిత్య జీవితంలోని స్వాభావికమైన ఆవేదన, ఘర్షణ వంటి భావాలను శిల్పాలలో చూపారు. బిడ్డలు, తాగుబోతులు, మరణిస్తున్న యోధులు, బాధ పడుతున్న దేవతల వంటి ఇతివృత్తాలను ఈ కాలపు శిల్పులు ఎన్నుకొన్నారు. డైయింగ్ గాల్ (Dying Gaul) అనేది ఈ తరానికి చెందిన ఒక గొప్ప శిల్పం. అలాగే టాక్సన్ అనే ఇంకొక శిల్పంలో మరణ సమయంలోని తీవ్ర వేదనను సృష్టించడం జరిగింది. హెలెనిస్టిక్ యుగంలోని శిల్పులు అమితావేశపూరితమైన భావ వ్యక్తీకరణకు అధిక ప్రాధాన్యమిచ్చారు. ఈ రకంగా గ్రీక్ శిల్పం సజీవమైన సౌష్ఠవం ద్వారా హుందాతనం, ప్రశాంతతల నుండి వైవిధ్యాన్ని వ్యక్తీకరిస్తూ, వ్యక్తిగత భావన, మహోద్వేగాన్ని చూపే మాధ్యమంగా పరిణమించింది.

BRAOU

### 22.2.4 చిత్రలేఖనం

గ్రీస్ దేశంలో చిత్రలేఖనం కూడా ఎంతో అభివృద్ధి చెందింది. వస్తువుల ఏర్పాటు, అలంకరణలో పరిమితమైన భావన, గ్రీక్ చిత్రలేఖనంలో సామాన్యాంశాలు. ఎక్కువ చిత్రాలను జాడీల మీద, గోడల మీద, చెక్కలమీద రాయడం జరిగింది. డ్యురిస్ (Duris) తొలి దశలోని చిత్రకారుడు. క్రీ.పూ. 5వ శతాబ్దంలో థ్రేస్ నివాసి అయిన పోలినోటస్ (Polynotus) గొప్ప చిత్రకారుడు. ఇతడు ఎన్నో బొమ్మలను చిత్రించాడు. ప్రతి బొమ్మ విషయంలోను ఎంతో శ్రద్ధ తీసుకొన్నాడు. గాలికి రెప రెపలాడే పారదర్శకమైన పరదాలు (Transparent wind - blown drapery) అనే చిత్రం ఎంతో గొప్పదిగా చెప్పడం జరిగింది. క్రీ.పూ. 4వ శతాబ్దాంలో అపోలో డోరస్ (Apolodorus), మరొక గొప్ప పూజారి పూజలో వున్నప్పటి చిత్రాన్ని గీశాడు. ఇతడు చెక్కల మీద చిత్రాలు చెక్కడాన్ని ప్రవేశపెట్టాడు. హెలెనిస్టిక్ యుగంలో అలంకరణలు బాగా పెరిగాయి. ఎపెలెస్ (Apelles) ఆ తరం గొప్ప చిత్రకారుడు. ఇతడు అలెగ్జాండర్ ఆస్థానంలో కూడా పనిచేశాడు. ఇతని తరం నుండి రేఖలు గీయడం, భావాన్ని నిర్దిష్టంగా చూపడం, రంగులను, నీడలను, దూరగతానుచిత్రణాన్ని అప్రధానంగా భావించడం పెరిగింది.

## 22.3 వాస్తుకళ

గ్రీస్ దేశంలో వాస్తుకళ అతి ప్రాచీనమైన ఆర్కేయిక్‌శైలి నుండి డోరిక్, అయోనియన్, కారింథియన్ అనే మూడు శైలులలో అభివృద్ధిచెంది, పరిణమించడం ప్రారంభమై హెలెనిస్టిక్ కాలం నాటికి సమ్మిశ్రిత కళా విధానంగా రూపొందింది. గ్రీక్‌ల నిర్మాణాలలో ఇళ్ళు, ఆటస్థలాలు, పాఠశాలలు, రంగ స్థలాల వంటి వివిధ లౌకిక నిర్మాణాలు ఉండగా, దేవాలయాలు కూడా విరివిగా నిర్మితమయ్యాయి. దేవాలయాలు సాధారణ ప్రజాదరణను కూడా పొందాయి. ఈజిప్షియన్, బాబిలోనియన్‌ల ఆలయాలవలె, గ్రీక్‌ల దేవాలయాలు దేవతల నిలయాలు కావు. దేవతలు మానవరూపంలో ఉంటారని, వాళ్ళకొక నివాస స్థలం అవసరమని, మరో ప్రపంచంలో ఆ రకమైన దేవతల నివాస స్థలాలు ఏర్పరచబడి ఉంటాయని గ్రీక్‌ల విశ్వాసం. ఆ దృష్టితోనే దేవాలయాలను గ్రీక్‌లు నిర్మించారు.

గ్రీక్‌ల ఆలయ నిర్మాణంలో వివిధ పరిణామ దశలున్నాయి. చెక్క, ఎండ బెట్టిన , కాల్చిన ఇటుకలు, రాళ్ళు వివిధ దశలలో ప్రధాన నిర్మాణ వస్తువులయ్యాయి. అతి ప్రాచీన దేవాలయాలను కారింథ్‌లు క్రీ.పూ. 581లోను, డెల్ఫిలోను కూడా నిర్మించారు.

### 22.3.1 డోరిక్ శైలి

ఇది ఎంతో ప్రాచీనమైన శైలి. దీనిపై ఈజిప్ట్ ప్రభావం ఉంది. కారింథ్, డెల్ఫిలో గల ఆలయాలు డోరిక్ శైలికి చెందినవి. ఈ శైలిలోనే క్రీ.పూ. 447 - 438ల మధ్య పార్థినాన్ (Parthenon) దేవళం నిర్మితమైంది. ఈ శైలిలో స్తంభాలు నిరలంకృతాలు. స్తంభ శీర్షం దీర్ఘచతురస్రాకారంలో ఉండి, దాని కింద ఏటవాలు అంచు ఉండే శీర్ష పీఠం ఉంటుంది. దాని దిగువన శీర్షాన్ని, స్తంభం మధ్యాన్ని వేరు చేసే రేఖాలంకరణ ఉంటుంది. దీనిని అములెట్ (Amulet) అంటారు. దాని దిగువన గల స్తంభం మధ్య భాగం, ఆద్యంతాలు సన్నని చారల వంటి పొడుగైన అలంకరణ కలిగి వుంటుంది. ఈ శైలిలో నిర్మితమైన ఏథెన్స్‌లోని పార్థినాన్ దేవాలయంలో గల స్థంభాలు 4 1 / 2 అడుగుల వ్యాసాన్ని కలిగి వుండి, 16 లోతయిన చారల వంటి అలంకరణను కలిగి వుంటాయి. దానిపైన గల శీర్ష పీఠం 12 అంగుళాల మందాన్ని కలిగి వుంటుంది. దాన్ని ఓవలో (Ovalo) అని, పెర్సి బ్రౌన్ పేర్కొన్నాడు. పార్థినాన్ దేవాలయం అధిష్ఠానం 229 అడుగుల పొడవు, నూరడుగుల వెడల్పు ఉంది. స్తంభాల ఎత్తు 39 అడుగులు వుంటుంది. అటువంటి స్తంభాలు 46 ఉన్నాయి. పట్టబంధాలలో ఫిడియాన్ అనే శిల్పి చెక్కిన శిల్పాలను చూడొచ్చు. ట్రాయ్ ముట్టడి, జీయస్ కనుబొమ నుండి ఎథీనా పుట్టుక, ఎథీనా, పోసీడాన్ ల మధ్య కలహం వంటివి చిత్రించబడ్డాయి. అధిష్ఠాన దేవత ఎథీనో శిల్పం 42 అడుగుల ఎత్తుతో వుంది.

### 22.3.2 అయోనిక్ శైలి

ఈ శైలిపై బాబిలోనియా నాగరికత ప్రభావం వుంది. ఈ శైలిలో స్తంభాలు ప్రత్యేకమైనవి. డోరిక్ శైలికన్నా విరుద్ధంగా అయోనిక్ శైలిలో స్తంభ పీఠం సాలంకృతమైంది. ఇది కింద నుండి పైకి తగ్గుతున్న వ్యాసం గల మూడు వృత్తాలతో ఏర్పడి, దానిపై భాగంలో నాలుగో వృత్తం వుంటుంది. నాలుగోది, మూడవ దాని కన్నా ఎక్కువ వ్యాసాన్ని కలిగి వుంటుంది. ఈ వృత్త భాగం అంతా 'టోరస్ ' అనే గొలుసుల

నమూనాతో కూడి ఉంటుంది. స్తంభ శీర్షం కూడా సాలంకృతంగా వుంటుంది. శీర్ష పీఠం వెలుపల నుండి లోపలికి చుట్ట చుట్టుకున్న నమూనా కలిగి వుంటుంది. అయోనిక్ స్థంభాలపై భాగంలో ఎక్కువగా ఉబ్బెత్తు శిల్పం కనిపిస్తుంది. ఏథెన్స్ వద్ద నిర్మితమైన ఎరెక్తియం (Erectheuem) భవనం ఈ శైలికి మంచి ఉదాహరణ . దీనిలో దక్షిణం వైపు గల పోర్చ్ ఆఫ్ ది మెయిడెన్స్ అనే చావడిలో సుందరీమణుల శిల్పాలను స్తంభాలుగా చెక్కారు.

### 22.3.3 కారింథియన్ శైలి

ఈ శైలిలో స్తంభం ఎంతగానో సాలంకృతమైంది. స్తంభ శీర్షానికి, స్తంభ మధ్యానికి మధ్య, సుమదళాలంకరణ గొప్పగా కనిపిస్తుంది. ఈ అలంకరణలో అయోనిక్‌శైలిలో వున్న లోపలికి చుట్ట చుట్టు కొన్న నమూనా ప్రస్ఫుటంగా కాక, కేవలం నేపథ్యంగా మార్చడం జరిగింది. ఈ శైలిలో క్రీ.పూ. 330 లో నిర్మించిన ఏథెన్స్‌కు చెందిన లిసిక్రటిస్ విగ్రహం గొప్ప ఉదాహరణ.

హెలెనిస్టిక్ యుగంలో ఎక్కువగా లౌకిక నిర్మాణాల మీద మక్కువ చూపారు. రాజ ప్రాసాదాలు, మండపాలు, గ్రామీణ వసతి గృహాలు, గ్రంథాలయాలు, వస్తు ప్రదర్శన శాలలు, క్రీడా మందిరాల వంటి వివిధ నిర్మాణ విశేషాలు అభివృద్ధి చెందాయి. పర్గామమ్, ప్రియన్, అలెగ్జాండ్రియా వంటి నగరాలు, ఆకాలపు నిర్మాణాలకు సూచికలు.

ఈ రకంగా వాస్తు కళ ఒక పరిపూర్ణతను, సమగ్రతను నాలుగు దశలుగా పొందినా, హెలెనిస్టిక్ యుగం నాటికి, ఇది కేవలం లౌకిక నిర్మాణాలకే పరిమితమైంది.

---

## 22.4 సంగ్రహంగా

---

గ్రీస్ దేశంలో లలిత కళలయిన సాహిత్యం, సంగీతం, శిల్పం, చిత్రలేఖనం అనే వానితోబాటు, సమాహార కళ అయిన వాస్తువు ఎంతో బాగా అభివృద్ధి చెందింది.

మొట్టమొదట గ్రీస్ దేశంలోని వారి ఔన్నత్యాన్ని, వారి వీరుల విజయగాధలను, సాహస కృత్యాలను పాడటానికి, వర్ణించడానికిగాను, పౌరాణిక సాహిత్యం అభివృద్ధి చెందింది. హోమర్ రాసిన ఇలియడ్, ఒడిస్సీ అనేవి గొప్ప ఇతిహాసాలుగా పేరొందాయి. ఆ తర్వాతి కాలంలో హెసియాడ్ ఇంకొక గొప్ప కవి. ఇతడు రాసిన 'వర్క్స్ అండ్ డేస్', 'డిసెంట్ ఆఫ్ ది గాడ్స్' అనే రెండు కృతులు సంధి యుగాన్ని సూచిస్తూ, సాహిత్యంలోని సామాజిక స్పృహ పెంపొందడానికి, లాంఛనప్రాయమైన సూచనగా తోడ్పడతాయి. ఆ తర్వాత కాలంలో కేవలం ఐతిహాసిక వస్త్వాత్మక రచనలు గాక, వ్యక్తిగతమైన భావాలను, ఉద్వేగాలను వెల్లడించే గేయ సాహిత్యం, లైర్, పిల్లనగ్రోవి వంటి వాటిపైన పాడటానికి అనువుగా పెంపొందింది. ఆర్కిలోకస్, సాఫో, అనాక్రియస్, పిండార్, బెకిలైడిస్ వంటి వారు, ఈ ప్రక్రియలలో గొప్పవారు. సాఫో, పదో కావ్య దేవత అనే బిరుదును కూడా పొందింది. అలాగే ఉత్సవ సంప్రదాయాలకు అనువుగా, ఈ కాలంలో రూపకాలు ఆవిర్భవించాయి. ఎస్కిలస్, సోఫోక్లిస్, యురిపిడిస్ అనే వారు విషాదాంత రూపకాలను, అరిస్టోఫేన్స్ వ్యంగ్య సాహిత్యాన్ని రూపకాలలో సృష్టించారు. ఈ రకమైన మార్పు దైనందిన

జీవనంలోని వాస్తవాలను తెలిపే ప్రక్రియగా, గత కాలానికి అద్దం పట్టే సాహిత్యంగా, చరిత్ర రూపొందింది. హెరోడోటస్, థూసిడైడ్స్, గ్జెనాఫోన్ , పోలిబియస్ మొదలగు చరిత్రకారులు రోమన్ రాజ్య స్థాపనా పర్యంతంలోని వివిధ దశలను రాశారు. ఈ రకమైన సత్య చింతన, హేతుబద్ధతతో కూడిన శాస్త్ర వాఙ్మయ వికాసానికి తోడ్పడింది. గణితం, జంతు శాస్త్రం, శరీర ధర్మశాస్త్రం, వైద్యం, ఖగోళం, భూగోళం, వృక్షశాస్త్రం వంటి వివిధ రూపాల విజ్ఞాన సాహిత్యం వెల్లివిరిసింది.

సంగీతం హోమర్‌తో ప్రారంభమయింది. హోమర్, హెసియాడ్ లిద్దరు, హెక్సామీటర్ మీద కూర్చి, పాడేవారు. క్రీ.పూ. 676లో టెర్‌పాండర్ సితారును బాగా వినియోగించాడు. క్రీ.పూ. 570 - 500లలో పైథాగొరస్ సంగీత శాస్త్రాన్ని ఏర్పరిచాడు. సోలో ఆరియా అనే సంగీతం క్రీ.పూ. 483లో రంగస్థలం మీద ప్రదర్శితమైంది. ఈ సంగీతం గ్రీస్ దేశంలో డోరియన్, ఫ్రిజియన్, లిడియన్ శైలులుగా పరిణమించింది.

శిల్పకళ హుందాతనం, గాంభీర్యం, నిశ్చల ప్రశాంతత, ప్రకృతిలోని యధాతథ స్థితి, సౌందర్యం ప్రదర్శించాలనుకొనే ప్రధానోద్దేశంతో ప్రారంభమైన చంచలమైన, తీవ్రమైన మానవ భావాల ఉద్విగ్నతను, కదలికలను ప్రవేశపెట్టే మాధ్యమంగా రూపొందింది. పాలరాళ్ళు, కంచు ప్రధాన పదార్థాలుగా వివిధ శిల్పాలు రూపొందాయి. ఫిడియాస్, మైరాన్, పోలిక్లిటస్, స్కోపాస్, ప్రాక్సిటెలిస్‌లు గొప్ప శిల్పులుగా పేరొందారు. ఐతిహాసిక సాంప్రదాయం నుండి ఈ కళ పరమ లౌకికంగా రూపొందింది.

పోలినోటస్, అపోలో డోరస్, ఎపెలెస్ మొదలైనవారు గ్రీస్ చిత్రలేఖనానికి తోడ్పడ్డారు. జాడీల మీద , గోడల మీద, చెక్కల మీద గ్రీక్ చిత్రలేఖనం పెంపొందింది. గ్రీక్‌ల వాస్తుకళ క్రీ.పూ. 581 నుండి పరిణమించింది. దీనిలో డోరిక్ శైలి , అయోనియన్ శైలి, కారింథియన్ శైలి అనే మూడు ప్రధాన దశలున్నాయి. డోరిక్ శైలి మీద ఈజిప్ట్ ప్రభావం ఉంది. పార్థినాన్ దేవాలయం గొప్ప ఉదాహరణ. అయోనియన్‌శైలి మీద బాబిలోనియా ప్రభావం వుంది. ఎలెక్థియం దీనికి గొప్ప ఉదాహరణ. కారింథియన్ శైలికి లిసిక్రటిస్ గొప్ప ఉదాహరణ. ఈ పరిణామం నిరలంకృతత్వం నుండి సాలంకృతత్వానికి, పౌరాణిక ప్రభావం నుండి లౌకికతకు సంభవించింది.

ఈ కళలన్నీ గ్రీక్‌ల మానసిక పరిణామానికి, వారి జాతీయతలో ఏర్పడ్డ ఎగుడుదిగుడులకు, మహోన్నత్వానికి, సౌందర్య పిపాసకు ప్రతీకలు.

## 22.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. గ్రీస్ దేశంలో సాహిత్య పరిణామంలో గల వివిధ దశలను వివరించండి.

2. గ్రీస్ దేశంలో ప్రధాన , వాస్తు శైలులను వర్ణించండి.

**II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. గ్రీక్‌ల శాస్త్ర సాహిత్యం

BRAOU

2. గ్రీకుల సంగీతం

3. గ్రీకుల శిల్పకళ

4. గ్రీకుల చిత్రలేఖనం

## 22.6 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| Bury , J.B. | : | **A History of Greece,** 1913 |
| Edgar Swain, J | : | **History of World Civilization,** 1984. |
| Korodkin, F. | : | **Ancient History of the World,** (Translation), 1987. |
| George Guest | : | **The March of Civilization,** 1966. |
| Muzeer, M. | : | **World History our Heritage.** |
| Percy Brown | : | **Indian Architecture,** 1970 |
| Readers Digest | : | **Rivers Dictionary,** 1989. |


## 22.7 పదకోశం

అక్రోపోలిస్ : కొండపై గాని , ఎత్తు ప్రాంతంమీద కాని నిర్మించే నివాస స్థావరం

పెంటెలికస్ : ఏథెన్స్ ప్రాంతంలో గల పాలరాతి కొండ.

యులిసెస్ : ఒడిస్సీ కావ్యంలో నాయకుడు

ఇక్త్యాంజీ : మత్స్య శాస్త్రం

హెలియోసెంట్రిక్ థియరీ : సౌర కేంద్ర సిద్ధాంతం

సోలో ఆరియా : క్రీ.పూ. 483లో ప్రారంభమైన సంగీత విశేషం

డోరిక్ : ఈజిప్ట్ ప్రభావం గల వాస్తు శైలి

అయోనియన్ : బాబిలోనియా ప్రభావం గల వాస్తు శైలి.

BRAOU

## డా . బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం
చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం
మొదటి సంవత్సరం

### పాఠ్య ప్రణాళిక

**కోర్స్ - 1 : ప్రాచీన నాగరికతలు**

**ఖండం - I : చరిత్ర పూర్వయుగం నుండి చారిత్రక యుగం వరకు**

భాగం - 1 : చరిత్రపూర్వయుగం : చారిత్రక సంధి యుగం

భాగం - 2 : చారిత్రక యుగ ప్రారంభం

**ఖండం - II : మెసపటోమియా**

భాగం - 3 : మెసపటోమియా నాగరికతా లక్షణాలు

భాగం - 4 : సామాజిక , ఆర్థిక , రాజకీయ వ్యవస్థలు

భాగం - 5 : మతం - తత్వ వివేచన

భాగం - 6 : కళలు - శాస్త్ర విజ్ఞానం

**ఖండం - III: ఈజిప్ట్**

భాగం - 7 : ఈజిప్ట్ నాగరికతా లక్షణాలు

భాగం - 8 : సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు

భాగం - 9 : మతం - తత్వ వివేచన

భాగం - 10 : కళలు - వాస్తువు

**ఖండం - IV: ఇండియా**

భాగం - 11 : హరప్పా సంస్కృతి నేపథ్యం

భాగం - 12 : హరప్పా సంస్కృతి లక్షణాలు

భాగం - 13 : సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు

భాగం - 14 : మతం, కళలు, వృత్తికళలు

BRAOU

**ఖండం -V :** చైనా

భాగం - 15 : చైనా నాగరికతా లక్షణాలు

భాగం - 16 : సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు

భాగం - 17 : తత్వ వివేచన - మత వ్యవస్థ

భాగం - 18 : కళలు - వాస్తువు

**ఖండం - VI:** గ్రీస్

భాగం - 19 : గ్రీక్ నాగరికతా లక్షణాలు

భాగం - 20 : సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు

భాగం - 21 : మతం - తత్వ వివేచన

భాగం - 22 : కళలు - వాస్తువు

BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

మొదటి సంవత్సరం

**మాదిరి పరీక్షా పత్రం**

**కోర్స్ - 1 : ప్రాచీన నాగరికతలు**

సమయం : 3 గంటలు | మార్కులు : 100

## భాగం - A

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. చరిత్ర పూర్వ యుగాన్ని గురించి శాస్త్రవేత్తల అధ్యయనం లోని వివిధ దశలను వర్ణించండి.

లేదా

కాంస్య యుగ నాగరికతల లోని సామాన్య లక్షణాలను పేర్కొనండి.

2. మెసపటోమియా నాగరికతా ఉనికి, విస్తరణ, సంపన్నతను తెలియజేయండి.

లేదా

ఈజిప్ట్ నాగరికతా కాలం నాటి సామాజిక వ్యవస్థను సమీక్షించండి.

3. సింధు ప్రజల మతాచారాలను, మత విశ్వాసాలను విశ్లేషించండి.

లేదా

చైనాలో నాగరికతకు చెందిన ఆర్థిక వ్యవస్థను పరిశీలించండి.

4. చైనా చిత్రలేఖన ప్రాముఖ్యత, పరిణామాల గూర్చి వివరించండి.

లేదా

గ్రీక్ నాగరికతా లక్షణాలను విశ్లేషించండి.

## భాగం - B

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

5. హోమోసేపియన్ల గురించి మీకు తెలిసిన విషయాలను పేర్కొనండి.

లేదా

అయోయుగపు రాజకీయ , ఆర్థిక పరిణామాలను విశ్లేషించండి.

6. సుమేరియా ఆర్థిక జీవనమెలాగుండేది ?

లేదా

బాబిలోనియన్ శాస్త్ర విజ్ఞానాన్ని తెలియజేయండి.

B R A O U

7. ఈజిప్ట్ నాగరికతను ఇతర నాగరికతలతో పోల్చి చూడండి

లేదా

ఈజిప్ట్ నాగరికతకు చెందిన ఉపకళలను (Minor Arts) పరిశీలించండి.

8. సింధు నాగరికతా ప్రాముఖ్యత ఎట్టిది ?

లేదా

సింధు ప్రజల వ్యాపార వాణిజ్యాలు ఎలా సాగాయి ?

9. చైనాకు, భారతదేశానికి గల సాంస్కృతిక పోలికలను పరిశీలించండి.

లేదా

గ్రీక్ రాజకీయ వ్యవస్థపై ప్లేటో, అరిస్టాటిల్‌ల రాజకీయ సిద్ధాంతాల ప్రభావాన్ని తెల్పండి.

BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం

ప్రథమ సంవత్సరం

**కోర్స్ - 1 : ప్రాచీన నాగరికతలు**

**అభ్యాసం - 1**

**గమనికలు :**

- పుస్తకాలను చూచి, జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయాలి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపులా మూల్యాంకన కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

భాగం - A

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. శిలా యుగాల లోని పరికరాలు, పరిశ్రమలు, స్థావరాలను సమీక్షించండి.
2. సుమేరియా నగర రాజ్యాల స్థాపన, వాటి పాలనా వ్యవస్థను సంగ్రహంగా తెలపండి.

భాగం - B

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. నగర విప్లవాన్ని వివరించండి.
2. కాల్డియన్‌ల శాస్త్ర విజ్ఞానాన్ని పరిశీలించండి.

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం

ప్రథమ సంవత్సరం

**కోర్స్ - 1 : ప్రాచీన నాగరికతలు**

**అభ్యాసం - 2**

**గమనికలు :**

- పుస్తకాలను చూచి, జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయాలి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకన కోసం, అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి, రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

B R A O U

భాగం - A

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. ఈజిప్ట్ ఆర్థిక వ్యవస్థను విశ్లేషించండి.
2. సింధు లిపిని గుర్తించడానికి నేటి వరకు జరిగిన ప్రయత్నాలను సమీక్షించి, సింధు నాగరికతా నిర్మాతలెవ్వరో తెల్పండి.

భాగం - B

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. పిరమిడ్లను గురించి మీకు తెలిసిందేమిటి ?
2. సింధు నాగరికతా వ్యాప్తిని పేర్కొనండి.

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం

**ప్రథమ సంవత్సరం**

**కోర్స్ - 1 : ప్రాచీన నాగరికతలు**

**అభ్యాసం - 3**

**గమనికలు :**

- ✡ పుస్తకాలను చూచి, జవాబులను రాయకూడదు.
- ✡ సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయాలి.
- ✡ జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకాలూకు వివరాలను పొందుపర్చండి.
- ✡ అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- ✡ మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకన కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.

ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి, రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

**భాగం - A**

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. చైనా నాగరికతా లక్షణాలను సమీక్షించండి.
2. గ్రీక్‌ల సామాజిక, ఆర్థిక వ్యవస్థలను విశ్లేషించండి.

**భాగం - B**

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. కన్ఫ్యూషియన్ సిద్ధాంతాలను పేర్కొనండి.
2. సోక్రటీస్ యుగ తత్వ వివేచనను విశ్లేషించండి.

BRAOU